TEXT PROBLEM WITHIN THE BOOK ONLY

UNIVERSAL
LIBRARY
OU_204022
UNIVERSAL
LIBRARY

OUP—552—7-7-66—10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T928 | M81A Accession No. T3780

Author సత్యనారాయణశాస్త్రి, మధునాపంతుల

Title ఆంధ్ర రచయితలు

This book should be returned on or before the date last marked below.

ఆంధ్ర రచయితలు

ప్రథమ భాగము

[౧౮౦౭ - ౧౯౦౧]

గ్రంథకర్త

మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి

రు 6/-

పబ్లిషర్సు: అద్దేపల్లి అండ్ కో

సరస్వతీ పవర్ ప్రెస్

రాజమహేంద్రవరము

సర్వస్వామ్యములు
ప్ర కా శ కు ల వి

ప్రథమ ముద్రణము ౧౯౫౦

Saraswathi Power Press, Rajahmundry.
Printed and Published by
A. Nageswara Rao
For Addepally & Co., Educational Publishers.
Order No. 5779/1950.

కథాపీఠము

ఆంధ్రకవిత నన్నయ మొదలు చిన్నయదాఁక నొకతీరున సాగినది. నడుమ నడుమఁ గొన్ని మార్పులు కలిగినను అవి యల్పములు. ౧౯ వ శతాబ్దినుండి, ఇంచుమించు చిన్నయసూరి నాఁటినుండి వాఙ్మయ వాహిని క్రొత్తదారులు తీసినది. ఈత్రోవలెల్ల క్షుణ్ణము చేసిన మహాశయులు వీరేశలింగము పంతులుగారు. కొన్నిటికి మార్గదర్శిత్వమే పంతులుగారిది. నవలలు, వ్యాసరచనలు, కవిజీవితములు, స్వీయచరిత్రములు, కథానికలు, ఖండకావ్యములు, ప్రహసనములు, గ్రంథవిమర్శనములు, నాటికలు, చరిత్ర పరిశోధనము, పత్త్రికాప్రచురణము — ఇత్యాదులు నేఁటి సారస్వతవృక్షము వేసిన క్రొత్తకొమ్మలు. ఈకొమ్మ[illegible] ముమ్మరముగాఁ బూచి కాచుచుండుట నేఁడు పరికించుచు[illegible]. పయి పట్టికలోని వన్నియు నపూర్వము లనుకొనముగదా, ప్రకృత[illegible]ల పరిస్థితుల ననుసరించి మన కాత్రోవలు కొన్ని కావలసి గట్టిచేసికొం[illegible]

వీనిలో కవిచరిత్ర రచన మొకటి. శ్రీ వీరేశలింగము పంతులుగారు బహు పరిశ్రమకుఁ బాల్పడి ఆంధ్రకవుల చరిత్రలు సంపాదించి [illegible]రించిరి. అంతకుమున్న శ్రీ గురుజాడ శ్రీరామమూర్తిగా రాంగ్లేయుల మార్గము నాశ్రయించి కవి జీవితములు ప్రచురపఱిచిరి. గురుజాడవారి రచనపై వీరేశలింగముగారి కూర్పు సంస్కరణ పూరణములు కలదిగా వెలసినది. కావలి వేంకటరామస్వామి యనునాయన ఆంగ్ల భాషలోఁ గొంద ఱాంధ్రకవులను గూర్చిన చరిత్రలు వ్రాసి ౧౮౨౯ వ యేట బొంబాయిలో వెలువరించినారని మిత్రులు చెప్పుట. బ్రౌనుదొర తన నిఘంటువునఁ బ్రసంగమునఁ గొందఱు ప్రాక్తనకవులను గూర్చి యించించుక వ్రాసెను. ఇవి బొత్తిగా చాలనివి. గురుజాడ శ్రీరామమూర్తిగారి కవి జీవితములు ౧౮౯౩లో మొదలై పదేండ్లకుఁ బూర్ణముగా బయటఁ బడినది. వీరేశలింగము పంతులుగారి కవిచరిత్రము ౧౮౮౭ నాటికి ప్రకటితము. పంతులుగారి కూర్పు తెలుఁగు వారికి మేలుబంతి. ఇటీవల నిటీవల విడివిడిగా, విపుల విపులముగా కవి జీవితములు

వ్రాయుచున్నారు. విస్మృతాంధ్రకవి చరిత్రములు పెక్కురు బయటఁ బెట్టుచున్నారు. తెలుఁగులోని కవులు సాగరములోని రత్నములు. అన్వేషించిన కొలఁదిని వెలువడుచునేయుందురు. మఱుఁగు పడిన కవులను జతపఱిచి క్రొత్తపరిశీలనమునుబట్టి సవరింప వలసినవి సవరించి కవిచరిత్రలు సంస్కరణ పూరణములతో పునర్ముద్రణమునకుఁ దెచ్చుట యెంతో మేలిపని. ఎట్లెఁగినందాఁక, పూర్వాంధ్ర కవుల చరిత్రములు పూర్తిగ గ్రథింపఁబడినఁగాని, ఆధునిక కవిజీవితములు వ్రాసిన తృప్తి యుండదు. ఈ మహత్తర కార్య నిర్వాహణమునకుఁ బూనుకొనుట శ్రీ వీరేశలింగము పంతులుగారి పవిత్రాత్మ తృప్తికిఁ గూడ హేతువు.

రచయితృ శబ్దము కవి, విమర్శక, పరిశోధకాది సర్వసామాన్య రచనకార వాచక మగునని యాలోచించి యిపు డీకూర్పునకు 'ఆంధ్ర రచయితలు' అనుపేరు పెట్టనాయెను. వెనుకటివలెఁగాక, వర్తమాన సారస్వతము వేయిపడగలై విస్తరిల్లిన దనుకొంటిమి. ఒక పద్యకవుల చరిత్రములే సంధానించినచో, యావజ్జీవము చరిత్రాన్వేషణము చేసిన పరిశోధకులు — సంపుటముల కొలఁది విలువగల విమర్శనములు వ్రాసిన పండితులు — మున్నగువారుచరిత్ర కెక్కక మఱుఁగుపడవలసినదేనా ? 'రచయితలు' అన్నచో బాధ యుండదు, ఈ యూహతో నీ నామ కరణపు మార్పు జరిగినది.

ఇపు డీమొదటిపాలున ౧౭౦౦ — ౧౯౦౦ నడుమనున్న — అనఁగా ౧౯ వ శతాబ్దికిఁ జెందిన జనన తిథులుగల నూఱుగురు రచయితలనుగూర్చిన జీవిత కవితా సమీక్షు లున్నవి. ౧౭౦౬ లో జన్మించిన పరవస్తు చిన్నయ సూరితో నీగ్రంథము మొదలగుటలో సూరి శతాబ్దారంభములోని వాఁడనుటయే కారణముగాక, నీతిచంద్రిక రచనచే గద్యవాఙ్మయమునకుఁ గ్రొత్తవెలుఁగునిచ్చి కొన్ని క్రొత్తదారులు తీసినవాఁ డగుటయుఁ గారణ మగుచున్నది. సాధారణముగా, కవుల పుట్టుకలనుబట్టికాక, గ్రంథ రచనలను బట్టియే చరిత్రములు సంధానించుట యాచారము. నేను అది పెట్టుకొనక, పుట్టుకలనుబట్టి యీ శతాబ్దిలోని వారని యేఱుకొంటిని. జాగ్రత్తగా, చూచినచో మఱియొక వందకాదు, కొన్నివందలమంది

మహారచయితలు గలవు, శతకములకు సంబంధపడినవా రుందురు; ఉన్నారు. వారి నెల్లరను దెచ్చి చేర్చినఁగాని యీ కూర్పునకు సమగ్రత సిద్ధించ నేఁగాదు. కాని, ఇప్పటి కిది నా సేవాలేశము. దైవాదేశ మయిననాఁడు, ఈగ్రంథము సుపరిపుష్టము కావచ్చును.

ఇప్పుడిచట ఆరాధింపఁబడినవారు గాక, మఱియెందఱో మహనీయులు తెలుఁగున కందినవారి క్షమాభిక్ష నేను వేఁడవలసియున్నది. ఈ మహనీయులలోఁ గొందఱి జనన తిథ్యాదికము తెలియకపోవుట — కొందఱి రచనలు నేనిందాఁక చదువుకొనుటకు ఈడు చాలకపోవుట — కొందఱు జీవత్కవులు తమ్ముఁగూర్చి ప్రకటింపరాదని నాకు శాసించుట— కొందఱి విషయమున, రచయితలుగా నందిన కీర్తికంటె, భాషాభివర్ధకులుగా సంపాదించిన యశస్సు హెచ్చుగా నున్నదని సదుద్దేశముతో నుపేక్షించుట — ఇత్యాదు లేవేవో కారణము లీగ్రంథము నింత పరిమితముఁ జేసివైచినవి. క్రింది రచయితలను, ఈ కూర్పుననే పూజించుకో లేని నా నీరసతకు, సిగ్గిలుచున్నాను.

కరాలపాటి రంగయ్య
శతఘంటము వేంకటరంగశాస్త్రి
చదలువాడ సుందరరామశాస్త్రి
ఆదిపూడి సోమనాథరావు
ఆదిపూడి ప్రభాకరరావు
తురగా వేంకమరాజు
అమరవాది రామకవి
భోగరాజు నారాయణమూర్తి
కొప్పరపుఁ గవులు
శేషాద్రి రమణ కవులు
తాడేపల్లి వెంకటప్పయ్యశాస్త్రి
కాశీనాథుని నాగేశ్వరరావు
ముట్నూరి కృష్ణారావు
ఉన్నవ లక్ష్మీనారాయణ
జూలూరి అప్పయ్య
అక్కిరాజు ఉమాకాంతము
మల్లాది విశ్వనాథశర్మ
రాయదుర్గము నరసయ్యశాస్త్రి
కేతవరపు వేంకటశాస్త్రి
భండారు అచ్చమాంబ
కాంచనపల్లి కనకమ్మ
త్రిపురనేని రామస్వామి చౌదరి
మానవల్లి రామకృష్ణకవి
నాయని సుబ్బారావు
అబ్బూరి రామకృష్ణారావు
బలిజేపల్లి లక్ష్మీకాంతము
తాపీ ధర్మారావు —

ఇటు లెన్నో పేరులు స్మరింపవచ్చును. రాయలసీమ - నిజాము ప్రాంతీయులలో నెందఱో విజ్ఞులవిషయమున నేను అజ్ఞుఁడను. వీరందఱను కాలక్రమమున మనము ఒకకూర్పున సమావేశము చేయవలసి యున్నది.

ఈ నా రచనలకై యెందఱో మిత్రుల సహాయము పడసితిని. వారందఱు మేలు మఱచి పోఁజాలను. సామూహికముగా వారికి నా హార్దాభినందనము లిందు మూలముగా మనవి చేసికొనుచున్నాను.

ఒకసంగతి యేమనఁగా:— కవిబ్రహ్మ ఏటుకూరి వేంకట నరసయ్య గారు ౧౯౦౦ పూర్వము జననము కలిగియుండినవా రనుకొని యిందుఁ జేర్చుకొనుటకై, తెనాలి వాస్తవ్యులు శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తి (ఎమ్, ఏ; యల్, యల్, బి) గారిని కవిబ్రహ్మ జీవితాంశములు తెలుపవలసినదిగాఁ గోరి తొందరపెట్టి యుంటిని. దయతో వారు పంపిన విషయములను జూచి నరసయ్యగారు ౧౯౧౧ సం॥ జన్మించిరని తెలిసికొంటిని. వారు, మఱికొందఱు ప్రముఖరచయితలు రెండవభాగమున రాఁగలవారు.

మఱి, ౧౯౦౦ సం॥తో ముగించుటకు బదులు, ఒక యేడు ముందుకు సాగి ౧౯౦౧ సం॥లో జననము గల శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారి నిందుఁ జేర్చుట, వారిని గూర్చిన వ్రాయసము ద్వితీయ భాగమునకు 'నాంది' పాఠము కాఁగలదని యిపు డిక్కడ మనాకూ్సచనమునకు —

ఈ రచన యిటు లింతలో వెలుఁగు చూచుటకు పూజ్యులు శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి ఆశీఃప్రోత్సాహములు నేనెపుడును మఱవఁజాలని దోహదము లయినవి. వారికి మనఃపూర్వకమైన ధన్యవాదము లర్పించుచున్నాను.

ఈ గ్రంథము 'సరస్వతీ పవర్ ప్రెస్సు' అధికారులు, ఉదారులు నగు శ్రీ అడ్డేపల్లి నాగేశ్వరరావుగారి సౌహార్దముతో నావిష్కృతమైనది. ప్రత్యేకశ్రద్ధవహించి, ముచ్చటగా సీకూర్పు ముద్రింపించి, ఇంతత్వరలో నా యుద్యమమును లోకమునకుఁ జూపిన శ్రీ నాగేశ్వరరావుగారిని హృదయపూర్వకముగా నభినందించుచు, వారి కితోఽధిక భోగ భాగ్య సంపత్తి ప్రసాదించుటకు జగదీశ్వరు నభ్యర్థించుచున్నాను.

రాజమహేంద్రవరము — మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

౧ సెప్టెంబరు ౧౯౫౦

సమర్పణావతారిక

ఇది పదియేండ్లనాఁడె రచియించుతలంపులు లేఁతవంపుగాఁ
బొదలి, సరస్వతీకరుణ పొంగులు దేఱఁగ, పేరు నాదిగాఁ
గదలిన 'ఆంధ్రి' నొక్కకటిగాఁ బ్రకటించుచు వచ్చినాఁడ; నీ
బ్రదుకున కాయదృష్టమును బట్టకపోయె నొకింత కాలమున్.
అది మూఁడేఁడుల ముచ్చటై నడచిపో — నల్లల్లనన్ సాహితీ
హృదయస్పందము గుర్తులందుకొని 'ఆంధ్రి' పత్త్రికారత్న మ
భ్యుదయ చ్ఛాయల కెక్కు కాలమున నయ్యో! పాపినై యాఁపికో
న్న దరిద్రుండను; నిద్రలోఁ గలవరింతల్ నేఁటి నాయూహముల్.

నాఁట ననిచిన యీ కూర్పు నేఁటి కిటులు
పెనిచి, మాతల్లి నత్తి పెంచిన జనకుఁడు
రాజయోగి: శ్రీ ఆకొండి రామమూర్తి
శాస్త్రి కుదుగరలిడుదుఁ బుష్పసరభరము.
ఇచ్చుటయు, వారు మేనును బుచ్చుకొనుట
మూఁడు తరముల యాచారముగ రహించు;
నివుడు మాయది పయిచేయి; యిచ్చువాఁడ
నేను; నాకృతికిఁ బ్రతిగ్రహీత తాత.
'పోల్వరము' వెళ్లి వచ్చునప్పుడదియేమొ!
వెక్కసం బౌను, అమ్మమ్మ వెఱ్ఱిప్రేమ;
ఆమె కనులు కృపాఘురు; లామె వోయు
దీవనలు లేక రాలేను రేవుదాఁటి.

మవ్వాపుమోసులై యమృతమానసులై కనటింతలేని లే
నవ్వులరాసులై మెఱసినార లఖండరసస్వరూపు; లా

ముప్పురు మేనమామలయుపోలిక నాయెడఁ గూడి వచ్చినం
బువ్వులబాట లంచనడపుల్ గద ! మత్కవితా చిరంటికిన్.
పోరలున్ — పోరులు లేక భావములు పూవుల్ తావులై పొత్తుమూ
పురుమేనత్తల కూర్మిలోఁ గరఁగిపోవు న్నామన; స్సంతలో
బిరుసుల్ త్రోవును బెద్దయల్లుఁదనపుంబింకమ్ము; నా కంతలో
భరమైపోవును వారివారి యమృత స్వాదూక్తి మర్యాదలున్.

వేడ్కఁ దాతయ్య కూర్చున్న వీథియరఁగు
పండ్ల బరువున నొరఁగు కల్పద్రుమంబు —
చేరి మామయ్య లోదుగు దక్షిణపువైపు
పోకమ్రాఁకులు, తములపుటాకుఁ దోఁపు.

విందులకో మందులకో
యెందులకో పేరుచెప్పి యేతెంచు హితుల్
బందుగులు నిత్యమును బది
మందిగదా, వారి సదన మాధురి యదిరా !

మఱియొక ముచ్చట — అచ్చటఁ
బఱచిన భోజనపుఁ బంక్తి పరికింపవలెన్
వరికళ్ళము చేరిన పా
వురముల వలె వచ్చి మెసవి పోదురు నిసువుల్.

కొడుకులు మన్మలుం జెలుత కుఱ్ఱలు బందువు, లల్లువారు, పే
ర్వడిన కవుల్ ప్రియాతిథులు పర్వెన చుక్కలబంతిలోనఁ జం
ద్రుఁడు వలె “ గందమక్షతలతోఁ ” గళతో—నభిరామమూర్తి యే
ర్పడ నమృతాన్నపుం జవులు పట్టును తాతయ, యెట్టి ధన్యుఁడో !
ఎనుబది యేండ్లకున్ దరికి నెక్కి తొనంకినవాఁడు తాత — జ
వ్వనమునునుండి పెంపుగనువాఁడగు నీమనుమండుకూడ — ని

ల్వాని యది నిశ్చయం; బీఁక నిలాస్థలి నీయుభయైక నిష్ఠ బం
ధన పరమార్థ మీకృతిగదా, యొకకొంతకుఁ గొంత నిల్చినన్.

ఏమో! యీ కృతి యంత శాశ్వతమటోయీ! యందురా, కాదు కా
నీ, మాధుర్యధురీణ కావ్యరచనా నిత్యోత్సవ శ్రీ కళా
ధాముల్ సూర్యురు పెంచు నీయమృతగాథా జ్యోతు లీనాఁటితో
నే, మిన్నందియు వట్టి "మందకొడు" లౌనే, యెట్టు లూహించినన్.

'ఇది యి'ట్లని పేర్కొనఁగాఁ
గుదురని యొక కదలి పోని గూఢాశయ మె
య్యదియో ననుఁ గదలించెడి—
నదిగో, మా తాతమహార్పణాభిలషితమై.

అంబరములు తొడవు లగ్రహారమ్ములు
సంచకార మభిలషించలేదు;
వ్రాయఁ దోఁచి వ్రాసి— బ్రహ్మార్పణైక తా
త్పర్య మదర సుకృతి తాత కిడెద.

సమర్పణము

తాతయ్యా, కొనుమయ్య, యీ చిఱుతపాత్రం బుత్తమ శ్లోక గా
థా తాత్పర్య సనాథమై యలరి యంధ్రక్షోణి రాణించు! నీ
కేతత్ స్వీకృతి దొడ్డగా; దయిన — దౌహిత్రుండనై పూజ్యపూ
జాతంత్రంబున నవ్విలోఁగు నను విశ్వాసంబుతో నిచ్చెదన్.

సాఁగిన జీవితంబు, చెయిచాఁపని భావము, కీర్తిలిప్సకున్
లోఁగమి - రాగ నిస్పృహత - లోకము దాఁటినచూపు - నిన్నిటం

దాఁగిన కోవిదుండవగు త్వత్కవితా గజగర్భ పద్ధతిం
దోఁగినవాఁడ; నీ వినువు దోయిటఁ బోయుము పండుదీవనల్.

అరయిక చేసితో నొకటి యాత్మకుఁ దోఁచెను నాకు; అమ్మతో
సరణముగాఁ గవిత్వధన మంపితి వింపిత; మట్లు పిత్ర్యమై
సిరి నను సంక్రమించుటను జేసి భవత్కృతముం గృతజ్ఞతా
భర హృదయంబునం దలఁపు వాఁగఁ జెప్పెద ధన్యవాదముల్.

పసినాఁటం దనతండ్రిఁ బాసి పనవింపందీసి - మానాన్న కా
రసుతో పాటుగ "వైద్యలక్ష్మి" నిడి తౌరా! నాఁటి నీ ప్రేమపుం
బస నీనాఁడొక భామనందన పనీ ప్రాగ్భారమై మాదు పం
గన మింపారెడి నన్నుచో నతిశయోత్కంఠానో లోకానకుఁ.

తిరుపతి కవీశ్వరులు 'దేవి చరిత' రచనఁ
బసదనాన నర్ధాసన మొసఁగి రనఁగ -
నీకవిత్వాధికృతులు గణింపఁ దరమె!
నీకు నాయుష్యకాన్క యుల్లాకుతునక.

ఇలువేల్పై కరుణించి పూటపడి నీ
కేలోటునున్ రాని య
ట్టులు దీవించెడి 'కామవల్లి' కృప గ
ట్టుల్ దాఁటి నామీఁద, పొం
గులుగట్టన్ మఱియెన్ని కట్టుదునో, ని
గ్గుల్ దేఱు నేతాదృగు
జ్జ్వాల బంధంబులు, భావబంధుర కృతుల్
భాషా విభూషోన్నతుల్.

రాజ**మ**హేంద్రవరము
వికృతి శ్రావణి - ౧౯౫౦

సత్యనారాయణశాస్త్రి

ఆంధ్ర రచయితలు

పరవస్తు చిన్నయసూరి

1806 - 1862

సాతాని శ్రీవైష్ణవుఁడు. అభిజనము: చెంగల్పట్టు జిల్లాలోని పెరంబూదూరు. ఉనికి చెన్నపురము. తల్లి: శ్రీనివాసాంబ. తండ్రి: వేంకటరంగయ్య. సూరి జననము 1806-నిర్యాణము 1862. రచించిన గ్రంథములు: చింతామణివృత్తి 1840- పద్యాంధ్రవ్యాకరణము 1840- సంస్కృత సూత్రాంధ్ర వ్యాకరణము 1844- పచ్చయప్ప నృపయశోమండనము 1845- ఆదిపర్వవచనము 1847- శబ్దలక్షణ సంగ్రహము 1853- నీతిచంద్రిక 1853- నీతిసంగ్రహము 1855- బాల వ్యాకరణము 1855- విభక్తిబోధిని 1859- ఆంధ్రధాతుమాల- అక్షర గుచ్ఛము- ఆంధ్రశబ్ద శాసనము- బాలవ్యాకరణ శేషము- ఇంగ్లీషులా చట్టముల భాషాంతరీకరణము- ఆంధ్రకౌముది (వచనము) ఆంధ్ర కాదంబరి (వచనము) అకారాది నిఘంటువు- చాటుపద్యములు- సుజనరంజనీ పత్రిక- యాదవాభ్యుదయము.

ప్రాచీనాంధ్ర భాషాయుగమునకు నన్నయవలె, అర్వాచీనాంధ్ర భాషాశకమునకు 'చిన్నయ' మార్గదర్శకుఁడు. నన్నయ తననాఁటి వ్యావహారికమును గ్రాంథికవ్యవహారముగా సంస్కరించుటకు చింతామణి రచించిన శబ్దశాసనుఁడు. చిన్నయ దేశభాషలో బాలవ్యాకరణము రచించి యాంధ్రపాణిని యనిపించుకొనిన సూరి. చింతామణికి శేషగ్రంథముగా 'అథర్వణ కారికలు' బాలవ్యాకరణమునకు శేషగ్రంథముగా 'ప్రౌఢవ్యాకరణము' వెలువడినను విద్వాంసుల శాస్త్రార్థముల కాఁగినవి చింతామణి బాలవ్యాకరణములు రెండే. నన్నయభట్టు భారతామ్నాయము నాంధ్రీకరించి తెలుఁగునఁ బద్యకవితకు బాటవేసెను. చిన్నయసూరి నీతిచంద్రిక సంధానించి యాంధ్రమున గద్యకవితకు ఘంటాపథము కల్పించెను. ఆదికవి యనఁబడిన నన్నయభట్టారకునకుఁ బూర్వ

మాంధ్రమునఁ బద్యకవిత్వము లేదనుటకు వీలుపడదు. అటులే, చిన్నయ సూరికిఁ బూర్వము గద్యగ్రంథములు రచించినవారు లేరనుటకును ధైర్యము చాలదు. కాని 'నీతిచంద్రిక' వంటి యుత్తమవచన కావ్యములు నాఁడు వెలయలే దనవచ్చును. నాఁటికిని నేఁటికిని సూరివచన శైలి యనన్య లభ్యమైన వైలక్షణ్యము గలిగియే యున్నది. కావునఁ బద్యమున నన్నయకువలె గద్యమునఁ జిన్నయకు నాద్యస్థానము నీయవలయును.

చిన్నయసూరి తండ్రి వేంకటరంగయ్యగారు మంచి పండితులు. వీరు చెన్నపురిలో ఈస్టుఇండియాకంపినీవారి పాలనముననున్న యున్నత న్యాయస్థానమునఁగల పండితసభ్యులలో నొకరు. 1836 లో వీరు మరణించిరి. చనిపోవునప్పటికి వీరి వయస్సు నూటపదియేండ్లవఱకునుండును. సూరి తండ్రికడనే తెనుఁగు, అఱవము, సంస్కృతప్రాకృతములు చదువుకొనెను. కంచి రామానుజాచార్యులతోఁ దర్కాలంకార మీమాంసలు పఠించెను. ఉత్తరదేశ పండితుఁడు రామశాస్త్రి యను నాయనకడ వేదవేదార్థరహస్యములు సంగ్రహించెను. ఈ రామశాస్త్రియే సూరికి హయగ్రీవమంత్రోపదేశ మొసఁగెను. సూరి స్వయం కృషిచే నాంగ్లముతోఁగూడ నించుకపరిచయము కలిగించుకొనెను. వేదము వేంకటరమణ శాస్త్రులుగారు (వేదము వేంకటరాయశాస్త్రి గారి తండ్రి) చిన్నయసూరినాఁటివారు. వీ రిరువురు సాహిత్యగోష్ఠి చేసెడివారు. సూరిగారి యాంగ్లభాషాపరిచయము బ్రౌనుదొర మున్నగువారితో విశేషస్నేహము చేకూర్చినది. ఉన్నతోద్యోగులగు నాంగ్లేయు లెందఱో సూరిగురుత్వమున సంస్కృతాంధ్రములు సాధించిరి. వారివారి సాహాయ్యమున పచ్చయ్యప్పకళాశాలలో సూరి ప్రధాన పండితపదము సంపాదించి 1845 మొదలు 1848 వఱకు నచట నుద్యోగించెను.

(చెన్నపుర రాష్ట్రీయ కళాశాలలో సూరి ప్రధానాంధ్రోపాధ్యాయుఁడై యుండెను.) మొట్టమొదట నాంధ్ర మహాభాగవతము వెలువరించిన పండితవరులు పురాణము హయగ్రీవశాస్త్రిగారు నాఁడు ద్వితీయాంధ్రోపాధ్యాయులుగా నుండిరి. వీ రిద్దరును సహపాఠులు. నాఁడు విశ్వవిద్యాలయ కార్యదర్శి ఎ. జె. ఆర్బత్ నట్ దొర కాశినుండి తర్క మీమాంసా పండితుల రావించి చిన్నయను బరీక్ష చేయించి సమర్థుఁడని యెఱిఁగి 'చిన్నయసూరి' యను నక్షరములతో స్వర్ణ కంకణము నొండు 'సీమ' నుండి తెప్పించి బహుమానించెను. నాఁడు మొదలు చిన్నయ చిన్నయసూరి.)

ఆ కాలమున మదరాసులో న్యాయమూర్తి శ్రీ రంగనాథశాస్త్రి పదునైదు భాషలలోఁ బ్రవేశముగల పెద్దన్యాయాధిపతి.

ఆయనకు హయగ్రీవశాస్త్రిగారిపై నభిమాన మధికము. ఆ కారణమున నాయన "సూరిగారి ప్రథమోపాధ్యాయ పదవి మీకు వచ్చునట్లు చేసెద" నని రెండుమూఁడుసారులు చెప్పుచు వచ్చిరఁట. అంతట హయగ్రీవశాస్త్రిగారు "ప్రధానోపాధ్యాయస్థానమునకు సూరిగారే సమర్థులు." అని చెప్పి రంగనాథశాస్త్రిగారికి సూరిప్రతిభ చూపనెంచి యొక యాదివారమున వారిని సూరియింటికిఁ గొంపోయిరఁట. రంగనాథ శాస్త్రిగారి కోరికపైఁ జిన్నయసూరి యలంకారవిషయము ముచ్చటించుట కారంభించెను. ఆ మహోపన్యాస మట్లు గంగాప్రవాహామువలెఁ బోవుచునే యున్నది. రంగనాథశాస్త్రిగా రేకతానులై చెవులొగ్గి వినుచుండెను. హయగ్రీవశాస్త్రి తమసహపాఠిశక్తి కానందభరితుఁ డగుచుండెను. రాత్రి పదిగంట లయినది. అప్పుడు న్యాయాధిపతికి మెలఁకువవచ్చి సూరి శాస్త్రజ్ఞానమున కాశ్చర్యపడి, పూర్వాభిప్రాయము తొలఁగించుకొని సెలవుగైకొని యింటికిఁ బోయెను.

సూరిగారికిఁ బేరుపొందినశిష్యు లెందఱో కలరు. శబ్దరత్నాకర కర్తలు, ప్రౌఢవ్యాకర్తలు నైన బహుజనపల్లి సీతారామాచార్యులు

గారు వీరి శిష్యరత్నము. ఆంధ్ర విశ్వగుణాదర్శకర్త పంచాంగము తేవప్పెరుమాళ్ళయ్య సూరికడనే పఠించెను.

బ్రౌనుదొర, గాజుల లక్ష్మీనృసింహము సెట్టి, జస్టిస్ రంగనాథ శాస్త్రి, కుమారస్వామిశాస్త్రి మున్నగు మహనీయులు నెచ్చెలులై చిన్నయసూరి భాషాసేవకు నిరంతర ప్రోత్సాహ మిచ్చుచుండువారు. తొట్టతొలుత సూరిని గ్రంథ రచనోద్యమములోఁ బెట్టినవాఁడు లక్ష్మీనరసింహముశ్రేష్ఠి. ఆంధ్రశబ్దశాసనము, ఆంధ్రనిఘంటువు, వీరిమెచ్చరిక వలననే సూరి వ్రాయనారంభించెను. కాని యవి రెండును దుదముట్టలేదు. ఈనిఘంటువిషయ మిచటఁ గొంతముచ్చటింపవలసినది కలదు.

చిన్నయసూరి యాంధ్రనిఘంటు రచనోద్యమము నెఱిఁగిన రు పెక్కుమంది యుండరు. ఆయుద్యమము కడముట్టలేదు గాని పదముల పట్టిక వ్రాసికొని, యర్థనిర్ణయమునకుఁ గావలసిన ప్రాచీనమహాకవి ప్రయుక్త వాక్యముల నెత్తి, కొన్నింటి కర్థనిర్ణయము చేసి సూరి చాలఁ బరిశ్రమమునకుఁ బాలుపడి దైవ దుర్విపాకమున రాచపుండు బయలు దేఱి, 1862 లోఁ బ్రాణములు గోలుపోయెను. ఆచార్యుని నిర్యాణానంతరము వారియాప్తశిష్యులు బహుజనపల్లి సీతారామాచార్యులవారు సూరిగారి కోడలికడ నున్న నిఘంటుసామగ్రిని కారణాంతరము చెప్పి పుచ్చుకొని యంతయు సంగ్రహించి వ్రాసికొని మరల నది యామె కిచ్చివేసిరని యొకవదంతి. ఈ వదంతిలోని యాథార్థ్యములు నిర్ధారింపఁజాలము. కాని శబ్దరత్నాకరమునకును, అముద్రితమగు చిన్నయసూరి నిఘంటువునకును పెక్కుచోట్ల నక్కసెల్లెండ్ర పోలికలు కలవు. శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారి కిది యెటులో లభించినటులు, ఆయనకడ వీరేశలింగము పంతులుగారు విలిచికొని, సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యాలయము వారికి, అనఁగా ఆంధ్ర సాహిత్యపరిష త్కార్యాలయమునకు వెలకో, ఊరకో యిచ్చియుందురని విన్నసంగతి. ఏమైనను, తన్నిఘంటు కార్యాలయ పండితులు ప్రామాణికముగా నీవ్రాఁతకాకితములు చూచు

కొన్నా రన్నది నా కనుఁగొన్న సంగతి. శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువున చి. ని. అను సంకేతాక్షరములతో నున్న పద సందర్భము లరసిన నిది విశదము. సూరి స్వహస్తాక్షరములతో నక్షిపర్వ మొన రించుచున్న యసంపూర్ణ నిఘంటుపత్రములు భాషాచరిత్రమున శాశ్వ తత్వమును గల్పించుకొనఁగలవనుటలో నాశ్చర్యము లేదు. శబ్దరత్నాకర కారుల యీ వాక్యములు వినుఁడు.

"సంస్కృతాంధ్రములయందు విశేషపాండిత్యము కలిగి యాసేతు హిమాచలము చాలఁ బ్రసిద్ధివహించియుండిన పరవస్తు చిన్నయసూరిగారు జీవితులై యుండినకాలంబున దీర్ఘసూత్రతతో ననేక గ్రంథపరిశోధనంబు గావించి మిగుల విరివిగాఁ బ్రయోగసహితంబుగా అకారాది తెనుఁగు నిఘంటు వొకటి వ్రాయం బ్రారంభించి నడపుచుండిరి."

ఈ మాటలనుబట్టి చూచిన సీతారామాచార్యులవారికి సూరిపైఁ గల గౌరవభావమును, శబ్దరత్నాకరమునకు సూరినిఘంటువుతోఁ గల సంబంధము విస్పష్టమగును. ఆచార్యులవారి "ప్రౌఢవ్యాకరణము" లోని సూత్రములకును, అచ్చున కెక్కని సూరిసూత్రములకును గొన్నింట గురుశిష్య సంబంధమున్నది. సూరి "బాలవ్యాకరణ శేషము" ఆంధ్రి యభాగ్యవశమున నశేషమై పోయినది.

బాలవ్యాకరణము :

'బాలవ్యాకరణము' నకు చిన్నయసూరి యని ప్రసిద్ధవ్యవహారము. కిరాతార్జునీయమునకు 'భారవి' యని, శిశుపాలవధమునకు 'మాఘు'మని పేరు లున్నవి. 'టెన్నిసన్' చూచితీరా? 'షెల్లీ 'చదివితిరా? యనునది పాశ్చాత్యము. తెలుఁగున నిట్టివాడుక చిన్నయసూరికిఁ దక్కినది. సూరి కీర్తిచంద్రికకు బాలవ్యాకరణము శారదరాత్రి. సంస్కృత భాషావ్యాక రణములెన్నో యున్నవి. కాని పాణినీయముముం దవి నిలఁబడలేక పోయినవి. తెలుఁగునను జాలమంది వ్యాకర్తలు పుట్టిరి. వారు చిన్నయ సూరికి లోచ్చు. దీనినిబట్టి సూరిని కాదనిపింపఁగల శాస్త్ర పండితులు

లేరని కాదు. అవ్యాప్త్యతివ్యాప్తులులేకుండ స్వల్పాక్షరముల నుండి విశ్వతోముఖమైన యర్థము వచ్చు సూత్రరచనము సూరికిఁ జక్కఁగ నలవడినది. ఇది విద్వత్సాధారణమైన యభిప్రాయము.

"ముము మదుపజ్ఞం బగుచుం
దనరిన వ్యాకృతిని సూత్రతతి యొకకొంతం
దెనిఁగించి యిది ఘటించితి
ననయము బాలావబోధ మగుభంగిఁదరక్."

అని చిన్నయసూరి వ్రాసికొనెను. అది కాదని గుప్తార్థప్రకాశికా కారులు (కల్లూరి వేంకటరామశాస్త్రిగారు "బాలవ్యాకరణము శిష్టు కృష్ణమూర్తిశాస్త్రిగారి హరికారికల కనువాదముగాని సూరిస్వతంత్ర రచనము కాదనియు, అబ్రాహ్మణుఁడగుట సూరి కట్టిపాండిత్యవిశేష ముండ" దనియు వ్రాసి, సూరిని త్రోసిరాజనఁజూచిరి. తత్త్వజ్ఞులెవరు నీ వాదము నిరాధారమగుట నంగీకరింపలేదు.) "కాళహస్తిలో కృష్ణమూర్తి శాస్త్రిగారికిని, సూరిగారికి జరిగిన సంవాదములో శాస్త్రిగారొక విషయమునఁ బరాజితులై సహింపనేరక సూరి బాలవ్యాకరణము నణఁచుటకు 'హరికారికలు' సంస్కృతమున వ్రాసి బాలవ్యాకృతి కిది మాతృక యని ప్రచారము చేసెడివా" రని జనశ్రుతి. దీని కుపష్టంభకముగా వీరేశలింగము పంతులుగారు 'కవులచరిత్ర'లో కృష్ణమూర్తి శాస్త్రిగారి చరిత్రయం దిట్లు వ్రాసినారు.

"ఈ కృష్ణమూర్తికవి కాళహస్తిలో నున్నపుడు చేయఁబడిన ప్రధానగ్రంథ మింకొకటికలదు. ఆ కాలమునఁ నీయనకును చెన్నపురి శాస్త్రపాఠశాలలో నాంధ్రపండితుఁడైన పరవస్తుచిన్నయసూరిగారికిని సిద్ధాంతకౌముదిలోని సూత్రవిచారము కొంత నడచెను. మన పండితులు సాధారణముగా మత్సరగ్రస్తులగుట సుప్రసిద్ధమే కదా! అట్టివారీర్ష్యచేతఁ దమకు లాభము లేకపోయినను బరులకు నష్టము కలుగుటయే తమ యభీష్టసిద్ధిగా భావించి కొన్నిసమయములయందుఁ బరులకీర్తికి భంగము

కలిగింపఁజూతురు. అంతకుఁబూర్వము కొంతకాలము క్రిందటఁ జిన్నయ సూరి బాలవ్యాకరణము రచియించెను. దానితో సరిపోల్పఁదగిన యాంధ్రవ్యాకరణ మావరకు వేఱొకటి లేదు. అట్లుండఁగాఁ గృష్ణమూర్తి గారిచేఁ జేయఁబడిన వ్యాఖ్యానముతోఁ గూడిన హరికారిక లనఁబడెడి యాంధ్రవ్యాకరణసూత్రగ్రంథ మొకటి యటుతరువాత నల్పకాలము నకు వెలువడెను. అదియే హరిభట్టకృతమై యథర్వణాచులచేఁ జేర్కొనఁబడిన కారికావళియైన పక్షమునఁ జిన్నయసూరి తనవ్యాకర ణము లోని సూత్రములన్నిటిని హరికృతగ్రంథమునుండి దొంగిలించి తన పేరిటఁ బ్రకటించినట్లు స్పష్ట మగుచున్నది. అయినను మూలగ్రంథ ములోఁ జూపఁబడిన లక్ష్యములు కొన్ని యథర్వణాచార్యుల కిటీవలి యాధునిక గ్రంథములలోని వగుటచేత వ్యాఖ్యానమును మాత్రమేగాక మూలగ్రంథమును సైతము కృష్ణమూర్తిగారే రచించిరేమోయని పలు వురు సందేహపడుచున్నారు. అట్టిగ్రంథమును రచియింపఁగలసామర్థ్య మావిద్వత్కవికిఁగల దనుటకు సందేహములేదు. ఈయన యిటువంటి గ్రంథకల్పనము సేయ సంశయపడువారు కారని చూపుటకై చరమ దశయందు గూడుగల్లులోనున్న పు డొకరాత్రిలోఁ జేసిన ట్రీయను కారోపింపఁబడిన యశ్వశాస్త్రకథ కొంత తోడ్పడుచున్నది".

(కవులచరిత్ర 588 పుట)

ఈ వాక్యములు సావధానముగాఁ జదివినచో సూరిగారి బాల వ్యాకరణమున కనూయపడి కృష్ణమూర్తిశాస్త్రిగారు హరికారికలు రచించిరనుట సుస్పష్టము. ఇదిగాక హరికారికలు పెక్కుచోట్ల నసందర్భ ములుగా నున్న విగూడను. ప్రథమమున మదుపజ్ఞంబని చెప్పిన 'సంస్కృత వ్యాకరణము' సుప్రచురము కాదని తలఁచి బాలవ్యాకరణము తెనుఁ గున సూరి రచించినాఁడు. చిన్నయసూరి కృష్ణమూర్తిశాస్త్రిగారివలె సర్వతంత్రస్వతంత్రుఁడు, షడ్దర్శనీపారంగతుఁడు కాకపోవచ్చును. బాల

వ్యాకరణము రచించుటకుఁ దగినపాణినీయపాండితియుఁ బ్రయోగపరిజ్ఞానము లేనివాఁ డనుట యన్యాయము.

ఆంధ్ర విశ్వవిద్యాలయపండితులు శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగా రీ వాదమును బలపఱుచుచుఁ గడకు వారు నిష్కర్షించి తెల్పిన యభిప్రాయ మిది :

"...పూర్వోదాహృతములగు సంశయములన్నియు బాల వ్యాకరణమే ప్రాథమిక మని స్థాపింపఁజాలియుండుటవల్లను, సూరిగారు విద్వాంసులని పండితపరంపరాయాతమగు ప్రసిద్ధి యుండుటవల్లను, నాంధ్ర సాహిత్య పరిషత్కార్యాలయమువారు ప్రచురించిన సూరిగారి జీవితమును బట్టియు, సూరిగారు రచించిన నిఘంటువును బట్టియు వీరిట్టి వ్యాకరణ గ్రంథము స్వతంత్రముగా రచించుటకు సమర్థులని స్పష్టముగాఁ దెలియుచుండుట వల్లను, బూర్వోదాహృతమగు నశ్వశాస్త్రకథనుబట్టి శిష్టుకవిగారిట్టి గ్రంథ కల్పనము చేయఁగలిగినవారని స్పష్టపడుచుండుట వల్లను హరికారికలకు బాలవ్యాకరణమే మూలమని నాయభిప్రాయము."

[బాల వ్యాకరణ హరి కారికల పౌర్వాపర్య విమర్శనము –
ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రిక సంపుటము ౧౫ – సంచిక ౫, ౬]

(నీతిచంద్రిక : ఇది సూరికృతులలో నత్యుత్తమము. వచన కథారచనా విధానమునకుఁ జిన్నయసూరియే శ్రీకారముచుట్టె ననుటకుఁ జరిత్రపరిశీలకు లొప్పుకున్నను నీతిచంద్రికలోని శైలి గవాలవాల మనుట సహృదయ సామాన్యమున కిష్టాప త్తియే.) సూరి 'వాణీదర్పణ' మను ముద్రాయంత్రమును నెలకొలిపి నీతిచంద్రిక తొలిముద్రణము 1853 లో వేయించెను. ప్రిరేశలింగకవి "చిన్నయసూరి ధీరు లెదఁ జేరిచి సారెకు నాదరింపఁగా మున్ను రచించి మించె నగము స్వచనంబుగ నీతిచంద్రికన్" అని తా నుత్తరార్థముఁ గూర్చెను. కొక్కొండ వేంకటరత్నము పంతులుగారును 'విగ్రహము' గావించిరి. సూరివచనములోని సొగసు వీరిద్దరకును దూరమైనది. మిత్రభేదము మిత్రలాభముకంటెఁ బ్రౌఢము. రచనా

చతురతకును, సామెతలు చక్కఁగ వాడుటకును, ప్రయోగ విశేషములు ప్రదర్శించుటకును చిన్నయసూరి శ్రద్ధ తీసికొనెను. రసానుగుణములగు వృత్తులు, పాత్రోచితములగు పదములు నీతిచంద్రికయందే పరికింప వలయును.) సూరి సూత్రాంధ్రవ్యాకరణము — ఆంధ్ర ధాతుమాలయు నాంధ్ర సాహిత్యపరిషత్తు ప్రకటించినది.

ఇతఁడు సంస్కృతాంధ్రములలోఁ జక్కనిరీతిగల కవిత సంతరించెను. పచ్చయప్పన్యశోమండనము చూడుఁడు.

"గగనంబట్లు రసప్రపూర్ణ విలసత్కందంబుల స్స్మాటి య
ద్భగసాలంబుగతిన్ సితచ్ఛదములన్ భాసిల్లి మేరుక్రియన్
జగదామోద సువర్ణభాస్వరముగా జాణొంది పచ్చాప్పనీ
శగుణంబు ల్గణుతించుకోశ మిది యిచ్చు న్మెచ్చుగావించెడిన్.
గుణస్య బాధికాం వృద్ధిం కృతవాన్ పాణినిః పురా
అబాధితగుణాం వృద్ధిమకరో త్పచ్చపప్రభుః"

సంస్కృతాంధ్రకవితలు రెండును ధారాశగతినుండి పండిత హృదయముల నాకర్షించుచున్నవి.

(చిన్నయసూరి వ్యాకర్తయేకాదు, కావ్యకర్తకూడను. భాషాభిజ్ఞుఁడేకాదు, సంగీతకళావిజ్ఞుఁడు కూడను. సరస్వత్యుపాసకుఁడే కాదు, హయగ్రీవోపాసకుఁడు కూడను. సుస్థిరయశ స్సంపాదకుఁడే కాదు, "సుజనరంజనీపత్రికా" సంపాదకుఁడు కూడను.)

సూరి కంఠధ్వని చాల శ్రావ్యముగా నుండెడిదఁట. ఆయన సంగీతము కొంతనేర్చెను. సూరి 'సుజనరంజని' యను మాసపత్రిక కొన్నియేండ్లు వెలువరించినట్లు తెలియును. అందుఁ బట్టపరీక్షార్థులకు విద్వాంసులకుఁ గలుగు భాషాసందేహములకుఁ జక్కని సమాధానములు ప్రచురింపఁబడుచుండెడివఁట. "ఇదివరలోఁ జిన్నయసూరి ముద్రింపించుచు వచ్చిన సుజనరంజనీ యను పత్రికయందు పై నుదహరించిన

మూఁడు గ్రంథములును భట్టుమూర్తి రచించె నని వ్రాసియున్నది” (అముద్రితగ్రంథ చింతామణి- 1886 ఫిబ్రవరి) ఈవ్రాఁతను జూచిన ‘సుజనరంజని’ సూరి నడపినటులు సువిశదము.

సూరి కవితానిపుణుఁడు. వచనరచనా మార్గదర్శకుఁడు. సంఘ సంస్కారపరుఁడు. భాషాపోషకుఁడు. ఇతఁడు ప్రాచీనుల యడుగుజాడ లలో నడచెను. ఇతనికి నన్నయ చెప్పినది వేదము. ఇతనికడ శాస్త్రాది గ్రంథములతో నిండిన భాండాగార ముండెడిదని ప్రసిద్ధి.

బ్రౌనుదొర ప్రోత్సాహము - లక్ష్మీనరసింహశ్రేష్ఠి హెచ్చరిక, సూరిభాషాసేవకుఁ జేయూఁత నిచ్చినవి. సూరి మరణించినను నాతని కీర్తిజ్యోతి బాలవ్యాకరణ నీతిచంద్రికాస్నేహమున నధునాతనాంధ్ర భాషాభవనములో దేదీప్యమానముగ వెలుఁగుచునే యున్నది.

మంత్రిప్రెగడ సూర్యప్రకాశకవి

1808 - 1873

ఆఱువేలనియోగి బ్రాహ్మణుఁడు. హరితసగోత్రుఁడు. ఆపస్తంబ సూత్రుఁడు. తల్లి : సీతమ్మ. తండ్రి : శరభరాజామాత్యుఁడు. జన్మస్థానము : పిఠాపురము దగ్గఱనున్న తిమ్మాపురము. జననము : క్రీ. శ. 1808 విభవసంవత్సరము. నిర్యాణము : 1873 సం॥రం మే 11 తేది, శ్రీముఖసంవత్సర వైశాఖశుద్ధచతుర్దశి భానువాసరము. గ్రంథములు: ౧. సీతారామచరిత్రము (ఆఱాశ్వాసముల కావ్యము- 1851-52) ౨. కృష్ణార్జునచరిత్రము (ద్వ్యర్థికావ్యము - 1863) ౩. భీమలింగ శతకము (1869.)

సూర్యప్రకాశకవి శ్రీకృష్ణభూపాలునాస్థానమునఁ బండితకవి. కృష్ణభూపాలుఁడు 'మాడుగుల' సంస్థానప్రభువు. ఈప్రభువు స్వయముగాఁ జదువుకొనిన పండితుఁడు. ఈయన 1813 లో నుదయించి 1875 లో నస్తమించెను. 1835 లో సంస్థానాధిపత్యము వహించి నలువదివత్సరములు రాజ్యమేలెను. అల్లంరాజుసుబ్రహ్మణ్యకవివరుఁ డీయనపై "కృష్ణభూపతిలలామశతకము" రచించెను. శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి యీ ప్రభువుచే సంభావితుఁడయ్యెను. బులుసు పాపయ్యశాస్త్రి, ఇంద్రకంటి గోపాలశాస్త్రి మున్నగు విద్వత్సత్తము లీయుత్తమభూపాలుని దర్శించి సంతోషించుచుండెడివారు. సాహిత్యముకలిగి సమర్థుఁడైనప్రభుని యాస్థానమునుండి గౌరవింపఁబడుట కవికి మహాభాగ్యము. అట్టి యదృష్టము పట్టుట యెక్కడనోకాని కన్పట్టదు. సూర్యప్రకాశకవి మంచి విద్వాంసుఁడు. చక్కనికవి. ఇతఁడు కృష్ణభూపతియోలగమున విద్వత్కవిగా వెలసెను. ప్రభుదర్శనమునకు వచ్చుపండితులను గౌరవించి రాజసన్మానము గావింపించి పంపించుచుండెను. అతని సహృదయత ప్రశంసనీయముగదా!

ఈ కవి విద్యాగురువులు మూవురు. కందర్ప సీతారామశాస్త్రి గారు బాల్యగురువులు. దేవులపల్లి తమ్మయసూరిగారు, వాడపల్లి అనంత పద్మనాభాచార్యులు గారును భాషాచార్యులు. వీరికడ నడఁకువతో నుభయభాషలఁ జక్కఁగ సంప్రదాయసిద్ధముగ నభ్యసించెను. కవితా ధార యితని కాజానజమైన యలవాటులోనిది. తల్లివంక వారును, తండ్రి వంకవారును బండితకవులు.

ఈకవి మేనమామ మంచికవియఁట. సీతారామచరిత్ర లోని యీ పద్యము చదువుఁడు.

సీ. ఏమహాత్మునితాత యీశ్వరారాధన
ప్రముదితస్వాంతుండు బసవరాజు
ఏగుణాధికుతండ్రి హిమశైలకైలాస
సురుచిరసత్కీర్తి జోగిరాజు
ఏసుధీమణియన్న భాసురాత్మజ్ఞాన
పటుమనీషాశాలి బసవరాజు
ఏధన్యునూనుం డనేకబాంధవజన
స్తుత్య సద్గుణవార్ధి జోగిరాజు
అట్టి విస్సాప్రెగడ సత్కులాంబురాశి
సోము సుకవిత్వధారాభిరాము నాకు
మేనమామయు మామయై మెఱయువాని
నధిపకృతిసఖ్యుఁ గామరాజాఖ్యుఁ దలఁతు.

ఈకవి తండ్రి నిటు నుతించెను.

క. ప్రవిమలభక్తి నుతింతును
రవిసన్నిభతేజు శరభరాజ సమాఖ్యున్
కవితామహత్త్వ జితభా
రవికవి మజ్జనకు శరభరాజసమాఖ్యున్.

సూర్యప్రకాశకవి మూఁడుకృతులు రచించెను. అందు మొదటిది సీతారామచరిత్రము. ఇందున్నవి యాఱాశ్వాసములు. ఆంధ్ర సాహిత్యపరిషత్తు బాలకాండముగల ప్రథమాశ్వాసము 1941 లో వెలువరించినది. ఈకృతి కృష్ణభూపతి యాజ్ఞచే శ్రీ భీమలింగేశ్వర దేవున కంకితము. పూర్వాంధ్ర కవుల నీకవి యభినుతించుచు నొకసీసము వ్రాసెను. అందుఁ గవి కాలక్రమము సక్రమముగఁ బాటింపలేదు. నన్నయ, తిక్కన, శ్రీనాథుఁడు, ఎఱ్ఱన, భాస్కరుఁడు, భీముఁడు, పోతన, రంగనాథుఁడు, రామభద్రుఁడు, సోముఁడు - ఈకవి మెత్తుకొనిన కవుల వరుస యిది. సమకాలికుఁడైనను పిండిప్రోలి లక్ష్మణకవి నితఁడు కొలిచెను. దీనికిఁ గారణ మొకటి యని తోఁచెడిని. లక్ష్మణకవి ద్వ్యర్థి కావ్యము వ్రాసెను. ఈయనకును ద్వ్యర్థికావ్యము రచింప నప్పటికే తలఁపు కలిగెను. ఆ తలఁపు క్రమముగ 1863 సం॥ లో 'కృష్ణార్జునచరిత్రము' గ ఫలరూపము నందినది.

సూర్యప్రకాశకవి తనప్రభునిచే నిటు లనిపించుకొనెను:

చ. ప్రవిమలభక్తి శంభుపదపంకజపూజన మాచరింపఁగా
నవిరళ శబ్దశాస్త్రములయర్థము లొప్పఁగఁ జెప్ప నుల్లస
న్నవరసభావ కావ్యరచనాపటిమ న్నృపకోటికి న్మహా
కవులకు మెచ్చుగూర్పఁగఁ బ్రకాశకవీ! చతురుండ వెన్నఁగన్.

ఈకవి శివభక్తుఁడనని తఱచు చెప్పుకొనియు 'సీతారామచరిత్రము' రచించి తన యద్వైతాభిమాన మావిష్కరించెను.

ఇతఁడు రచించిన 'కృష్ణార్జునచరిత్ర' మను రెండాశ్వాసములు గల ద్వ్యర్థికావ్యము శ్రీ విక్రమదేవవర్మ మహారాజుగారి టీకతో 1905 లో వెలువడినది. ఇందు పారిజాతాపహరణ విజయవిలాసార్థములు గలవు. శ్లేషకావ్యమైనను పింగళి సూరన కవిత్వచ్ఛాయలలోనుండి కుంటి నడక లేకుండ నున్నది. శబ్దశ్లేషకంటె నర్థశ్లేష ప్రధానముగా గ్రహింపఁ బడినది. శబ్దశ్లేషలో రాఘవపాండవీయ విధానము నాశ్రయించెను.

గీ. సమయమెన్నక భీష్మకజాతకేళి
నిలయ సన్నిధిఁజేరుట నలరువార్త
వినిన సత్యవిరక్తి దుర్వృత్తియనుచుఁ
జాల నిందింపకుండునే జగతి నన్ను.

(ప్రథమాశ్వాసము ౧౮౦ ప.)

కృష్ణ: సమయమెన్నక = ఆచారమును గణింపక, భీష్మకజాతకేలి నిలయ = రుక్మిణీ విలాసమందిరమును, సన్నిధిఁజేరుటన్ = మంచి నిధినిఁ బొందుటయును, అలరువార్తన్ = పుష్పవృత్తాంతమును, సత్య = సత్యభామ, విరక్తిన్ = విరాగముచేత, దుర్వృత్తి యనుచున్ = దుర్వ్యాపారము కలవాడనుచు.

అర్జు: సమయమెన్నక = శపథము గణింపక. అభీష్మ = భయంకరుఁడు గాని, కజాత = యమపుత్రుడను ధర్మరాజుయొక్క, కేలినిలయ సన్నిధిన్ = క్రీడాగృహసమీపమును, చేరుటను = చేరుటయనందగు, వార్త = వర్తనమును, సత్యవిరక్తి = శపథము నతిక్రమించిన వాఁడును.........

(శ్రీవిక్రమదేవవర్మగారి టీక)

ఈ కృష్ణార్జునచరిత్రము 1908 లో బి. ఏ కును, 1914 లో ఎమ్. ఏ కును బాఠ్యముగా చెన్నపుర విశ్వవిద్యాలయము వారు నిర్ణయించియుండిరి.

ఈ పండితుని సంస్కృత చాటువులు మూఁడు "చాటుధారా చమత్కారసారము" న అల్లంరాజు సుబ్రహ్మణ్యకవి చేర్చి వ్యాఖ్యానించి యున్నాడు. అవి యివి:

శ్లో. చేతులే గోతులే బాలే కాకులే వానముక్కులే
రుచిం పశ్యామి సుశ్యామే కచానాం తవ మంజులామ్॥

శ్లో. కృష్ణభూపతి సంకాశం కృష్ణభూపతి సన్నిభమ్
కృష్ణభూపతిసీకాశం కృష్ణభూపతి సదృశః.

శ్లో. విక్రమేణార్జునసమాః కృష్ణభూపాల తే హితాః
విక్రమేణార్జునసమాః కృష్ణభూపాల తేఽహితాః॥

తొలిశ్లోకములోని పూర్వార్థము తెలుఁగుగా భ్రమింపఁజేయును. రెండు మూడు శ్లోకములు మాఁడుగుల కృష్ణభూపాలుని గుఱించి ప్రశంసించుచు రచింపఁబడినవి.

సూర్యప్రకాశకవి భీమలింగ శతకమునుండి రెండురత్నములు :

క. కాయలు లేని మహీజము
కోయిల లేనట్టి వనము గుడిలేనిపురం
బాయత మోదముఁ జేయవు
కాయజహర! భీమలింగ! కలుషవిభంగా!

క. జీతంబు లేని కొలువును
దాతలు లేనట్టి పురము తమిలేని కవల్
ఖ్యాతిని బొందక యుండును
కౌతుకయుత! భీమలింగ! కలుషవిభంగా!

కోరాడ రామచంద్ర శాస్త్రి

1816 - 1900

వేఁగినాఁటి బ్రాహ్మణుఁడు. కౌండిన్యసగోత్రుఁడు. అపస్తంబ సూత్రుఁడు. తండ్రి: లక్ష్మణశాస్త్రి. జన్మస్థానము: కేశనకుఱ్ఱు (అమలాపురం తాలూకా) నివాసము: బందరు. జననము 1816సం॥ అస్తమయము 1900 సం॥ రచించిన తెలుఁగుకృతులు: ౧. మంజరీమధుకరీయనాటిక. ౨. ఉన్మత్త రాఘవము. ౩. నయప్రదీపము. (విగ్రహాంధ్రీకరణము) ౪. రథాంగ దూతము. (వచనము) – అముద్రితములు: ౧. శాకుంతలాంధ్రీకరణము. ౨. వేణీసంహారము. ౩. ముద్రారాక్షసము. ౪. ఉత్తరరామచరితము. ౫. పరశురామ విజయము. (గద్యము) ముద్రితసంస్కృత గ్రంథములు. ౧. కుమారోదయము. (చంపూ కావ్యము ౨౭ ఉల్లాసములుమాత్రమే ముద్రితము) ౨. ఘనవృత్తము. (సంస్కృతాంధ్ర పద్యములు) ౩. దేవీవిజయము. (చంపువు) ౪. శృంగార సుధార్ణవము. ౫.ఉపమావళి – అముద్రిత సంస్కృతకృతులు: ౧. మృత్యుంజయవిజయకావ్యము. ౨. పుమర్థసేవధి కావ్యము. ౩. కమనానందభాణము ౪. రామచంద్రవిజయవ్యాయోగము. ౫ త్రిపురాసురవిజయడిమము. ౬. ఉత్తరరామాయణము. ౭. ధీసౌధము. (వ్యాకరణసంగ్రహము) ౮. మంజరీసౌరభము ఇత్యాదులు.

“ఉత్పత్స్యతే మమతు కోపి సమాన ధర్మా” అను నిశ్చయమున ౧౯వ శతాబ్దిలో సంస్కృతాంధ్ర గ్రంథములు రచించి క్రొత్తమార్గము తీసినపండితకవి రామచంద్రశాస్త్రి. వీరిది పండితవంశము. ఈయన అమలాపురము తాలూకాలోని కేశనకుఱ్ఱు గ్రామమున మాతామహుని యింట బాల్యము గడపెను. రామమంత్రోపదేశము పొందెను. శిష్టు కృష్ణమూర్తి శాస్త్రులవారిసన్నిధి నలంకార గ్రంథములు చదివెను. మంచి సాహిత్యము సంగ్రహించెను. అంతఁ గొంతకాలమునకు,

త్వం సాహిత్యవరోసి సాధుకవితాధుర్యోసి తే వాగ్మితా
సిద్ధా ప్రవ్రజ చెన్నపట్టనపురీం విద్యాలయే హ్యూనకాః

అర్థాపార్థ్యేతమాయ విశ్వగ్రహాలుందత్వాం పరార్థం పరం
తేన స్వాత్మన సత్కృతప్రవిశ్య స్తన్యా స్వహైంత తుష్కరా.

అని మిత్రులు వివాహార్థ మెచ్చరించిరఁట. ఆసమయమునఁ జీకాకుపడియు లగు శిష్యకవిగారు రామచంద్రపురము రాజుగారికి "ఇతఁడు నాస్థాన పండితుడుగా గౌరవింపుఁ" డని యుత్తరము వ్రాసి యిచ్చిరఁట. వారు దేశమున క్షామము వచ్చుటచే నీకవిని రెండునెలలకంటె నెక్కువ పోషింపలేమని చెప్పిరఁట. ఆమాట రామచంద్రశాస్త్రికి నచ్చలేదు. మదరాసు పోయి యేదో యుద్యోగము సంపాదించుటకు సంకల్పించి ప్రయాణము సాగించెను. త్రోవలో మచిలీపట్టణమున నాఁగవలసివచ్చి యెంగువ రామస్వామి శాస్త్రిగారియొద్ద మంత్రశాస్త్ర మభ్యసించెను. అప్పుడు నర్థం అద్వైతపరబ్రహ్మశాస్త్రి పాండిత్యశక్తి పరీక్షకై శాస్త్రార్థము చేయఁగా నందాయనను ధిక్కరించి పెద్దచేసికొని యింటికిఁ బోయెను. ఆయన స్వస్థలము నడపల్లి. ఆయూరివారు రామచంద్రశాస్త్రి సామర్థ్యము పరీక్షించుటకు శతావధానము చేయుమనిరి. మహాకవితాధార కలిగిన యీయన కది యొక లెక్కా? నూటి పద్యములు తడవుకొనకుండ నవధానమునఁ జెప్పెనఁట. ఆ పద్యములు మాత్రమే మనకు లబ్ధములు.

క్రమముగా శాస్త్రిగారి పాండితీ కవితా ప్రతిభలు నుతికెక్కినవి. బందరు నోబిలుపాఠశాలలో నుద్యోగము లభించినది. అక్కడ ౪౩ వత్సరములు పనిచేసిరి. దొరలు సిరినైష్ఠికులు నిన్నెఱపోయెడివారు. ఇతఁ డెవ్వరిని లెక్కసేయుటలేదు. ఉద్యోగించిన నలుబదిమూఁడేండ్లలో 'ఉతప్పుచేసితి' యని యధ్యక్షునిచే నాక్షేపింపఁబడలేదు. కళాశాలాధ్యక్షుఁడు నీయనకు నొక శ్లోకార్థములో భ్రాంతి కాంతాభిప్రాయములు వచ్చినవి. శాస్త్రులుగారు ముక్తకంఠముతోన 'మీయర్థము పొరపా'టని వ్రాసివైచిరి. తాత్కాలికముగా నధికారికి క్రోధావేశము కలిగినను శాస్త్రులుగారి యథార్థవాదిత కాయన తలయొగ్గక తప్పినదికాదు.

వెనక శ్రీ వీరేశలింగము పంతులుగారు రాజమహేంద్రవరము నార్ట్సు కాలేజీలోఁ దెలుఁగుపండితులుగా నుండునపుడు కస్తూరి శివశంకర శాస్త్రి గారిది సంస్కృతపండిత స్థానము. శాస్త్రిగారు పరీక్షాపత్రము నెవ్వరా వ్రాసినవారికి నూటికి నూటపది మార్కులు వేయుచుండు వారఁట. ప్రిన్సిపాలు 'ఇదేమిపాప' మని యడుగగా, 'అవిద్యార్థిపుణ్యా' మని నిరంకుశముగా సమాధానించుచుండు వారఁట. మన రామచంద్ర శాస్త్రిగారి నైరంకుశ్య మాతీరులోనిదే.

మాడభూషి వేంకటాచార్యులుగారు మనశాస్త్రిగారి ప్రతిభ నెఱుఁగఁ దలఁచి "శ్లో. చింతకాయ కలేకాయ బీరకాయ తమారికే, ఉచ్చింతకాయ వాక్యాయ సాధకాయ తమాంజలిమ్" అని యొకశ్లోకము వ్రాసి శిష్యున కిచ్చి రామచంద్ర శాస్త్రి పీసి కర్థ మెట్లు చెప్పునో కనుఁగొని రమ్మనెనఁట. అంతట శాస్త్రులుగారు దాని కర్థము చెప్పుటయేగాక మఱి రెండు గద్యశ్లోకములు వ్రాసి యాచార్యులుగారికిఁ బంపి నిరుత్తరులను జేసి రని వదంతి.

ఈయన సంస్కృతాంధ్రములలోఁ జాలకృతులు రచించెను. పంద్రెం డవయేఁటనే యుపదేశము పొందెను. 'దేవీవిజయము', కుమారోద యము' అను గ్రంథములు వీరి యుపదేశవిషయమును స్ఫుటీకరించును. 1860 ప్రాంతమున మంజరీమధుకరీయ నాటకము సంఘటించిరి. ఈనాట కమునకు ముందుఁ దెలుఁగున ఎలకూచి బాలసరస్వతి విరచితమగు 'రంగకౌముది' నాటకమున్నట్లు వినఁబడి. మంజరీమధుకరీయములోని కథ కల్పితము. ఇది రంగమున కనుకూలము. ఇందలి కవిత్వము కఠినము. మచ్చున కొకపద్యము చూడుఁడు:

మ. పికదష్ట్రామ్రకినాల దంతపటియుత్పీనస్ఫురత్సౌరభ
ప్రకటోద్గార రజోగుళుచ్ఛ కుచభార ప్రహ్వా సంజాతకో
రక రోమోద్గమ సాంద్రమంద కలనిర్హ్రాదస్వనగ్రీవ, యీ
సకలశ్రీవని యామనిం గదిసి హృజ్జక్రీడలన్ సల్పెడిన్.

రామచంద్రశాస్త్రిగారు వేణీసంహార ముద్రారాక్షస శాకుంత లము లనువదించిరి. సంస్కృతాంధ్రకవితలు రెంటను వీరిచేయి యారితేఱినది. మేఘసందేశము తరువాతికథను 'ఘనవృత్తము' అను గీర్వాణకావ్యముగ రచించిరి. దీనికిఁ దెలుఁగుసేఁత శ్రీ మల్లాది అచ్యుతరామశాస్త్రిగారు చేసిరి. యక్షసందేశ శ్రవణానంతరము మేఘుని వృత్తాంతము తెలుపున దగుట దీనిని 'ఘనవృత్త' మని పేరుకొనిరి. అందలి ధోరణికి కాళిదాసు నొరవడి.

శ్లో. ఇత్యుక్తోసౌ సపది జలద స్తేన దీనాత్మనాలం
శ్రుత్వా కామం పరవహృదయః ప్రాగణీత్వాత్రపాహృష్టః
లోకే దీనావన మనుపమం పుణ్య మాదత్తఏవ
సంతః ప్రోచు స్తదిహ హిమయాతోపణీయస్పృహా మే.

మతుకుమల్లి నృసింహకవి

1816 - 1873

ఆఱువేలనియోగి. కృష్ణయజుశ్శాఖీయుఁడు. ఆపస్తంబ సూత్రుఁడు. కాశ్యపసగోత్రుఁడు. జన్మస్థానము తెనాలి. తల్లి జానకమ్మ. తండ్రి కనకాద్రిశాస్త్రి. జననము 1816 – ధాతృ సంవత్సర శ్రావణ బహుళ చతుర్దశి. నిర్యాణము 1873 – శ్రీముఖ సంవత్సర శ్రావణబహుళ తృతీయ. గ్రంథములు: ౧. ఆంధ్రమేఘసందేశము. ౨. వేంకటాచల యాత్రాచరిత్రము. 3. అజచరిత్రము. (ఆంధ్రప్రబంధము 1912 ముద్రి) ౪. చెన్నపురీవిలాసము (ప్రౌఢప్రబంధము. 1920 ముద్రి) ౫. శ్రీకృష్ణ జలక్రీడావిలాసనాటకము. ౬. నృసింహసహస్ర నామావళి. (సం) ౭. పుండ్రకకళానిధి. (సం) ౮. ఆంధ్ర సిద్ధాంతకౌముది. ౯. భరతశాస్త్ర సర్వస్వము. ౧౦. సంగీతసారసంగ్రహము. (అముద్రి.)

మూఁడుశతాబ్దులనుండి వీరిది పండితవంశము. ఈనృసింహకవి ప్రపితామహుఁడు మాధవకవి. ఈయన వ్యాసభారతము యథామాత్రకముగ ననువదించి "అభినవభారతము" అని పేరుపెట్టెను. ఈ మిశ్రకావ్యమునఁ బ్రస్తుత మాదికాండమాత్రము మిగిలియున్నది. తక్కిన పర్వములు తాడిపత్రిగ్రామమునఁ దగులఁబడినట్లు చెప్పుదురు. తెనాలి గోవర్ధనస్వామి కోవెలయం దుంగల గరుడవిగ్రహము మాధవకవి శిల్పకళాకుశలతకు దార్కాణ. ఈయన పుత్రులు నృసింహశాస్త్రి గారు. వీరు వేదవిదులు. గొప్పవైయాకరణులు. కనకాద్రిశాస్త్రిగారు వీరికిఁ గుమారులు. వీరే మనప్రస్తుతకవివరుని జనకులు. కనకాద్రిశాస్త్రి గారు సకలశాస్త్ర ప్రవీణులు. శ్రీ మల్రాజు గుండారాయఁడుగారి సంస్థానపండితులు. గుండారాయఁడుగారు నాఁడు పేరుమోసిన పెద్ద జమీందారులలో నొకరు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వీరినిగూర్చి యీకథ ముచ్చటించిరి:

"ఒకప్పుడు వాసిరెడ్డి వేంకటాద్రినాయఁడును, సర్నారావుపేట మల్రాజు గుండారాయఁడును, నూజవీటి అప్పారావును, చల్లపల్లి అంకి

నీఁడును గూడి యిష్టాగోష్ఠి సల్పుకొను సందర్భమున హాస్య చతురుఁడు గుండారాయఁడు 'మన జీవితములు కడచిన తర్వాత లోకము మనల నెటు ప్రశంసించునో తలఁచి చూచుకొందమా?' అనెనఁట. అందఱు నంగీకరించిరఁట. నూజవీటి అప్పారాయఁడు చనిపోయినా బైరాగులందఱును బలవించెదరు. తాను చనిపోయితినా వేశ్యలందఱు పలవించెదరు. వేంకటాద్రి నాయఁడు చనిపోయినా అందఱు ప్రలోయని దుఃఖించెదరు. అంకినీఁడు చనిపోయినా అందఱు అహో యని సంతోషించెదరు."

ఈగుండారాయని యాస్థానమునుండి పాండిత్యశక్తిచే నీకనకాద్రి శాస్త్రిగారు స్థిరమైనభూమి నార్జించి సుఖించెను. నృసింహావిద్వత్కవి తల్లి కూడ విదుషి. ఆమెపేరు జానకమ్మ. దశలవాక సుబ్బయామాత్యుని కొమార్తె. ఈ పద్యము లామెయే చెప్పినదఁట:

"మతుకుమల్లియిల్లు మహా విద్య వెదచల్లు
పరబుధేంద్రులకును ప్రక్కముల్లు
ఎఱిఁగి మెలఁగి రేని నెలమిచే నాటెల్లఁ
గాన వారియిల్లు ఘనతఁ జెందె"
అతి చమత్కృతి గలిగిన మతుకుమల్లి
వారు శబ్దము గొల్పిన శాణమున
వసుధలోపల నుంచెల్లవారియిల్లు
శారదాదేవి నాటకశాల యంద్రు
వాసుదేవుని కవితావిలాస మచట
మొలక బంగరు కజ్జల ప్రోఁతగాదె?

మనకవివరుని తమ్ముఁడు కృష్ణశాస్త్రి. ఆయన తన యన్నగారి "అజ చరిత్రము" లో నక్కడక్కడ నాశ్వాసాంతపద్యములు పోయినవి మరల వ్రాసెను. అతఁడుకూడఁ జక్కని కవితాధార గలవాఁడు.

మన నృసింహావిద్వత్కవి పూర్వులను మించిన పండితుఁడు. అజచరిత్రము ప్రౌఢప్రబంధ మీతని కృతులలో నుతికెక్కినది. ఇందలి శైలి వసుచరిత్రకు సహపాఠి. తెలుఁగుకంటె సంస్కృతపుఁబాలు వీరి కవితలో

హెచ్చు. భావములు మహోన్నతములు. భాష నిర్దుష్టము. ఈ పద్య మిన్నిటికి నాదర్శమైనది.

సీ. ఘనఘన శ్రీసముత్కట జటావరపద
క్రమయుక్తియీమయరమ్యవేణి
నానాస్వరవ్యంజన ప్రతానానూన
శబ్దమహాశబ్దశాస్త్ర వీణ
భూరిగుణవిశేష పుంజైక నిశ్వాసం
బంధవత్తర్క విభ్రాజితశశ
సరససాలంకియోజ్జ్వల సువర్ణపదోరు
సంగీతసాహితీ స్తనభరాఢ్య

గీ. శ్రీప్రసన్నతి నుఖరభాట్ట పరిభాక
రీయమంజీరయుగ రమణీయ చరణ
జలజనిత్య ప్రగల్భ వాచాల వాణి
నిలుచుంగాత ! మదీయాస్య జలరుహమున.

ఈ అజచరిత్రకే 'ఇందుమతీపరిణయ' మని మాఱుపేరు. ఇందున్నవి యాఱాశ్వాసములు. ఆద్యంత మొక్కరీతిని కవిత మహాప్రౌఢముగా నడచినది. రఘుచరిత్రాదుల ఛాయలు పెక్కు లున్నను కవి ప్రతిభావ్యుత్పత్తులు వానిని కప్పిపుచ్చినవి ఈకావ్యము మంగళాంతము.

క. పాణిగ్రహణ మొనర్చిరి
యేణాక్షియు వరుఁడు సాత్త్వికైకస్వేద్య
త్వాణీశ్లథభావము స్ఫుర
మాణహ్రీంకైతవమున మాటుపడుచుచుఁ. (౬-౫౩)

ఈకవి శ్రీమన్మాల్యశైలనృసింహభక్తుఁడు గ్రంథాంతగద్య మరయునది:-

"శ్రీమన్మాల్య శైల నృసింహ వరప్రసాద సమా
సాదిత సకల శాస్త్ర సంవిదుపస్కృత సంస్కృ

తాంధ్ర సాహితీ పురస్కృత సరస సారస్వత
చతుర వాగ్ధోరణి.......................

ఈకృతి యానృసింహస్వామి కే యంకితము.

ఈకవిసింహుని యితరకృతులలో "చెన్నపురీవిలాస" మొకటిచెప్పదగినది. ఇది శ్రీరాజా బొమ్మదేవర నాగన్ననాయుఁడు జమీందారువారి యాజ్ఞచే రచియింపఁబడినకృతి. ఈయన కృష్ణామండలములోని "తోట్లవల్లూరు" సంస్థానాధిపతి. ఆసంస్థానమునకు నీనృసింహకవి పండితుఁడుగను, పరీక్షాధికారిగను నుండెను. సంస్థానప్రభువులవలన మనకవి మహాసన్మానములు నందుచుండెను. కొల్లలు తిరిగినపండితులు వార్షికములకు వచ్చినప్పుడు వీరేపరీక్షాధికారులు. తర్కాదిశాస్త్రపండితులగు శ్రీ ప్రభల సుందరరామశాస్త్రి ప్రభృతులను వీరు శాస్త్రవాదమున నోడించిరని యందురు. శ్రీ జగద్గురు శంకరాచార్యులవారి పీఠవిద్వాంసులసమక్షమునఁ బైవారికిని మన శాస్త్రిగారికిని దర్కశాస్త్రీయవాద మిరువదియొక్క దినము జరిగినదఁట. అప్పుడు వీరివిజయము నెఱిఁగి పీఠాచార్యులీపండితు నేనుఁగుపై నూరేఁగించిరఁట. ద్వైతాద్వైతవిశిష్టాద్వైతములలో వీరి వాదప్రావీణ్య మగణ్యము. నృసింహులోపాసకుఁ డగుటచే నీయనయెదుట వాదముచేసి నెగ్గినవారు లేరని వచింతురు. వీరి బుద్ధిలోఁ బ్రతిఫలింపనిశాస్త్రము లేదు. కళలేదు. ఇందులకు వారిగ్రంథములే సాక్షులు. ఈయన ముప్పదియేండ్లు వచ్చునటుకుఁ బితురంతేవాసియై షట్ఛాస్త్రములు లోతులుముట్ట వ్యాసంగించెను. అప్పుడు వాక్యార్థములకు గ్రంథరచనకుఁ గడఁగెను. లోకమర్యాదకు సంస్థానపండితుఁడుగా నుండెఁగాని ప్రభువునకు లొంగియుండలేదు.

సంస్థానప్రభువు నాగయ్యనాయుఁడుగారితో నీకవి చెన్నపురము వెళ్లినపుడు చూపట్టినవిశేషములు ప్రబంధరూపముగ వర్ణింపుఁడని యడుగ నీ"చెన్నపురీవిలాసము" రచించిరఁట. అది 1860 ప్రాంతము. నాఁటి మదరాసులోని విశేషములన్నియు నిండుఁ గన్నులకుఁ గట్టినట్టులు వర్ణింపఁబడినవి. వీథులు, మేడలు, సముద్రము, రైలు, ఫొటోగ్రాఫు, అచ్చుకూటములు, ఆసుపత్రులు, మ్యూజియము, లైటుహౌసు, హార్బరు

పువ్వులయంగడి యున్నగు నెన్నో ప్రకరణము లిందుఁ గలవు. కావ్యము గద్యపద్యాత్మకము. కవిలోకజ్ఞత కిది యద్దము. ఆ కాలమున నిట్టిక్రొత్త యూహ లూహించిన కృతికర్తను నేఁటిచారిత్రికులు ప్రశంసింపఁ దగి యున్నది. ఇందలిపద్యము లన్నియు గొప్పవి. అచ్చటచ్చటివి మచ్చు.

మ. ఎరణాయూరును గత్తివాక యుసదూరీ రెన్న ఖుంబూరు మే
ల్తిరువట్టూరును రాయపేట తిరునల్లిక్కేళి చేపాకయున్
బరశుంబాక పరంగికొండ మరి కృష్ణాంపేటయున్ లోనుగాఁ
బురిమిట్టున్ బలసిల్లునాటుపురమిల్ భూతింద దేకాకృతిన్.

గీ. సరకు నింపను దింపను సారెసారె
దరులయొద్దకు దరియొద్ద కరుగుపడవ
లోడలకు మేడలకు మైత్రినొనరఁగూర్చ
నిటు నటు చరించుచాగుల నెనసి వెలయు.

మ. అల మోగ్నేసు పరంగి బొంబయియు బర్మాసీమ పైగోవ బం
గళ కోరంగియు నాదగాఁగలుగు ప్రఖ్యాతంపుకోస్తాల నా
వల రాక ల్నగరీజనంబులకు రేవల్ దెబ్బ్ర రఁజిల్లు ను
జ్జ్వల 'సీకష్ట' నివిష్టకేతన పటు స్తంభాగ్రచేలచ్ఛటల్.

సీ. క్షమ విహారించువాకృతి పుట్టినయులు ము
తుకు మల్లి కులముతల్లిక తదన్వ
యోదితు వేంగళార్యాకులు మాల్యాశై
ల నృసింహ కరుణోపలబ్ధ వర చ
తుష్షష్టి విద్యావిశాల భవత్ప్రపితామ
హుండు మాధవకవీంద్రోత్తముఁ డఖి
నవభారతాది నానాగ్రంథకర్త నీ
తాత నృసింహ విద్వద్వరుండు

గీ. శబ్దశాస్త్ర ప్రసయీ విచక్షణుఁడు నీదు
జనకుఁ డైనట్టి కనకాద్రిశాస్త్రివర్యుఁ
డఖిల శాస్త్రార్థవేది నీ వద్భుత ప్ర
సిద్ధసారస్వతుఁడవు నృసింహశాస్త్రి!

వారణాసి వేంకటేశ్వరకవి

1820

వెలనాటి వైదిక బ్రాహ్మణుఁడు. అపస్తంబ సూత్రుఁడు. విశ్వామిత్రగోత్రుఁడు. తల్లి: లచ్చమాంబ. తండ్రి: కామయార్యుఁడు. గోదావరీ మండలములోని పీఠికాపుర ప్రాంతమునఁగల 'క్రొత్తయిసుకపల్లి' యీకవి నివాసమని చెప్పుదురు. 1850 ప్రాంతమున గ్రంథరచన గావించి నటులు తెలియుచున్నది. జననము 1820 ప్రాంతము. రచించిన గ్రంథము: రామచంద్రోపాఖ్యానము (ఆఱాశ్వాసముల కావ్యము 1911 ముద్రితము.)

రామాయణములోని కథను సంక్షేపించి యాఱుకాండములకు నాఱు ఆశ్వాసములుగా 'రామచంద్రోపాఖ్యాన' మనుపేర గద్య పద్యాత్మక మగుకావ్యము రచించిన యీవారణాసి వేంకటేశ్వరకవి సంస్కృతాంధ్రములలోఁ జక్కనిప్రవేశముకలిగి శివారాధకుఁడైన పండితుఁడు. ఈగ్రంథమునకు శ్రీ పురాణపండ మల్లయ్యశాస్త్రిగారు పీఠిక వ్రాయుచు నీ వేంకటేశ్వరకవి నివాసము పీఠికాపురపరిసరమున వెలసిన క్రొత్త యిసుక పల్లి యనియు, రచనాకాల మిఁతఁడు 1850 ప్రాంతమం దీగ్రంథరచన చేసి యుండుననియుఁ, దత్రత్యులవలన విన్నది విస్పష్ట పఱిచిరి. కూచిమంచి తిమ్మకవి వలెనే యితఁడును శివభక్తుఁడై యీకృతి "శ్రీ పీఠాఖ్యపురీ మహేశ్వరుఁ" డగు కుక్కుటేశ్వరున కంకితము గావించెను. రామోపాఖ్యానము రచించి యీశ్వరున కిచుటలో నితని యద్వైత మతాభిమానము వెల్లివిరిసినది. సంస్కృత సీసములో నీ కవి గావించిన కుక్కుటేశ స్తవము వినుఁడు.

సీ. శ్రీమ ద్వచోమానిసీ మహశ్చక్రాణి
నాకలోకేభ విభాకులాని
దుగ్ధపాథోధి షమ్యగ్ధామయాధాని
పుండరీక ప్రభామండలాని

బృందారకావగా మందభా బృందాని
కైలాస శైల రుగ్జాలకాని
మహనీయ సురమహీరుహా దీప్తిజాలాని
విపుల శుభ్రచ్ఛదోన్నపటలాని
వ్యాళనాయక రుచి చక్రవాళకాని
కంబు విస్ఫార శోభాకదంబకాని
భువి విజిత్వా విరేజిరే తవయశాంసి
మారమదభంగ! కుక్కుటాకారలింగ!

ఏతద్ గ్రంథాంతగద్యమున "ఇది శ్రీమత్కుక్కుటేశానుగ్రహ ప్రభూతకవిత్వ విశ్వామిత్ర గోత్రపవిత్ర వారణాసివంశపారావార కైరవ మిత్ర విద్వన్నుతచరిత్ర కామసూర్య పుత్ర సుకవి జనవిధేయ శ్రీ వేంక టేశ్వర నామధేయ ప్రణీతంబైన......" యనియున్నదిగాని, కృత్యాది పద్యములో నీగ్రంథనిర్మాణమునకుఁ దనసోదరులైన లక్ష్మీపతి, జోగన్న యనువారలు తోడ్పడిరని కలదు. ఆపద్య మిది:

శా. ప్రీతింబుట్టితి మన్వధూవరులకున్ శ్రీ వెంకటేశుండ నే
నేతద్ గ్రంథనిబంధనంబునకు నాకెంతేనియుం దోడుగాఁ
జేతస్ఫూర్తి రచించి పొల్పెసఁగు లక్ష్మీపత్యభిఖ్యుండు వి
ఖ్యాతప్రజ్ఞుఁడు జోగనాహ్వయుఁడు నార్యశ్లాఘ్యసంశీలతన్.

గ్రంథపీఠికాకారులు మల్లయ్యశాస్త్రిగా రీవిషయము గూర్చి యిటులు వ్రాయుచున్నారు.

"...ఇట్లున్నను నీగ్రామమందున నున్నవారొకరు వీరు తమకు సన్నిహిత బంధువు లనియు, వీరిమువ్వుర నెఱుఁగుదు మనియు, వేంకటేశ్వరకవి దీనిని రచింపనారంభించి మిక్కిలి కొలఁదిభాగమును రచియించి యేకార ణముచేతనో మాని తరువాతఁ గొలఁదిదినములలో మృతిఁజెందెననియుఁ, బిమ్మట లక్ష్మీపతియే దీనిని సాంతముచేసి యన్నయందలిభక్తిచే నాయన

చేసినట్లే ప్రచురించెననియుఁ జెప్పిరి. వీరు రచించిన యితరగ్రంథములేవియు లేమింజేసియు, శైలి యన్నిభాగముల సదృశ మగుటంజేసియు నిందేది యెవరు రచించిరో తెలియుట దుస్సాధము......"

ఏది యెట్లైన నీగ్రంథ మొక్కటేతీరున ధారాళమైన కవిత్వముతో రాజిల్లినదనుట వాస్తవము. వేంకటేశ్వరకవి పితామహుఁడు "......అబ్జాంభోరుహాస్తాను కం, పాసంప్రాప్త సమస్త దేశ విలసద్భాషా కవిత్వాది, విద్యాసంపాదితరత్న హేమ వసనక్ష్మారామ భూషాముఖ, శ్రీసత్కారుఁడు" అయిన వేంకటేశ్వరకవి యని గ్రంథములోఁ జెప్పికొనెను. ఇతని తండ్రి "రాజాధిరాజ సభాంతరార్యలోక సంశ్లాఘ్య సకల కలాకలాపనిధి" యఁట ఆయనపేరు కామకవిరాజు. తండ్రికడనే మన వేంకటేశ్వరకవి చదువులు సమస్తము చదివెనఁట. ఇతని పితృసోదరుఁడుకూడ నుభయభాషాకవిత్వ విశారదుఁడనియు, రాజానుగ్రహ పాత్రుఁడనియు గ్రంథాదినున్నది. మేనమామయు గొప్పభక్తుఁడు, నీతిశాస్త్రవేత్తగఁ జెప్పఁబడెను. ఈరీతిని దండ్రియుఁ, బినతండ్రియుఁ, బితామహుఁడు, మాతులుఁడు ప్రఖ్యాతులైనటులును, మహారాజ సత్కారము లందినటులును వేంకటేశ్వరకవి కృతిప్రారంభపద్యములో ఘనముగస్తుతించుకొనెను గాని, వారి వారి గ్రంథములుగాని, వారినిగుఱించిన కథలుగాని కనఁబడవు, వినఁబడవును.

ఈ రామచంద్రోపాఖ్యానము నందలి కవిత యందచందములు కలిగి ధారావిషయమునఁ బూర్వకావ్యములతీరు స్మరింపఁజేయుచున్నది. ఎత్తుకపోయె, చేతును మున్నగు ప్రయోగములు కొన్ని వ్యాకరణము ననుసరించనివికలవు. మొత్తముమీఁద ద్రాక్షాపాకము, నడుమ నడుమ నారికేళపాకముగఁ గవితసాగినది. మచ్చుపద్యములు:

చ. ఒక పలుగాకి కాకి యమితోన్మద మొప్ప ధరాకుమారికం
జకమక నొందఁజేయ రఘుశేఖరుఁ డారసి దాని కాత్మలో

నకనక నొంది క్రన్ననఁ దృణం బొకచేయ మహాస్త్రమై కరం
బొకవరి బీరువోక సకలోర్వరఁ ద్రిప్పినఁ గాకి భీరుతన్.

తృతీయాశ్వాసము.

శా. కాంతా రాంతర సంచర జ్జనకరాట్కన్యా మణీ విస్ఫుర
త్కాంత శ్యామల కేశపాశ విలస త్కాలాంబుదాలోక నా
ట్యంతామోద నటత్కలాపిచయ కేకారావ సంపూరితా
శాంతం బయ్యెను వింటి కాని యెడఁ గేక్యాఘుంబు లిట్లుండునే?

తృతీయాశ్వాసము.

మ. కలశీ సూను మహోపదేశమున సర్కస్వామి నెంతే విని
ర్మల భక్తిం బ్రణుతించి బాహుబలసామగ్రిన్ విజృంభించి యీ
కలుషాత్మున్ వధియించెదం గలన నింకన్ బంకజాతాసనా
దులు నడ్డంబుగ వచ్చి నిల్చిన సుధాంధో బృంద మీక్షింపఁగన్.

షష్ఠాశ్వాసము.

ఆకొండి వేంకటకవి
1820

ఆరామద్రావిడ శాఖీయ బ్రాహ్మణుఁడు. తండ్రి: జగన్నాథ శాస్త్రి. తల్లి: అచ్చమాంబ. నివాసము: విశాఖపట్టనమండలములోని "గజరాయనివలస". రచించిన గ్రంథములు: తత్త్వసంగ్రహరామాయణము శతకములు మూఁడు (అముద్రితములు). కవికాలము 1820 ప్రాంతము.

ఈకవిచే నాంధ్రీకరింపఁబడిన "తత్త్వసంగ్రహ రామాయణము" నందలి బాలకాండము ఆంధ్రవిజ్ఞానసమితి వెలువరించినది. ఈ రామాయణము సంస్కృతములో రచించినవారు శ్రీ బ్రహ్మానందభారతీ స్వాములు. ఈయన యెప్పటివారో తెలియదు. భారత, విష్ణు, కూర్మ బ్రహ్మాండాది నానాపురాణములనుండి సంగ్రహింపఁబడిన కథ లెన్నో యిందున్నవి. ఈ వేంకటకవి మేనమామలు పెద్దపండితులు. వారిని గూర్చి కావ్యాది నిట్లు చెప్పుకొనెను:

సీ. పండితదుర్మద మనఃపల్లవముకుళ పు
ష్పవికాస జైత్రుండు పాత్రసూరి
స్వాభ్యస్త నిఖిలశాస్త్రాబ్ధిజజ్ఞానామృ
తేప్సానుభవుఁడు గౌరీన్నసిష్టి
ప్రభుసభాప్రథిత విద్వజ్జయోద్భవ యశో
న్నతసద్యశుఁడు జగన్నాథశాస్త్రి
స్వకృత ప్రబంధ పుష్పగుళుచ్ఛసురభితా
ర్ణవ మధ్యదేశుండు రామసుకవి
గీ. యనఁదగు సమాఖ్య లొప్ప భూమ్యధిప దత్త
మణివలయకుండలాది భూషణము లమర
నలువు మీఱఁ జెలంగునా నలువురైన
మాతులుల కెఱఁగెదఁ గీర్తిమాతులులకు.

ఈకవి చిన్ననాఁటనే పితృవియోగము నంది మాతామహుఁడు కాకర పర్తి వేంకటశాస్త్రియొద్ద సంస్కృత మభ్యసించెను. ఇతని మేనమామ లలో పాత్రసూరి యనునతఁడు "సత్యభామా కృష్ణ సంవాదము" అను సుందరమైన ప్రబంధము రచించెను.

ఈ వేంకటకవి ఘండపాక పార్వతీశ్వరకవి, కాకపర్తి పాత్రసూరి కవులకు సమకాలికుఁ డగుట ౧౯ వ శతాబ్ది యారంభములోనివాఁడని తెలియవలయును. ఈయన "తత్త్వ సంగ్రహరామాయణము" రచించు చుండుటఁ దెలిసి సాలూరు జమీందారును, కాశింకోట జమీందారును కృతినిమ్మని కోరిరఁట. నరకృతిగావింప నిష్టపడక తనగ్రంథము శ్రీకృష్ణ భగవదంకితము గావించి యీకవి చరితార్థుఁ డయ్యెను. ఇందలి కవిత సంస్కృతపద ప్రచురము. వ్యాకరణవిశేషము లెక్కువి యెఱుంగు నవట కనేక నిదర్శనము లున్నవి.

క. ఏహి గృహాణ ప్రతిభిక్షాం
దేహి దయాక్షీరవారిధే నస్త్రాహి
త్రాహి రవిజం భటం జా
నీహి జహీంహి క్రుధా మనీషాం శాంత్యా.

ఇది శుద్ధసంస్కృతకందము. ఇట్టి వింకను గలవు. గ్రంథకర్త స్యాలకుఁడు వఝ్ఝల అన్నయభట్టు ఈ గ్రంథము కొంతభాగము పూరించెను.

గీ. స్యాలకుఁడు మాకు సాహితీపాలకుండు
వఝ్ఝ లన్నయభట్టు కవనవిశేష
తులితనన్నయభ ట్టురుబలసహాయ
మొనరఁ జేయఁగ నీగ్రంథమును రచింతు.

అని కవి చెప్పుకొని, బాలకాండము మొదలు సుందరకాండాంతము - యుద్ధకాండములోఁ గుంభకర్ణ యుద్ధాంతముగను - తరువాత రావణ ద్వితీయ యుద్ధభాగము సీతాపరిగ్రహణ పట్టాభిషేక ఘట్టము వ్రాసి

పూర్తిచేసెను. నడుమది వజ్ఝల అన్నయ భట్టు ఎనుబదిపద్యములలో బూరించెను. పూరణ శైలి వేఱుగా నున్నది. వార్ధకభీతిచే నీకవి యిత రునిచే వ్రాయించెనా ? యని సందేహించెదము. షష్టిపూర్తి కాకుండఁ గనే యితఁడు మరణించెననియు, గ్రంథరచనమునకుఁ బదునైదేండ్లు పట్టినదనియుఁ దద్వంశీయులు చెప్పుదురు.

ఈ రామాయణమేగాక వేంకటకవి మూఁడుశతకములు కూడ రచించెను. "రామా" అనునది యొకటియు, "నారాయణ ! భక్త పోషణా ! శ్రీరమణా !" అనున దొకటియు "రామప్రభూ" అనున దొకటియు నా శతకములకు మకుటములు. ఈ రామాయణములో నాయా శతకపద్యములు శ్రీరామస్తవ సందర్భమునఁ గలవు. మచ్చున కందలి పద్య మొకటి ప్రకటింతును.

అఘనాశాఖిల దేవతానిచయ సౌఖ్యప్రాపకోద్యత్ప్రభా
వఘనా ! దివ్యసువర్ణ చేలమణి భాస్వత్కాంచి కాంచన్మహా
జఘనా ! హార కిరీట ముఖ్యవర భూషాభూషిత ప్రోజ్జ్వలా
పఘనా ! కీర్తిఘనా ! ఘనాఘన సమాభాధామ ! రామప్రభూ !

పరవస్తు వేంకట రంగాచార్యులు

1822 - 1900

జననము 1822సం. నిర్యాణము 1900సం. నివాసస్థానము విశాఖపట్టణము. తండ్రి: శ్రీనివాసాచార్యులు. గ్రంథములు: ౧. మంజుల నైషధము (ఏడంకముల నాటకము) ౨. లఘువ్యాకరణము (శ్లోకరూపమగు సులభవ్యాకరణము) ౩. ప్రపత్తివాదము (వేదాంతగ్రంథము) ౪. కుంభకర్ణ విజయము ౫. ఆంగ్లాధిరాజ్యస్వాగతము (చిన్న కావ్యములు) ౬. శకుంతలము (ఆంధ్రీకరణము) ౭. కమలినీకలహంసము (రాజచూడామణి దీక్షితుని కృతి కాంధ్ర పరివర్తనము) ౮. శబ్దార్థ సర్వస్వము (నిఘంటువు) ౯. ఈశ, కేన, కఠ ప్రశ్న, ముండ, మాండుక్యాది దశోపనిషత్తులకుఁ బద్యానువాదము. మున్నగునవి--

మన ప్రాచీనకవి పండితుల నిరంకుశతకు గుఱుతులుగా ననేక చరితములు చెప్పుకొందురు. పిఠాపురసంస్థాన ప్రభువగు గంగాధరరామారావుగారు గొప్ప రసిక ప్రభువులనియు, వారియాస్థానిలో బులుసు పాపయ్యశాస్త్రి ప్రభృతులు పండితులుగా నుండి చేసిన నిరంకుశవాదములు స్మరణీయములు లనియు నేడు కథలుగా, గాథలుగా నల్లుకొన్నవి. విజయనగర సంస్థానములో కలిగొట్టు కామరాజుగారని గొప్ప గాయకుఁడు. ఆయన పల్లవిపాటలో జోడులేనివాఁడు. మహారాజు బతిమాలినను, దనకు దోఁచినపుడుగాని గొంతెత్తువాఁడు కాదఁట.

మహామహోపాధ్యాయులగు పరవస్తు రంగాచార్యుల వారిని దర్శింప వలయునని విజయనగర సంస్థాన ప్రభువు నభిలాష. ఎన్నో సారులు వర్తమానము లంపిరి. చివరకు రంగాచార్యులవారు మూడు నియమముల కడ్డు చెప్పనిచో వచ్చుట కభ్యంతరము లేదని కబురు చేసిరి. ౧. సవారీలో కోటగుమ్మమువరకు వెళ్ళుట (౨) కోట గుమ్మముకడ సవారీ దిగి పాదుకలతో సభామండపముదాఁక వెళ్ళుట.

(3) అక్కడ పాదుకలువదలి సభలో చిత్రాసనముమీఁదఁ గూర్చుండుట. పయి షరతులలో మొదటి రెండును మహారాజున కంగీకార్యము లైనవి. చివరిది మాత్రము వా రంగీకరింపలేదు. "చిత్రాసనముమీఁదఁ గూరుచుండుట మాకేమియు వ్యతిరేకము కాదుగాని, పండితుల కవ మానకరమగు " నని ప్రభువుల యుద్దేశము. ఆపద్ధతిని మేము రానే రామని రంగాచార్యులవారి సమాధానము.

ఇట్టి యాచార్యులవారి పాండితీ పటిమత యెంతగొప్పదో! ఆయన తర్క వ్యాకరణ మీమాంసా ద్యనేక శాస్త్రములలో నందె వేసినచేయి. మహా మహోపాధ్యాయ బిరుదమునందిన మన తెలుఁగువారిలోఁ బ్రథములు రంగాచార్యులవారు. వీరితరువాత తాతా సుబ్బారాయ శాస్త్రిగారికే యాబిరుద మన్వర్థమై యందగించినది. పదపడి, దాని లోని బిగువు కొంత నడలిపోయి బెడఁగు తగ్గినది. శాస్త్రములలో నింత పరిశ్రమ చేయువారు, తెలుఁగు బాసపై తేలికచూపు వేయుదురు. వీరటులు కాదు. కాళిదాసు శాకుంతలము ౧౮౭౨ లోఁ దెలుఁగున సంత రించి 'సకల విద్యాభివర్ధనీ పత్రిక' లో రెండంకములు వెలువరించిరి. మిగిలిన గ్రంథము ప్రచురితమైనట్లు చూడలేదు. రంగాచార్యులవారి యీ తెలిఁగింపు వీరేశలింగము పంతులుగారి శాకుంతలాంధ్రీకృతికిఁ గొంతయుత్సాహ మిచ్చినదని స్వీయ చరిత్రములోని పంతులుగారి వ్రాఁత వలనఁ దెలియును.

ఎంతటి కఠినాంశ మయినను జేతి యుసిరికవలె నందఁజేయు చాతు ర్యము రంగాచార్యులవారికి నిసర్గజము. ఆయన మాటాడునపుడు జనులు ముగ్ధులగుచుండెడివారు. సభ్యుల యభిరుచులు కనిపెట్టి, యిట్టే తమయభిప్రాయము మార్చుకొని యుపన్యసించుటలో వీరి కున్నంత నేరుపు వేఱెవరికి నుండదని పలువు రిప్పటికిఁ జెప్పుకొనుట కలదు. ౧౮౯౯ లో వీరొకతూరి రాజమహేంద్రవరము వేంచేసినపుడు

జరిగినముచ్చట శ్రీ వీరేశలింగము పంతులుగారు ముచ్చటించిరి. హిందూమత ప్రశస్తతనుగూర్చి రంగాచార్యులవారు సుధా సహోదర మగు మధురధోరణిలో నుపన్యసించెను. వెనువెంటనే మహారాష్ట్ర పాఠశాల స్థాపించి నడపుచుండిన ముత్తుస్వామి శాస్త్రి భావోద్రేకత నాఁపలేక "తా నదివఱకు క్రైస్తవ మతావలంబిననియు మీ యనుగ్రహము వలన నేఁటినుండి హైందవ మతావలంబి నయితిననియుఁ" జెప్పి ప్రణమిల్లెనఁట. ఆయన కేకాదు, నాఁడు వీరియుపన్యాసము విన్న పరమతస్థుల మనస్సు లెన్నో హిందూమతమువైపునకు వచ్చి స్థిరపడినవి. వాదవిషయమునఁ గొంత స్వతంత్రత చూపినట్లున్నను, మొత్తముమీఁద శాస్త్రప్రామాణ్యమునకు దవ్వుగాని త్రోవ రంగాచార్యులవారు తీసినారని యనేకుల యభిప్రాయము.

వీరు తమ యెనిమిదవయేఁటనే కుంభకర్ణవిజయ మను సంస్కృత కావ్యము రచించిరి. ప్రౌఢభాషాసరస్వతి బిరుదాఢ్యులై ౧౮౮౭ లో విక్టోరియా జూబిలిలో మహామహోపాధ్యాయులై వన్నె గాంచిన రంగాచార్యులవారు బొబ్బిలి, ఉర్లాము, పిఠాపురము, మైసూరు, మందసా, మున్నగు సంస్థానములలో సన్మానింపఁబడిరి. బొబ్బిలి సంస్థానమున మూఁడు వందల పృచ్ఛకులతోఁ బరశ్శతావధానము గావించిరని ప్రసిద్ధి.

ఆంగ్లములోని "ఎన్సైక్లోపీడియా బ్రిటానికా" గ్రంథము తీరు నాదర్శముగాఁ గొని శబ్దార్థ సర్వస్వమను గొప్పనిఘంటువును వీరు రచించినారు. ఇది వీరి సారస్వతోద్యమములలో శిరోమణి. దీని రచనకు మొత్తము నలువదియేండ్లు పట్టినది. 200 పుటలలో అకార-ఆకారాది పదములు గల రెండుసంపుటములు వెలువరింపఁబడినవి. శేషభాగ మెంతయో వెలుఁగు చూడవలసి యున్నదై యున్నది. మొదటి సంపుటములు చూచినచో శ్రీ రంగాచార్యుల వారి విశ్వతోముఖపాండిత్య మందు రూపముగట్టి కనుపట్టును. వీరి తండ్రిగారు శ్రీనివాసాచార్యులు "సర్వశబ్దసంబోధిని" యను అకారాది సంస్కృత

నిఘంటువు రచించిరి. అదిగాక వారు వేంకటాధ్వరి 'విశ్వగుణాదర్శము' తెలుఁగు పఱిచిరి. కుమారుఁడు తండ్రిని మించిన పండితుఁడు.

ఈశావాస్యోపనిషత్తులకుఁ దెలుఁగు పద్యములలో ననువాదము రంగాచార్యులు గావించిరి. అదిచూడ నబ్బురమగును ఆపద్యముల పొందిక సుందరమైనది.

శాన్తిః॥ పూర్ణమదః, పూర్ణమిదం, పూర్ణాత్పూర్ణ ముదచ్యతే ।
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥

క. పూర్ణమది, పూర్ణమిదియుం
బూర్ణంబగు దానివలనఁ బూర్ణము పొడమున్
బూర్ణమగు దానిదే యగు
పూర్ణముఁ గొని మిగులుచుండుఁ బూర్ణమె యెందున్.

శాన్తిః॥ అప్యాయన్తు మ మాంగాని, వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్ర
మథోబల మిన్ద్రియాణి చ సర్వాణి, సర్వం బ్రహ్మోపనిషదం,
మాహం బ్రహ్మ నిరాకుర్యాం, మామా బ్రహ్మ నిరాకరోత్,
దనిరాకరణ మ, స్త్వనిరాకరణం మే అస్తు, తదాత్మని నిరతేయ
ఉపనిషత్సు ధర్మా స్తేమయి సన్తు తే మయి సన్తు॥

సీ. అప్యాయితములు నాయంగంబు లగుఁ గాత,
ప్రాణంబు వాక్కు నేత్రంబు చెవియు
బల మఖిలేంద్రియంబులు నట్లయగుఁ గాత
నిఖిలంబు బ్రహ్మోపనిషదమె యగు
బ్రహ్మంబు నేను నిరాకరింపఁగరాదు
బ్రహ్మంబు నన్ను నిరాకరింప
రా, దెందును నిరాకరణము కాకుండుఁగా
వుత, లేకయుండుఁ గావుత మదీయ

గీ. మగు నిరాకరణంబును, నాత్మనిరత
మైన చోటున నుపనిషద్వ్యాహృతంబు

శైవ ధర్మంబులెల్ల నాయందు నెపుడు
కలుగుఁ గాత, నాయం దవి కలుగుఁ గాత!

శాన్తిః॥ భద్రం కర్ణేభి శ్శృణుయామ దేవాః । భద్రం పశ్యే మాక్షభి
ర్యజత్రాః । స్థిరై రఙ్గై స్తుష్టువాగ్ఁ సస్తనూభిః ! వ్యశేమ
దేవహితం యదాయుః । స్వస్తిన ఇన్ద్రో వృద్ధశ్రవాః ।
స్వస్తినః పూషా విశ్వవేదాః । స్వస్తి న స్తార్క్ష్యో అరిష్ట
నేమిః । స్వస్తి నో బృహస్పతి ర్దధాతు ॥

ఉ. విందుముగాత మాచెవుల వేలుపులార శుభంబు లెప్పుడుం
గందుముగాత భద్రములె కన్నుల నోయజనీయులార! యె
ప్పుం దిరమైన యంగముల పోడిమి నిన్ను నుతించువారమై
యుందుముగాత, ఆయు విరవొందఁగ మేనుల నీకు నింపుగన్.

ఆ. వె. ఇంద్రుఁ డిచ్చు మేలు వృద్ధశ్రవుఁడు విశ్వ
వేదుఁడైన పూష విభుఁడు నట్లు
తా నరిష్టనేమి తార్క్ష్యుండు మాకు బృ
హస్పతియును శుభదు లగుదురెలమి.

శాన్తిః॥ సహనా వవతు । సహనౌ భునక్తు ।
సహవీర్యం కరవావహై । తేజస్వినా వధీత మస్తు
మా విద్విషావహై । ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః ॥

చం. మనల నతండు ప్రోచుత సమంబుగఁ, బాలన సేయుఁగావుతన్
మనమును వీర్యమొక్కమొగి మానక చేతుముగాత, మెప్పుడున్
మనదగు నీయధీతమును మానితతేజముగాత, ద్వేషమున్
మనకెపుడుం దొలంగుత, శమంబు శమంబు శమంబుగావుతన్ !

నరసింహదేవర వేంకటశాస్త్రి

1828-1915

ఆరామద్రావిడశాఖీయబ్రాహ్మణుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. శ్రీవత్స గోత్రుఁడు. తల్లి సీతమాంబ. తండ్రి ఉమామహేశ్వరశాస్త్రి. జన్మస్థానము తాడేపల్లిగూడెము. నివాసము తణుకుతాలూకాలోని వెలగదుర్రు. జననము 1828- సర్వజిన్నామసంవత్సర కార్తికశుద్ధ ద్వితీయ. విశాఖ నక్షత్ర చతుర్థచరణము. నిర్యాణము 1915 సం॥ రాక్షసనామ సంవత్సర శ్రావణబహుళ పంచమి. గ్రంథములు: ౧. వేంకటేశ్వర శతకము. ౨. గౌరీశతకము. ౩. విచిత్రరామాయణము.

ఇరువదియేండ్లు వచ్చువఱకును వేంకటశాస్త్రిగారు పండితుఁడు కాఁడు. కవియును గాఁడు. అష్టపదులు తరంగములు కృతులు మృత్యుంజయ విలాసము అధ్యాత్మరామాయణ కీర్తనలు చెప్పుకొని పాడుకొను నొక భక్తుఁడు. దానికిఁదోడాయన మృదంగముకూడఁ జక్కఁగ వాయించుచుండువారు. వెలగదుర్రు గ్రామమునకు సభాపతియై పెత్తనము నిర్వహించుచుండెను. అట్టిసమయమున నెవరో యొకశాస్త్రులుగా రాయూరు వచ్చి మన వేంకటశాస్త్రిగారితో సంస్కృతమున మాటాడ నారంభించిరఁట. వీరి కాభాష బొత్తిగా రాదు. దానితో నభిమానము పుట్టి నాఁడు మొదలు వేంకటశాస్త్రిగారు సంస్కృతాంధ్ర భాషలు పట్టుదలతో సాధించిరి. ౨౫ వ యేఁట రచించిన వేంకటేశ్వర శతకము వీరి తొలికబ్బము. తరువాతి 'గౌరీశతకము' రచించిరి. ముప్పదవయేఁట "విచిత్రరామాయణము" రచించుట కారంభించి మూఁడేండ్లలో నాలుకాండములను బూర్తిచేసిరి. ఇది శ్రీరామాంకితము. ఈ కవివరుని కీర్తిని శాశ్వత మొనరించునది యీ యొక్క కావ్యమే.

గోపీనాథకవి వచనమున నీవిచిత్రరామాయణము తొలుత రచించెను. అదిచూచి గద్యపద్యకావ్యముగా వేంకటశాస్త్రిగా రిది వ్రాసిరి. ఇందు లాక్షణికు లంగీకరింపని ప్రయోగములు కొన్ని యున్నను కవి

త్వము మాత్రము ధారావాహి. ఆనాఁడు పెద్దపండితులైన కొక్కొండ వేంకటరత్నశర్మ, బహుజనపల్లి సీతారామాచార్యులు నీగ్రంథము మీఁద మంచి యభిప్రాయములిచ్చిరి. "...దండికావ్యము కంటెను అభినవ దండికావ్యముకంటెను జాలమేలనియెన్నఁదగియున్నది" అని వేంకటరత్నశర్మగారును, "...ఆధునిక గ్రంథస్థములని తెలియకయుండలి గద్యపద్యములను విన్నవారు అవి పూర్వగ్రంథస్థములేయని నిస్సందేహముగఁ దలంతురు" అని సీతారామాచార్యులుగారును విచిత్ర రామాయణమును గొండాడిరి. ఇందలి కవిత్వపు మచ్చునకు రెండుపద్యములు:

గుంపులుగూడి సీత మనకు న్మనసివ్వదు గాని చన్మొనల్
సొంపవు శక్రనీల మణిసోయగము న్వహియించి యున్న వీ
చంపకగంధి మోముజిగి చందురు తేటకు సాటిరాఁదగున్
దంపతులేమి నోఁచిరొకొ తథ్యము గర్భిణియందురందఱున్.

లలితేందీవర కైరవాకృతజ కల్హారాదిపుష్పౌఘ సం
చలదిందిందిర బృందగానలహరీ సంయుక్తమంద క్రమా
నిలసంచారకృతార్భకోర్మియుత పానీయౌఘముంగల్గి ని
ర్మలమై యొప్పు సరోవరంబుగని రా క్ష్మాపుత్రికాలక్ష్మణుల్-

శాస్త్రిగారు తమ ౭౮ వ యేఁట విచిత్రరామాయణమున నుత్తర కాండము సంపూర్తిఁజేసి వారే ముద్రింపించుకొనిరి. తరువాత వారి కుమారులు ౧౯౩౭ లో నీగ్రంథము సమగ్రముగ వెలువరించిరి.

ఈకావ్యముగాక మనకవి 'విరాగసుమతీసంవాద' మను వేదాంతపర మగు హరికథను వ్రాసెను. వీరికి నాగబంధ, రథబంధాదులరచనయందు మంచినేరుపు కలదు గానకళలోఁ జక్కనిప్రవేశము కలదు. ముహూర్త భాగమునఁ బెద్దయనుభవము కలదు. ఈయన యెట్టికవియో యట్టి నైష్ఠికుఁడు. ఏకాదశీవ్రతము విడిచియెఱుఁగడు. ఇట్టి భక్తకవి నోటి నుండి వచ్చిన "విచిత్రరామాయణము" తెలుఁగుబాసకుఁ దొడవగుట కాశ్చర్యమేమి?

రేమెల వేంకటరాయ కవి

1820-1847

గోదావరీ మండలములోని 'దుగ్గుదుఱ్ఱు' గ్రామ నివాసి. వెలమకుల సంభవుఁడు. అరవెల్లిగోత్రేయుఁడు. తండ్రి: భావయ. జననము 1820 ప్రాంతము. నిర్యాణము 1847 ప్రాంతము. రచితగ్రంథము: ఉత్తరా పరిణయము.

ఈ కవి వెలమకులీనుఁడు. 'ఉత్తరాపరిణయ' మను మూఁడాశ్వాసముల ప్రౌఢ ప్రబంధము రచించెను. నివాసము కాకినాడ తాలూకాలోని దుగ్గుదుఱ్ఱు. అచటికి రెండుమైళ్ల దూరమున 'కుయ్యేరు' అను పల్లెటూరు కలదు. అది సుప్రసిద్ధ పండితకవియగు పిండిప్రోలు లక్ష్మణకవి పుట్టినయూరు. లక్ష్మణకవికిని వెంకటరాయకవికిని పరస్పర పరిచయమున్నట్లు తత్రత్యులు చెప్పుదురు. ప్రకృతకవి యిరువదియేడేండ్లు మాత్రమే జీవించియున్నట్లు పరంపరాయాత ప్రసిద్ధి.

శ్రీమీఱఁగ ధర సద్గుణావళులచేఁ జెన్నొందుచున్నట్టి యా
శ్రీమద్వేంకటనీలశైలపతి నాసిం జూచి పోషింపఁగా
ధీమద్రాజితదుగ్గుదుర్రిపురి నాత్రేయాసమాలోకనో
ద్దామత్వంబున నుంటి మిచ్చట సదాధర్మార్జనవ్యాప్తిచే.

అని వ్రాసికొనుటఁబట్టి శ్రీ పీఠికాపుర ప్రభువగు శ్రీ రావు వేంకట నీలాద్రిరాయనింగారి యాదరణమునకుఁ బాత్రుఁడయ్యెనని వ్యక్తము. ఈకవి జ్యోతిషమున మంచిప్రజ్ఞావంతుఁడఁట. జాతకమునుబట్టి తా నిరువది యేడేండ్ల వయసున మరణింతునని తెలిసికొని పెండ్లిగావించుకొనక గ్రంథరచనా దీక్షితుఁడై శ్రీరామచంద్రసేవామగ్నుఁడై కాలము గడపెను. ఈ స్వల్పవయస్సుననే యుభయభాషాభ్యాసముచేసి "ఉత్తరా పరిణయ" కావ్యమూలమున యశము సంపాదించెను. ఈ ప్రబంధము 1930 లో కవి వంశీయులు శ్రీ రేమెల చినవేంకటరాయనింగారు వెలువ

రించిరి. శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు దానికిఁ బీఠిక వ్రాసి యిచ్చిరి.

ఈప్రబంధ మరసినచో నీకవి చక్కనిధారాశుద్ధి కలవాఁడని స్పష్టమగును. మను వసు చరిత్రాదులలోని పద్యములచాయ లీతని కవిత్వమునఁ గలవు. ఏవో స్వల్పదోషము లున్నను మొత్తముమీఁద నీకవి ప్రయోగపరిజ్ఞాతయు, వ్యాకరణజ్ఞానము కలవాఁడునుగాఁ దోఁచుచున్నాఁడు. రెండవయాశ్వాసమున... "భ్రమ, ద్రటదవదాత పత్ర నికురంబము..." అని ప్రయోగించెను. "ఇట 'నికురుంబము' గాని 'నికురంబము' గాదు" అని పీఠిక. 'నికురంబ' మను అత్వయుక్త ప్రయోగమే లక్షణసమ్మతము. బాహుళకమువలన ఉత్వము కూడ రాఁగా "నికురుంబము" అని కూడ నగును. ఉకార విశిష్టమైన ప్రయోగము ప్రచురముగా నున్నది. కాని నికురంబము తప్పుకాదు. ఈపదము నుపయోగించుటఁబట్టి యీకవికి వ్యాకరణజ్ఞానము చక్కఁగా నున్నదని యవగతము. ఈ కవి ధారాశుద్ధి కలవాఁడగుట కీపద్యము చాలును.

బంతులు దేరి పూఁబొదల పజ్జలఁ జేరి సరోజపాళికై
దొంతిగఁ బాఱి జుమ్మనుచుఁ దూరెకుఁదూరెకు మల్లికాసభా
సంతతి దూరి భాసిత రసాల విశాల మరందధార ల
త్యంతము గ్రోలఁగోరి మధుపావళులొప్పె వనాంతరంబులన్.

౨ ఆశ్వాసము.

ప్రబంధ ప్రారంభమున "శ్రీలలనాఁ దానకింబాగుచు..." ఇత్యాదిగా నున్న నీలాసుందరీపరిణయములోని మొట్టమొదటి పద్యము యథాతథముగఁ జేర్పఁబడియున్నది. "ఇంతమాత్రమున నియ్యల్పఘునందు గ్రంథచౌర్యము నారోపించుటకన్న, నీయనకు శ్రీ కూచిమంచి కవిసార్వభౌమునియం దపారమైన యభిమానముగలదని తెల్పుటకుఁగా నది సాధక

మయ్యెడి'' నని పీఠికలో వ్రాసిరి. కాని యీ మొదటిపద్యము ప్రక్షిప్త మనియో, లేఖకులెవరో ప్రార్థనమునకు వ్రాసికొని రనియో చెప్పితీరవల యును. దీనికి రెండుప్రబలకారణము లున్నవి. శ్రీరాజన్మహిజా... అని శ్రీకారముతో రెండవపద్యము ప్రారంభింపఁబడినది. అది శ్రీరామ ప్రార్థనము. ఈకవి "శ్రీరామచంద్ర సాంద్ర కరుణాసమాగత కవితా మాధురీ ధురీణుఁడ'' నని యాశ్వాసాంతవచనమునఁ జెప్పుకొనుటచేఁ గావ్యాదిని శ్రీరామప్రార్థనమే చేసినాఁడనుట యుక్తము. 'నీలాసుందరి' లోని 'శ్రీలకుఁ దానకంబగుచు' నను పద్యము శివస్తోత్రపరము. ఈ పద్యము మొదటఁజేర్చుట కవిమతమును జెఱచుట యగును. అదియుఁ గాక మూఁడవపద్యమున "...కాంచనాచలో, దారశరాసనుండు జయ ధన్యత మాకొనరించు నెప్పుడున్'' అని యీశ్వరుని ప్రార్థించినాఁడు కూడను. దీనినిఁబట్టికూడ మొదట ముద్రించిన పద్యము తీసివేసినఁగాని నసిపడదు. ఉత్తరా పరిణయము చక్కని కావ్యము. ఈ కావ్యకర్తకు భగవంతుఁ డాయువిచ్చిన నిట్టికబ్బము లెన్ని సృష్టింపఁబడెడివో ! ఈ కవి చక్కఁగ సంభాషించెడివాఁడనుట కచటివారీవిషయము చెప్పుచుందురు. "పిండిప్రోలు లక్ష్మణకవిగారును వీరును బావమఱఁది వరియాచక మాడు కొనుచుండువారు. ఒకప్పుడు ఏదో సభలో లక్ష్మణకవి కూర్చుండి యుండ మనకవిగారు వెళ్లిరఁట. మరియాదకు లక్ష్మణకవి చోటుచూపి "దొర లకు చోటు చాలా'' యనెనఁట. అప్పు డీయన "దొరలకు - చోటు చాలు'' నని సమాధానము. (దొంగలకుము=ఒత్తగిల్లకుము) కవి సంభా షణ చాతుర్యము !

అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి

1831-1892

ఆరామ ద్రావిడ బ్రాహ్మణుఁడు. హరితసగోత్రుఁడు. తల్లి: గంగమాంబ. తండ్రి: రంగశాయి. జన్మస్థానము: పిఠాపురము కడనున్న చేబ్రోలు. జననము 1831– వికృతి సంవత్సరము. నిర్యాణము 1892. గ్రంథములు: ౧. శ్రీ కృష్ణభూపతిలలామ శతకము (1853) ౨. శేషధర్మములు (ఆఱాశ్వాసముల పద్యకావ్యము). (1867) ౩. పాపయమంత్రి శతకము. ౪. ఆత్మబోధము (శంకరకృతికిఁ దెలుఁగుపద్యములు) (1875) ౫. మణిధ్వజచరిత్రము (గ్రంథము లభింపలేదు.) ౬. సింహాద్రిరామాధిప శతకము (1876) ౭. భద్రాపరిణయము (1878) ౮. శ్రీకృష్ణలీలా కల్యాణము (1878) ౯. చాటుధారా చమత్కారసారము.

ఒకప్పుడు మాడభూషి వేంకటాచార్యులవారు పీఠికాపురసంస్థానమునకు శ్రీ గంగాధర రామరాయేంద్రుని దర్శనార్థము వచ్చిరి. అప్పుడు అల్లమరాజు సుబ్రహ్మణ్యకవిగారు నిండుకొలువులోనుండి "ఇఁక" అను పదముతో నారంభించి కందములో, ప్రభుకీర్తిని వర్ణింపుఁడని యాచార్యులవారితో ననిరఁట. వేంకటాచార్యులవారు గొప్ప యాశుకవి. వెంటనే యిట్లు చదివిరి.

క. ఇఁక నెవ్వరికీర్తులు నీ
ప్రకటగుణుండైన రామరాయ క్ష్మాభృ
త్సుకృతి జనపోషకుని కీ
ర్తికి సరిగారావునుమ్మి పృథ్వీస్థలిలోఁ.

సుబ్రహ్మణ్యకవి "మీపద్యములోఁ దప్పుకల" దని యాచార్యులవారి నాక్షేపించెను. 'తప్పులే' దని యాయన గంభీరముగఁ జెప్పివైచెను. అపుడు సుబ్రహ్మణ్యకవి 'ఇదిగో' నని యీ పద్యమును పఠించెను.

ఇఁక విను నీయశమునకుఁ ద
లఁకి శశి కృశుఁడయ్యెను మఱలఁ బెరుఁగ వేర్వ

ల్లఁకియుఁ గొనెనొకొ తొలిమలకె

లఁకలను శ్రీరామరాయ లలితశ్రేయా !

"ఇఁక" సబిందుకశబ్దమగుటఁ దక్కిన చరణములు సబిందుకప్రాసముతో నడుపవలెనని తత్క్షణమున వేంకటాచార్యులవారికిఁ దట్టియుండక పోవచ్చును. గంగాధరరామారావుగారు గడుసురాజు. "ప్రబంధకవిత్వమున మీరధికు" లని సుబ్రహ్మణ్యకవిని స్తుతించెను. "ఆశుకవితలో మీ రధికు" లని యాచార్యకవి నభినందించెను.

సుబ్రహ్మణ్యకవి చమత్కృతి కప్పు డట్లనేఁగాని సబిందుక నిర్బిందుక ప్రాససాంకర్యముచేయునని పట్టుదల పట్టినకవికాఁడు. ఆయన భద్రాపరిణయములో (ద్వితీయాశ్వాసము 75 పద్యము చూ) నెన్నో దీని కుదాహరణము లున్నవి.

ఈ సుకవివరుని చాటుపద్యములు తెలుఁగున వ్యాప్తముగ నున్నవి. ఈయన కాట్రావులపల్లి నూతులపై నొకపద్యము చెప్పెను.

దేవాసురు లబ్ధిఁదరుప
నావిర్భూతమయి హాలహాల సుపుడు మహా
దేవునకుఁ భీతిలి కా
ట్రావులపలినూతులందు డాఁగెంజుండీ.

మూఁడుగల్లుసంస్థానమునకుఁ బోయినపు డక్కడ నొక్కనియోగికవి వైదికకవులనుబట్టి పడఁదిట్టుచుండెనఁట. అప్పుడు సుబ్రహ్మణ్యకవి పట్టలేక యీపద్యము చెప్పెను.

చందనశాఖికన్న విరసంబుగ బూరుగ మేలటన్న తీ
విం దగినట్లు వైదికకవిత్వసుధారస ధారలెల్లఁ జె
ల్వొందఁగ భూతలంబున నియోగికవిత్వముతోడ సాటిరా
దందురు బెట్టిదంబగునటందురు కొందఱు మూఢమానవుల్.

సూరపరాజు మల్లపరాజు అనునాయన గంగాధరరామారావుగారి మిత్రుఁడు. సుబ్రహ్మణ్యకవి యీయనను జూడఁబోయెను. "శ్రీ రావు

వేంకటమహీపతి గంగాధర రామారావు" అని వరుసగా వచ్చునటులొక కందము చెప్పుడని మల్లపరాజుగా రడిగిరి. అప్పుడు వీరిటులు చెప్పిరి.

శ్రీధర! శౌరీ! వైకుం
ఠా! ధర శ్రీరావు వేంకటమహీపతి గం
గాధరరామారాయ
క్ష్మాధరునిం బ్రోవు మెపుడు కరుణాదృష్టిన్.

ఈచాటువులు వేటూరి ప్రభాకర శాస్త్రిగారు సేకరించి వెలువరించిరి.

సుబ్రహ్మణ్యకవిది పండితవంశము. ఇతని తండ్రి రంగధామార్యుడు. నారాయణాచలమాహాత్మ్య కృతికర్త. కవిచకోర చంద్రోదయ, సత్యభామావిలాసములు రచించిన రామకృష్ణకవి కితడు భిన్నోదరసోదరుడు. సుబ్రహ్మణ్యకవి నాగాభట్ల నరస కవితో నుభయభాషలు పఠించెను. చాలవఱకు స్వయంకృషి చేసి సాహిత్యనిష్ణాతుడాయెను. వసుచరిత్రము-ఆముక్తమాల్యద వీరి కభిమానితగ్రంథములు. జ్యోతిషభాగముకూడ నీయన చక్కగనెఱిగెను. అదికొంత తొలుత జీవనాధారమైనది. క్రమముగా గవిత్వరచనమే ప్రధానవృత్తిగా బెట్టుకొని రాజదర్శనము చేయుచు సుబ్రహ్మణ్యకవి తనలేవడి నెట్టుకొనుచుండెను. 1853 లో మాదుగల్లు సంస్థానాధిపతియగు శ్రీకృష్ణభూపతిపై నీకవి సీసపద్యములశతక మొకటి చెప్పెను. అది "శ్రీకృష్ణభూపతి లలామశతకము". అప్పటికి గవియీ డిరువది రెండేడులు. మాదుగల్లుసంస్థాన పండితులు మనకవి నెన్నో తిప్పలు పెట్టిరట. మంత్రిప్రెగడ సూర్యప్రకాశరాయకవి మున్నగువారు నాడు తత్సంస్థాన విద్వత్కవులు. అక్కడివారు "కుట్రయొనర్చి లేమ తన గుబ్బలయుబ్బు సహింపలేమిచేన్." అను సమస్య నిచ్చి, నిలుచుండగా బూరింపుమనిరి. అది యీకవిచే నిటు పూరింపబడియె.

వట్రువహారరత్నములు వన్నె నగల్ పులిమీఁద వచ్చు నా
పుట్ట యటన్నరీతి జిగి బొల్పగు చూచుకలీల జూచుచున్

దొ(ట్రిలనేల ? కేలఁగొని గోరులకొఱుకు-ను నాథయుంచుఁ దాఁ
గుట్రయొనర్చె లేమ తనగుబ్బలయుబ్బు సహింపలేమిచేన్.

ఇట్టి పరీక్షల కాఁగిన సుబ్రహ్మణ్యకవిని మాడుగల్లు ఱేఁడు మెచ్చి యాస్థానకవిగా నర్థించెను. కాని జన్మస్థానమున కాయూరు దూర మగుటచే నంగీకరింపక కవిగారు వార్షికబహుమానము వచ్చునటుల ప్రార్థించెను. 1853 మొదలు 1869 వఱకు నాసంస్థాన వార్షికవిత్తము సుబ్రహ్మణ్యకవి పొందుచుండెను.

1869 లో పీఠికాపుర సంస్థానమున మాసవేతన మేర్పడినది. గంగాధరరామరాయేంద్రుఁ డీకవిప్రతిభఁ దెలిసికొని సన్మానించెను. "భద్రా పరిణయము" అను ప్రౌఢాంధ్ర ప్రబంధ మా మహారాజున కంకితము గావించెను. ఏత త్కృతిప్రదానవిషయ మీ పద్యము తెలుపును.

శాలివాహనశక సంవత్సరము లిందు
గగనకరీందుసంఖ్యల నెసంగ
జరుగుప్రమాథివత్సర మార్గశిరశుద్ధ
సప్తమీ శుక్రవాసరము నందు
శ్రీ మహారాజభూషిత చరిత్రుండు సూ
ర్యారాయభూనాయకాత్మజుండు
రావు గంగాధరరామరాయక్షమా
ధవుఁడు సుబ్రహ్మణ్య కవివరునకుఁ
బీఠపురదుర్గసౌధంపుఁ బెద్దకొలువు
నందు భద్రాపరిణయకావ్యంబు నంది
యధికతరమాన్యభూమి వెలయ్యలును సు
వర్ణ వలయంబులను సేలువలు నొసంగె.

ఈ భద్రాపరిణయము నాలుగాశ్వాసములు కలది. కొణాదము పెద్దన సోమయాజి భద్రాపరిణయమను మాఱు పేరుగల ముకుందవిలాస ప్రబంధము రచించెనని వీరేశలింగముపంతులుగారు వ్రాసిరి. ఆ ముకుంద

విలాసములోని కవితారీతు లీ సుబ్రహ్మణ్యకవి కొన్ని సంగ్రహించెను. అందలిపద్యములు పద్యములుగాఁగొన్ని యిందున్నవి. కథలోఁగూడఁ బెద్ద మార్పులేదు. భావములు చాలవఱకు దానిని బోలినవే. ఈవిషయము శ్రీ నడకుదుటి వీరరాజుగారును వెల్లడించిరి. ఆకవి కవితపైఁగల యభిమానమున నీసుబ్రహ్మణ్యకవి యిటులు చేసినాఁడని సమర్థించుకొనవలయును. పురాణపండ మల్లయ్యశాస్త్రిగారి వ్యాఖ్యతో 1912 లో నీగ్రంథము నేఁటి పీఠికాపుర ప్రభువు లావిష్కరించిరి. సుబ్రహ్మణ్యకవి సాధారణకవి కాఁడనుట కతనిఁగూర్చినకథలు చాలఁగలవు. పెద్దపెద్ద సంస్థానములకుఁ బోయి యతఁడుచూపిన విచిత్రాశుకవితాదు లందులకుఁ దార్కాణ. ఆయన 'చాటు ధారాచమత్కారసార' మనునొక గ్రంథము సంధానించెను. అందుసంస్కృతమునఁ జాటువులుగ నుండి పండితులచేఁ బరంపరాయాతములై యున్న గంభీరార్థకములగు శ్లోకములకు సులభమైనయర్థము వ్రాయఁబడియున్నది. ప్రాచీనాధునాతనపద్యము లెన్నో యందున్నవి.

కమలాకర కమలాకర
కమలాకర కమల కమల కమలాకరమై
కమలాకర కమలాకర
కమలాకరమైనకొలను గని రా సుదతుల్.

ఈపద్య మిచ్చి మూఁడుగూం సంస్థానములో నెవరో పండితులు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నర్థము చెప్పుమనిరఁట. నాఁటి వారిలో నిట్టి పాషాణములను బ్రద్దలుగొట్టు దిట్టలు చాలమంది యుండువారు. మన శాస్త్రిగారు వెంటనే దానికర్థము వివరించి చెప్పిరి. తరువాత సేకరించిన కొన్ని చాటువులకు వ్యాఖ్య వ్రాసి "చాటుధారా చమత్కారసారము" వెలువరించిరి.

జయంతి రామయ్యపంతులుగారికి వీరికిని మైత్రి. రామయ్యపంతులుగారి ప్రోత్సాహమువలన నీకృతి రచితమైనది. ఆ విషయమును విస్పష్టము చేయు శ్లోక మీక్రిందిది విధిగా నుదాహరింపఁదగినది.

శ్లో. ఏతాదృగ్భిర్గుణ మణిగణై ర్భూషితేనైవ తేనా
సుజ్ఞాంప్రాప్య శ్రితహితకరీం శ్రీమవన్నానపూర్వాం
అల్లంరాజాన్వయమణి రసౌ రంగశాయ్యార్యపుత్ర
స్సుబ్రహ్మణ్యస్సుకవి రకరో చ్చాటుధారార్థసారమ్"

రామయ్యపంతులుగారి నుద్దేశించి సుబ్రహ్మణ్యకవి 'అంతర్లాప' యిటులు చెప్పెను. ప్రశ్నోత్తరములు లోపలనే నిగూఢముగా నుండు సమస్యకు 'అంతర్లాప' యనిపేరు.

చెప్పినాఁడ రెండు చిత్రోత్తరము లిందు
నల జయంతి రామయార్యవరుని
సువచనమున నే దడవిలోఁ జరించు నె
ద్దీశ్వరునికిఁ బ్రియము నెక్కు డనఁగ.

సుబ్రహ్మణ్యకవి యాధునికుఁడగుట గ్రంథవిమర్శములనుగూడ వ్రాసెను. శ్రీమన్మాడభూషి వేంకటాచార్యకవి రచించిన 'భరతాభ్యుదయము' న దోషము లున్నవని సప్రమాణముగఁ జూపి రాజయోగి పత్రికలో వెలువరించెను. కాని యిక్కవి రేఫద్వయమైత్రి, అఖండయతి, కొన్ని ప్రాచీనలాక్షణికానభిమత సంధులు విడిచిపెట్టలేకపోయెను. అదియటుండె, సుబ్రహ్మణ్యకవి ప్రతిభావ్యుత్పత్తులు సమానముగాఁ గల కవివరుఁడు. వారిపద్యధారకుఁ జివర నొక యుదాహరణమిచ్చి విడిచెదను.

పగడపుమోవితో జిలుఁగుఁబయ్యెదతో విడియంపుసొంపుతో
నిగనిగ నుబ్బుసిబ్బెముల నిగ్గులతోఁ దగుగుబ్బదోయితో
సొగసగువేణితో బెళుకు చూపులతో లలితేతనవ్వుతో
జిగివగగుల్కవచ్చి యొక చేడియచూచెఁ ద్రిలోకమోహనున్.

భద్రాపరిణయము ౩. ౫౮.

మండపాక పార్వతీశ్వరశాస్త్రి

1833 - 1897

వెలనాటి వైదిక బ్రాహ్మణుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. పారాశర గోత్రుఁడు. తల్లి జోగమ్మ. తండ్రి కామకవి. జన్మస్థానము విశాఖపట్టన మండలములోని పాలతేరు (బొబ్బిలి సమీపము) జననము క్రీ॥ శ॥ 1833 సం॥ జూన్ 30 తేదీ. నిర్యాణము 1897 సం॥ జూన్ 30 తేదీ. విరచిత గ్రంథములు: ఏకప్రాస శతకములు: ౧. బ్రహ్మేశ శతకము ౨. చిత్రశతి 3. వేంకటశైలనాయద్విశతి ౪. విశ్వనాయక శతకము ౫. విశ్వనాథస్వామి శతకము ౬. కాశీ విశ్వనాథ శతకము ౭. పార్థివ లింగ శతకము ౮. పరమశివ శతకము ౯. సూర్యనారాయణ శతకము ౧౦. బాల శశాంకమౌళి శతకము ౧౧. చంద్రఖండ కలాప శతకము ౧౨. కలిపురుష శతకము ౧3. ఈశ్వర శతకము.

శతకములు (౨3)

౧. సీతారామ ద్వ్యర్థి శతకము ౨. శ్రీ జనార్దన శతకము 3. కాశీ కా విశ్వనాథ సీసపద్య శతకము ౪. పరమాత్మ శతకము ౫. పార్వతీశ్వర శతకము ౬. కాశీవిశ్వనాథ ప్రభూశతకము ౭. సూర్యనారాయణ శతకము ౮. వేంకటరమణ శతకము ౯. వరాహ నరసింహశతకము ౧౦. జగద్రక్షక శతకము ౧౧. రమానాయక శతకము ౧౨. ఆంజనేయ శతకము ౧3. రామ రక్షాశతకము ౧౪. గోపాలకృష్ణశతకము ౧౫. బాలకృష్ణ శతకము ౧౬. రఘుపతిశతకము ౧౭. జగన్నాయకశతకము ౧౮. రామలింగేశ్వర శతకము ౧౯. సర్వ కామదాశతకము ౨౦. గణ పతిశతకము ౨౧. హరిశతకము ౨౨.హరిహరేశ్వరశతకము. మాలికా కృతులు, దండకములు మఱికొన్ని కలవు.

కావ్యములు.

౧. శ్రీ రాధాకృష్ణ సంవాదము ౨. బొబ్బిలి మహారాజ వంశావళి 3. ఉమాసంహిత ౪. కాంచీమహాత్త్వము ౫. అమరుకము ౬. అక్షర మాలికాఖ్య నిఘంటువు.

గద్యకావ్యములు.

౧. యాత్రాచరిత్ర ౨.గురుచిత్రకథ 3. లఘుచిత్రకథ ౪. శ్రీ బొబ్బిలి మహారాజ వంశావళి.

సంస్కృత కృతులు.

౧. గుణశ్లోకాది చిత్రరచన ౨. కవితా వినోద కోశము ౩. సీతా సేతృస్తుతి ౪. కాశీశ్వరాష్టకము ౫. మంగళాష్టక చతుష్టయము ౬. శ్రీ వేంకటగిరి ప్రభు ద్వ్యర్థి శ్లోక కదంబము ఇత్యాదికము.

పార్వతీశ్వరశాస్త్రిగారు రశిన వాంధ్రకవితా పితామహుఁడని పేరు చెందిన పండితుఁడు. ఈయనకుఁ బ్రబంధకవిత్వమందును శతక కవిత్వ మందును బెద్దమమకారము. శతకకవులలో నీయన కున్నది యుత్తమ స్థానము. వీరు వ్రాసినశతకములు శతసంఖ్యగలవి. సత్యవోలు భగవత్కవి మున్నగు వారు శతకశతము రచించినట్లు తెలియుచున్నది. తెలుఁగు వాఙ్మయమున శతకములకు గొప్ప విలువయున్నది. అది యిప్పుడిప్పు డీ యిరువదవ శతాబ్దినుండి యించుక సన్నగిల్లుచున్నది. నేఁడును 'కాళహస్తీశ్వర' ప్రభృతి శతకములను గౌరవముతోఁ జూచుచున్నవారు చాలమందియున్నారు. పార్వతీశ్వరకవి ౧౯ వశతాబ్దిలోఁ బ్రసిద్ధుఁడగు శతకకవి. కేవలము శతక కవియేకాదు. ఆశుకవి, ప్రబంధకవి కూడను. వీరినిగూర్చి చెప్పవలసిన విశేషములు చాలఁ గలవు.

ఈయన పితామహుఁడు వేరయసూరి ఇందుమతీపరిణయము, నిర్ధుష్ట నిరోష్ఠ్యదాశరథీశతకము, లక్ష్మీనృసింహామూర్తిస్తుతి కృతులు రచించిన వారు వీరే. పార్వతీశ్వరశాస్త్రిగారితండ్రి కామకవి బ్రహ్మోత్తరఖండము, కార్తికమాసవ్రతమాహాత్మ్యము, బలరామక్షేత్రమహాత్మ్యము, జానకీ రామశతకము, సూర్యనారాయణ రామప్రభుశతకములు రచించిన విద్వత్కవి. పార్వతీశ్వరకవి యన్నగారు రామస్వామిశాస్త్రి వేదాంతకృతి కదంబము, గంగాలహరి, గంగాస్తవము వ్రాసిరి. పార్వతీశ్వరశాస్త్రిగారు తండ్రిగారి సన్నిధిని మొదటఁ జదువుకొనిరి. తరువాత తాతా సూర్యనారాయణశాస్త్రిగారి కడఁ బఠించిరి. శ్రీ త్రైపదేంద్రస్వామివారి యనుగ్రహమున నుపనిషత్పాఠము చేసిరి. స్వయంకృషిచే బలమైన పాండిత్యము సంస్కృతాంధ్రములలో సంపాదించిరి. కవిత్వము సహజముగ నున్నదే.

ఈ సహజకవితాధార కాయసాధారణపాండిత్యము తోడైనది. పండ్రెండవ యేఁటనే వాటముగఁ గవిత వ్రాయ నారంభించి "కవితా లతాంకురము" పంతముపట్టి గంటలోఁ జెప్పెను. చిన్ననాఁటనే వేంకటగిరి మున్నగు సంస్థానముల కేఁగి కవితాప్రదర్శనమున సత్కరింపఁబడెను. బొబ్బిలి సంస్థానమున విద్వత్కవిగాఁ గుదిరెను. ఆయాసంస్థానరంగములలో నీయన కనఁబఱిచిన కవితాచతురత నేనోళ్ళ మెచ్చుకోలుబడసినది. పార్వతీశ్వర కవి తజ్జీవిత విశేషములు 'ఆత్మచర్య' యను సీసపద్యములలో వ్రాసి కొనెను. ఇది యొకటి చదువుఁడు :

మఱియు సద్ధాతలో వఱపు పట్టఁగఁజూచి
గుఱుతు తప్పక వానకురియునట్లు
మంచిపద్యములు గావించి తెండని రంగ
రాయవిభుం డాదరమునఁ బల్క
నీమీఁద భారంబు నేనుంచి యమృత బీ
జాక్షరఘటిత పద్యంబు లైదు
పంచరత్నము లనఁ బచరించి నవరత్న
పద్యయుక్తముగఁ దత్ప్రభున కొసఁగఁ
గా కతాళీయనయమున గాలివాన
కురియఁ జేసితి వది మాన్పఁగోరి మాన్పి
తౌర! యతివృష్టి కష్టహారాష్టకమున
హరిహరేశ్వరదేవ! మహానుభావ!

ఇచట రంగరాయవిభుఁడన బొబ్బిలి ప్రభువు వేంకటశ్వేతాచలపతి రంగా రావు బహద్దరువారు. ఈకవి యిట్టి సిద్ధ వాక్కనుటకు సందేహింపఁ బని లేదు. బొబ్బిలిలో నితఁడు 1876 లోఁ బ్రవేశించి 1897 వఱకు సంస్థాన కవిగా నుండెను. అదియే వీరి జాతకమున ఘనదశ. అంతకుమున్ను శ్రీ విజయనగరమహారాజు దర్శనమునకుఁబోయి 1867 లో నచటఁ గవితా ప్రతిభాప్రకటనము చేసెను. కాని యాస్థానకవితాస్థానమున నుండుటకు

యోగము పట్టలేదు. ఆయన బొబ్బిలిసంస్థానకవి కావలసియుండెను. ఆనందగజపతిదర్శనము చేసి పార్వతీశ్వరకవి యమూల్య పద్యములు చదివెను. అం దిది యొకటి.

అప్రదుఁడగు మేఘుఁడు బలి
కుప్రదుఁడగు ఖేచరుండగు నసుప్రదుఁడ
శ్రీప్రదుఁడగు నర్కుఁడు నం
దప్రదునకు సాటియనఁగఁ దగునే వీరిన్.

విజయనగరములోని యాస్థానపండితుఁడు ముడుంబ నరసింహాచార్యకవి "అన్నవతాళిఁజాల కహహా! యని తల్లడమందె నెంతయున్" అను సమస్యనిచ్చి "వెన్నెలఁ గాయఁ గాయజుఁడు వేమఱుమై విరిగోల లేయ లే" యని పూర్వార్థము వెనుక నేను పూరించితినని తక్కిన చరణములు శాస్త్రులుగారు చెప్పవలయుననిరఁట. అప్పుడది యాశువులో ననుప్రాసము వచ్చునట్లు వీ రిట్లు పూరించిరి.

క్రొన్నన గోయఁ గోయనుచుఁ గోయిల కన్నెఱఁ జేయ జేయటుల్
కిన్నరఁబాయఁ బాయసము కీల్కొని పొంగిన చాయ చాయలన్.

1865 లో పాపిలివలస జమీందారగు ఇనుగంటి సీతారామస్వామిగారి దర్శనమున కీ కవి వెళ్ళినపుడు వసుచరిత్రలోని పద్యమునిచ్చి సంస్కృతీక రింపుమనిరి. తెలుఁగును సంస్కృతములోనికి నింతమాధురీధుర్యముగా మార్చిన-మార్చఁగల కవులు తక్కువ.

ఆతన్వంగి యసంగరఘ్నాంకరణవ జ్యాఘుక్త మాతాస్త్ర ని
ఘ్రాతం బోర్వ్యక తమ్ములంచుఁ దటినీ గర్తై భక సంజాత కం
జాతవ్రాతము మాటుచెంద నది యేఁచన్ సాఁగె మున్ముందుగా
జ్ఞాతిశ్చే దనలేన కిమ్మనెడి వాచారూఢి సత్యమ్ముగాన్
సాఽసహ్యస్మరదుంక్రియాశ్రయ గుణోన్ముక్తాత్రమబాణక్షతిం
తన్వీ సారసజాతి రిత్యవధృతా ఽద్యాప్యటవీ మాశ్రితా

సాసింధూదరసంభవాపి పురత స్సద్భాధనే చోద్యతా
జ్ఞాతి శ్చేదసతీన కిన్విత వచ స్సత్యం యథాస్యా త్తథా.

కవి యీవిషయము ' స్వాత్మచర్య ' లో నిటు వివరించుకొనెను.

సుతనిరామయతకై సూర్యనారాయణ
స్వామిని గని హర్షవల్లినుండి
వావిలివలసకు వచ్చి యున్నంటి నీ
తారామవిభుఁ గాంచి తత్ప్రతిజ్ఞ
నడంచి యా 'తన్వంగి' యనెడు వసుచరిత్ర
లోని పద్యమునకు శ్లోకరచన
ప్రతిన సన్నూటయేఁబదియారుపద్యముల్
గలుగుషోడశవిధ కందరచన
తత్కృతులకన్న నెక్కుడుధార గల్గి
వింతయగునట్టి యాశుకవిత్వరచన
నాకుఁ గల్గించి చెలగించినాఁడ వౌర!
హరిహరేశ్వరదేవ! మహానుభావ!

ఆ వావిలివలస ప్రభువులే యిన్నూటయేఁబదియాఱువిధములుగఁ జనువఁ దగిన కందము వ్రాయుఁడని పార్వతీశ్వరశాస్త్రిగారి నడుగ నాయన యాశువుగ నిట్లు చెప్పిరి.

శ్రీవామ । దేవ । పావన
భావా । భావంగ । మాగ్ర్య । పండిత । భావా
శ్రీవాను । దేవ । బహ్వాను
భావా । భావా । భవజనక । పాలిత । భావా
ఏకమతిఁ భేకగతిఁ
సాకల్యమునం గనుండు షట్పంచాశ
చ్ఛ్లోకో త్తరద్విశతి నం
ఖ్యాకములై యంద మొందుఁ గందములిందుఁ.

ఆశుధారాపరీక్షలో నీకవి మొదటితరగతిని నెగ్గినాఁడు. చతుర్విధ కవిత్వములందు నీకవి కడుదిట్ట. ఒకశివరాత్రి యుపవసించి లింగోద్భవకాలమున మొదలిడి తెల్లవాఱుసరికిఁ బార్వతీశ్వర శతకము రచించిన యాశుకవి వరుఁ డీయన. రెం డేకప్రాసశతకములు మూనాళ్ళలో రచించి చూపిన శీఘ్రకవితాచతురుఁడు. ఘనముగముగఁ బద్యములల్లుట, ద్విత్రిచతుఃప్రాసములతోఁ గవిత్వ మాయుట యీకవికి వేడుక.

వీరి రాధాకృష్ణసంవాదము కృష్ణాభ్యుదయము అమరుకము తెలుఁగు నాఁటఁ బ్రచారమున నున్నవి. వెనుకటివారిలో, తాళ్ళపాక తిరువేంగళప్ప అమరుకాంధ్రీకర్తలయిం దగ్గఱ్యాఁడు. అధునాతనులలో నమరుకము నాంధ్రీకరించినవా రయిదాఱుగురు కలరు. వానిలోనెల్ల వీరి తెలిఁగింపు చాల గొప్పగా నున్నది. రాధాకృష్ణ సంవాదములోని యీ క్రిందిపద్యము వీరి తాతతండ్రుల విశిష్టత కొక గుఱుతు.

సీ. శ్రీమీఱ నుభయభాషా ముఖ్య సత్కృతుల్
    తజ్జ్ఞులెన్నఁగ నుదంకితములు చేసి
యశముగాంచిన వీరయ మనీషిమణికిఁ బౌ
    త్రత్వంబుఁ గార్తికవ్రతమహాత్మ్య
శివమహాత్మ్యాద్యనేకవిధ ప్రబంధంబు
    లొనరించి సత్కవి వినుతిఁ గనిన
పారాశరసగోత్ర పావనుండగు మండ
    పాక కామేశ్వర పండితునకు
మహిత పుత్రత్వము ను గాంచి బహువిచిత్ర
చిత్రశతి ముఖ్య సత్కృతుల్ చెప్పి మెప్పు
వడసితివి గద కులకీర్తి వర్ధిలంగ
సరసగుణసాంద్ర! పార్వతీశ్వరకవీంద్ర!

పార్వతీశ్వరశాస్త్రిగారి మనుమలు పార్వతీశ్వరశాస్త్రిగారును భాషోపాసకులై తాతగారివి మఱుఁగునఁ బడిన కవితారహస్యములు కొన్ని

భారతి కందిచ్చిరి. అముద్రితగ్రంథచింతామణి పార్వతీశ్వరశాస్త్రి ప్రతిభకు నికషము. తత్పత్రికాధిపతులు పూండ్ల రామకృష్ణయ్యగారు వీరి చరిత మామూలాగ్రముగ వ్రాసిరి. అది పార్వతీశ్వరశాస్త్రి 'ఆత్మచర్య' యనందగు "హరిహరేశ్వర శతకము" నకుం బీఠికగా వెలసియున్నది. పార్వతీశ్వరశాస్త్రిగారికిని, మహామహోపాధ్యాయ కొక్కొండ వేంకటరత్నము పంతులుగారికి నీపత్రికాద్వారమునం బెక్కు నాళ్ళు భాషావిషయక వివాద మాపాదిల్లినది.

పార్వతీశ్వరశాస్త్రిగారు మహాభక్తులు. కడకాలమున "మృత్యుం జయునకు నమస్కరింతుం దరింతుఁగ" అను మకుటముతోఁ బద్యములు చెప్పుచు ముప్పదియైదు పద్యములు పూర్తిచేసి జీవము విడిచిరి. వీరు జీవించిన యెనుబదిరెండేండ్లలో శతాధికములగు కృతులు విరచించిరి. తుదకు మిగిలిన కృతులు కూడ నెనుబదిరెండే. ౧౯ వ శతాబ్దిలో నిట్టి యాశుకవి లేడనుటకు సందేహము లేదు. పార్వతీశ్వరశాస్త్రిగారి శతక కవిత యిటులుండుననుట కొకపద్యము నుదాహరించి యింక విరమించెదను.

అత్తుల్ నిన్గనునట్లు హస్తములు నిన్నర్చించునట్లాత్మ ని
న్నక్షీణంబుగ నమ్మునట్లు చెవి నిన్నాలించునట్లాస్యముల్
దీక్షన్నిన్గొనియాడునట్లు కరుణన్వీక్షించి రక్షింపుమీ
సాక్షాన్మంగళ సంఘసంఘటన కృష్ణా! బాలకృష్ణా! హరీ!

మాడభూషి వేంకటాచార్యకవి

1835-1895

వైష్ణవబ్రాహ్మణుఁడు. కౌశికగోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. తల్లి: అలివేలమ్మ. తండ్రి: నరసింహాచార్యులు. జన్మదేశము: నూజవీడు. జననము 1835. నిధనము 1895- మన్మథనామసంవత్సర ఫాల్గునబహుళ తృతీయ. గ్రంథములు: ౧. భరతాభ్యుదయము (ప్రబంధము) ౨. వామననాటకము. ౩. పుష్పబాణవిలాసము, ౪. హంససందేశము. ౫. మదనమోహన చరిత్ర (వచనము) ౬. బృహద్వైద్యరత్నాకరము. ౭. రామావధూటీ నక్షత్రమాల. (చాటుపద్యమణి మంజరి-ద్వితీయభాగము చూడుఁడు) ౮. ఆనంద గజపతిపై వ్రాసిన ౬౫ సీసములు.

శతావధానములను ప్రచారములోనికిఁ దెచ్చినవారిలో వేంకటాచార్యులుగారు కనిష్ఠికాధిష్ఠితులు. భట్టుమూర్త్యాదులు శతలేఖినీపద్యసంధానధురంధరుల మని చెప్పికొనినారు. వేంకటాచార్యులవారు అసాధారణుఁడైన మేధావి. ఈయన గంటకు పందలకొలఁది పద్యములు చెప్పఁగలనేర్పరు లనుట యటుండి, యేకసంధాగ్రహణమున నూఱులకొలఁది పద్యములు అప్పగించు బుద్ధిమత్తరులు. వీరి మేధావిశేషమునకుఁ బెక్కుకథలు తెలుఁగుదేశమునఁ బ్రాఁకియున్నవి. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు "చాటుపద్య మణిమంజరి" లో వెలువరించిన కథ యొకటి ప్రకటించెదను.

"పసప్పాకం అనంతాచార్యులుగారిదగ్గఱ కొక్కప్పుడు అవలిప్తుఁడగు అరవదేశపు విద్వాంసుఁడు వచ్చి స్వరచితములైన శ్లోకములను జదువుచు వివరించుచుఁ బ్రశంసించుకొనుచు నుండఁగా వేంకటాచార్యులవారు వినుచుండిరి. పది శ్లోకము లయినవి. ఆత్మోత్కృష్ట్య ప్రశంసాపరాయణుఁడుగా నున్న యా పండితునితో "అయ్యా ఈ శ్లోకములు పిన్ననాఁడు మా నాయనగారు నాకుఁ జెప్పిరి. ప్రాచీన కవికృతములైన

యీ శ్లోకము లనంతాచార్యులుగా రెటులగ రని యాత్మీయములుగాఁ జదువ నారంభించితిరా?" యని పలికిరఁట. కుపితుఁడై వెడవెడ నవ్వు నవ్వి యీ యువదేశపండితుఁడు వేంకటాచార్యులుగారి నెటులగక 'ఏదీ నీకు వచ్చునేని చదువుము, రచించినవాఁడను నేనే యిక్కడ నుండఁగా నాతోనే యిట్లు పలికెదవేమయ్యా! ఎవ్వరవీవు?' అని తుటారించెనఁట. ఇదిగో చదువుచున్నానని యేకసంధాగ్రహణమున నప్పగించిరి. వెల్ల బోయి యీ పండితుఁడు వేఁడుకొనెనఁట. మీ మాహాత్మ్యము నెటులగ నైతిని మన్నింపుఁడని-"

ఇట్టి కథలు గాథలు వీరినిగూర్చి శ్రవణానందములు. కని విని యెఱుఁ గని భాషలోనివి కొన్ని పద్యములు వీరికడ నొక్కసారి చదివినఁజాలును. అవి యద్భుతముగా వల్లించిన పద్యముల వలె నప్పగించువారఁట. ఆయన ధారణాశక్తి యట్టిది. ఒక గదిలో నూఱుచెంబులు పెట్టి పుల్లతో ముందు వరుసగా వాయింపఁగా, గదివెలుపలనుండి విని మరల నడుమ నేచెంబుపై దెబ్బ కొట్టినను 'ఇది యీసంఖ్యకల చెంబు' అని చెప్పువా రఁట. శబ్దగ్రహణమునఁగూడ నాయన కిట్టి బుద్ధిసౌక్ష్మ్య ముండెడిది. దేవులపల్లి సోదరకవులు, తిరుపతివేంకటకవులు వీరిని విని యవధానము లారంభించిరి. తిరుపతివేంకటకవులు అవధానలతను దేశదేశమెల్లఁ బ్రాఁకించిరి. వేంకటాచార్యులుగారు శతావధానియే కాదు. సంస్కృ తాంధ్రముల లోఁతు చూచిన పండితుఁడు. తర్కవ్యాకరణములు గురు కుల క్లిష్టుఁడై కఱచెను. మొత్తముమీఁదఁ జదివినదానికంటెఁ జూపిన దెక్కువ. సంస్థానముల కెక్కుట - యవధానములు గావించి యాశుకవిత చెప్పుట వీరి యుద్యోగము. తెలుఁగురాజు లెందఱో వీరి నాదరించి సత్క రించి పంపిరి. ప్రభువులకు నెలవైన నూజవీటఁ గాఁపురము. తోఁచినప్పు డొక్కొక్క ప్రభుని దర్శించి ప్రతిభచూపి కానుకలఁ గొనితెచ్చి యింటఁ గూర్చుండి గ్రంథరచనము చేయుచుండువారు. పీఠికాపుర మహారాజు

గంగాధర రామారావుగారిని దర్శించి 1879 లో నవధానము చేసెను. ఆయవధానమునకు మహారాజు మహాశ్చర్యభరితుఁడై మనకవివరుని గొప్పగ సన్మానించెను. ఈరీతి నీయన పొందిన రాజగౌరవములకు మేరలేదు.

చింతకాయ కలేకాయ బీరకాయ తమారికే
ఉచ్చింతకాయ వాక్కాయ సాధకాయ తమాంజలిమ్

ఈ మొదలైన కొంటెరకపు శ్లోకములు వేంకటాచార్య రచితములుగాఁ జాలమంది చదువ విందుము.

ఆచార్యులుగారు దొడ్డుపొడుగులుగల మానిసి. స్ఫురద్రూపి. ఆయన రసికతకు నిదర్శనములుగాఁ గొన్నిరచన లున్నవి. "రామావధూటి తారావళి" వానిలో నొకటి. ఆ పద్యములు రసఘుటికలు. రెండుదా హరింతును.

సీ. శ్రీరాధికాకుచాశ్లేషజ సంతోష
విభవుఁడౌ శ్రీకృష్ణవిభున కెరఁగి
సకలవిద్యావ్యాప్తి సాధనభూతయౌ
శారదాంబకు నమస్కారములిడి
మైహికానంద ప్రవాహపూరకమైన
శృంగారరస మాత్మ నిరవుకొలిపి
మదనసామ్రాజ్య సింహాసనారూఢులౌ
పురణించు రసిక శేఖరుల నెంచి
వివిధ రతితంత్రపాండిత్య భవమహాను
భవములౌ పదార్థములుగ నేర్పఱిచి సీస
పద్య నక్షత్రమాలిక భావవిదుల
మనము లలరంగఁ గూర్తు రామావధూటి.

ఒకనాఁటి కలలోన సకియ! నీకాలిపా
జేబులో జందెంబు చిక్కినట్లు
ఒకనాఁటికలలోన సకియ! కౌగిటఁజేర్చు
తఱిఁ గంటె గడ్డానఁదాఁకినట్లు
ఒకనాఁటికలలోన సకియ! మెల్లన నాదు
గూబలో 'గొర్గొర్' కూసినట్లు
ఒకనాఁటి కలలోన సకియ! నీ చేతిపో
చీలోన జందెంబు చిక్కినట్లు
ఇన్నివిధముల నచ్చట నున్ననాఁటి
వన్నెలన్నియుఁ గలలోన వచ్చి యిచట
గాసి గూర్చుచున్నవి నిన్నుఁబాసి యెట్లు
మరులు నిల్పఁగనేర్తు రామావధూటి!

వేంకటాచార్యులుగారు నూజవీటి శ్రీరాజా శోభనాద్రి అప్పారావుగారి సంస్థానమున విద్వత్కవి. ఈయన కభినవపండితరాయ లని బిరుదము కలదు. వీరి తండ్రి నరసింహాచార్యులుగారును కావ్యకర్తలు. వల్లవీవల్లవోల్లాసము, రుక్మిణీకల్యాణము, నీలాపనిందానివారణము ఈగ్రంథములు వారురచించినవే. వీరేశలింగము పంతులుగారి కవులచరిత్రలో తండ్రి కొడుకుల చరిత్రలు రెండును గలవు. మన వేంకటాచార్యులుగారు 'భరతాభ్యుదయ' మను ప్రౌఢప్రబంధముఁ సంతరించిరి. దీని ప్రాశస్త్యము కవిచరిత్రమున నుగ్గడించియుంటఁ బునరుక్తి సేయులేదు. ఈయన ప్రబంధకవిత్వ మెటులుండునో యాశుకవితయు నించుమించుగ నట్లేయుండుననుట యత్యుక్తిగాదు. శోభనాద్రి అప్పారావుగారు 'పుష్పబాణవిలాసము' నాశువుగా నాంధ్రీకరింపుమని యాచార్యులుగారి కాజ్ఞాపించిరఁట. ఆయన కాశువన్న బ్రహ్మాండముగాదు. ఈ పద్యమ్ములెంత యుంద్ధముగా నడపించిరో చదువుఁడు,

సరసుఁడు దూరమేఁగునని చాలఁగ నామది చింతనొందు నె
ల్లరకు వినోదిమైనను గళానిధి వైరమొనర్చి వెండియున్
బరభృతకాకలీరవముఁ బాసి తనర్చును నిష్కుటీ విసృ
త్వర మలయానిలంబులనఁ బ్రాణము లేహరియించు నెంతయున్.

ఆచార్యులుగా రసపత్న్యులు. 'భరతాభ్యుదయము' వారిపుత్రుఁడు. అవధాన ప్రతిభాయాతమగు కీర్తి వారిపుత్రిక. గుంటూరిలో నిప్పుడు న్యాయవాదులుగా నున్న వేదాంత నరసింహాచార్యులుగారు వీరి దత్తకుమారులు.

ముడుంబ నృసింహాచార్యకవి

1841-1927

శ్రీవైష్ణవులు. తండ్రి వీరరాఘవాచార్యుఁడు. జన్మస్థానము : శ్రీకూర్మము దగ్గఱ వంశధారా తీరస్థమగు అచ్యుతపురి – జననము : ప్లవంగ సంవత్సర భాద్రపదబహుళనవమి 1841 సం||రం సెప్టెంబరు 22. నిర్యాణము : ప్రభవసంవత్సర భాద్రపదబహుళ ద్వాదశి. 1927 సెప్టెంబరు 22 తేదీ. గ్రంథములు : ౧. రంగేశ శతకము. ౨. ప్రౌఢా శృంగారము. ౩. ముగ్ధాశృంగారము. ౪. కామినీదృష్టిశృంగారము. ౫. అంగశృంగారము. ౬. సంకీర్ణశృంగారము. ౭. శ్రీకృష్ణచాటువులు. ౮. సత్య శతకము. ౯. వృష్టిపంచాశత్తు. ౧౦. గరుడాచల నాటకము. ౧౧. కృతులు. ౧౨. హరికథలు–సంస్కృతగ్రంథములు: ౧. బ్రహ్మసూత్రభాష్యము. ౨. బ్రహ్మసూత్రార్థమంథము. ౩. ప్రపత్తి చింత. ౪. నృసింహశారీరకభాష్యము. ౫. ఉజ్జ్వలానంద చంపువు. ౬. వాసవ పరాశరీయ నాటకము. ౭. జయసింహాశ్వమేధీయము. ౮. చిత్సూర్యాలోకము. ౯. కావ్యసూత్రవృత్తి—ఇత్యాదులు. వీరు సంస్కృతమున వ్రాసిన తత్త్వగ్రంథముల సంఖ్య ౨౨. సాహిత్యగ్రంథములు ౧౪. స్తోత్రకృతులు ౧౫. నీతిశాస్త్రరచనలు ౨.

శ్రీమన్నరసింహాచార్యస్వామికి 'భగవత్కవి' యని బిరుదము. సింహాద్రినాథు నీయమాచార్యుఁ డుపాసించుచుఁ దనకృతుల నన్నిటి నాతనికే యంకితముచేసెను. ముప్పదియేండ్లయీడున నున్నపుడొకప్పుడు వేదవ్యాసులు వీరికిఁ గలలోఁ గనఁబడెనఁట. స్వప్నమున వచ్చిన దేవుఁడు తిక్కనాదుల నడిగినట్లు వీరిని కృతి యడుగలేదు. వచ్చి దర్శన మిచ్చి చక్కఁబోయెను. అప్పటినుండియే యీయనలో నార్షప్రతిభ రేకెత్తెను. విజయనగరములో నల్లచెఱువుమెట్టపై వేదవ్యాసులను కేశవస్వామిని ప్రతిష్ఠించి యీయమాచార్యవరుఁ డాలయము నెలకొల్పెను. అట్టి యుపాసకుఁ డీయన.

పదవయేట సహజముగ కవితాధారయుండెనది. అచ్యుతాపురాగ్రహారములో జిన్నతనమునాటి యొకకృత్యాత మిట్లు చెప్పుదురు. అప్పన్నయను కట్టుపనివాడు పట్టుగుడ్డలో నొకసంచి కట్టి యమ్మక మునకు దెచ్చెను. ఈయాచార్యకవి బాలుడు దాని నాసించెను. కాని చేత గానిదేదు. తక్షణమే యీపద్యము వ్రాసిచ్చి నాశువు చదివెను.

మునియాగరక్షకుండును
మునిసతి రక్షకుండు మోదముతోడన్
నినుగనుగొని ప్రోచుసుమీ
జరిజీ అప్పన్ననామ! సద్గుణధామా!

చదువుకొన్నకట్టుడని అప్పన్న సంతోషించి సంచి వట్టుకపోయ్యెను. ప్రాసము పోయినదని యతడెత్తిగిన సంచి యీయక పోయి యుండు వాడు.

క్రమముగా నరసింహాచార్యకవి పండితుల మెచ్చుకొనుచు కవిత్వము వ్రాయ మొదలిడెను పఠనీయముగు సంస్కృతాంధ్ర గ్రంథము లధిక రించెను. శాస్త్రపాండితిని సంపాదించెను. కంఠము మంచి దగుట సంగీత ము కూడ నేర్చెను.

వావిలివలస ప్రభుని దర్శించుట కొకప్పు డాచార్యులు పయనమైరి. ఆ దొరపేరు సీతారామయ్య. కవు లనిన నా ప్రభువున కభిమానము. ఆయనను దర్శించి నరసింహాచార్యు డీపద్యము చదివెను.

వెండికొండకు నీకీర్తి వెలిగలీబు
పాలకడలికి మీగడ పవికి దళుకు
శశికి దనకందుమానుప జాలునందు
కొనడ డదేలొకో శ్రీరామకువలయేశ!

ఇదివిని రాజు రసికుడగుట నరసింహాచార్యుని తన యాస్థానకవిగ నుండ నడిగించెను. ఇతడిది యంగీకరింపక యిట్లు చెప్పెను. "నేను కొంత కాలము క్రితము శ్రీ విజయనగరము మహారాజు విజయరామగజపతి వేటకై యడవి కేగుచు పాలకొండ గ్రామమున విడిసినపుడు

నే నాయన దర్శనము చేసియుంటిని. ఆ మహారాజు నా పద్యములు విని యానందించి విజయనగరము రమ్మని సెలవిచ్చెను. ఆయనయాజ్ఞచే మఱొకపుడు రాజధానికిఁ బోయి జమ్మి వాసుదేవరావుపంతులుగారి సాహాయ్యమున ఆనంద గజపతి కుమారరాజేంద్రుని సందర్శింపఁగలిగితిని. వారు నా కవితాధోరణి కానందపడి నన్నుఁ దమయొద్ద నుండెద మనిరి. ఇంతలో మహారాజుగారు సకుటుంబముగాఁ గాశికిఁ బోవ నయ్యెను. నన్నును దమతో రమ్మని చెప్పిరి. కాని నేను వెళ్ల వీలుగలుగలేదు. మేము తిరిగి వచ్చినతరువాత దర్శనము చేయుఁడని నాకుఁ జెప్పి వా రేఁగిరి. కావున నే నన్యాశ్రయము చేయఁజాలను.”

నరసింహాచార్యునిమాటలు విని వాపిలివలసప్రభువు అబ్బురపడెను. అప్పటి కీకవివయస్సు ఇరువదిరెండేండ్లుమాత్రము. ౧౮౬౮ లో నీకవి తల్లితో దక్షిణదేశయాత్ర చేయుచు శ్రీరంగమునకు వచ్చి యచ్చటఁ గొంతకాల ముండెను. అపుడే “పీతభవత్కృష్ణ! రంగేశ వేషకృష్ణ” అను మకుటమున నొక శతకము రుక్మిణీకల్యాణ కథాత్మకముగ రచించెను. ఈ శతకము వావిళ్ళవారును, చెలికాని లచ్చారావుగారు నుద్ధరించి శతక సంపుటములలోఁ బ్రకటించిరి. అందలి యొకపద్యము :

సీ కట్టివదలిన నెఱిక కన్నుల నద్ది
యుత్తరీయంబుగా నుంచుకొందు
నీ చుట్టివిడిచిన నిరుపమ మాల్యముల్
ముదమంది కొప్పులో ముడిచికొందు
నీ మహత్తరపాద నీరేజతీర్థంబు
చేఁద్రావి శిరమునఁ జిలికికొందు
నీ నోటికప్రంపు నెఱివీడె మిచ్చుచో
నమృతంబుగాఁ గేల నందుకొందు
నీదు పాదుక లొదలఁ బాదుకొల్పి
చనఁటి జన్మంబు సఫలతఁ జేసికొందు
నయ్య దాస్య మొసంగఁగదయ్య నేఁడు
పీతభవత్కృష్ణ! రంగేశ వేషకృష్ణ!

శ్రీరంగమున నొకవత్సర ముండి నరసింహాచార్యుఁ డింటికివచ్చెను. శ్రీవిజయ నగర ప్రభువులును గాశినుండి వేంచేసిరి. మన కవి మరల మహారాజ దర్శనముచేసెను. ఆనందగజపతియు వీరి కవిత్వగోష్ఠి కలసి వీరిని మరిమరి ప్రేమించుచు వార్షిక బహుమాన మొసఁగుచుండెను. ఆనందగజపతి చెప్పుటచే మహారాజు విజయరామగజపతికిని నరసింహాచార్యుని కవిత్వ పాండిత్యాదులపై విశ్వాసము కలిగినది. అప్పు డా మహారాజుపై మన కవివరుఁ డిట్లు చెప్పెను.

ఈ జగమందు నిందు నటులెల్లరకుం గనువిం దొనర్చుచో
యోజ గనంగ రాజనుట కెల్లను సందియ మొంద దిందునన్
రాజను మాట మా విజయరామనరేంద్రునకే ప్రసంగు పై
రాజులు శోకవహ్ని మదిరాఁజుట రాజు లనంగఁ జెల్లెడిన్.

ధకాం డధాంకరణ రవ
ఘర్ఘరిత్ఫణిప ఫణమణి నిపతనజ శూల
స్ఫూర్జత్కర్ణ కుహర ఘుర్ఘుర
ముకోలపభీత గుప్తముఖ కూర్మేంద్రా!

ఈ పద్యములు విని విజయరామరాజు చాల సంతోషించి నరసింహాచార్యుని తన సంస్థానకవిగ నాదరించెను. భర్తృహరి మున్నగు కృతులు మహారాజీ పండితునికడఁ జదివెను.

కూరెళ్ళ రామశాస్త్రియను పండితు లొకరు "ఉమాముఖం చుంబతి వాసుదేవః" అను సమస్య నిచ్చి పూరింపుఁడని నరసింహాచార్యుల నడిగి నపు డాయన తడవుకొనకుండ

భవిష్యదీశోపయమం విచింత్య
హిమాలయస్యాలయమేత్య కిం తే
సుతేతి చోద్ధృత్య శిశుత్వ ముగ్ధ
ముమాముఖం చుంబతి వాసుదేవః.

అని చదివెను. ఆశువున నింత యందముగఁ జెప్పుట యబ్బురము. సంస్కృతాంధ్రములు రెండింటను వీరికవిత ప్రౌఢతరము. తెలుఁగున వీరు వ్రాసినవి తక్కువగ నున్నవి.

ఈ సమస్యాపూరణ మెంత రమణీయముగ నున్నదో యరయవచ్చును.

స్నిగ్ధత దేవదానవులు చెచ్చెర మందర భూధరంబునన్
ముగ్ధత వాసుకి న్ద్రావి త్రోయ మథింప హాలాహలంబు ని
ర్దగ్ధముసేయ నద్రిశిఖరంబులు విచ్చి శరణ్యుఁ డుండియున్
దుగ్ధ పయోధిమధ్యమున దున్మది గమ్మ నదేమి చిత్రమో!

కవికల్పద్రుమ మనందగు నానందగజపతి ౧౮౯౭ లోఁ బరమపద మందెను. ఆయన గతించినవెనుక నరసింహాచార్యుని కల మాఁగిపోయినది. ఇఁక విరక్తి నంది భగవదుపాసనముఁ గడపుచు నీభగవద్భక్తి యొనుబది యేండ్లు జీవించి ౧౯౨౭ లో జీవయాత్ర చాలించెను. కూచిమంచి తిమ్మకవివలె నరసింహాచార్యులును నలుగురు ప్రభువులకాలమున నుండె ననుట యొక విశేషము.

ఈ కవి తెనుఁగుకృతులలోఁ గొన్ని చాటువులు, రంగేశ శతకమును శాశ్వతముగ నుండఁగలవు. సంస్కృతాంధ్రములలో వీరి కవిత్వపు మచ్చులు మఱికొందు.

సఖిస్తవము:

రాగోయం మధురాధరే క్షిపతి మాం సింహాచలాధీశ తే
జ్ఞానం తన్నిర్దపద్మ శుభ్రసఖరజ్యోత్స్నా మధః కర్షతి
భో సింహాచలనాథ పాహి సతతం ద్వేధాశ్రమా పాదనా
ద్యత్రాగ్రాక్షితి రప్యతత్ర వసతిం దేహి ప్రభో మాచిరమ్.

ప్రౌఢాశృంగారము:

తరుణి! నీదు కాంతిఝరి కన్నులను గ్రోలి
పొరలవలసెఁ దాపగరిమ విరుల
చెండులంతలేసి కొండలచే నెంత
జోబ గలిగె వింత సుందరాంగి.

కొక్కొండ వేంకటరత్నశర్మ

1842-1915

నియోగిశాఖీయులు. జన్మస్థానము వినుకొండ. నివాసము చెన్నపట్టనము. రాజమహేంద్రవరము, జననము 14-3-1842 సం॥ నిర్యాణము 1915. కవికర్తృకకృతులు: పంచతంత్రము, సింహాచల యాత్ర, బిల్వేశ్వరశతకము, బిల్వేశ్వరీయ ప్రబంధము, కుమారనృసింహము, ధనంజయవిజయ వ్యాయోగము, నరకాసుర విజయ వ్యాయోగము, మంగళగిరి మాహాత్మ్యము కొరుకొండ మాహాత్మ్యము, గోదావరీ వర్ణనము, గోవిందమంజరి, దీక్షితచరిత్రము, యుగరాజు పర్యటనము, పోయం ఆఫ్ ది ప్రిన్స్ ఆఫ్ వేల్సు-విజిట్ టు ఇండియా - ఇత్యాదులు.

వేంకటరత్నశర్మగారు "మహామహోపాధ్యాయ" లని కొనియాడఁబడిన పండితులు. చిత్తూరు మండలములోని 'తిరువల' గ్రామమున వెలసిన శ్రీ తనుమధ్యా బిల్వ నాథేశ్వరులభక్తులు వీరు. తత్కరుణా కటాక్ష సంప్రాప్త కవితావిద్యా ప్రవీణులు. గుంటూరిలో విద్యాభ్యాసము చేసిరి. చెన్నపురి రాష్ట్రీయ కళాశాలలోఁ బండితపద మధిష్ఠించిరి. రాజమహేంద్రవర రాజకీయ శాస్త్రకళాశాలయందుఁ బ్రధానాంధ్రపండితులై ముప్పదియేం డ్లుద్యోగించిరి. కవిబ్రహ్మయనియు, అక్షరసంఖ్యాచార్యులనియు వీరి బిరుదములు. మహామహోపాధ్యాయ మహాబిరుదమందిన తెలుఁగువారిలో వీరు తొలివారు. "ఆంధ్ర భాషాసంజీవిని" వీరు నడపిన తెలుఁగు పత్రిక. ప్రసిద్ధిగాంచిన నాఁటి పత్రికలలో నిది యొకటి. అముద్రిత గ్రంథచింతామణి-కళావతి-వివేకవర్ధని-శశిలేఖ మున్నగుపత్రికలు మహోత్తమ రచయితల సంపాదకత్వమున వెలువడుచుండిన దివసము లవి. నాఁడు 'ఆంధ్రభాషా సంజీవిని' యన్వర్థనామముతో వెలసినది. వేంకటరత్నముపంతులు గారికి ధర్మవరము రామకృష్ణమాచార్యులు, రాయదుర్గము నరసయ్య

శాస్త్రి, కొమాండూరి అనంతాచార్యులు మున్నగు పండితకవుల చెలిమి చేకూరినది. ఈయన "ఆంధ్ర ప్రసన్న రాఘవము" ను వేదము వేంకటరాయశాస్త్రి యీఁకకు నీఁకగా విమర్శించెను. నాటి విమర్శనములు స్మరణయోగ్యములు కావు. అందు తిట్టులు శాపములు కుప్పనఁగూరలు. విమర్శనమున సారము లేకపోలేదు. కాని వ్యక్తి దూషణములు పెచ్చుపెరిఁగినవి. కొక్కొండపండితుని ప్రసన్నరాఘవమును గూర్చి వేంకటరాయశాస్త్రిగా రిట్లనుచున్నారు.

"ఛందోవ్యాకరణాలంకారముల కిది వేరుపురువు... రసము నున్న ... పూర్వులు చెప్పినపాకము లిందులేవు...... కవనము పెద్ద యక్షరముల వ్రాఁత కుదురకముందే వ్రాసిన జిలుఁగుగొలుసు ఎట్లుండునో అట్లున్నది. పాదపూరణమువలన పద్యార్థము ప్రాయికముగా నభేద్యత్వముం బొరసియుండును. పాదపూరణ ప్రయోగమందును, అదియేని చక్కఁగ చేతగామియుండును ఇంతటికవి మఱి లేఁడు. అలంకార శాస్త్రమునఁ జెప్పిన దోషములలో నిందు లేనిదిలేదు. అందులేనివి యిందెన్నియేని గలవు. తప్పుయతులు తప్పుగణములు తప్పుసంధులు ఆద్యంత సమాసములు సరసవస్తుత్యాగము కొసవిసరులు అంత్యాశ్చర్యములు సముచ్చయములు పౌనరుక్త్యము, ఉక్తానుక్తకావ్యదోషములు ఇత్యాద్యపాయము లెన్నియేని యుండియు వీరిపద్యమున కుదురక పడినపాట్లు అనుశోచనీయముగా నున్నవి..."

ఈ వచనములు నాఁటి విమర్శనలతీరు లిటు లుండె ననుటకుఁ జూపఁ బడినవి. ఈ కవివరున కిట్లే పెక్కుమందితో వాగ్వాదములు వచ్చినవి. మండపాక పార్వతీశ్వరశాస్త్రిగా రిట్లు వ్రాసిరి.

పటుధాటీ పరిపాటియందుఁ గవితా ప్రాగల్భ్యముం దింక న
న్నిటియం దెన్నికఁగన్న చెన్నపురిలో నెక్కొన్న కొక్కొండ వేం
కటరత్నాఖ్య కవీశ్వరుండు నరసగ్రంథంబు లచ్చొత్తుచున్
గటువాదం బిటుమీఁదనైన విడువంగా నర్థిఁ బ్రార్థించెదన్.

పూండ్ల రామకృష్ణయ్య పండితుఁడు వేంకటరత్నముపంతులుగారి బిల్వేశ్వరీయాది కృతులు 'విమర్శించి వైచెను. ఆయా విషయములకు నముద్రిత గ్రంథచింతామణి యరయనగును. వేంకటరత్నకవి కవిత సంస్కృతసమాస నిబిడము. ఈయనకు సంస్కృతభాషా పాండిత్యము తక్కువయనియుఁ దెలుఁగున గట్టిశక్తి కలదనియు విమర్శకు లనిరి. అది మనము సహింపరాని మాట. వీరు వెండి, బంగారము మున్నగు క్రొత్తరకపు వృత్తములు కల్పించి తమ ప్రబంధములలోఁ జేర్చిరి.

సీ. చిటిపొటి కొంపలు చిన్నవి పెద్దవి
యిండ్లు మిద్దెలు దారి కిరుగెలఁకుల
నారు పోసినయట్లు వారక యెన్నని
పూర్వాచరణముల పోల్కిఁ దనర
మరికొన్ని సుగృహహర్మ్యములు నూత్నాచార
ముల యట్లు పైపయి మురువుసూపఁ
జైత్యద్రుమంబుచే సత్రంబులుగ వార
మున కొకసంతయె యొనర విపణి
గా నధిత్యకస్పృహారి నికాయమె ఘన
రాజమందిరముగఁ గడు రాజిలంగ
జానపద జన సమాజమెద్దైనఁ బౌర
కోవిదావాసము నగుఁ గోర్కొండపురము.

'కుమార నృసింహము.'

వీరేశలింగముపంతులుగారును వీరును పరస్పర గ్రంథ విమర్శనములు గావించుకొనిరి. ఆ గ్రంథవిమర్శనములు క్రమముగా వ్యక్తిదూషణము లకుఁ జేరి విసుగుపుట్టించినవి. అయినను భాషాజిజ్ఞాసువుల కా విమర్శన ములు కొంత యుపయోగపడిన వనవచ్చును. వేంకటరత్నముపంతులు గారు 'ఆంధ్రభాషాసంజీవిని' పత్రిక కనుబంధముగా హాస్యసంజీవిని

ప్రకటించిరి. వీరేశలింగముపంతులుగారును 'వివేకవర్ధని' ప్రక్క హాస్యవర్ధని వెలువరించిరి. ఇవి యన్యోన్యవివాదములతోఁ జాలకాలము చేరేఁగినవి. ప్రసిద్ధపండితుఁ డన్న వాఁ డల్ల వేంకటరత్నముపంతులుగారి గ్రంథములు విమర్శించెను. దీనికిఁ గారణము; ఆయన సంస్కృతాంధ్రములం దసమానపండితుఁడై మహామహోపాధ్యాయుఁడను నగ్గలపు బిరుద మా నాఁ డాంధ్రులలో నందుకొనుటయే యనవలయును.

'పలుకు దయ్యమా, ఇది పాయసమమ్మా! బమ్మదయ్యవుటిల్లాలా! ఇది పానకమమ్మా! త్రాగుమమ్మా!' అను రీతిని మాటాడు గ్రాంథిక భాషాస్వరూపుఁ డీయన. ఇంటిలో భార్యకడను, బజారులో దుకాణము కడను వీరు గ్రాంథికసంభాషణము గావించెడివారు. అంత పట్టుదల. అఱవము, కన్నడము నెఱుఁగుదురు. వీరు రచించిన బిల్వేశ్వరీయమున కఱవమున మాతృక యున్నదఁట. 'గీతమహానటము' అను పేరితో జయదేవుని గీతగోవిందమువంటి కృతిని వీరు సంస్కృతమున నంతరించిరి. విద్యావినోదము పనప్పాకము అనంతాచార్యులుగారు పంతులుగారిని "ఆంధ్రా జాన్సన్" అని పిలుచుచుండువారు. ఇట్టివి తెలుఁగువారికి సదా స్మరణీయుఁడుగదా!

బహుజనపల్లి సీతారామాచార్యులు

1827-1891

ద్రవిడదేశ వైష్ణవులు. జననము. 1827 సం॥ నిధనము 20-3-1891సం॥ పుట్టుక నాగపట్టనము. నివాసము చెన్నపట్టనము. రచించినగ్రంథములు: సౌందర్యరాజస్వామిశతకము 1849—ప్రాకృతదీపిక, పదార్థనామకోశము, బాలచంద్రోదయము, 1871 – అలఘుకౌముది1872 -నీతిమాల 1872- సతీధర్మసంగ్రహము, ప్రపన్న పారిజాతము 1887 — ఆంధ్రశబ్దమంజరి, ఉపాధ్యాయబోధిని, వినాయక శతకము, త్రిలిఙ్గ లక్షణశేషము, శబ్దరత్నాకరము 1855.

సీతారామాచార్యులుగారి పేరు చెప్పినంతనే శబ్దరత్నాకరము, ప్రౌఢ వ్యాకరణము జ్ఞప్తికి వచ్చుచుండును. శబ్దరత్నాకరప్రాశస్త్యమును గని పట్టి చెన్నపురిలోని దేశభాషాగ్రంథకరణసభ వా రాచార్యులుగారి కైదు వేలు సన్మానముగా నిచ్చిరి. నిజమాలోచించినచో నైదులక్ష లిచ్చినను దెలుఁగువారు వారియప్పు దీర్చుకొనలేరు. "శరీరకష్టమును విత్తనష్టమును నించుకేనియుం బాటింపక" రేలుంబవళ్లు శ్రమించి రచించిన నిఘంటు వని నిఘంటుకారులు వ్రాసికొనియేయున్నారు. శబ్దరత్నాకరములోని శబ్దములరూపనిర్ణయము నర్థనిర్ణయము శాస్త్రసమ్మతమైనది. పూర్వ నిఘంటువులకంటె నిది బహువిధములమేలైనది. అక్షరక్రమముగా రచింపఁబడిన నిఘంటువులలో నిది శ్రేష్ఠము. తెలుఁగున నీరకమైన నిఘంటువులకు దారితీసినవారు ఎ. డి. కాంబెలు పండితుఁడు, సి. పి. బ్రౌనుపండితుఁడును. వీరిద్దఱు నాంగ్లేయులే. అక్షరక్రమనిఘంటువులు తెలుఁగులో వెలయుట కాంగ్లేయులే యాదిభిక్షుము.

తరువాతఁ బరవస్తు చిన్నయసూరిగా రాంధ్రజనసామాన్యమునకందు బాటులో నుండునట్లు లోక తెలుఁగుపదముల నిఘంటువును రచింపఁ

దలంచి పదములు ప్రామాణికగ్రంథములనుండి యెత్తి వ్రాసికొని యచ్చుటచ్చుటం గొన్ని పదముల కర్థనిర్ణయము చేసికొని యీమహోద్యమము తుదముట్టకుండగనే పరమపద మలంకరించిరి. వారియనంతరము సీతారామాచార్యులవారు సంస్కృతాంధ్రపదములు తదర్థములు కొన్ని ప్రయోగములు చేర్చి శబ్దరత్నాకరము సంధానించిరి. ఇది 1885 లో వెలువడినది. శబ్దరత్నాకరము తరువాత 'శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు' వెలువడిన విషయము తెలుగువారికి దెలిసినదే.

చిన్నయసూరి వెనుక లాక్షణికులలో సీతారామాచార్యులుగారు ముఖ్యులు. ఈయన సూరికి శిష్యుడని వ్రాసికొనలేదు. కాని శిష్యుండైనట్లు జనశ్రుతి. ఆచార్యులవారు కొండొకచో నిట్లనుచున్నారు. "పరవస్తు చిన్నయసూరిగారి కాంధ్రమునందును దదుపయుక్త సంస్కృత ప్రాకృతములయందును దలస్పర్శియగు పరిజ్ఞానము కలదని వారుచేసిన లక్ష్యాలక్షణగ్రంథములే నిరూపించుచున్నవి. మేము వారితో జిరకాలము సావాసము చేసియుంట వారిపాండిత్యము మాకనుభవసిద్ధము." ఇది చూచి వీరి శైష్యోపాధ్యాయిక తెలిసికొన వచ్చును.

ఆచార్యులవారు పండితోత్తముడు సజ్జనాగ్రేసరుడునగు తమ తండ్రిగారికడ విద్యాభ్యాసము చేసిరి. కవితారసధార యథోచితముగం బసినాటనే కలిగినది. అప్పుడు బాలవయోవస్థాకాల వాసస్థానమైన నాగపట్టణములో నున్న సౌందర్యరాజ స్వామిపై శబ్దాలంకారభరితమైన శతక మొకటి రచించిరి. ఈశతకము శతకకవిచరిత్ర కారులకు దొరకినది. కవిత ప్రాథమికమైనను నిట్లు మాధురీభరితముగ నున్నది.

హారశూల నామశరదా
శరదాసితగాత్ర భక్తజనహితవరదా !
వరదామరుచిర సురదా
సురదాస్య మహిత సురాజ సుందర రాజా !

మలయజ శిశిర తనురుచిర
జలరుహదళ సదృశనయన జలనిధిశయనా !
కలరవ కలిత కటకయుగ
సులలిత మృదుపద పయోజ ! సుందరరాజా !

ఇది వ్రాయునాటికి గవి యీడు ఇరువది రెండేండ్లు. అప్పటికిం జిన్నసాహితియుం గవితాధోరణియుం గల యీయాచార్యులుగారు, ఇంక నిచట కూపమండూకముపగిది నుండరాదని సమీపమునంగల మదరాసునకు వచ్చెను. వచ్చి యానాడు చెన్నపురిలో మంచి వ్యుత్పన్నుండై, ప్రామాణికుండైయున్న పరవస్తు చిన్నయసూరిని జేరి యతనితో ననేకవిషయములు చదివెను. సూరి రాజధానీకళాశాలలోం బ్రధాన పండితుండు. పురాణము హయగ్రీవశాస్త్రిగారు రెండవపండితులు. ఈయిరువుర సాహచర్యము సీతారామాచార్యులుగారికి విద్యాసంగ్రహణమునం జాల నుపకరించినది. 'శబ్దరత్నాకర' నిఘంటురచన బీజ మాచార్యులవారి హృదయకేదారమునం బడినది యీసమయమే. సూరి యహోరాత్రము లదేపనిగా విశ్వనిఘంటురచనోపయోగి పరికర సంగ్రహణ మొనరించుచున్న సమయమది. పాపము ! అతనితలంచినపని పూర్తికాకుండగనే 1862 మ్రింగివైచినది. సూరి తత్సమపదములకర్థము వ్రాయవలయునని తలపెట్టలేదు. మన యీయాచార్యులుగారు తత్సమ పదములుచేర్చి.సూరినిఘంటువు నాదర్శముగాందీసికొని సర్వప్రశస్తముగా "శబ్దరత్నాకరము" నావిష్కరించిరి. సూరి గతించిన 1862 లో నారంభమై యించుమించు యిరువదిమూండేండ్ల వఱకు సాగి 1885 లో నీనిఘంటువు బయటికివచ్చినదని చరిత్రజిజ్ఞాసువులకుం దెలిసినది. శబ్దరత్నాకరరచన సాగుచున్నకాలముననే యీయాచార్యులవా రనేకకృతులు వ్రాసిరి. నిఘంటునిర్విఘ్నపరిసమాప్తికి 'వినాయక శతకము', రచించిరి. దానిలోని పద్యములు సొగసుగా నున్నవి.

వంకర తొండము చేటల
పొంకము గలచెవులు పెద్దపొట్టయుం దగ ని

ర్వంకల వందులు వాగడఁగ
బింకముతోఁ గొల్తువయ్య పేర్వెనకయ్యా!
తల్లిని పరిగొన భక్తుల
కుల్లానము పుట్టఁజేసి యురు మదధారల్
వెల్లిగొన సొంపుమానెడు
బల్లిదు నినుఁ గొల్తునయ్య భవు వెనకయ్యా!

పాఠశాలలకుఁ బనిచేయు విభక్తిదీపిక, బాలచంద్రోదయము, అలఘుకౌముది, వైకృతదీపిక మున్నగు చిన్నపుస్తకములుకూర్చిరి.

ఇవియెల్ల నటుండె, శబ్దరత్నాకరముతరువాత నాచార్యులవారికీర్తిని ధ్రువముచేయుగ్రంథము ప్రౌఢవ్యాకరణము. నిఘంటురచనాకాలమున భారతాదిగ్రంథ పరిశోధనమువలనఁ గలిగినఫలమే ప్రౌఢవ్యాకరణము. సూరి బాలవ్యాకరణమునకు శేషగ్రంథమగుట దీనికిఁ ద్రిలిఙ్గలక్షణశేష మని పేరుంచిరి. సూరివలె నాచార్యులుగారికి సూత్రపఱుచుటలోఁ బొందిక కుదురలేదనవలయును. ఆచార్యులుగారు వ్రాసికొనినట్లు, ఇందలి లక్షణము లసాధారణములనియు నియ్యది విద్యార్థుల కత్యంతోపకారక మనియు ననుటలో సందేహములేదు.

క్షేత్రయ్య సీతారామాచార్యులుగారి దృష్టిలోఁ బరమ ప్రామాణికుఁడు. క్షేత్రయపదములు వేశ్యలభినయించునపుడువీరు చెవులు కోసికొను వారఁట. అభినయాభిరుచియాచార్యులుగారికిఁ బెద్దదని పెద్దలవలనవినుట.

వీరు చెన్నపురిలోని బోధనాభ్యాసన పాఠశాలలో ద్వితీయపండితులుగా 1864 లో మొట్టమొదటఁ బ్రవేశించిరి. అక్కడినుండి రెండేండ్లకు ప్రథమపండితస్థాన మాక్రమించి యావజ్జీవ మచటనే గడపి చెన్నపురిలో నాఁడుద్యోగించెడి కొక్కొండ వేంకటరత్నశర్మ, చదలువాడ సీతారామశాస్త్రి మున్నగువారితో పాటు సీతారామాచార్యులవారు నొక పండితస్థానము నాక్రమించిరి. శబ్దరత్నాకరము చదలువాడ సీతారామశాస్త్రిగారేసంధానింపఁగా, వారితరువాత సీతారాచార్యులు తమ పేర దాని నించించుకమార్పులుచేసి ప్రకటించుకొని రని నమ్మఁ జాలని ప్రతీతి.

ఆదిభట్ల నారాయణదాసకవి

1864-1945

పేరూరు ద్రావిడ శాఖీయ బ్రాహ్మణుడు. భారద్వాజస గోత్రుడు. తల్లి: లక్ష్మీ నరసమాంబ. తండ్రి: వేంకటచయనులు. జన్మస్థానము : అజ్జాడ గ్రామము. నివాసము : విజయనగరము. పుట్టుక : 1864 ఆగష్టు 31 వ తేదీ. నిర్యాణము: 1945 జనవరి 3 వ తేదీ. ముద్రిత గ్రంథములు: హరికథలు:- ౧. జానకీశపథము ౨. రుక్మిణీకల్యాణము 3. అంబరీష చరిత్రము ౪. హరిశ్చంద్రోపాఖ్యానము ౫. భీష్మచరిత్రము ౬. గజేంద్రమోక్షము ౭. మార్కండేయోపాఖ్యానము ౮. ప్రహ్లాద చరిత్రము ౯. సావిత్రీ-చరిత్రము ౧౦. ధ్రువోపాఖ్యానము ౧౧. యథార్థ రామాయణము ౧౨. భగవద్గీత [వేల్పుమాట]

శతకములు:- ౧౩. రామశతకము ౧౪. శివశతకము ౧౫. ముకుందశతకము. ౧౬. మృత్యుంజయ శతకము ౧౭. సూర్యనారాయణ శతకము ౧౮. సత్యవ్రత శతకము ౧౯. నూరుగంటి ౨౦. వేల్పువంద ౨౧. బాటసారి [కావ్యము] ౨౨. నవరస తరంగిణి [షేక్స్పియర్, కాళిదాసకవుల కవిత్వపు సొగసులు విమర్శించునది] ౨౩. పురుషార్థ బోధిని ౨౪. ఉమర్ ఖయ్యామ్ [పారశీకకృతికి సంస్కృతాంధ్రములలో పరివర్తనము] ౨౫. ఋక్సంగ్రహము [తెనుఁగులో సంగీతకృతి] ౨౬. వెన్నుని వేలుపేరుల వెనుకరి [విష్ణుసహస్రనామసంకీర్తనము నకుఁ దెలుఁగుసేఁత] సంస్కృతభాషలో:- ౧. కాశీశతకము ౨. రామచంద్రశతకము 3. శ్రీకృష్ణకథామృతము [సంస్కృతభాషలో హరిగాథ] ౪. తారకమ్ (కావ్యము)

ప్రఖ్యాతపురుషుల జాతకములు బహువిచిత్రములుగ నుండును. సాధారణముగఁ జిన్ననాఁటఁ బడరానిపాట్లు పడినవారు పెద్దతనమున విడువులేని విభవము లనుభవించుట చూచుచున్నాము. విశ్వఖ్యాతి నార్జించిన నేఁటి దేశనాయకుల, నేఁటి మహాకవుల, నేఁటియుత్తమపురుషుల జీవిత చరిత్రములు చదివికొన్నచో మన కీవిషయము విస్పష్టమగును.

ఆదిభట్ల నారాయణదాసుగారి నెఱుఁగనివారు తెనుఁగువారిలో నుండరు. ఆయన హరికథాకథనమున కాద్యబ్రహ్మ. సంస్కృతములో, ఆంధ్రములో, ఆంగ్లములో నాయన యందె వేసిన చేయి. ఎన్నో భాషలయం దద్భుతముగాఁ గవిత చెప్పెను. ఎన్నో భాషలయం దనన్య సామాన్యముగా హరికథలు పాడెను. ఆంధ్రదేశీయులేకాక, యన్య దేశస్థు లెందరో నారాయణదాసుగారిని బ్రహ్మరథము పట్టిరి. అట్టి మహాశయుని చిననాఁటి మనుగడను గూర్చి యాలోచించినచో నేఁ డాశ్చర్యపడుదుము. దాసుగారిది సిరిగలకుటుంబము కాదు. తండ్రి వేంకట చయనులుగారు శ్రౌతస్మార్తములు దిట్టముగా వచ్చిన లబ్ధవర్ణులు. ఆయ నకుఁ గల యైదుగురు పుత్రసంతానములోను కడపటివాఁడు నారాయణ దాసు. పై నలువురు సోదరులు నేదోరకముగా విద్యావంతులై ప్రయోజకు లయిరి. కడకు, కడపటి సంతతి ప్రయోజకతనుగూర్చి తల్లికి వెఱపు. పసినాఁటనే తండ్రి నెడఁబాసిన కొడుకును తల్లిగారు లక్ష్మీ నరసమాంబ బుజ్జగించి యుగ్గుఁబాలతో భాగవతతత్త్వమును బోధించి నది. ఒకముచ్చట చెప్పుకొందురు. 'గుంప' యను శివక్షేత్రమున శివ రాత్రికి గొప్పతీర్థముజరుగును. ఆతీర్థమునకుఁ దల్లితో నారాయణదాసు ప్రయాణమాయెను. బండి యెక్కి తల్లీ కొడుకులు వచ్చుచుండఁగాఁ బుస్తకములమ్ము నంగడి పసిదాసు కంటఁబడెను. ఆ దుకాణములో పోతనగారి భాగవతము బొమ్మలతో నున్న ప్రాఁతప్రతి యుండెను. అదిచూచుసరికి నారాయణదాసు తనయొడలు గగుర్పొడువ, వెంటనే బండియుఱికి సాహుకారునొద్దకుఁబోయి యా భాగవత మర్థించెను. ఆ సాహుకారిపేరు దాసుగారి చరిత్రములో బంగారునీట వ్రాయఁ దగ్గ "రంగయ్య" యని అతఁడు "పసివానికి నీకు భాగ వత మేలనయ్యా" అని వెటకారముచేయుట తల్లి బండిలోనుండి విని, "కాదు, వాఁడు చదువుకొందమని యభిలాషతో నడిగె

నోయీ" యని సమాధానము చెప్పెను. వర్తకుఁడు భాగవతము తీసి బాలనారాయణదాసును బఠింపుమనెను. అతఁడు గణగణ తడవుకొనకుండ రాగధోరణిలోఁ జదివెను. ఇటులే మఱొకఘట్టము, మఱొక ఘట్టముగా సాహుకారు పిల్లవానిచేఁ జదివించి విని బ్రహ్మానందపడి, భాగవతపు బ్రతియేకాక మరియొక మైదుమూపాయ లుపాయనముగాఁగూడ వానిచేతిలోఁ బెట్టెనఁట. ఆ బేహారి 'రంగయ్య' పేరు వేఱొకతూరి స్మరించుకొందము. ఒసినాఁట మాతృోపదేశము, భాగవతసందేశము గుండియలకుఁ బట్టించుకొనియే నారాయణదాసు క్రమముగా కళాప్రపూర్ణుఁడై వాసికెక్కినాఁడు.

దాసుగారికి సహజముగ నాటపాటలయందు మేటి యాసక్తి మొలసులెత్తినది. అయిదాతేండ్లయీడుననే కళాబీజములు పొటమరించినవి. విజయనగర మహారాజుగారి రాజకీయాంగ్లపాఠశాలలో నాంగ్ల విద్యాభ్యాసమునకు విఘ్నేశ్వరపూజ జరిగినది. ఆనాఁటికి వీరివయస్సు పదునాఱు సంవత్సరములు. 1886 లో 'మెట్రిక్యులేషన్' పరీక్షయందు నెగ్గి ఎఫ్. ఏ. విశాఖపట్టణము ఏ. వి. యన్ కళాశాలలోఁ జదువుకు మొదలిడిరి. 1888 సం॥ ఎఫ్. ఏ పరీక్ష వీరిని తప్పించినది. అంతతో దానికి స్వస్తి. నిర్బంధపఠనము వదలిన పిదప ఆంగ్లములో నెన్నో మెలఁకువలు, మెఱుఁగులు గుర్తించుటయేగాక పారసీకము, అరబ్బీ, ఉర్దూ, సంస్కృతము చదివి తనపాండితికొక క్రొత్త వన్నె తెచ్చుకొనెను.

తొలుతనే ముచ్చటించవలసిన విషయ మొకటి యిపుడుజ్ఞప్తికి వచ్చుచున్నది. అసలు, తలిదండ్రులిడిన నామకరణమువీరికి 'సూర్యనారాయణ' యని. "నారాయణదాసు" అనుటయేకాని యాపేరు చాల మంది యెఱుఁగురు. వారిబంధుకోటిలో మాత్రము 'సూరన్న' యని పిలుచుట వాడుక. 'దాసు' అనునుత్తరపదముతోఁగూడిన వ్యవహారము 1886 సం॥ నుండి తెలుఁగునేలలో మంచి ప్రచారములోనికి వచ్చినది. నారాయణదాసుగారి 'హరికథా' కల్పవృక్షమునకుఁ బ్రాకుడుగొమ

మైన జయంతి కామేశము గారిని తలపోసికొనవలసియున్నది. ఆయన బరంపురము నివాసి. దాసుగారి తొట్టతొలిహరికథకు సన్మానముచేసి, ప్రోత్సహించిన మహోదారుఁడాయన. అదియాది, మైసూరు సంస్థానములోనే కాక, పిఠాపురము, ఉర్లాము, చీకటికోట, కిర్లమపూడి, మందసా, సిరిపురము, లక్ష్మీనరసాపురము, వంగెడిగూడెము, నూజవీడు, వేంకటగిరి మున్నగా నెన్నో దేశసంస్థానములలో వీరి కఖండ సత్కృతులు జరిగినవి. మైసూరు సంస్థానమునకు వీరువెళ్ళినప్పటి ముచ్చట చెప్పవలసియున్నది. నారాయణదాసుగారి అన్నగారు సంగీతజ్ఞులు ఈయన యభివృద్ధికిఁ గొంతకారణ మాయన్నగారేయని కొందరు చెప్పుదురు. ఆయన గాత్రము సన్నవిడిది. నారాయణదాసుగారిది చెప్ప నక్కరలేదు. బ్రహ్మాండమంతగొంతు. తమ్మునివెనుక నన్నగారు సహకారగానముచేయుచుండు నలవాటు. మైసూరు వీరిరువురును వెళ్ళిరి. సంస్థాన విద్వాంసుల పరీక్షల కాఁగినఁగాని ప్రభుదర్శనముకాదు. మొత్తముమీఁదఁ బెక్కునాళ్ళకు దివాణములోని గాయకులు వీరిపాట వినుట కేర్పాటు చేసిరి. కొమ్ములుతిరిగిన పండితులు కూర్చుండి, నారాయణదాసుగారిని వీణవాయించుటకును, వారియన్నగారిని పాటపాడుటకును నియమించిరి. ఇది బొత్తిగా రక్తికట్టలేదు. అప్పుడు దాసుగారు "తానుపాడెదనని, అన్నగారు వీణవాయించు" నని చెప్పి గొంతెత్తెను. ఇఁక బట్టబగ్గములులేవు. కొంతదూరములోఁ బచారు చేయుచున్న మహారాజు చెవిలో నమృతవర్తి వలె నారాయణదాసుగారి కంఠస్వరము చొచ్చుఁబడినది. ఆశ్చర్యపడి, ఆయన తిన్నగావచ్చి స్వయముగా దాసుగారి విషయమడిగి తెలిసికొని యభినందించి బహుమానించెను. అది దాసుగారికి మైసూరుగాయకుల యెదుట, పండితుల యెదుట నొక జయధ్వజ ప్రతిష్ఠ. మైసూరు వృత్తాంతము పత్రికలలోఁ జదివి విజయనగరము మహారాజు ఆనందగజపతి నారాయణదాసును గుర్తించి, కానిపించుకొని సంస్థాన విద్వాంసునిగాఁ జేసెను.

ఈయనకు మహాకవిగా రావలసినపేరు హరికథకుఁడుగా వచ్చినది. హరికథా కథనములో వీరికిఁ జెప్పఁదగిన శిష్యులు నేతిలక్ష్మీనారాయణ, వాజపేయయాజుల సుబ్బయ్య, చొప్పల్లి సూర్యనారాయణ మున్నగాఁ బెక్కురున్నారు, వారెల్ల గురువుల స్మరణకుఁ దెచ్చు హరికథాకేసరులు. నారాయణదాసుగారు ఆఁడువారు మగవారు కలిసి గజ్జెకట్టు మరాఠీ హరికథా విధానమును మార్చి మనదేశపద్ధతిలోఁ గ్రొత్తమెఱుఁగులు కలిగించినారు. ఆయన త్యాగరాజువంటి భక్తుఁడు. సరిగా, త్యాగరాజు జయంతి నాఁడే దాసుగారు పరమపదము చేరుట మరచిపోరాని ఘట్టము. అదియటుండ, ఈయన జీవితము తిరుపతి వేంకటకవులజీవితముతోఁ గొంత పోలియుండుట మనము గమనింతుము. కవిత్వముపేరు చెప్పుకొని వారు ప్రతిసంస్థానము, ప్రతిగ్రామము చూచినారు. హరికథల పేరుచెప్పుకొని నారాయణదాసు చూడని సంస్థానము, చూడని పురము లేదు. చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రిగారికి నేఁడు కవిత్వము చెప్పువాఁడెల్ల శిష్యుఁడు. నారాయణదాసుగారికి నేఁడు గజ్జె కట్టినవాఁడెల్ల శిష్యుఁడు. ఈయిరువురికి సాక్షాచ్ఛిష్యులో, పరంపరా శిష్యులో, ఏకలవ్య శిష్యులో కానివారు తెనుఁగువారిలో నెందఱుందురు? చెళ్లపిళ్లకవిని స్మరింపక శతావధానము, నారాయణదాసును స్మరింపక హరికథ లే దన్నట్లుగా నున్నది. నారాయణదాసు పండితులలోఁ బండితుఁడు, కవులలోఁ గవి. గాయకులలో గాయకుఁడు. ఆయన నేఁటిసాధారణదాసులవలె మాటలు, పాటలు నోటఁబట్టుకొని చెప్ప వలసిన ప్రారబ్ధయోగము కలవాఁడు గాఁడు. ఆశువులో నప్పటి కప్పుడు చెప్పుటయే యాయన యలవాటు. పరవాదులతో భాషించు నపుడు, అంత నిర్భీతి, అంత స్వపక్షస్థాపనప్రీతి కలవారరుదుగానుందురు. నారాయణదాసు జీవితము మదపుటేనుఁగు మునుగడ. ఆ భోగ త్యాగములు వేఱొకనికి రాగుట కష్టము.

వీరు విజయనగరము మహారాజుగారి గానకళాశాలలో 1919 లోఁ బ్రథమాచార్యులుగాఁ బ్రవేశించి 1936 వరకు సక్రమముగా నిర్వహించిరి. నాఁడు అధ్యాపకులుగనున్న శ్రీ ద్వారము వేంకటస్వామినాయుఁడు గారు నేఁడు ప్రధానాచార్యులు. ఇవుడీ పయి సన్గొన్న విషయ మంతయు ఆదిభట్ట నారాయణదాసుగారి జీవితములో నొక కళాభాగము. ఇఁక నామహాకవి రచనా విశేషములు:-

అచ్చ తెలుఁగు పొలుపులు నారాయణదాసునకుఁ దెలిసినంతగా మరియొక యాధునిక కవికిఁగాని, ప్రాక్తన కవులయిన కూచిమంచి తిమ్మన, మున్నయినవారికిఁ గాని తెలియవని చెప్పివేయుటకుఁ దఱచుగా సాహసము కలుగుచుండును. అబ్బా! తెనుఁగుపై నెంత నిబ్బరపుఁ బ్రేముడిగల వ్యక్తి నారాయణదాసు ?

గీ. మొలక లేతదనము, తలిరులనవకంబు,
మొగ్గ సొగదనము, పూవు తావి,
తేనె తీయఁదనము తెనుఁగునకే గాక
పరుష సంస్కృతాఖ్య భాష కేది ?

సంస్కృతమునలో నీయన కవిత బహుమనోహరముగా నుండును. 'ఉమరుఖయ్యాము' సంస్కృతాంధ్రములలో ననువదించి "ఫిడ్జిరాల్డు" ఆంగ్లముతో, పారశీకమూలముతో వెలువరించిన వీరికృతి తెలుఁగు వాఙ్మయమునలో సుస్థిరముగా నిలఁబడునది. దాని తెనుగుపీఠికలోని యీభాగము పరికించుట యవసరము. ఈమహాకవి తెనుఁగువచనరచన పొంపుల కది మహోదాహరణము కాగలదు.

"... ఉమరుకయ్యా మల్లిన మాటపన్ని కంబట్టి యామేటి పాట కారి చదువరి వేల్పుల నెఱిఁగించుటకై పన్నిన గుడిబొమ్మలవలె వేల్పు నడ నెఱుకవగలవారి కుండఁదగిన తగులే పెట్టినీళ్ళనియు వేల్పునెత్తు ఱులవేఁడుకొను తలంపే యక్కలు ద్రావించుమిటారి యనియు చిన్న పెద్ద లిరువురకున్నూడ మిగుల గొప్పచవి పుట్టించును. కేయున నొకటి

చెప్పనదిం కొకటియున్నా లేనిపోని వాలకములఁ దాము వలచిన కూడు గూర్కులఁ దమతోటిపాటివారి నందఱం జెఱచియున్నా నొక్కరే హాయిగానుండఁగోరి పెద్దల నడువడికిఁగసింతయున్నాడదారి ద్రొక్కుమని గోటునఁదెగనీల్గుచుఁ బ్రాఁజదువులఁ బిక్కపెట్టి గ్రుడ్డెద్దు చేలఁబడునట్లు ఉవ్విళ్లూరుచు లోలోనఁ జెడుపను లెన్నెన్నో చేయునాలి యిచ్చు ఐగరుఁబోతుల పరువు బయలుపెట్టి తనతోటిపాటివారికి నుంచు వెరవు నేర్పుటయే యని నాచేత వెల్లడింపించు నాయిలువేల్పు ప్రొద్దుపోని యూడుచు నుమరు కయ్యాము పద్దియములకు విరివిగా నాయల్లిన యీ తెలుఁగుపద్దెముల న్నేల్పునుడి జోలినంతయును లేని నాటుపాటి మాటలతోడనే యిదివఱకే మాటలల్లువాని నూర్పు దొరకొనఁ దెగింపని పట్టుదల నొంటి పెద్దల నుడిపడికట్లొక్కింతయు దప్పకేరికైన నిట్టేపారసి నుడుల విరించు నాటుమాటలం బన్నినిక నలవికాని తెన్నునఁ గూర్పఁ గల్గితినని చాటుచు సతియు మొట్టమొదట వెగటుగాఁ దోఁచిన దిను సైనం జవి చూచినకొలంది నలవాటునై నింపుగాక మానదు నింక నోర్మిగల మంచి చదువరులకీ నాపన్నిక కొనముట్ట నా రసికులఁదిఁ జవిగొల్పక తీరదను నిండునమ్మిక నింతతో నీవ్రాఁత ముగించి నాఁడను......"

అచ్చతెనుఁగు రచన యింతస్వాధీనము చేసికొన, రచయితలు చాలఁ దక్కువగా నుందురు. వచనముకాక పద్యము కూడ హాయిగా సాగునట్లు నడపించు నేర్పు నారాయణదాసుగారితోఁ బుట్టినది. 'ఉమరు కైయాము' లోనివే కొన్ని సంస్కృతాంధ్ర పద్యోదాహరణము లీయకుండ నుండఁగూడదు.

గీ. నడికారునకు జ్జెలకు
నడుమ నలరు తోటలోన నా విడిదట సం
దడి లేదు కొద్దిగొప్పల
గోడవ మాట బ్రదుకు కోరుకొన్నటు కడచున్.

ఆ.వె. పట్టనీ పోటులు చట్ట సైఁదము రొట్టె
కోలుబుడ్డిలాలు కోవుమడ్డి
నేను నీవు చాటుగా నెసిన వేడ్క
దొరకుటెట్లు లెట్టిదొరలకైన.

చె. ఏటిరెయొడ్డునఁ జివురెత్తిన బీడు
వేలుపువడుచు మోవిన్నుబట్టె ననెదు
త్రొక్కఁ గూడదు కాలితో నిద్దిచెల్వ
చిన్నారి పొన్నారి చెక్కిలిసిగ్గు.

క. ఏరు న్నారన నేరక
యూరక యున్నార లెవ్వఁరో వల్కె నిటూ
రారా దూరకుఁడీతా
నారయ కావేల్పు గూడనై పొనరించున్.

శ్లో. భూతకాలః పరోక్షో౽స్తి, భావికార్య మనిశ్చితమ్
వృథా గతా నాగతయో శ్చర్చా పిబ పిబా పిబ
అసంబద్ధ శ్చేతనో౽యం జడప్రకృతితో సతః
స్వతంత్రస్య తథాప్యన్య వృథాకర్మ విధీయతే.
యావత్పిత్రృ గృహం గచ్ఛే త్స్వం శనైః ప్రాణవల్లభే
తావ దేవాను సృత్యాత్యాం సాయుజ్య పదవీ మియామ్.

ఈతీరుగల సంస్కృతాంధ్ర కవితలు సంతరించు నారాయణదాసు మహారచయితలలో రచయిత. వీరి "తారక" కావ్యము, పరికించి Gildner అను ప్రొఫెసరు Marburg నుండి పంపిన యీ యభిప్రాయము ప్రకటింపఁదగియున్నది.

జానాతే యన్న చంద్రార్కౌ జానతే యన్న యోగినః
జానీతే యన్న భర్గో౽పి తజ్జానాతి కవి స్స్వయమ్.
వచ స్సుధామయం కావ్యం పీత్వాహం తృప్తమానసః
కృతజ్ఞో౽భిప్రశంసామి భవంతం కవిశేఖరమ్.

దేశీయ స్వదేశీయ పండితులచే మెప్పులుగాంచిన నారాయణదాసు కవిత్వము తెనుఁగువాఙ్మయమున కొక మేలివెలుఁగు. ఆయన యాట పాటల వేవెలుఁగునెదుట కొన్నాళ్ళు కవిత్వము కాఁగడావలెఁ గాంతి హీనముగా నుండిపోయినది. ఇప్పు డది విద్యుద్దీపిక. ఆధునికకాలములో నచ్చతెనుఁగున కొక యుజ్జ్వలతనిచ్చు రచనకు నారాయణదాసుని యమృతభిక్షు. ఆమహాకవి సర్వభాషాప్రవేశమున కీసీసము సముదాహరణము.

—: పీ ఠి కా పు ర వ ర్ణ న ము :—

సంస్కృతము

భ్రాజతే కుక్కుటేశ్వర మాధవాలయాభ్యాం ఘనారూఢసౌధాంతరేణ

పార్శీ

హాసిల్ హామీాష జహాన్ తాజ్ నమూన బి హిమ్మత్తు నసా పిర్బి హి రిసాల

ఇంగ్లీషు

రావుసూర్యారావు రాజాబహద్దూర్ చారిటబిల్రూల్ప్రిజెంట్స్ ఎవ్రి

తెలుఁగు

చదువుల పుట్టిల్లు చల్వతెమ్మెరజల్లు మేల్నోళ్ళు పొగడిక మీఁరఁజెల్లు
మేటిపంటల టెంకి కల్మిమొదలంకి
బెస్టుటౌ ని న్గోడావరీ యీస్ట్ ది సీజె
మర్చు పీర్వ జవాన్ జవాల్ మీర్జనాన
పీఠికాపుర మేవ త్రివిష్టప మిహ.

కందుకూరి వీరేశలింగకవి

1848-1919

ఆఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. జన్మస్థానము: రాజమహేంద్రవరము. తల్లి పున్నమాంబ. తండ్రి సుబ్బారాయుఁడు. జననము: 16-4-1848. నిర్యాణము: 27-5-1919 (విరచిత గ్రంథముల సంఖ్య 130-ప్రబోధచంద్రోదయము, మాలతీమధుకరము, మాళవికాగ్నిమిత్రము, అభిజ్ఞానశాకుంతలము, రత్నావళి, హరిశ్చంద్ర నాటకము, సత్యరాజ పూర్వదేశయాత్రలు, వినీసువర్తకుని చరిత్ర, రాగమంజరి, రాజశేఖర చరిత్ర, నీతిచంద్రిక, ఆంధ్రకవుల చరిత్రము, స్వీయచరిత్రము ప్రహసనములు మొత్తము 58. ఇత్యాదులు. విపులచరిత్రమునకు వీరి స్వీయచరిత్ర (2 భాగములు) చదువుకొనవలయును.

వీరేశలింగంగారు తెలుఁగు వాఙ్మయమునఁ దొల్లి త్రొక్కని క్రొత్తదారు లన్నియుఁ ద్రొక్కి యాధునికాంధ్రవాఙ్మయమునకు మార్గదర్శి యనిపించుకొనినకవి. ఆయన రచించిన గ్రంథములు నూటయిరువదికిఁ బైగా నున్నవి. 'అయిగవవాచకము' మొదలుకొని 'ఆంధ్రకవుల చరిత్ర' వఱకు వ్రాసినారు. నవలలకు దారిచూపినారు. నాటకములు రచించినారు. కథలల్లినారు. వ్యాసములు వెలువరించినారు. ప్రహసనములు ప్రకటించినారు. గ్రంథవిమర్శలు సంధానించినారు. శాస్త్రగ్రంథములు సంతరించినారు. చారిత్రక కృతులు ప్రచురించినారు. వార్తాపత్రికలు సంపాదించినారు. విశేషమేమనఁగా నీ సారస్వతశాఖలకుఁ గొన్నిటికిఁ ద్రోవచూపినవారు, కొన్నిటికి రాచబాట వేసినవారు నైరి.

పందొమ్మిదవశతాబ్ది శేషార్ధమునుండి తెలుఁగున నొక క్రొత్తయుగ మారంభమైనది. దానికి గద్యయుగ మని సాధారణపుఁ బేరు పెట్టవచ్చును. అంతకుఁ బూర్వము వచనగ్రంథములు మిక్కిలి తక్కువ. చంపూపద్ధతిని పురాణములలో నక్కడక్కడ వచన ముపయోగింపఁబడినది. ప్రబంధములలో వచనము ఛందోనిర్బంధము లేనిపద్యములవలె

నడపించిరి. ఇంతియేకాని ఇతిశ్రీ గా గద్యము గలగ్రంథములు 17 వ శతాబ్దిలో మధురా పరిపాలకుడైన విజయరంగ చొక్కనాథుని కాలమునుండి కాని బయలు దేఱలేదు. మధురాంధ్ర వాఙ్మయములోఁ బుట్టిన వచనరచన లన్నియుఁ బౌరాణిక గాథాగ్రథితములు. పోనీ, కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయనాటకమును నంది మల్లయ్య, ఘంట సింగన కవులు ప్రబంధముగా మార్చిరిగాని నాటకము నాటకముగా నాంధ్రీకరింపలేదు. 'విద్ధసాలభంజిక'ను మంచనకవి 'కేయూరబాహుచరిత్ర' కావ్యముగా మార్చెను. ప్రాచీనాంధ్రకవులకు వచనములపై గల యుపేక్షాభావమున కిది నిదర్శనము. క్రొత్త తీరుగల చిన్నయసూరి 'నీతిచంద్రిక' తెలుఁగున మొట్టమొదటి వచనగ్రంథము. చిన్నయసూరి వేసిన వచన వాఙ్మయబీజమును వీరేశలింగము పంతులుగారు మొలపించి వెలయఁజేసిరి. వీరేశలింగముగారి రాజశేఖరచరిత్రకు గోపాలకృష్ణుని సెట్టి "రంగరాజుచరిత్ర" తోఁ బోలికలు గలవని యొకరు చూపించిరి. అగుఁగాక! తిక్కన కవిబ్రహ్మ యనునట్లు పంతులుగారు గద్యబ్రహ్మ. సూరి నీతిచంద్రిక తరువాత సుప్రసన్న భాషలో వీరేశలింగముగారు సంధివిగ్రహములు వ్రాసిరి. వీరిశైలి సుమధురము సులభమునై సర్వజనగ్రాహ్యముగా నుండును. సంధులచ్చటచ్చట సడలించినను రచనలో మాధుర్యము నణుమాత్రము తొలఁగించలేదు. అన్యదేశ్యములు కొన్నియుపయోగించినను నందము చెఱుపలేదు. ప్రజాసామాన్యమున కర్థము కావలయుననియు సంఘసంస్కార ప్రచారార్థమనియు వీరిశైలి తేలికపఱుచుకొనిరి. వీరి రాజశేఖరచరిత్రము, సత్యరాజా పూర్వదేశయాత్రలు ఆంగ్లేయరచనలకు ఛాయలైనను స్వతంత్రరచనములవలెనుండి నవలలకు దారిచూపినవి. వీరేశలింగము పంతులుగారు వచనములో నొకవిలక్షణత వెలయించిరి.

ఇఁక నాటకముల మాట. మోపెంచిన వో నివి యింతకుఁ బూర్వము తెలుఁగునలేవు. యక్షగానములుమాత్ర మున్నవి. కాళిదాసకృత

శాకుంతలము పంతులుగా రనువదించి 1883 లో నావిష్కరించిరి. అది మొదలు వేదము వేంకటరాయశాస్త్రి ప్రభృతులు పదిమందివఱకు నా నాటక మెవరిశక్తి కొలఁది వా రాంధ్రీకరించికొనిరి. వీరేశలింగముగారి ఆంధ్రశాకుంతలము రంగస్థలములకెక్కి యనేకులచే నభినందింపఁ బడినది.

చల్లనివై శ్రమం బడఁపఁజాలిన తామరపాకు వీవనల్
మెల్లన గొంచు వీచుదునొ మిక్కిలిశీతలమైన వాయువుల్
సల్లలితారుణాబ్జ సదృశంబగు నీచరణద్వయంబు నో
పల్లవపాణి! నాతొడలపై నిడి హాయిగఁ బట్టువాఁడనో ?
కొందలమందె డెందము శకుంతల తానిపు డేఁగుచుండ నయ్యో
క్రందుగ బాష్పరోధమునఁ గంఠమునుం జెడె, దృష్టిమాంద్యముం
బొందె నొకింత పెంచిన తపోధనులే యిటుకుంద నెంతగాఁ
గుందుదురో తమంతఁ గనకూఁతులఁ బాయు గృహస్థులక్కటా !

ఇత్యాదిపద్యములు తెలుఁగున మొదట వ్రాసినవి. శాకుంతల మేగాక ప్రబోధచంద్రోదయము, మాళవికాగ్నిమిత్రము, రత్నావళి మున్నగు నాటకముల నాంధ్రీకరించిరి. ఆంగ్లేయనాటకముల బట్టి చమత్కార రత్నావళి, కల్యాణ కల్పవల్లి, రాగమంజరి అను వానిని రచించిరి. ప్రహ్లాద దక్షిణగోగ్రహణాది పురాణనాటకములు వ్రాసిరి.

పంతులుగారు కృతికర్తలేకాక, ప్రాచీనమహాగ్రంథముల నెన్నిటినో ముద్రింపించిన భాషాపోషకులుకూడను. నాచనసోమనాథుని యుత్తర హరివంశము, అనంతుని భోజరాజీయము, చరిగొండధర్మన చిత్రభారతము, నందిమల్లయ, ఘంట సింగయకవుల వరాహపురాణము, నారాయణకవి పంచతంత్రము, కాకమాని మూర్తి పాంచాలీ పరిణయము, మొల్లరామాయణము మున్నగు కబ్బములకు వీరేశలింగముపంతులుగారే తొలుత నచ్చు వెలుఁగు చూపి పున్నెము గట్టుకొనిరి.

వీరేశలింగముగారికిఁ దొల్లి తెలుఁగులో ప్రహసనములులేవు. 'చంద్రరేఖావిలాపము' వంటి తిట్టుకవితలు మాత్రము గలవు. సంస్కృతమునఁ

జాలనున్నవి. (ప్రహసననిర్మాతలలో పంతులుగారే ప్రథములు.) "ఆచారము" అనుప్రహసనములో చేదస్తపుచెలమమ్మమాటలు కొన్నిమచ్చు:

"నీవు అదృష్టవంతురాలవు గనుక వొక్కమోస్తరుగా ఆచారం జరుపుకుంటున్నావు. నాకు నీలాగుజరుగదు అక్కడికి నేను రోజుకు రెండు వందలస్నానాలు చేస్తాను. ఈవేళ మట్టుకు ఇప్పటికి పదిస్నానాలు చేసినాను. తెల్లవారిలేచి దొడ్లోకివెళ్ళినప్పుడు కాలికింద యేమో మెత్తగా తగిలి అది యేమిగుడ్డో అని తలసిండా స్నానముచేసినాను. తరువాత మాకోడలు దగ్గరనుంచి వెళ్ళినప్పుడు పైటకొంగు తగిలినట్టుఅనుమానం కలిగి మళ్ళీస్నానము చేసినాను. గోదావరికి వెళ్ళి స్నానముచేసి బిందె ఎత్తుకొని వస్తూ ఒట్టలు వుతుకుక్కనే వాళ్ళ నీళ్ళుపడ్డట్టుతోచి మళ్ళీవెళ్ళి మునిగినాను. తీరా వడ్డుకు వచ్చేటప్పుడు నీళ్ళలో కాలికేదో ఆకుతగిలి అంటతిప్పళాలు తోమేవాళ్లు వేసిన అంటాకని నీళ్ళుపారపోసి వెళ్ళి మళ్ళీ స్నానం చేసినాను. తరువాత బిందెత్తుకొని సఘందూరం వచ్చేటప్పటికి ఇరవైగజాలదూరంలో మాలవాడు కనబడి నీళ్ళు నడివీధిలో పారపోసి వాణ్ణినాలుగు తిట్టి వాడిజీవానికి ఉసూరుమంటూ మళ్ళీ వెనుకకు గోదావరికి వెళ్ళి స్నానముచేసి నీళ్ళుతెచ్చుకున్నాను .... ఎన్నిస్నానాలయినవో లెక్కపెట్టినావా" ఈయన మొత్తము ౨౮ ప్రహసనములు కూర్చిరి. అందు పదునాల్గు పెద్దవి. (వీరి ప్రహసనభాష పొగసుగా నేయుండును. స్వాభావికత కొంతతక్కువ.)

(వీరు "తర్కసంగ్రహము" నకుఁ జక్కని తెనుఁగు వ్రాసిరి. జ్యోతిశ్శాస్త్రము—శారీరశాస్త్రము ననువదించిరి. ఆంగ్లేయభాషలోనుండు భౌతికశాస్త్రము లాంధ్రీకరించుత్రోవ పంతులుగారే చూపిరనవచ్చును.)

జీవితచరిత్రరచనమునకుఁ దెలుఁగున సూత్రము వేసినవారు వీరేశలింగముపంతులుగారే. వేమభూపాలీయ రఘునాథాభ్యుదయాదులు సంస్కృతములో వెలసినవి. వానిలోఁగవితకున్నంత ప్రాధాన్యము చరిత్ర

మునకు లేదు. ఆంధ్రమున రామరాజీయాదులు రెండుమూడు చారిత్రకకృతు లున్నవి. ఇవియు నట్టివే. ఆంగ్ల సంప్రదాయము ననుసరించి పంతులుగారు తొలుత విక్టోరియా మహారాజ్ఞి చరిత్రము, జీససుచరిత్రము తెలుగులో వెలయజేసిరి. అక్కడినుండి యనేకజీవితచరిత్రలు చిత్రింపబడినవి. "స్వీయచరిత్ర" రచనారంభము చేసినవారునువీరే. ఇది 1910 లో వెలువరింపబడినది. పంతులుగారి చిన్నతనమునుండియు గలచరిత్ర మిందు సమగ్రముగా వ్రాయబడినది. సూక్ష్మాంశములుకూడ విస్మరింపక వీరీచరిత్రము సంధానించిరి. ఇది వీరిమేధాబలమునకు బలకరమగు నిదర్శనము. ఈచరిత్రము చదువునప్పుడు సమకాలికులకు నాత్మస్తుతిగాను పరనిందగాను నున్నట్లు కొన్నిపట్టుల గోచరించును. ఈ విషయము మే పంతులుగారు తొలుతనే చెప్పుకొనిరి. ఈపంక్తు లరసిన వారి స్వభావస్వభావాదులు తెలియును.

"ఎక్కడ నేయక్రమము కనబడినను నాది సహించి యుండెడి స్వభావము కాదు అయుక్తమమునకు ప్రతిక్రియ జూచువఱకును నా మనస్సున కూఱట కలుగదు."

"ఈశ్వరుడు నాకు వేగముగా వ్రాయుశక్తిని ప్రసాదించియున్నాడు పద్యమునుగాని, వచనమునుగాని నేనొక సారియే వ్రాయుచుందును వ్రాసినదానిని మరలదిద్ది వ్రాయుట నాకలవాటులేదు. అందుచేత నావ్రాత దిద్ది దిద్ది మరల మరల వ్రాయుచుండువారి దానివలె నంతి మెఱుగుగా నుండదని కొందరను."

"ఏకసంధాగ్రాహి ధారణాశక్తులకంటె బుద్ధివిశేషము కొంతకలవాడ నగుటచేత నేనింటనుండి పాఠశాలకు బోవుచు నొకసారియో రెండు సారులో దారిలో భాగము చూచినంతమాత్రముననే నాకది ముఖస్థమై యప్పటికి దప్పకుండ నప్పగింపశక్తుడ నగుచుంటిని."

స్వాభావికముగా నమచరిత్రము తామే వ్రాసికొనుటచే నీప్రిమాటలు స్వాహంకారపూరితములుగా స్థూలదృష్టికి దట్టును. కాని, యథార్థ

మరసినచో వీరేశలింగకవి యట్టివాఁడే. అద్యతనాంధ్రవాఙ్మయములో ననేకనూతన మార్గములు వేసి శతాధికకృతులు రచియించి యఖండ కీర్తి నార్జించిన యీ కవివరుని యెడ ఏకసంధాగ్రాహిత్వాదిలక్షణము లుండుననుట స్వభావోక్తికి దవ్వుగాని మాట.

అచ్చతెనుఁగు కృతులు రచించుటలో వీరేశలింగకవిది గొప్పచాతుర్యము. ఈయన శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము ప్రసిద్ధమైనది. విశ్వేశ్వరీయములో కొక్కొండ వేంకటరత్నపండితుఁడు పంతులుగారి నిటులు కొండాడినాఁడు:

అచ్చతెనుఁగు కబ్బ మలవరించుట కూచి
మంచి తిమ్మనయును, మంచి తెలగ
నయును, లింగనయును నయమున స్వీయభా
షాభిమాన మాన్యు లని నుతింతు-

తిమ్మనార్యుఁడు, తెలగన్నలతో పాటు వీరేశలింగకవి కూడ అచ్చ తెనుఁగు కబ్బములు కూర్చుటలో దిట్ట.

ఇఁక కవిచరిత్రరచనము ప్రచురము చేసినవారును పంతులుగారే. శ్రీగురుజాడ శ్రీరామమూర్తిగారు ఆంగ్లేయుల ననుసరించి కొలుదొల్తఁ దెలుఁగున నాంధ్రకవిజీవితములు వ్రాసిరి. దానికనువాత వీరేశలింగకవి గారు "ఆంధ్రకవులచరిత్రము" మూఁడుభాగములుగా వ్రాసిరి. శ్రీ రామ మూర్తిగారి గ్రంథము కంటె నిది పెద్దగ్రంథము. దానికంటె వీనిలోఁ జారిత్రక చర్చ మిన్నగా నున్నది. కవికాలనిర్ణయాదులు లెస్సగ నిందుఁ గూర్చిరి. కవుల గ్రంథములలో గుణదోషవివరణము గావించిరి. ఈ గ్రంథము వీరేశలింగముగారి శక్తిసామర్థ్యములను జాలభాగము చూరకొనినది. వీరు కొందఱు కవులనుగూర్చి వ్రాసిన కాలనిర్ణయాదులకు నవీను లంగిరింపలేదు. ప్రథమ ప్రయత్నమున నిది యాక్షేపణీయము గాదు. పంతులుగారనంతమగు భాషాసేవచేసిన మహాశయులు. సంఘ

సంస్కరణప్రియులును. స్త్రీ పునర్వివాహకరణోద్యమమునకుఁ బరిపుష్టి గావించిరి. ఈవిషయమున వీరు పెద్దప్రచారము గావించిరి. కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారికిని వీరికి బహుకాలము వివాద మీవిషయమున సాఁగినది. ఇది యాంధ్రమునకుఁ బరిచితము.

వీరేశలింగముగారు పగలు సంస్కరణవిషయములలోఁ బనిచేసి రాత్రులు గ్రంథరచనము సాఁగించుచుండు నలవాటుకలవారు. పీనసరోగ పీడితులగుట రాత్రులు వీరికి నిద్రపట్టెడిదికాదు. 'కాడ్లివరునూనె' యాహారప్రాయముగా నుపయోగించుకొనుచు గ్రంథరచన చేయుచుండు వారు. ఈయనకలమునకు మొగమోటమి యనునది కలలోనైన లేదు. సంఘాచారములకు వ్యతిరేకమై పెద్దలకుఁ బ్రతిష్ఠాభంగము కలిగించి యీయన వ్రాఁత యభియోగముల కెక్కినది. కాని యీయన సత్యవాదిత విడువలేదు. చివరికాలమున నపనిందలఁ బాలయ్యెను. చెలికాండ్ర సహవాసము వీడవలసివచ్చెను. ధనవ్యయ మయ్యెను. ఆరోగ్యము చెడెను. ఎట్టి క్లిష్టపరిస్థితులు తటస్థించినను కర్మశూరత్వము సత్యవాదిత్వము విడువలేదు. ఈయన వాఙ్మాధుర్యముకంటె వ్రాఁతనేర్పు గొప్పది. వీరేశలింగంపంతులువంటి దీక్షాపరుఁడు, కర్మశూరుఁడు, ధైర్యవంతుఁడు, కార్యదక్షుఁడు, స్వార్థత్యాగి, స్వతంత్రుఁడును ఆంధ్ర మహారచయితలలో లేఁడు. ఉండఁడు.

త్రిపురాన తమ్మయదొర

1849 - 1890

తెలగావంశీయుఁడు. తల్లి: చిట్టమాంబ [చిట్టెమ్మ] తండ్రి: వేంకటస్వామిదొర. జన్మస్థానము, నివాసము: విశాఖమండలములో శ్రీకాకుళము తాలూకా సిద్ధాంతగ్రామము. జననము: 1849సం. సౌమ్య సంవత్సర శ్రావణశుద్ధ చతుర్దశీ గురువారము. నిర్యాణము: 1890 సం వికృతి సంవత్సర పుష్య శుద్ధ పూర్ణిమ. ముద్రితశతకములు: ౧. నీతిశతకము. ౨. పాండురంగాష్టోత్తరశతము. 3. కామినీ నిర్మోహజనన తారావళి. ౪. విటీవిట నటనార్థమాల. ౫. ముఖలింగేశ్వరశతకము. ౬. నిద్రావిజయము. ౭. శ్రీ దేవీ భాగవతమహాపురాణము (1883 విరచితము - అచ్చుపడలేదు.)

త్రిపురాన తమ్మయ దొరగారు మంచికవులుగాఁ బేరుగాంచి 'దేవీ భాగవతము' నాంధ్రీకరించినవారని తెలుఁగువారికి వేఱే తెలుపనవసరము లేదు. దేవీభాగవతము నిప్పటికి నలువురు తెలిఁగించిరనియు, నానాల్గిటిలోను మూఁడు ముద్రితములైనవనియు ననుకొని, తమ్మన్నకవిగారిది మాత్ర మచ్చుపడవలయునని మనము కోరుకొనుచుందుము. మనకోరిక సమకూరుగాక !

తమ్మయ్యకవిగారు తెలగదొరలు. దంతపుండా మాలుకుదారులు. సిరికిఁ దగినయీవి. ఈవికిఁ దగ్గ పాత్రవివేకము. కవులను సంభావించిరి. పండితులను గౌరవించిరి. బీదసాదుల నాదరించిరి. ఉర్లాము జమీందారులు శ్రీ కందుకూరు బసవరాజుగారు ప్రతిశ్రావణికి వేదశాస్త్రపండితుల నాహ్వానించి, పరీక్షచేయించి వర్షాశనము లొసంగుచుండువారు. అక్కడకు వచ్చిన పండితులెల్ల నిక్కడ తమ్మయదొరగారినిఁగూడ దరిసించి సత్కారములంది పోవుచుండువారు. వీరివంటి కవులుగాదు, పండితులుగాదు, వీరిగౌరవము నొందనివారు లేరని చెప్పుకొందురు. శ్రీ ముక్కపిల్లి సాంబయ

శాస్త్రిగారు వీరి యాస్థానకవులు. ఆయన సంస్కృతాంధ్రములలో నిరూఢపాండితి యుండి యుభయభాషాకవితలయందు నేర్పుగలకవులు. వీరి 'జానకీశ్వరశతక' మొకటి ప్రకటితము. ఇట్టిపండితుని తనసంస్థానమున నుంచుకొని తమ్మయకవి పోషించెను. కళాప్రపూర్ణులని విశ్వవిద్యాలయమువారిచే నెన్నఁబడిన త్రిపురాన వేంకట సూర్యప్రసాదరాయకవి తమ్మయదొరగారి కుమారరత్న మేనుఁడీ! బాణభట్టుఁడు, తత్పుత్రుఁడు భూషణభట్టువలె నీతండ్రి కొడుకులిరువురు పండితులును, కవులు నగుట మెచ్చుకొనఁదగినది. తమ్మయదొర కడు ధన్యుఁడు. దేవీ భాగవతుఁడై పోతరాజు 'భాగవతకవిత' నారాధించుచు 'దేవీభాగవతము' తా నాంధ్రమున రచించినాఁడు. శ్రీ సూర్య ప్రసాదరాయకవి తండ్రినిఁ గూర్చి యిటులువ్రాసెను.

ఉ. భాగవతోత్తముండనఁగఁ బ్రస్తుతికెక్కెఁ జతుర్థ్వారిద్దరీ
భాగవదాతకీర్తియయి భాసిలె శక్తి కథాసుధాధ్యమా
భాగవతంబుఁ దాఁ దెలుఁగుబాస రచించెఁదగంగ నమ్మహా
భాగవరేణ్యు నెన్నఁగను బన్నగనాథున కైన శక్యమే!

"నిర్వచన కుమారసంభవము"

అదియుఁగాక తమ్మయదొరగారి కుమారుఁడు ప్రసాదరాయకవి తండ్రిగారిస్వర్గతికి వగచుచు "మృతజీవి జీవితామృతము" అను పేరితో రచించినకృతిలోని పద్యములు చదువవలసినవి. మూఁడు పద్యములు మాత్రము ప్రచురించెదను.

మ. నిను మూఁడేఁడులప్రాయమందె విడిచెన్ నీతండ్రి, నీవంతకుం
జిననాట న్ననుఁ బాసిపోయితి విదే చిత్రంబు నీయట్ల నే
మనునయ్యో! పితృసౌఖ్యముంబడయఁగానోఁచన్, బితంబాయునం
దను కల్మిల్ వృథగావె తమ్మయవిభూ! తండ్రీ! కవిగ్రామణీ!

మ. అవసానంబున దారపుత్రికల డాయంబిల్చి నాకోన మీా
రు వగం బొందకుఁ డీకులాంకురము పేరుం బెంపునుం బొంది ప్రా
పవు మీా కంచును నప్పగించితఁట మాయక్కయ్యకున్నన్ను నెం
త విశేషజ్ఞుఁడవయ్య తమ్మయవిభూ! తండ్రీ! కవిగ్రామణీ!

మ. పదుమూఁడేఁడుల ప్రాయమందు కవితాప్రావీణ్యముం జూపి న
ల్వది రెండేఁడులు మాత్రమే బ్రదికియున్ భాస్వద్యశోవల్లి క
ష్టదిశల్ ప్రాఁకులు సేసి సారపు నివేశస్థాయివై సల్పి త
త్పదముం జేరితి వౌర తమ్మయవిభూ! తండ్రీ! కవిగ్రామణీ!

తమ్మయకవి దేవీభాగవతరచనకు సరిగా స్వభాను సంవత్సర చైత్ర శుద్ధ ప్రతిపత్తు [1883 - ఏప్రియల్ 8 తేదీ] నాఁడు శ్రీకారము చుట్టి, రెండుమూఁడేండ్లలో సమాప్తిగావించి రని తెలియుచున్నది. ఈ రచన మయినపిమ్మటఁ దమ్మయకవి మూఁడునాలుగేండ్ల కంటె నెక్కువ కాలము బ్రదికియుండలేదు. ఆయన నిర్యాణము 1890 లో. జీవితము పూర్వార్ధమున నేవో కొన్ని శతకములు, కొన్ని చిన్నకృతులు రచించి పరిపాక దశలో భాగవతము ప్రారంభించిరి. ఆసంగతి మనకుఁ గవిత్వము లోనే పొడకట్టుచున్నది. "గడియలోన నొక్కకావ్యంబు రచియించు భూరితర కవిత్వధార గలఁడు" అని వీరినిగూర్చిచేసిన ప్రశంస సుప్రశంస. కాకున్న ౧౧వేల గ్రంథము రెండేండ్లలో నెట్టులువ్రాయుదురు! శ్రీ దాసు శ్రీరామకవిగారు 'దేవిభాగవతము' ను నాలుగునెలలలో వ్రాసి రఁట. పట్టుదల వచ్చినపు డట్టులు రచించువారిని మనము చాలమంది నెఱుఁగుదుము. తమ్మయకవిగా రాశుగతిని రచించినను వీరి దేవీభాగ వతము సుందరతరముగా సాగినది. పూర్వకవులు తిక్కనాదులకువలెనే వీరికిని కృతిరచనారంభమునఁగలవచ్చినది. కలలో శ్రీరంగపతి సన్నిధి చేసి నా కంకితముగా దేవీభాగవతముఁ దెలిఁగింపుమనెనఁట. యథార్థ ముగఁ దమ్మయదొర యపట్టిరామభక్తుఁడు. ఆయన కృతులెల్ల భగవ

దర్పితములే. తమ్మయరాట్కవీంద్రుని భాగవతకవితలోని కమ్మదనము చూరలిచ్చుట కీపద్యము లుదాహరణముగ నిచ్చుచున్నాఁడను.

క. కాలము గడచుట నైజం
బేలీలలనైనఁ గడచు హీనులకు, సము
ద్వేల వ్యసనమ్ముల, గుణ
శాలురకున్ హరికథా ప్రసంగవశమునన్.

సీ. దేవీపద ధ్యాన దినకర ప్రభలచే
ఘోరసంసారాంధ కారము లణఁగు
దేవీపదాబ్జ సంసేవానిలంబుచేఁ
దాపత్రయ మహాంబుదమ్ము లణఁగు
దేవీ వివిధ నామధేయ స్తవాగ్నిచేఁ
గలుష శుష్కాటవ్య గణము లణఁగు
దేవీనమస్కార దివ్యౌషధమ్ముచేఁ
బ్రబలేంద్రియరోగ శాపమ్ము లణఁగు

గీ. భక్తజన పరిరక్షణాసక్త యగుచు
దేవి సర్వోత్తమస్థితిఁ దేజరిల్లు
సత్య మిది నిగమాగమ సమ్మతమ్ము
శౌనకమునీంద్ర! నీ కేల సందియమ్ము.

[వ్యాసకృతశివపశ్చార్ధ్య — శుకోత్పత్తి]

శా. కన్యన్ నవ్యపయోవిలాస రతిశాకారాంగ రంగత్కళా
ధన్యన్ సత్కుల సంభవానుచరిత్ర స్ఫీత సౌజన్య స
మాన్యన్ దుష్కృతవంధ్యగోపధికథామాత్సర్యరోగక్రుధా
శూన్యన్ బొందినఁ బొందవచ్చును, దనూజున్ నా కదెట్లబ్బెడున్.

ఉ. అబ్బురమౌగాక ! బంధనము లైన లతాంగుల పొందు మేలె ? యు
బ్బుబ్బ! జగంబునం బురుషుఁ డన్నదహా స్థితిఁ గాలిసంకెలల్
గుబ్బెత లెంచిచూడ నిది గూఢపు సంసృతిఁ గూడి చిక్కఁడే
గిబ్బపటాణి కౌతు కముకించి సతీతనుపాశ బద్ధుఁడై.

[మింటఁ దోఁచిన ఘృతాచిం జూచి]

సీ. కాదంబినియొ కైశికము మోలుంగఁ గాదు
ద్విజరాజొ వదనమో తెలియరాదు
కనకాంబుజమ్ములో కరములో గనరాదు
తారలో నఖములో తలఁపరాదు
స్వర్ణదీ వీచులో వళులో పలుకరాదు
గగనమో మధ్యమో గాంచరాదు
చక్రవాకములో కుచములో యరయరాదు
మెఱుపో, మేనొ యేరుపఱుపరాదు

గీ. నన్ను వంచింపవచ్చిన నవ్యదివ్య
కామమోహన దేవతాకార మిదియొ.
నిక్కమౌని మాని లోలోన స్రుక్కి నిక్కి
మాటలనవచ్చు, నచ్చునే మనసు నిలుప ?

ఉ. చన్నుల పెంపు, పాద జలజమ్ముల కెంపు, మనోహరమ్ములౌ
కన్నులసొంపు, మైయగరు కంపు, [illegible] వంపు, శ్రోణులన్
తిన్నల నింపు, నెన్నడల తీరు సెజంపు, నఖాళి తెంపు, పత్
త్రోన్నతియింపు, ముంగురులగుంపు [illegible] వరింప కెట్లగున్.

[ప్రథమస్కంధము]

వావిలాల వాసుదేవశాస్త్రి

1851 -1897

తెలగాణ్య శాఖీయ బ్రాహ్మణులు. ఆపస్తంబసూత్రులు. హారితస గోత్రులు. కాఁపురము రాజమహేంద్రవరము. జననము కారుమూరు (తెనాలితాలూకా) తండ్రి. అప్పయ్య. జననవత్సరము 1851. నిర్యాణము 1897. రచనలు: ౧. ఆరోగ్యసర్వస్వము ౨. గరుడాచలము ౩. నందకరాజ్యము ౪. మృచ్ఛకటికము ౫. ఉత్తరరామచరిత్రము ౬. మాతృస్వరూపస్మృతి ౭. ఆంధ్రరఘువంశము ౮. జూలియసుసీజరు ౯. ముముక్షుతారకము మున్నగునవి.

రాజమహేంద్రవరమునఁ బ్రకృత కవిత్రయ మనఁబడిన వారిలో వాసుదేవశాస్త్రిగా రొకరు. తక్కుఁగల యిర్వురలో వడ్డాది సుబ్బారాయుఁడుగా రొకరు. వేఱొకరు వీరేశలింగము పంతులుగారు. కవితా విషయమునఁ గాంచినచో నీమువ్వురకును జాలభేదమున్నది. కొక్కొండ వేంకటరత్నశర్మ, ఆకొండి వ్యాసమూర్తిశాస్త్రి, వాసుదేవశాస్త్రిగారలు కవులలో నొకశ్రేణికి సంబంధించినవారు. ఈ మువ్వుర రచనలలోను నొక ప్రత్యేక విలక్షణత యుండును. వీరిలో నొకరు బహుగ్రంథకర్తలగు మహామహోపాధ్యాయులు. ఒకరు భారతాంధ్రీకర్తలగు నాంధ్రవ్యాసులు. ఒకరు దృశ్య శ్రవ్య కావ్య రచయితలుగా విఖ్యాతులు. ఈమువ్వుర రచనలలోఁగూడ నించించుక భేద మున్నను, మొత్తము మీఁద నొకరకపు కవిశ్రేణికిఁ జెందినవారుగాఁ దోఁచెదరు.

వాసుదేవశాస్త్రిగారు విద్వద్వంశీయులు. ఈయనప్రపితామహుఁడు వెంకటశివావధాని వాసిరెడ్డివారి సంస్థానమునఁ బండితుఁడు. మన శాస్త్రిగారు బందరునోబిలు కళాశాలా పండితులైన కోరాడ రామచంద్రశాస్త్రిగారికడ సంస్కృత విద్యాభ్యాసము గావించెను. అదిగాక,

రాజ మహేంద్రవర కళాశాలలోఁ జదివి 1872 లో బి. ఏ పట్టభద్రు లయిరి. ఆయేఁడు "మాక్డోనాల్డు" బంగారుపతకము వీరికి లభించినది. 1874 మొదలు 1896 వఱకు రాజమహేంద్రవరమున ప్రభుత్వకళా శాలాంగ్ల సహాయోపాధ్యాయపదవి నలంకరించిరి. తరువాతఁ బాఠ శాలా సహాయపరీక్షకులుగాఁ గూడ నుండిరి.

వాసుదేవశాస్త్రిగారు పేరుగొన్న రచయిత. ఆంగ్లనాటకము లాంధ్రీ కరించుటలోను, శ్రోత్రియితివృత్తములో స్వతంత్ర నాటకములు సంఘ టించుటలోను శాస్త్రిగారికిఁ బ్రాథమ్య మీయవలెను. జూలియస్ సీజరు. 'సీజరుచరిత్ర' మనుపేర వీరాంధ్రీకరించిరి. వీరి 'నందకరాజ్య' నాటకమంతయుఁ దేటగీతములోనే సాగినది. యీపద్యమరయుఁడు.

తేట గీత మండె దీనిని వ్రాయంగ
మంచి దంచుఁ దోఁచె మదిని నాకు
సాయ మిండి నాకు సదయత బుధులార!
వావిలాల వాసు దేవ శాస్త్రి.

కథా సరణియందు, పాత్రలపేరులయందు మాఱుపు చేయలేదు. ఈ యాదర్శమే వీరేశలింగము పంతులుగారి వెనీసువర్తక చరిత్రాదులను వెలయింపఁ జేసినది. 'నందకరాజ్యము' స్వతంత్రాంధ్రనాటకములలో మొదటిదిగాఁ బరిగణింపవలయును. దీని ప్రచురణము 1880 లో. దాని పీఠికలో నిట్లున్నది :

"...ఇది నేను వ్రాయుటకుఁ గల్గిన ముఖ్యోద్దేశము మనవారిలో, అందులో బ్రాహ్మణులలో బహుతరముగాఁ గాన్పించునట్టి యైకమత్య మును సర్వవిధంబుల స్వీకరించి దానివల్ల మనమెల్ల మేలువడయఁ గోర వలయునని యొఱింగించుటె గాని మఱియొకటి కాదని స్పష్టముగాఁ జెప్పు చున్నాఁడను. ఈసంగతినే పొడి మాటలతోఁ దెలియఁజేయక కథ యొకటి కల్పించి యందులోఁ బరస్పరవైరములు పెంచినవారు శిక్షింపఁ

బడినట్లు కూర్చుట మంచిదని యెంచి యిట్టి నాయభిప్రాయంబునె మన వారెల్లరు గ్రహింతు రని తలంచి నాటక ధోరణిని వ్రాసితిని...."

గీతనాటకములకీ సందర్భౌజ్జ్వల్యము ముంగలిది. పూర్వపుగ్రామ్య వ్యవహారము లిందు సుందరతరముగా నభివర్ణితములు. పదప్రయోగమున నంత ప్రౌఢిమ పొడసూపదు గాని, స్వాభావికత పెద్దగానున్నది.

వైదికులపక్షమున రామదీక్షితులమాటలు :—

భూవు సంపత్తికిసి వారె మూలబలము
కావునన వైదికులకు భూకాంతులు మును
పెక్కులుగ జీవనములు కల్పించినారు
బహుదినంబులు పోc గుటుంబములు పెరిcగి
వటికొ పాతికొ చిక్కె మావారు సగము
తగ్గి జీవించు చుండిరి దాన దాన
కాని యేలొ, యిటీవల హానివచ్చె.

రాజకీయోద్యోగుల పక్షమున శరభోజి పలుకులు :—

"ఇప్పుడీ దీక్షితులు విప్పిచెప్పినట్లు
వైదికులపైని మాకేమి వైరమేమి?
మేము వారును నొక్కటై మెలcగc గన్న
నైకమత్య ఫలంబుల ననుభవింపc
గాను, మా సరివా రెందుc గానరారు.
అయిన నావేడ్క మా కింక నబ్బ దయ్యె;
స్వామి కార్య నిర్వహణము జగడమునకు
మూల మయ్యెను, నిజముగా భూపవర్య!"

శాస్త్రిగారు 1874 లో ముముక్షుతారక మనుపేర భజగోవిందశ్లోకము లనువదించిరి. 1875 లో 'బ్రాహ్మణీయము' ప్రబంధము రచించిరి. ఇది యముద్రితము. వీ రనువదించిన 'మృచ్ఛ కటికము' మనోహర

మైనది. అటుపిమ్మట తిరుపతివేంకట కవులు కూడ దాని ననువదించిరి. వాసుదేవశాస్త్రిగారి ఉత్తరరామచరిత్రాంధ్రీకృతి 1883 లో వెలువడినది. వీరి తెలుఁగుసేత దాని ననేకు లనువదించిరి.

వీరి 'మృచ్ఛకటికము' తెనిఁగింపు మచ్చు:

తోడీఁ బండకుండఁగా జనము త్రోవల నిల్చిన మింటిదీపమై
పోడమి శశాంకుఁ డల్లడుగో బోటుల చెక్కులవోలె వెల్లనై
యుడుగణ మాశ్రయింప నిగు లుచ్చిపడన్ వెదచల్లె వెన్నెలన్
వడిలిన పంకమందుఁ బయిపైఁ బడుచుండెడు పాలధారగా."

"అద్వైతం సుఖదుఃఖయో రనుగత" మిత్యాదికమగు ఉత్తరరామచరితగతశ్లోకమునకు వాసుదేవశాస్త్రిగారి తెనుఁగు పరివర్తనమిపుఁడిదిరు:

ఎవ్వనికైన జన్మముఁ గ హృచ్ఛ్రియ లేక సుఖాసుఖంబుల
న్నవ్వుచు నొవ్వకే చెలువున న్సహితంబును రాగలబ్ధితో
జవ్వనమూడి వార్ధకము సాఁగఁగ స్నేహము మెండుకొన్నఁ దా
మవ్వపుఁ గోర్కె నట్టి యతిమానుష శాలికి సుంగళంబగున్!

వీరి 'రఘువంశము' గ్రిగ్గుదొరగారికి గురుతుగా నర్పింపఁబడినది. చిత్రమయిన యీపద్యము చదువుఁడు. "ఖ్యాతమతి బోధ్య సూతి విశిష్టభూతి, సకలవిద్యాధికారి ప్రశస్తసూరి, ఆశ్రితావనశక్తి రాజాదృతోక్తి, లగ్గు పుడుకంగలారు శ్రీగ్రిగ్గుగారు." వీరివ్యుత్పత్తి భారములో రచనాసౌలభ్యము కొంత మఱుఁగున నుండును. ఎన్నో పద్యము లిందుల కుదాహరణములు చూడవలయును. రఘువంశమును దొరగారి కంకితము నిచ్చుట యీగీతమాలలో నిటుల సమర్థింపఁబడినది.

కృతుల కొప్పిరి శ్రీశిష్టు కృష్ణమూర్తి
లక్ష్మణకవులు గౌరన సూక్ష్మబుద్ధి
కందుకూరి వడ్డాది నిగమ సుసర్ల

పాలెపు త్రిపురాన పన్నాల వ్రాండ్ల
వారణాసి చిలంబు దుర్భ నిడమర్తి
వంద్రి సత్యవోల్ కల్లూరి బయపునేడి
జగతి శైల నాదెళ్ళ గుండు గురుజాడ
మాడభూషి కొకొ్కండ వంశప్రణేయు
లోగిరాల జగన్నాథ నాగయాది
బుధులు నరదేవతాంకితములుగఁ జేసి

ఈమాలికలో సమకాలికుల ప్రసక్తి లెస్సగాఁ బొందికగా ముచ్చటింపఁ బడినది. రాజమహేంద్రవర రాజకీయ సర్వకళాశాలాధ్యాపకాస్య తముఁడు, సంస్కృత ప్రాకృత హూణభాషాసామ్య వైషమ్యబోద్ధయు, శాస్త్ర బ్రహ్మచార్యపథా శుద్ధతా ప్త సువర్ణ శాననుండు, కతిపయ రూపకప్రణేతయు నగు వాసుదేవశాస్త్రిగారు ధన్యులు. ఎవరో చమత్కరించి నటులు వీరిపేరు ఆటపెలఁదిలో నిముడును. "నందకరాజ్య" మందలి యీాక్రింది సీసము శాస్త్రులుగారి జీవితసర్వస్వ సంగ్రహమునకు నిలువుటద్దము.

తొల్లి విరోధికృత్తున జ్యేష్ఠ శుక్ల ద్వితీయాదివాకరతిథికి సరిగ నాన, వేయి యెనిమిదగు నూటయేఁబది యొకటవ యేఁటి జూనొకటి నాఁడు పుట్టి కార్యూరిలో మట్టమువారింట మేనమామల కొర్కెమీాఁద నట్లు చేవేంద్ర కృష్ణమ్మ శేషాచలముగార్ల యొద్దను బడిచదు వానరఁ జదివి మేనత్త పెదకొడుకైనట్టి యారామలింగ శాస్త్రులవారి చెంగటను బసందుగాఁ గాళిదానత్రయ మేమొ పఠించి యుప్పుకవియ మెంచి నేర్చి కామ్మూరు, గుంటూరు పేర్లితో నింగ్లీషు చదవి, ఒందరఁ గొద్దిశాలఁ జదివి నోబిలుస్కూలులోను బ్రవేశపుఁబరీక్ష ప్రథమశాస్త్ర పరీక్ష వఱకుఁ దేలి యచట వేదుల వేంకటాచార్య వర్యుల సన్నిధిలో నాంధ

సంస్కృతముల జాడలు మఱుఁగులు చక్కఁగా వినఁగల్గి మేరలేని కృతజ్ఞ భారమొంది రాజమహేంద్రవరము వచ్చి స్కూలులో మేష్టరీ హోదాను మేలుపొందిన సర్వేశుకరుణ శాస్త్రబ్రహ్మచారినై కాలేజి మేష్టరీ గ్రాలుచున్న నేను, నా కుపకర్తలైన మహానుభావుల పేళ్ళు సతముగా భువిని వెలుఁగ,

వారి కీయపూర్వ పక్కిక పుస్తంబు
నన్నుఁ బెంచి విద్య నాకుఁ జెప్పి
నట్టి దయకుఁ గృతిగఁ బట్టి యిచ్చెద నిదె
వావిలాల వాసు దేవ శాస్త్రి.

తిథి 1 - 4 - 1880 సం॥

గురుజాడ శ్రీరామమూర్తి

1851-1899

నియోగిశాఖీయ బ్రాహ్మణులు. తండ్రి : దుర్గప్రసాదరావు. నివాసము కాకినాడ, విజయనగరము. జననము 1651. నిధనము 1899. గ్రంథములు : ౧. చిత్రరత్నాకరము ౨. కళాపూర్ణోదయ కథాసంగ్రహము ౩. కవిజీతములు ౪ కలభాషిణి ౫. తెనాలిరామకృష్ణునికథలు ౬. అప్పయదీక్షితచారిత్రము ౭. తిమ్మరుసుచారిత్రము – ఇత్యాదులు. 'రాజయోగి' పత్రికా సంపాదకత్వము.

గురుజాడ శ్రీరామమూర్తిగారికిఁ బూర్వము తెనుఁగునఁ గవిచరిత్రములులేవు. వీ రాంగ్లవిద్యాధికులు గానఁ బాశ్చాత్య విద్వాంసులు రచించిన కవిజీవితములు చూచి యట్టిది యాంధ్రమున సంధానించిరి. ఆంధ్ర కవిజీవితములు కథాప్రధాన మయినగ్రంథము. అందు కవి కాలనిర్ణయాదుల కంటె నా యాకవులపైఁ జెప్పఁబోను పుక్కిటిపురాణము లెక్కువ. చారిత్రకదృష్టితోఁ బరిశీలించిన నీగ్రంథమునకుఁ బ్రథమస్థానము లేకున్నను గవిచారిత్రములకిది మార్గదర్శి యనవలయును. కందుకూరి వీరేశలింగము పంతులుగారు తమ 'కవులచరిత్ర' లో మఱుఁగున నున్నకవులను బెక్కుమందిని బయటఁ బెట్టి వారివారి కాల నిర్ణయములు సప్రమాణముగా నొనరించి తత్తద్గ్రంథములలోని గుణదోషములు వెల్లడించిరి. ఆకారణమున వీరి కవిజీవితములకంటె, వారి కవిచరిత్రములకుఁ బెద్దపేరువచ్చినది. 1880 లో కవి జీవితరచనము వీరిది సాగినది. రామమూర్తిపంతులుగారి పీఠికలోని కొన్నిమాటలు పఠింపఁ దగినవి.

"...కందుకూరి వీరేశలింగముగారు తమమిత్రు లెవ్వరో తమ్ము గవిచరిత్రములు తిరుగ రచియించుటకుఁ బ్రేరేపించినారని కవిచారిత్రములను పేరితో నొకగ్రంథము ప్రాచీనకవులం గూర్చిన భాగమును ముద్రించి ప్రకటించిరి. అందు పెక్కండ్రు కవుల పేళ్ళును వారి చారిత్రములును

వ్రాసినట్లున్నను జాలభాగ మిదివఱలో నాచేఁ బ్రకటింపఁబడిన కవి జీవితముల యర్థ సంగ్రహామే కాని వేఱుకాదు. ఏవిధమైన నొకటిరెండు కథలు నవీనముగాఁ గాన్పించుటకుఁ జేర్పఁబడినను నవి యనవసరమైన చారిత్రములుగానైనను లేక ప్రత్యేకము కవిత్వ శైలిం జూపుటకు వ్రాయఁ బడిన పద్యములు నుదహరణములుగా నైన నుండును...."

ఇదియటుండె, రామమూర్తి పంతులుగారిది సువర్ణవిగ్రహము. విగ్రహమునకుఁ షడ్గుణసంపత్తి. ఈయన 'మెట్రిక్యులేషన్' పరీక్షలో నుత్తీర్ణులు. పూర్వపు 'మెట్రిక్యులేషన్' నేఁటి ఎమ్. ఏ లకు సమానము. వీరు కాకినాడ సబ్ కోర్టులో నుద్యోగించుచు రాజీనామానిచ్చి 1830 లో విజయనగర సంస్థానాధీశ్వరులు ఆనందగజపతి సన్నిధిని నిలయవిద్వాంసుఁడుగానుండెను. ఆప్రభువున కీకవియెడలఁ జెప్పలేని యాదరము. ఆనందగజపతి నిర్యాణము 1897 లో. ఆతరువాత రామమూర్తిగారిని సంస్థానము పోషించినది. వీరి కవిజీవితములు ఆనందగజపతి పేరుగా వెలసి యున్నవి.

ఈయన చరిత్రపరిశీలకుఁడే గాక కవి కూడను. 'మర్చంటు ఆఫ్ వినీస్' నాటకమును బరివర్తించిరి. ఓగిరాల జగన్నాథ కవిగారి యచ్చ తెనుఁగునిఘంటువగు "ఆంధ్రపదపారిజాతము"ను గొన్నిపదములందుఁ జేర్చికూర్చి వీరచ్చుకొట్టించిరి. తిమ్మరుసు, బెండపూడి అన్నమంత్రి, అప్పయదీక్షితులు ఈమూవురు మహామహుల చరిత్రములు సంపాదించిరి. తెలుఁగువారి కందిచ్చిరి. మొత్తము, వీరికిఁ జరిత్రసంధానముపై మక్కువమెక్కువ. వీరు కాకినాడ నుండి వెలువరించిన 'రాజయోగి' పత్రిక, నాఁడు పేరుగాంచినది. విజయనగరము ప్రాంతములో వీరికి "కాకినాడ పంతు" లని పేరు. శ్రీరామమూర్తిగారి 'కవిజీవితములు' చరిత్రలో నొక కనక ఘట్టము.

వేదము వేంకటరాయశాస్త్రి
1853 - 1929

పుదూరు ద్రావిడబ్రాహ్మణులు. తల్లి: లక్ష్మమ్మ. తండ్రి: వేంకట రమణశాస్త్రి. పుట్టుక మదరాసులో. పూర్వులజన్మస్థానము నెల్లూరు జిల్లా కావలితాలూకాలోని మల్లయపాలెము. జననము 1853 డిసెంబరు 21 తేదీ. (ప్రమాదీచ సంవత్సర మార్గశీర్ష బహుళ ౬ బుధవారము. నిర్యాణము. 1929 జూన్ 18 తేది ఉదయము 5–45 ని. కు) రచిత గ్రంథములు : ప్రక్రియాఛందస్సు, అలంకారసారసంగ్రహము 1886- ఆంధ్రకథాసరిత్సాగరము 1891 - నాగానందము 1891 - ఆంధ్రాభిజ్ఞానశాకుంతలము 1896- ప్రతాపరుద్రీయ నాటకము 1897- ఆంధ్రప్రసన్నరాఘవ నాటక విమర్శనము 1898 - ఉషానాటకము 1901 - బొబ్బిలియుద్ధనాటకము 1916- మాళవికాగ్నిమిత్రము 1919- ఉత్తరరామచరిత్రాంధ్రీకరణము 1920- విక్రమోర్వశీయ, రత్నావళి, సాహిత్యదర్పణాంధ్రీకరణములు 1921- శారదా కాంచిక శృంగారనైషధము సర్వంకషవ్యాఖ్య 1913-ఆముక్తమాల్యదవ్యాఖ్య 1920- రఘువంశము, కుమారసంభవము, అమరుకావ్యము, విజయవిలాసము, సారంగధర, కావ్యాలంకారచూడామణి మున్నగునవి టీకలతో-1910 లో వెలువరించిరి. 'జనవినోదినీ' పత్రిక ప్రకటించిరి.

"కవి పండితుఁడు కాఁడు. పండితుఁడు కవి కాఁడు" అని కొందఱి వాదము. కాళిదాసుఁడు కవికులతిలకము. అతని పాండిత్యము భువనవిదితము. భవభూతి మహాకవి. అతఁడు పదవాక్య ప్రమాణజ్ఞానమునఁ బేరు మోసినవాఁడు. కవి పండితుఁడు కాఁడనుటలో సొగసులేదు.

వేదము వేంకటరాయశాస్త్రిగారు మహోపాధ్యాయులు. సర్వతంత్ర స్వతంత్రులు. కళాప్రపూర్ణులు. వ్యాఖ్యానమల్లినాథులు. వీరు వ్రాసిన పద్యకావ్యములు లేవుగాని కాళిదాస భవభూతులవలె వీరును మూఁడు నాటకములు రచించిరి. ఇవి మూఁడును మూఁడురత్నములు. వానిలో ప్రతాపరుద్రీయము సువర్ణరత్నము. ఉష, బొబ్బిలినాటకములు రమ్యములై

రంగస్థలముల కెక్కి కీర్తిగనినవి. ఈనాటకములు మూఁడిటికిని పాత్రౌచిత్యపోషణము పెద్దవన్నె దెచ్చినది. మహానుభావముగల వేంకటరాయశాస్త్రిగారు గ్రాంథిక గ్రామ్యములు పాత్రోచితములుగాఁ జిత్రించి ప్రతాప రుద్రీయమునకుఁ బేరుదెచ్చిరి. నాగానందాంధ్రీకరణమునను ప్రతాపరుద్రీయమునను వీరు క్రొత్తమార్గము త్రొక్కుటఁ జూచి కొందఱు కేవల గ్రాంథికవాదులకుఁ గోపకారణమైనది.) విమర్శనములు వెలువడఁ జొచ్చినవి. అంతకుమున్నె యిదికనిపట్టి 'ప్రతాప'లో శాస్త్రిగారిట్లు వ్రాసికొని నటించెఁ జదివించిరి.

అంకెకుఁ దార్చ్చి నేరసిరి సంగలభారతి ప్రౌఢనీతి, నా
కింకిరినాంధ్ర ద్రావిడియుఁ గేరుచు దైవిడయుఁగూడి రెన్నఁడిక
జంకు కళంకు లేనికవిచంద్రుఁడు శోషితకోవిదేంద్రుఁడా
వేంకటరాయశాస్త్రికృతి వెంగలిమూఁక కెఱుంగ శక్యమే?

ప్రతాపరుద్రీయమునఁ దురుష్కునిచేతను, బొబ్బిలిలో సిపాయి చేతను శాస్త్రిగారు సందర్భసముచితముగ సంభాషణము చేయించిరి. వేంకటరాయశాస్త్రి తండ్రిగారు వేంకటరమణశాస్త్రిగారు సంస్కృతాంధ్రములలో గొప్పపండితులు. వీరు పరవస్తు చిన్నయసూరికి సహపాఠులు. తండ్రిగారు పెక్కు పట్టణములలో నుద్యోగములు చేసియుండుటచే వేంకటరాయశాస్త్రిగారు కూడ వారితోపాటనేక మండలములలోఁ దిరుగుట, తత్తన్మండల వ్యవహార భాషాసంప్రదాయము తెలియుట తటస్థించినది. బహుబాల్యముననే ప్రతాపరుద్రీయ కథ వేంకటరాయశాస్త్రిగారి నాకర్షించినది. అది 1896 లో నాటక రూపమునకు వచ్చి యాంధ్రి కాభరణమైనది. ఈవిషయము ఆ నాటకావతారికలో నిటు లున్నది "ఓరుగంటి ప్రతాపరుద్ర మహారాజును తురకలు ఢిల్లీకి ఖయిదు గొనిపోయినకథ లిఖితముగాని ముద్రితముగాని నాకెచటను దొరకలేదు. నే నెనిమిదేండ్లవయసున నుండఁగా మా నాయన

గారు వేదము వేంకటరమణశాస్త్రులవారు తమ మిత్త్రబృందములో నీ కథను ప్రస్తుతించునపుడు నేనును వింటిని. వారుచెప్పుటలో నీకథ అరగంట కూడపట్టలేదు. ఇటీవల నేను ఆంధ్రజనవినోదినీముద్రణాధి కృతుఁడనై యుండఁగా 1883 సం॥మున ఈకథను నాకుఁ దోఁచినట్లు విరివిచేసి యల్లి కథారూపమునఁ బ్రచురించియుంటిని. పిమ్మట 1896 సం॥న జూలై నెలలో దానిని నాటకోచితముగారూపుచేసి, ఈనాటకమునందలి గద్య భాగమును మాత్రము వ్రాసి నామిత్రులకుఁజూపితిని."

శాస్త్రిగారి తండ్రిగారికడ నలుగురు శిష్యులు వేదాంతగోష్ఠి తీఱుచు చేయుచుండువారఁట. వారిలో నొకఁడుబ్రాహ్మణుఁడు. రెండవవాఁడు చాకలి, మూఁడవవాఁడు మసల్మాను, నాలగవవాఁడు క్రైస్తవుఁడు. వారిగోష్ఠి శాస్త్రిగారు వేడుకపడి వినుచుండువారఁట. ప్రతాప చరిత్ర లోని మహమ్మదీయపాత్ర మంతమనోహరముగాఁ జిత్రింపఁగలుగుటకు నాఁటిమహమ్మదీయ శిష్యునిమాటల వినియుండుటయే కారణమని శాస్త్రిగా రనుచుండెడివారని చెప్పుకొందురు.

ఈయన చోడవరము బడిలోఁగొన్నాళ్ళు ప్రధానోపాధ్యాయులుగా నుండిరి. నాఁటి యొకవిచిత్రగాథ నిట్లుచెప్పుదురు. ఆబడిలో 'పేరి గాఁడు' అను నొకనౌకరు యుండువాఁడు. బడిపనులేవియు ముట్టుకొనక మూఁడుప్రొద్దులు 'సెక్రటరీయింటనే గృహకృత్యములు సేయుట, ఎప్పుడోవచ్చి బడియరుఁగుమీఁదఁ బరుండుట - ఇది వానిదైనికచర్య. మన శాస్త్రులుగారికి వీనిచర్య చూడ నరకాలిమంట నెత్తికెక్కి యొక్క నాఁడు వీని కిదిపనికాదని యొకచింతబరికె చేతఁబుచ్చుకొని నసాళమంటు నట్లు నాలుగుచుఱుకులు తగిలించి మెల్లఁగాఁ దప్పుకొని రఁట. వాఁడు 'మొఱ్ఱో' అని లేచి 'సెక్రటరీ' తో శాస్త్రులుగారి యన్యాయము చెప్పి కొనెను. సెక్రటరీ శాస్త్రిగారిని రమ్మని నౌకరును పంపెను. 'మీయింటికి వచ్చునవసరము నాకులేదు. పనియున్నచో మీరు రావలయును.' అని శాస్త్రిగారి ప్రత్యుత్తరము." నిరంకుశాః కవయః!

ఈపేరిగాఁడే ప్రతాపరుద్రీయములోని పేరిగాఁడు. శాస్త్రులుగారిచెవి కింపుగా నేదేని చక్కని పలుకుబడిగాని నామవాచకముగాని వినఁబడి నదో, అది సందర్భోచితముగ గ్రాంథికముచేయవలసినదే. ప్రతాప రుద్రీయములో వెఱ్ఱివాఁడు "నేను కండచీమను. ఏమనుకున్నావో. పట్టు కుంటే వదలను" అనును. శాస్త్రులుగారు విశాఖపట్టనములో నున్న పుడు పొరుగింట ముసలిమగఁడు పడుచుభార్యను జీటికిమాటికి నీకండ చీమ పదము నుపయోగించి తిట్టుచుండువాఁడఁట. అది జ్ఞప్తికిరాఁగా నిచటఁబ్రయోగించిరని వారిసన్నిహితులు చెప్పుదురు.

బొబ్బిలినాటకమున నయిదవయంకములో సారాయిదుకాణముపెట్టిన వానిపేరు 'బాడ్మిఙ్' అనిరి. ఇది వీరు విశాఖపట్టనములో నున్నపు డక్కడిదుకాణదారునిపేరఁట. ఇంకను నిట్టియనేక స్వానుభవములు తమ నాటకములలో నుద్ఘాటించిరి. వీరికి జంగముపాటలు, పడవపాటలు, ముష్టివారిపాటలు వినుటయందాస్థ పెద్దది. ప్రతాప నాటకమునకు ముఖ్యముగాఁ బ్రఖ్యాతి గొనితెచ్చినది పాత్రోచితభాష. కవిచెప్పినటు లీనాటకము 'పండితపామరుల గండపేరు' గా నున్నది.

ఉషాచరిత్రము నెఱ్ఱాప్రెగడయు, సోమనాథుఁడును దమ కావ్య ములలో రసోత్తరముగాఁ జిత్రించిరి. ఎఱ్ఱన బాణుని రాక నాలోకించిన యుషచే నొకసీసము చదివించినాఁడు. సోమనాథుఁడు కలఁగనిలేచిన యుషచే నొకసీసము పఠింపించినాఁడు. వేంకటరాయశాస్త్రిగారి నాటక ములో "భ్రాంతిద్వీపమున నక్షత్రప్రాసాదమున బంధితయుష చెలి చిత్రరేఖతో" నిట్లనుచున్నది.

ఒడిలోన నేనులే కొలగంబుండని
తండ్రికినేఁ బగదాననైతి
నన్నుఁ గైసేయించి కన్నదే దినమైన
తల్లికి నే విషవల్లినైతి

ప్రాణంపుఁ బ్రాణంబునగిది నన్నో మొదు
నన్న కే తలనంపు వ్యాధినైతి
ననుఁగోరి తనప్రాణమునకుఁ దెగించిన
దయితుని కే బంధధాత్రినైతిఁ
బ్రాణనాథుని నేఁగోల్పి బందినైతిఁ
దప్పులేక కుశీలపతాకనైతి
దెప్పరము మాని సకి నీవ చెప్పవమ్మ
మానమేదిన వెలఁదికిఁ బ్రాణమేల ?

ఉత్తరోత్తర రసభావనిష్యందములగు నీమ ప్పురుకవుల సీసములు. నొకమాఱు చదువుకొని యభిజ్ఞులు రసతత్త్వమును జూఱలాడవలయును.

శాస్త్రిగారు నిరుపమానవర్ణనా సన్నివేశ సంధానధౌరేయులు. ఒకయెడఁ గాళిదాసుని దలపింతురు. ఒకయెడ భవభూతిని మఱపింతురు. అనిరుద్ధునకు స్వప్నములోఁ బ్రియురాలు గనఁబడెను. ఆమెయే యుష. సఖునితో నాసంగతిచెప్పుచు స్వప్నదృష్టయగు ప్రణయినిని వర్ణింప వలసివచ్చినది. అతఁడు పూఁదోఁటలో నున్నాఁడు. అది వెన్నెలరేయి. మంచుకురియుచున్నది. అట్టి సన్నివేశమున నిటులు వర్ణన.

మృషావలగ్న జిల్గుపైఁట మించుసన్న మంచగున్
ఝషాక్షిదట్ట మన్న సంజజాజులోని రేకగున్
తృషాకృదోష్ఠి భూషణాళి రిక్కలున్ మెఱుంగులౌ
నుషావతార మంచుఁ గాంత నూహసేయుదున్ సఖా !

ఉషకై పరితపించుచున్నయనిరుద్ధున కప్పటికిఁ దెలియకున్నను బ్రియయు నుషయేయైనదఁట. అతిమాత్రప్రజ్ఞా సంపన్నులగు శాస్త్రిగారి భావనా శక్తి నీపద్య మొక్కటియే తార్కాణించుచున్నది. కనుకనే నాటక కర్త "యుషావివాహము" 'సిద్ధసుధా ప్రవాహ' మనుకొనినాఁడు.

బొబ్బిలినాటకములు మఱికొన్ని కీటీవలికవులు కూడ వ్రాసిరి. వానియన్నింట వేంకటరాయశాస్త్రిగారిది రసవత్తరము. 'ఆఁడుఁబురువు

లేదు హాతమయ్యో మగకూన కోటపాడయ్యో నింకేటి కిచట' ఇది చదువుకొని కంటనీరుపెట్టుకొను రసిక శూరులు నేఁడు పెక్కండ్రు కలరు. శాస్త్రిగారు శ్రవ్యకావ్యముఁ వ్రాయలే దనువెలితి లేదు. వీరి యీపై మూఁడు నాటకములలోను గొప్పకవిత్వమున్నది. పిండిలేనివారికి వీరి కవిత యెటులుండినను, పండితకవులకుఁ బండువు "పండితుఁడు కవి కాఁడు" అను వాదమిపుడు నిలువదేమో!

వేంకటరాయశాస్త్రిగారి యఖండపాండితికిఁ దార్కాణముగా వారి ఆముక్తమాల్యదా, శృంగారనైషధ వ్యాఖ్యలు చూపవచ్చును. ఆముక్తాదులలోనిపాఠములు కొన్ని వీరు స్వయముగా సవరించిరి. అది కొంత వీరిలోఁగలలోప మనక తప్పదు. "ఆముక్త" వ్యాఖ్య వీరు కొన్నేండ్లు చదివి నాలుగునెలలలో వ్రాసిరఁట. 24-6-1920 నాఁడు ప్రారంభించి 28-10-1920 నాఁటికిఁ బూర్తి చేసి రని వారిచరిత్రము చెప్పుచున్నది. అందులకే యుపరమల్లినాథబిరుదము వారియెడ సార్థకమైనది.

(శ్రీ వీరేశలింగము పంతులుగారు 'విధవావివాహ' ప్రచారము బాధముగాఁ జేయుచున్న సమయమున శాస్త్రులుగారు "స్త్రీపునర్వివాహ దుర్వాదనిర్వాపణ" గ్రంథము బహుపరిశ్రమమునకుఁ బాల్పడి బహుగ్రంథములు పరిశీలించి ప్రకటించిరి. ఆప్రకటనమే శాస్త్రిగారి జీవితమునకు నూతన ప్రకరణమైనది. వారి ప్రతిభయుఁ బాండిత్యము లోకమునకుఁ దెలిపినది యీఘట్టమే.) పునర్వివాహవాదఖండనోపన్యాసములవలననే శాస్త్రిగారికిఁ బెక్కుమంది మదరాసు మహాశయులమైత్రి కలిగినది. ఆపర్టు, మిల్లరు మున్నగు పాశ్చాత్యులకు వీరి గీర్వాణభాషా పాండిత్యము విదితమైనది. తత్ఫలముగా 1887 నవంబరులో క్రైస్తవ కళాశాలా సంస్కృతోపాధ్యాయపదము శాస్త్రిగారికి లభించినది. ఈయుద్యోగముతో నూరకుండక యపారమగు భారతీసేవ గావించిరి. చెన్నపురజీవితము శాస్త్రులుగారికి గ్రంథరచనోత్సాహము హెచ్చించినది. 1890 లో [illegible] ముద్రాలయము నెలకొలిపి దక్షాపరిత్యాగ

రాది గ్రంథములు తెలుఁగున వెలయించిరి. కొక్కొండ వేంకటరత్నము పంతులు గారును వీరును హోరాహోరిఁబోరిరి. శాస్త్రిగారు పంతులు గారి ప్రసన్న రాఘవమును బ్రత్యక్షరము విమర్శించి విడిచిరి. ఆ వాదము ముదురుపాకమునఁబడి పండితులకు బాధయనిపించినది. దూషణవాక్యములు తొలఁగించినచో 'ప్రసన్న రాఘవ విమర్శనము' ఆంధ్రికి స్వర్ణభూషణము. అప్పుడు ప్రసిద్ధిలోనున్న 'అముద్రిత గ్రంథ చింతామణి' పత్రిక యీభాషావివాదమునను బ్రకటించినది. చింతామణి సంపాదకులు పూండ్ల రామకృష్ణయ్యగారు గొప్ప పండిత విమర్శకులు. వేంకటరాయశాస్త్రిగారికి వీరికి నొకటేప్రాణము.

శాస్త్రిగారు నాటకరంగమునకుఁ బ్రశస్తిదెచ్చిన కళాహృదయులు. ఇంచుమించు ముప్పదియేండ్లు సంస్కృతాంధ్ర నాటకములు తమ శిష్యులచేఁ బ్రదర్శింపఁజేసిరి. వీరి సర్వాధ్యక్షతతో నెల్లూర 'ఆంధ్ర భాషాభిమాని సమాజము' నడచి రజతోత్సవము జరిపించుకొన్నది. పూండ్ల రామకృష్ణయ్యగారే యీసమాజస్థాపకులు. 1904 లో పరమ మిత్రులు రామకృష్ణయ్యగారు మరణించుటయు, చింతామణి ఆఁగిపోవుటయు వేంకటరాయశాస్త్రిగారికి హృదయావేదన హేతువులైనవి. క్రైస్తవకళాశాలలో నిరువదినాలుగేండ్లనుండి పనిచేయుచు 1910 లో నాయుద్యోగమునుండి తప్పుకొనిరి. జ్యోతిష్మతీ ముద్రాక్షరశాలను బునరుద్ధరించి యెన్నో ప్రాక్తన గ్రంథములు సవ్యాఖ్యముగా వెలువరించి భాషాసేవగావించిరి. వేంకటరాయశాస్త్రిగా రాంధ్రభాషా మధుమథనులు. ఆయనసమించిన పండితులుండుకుగాక, ఆయనను శాదవిపించు కవులుండిరిగాక, ఆయన వలె భారతీపూజ గావించిన మహాభక్తుఁడు మాత్రములేఁడు. ఆయన డెబ్బదియాఱేండ్లు బ్రతికెను. కొన్నిశతాబ్దులు నిలుచు వాఙ్మయసేవ చేసెను. అహో రాత్రము లదేపనిగా వ్రాసినవాఁడు వ్రాసినట్లే యుండెను. చది

వినవాఁడు చదివినట్లేయుండెను. ఆపరిశ్రమము, దానికిఁదగిన యారోగ్యము, ఆ పాండిత్యము, దానికిఁ దగిన భావనాశక్తి మఱెవ్వానియందుఁ జూడము. ఆయనమాటలాడిన మధు వొలికెడిది. ప్రతిపక్షిని చల్లఁగాఁ గొంతుకోయువాఁడు. సభలో నిలఁబడినచో సింహము. ఆయన రసవత్సంభాషణములు వ్రాయుచో నొక మహాకావ్యము. స్వాతంత్ర్యము నెన్నఁడు చంపుకొనలేదు. పనిలేక యెవరినిఁ దూలనాడలేదు. ఆమేధ, ఆ ప్రతిభ, ఆ హాస్యవిలాసము, ఆ సమయస్ఫూర్తి యితరున కందవు. అవసరమునుబట్టి పెంకితనము చూపెను. ప్రాచీనాచారముల కలీతుఁడు. అట్లని నవీనాచారముల నాశ్రయింపనులేదు. సందర్భానుసారముగాఁ బోయెను. భాషావిషయమునను నిదియేత్రోవ. పాత్రోచితమని వ్యావహారికము వాడెను. గ్రాంథికమును సమర్థించెను. గిడుగువారివలెఁగాక వీరు నియమసాపేక్షముగా గ్రామ్యము ప్రయోగింపవలెనని యందురు. భాషావిషయికముగాఁ గొంచె మభిప్రాయభేద మున్నను గురుజాడ అప్పారావుగారు వీరిని కడు గౌరవించిరి. వజ్ఝల చినసీతారామ స్వామి శాస్త్రిగారును వీరియభిప్రాయముల నామెూదించిరి. బహుజనపల్లి సీతారామాచార్యులవారు వీరికాచార్యులు. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారికి వీరాచార్యులు. కట్టమంచి రామలింగారెడ్డి ప్రభృతులు వీరికి శిష్యులు. అల్లాడి కృష్ణస్వామి ప్రముఖులు వీరి శాత్రులు.

ఈపుంభావసరస్వతికి లక్ష్మీప్రసన్నత తక్కువ. శ్రీనాథునివలెఁ జివరికాలమునఁ జిక్కులఁ బడినారు. ఎంతచిక్కుపడినను సరస్వతీపూజ నేమఱలేదు. ఇట్టి మహనీయచరిత్రునకు 1927 లో నాంధ్రవిశ్వవిద్యాలయము కళాప్రపూర్ణబిరుదమునిచ్చి సత్కరించుటలో విశేషములేదు.

నెల్లూరుమండలమున కెల్లఁ దిక్కనవలెఁ గీర్తిఁదెచ్చిన కవిపండితుఁడీయన. శాస్త్రులుగారికృతులను బోషించిన రెడ్డివంశీయులయశము శాశ్వతము. వేంకటరాయశాస్త్రిగారు 1919 లో ఆంధ్రసారస్వత సభవారిచే

సన్మానితులై మహోపాధ్యాయ బిరుద మందిరి తమ వాగ్దేవతాపూజా విధాన మిట్లు నొడివిరి.

"ఆవాహనము శ్రీఘనసర్వీణాహరుర్వ్యాదర్శ్వాపణము- ఆసనసమర్పణము కథాసరిత్సాగరము- అర్ఘ్యము ప్రతాపరుద్రీయ నాటకము- పాద్యము మేఘసందేశాంధ్రటీక - అలంకారము ఆంధ్రప్రసన్న రాఘవ నాటకాదివిమర్శ కింకిణీగణ శింజాన శారదా కాంచిక - నైవేద్యము శృంగారనైషధ సర్వంకష వ్యాఖ్య.

ఉషానాటకమున వీరు జీవితవిషయ మిట్లు చెప్పించికొనినారు.

ఖాత్రిసాహస్ర ప్రచార బుగా నాట
కములను దన్నిగమంబు గలిపినారు
సర్వజ్ఞసింగమ సార్వభౌమునిగద్దె
యెక్కినదొరగ మది కెక్కినారు
హూణరూపకరసం బుదకంబు నిండారఁ
గ్రోవి గజ్జునఁ ద్రేఁచి తనిసినారు
టాటోటుఁగవులు పటాపంచలై వాయఁ
గాంచిక వాణి కర్పించినారు
బల్లారిభవ కవిపండిత సంఘంబు
మదరాసులో రూపుమాపినారు

కాళిదాసు శకుంతల నేలినారు
మించిన ప్రతాపకృతిని నిర్మించినారు
తగదొకో శాస్త్రిగారి గ్రంథములకోర
మహిత వస్తు పరాయణ మానసులకు.

ధర్మవరము రామకృష్ణమాచార్యులు

1853-1912

వైష్ణవులు-తండ్రి: కృష్ణమాచార్యులు. తల్లి: లక్ష్మమ్మ. జన్మస్థానము: ధర్మపురి అగ్రహారము (తాడిపత్రి తాలూకా-అనంతపురముజిల్లా). నివాసము: బళ్లారి. జననము 1853 సం. (పరీధావి కార్తిక శు॥ ఏకాదశి) నిర్యాణము 1912 సం. విరచిత గ్రంథములు, ముద్రితనాటకములు:—౧ చిత్రనళీయము, ౨ విషాదసారంగధరము, ౩ పాదుకా పట్టాభిషేకము, ౪ ప్రహ్లాద, ౫ సావిత్రీ చిత్రాశ్వము, ౬ మోహినీ రుక్మాంగద, ౭ బృహన్నల, ౮ ప్రమీలార్జునీయము, ౯ పాంచాలీ స్వయంవరము, ౧౦ ము[illegible]వళి, ౧౧. చిరకారినాటకము ౧౨ రోషనారా శివాజి, ౧౩ వరూధినీనాటకము. అచ్చుకాని నాటకములు:— ౧ ఉషాపరిణయము ౨. సుశీలాజయపాలీయము, ౩ అజామిళ (వచన నాటకము), ౪ యుధిష్ఠిర యౌవరాజ్యము, ౫ సీతా స్వయంవరము, ౬. ఘోషయాత్ర, ౭ మదనవిలాస నాటకము, ౮ ఉన్మాదరామప్రేక్షణిక నాటకము, ౯ రాజ్యాభిషేకము. ౧౦ సుగ్రీవ పట్టాభిషేకము. ౧౧ విభీషణపట్టాభిషేకము, ౧౨ హరిశ్చంద్ర, కన్నడనాటకములు: ౧ ఉపేంద్రవిజయము లేక వామనచరిత్ర, ౨ స్వప్నానిరుద్ధనాటకము.

శ్రీమత్కృష్ణమాచార్యకవికిఁ బూర్వము తెలుఁగులో స్వతంత్రసంవిధానము గలనాటకములులేవు. ఉన్ననాటకములు సంస్కృతమునకనువాదములు. ఆ కారణమున నాంధ్రరంగస్థలములు విస్తరించి వెలయలేదు. పాశ్చాత్యసంప్రదాయము, ప్రాచీన సంప్రదాయము నెఱిఁగి యొకగకమగు క్రొత్తత్రోవదీసి నాటకములు రచించి స్వతంత్రనాటకరచయితలకు మార్గదర్శియనిపించుకొనిన మహాశయుఁడీయన. వీరి కృషిని గుర్తించి గద్వాలమహారాజవరుఁడు 1910 లో నీయాచార్యకవిని, రత్నస్థగితమగు పతకముతో 'ఆంధ్రనాటక కవితాపితామహుఁ'డని బిరుద మొసఁగి గౌరవించెను. విచిత్రసమ్మేళనము గావించి నాటకపాత్రములకుఁ గేవ లాంధ్ర

త్వము నాపాదించి తొలుదొల్త స్వతంత్రనాటకములు రచించినవాఁ డగుటచే నీకవివరున కీబిరుద మన్వర్థ మని నాఁడు పెక్కువండితు లగ్గించిరి. పురప్రముఖులు ముగ్ధులై యొకకిరీటమర్పించిరి. ఆచార్యులవారు నాటకకర్త లేకాక నటకులు కూడను. చిత్రనళీయములో బాహుకుఁడు, విషాదసారంగధరములో రాజనరేంద్రుఁడు, పాదుకాపట్టాభిషేకములో దశరథుఁడు, అభిజ్ఞానమణిమంతములో దుష్టబుద్ధి, ఈపాత్రములు ప్రత్యేక ప్రశంసాపాత్రములుగా నటించెడివారు. దశరథ పాత్రధారిత్వమున కృష్ణమాచార్యులవారికి సాటి కృష్ణమాచార్యులవారే యని పలువురు చెప్పుకొందురు. ఆచార్యులవారు తమమరణము నాటక రంగమునన్నో న్యాయస్థానముననో యుండు నని యప్పు డప్పు డనుచుండువారు. అది తథ్యముగ వారు 1912 లో నొక యభియోగము నడపుటకు వెళ్ళి 'ఆలూరు' లో న్యాయస్థానమున నాకస్మికముగఁ గాలు జాఱి పడి 'రామచంద్రా' యనుచు నసువులఁ బాసిరి. వారిమృతకళేబరము నాలూరునుండి బళ్లారికి దెచ్చి యంత్యక్రియ నడపు సందర్భమున జరిగిన యూరేఁగింపుటుత్సవము పలువు రిప్పటికిఁ జెప్పుకొందురు. నాటకాచార్యుఁడై గడించినకీర్తియు, న్యాయవాదియై సంపాదించినపేరును నాఁడు ప్రకటితమైనవి. స్త్రీలు పురుషులు వృద్ధులు యువకులు నొక రననేమి, వేలకొలఁది పుష్పమాలికాదులచే నాచార్యకవి కంత్యసమ్మాన మొసంగిరి. ఇట్టి మహాశయుని శక్తియుక్తులు ముచ్చటించు కొందముగాక !

కృష్ణమాచార్యులవారి తండ్రిగారు మంచిపండితులు. తాత ముత్తాతలుకూడ విఖ్యాతవిద్వాంసులు. తండ్రిగారు బళ్లారి "వార్ధలా కాలేజి" లో నాంధ్ర పండితపద మలంకరించిరి. జనకుని సన్నిధినే కృష్ణమాచార్యుఁడు సంస్కృతాంధ్రములు కఱచెను. మేధాశక్తి గొప్పది యగుట నిట్టె చక్కని సాహిత్య మలవడుట తటస్థించినది. దానివలన బహుగ్రంథపరిశీలనము గావించి పాండిత్యమునకు వ్యయముగా మెఱుఁగు

పెట్టుకొనెను. అష్టశతావధాన ప్రదర్శనము గావించి కొక్కొండ వేంకటరత్న మహామహోపాధ్యాయుని వంటివారిచే మెప్పులం గాంచెను. అదియటుండ, నీయన కాంగ్లభాషాభ్యాసము చేయవలయు నని యభినివేశము కలిగినను పట్టుదలగలవారగుట ఎఫ్. ఏ పరీక్షలో నుత్తీర్ణత నందిరి. తరువాత ఆదవాని 'తాలూకా చేరీ'లోం గొన్నాళ్లు లేఖకులుగాం గుదురవలసివచ్చినది. కవికి దౌర్గత్యముకూడ నొకకళ యైనదిగదా! పాపము నాంటికి వీరిది పేదకుటుంబము. ఆదవానిలో సంసారము సరిగ జరుగక బళ్లారికి వచ్చి "కంటోన్మెంటు మేజస్ట్రేటు కోర్టు"లో 'ప్రైవేటు వకీలు'గ పనిచేయ మొదలిడిరి. ఆయుద్యోగము వీరి దరిద్ర దేవతను దఱిమివైచినది. వకీలువృత్తియందు వీరికి లభించిన యుత్తేజనము "ఫస్టుగ్రేడ్ ప్లీడరుషిప్" పరీక్షకుం బురికొల్పి యందు త్తీర్ణుని గావించెను. నాంటినుండి వీరిన్యాయవాదవృత్తి నిరాఘాటముగ సాగి న్యాయస్థానములకెక్కు నభియోగము లన్నింటను వీరి దొక వకు ముండితీరునంతటియున్నతికిం గొంపోయెను. ప్రతిపక్షులను సాక్షులను ప్రశ్నించుటలో వీరినేర్పు గొప్పది వీరివాదము వినుటకుం బ్రజలు గుమిగూడి యుండువారంట. బళ్లారిప్రాంతీయు లిప్పటికిని వీరిన్యాయవాద దక్షత వేనోళ్లం జెప్పుకొందురు.

ఈయాచార్యకవి యద్భుతమేధాశక్తి యనేకకళలను గ్రహించినది. ఆయుర్వేదము వీరు లెస్సగ నెఱుంగుదురు. అది వీరి వంశపారంపర్యముగ వచ్చువిద్య. నాడీపరీక్షలో నీయన సిద్ధహస్తులంట జ్యోతిశ్శాస్త్రమునను వీరి ప్రవేశము చాలగొప్పది. వీరినాటకములలో నిందులకు నిదర్శనములు పెక్కుగలవు చదరంగ మాడుట యన్న వీరికిం జెప్పరాని మక్కువ. నెలలతరబడి యనన్యమనస్కులై యాడుచుండువారని ప్రతీతి. అభినయశాస్త్రము వీరికిం బరిచితము. "డిబేటింగుసొసైటీ" నొకటి స్థాపించి పలువురు పురప్రముఖులనందు సభ్యులుగాం జేర్పించి 'షేక్సుపియరు' నాటకములలో ముఖ్యపాత్రల నభినయించెడివారు. ఆ సరసవినోదినీసభకు నాండు పెద్దప్రఖ్యాతివచ్చినది. నాటకబృందముపైం

గల దొల్లిటిహేతుభావము తొలఁగించిన దీసభయే. ఈసభామూలమున నొకసారి 'ఆంధ్రకవిపండితసంఘసమ్మేళన' మాచార్యులవా రతివిజృంభణముగా జరిపిరి. మఱొకసారి ఒంటిమిట్టలో వావిలికొలను సుబ్బారావుగారి 'ఆంధ్ర వాల్మీకిరామాయణ' కృతిసమర్పణోత్సవమునకు వీరి సధ్యక్షులుగా నెన్నుకొనిరి. అప్పుడు వీరి "పాదుకా పట్టాభిషేకము" ప్రదర్శింపఁగా రూ 1500 వచ్చినవి. అవి కోదండరాముని కైంకర్యమునకే యర్పింపఁ బడినవి. వీరినాటకములకుఁ బ్రజాసామాన్యములోఁ గల గౌరవమున కిది మంచితారకాణ. అంకములలోని కథ రంగములుగా విభజించుట వీరినాటకములలోని క్రొత్తపద్ధతి. ఇది పాశ్చాత్య సంప్రదాయము. నాటకము విషాదాంతముచేయుట వీరి కనభీష్టము కాదు. 'సారంగధర' ను జూచిన మనకది యవగతము. కాళ్ళు చేతులు విఱుగఁగఁ గొట్టఁబడి సారంగధరుఁడు చనిపోయెను. అంతతో నాటకము సమాప్తము. మఱియొకసంప్రదాయముగల కవియైనచో నిది యిట్లు వ్రాసి యుండఁడు. ఇదియు నాంగ్లేయమే. సారంగధరునిపై నింద మోపిన చిత్రాంగిని విచారించుటకు రాజనరేంద్రుఁడొక న్యాయస్థానసభ చేసెను. అది సరిగ నిసర్గసుందరముగనుండి కృష్ణమాచార్యులుగారు గొప్ప న్యాయవాదియని సాక్ష్య మిచ్చుచున్నది.

వీరి నాటకచక్రములో 'చిత్రనళీయము' మిన్నందిన ప్రఖ్యాతి గొన్నది. అందలి పద్యగద్యములు ప్రబంధములకు దీటువచ్చినవి. అది ప్రదర్శించుట కొకపాటినటకుఁడు పనికిరాఁడు. సంపూర్ణమైన యర్థజ్ఞానము కలిగి మరల నిట్టికవిత్వము వ్రాయఁగలవన్నవాఁడు వీరినాటకములు నోటఁబట్టఁగలఁడు. తెలుఁగులో ననువాదములు రెండుమూఁడు తప్ప స్వతంత్ర నాటకములు రచించువారలవాటు నాఁటికి లేకుండుటచేఁ బ్రాబంధికవాసన వీరినాటకములలో ననననేల. ఆనాఁడు వ్రాసినవారుగు రైదుగురు కవుల నాటకములలోఁగూడ వెల్లివిరిసినది.

ఆచార్యులుగారి చిత్రనళీయము చూడుఁడు! ప్రథమాంకములో స్వయంవరరంగమున భారతిచేత దమయంతికి భుజంగప్రియుఁ డాదులైన యెన్ని ప్రాబంధికవృత్తములతోఁ జెప్పించెనో! ఇప్పుడు బొత్తిగా నాట

కములలోఁ బద్యములను బరిహరింపవలయు ననుచున్నారు, అది మాచితీపోషక మని - అటువంటియుప్పుడు పృథ్వీవృత్తములు - మత్తకోకిలములు వృశ్చికావసానములలో నుపయోగించుట యొకరకముగానుండును. నాఁటినటకులుకూడ సర్వసమర్థులు. ఇప్పుడిట్టివి యాడువారు నూటికిఁ గోటికిని - ఇంచుమించుగా శ్రీనివాసరావుగారిని, కృష్ణమాచార్యులు గారినికూడఁ బద్యనాటకప్రారంభకులు. అనుగమునుగాకుఁ బద్యము. తిరుపతివేంకటకవుల పాండవనాటకములలోను పద్యములవా తెలుఁ-వయే. కాని వారు కొంతశైలి వేసకపఱచిరి.

చిత్రనళీయమను చతుర్థాంకములో 'శరద్రాత్రి' ని వారినారి యుపాలంభనములు జరుగునదియైన పద్యములలో నాచార్యులవారు వర్ణించిరైచిరి. నిజముగా నాపద్యములు వసుచరిత్రాది ప్రబంధములకు నందని యుదాత్తభావములు కలవి. భాషయు గట్టిదే. విరహవ్యథావిధురుఁడైన బాహుకభూమి కాధారమైయొక్క పిమ్మట నాపద్యములు చదువవలయునన్న డొక్క బ్రద్దలగును. నాఁటినటులు కొందఱు చిత్రనళీయాదుల కంతి ప్రఖ్యాతి ప్రజానామాన్యములోఁ గూడఁ దీసికొనఁ గలిగిరి. నటకులై ఖండాంతర ప్రసిద్ధిగాంచిన తాడిపర్తి రాఘవాచార్యులుగారికి మన ఆచార్యులుగారు మేనమామ. వీరి నాటకపద్యములు చాలమందికి నోటికి వచ్చినవే యైయుండును. అయినను గొందుమచ్చు:

అతిమాత్రంబుగ దుఃఖముల్ సుఖము దైవాధీనతం గర్మ సం
గతిమైఁ బ్రాణికిఁ గల్గుగా యిపుడు దుఃఖప్రాప్తి నుల్లాడె శ్రీ
యుతుఁడా భూమినుతుండు వెండియును నేఁడో తేపొ యాకాల దు
స్థితి దీఱంగను సర్వసౌఖ్యములు నిశ్చింతాన్వితం జెందఁడే ?
బలిరే కంటెనికంటె సప్తజలధి ప్రావేష్టితాఖండ భూ
లలనాధీశ కిరీట వారమహనీలంబాయమాన ప్రభో
జ్జ్వలితారుంద నసూనపాద సేవాప్రీతగోత్రాధవుల్
నళభూమీమాధవు నాశ్రితౌఘ గురుడా నవ్య ప్రభామాధవుల్

దేవులపల్లి సోదరకవులు

1853 - 1909, 1856 - 1912

అగ్రజులు: దేవులపల్లి సుబ్బరాయశాస్త్రులవారు. తమ్ములు: తమ్మనశాస్త్రియను నామాంతరముగల వేంకటకృష్ణశాస్త్రిగారు. మొదటివారిజననము 1853 సం. నిధనము 1909 సం. రెండవవారి పుట్టుక 1856 సం. నిర్యాణము 1912 సం. కూచిమంచితిమ్మకవి కడకాలమున నివసించిన చంద్రమపాలెమున (గోదావరిమండలము) వీరి మనుగడ-తెలగాణ్యవైదికశాఖీయులు. కౌండిన్యసగోత్రులు. తండ్రి: వేంకటకృష్ణశాస్త్రి. మహేంద్రవిజయము (ఆంధ్రప్రబంధము) రావువంశముక్తావళి (సంస్కృతము-అచ్చుకాలేదు) మల్హణస్తవము (తెనుగుసేత) రామరాయవిలాసము, రామపంచాశత్తు (సంస్కృతము) ఇవి సుబ్బరాయశాస్త్రివిరచితములు- నయనోల్లాసము, యతిరాజవిజయము, రావువంశముక్తావళి (తెలుగు కావ్యము. అముద్రితము) సకలేశ్వరశతకము, ఇవి తమ్మనశాస్త్రి రచితములు.

వేల్పు రాఘవుఁడు; ఇంటివేలుపు రామయు ... నెన్నఁ బి
యేలిక లెన్న రావుకులు ... రల కిప్పు డొప్పు భూ
పాళి నిజంబుగాఁ ... దేవులపల్లివంశ భూ
పాళి దలంచుచుండుఁ ... కీయుభయంబె ప్రాపుగన్.

చూచితిరా సుబ్బరాయశాస్త్రిగారు రామభక్తిపరిశేషము! రామభక్తిని మించినది రాజభక్తి. ఈ రెండింటి ప్రాపుచేతను, మహేంద్రవిజయాది మహోత్తమకృతులు రచించి, యాంధ్రదేశమున సత్కవికీర్తి నార్జించి మించిన మహాశయుఁ డీయన. గంగాధర రామరాయేంద్రుఁడు తనసింహాపీఠిపైఁ గూరుచుండఁబెట్టి "ప్రాజ్యపురంబుగా రాజ్య మొల్లని, దేగదా సుబ్బరాయసుకవి!" యని యఖండసత్కార మొసరించినను అవలిప్తుఁడు కాని యభిజ్ఞశేఖరుఁ డీయన. సుబ్బరాయశాస్త్రిగారాంధ్రభోజాభిఖ్యతో వెలయుచున్న నేటి సూర్యరాయమహారాజ

వరునకు సంస్కృతభాషాదేశికుఁడై యలరారిన యదృష్టవంతుఁడు. రామనామసంస్మరణము, రామరాయసందర్శనము నను దినకృత్యములుగా నెంచి పవిత్రజీవయాత్ర నెఱపినపండితుఁడు.

దేవులపల్లి వంశీయు లెల్లరు విద్వత్కవులు. పీఠికాపుర రాజ్యస్థాపకులు శ్రీరావు తెనుంగురాయణింగారి యాదరణముచే వీరివంశస్థులు పిఠాపురమునఁ బ్రవేశించిరి. సుబ్బారాయశాస్త్రిగారి తండ్రి గొప్పపండితుఁడు శాస్త్రులుగారు పిఠాపురాంతేవాసులు. వారికడఁ గావ్యనాటకాలంకారాదులు, జ్యోతిర్విద్య నధికరించిరి. కవిత్వాభిరుచి యుగ్గుఁబాలతోఁ బెట్టినది. ఇఁక విశేష మేమన, ఆశువుగాఁ బ్రబంధశైలి శాస్త్రిగారి కలవడినది.

1879 లో శ్రీమాన్ గూడభూషి వేంకటాచార్యులుగారు పిఠాపురాస్థానమున నవధానము గావించిరి. అప్పుడు గంగాధర రామరాయేంద్రులు "మనయాస్థానమున నిట్టియవధానముచేయు ప్రతిభావంతు లుండిరే" యని ప్రశ్నించిరఁట. మఱునాఁడు దేవులపల్లి సోదరుల శతావధానము ప్రారంభమైనది. అనన్యసామాన్యమగు కవితాధారతో నాయవధానము జయప్రదముగా నెఱవేరినది. వేంకటాచార్యులవారు సోదరకవుల ప్రతిభకు నివ్వెఱపోయిరి. మహారాజు తమ సంస్థానకవులశక్తి కానందపడెను. అప్పటినుండియు నాస్థానమున వీరిపేరు మాఱుమ్రోగినది. సుబ్బారాయశాస్త్రిగారు 'రావువంశముక్తావళి' సంస్కృతమున సంతరించిరి. అది మహారాజు 1882 లోఁ గృతినందెను. ఆసందర్భమున నే ఆకవిరాజున కామహారాజు "రాజ్యమిచ్చితిఁ బుచ్చుకొ"మ్మనెను. 'సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్ ?'

1890 లో గంగాధరుఁ డస్తమించెను. ప్రభువియోగము భరింపలేక మనకవి పీఠికాపురాంగ్ల పాఠశాలోపాధ్యాయపదవి విడిచి యింటఁ గూర్చుండెను. ప్రభుభక్తి యిట్లుండవలయును. సుబ్బారాయశాస్త్రిగారి తమ్ములు తమ్మనశాస్త్రిగారియెడలను నీవిషయము నుపలక్షణ

విధిచే నన్వయించుకొందురని పునరుక్తి సేయలేదు. ఈసోదరకవుల సాహిత్యము గొప్పదని చెప్పుకొందురు. తమ్మనశాస్త్రిగా రన్నిటను నాయన్నకుం దగిన తమ్ముడు. అవధానాది ప్రదర్శనములలో నన్నగారి కంటెc దమ్ముడేమిన్న యని జనశ్రుతి. పాండిత్యమునమాత్రమగ్రజుని దే యగ్రతాంబూలము.

ఈకవిసోదరులు తమనాఁటికి సుగృహీతనాములైయున్న కూచి మంచి వేంకటరాయుడు-శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి-మాడభూషి వేంకటా చార్యుడు - మొదలగువారి పరిచితివలనc దెలుగుకవిత్వమున మెలకువలు, కొన్ని క్రొత్తపోకడలు సంగ్రహించినారు. మాడభూషికవిని మించి యవధానము చేసెదమని కృతార్థులైనారు. మదరాసుపుర ప్రముఖులనుగూడ నవధాన ప్రదర్శనమున మెప్పించిరి. ఎన్నఁడో పదునాఱవ శతాబ్దికిc బూర్వ మంకురితమై, మాడభూషికవిచేc బల్ల వితమై, దేవులపల్లి సోదరులచేc గోరకితమై, తిరుపతి వేంకటేశ్వరాది కవులచేc గుసుమితమై యీయవధానవిద్యాలత కొన్నాళ్లు దెలుఁగు మన్నీల తల లూఁపించి క్రమముగా వెఱ్ఱితలలు వేయుస్థితికి వచ్చినది.

సుబ్బారాయశాస్త్రిగారు ప్రభుల యభిషేకవిజయ వార్త విని వార్తాహరునకుc దమచేతుల నున్న బంగారుకంకణములు బహూ కారముచేసెనcట. ఆయన ప్రభుభక్తి యట్టిది. 'మహేంద్రవిజయ' ప్రబంధ మీవిషయమును తార్కాణించును. ఈ "మహేంద్రవిజయము" నవీనవాసన ముమ్మరముగా గల మధురకావ్యము. వీరికృతిసంతతికెల్ల నిది మేలుబంతి. మచ్చున కొకపద్యము చాలును.

తొలికోడి తానయై మెలుcగెత్తి మూcడుభం
గులc గుక్కుటేశుండు కొసరి కూసె
నాలమందలకెల్ల నధినేత తానయై
పొంకంబుగా నంది ఱంకెవైచెc

దీర్ఘంబు దేమ్చుహాస్తికిఁ బెద్ద తానయ్యె
లంబోదరుఁడు బృంహితం బొనర్చె
విహగంబులకు నెల్లఁ బెద్ద తానై కుమా
రుని కేకి పిలుచ నిస్వన మొనర్చెఁ
దాని లింగార్చకులకుఁ బ్రాభమికుఁ డనుచుఁ
బ్రాతరవిలంబు కేశనాగ్రకమునను
ఘంట మ్రోయించె వందిమాగధులు తామె
యగుచు భక్తులు పేర్కొని రపుడుమున్నె.

మహేంద్రవిజయము. (౬-౨౩౨)

శాస్త్రిప్రభృతుల దేవభాషాకవితాధోరణి కొక శ్లోకము మూదలింతును.

జ్ఞాతార శ్శ్రోతార స్స్తోతారః కాంక్షితార్థదాతారః
నేతార స్సంతి యదిఖ్యాతా రచయంతి సత్కృతీః కవయః

అన్నదమ్ము లిద్దరును సంస్కృతభాషా కవితలోఁ జేయితిరిగిన వారు. తమ్మనశాస్త్రిగారి ధారాశుద్ధి చూడుఁడు.

ఫణీశదరతారకా శశిఘృణీ ఘృణీధోరణీ
తృణీకరణనైపుణీ విలసితాపసవ్యాంగకమ్
గణాధిపసమర్చితం గణసుధీగణగ్రామణీ
పణాయితగుణాన్వితం మనసి కుక్కుటేశం భజే.

తమ్మనశాస్త్రిగారి తెలుగుకూర్పులలో నయనోల్లాసము, యతిరాజ విజయము పేర్కొనఁ దగినవి. నయనోల్లాసము ప్రభుపట్టాభిషేకోత్సవ సమయమున వెలువడినది. అప్పుడు 'నయనోల్లాసము' సార్థకత నొందినది. ఇందలిపద్యములు ధారాళముగా నడచినవి. కాని వ్యర్థపదములు బహుళముగ దొరలినవి. వీరి 'యతిరాజవిజయము' చక్కనిశైలిలో నున్నది. ఇది మూఁడాశ్వాసములు వ్రాసి తమ్మనశాస్త్రిగారు గతించిరి. వారి తరువాతఁ బిఠికాపురసంస్థానకవులు వేంకటరామకృష్ణులు తక్కిన

యాశ్వాసము పూరించిరి. యతిరాజవిజయమునుఁ దమ్మన శాస్త్రిగారు కృతిపతులచే నిట్లు చెప్పించుకొనిరి.

> పదునాలుగేఁడులఁ బొదలు ప్రాయమునాఁడె
>   కడఁగినాఁడవుగదా కవితసేయఁ
> బదునెన్మిదవయేఁట వ్రాక్రుచ్చితివిగదా
>   సకలేశశతక మాశ్చర్యఫణితి
> నిరువదైదవయేఁట విరచించితివిగదా
>   రావుసత్కులచరిత్ర ప్రబంధ
> మొడనడ వేనవే ల్నుడివినాఁడవుగదా
>   యసమపద్యముల నత్యాశులీల
> నేఁడు వేడుకఁ జేయుచున్నాఁడ వన్న
> దనుమతిని నయనోల్లాస మనెడుకృతిని
> క్షితిని బరికింప నతిశీఘ్రగతిని బూని
> సుకవితను గూర్చునేర్పు నీసొమ్ముగాదె !

అభిన వాంధ్రకవులలోఁ బ్రసిద్ధభావుకులగు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు తమ్మన శాస్త్రిగారి తనూజు లని తెలియనివా రుండరు.

పురాణపండ మల్లయ్యశాస్త్రి

1853 - 1925

ఆరామద్రావిడశాఖీయ బ్రాహ్మణుఁడు. తండ్రి: భద్రయ్యశాస్త్రి. తల్లి: రామమ్మ. జన్మస్థానము: పెదతాడేపల్లి. నివాసము: ఖండవల్లి, పిఠాపురము, రాజమహేంద్రవరము. జననము 1853 సం. అస్తమయము 1925 సం. గ్రంథములు: ఆంధ్రీకృతబ్రహ్మసూత్ర భాష్యము (4 సంపుటములు) ఉపనిషత్కథలు, శుక్రనీతిసారము ప్రభావతీప్రద్యుమ్న, భద్రాపరిణయములకు వ్యాఖ్యలు- ఇత్యాదులు.

మల్లయ్యశాస్త్రిగారు సంస్కృతాంధ్రములలో మహాపండితులు. వీరు ప్రఖ్యాతప్రాజ్ఞులైన వెంపరాల దక్షిణామూర్తిశాస్త్రిగారి సన్నిధిని సూత్రభాష్యము నియమపూర్వకముగ నధ్యయనించిరి. తర్కవ్యాకరణములు పఠించిరి. ప్రస్థానత్రయతత్త్వ మెఱింగిరి. ఇట్టివిద్యాధికారసంపత్తి కలిగినమీఁదట మల్లయ్యశాస్త్రిగారు పీఠికాపురాధిపతుల యాజ్ఞచే శాంకరసూత్ర భాష్యమును దేటతెల్లముగఁ దెలుఁగున వ్రాసిరి. సూత్ర భాష్యమునకు మఱికొందఱుకూడ తెలుఁగు వ్రాసిరి. ఆ యనువాదములలో నీయనదియే మేలైనది. బ్రహ్మసూత్ర భాష్యము ననువదించుటకు సామాన్యపరిజ్ఞానము చాలదు. సర్వశాస్త్ర ప్రవేశము, సర్వదర్శన పరిచయము నుండవలయును. అధీతిబోధాచరణ ప్రచారణము లున్నవారికిఁగాని యిట్టియుద్గ్రంథములు తత్త్వము తెలియదు. సర్వథా సామర్థ్యముకలిగి యాంధ్రవచనరచనలోఁగూడ నాఱితేఱినవారగుటచే మల్లయ్యశాస్త్రిగారు 'ఆంధ్రసూత్రభాష్య' మందు పాటుఁగొనున్న శైలిఁగూర్చింప గలిగిరి. విషయగౌరవ ప్రాశస్త్యాదులం బట్టియు నాంధ్రభాషకుఁ బుష్టికరమగుటం బట్టియు నీగ్రంథము శాశ్వతముగ నాంధ్రమున నుండఁగలదు. రచనావిశేషమున కీపంక్తులు పరికింపుఁడు.

"'శాస్త్రయోనిత్వాత్' – ఋగ్వేదాది శాస్త్రమునకుం గర్త యగుటవలన (బ్రహ్మము సర్వజ్ఞము) బ్రహ్మస్వరూప జ్ఞానమునందు ఋగ్వేదాదిశాస్త్రమే ప్రమాణముగుటవలన దానిచేతనే జగజ్జన్మాది కారణముగు బ్రహ్మము తెలియంబడునేని అనియర్థము." భా. గొప్పది

యును పురాణన్యాయ మీమాంసాదులగు పెక్కు విద్యాస్థానములచే నుపకరింపఁబడినదియు దీపమువలె సర్వార్థములఁ బ్రకాశింపఁ జేయునదియు సర్వజ్ఞకల్పము నగు ఋగ్వేదాదిశాస్త్రమునకు బ్రహ్మము యోని=కారణము. సర్వజ్ఞునిగుణమగు సర్వార్థములం బ్రకాశింపఁ జేయు శక్తితోఁగూడిన ఋగ్వేదాది శాస్త్రమునకు సర్వజ్ఞునికంటె వేఱొక దానినుండి యుత్పత్తి సంభవింపదు. పాణిని మొదలగువారివలనఁ దెలియందగినవానిలో నొకభాగమగు వ్యాకరణాదికమువలెనే యేయేవిస్తరార్థమగుశాస్త్ర మేయే పురుషునివలనఁ బుట్టుచున్నదో యాతఁడా శాస్త్రముకంటె నధికతరవిజ్ఞానము కలవాఁడని లోకమున సంప్రసిద్ధము .."

శాస్త్రిగా రీరీతిగఁ బూసగ్రుచ్చినట్లు సూత్రభాష్యభావము కొఱవడకుండఁ దెనిఁగించి యాంధ్రభాషకు మహోపకృతి గావించిన మహాశయులు. మల్లయ్యశాస్త్రిగారు "ఉపనిషత్కథలు" వ్రాసిరి. 'తులసీతిసారము' వచనమున రచించిరి. పింగళిసూరనార్యుని ప్రభావతీప్రద్యుమ్నమునకు వ్యాఖ్యవ్రాసిరి. వీరి గ్రంథములన్నియు పీఠికాపురప్రభువులే ప్రకటించిరి. అల్లమరాజు సుబ్రహ్మణ్యకవిగారి భద్రాపరిణయమునకు వ్యాఖ్యా విపులపీఠికలు రచించిరి. అనేకపాఠాంతరములతో ననుగుణమగు వ్యాఖ్యతో నాంధ్రభారతములోని కొన్ని పద్యములు వీరు పరిష్కరించిరి. ఈపీఠికలవల్ల వీరియాంధ్రకవిత్వ పరిశ్రమ తెల్లమగును. మల్లయ్యశాస్త్రిగారు పద్యకవిత్వమునఁ గృషిచేసిన కవులు కారు. అయినను నడుమనడుమఁ బద్యము లల్లునలవా టున్నది. అల్లినపద్య మందముగనే యుండును.

శ్రీరఘువంశ వారినిధిశీతమయూఖుఁడు జానకీమన
స్సారసచంచరీకము నిశాచరమత్తకరీంద్ర సింహామున్
ధీరజనాగ్రగణ్యుఁడు సుధీజనసన్నుతకీర్తిశాలియౌ
నారఘురామమూర్తి మదినాదర మొప్పఁగఁ గాచులోకముల్.

'ఆంధ్రసూత్రభాష్యారంభము'

శాస్త్రిగారి జనకులు గొప్పసంస్కృతాంధ్రవిద్వాంసులు. వారం ధులు. తొలుతతండ్రిగారికడనే మనశాస్త్రిగారు విద్యాభ్యాసము గావించిరి. తరువాత విజయనగరమునఁ గొన్నాళ్ళు పఠించిరి. 1877 లో బెజవాడ కడనున్న కొండపల్లి మిషన్ హైస్కూలులో నధ్యాపకులు. తరువాత రాజమహేంద్రవర పాఠశాలలో వడ్డాది సుబ్బారాయకవిగారి స్థానమున 1884 వఱకుఁ బనిచేసిరి పిమ్మట అమలాపురము హైస్కూలులో 1889 లోఁ బ్రవేశించి 1906 వఱకు నుండిరి. అటుతరువాత పిఠాపురాంగ్లపాఠశాలయం దాంధ్రాచార్యులై, ఆ సాస్థానమున నాంధ్ర గ్రంథ పరిశోధక వ్యాఖ్యాతలై శ్రీ సూర్యరాయాధిపతులచేఁ బరి పోషింపఁబడిరి. పిఠాపుర సంస్థానమంత్రి శ్రీ మొక్కపాటి సుబ్బా రాయఁడుగారు వీరికిఁ బరమమిత్రులు. సుబ్బారాయఁడుగారు మల్లయ్యశాస్త్రిగారికడ సూత్రభాష్య మధ్యయనించిరి. పోలవరాధీశులు కొచ్చెర్లకోట వేంకట కృష్ణారావుబహద్దరువారు మల్లయ్యశాస్త్రి గారికి శిష్యులు. శాస్త్రిగారికి ఆముక్తమాల్యదపై నెక్కుడయభిమాన మనియు, వీరి మురారిపాఠము వినఁదగిన దనియుఁ బెక్కురు చెప్పు దురు. వీరి సంభాషణము విచిత్రతరమై హాస్యప్రచురమై యుండెడిదఁట.

చిలకమర్తి లక్ష్మీనరసింహాకవి మల్లయ్యశాస్త్రిగారి మేనల్లుఁడు. అచ్చముగా, ఆయన మాటచాలిక మేనమామ పోలికయే. ప్రసన్న యాదవనాటకములో చిలకమర్తికవి యిటులు ప్రస్తావించెను.

గీ. శ్రీపురాణపండ కులాబ్ధి శీతకరుఁడు
పరువఁ డాంధ్రగీర్వాణ భాషావిదుండు
మల్లయార్యుండు నామేనమామ యగుటఁ
గవిత యెటులున్న నీకృతి గణుతిఁగాంచు.

పురాణపండ పండితుఁడు ఆంధ్రసూత్రభాష్యమువలన నవినాశమగు యశము సంపాదించుకొనిన రచయిత.

పారనంది రామశాస్త్రి

1853-1930

కాసలనాటి వైదిక బ్రాహ్మణులు. ఆశ్వలాయన సూత్రులు. కాశ్యపసగోత్రులు. తల్లి: రామలక్ష్మమ్మ. తండ్రి: ముఖలింగేశ్వరుఁడు. జన్మస్థానము: పిండివాడ (పర్లాకిమిడి సంస్థానమునకుఁ జెందినది). జననము: 1853 సం|| (పరిధావి శ్రావణ శుక్ల నవమి) నిర్యాణము: 6-12-1930 సం. గ్రంథములు: ౧. ఆంధ్రశబ్దచింతామణి (ఉద్ద్యోతినీ వ్యాఖ్య) ౨. ఆంధ్రమహాభారత విమర్శనము ౩. కురుక్షేత్రయుద్ధ కాల నిర్ణయము ౪ మధుకేశ్వరీయము (నాటకము. అముద్రితము).

శ్రీ రామశాస్త్రిగారు పెద్దగా నాస్తి కలవారు కాకపోయినను గొప్ప యాస్తికులు. పేరు మోసినపండితులు. శ్రౌతతీరు లెఱిఁగిన విమర్శకులు. సంస్కృతాంధ్రములలో సమతూకముగల పరిశ్రమ పాటవము గలవారు. తొలుతఁ గావ్యపాఠము గావించి శాస్త్రపఠనముపై మనసు గూరి బొబ్బిలిచేరి శ్రీ సుసర్ల సీతారామశాస్త్రిగారికడఁ దర్కాలంకార వేదాంతము లధ్యయనించిరి. సంస్కృతములో గ్రంథములు చదివి పాండితి సంపాదించి, పదపడి తెలుఁగుబాస పోలుపులు గుర్తించినారు.

పర్లాకిమిడిరాజు రామశాస్త్రిగారి సామర్థ్యము నెఱిఁగి సంస్థానోన్నత విద్యాలయమున నుపాధ్యాయపదవి యిడి గౌరవించిరి. ఆయుద్యోగము 1853 మొదలు 1911 వఱకు విచ్ఛిత్తి లేకుండఁ గొనసాగినది. శ్రీశాస్త్రిగారు తాత్త్వికదృష్టిగల కర్మిష్ఠియగుటచే, తనకుమారుఁడు పట్టభద్రుఁడై, యుద్యోగియై, పదిరాళ్లు సంపాదించుకొను ప్రయోజకుఁడై యుండుటఁజూచి తనపని చాలించుకొనెను.

దేవీభాగవతమును దెలిఁగించిన త్రిపురాన తమ్మయదొర వీరిని గౌరవించి ధన్యుఁడయ్యెను. ఉర్లాము మొదలగు సంస్థానములలో వీరు ధర్మాదిశాస్త్రముల పరీక్షల నెగ్గి యనుగ్రహింపఁబడిరి. పండితులలో శాస్త్రార్థ

ములు 'నీవా నేనా' యని చేయఁగల శ్రీ రామశాస్త్రిగారు చాలకాలము దాఁక తెలుఁగు నెఱుఁగరనుట యొక రహస్యము. గిడుగువారి వాద శంఖనాదములు చెవులఁబడి ఆంధ్ర భారతము తీరెట్లుండునో యని చదువ నారంభించిరి. అది మొదలు, యగస్త్యునివలె యావదాంధ్ర వాఙ్మయ మహోదధిని రామశాస్త్రిగా రాపోశనించిరి. దానిఫలమే "ఆంధ్ర మహా భారత విమర్శనము" ఇది 500 పుటలు పైబడినకూర్పు. ఉద్యోగ పర్వ విమర్శనము మాత్రమే యచ్చువెలుఁగు చూచినది.

ఆంధ్రశబ్దచింతామణిపై 'ఉద్ద్యోతిని' అను గొప్పవ్యాఖ్యా గ్రంథము వీరు రచించిరి. శ్రీ వీరేశలింగము పంతులుగారు చింతామణి నన్నయ కృతము కాదనఁగా, ఆ వాదము సరిగాదని రామశాస్త్రిగారు సోదాహ రణముగా నన్నయకృతమే యని నిరూపించిరి. ఇది తెలుఁగులో వీరి తొలిరచన. జంకులేనివిద్వాంసులగుటచే, వీరేమి వ్రాసినను స్వాతంత్ర్య రేఖలు స్పష్టముగ గోచరించును. 'జ్ఞ' యను వర్ణము కంఠ్యమా, తాలవ్యమా యను విషయమును జర్చించుచు గొప్ప విమర్శనము వెలువ రించిరి. వీరి విమర్శన రచన లెన్నియో 'భారతి' ప్రభృతి పత్రికలలోఁ బ్రచురితములు. వీరి సంస్కృతరూపక రచనకు దోహదము చేసిన మహా నీయులు పర్లాకిమిడి ప్రభువుల పిన్నతండ్రియగు నొక రాజుగారు. ఆయన గీర్వాణ వాఙ్మయాభిరుచి పెద్దగాఁగలవాఁడని ప్రసిద్ధి.

ధర్మశాస్త్రముపై రామశాస్త్రిగారికి మంచి యభినివేశము. నిరంత రము ధర్మగ్రంథావలోకనములోఁ గాలక్షేపముచేసి, మహావ్యాఖ్యా తగా, విమర్శకుఁడుగాఁ బేరందిన పారనంది పండితుఁడు తెలుఁగుభూమిలో దాఁగిన చిరత్న రత్నము.

వడ్డాది సుబ్బారాయకవి

1854-1938

(నియోగిబ్రాహ్మణులు. హారితసగోత్రులు.) తండ్రి: సూరపరాజు. తల్లి: లచ్చాంబ. జన్మస్థానము: నగరముతాలూకా లోని పాసెర్లపూడి. నివాసము: రాజమహేంద్రవరము. జననము: 30-7-1854సం - (ఆనంద నామ సం. శ్రావణ శు. 11 ఆదివారము). నిధనము. 2-3-1938. కృతులు: ప్రబోధ చంద్రోదయము, ఆంధ్రవేణీసంహారము, అభిజ్ఞానశాకుంతలము, మల్లికామారుతము, విక్రమోర్వశీయము, చండకౌశిక నాటకము, నృసింహావిశ్వరూపము, గౌతమీ జలమహిమాను వర్ణనము, భక్తచింతామణి, ఆర్తరక్షామణి, మేఘసందేశము, నందనందనశతకము, సతీస్మృతి, సుతస్మృతి, వసురాయచాటూక్తిముక్తావళి, శ్రీసూక్తివసుప్రకాశిక, సుగుణప్రదర్శనము - ఇత్యాదులు

ఉపాధ్యాయత్వమునం గవిత్వమునను సుబ్బారాయఁడుగారు చాల సమర్థులు. రాజమహేంద్రవరమునందలి సర్వకళాశాల వీరి యధ్యాపకత్వమున కాశ్చర్యపోయెడిది. టి. జె. కూల్డ్రిదొరయంతవాఁడు వ. సు. రాయకవిగారి పాఠము వినుటకుఁ జెవికోసికొని తెలుఁగుచాటున నక్కువాఁడని ప్రతీతి. అందులో నాయన భాగవతపాఠము మఱియు నద్భుతము. విని తీరవలె నని నాఁటి విద్యార్థులిప్పటికిఁ జెప్పుకొనుచుందురు.

మదరాసు గవర్నరైన సర్. కె. వి. రెడ్డినాయఁడు వీరికిఁ దెలుఁగున శిష్యుఁడు. విదేశీయుఁడు "హ్యామ్నెటు" దొర సుబ్బారాయుఁడు గారియొద్దఁ జాలకాల మాంధ్రభాష నభ్యసించెను. వీరికడ విద్యాభ్యాసము చేసి పైకివచ్చినవారు పెక్కుండ్రు. ఎంతవారైన వీరియెడ నమ్రులై యుండవలసినదే. ఆయన యితరులకు లొంగలేదు. విద్యార్థులకు లోఁకువకాలేదు. ఆత్మగౌరవము కాపాడుకొనుచుఁ దా మేస్థానమున నుండవలయునో, యాస్థానమున నుండుట వారి సహజగుణము. చూట

లలోఁ బొందిక, నడతలో నార్జవము, జీవికలో నిరాడంబరము వ. సు. రాయకవికిఁ బెద్దమనుష్యులలోఁ బేరుదెచ్చినవి. నచ్చినవారి నదేవనిగా నుతించుట, నచ్చనివారిని బట్టి దూషించుట వారిచేతఁగాదు. విద్యకుఁ దగినసుగుణసంపద యుండుటచే వసుకవి యశస్కీర్తి నందెను. సుబ్బారాయఁడుగారు తమ జీవితసంగ్రహము తెలియుటకీపద్యము వ్రాసికొనిరి.

పుట్టుక పాసెర్లపూఁడిలంకను, దండ్రి
 బంధుగులింట నానందముగను
మెత్తని పొత్తుల సత్తమిల్లుట, శైశ
 వక్రీడ, పదుకొండువత్సరములు
ప్రాయంబుదనుక నిరంగ మహోరంగిఁ
 గన్నవారల వియోగంబు నటనె
అక్కయ మొదలు పరాన్న మేడేండ్లు దొ
 డ్డమ్మపేట దివాణమందు, శ్రీము
ఖాబ్దమున సొంతకాఁపుర మక్కొటికనె
ప్రథమజాయావియోగహృద్వ్యథ గను, భావ
రాణ్మహేంద్రంబునందు నాంధ్రపుటొజ్జ
పదవి; వసురాయ చరితంబు ప్రథిత మివల.

సుబ్బారాయఁడుగారు చిన్ననాఁట దొడ్డమపేట దివాణమువారి పోషణమున నుండి విద్యాభ్యాసము చేసిరి. నాఁడు వీరిగురువులు వాసుదేవశాస్త్రులుగారు దొడ్డమపేటకు సమీపమునఁ గల 'భీమక్రోశపాలెము'లో భాగవతుల హరిశాస్త్రిగారను సుప్రసిద్ధులై యాగకరను లుండెడివారు. వారియొద్దఁ జదువుకొను విద్యార్థి యొకఁడు "శ్రీదక్షవాటినివేశ! శ్రీభీమేశా!" యను సమస్యను మనకవిగారి కీయఁగా వీరు దానిని పదిరకములుగాఁ బూరించి చూపించిరఁట. అప్పుడు వీరి గురువులు సంతసించి ముందుముందు నీవు కవిశేఖరుఁడ వౌదు వని యాశీర్వదించిరఁట.

అప్పటి కీయన వయస్సు పదుమూఁడేండ్లకు మించదు. ఈదిగువపద్యము ప్రస్తుతకవిగారి పుట్టుకను దెలుపుచు నెంతయందముగా నడచినదో పరిశీలింపుఁడు.

గౌతమిఁ గట్టి కాలువలు 'కాటను' ద్రవ్వినకాలమందె సం
భూతుఁడనైనవాఁడఁ బదుమూఁడగు నేఁడులయాడుతల్లికిన్;
మాతకు లేమిఁ బా; లచట మంటిని (మోసిడియుప్పురమ్ము)లే
ప్రీతిని నన్నుఁ జన్గుడిపి పెంచిరఁ యేమి ఋణానుబంధమో?

వసుకవిగారికృతులలో 'భక్తచింతామణి' జీవము గలకృతి. దీనిలోని పద్యములు చాలమందికిఁ గంఠస్థములు. (భక్తచింతామణి సామాన్య శతకము కాదు) "భావగాంభీర్యమందును దత్త్వబోధనమందును భక్తచింతామణి పద్యములు కొన్ని ప్రపంచ సాహిత్యమందలి యేకవితకును దీసిపోవు" అని విమర్శకులు వ్రాసియున్నారు.

తలిదండ్రుల్ బలెఁ దప్పులోఁగొనుచు వాత్సల్యంబునం బ్రోతు; నె
చ్చెలియుంబోలె సుధామయోక్తులను మాసేమంబెటింగింతు; కే
వలధర్మప్రభువట్లు నీప్రజలయిబ్బందుల్ తొలంగింతు; ని
న్నలమిం గొల్వమి మాయభాగ్యదశగాదే, భక్తచింతామణీ!

సేవింతున్ భవదీయపాదజలరుట్చింతానుపానంబుతో
దేవా! మందు; ననామయత్వము ప్రసాదింపంగదే మేనికిన్
బ్రావృణ్మేఘువుఁ బ్రావుగల్గినను, దానం బేర్చునే వృక్షముల్
నీవుండన్ హృదినాకు వ్యాధిభయమున్నే? భక్తచింతామణీ!

మున్నగు ననర్ఘమణులకుఁ దావల మీశతకము. ఇది భక్తిప్రధానమైన దైనను ననేకవిషయము లిందు సంధానింపఁబడినవి. పద్యభావములన్నియు నుదారములు. భాష మృదుల గంభీరము. తెలుఁగున 'భక్తచింతామణి' వలె నధికముగ నమ్ముడువడిన గ్రంథములు తక్కువ.

(సుబ్బారాయకవిశేఖరులు సూక్తిసుధానిధులు. ప్రౌఢతకు, భావసంపదకు వీరికవిత నిదానము. భట్టనారాయణుని 'వేణీసంహారము' వీరాంధ్రీక

రించిరి. ఆతనిశ్శైలి ఈయునకు సరిపడినది. అభిజ్ఞానశాకుంతలము, మల్లికా మారుతము, ప్రబోధచంద్రోదయము, విక్రమోర్వశీయము, కుందమాల మున్నగునాటకము లనువదించిరి. ఇవన్నియుఁ దెలుఁగువారికి శిరఃకంపన కారణములు, ఆంధ్రరంగస్థలములకు నలంకారములు, విశ్వవిద్యాలయము లకుఁ బాఠ్యములునై యశస్సు నార్జించుకొనినవి. అన్నినాటకములకంటెను వీరి 'వేణీసంహారము' వినుతి గనినది. సుబ్బారాయఁడుగారు చిన్ననాఁట నాటకములలో నభినయించువారఁట. వేణీసంహారమున ధర్మరాజపాత్ర మును దామే నటించినట్లు చెప్పుదురు. ఈకళాభిమానమే యిన్నినాట కములు వ్రాయించినది. నాటకకర్త నటకుఁడైనఁగాని నాటకము రసవత్త రముగా సంఘటింపలేదు. భవభూతికూడ నటకుఁడైనట్లు చారిత్రకులు చెప్పుదురు. సుబ్బారాయఁడుగారు పద్యములు చక్కఁగాఁ జదువు నల వాటు కలవారు. చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు 'స్వీయచరిత్ర' లో నిట్లు వ్రాయుచున్నారు: 'పద్యములు చదువుటలోను దండకములు చదువుటలోను మిక్కిలి నేర్పుగల సుబ్బారాయఁడుగారి నోటనుండి విని నప్పుడు నామెడలు పరవశమైనది.'

రసానుగుణమైన శయ్యాసౌభాగ్యము వీరి కవితకు నిసర్గజమయిన సుగు ణము. వేణీసంహారము లోని యీ భీమవాక్యము నరయునది.

తత ఘూర్ణద్ఘటవార్ధి మధ్య విలుఠన్మందాచలధ్వాన ధీ
రతఁ గోణాహతమై జగత్ప్రళయ గర్జన్మేఘ సంఘట్ట చం
డతఁ దృష్ణోగ్రరుపాగ్ర దూత కురురాణ్ణాశంకరోత్పాత
నతి! మత్సింహరవానుకారి రణనిస్వానం బిదే మ్రోగెడిన్.

మరల, దుర్యోధనుఁడు తండ్రిని బాసిన యశ్వత్థామను బరామర్శించు నివిలాపవాక్యమునుగూడ నరయునది.

దగ్గఱ రమ్మా; నాకతనఁదండ్రికిఁబాసినబిడ్డవైతె? నన్
బిగ్గఁగవుంగిలింపు సఖ! నీ కడుపొత్తని మేను హత్తఁగా

నగ్గురు బాహులట్టి భవదాయత బాహులు మేను సోఁకినన్
గగ్గురుపాటు సంభవముగా దెటులారట మొందు చుండినన్.

ఈ రెండు ఘట్టములలోఁ గవి వెలువఱించిన కవితా శయ్యా భేదములు సహృదయాస్వాద్యములు.

రాజమహేంద్రవరమున నాధునికాంధ్రకవిత్రయ మని పేరొందినవారిలో వీరొకరు. ఆంగ్లభాషావిశారదులగు మిత్రులతో నిరంతరము సంభాషించుచుండుటవలన వీరికవిత్వమునకుఁ బాశ్చాత్యకవిత్వమునందలి నవీన భావములు కొన్ని యబ్బినవి. వీరి కవిత్వరచన కేవలము ప్రాచీనఫక్కినే నడచిన దని చెప్ప వీలుకాదు. క్రొత్తభావము లెన్నో వీరిపద్యములలోఁ బరికింప వచ్చును. ఆశుకవిత యనిన సుబ్బారాయఁడుగా రసహ్యాపడువారు. కబ్బం బల్లుదుఁగాని యాశుకవనోగ్రవ్యాఘ్రసంస్ఫాళికే నబ్బబ్బా! గుఱిగాను...... అని వీరు బాధపడినారు. ఆశుకవిత నందముగాఁ జెప్ప సమర్థులే యైనను దానియందు వారి కప్రీతి. ఇది కొందఱకు వింతగా నుండును. పద్యము చెప్పి నాలుగైదుమాఱులు వెనుకముందు లాలోచించి సానఁబట్టినఁగాని వారెన్నఁడు ప్రకటింపలేదఁట. వ. సు. కవి తన ప్రతిభా ప్రభ నాంధ్రమునఁ బ్రపంచించి సహస్రమాసములు జీవించి చనిన మహాకవి. 1933 లో రాజమహేంద్రవరమున జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషన్మహాసభ కధ్యక్షతవహించి 38 లో జీవయాత్ర చాలించిరి. వ. సు. చరిత్రము మధురగంభీరమైనది. వ. సు. కవి సంకల్పసిద్ధుఁడు. వార్ధకమున నతఁడీ క్రిందివిధముగా దైవప్రార్థనము చేయువాఁడు.

కడచిననాళ్ళఁ బైఁబడిన కష్టములం దలపోయ నిప్డు నా
యొడలు గగుర్పొడంకుఁ జెమ రుప్పతిలుం బెడగొండలట్టినా
యిడుమల నెట్టు నన్మనిచి యీస్థితి నిల్పితో యంచు నబ్బురం
పడుదు, శుభాంతముం జలుపుమా వసునాటకముం జగత్కృపీ!

కోలాచలము శ్రీనివాసరావు
1854 - 1919

జన్మస్థానము: హంపీవిరూపాక్ష క్షేత్రసమీపముననున్న కమలాపురము. జననము: 13-3-1854 సం. నిర్యాణము : 20-6-1919 సం. గ్రంథములు: సునందినీపరిణయము, మదాలసాపరిణయము, శ్రీరామజననము, పాదుకాపట్టాభిషేకము, లంకాదహనము, ద్రౌపదీవస్త్రాపహరణము, కీచకవధ, బభ్రువాహననాటకము, హరిశ్చంద్ర, రుక్మాంగద, చంద్రహాస, శిలాదిత్య, ప్రతాపాగ్బరీయము, కాళిదాసు, ప్రహ్లాద, రామరాజుచరిత్ర, మైసూరురాజ్యము, చాందుబీబీ, కుశలవ (నాటకములు) హాస్యమంజూష, అగస్త్యబాలభారతశతకము, ఆంధ్రీకృతాగస్త్యబాలభారతము - మొదలగునవి.

పేరుమోసిన నాటకరచయితలిరువురు 'బళ్ళారి' ని పావనము చేసిరి. అందు మొదటివారు ధర్మవరమువారు. రెండవవారు శ్రీనివాసరావుగారు. వీరిరువురును న్యాయవాదులు. ఇరువురును నటకులు, ధనికులును. కృష్ణమాచార్యులవారి చిత్రనళీయ మెంత పేరు సంపాదించినదో, శ్రీనివాసరావుగారి రామరాజుచరిత్ర మంతప్రతిష్ఠ నార్జించినది. 'రామరాజుచరిత్రము' చారిత్రకము. తల్లికోటయుద్ధమునఁగీర్తిశేషుఁడైన యళియ రామరాజుకథ యిం దభివర్ణితము. వీరి మైసూరు రాజ్యము, ప్రతాపాక్బరీయము చారిత్రకములు.

వీరు గ్రామ్యభాష నొప్పుకొనరు. కళాశాలలలో గ్రామ్యము నుపయోగింపవచ్చు నన్నప్పుడు మదరాసు విశ్వవిద్యాలయమువా రేర్పాటుచేసిన సంఘమునకు శ్రీనివాసరావుగారు సభాపతులై వ్యావహారికమును నిరసించివైచిరి. సంఘసంస్కారమును గూడ వీరు కోరినటులు లేదు. నాటకములు విషాదాంతములు చేయుట వీరి కనిష్టము. ప్రాకృతాదిభాషలకు బదులువ్యావహారిక ముపయోగించ వచ్చునన్న వేదమువారి మతముసైతము వీరికి సమ్మతముకాదు. చారిత్రకములు, సంఘసాంబంధికములు నగునాటకములే యీనాఁట వెలయవలెనని వీరు చెప్పిపోయినారు. తెలుఁగునకు శ్రీనివాసరావుగా రిచ్చిన సందేశమునకు సంగ్రహ మిది :

"భాషను జెఱుచుట తప్పు. అశ్లీలము లుంట తప్పు. దుర్నీతికరములుగ నుంట తప్పు. బండుబూతుమాటల నీతిఁజెప్పుట తప్పు. పేరుపెట్టి దూషించి యెత్తివేయుట తప్పు. గ్రంథమునం దితివ్యాదులు తప్పులగునుగాని మిగతవి తప్పులుగావు. విషయవైశద్యము కొంతవఱకు నుండినఁజాలు. లోహములన్నియును స్వర్ణమయములు కాకపోయినను బనికివచ్చునవి యెవ్వియునుగావు పూర్వకాలమునుండియు బుద్ధికుశలులని పేరందిన పండితుల గ్రంథములు చదివి తమ బుద్ధిబలిమిని వానికిఁ జేర్చి యిప్పటివారు వ్రాయుగ్రంథములు చెడెనని చెప్పుట యసమంజసంబు."

శ్రీనివాసరావుగారు మల్లినాథసూరివంశీయులు. వీరిపూర్వజు లందఱును విజయనగరసంస్థానపండితులు. వీరు నాటకాంతసాహిత్యము నెఱిఁగి స్వాధ్యాయపాఠము చేసిరి. జ్యోతిషము తెలిసికొనిరి. 1870 లో ఎఫ్. ఏ. పరీక్షలో నెగ్గిరి. రివెన్యూడిపార్టుమెంటులోఁ బనిచేసి 1881 లో అనంతపురమండలము 'డిప్యూటీకలెక్టరు' కడ దివానుగా నుద్యోగించిరి. 1888 లో రెండవతరగతి ప్లీడరుపరీక్షలోఁ దేఱి బళ్ళారిని న్యాయవాదులైరి. అంతటినుండి వీరి సారస్వతసేవ యభ్యుదయ మార్గమునఁ బడినది. 1917లో కడపయందు జరిగిన ఆంధ్రసాహిత్యపరిషత్సభ శ్రీనివాసరావుగారి నధ్యక్షులుగా నాదరించినది. మండపాకపార్వతీశ్వరశాస్త్రి ప్రభృతులు వీరి కవిత్వమును గొండాడిరి.

శ్రీనివాసరావుగా రుదారభావులు. పండితులను సత్కరించిరి. కవులను సన్మానించిరి. పేదలను బోషించిరి. తెలుఁగునాఁట నాటకశబ్ద మున్నంతదాఁక శ్రీనివాసరావుగారి పేరు నిలఁబడుననుట నిశ్చయము. 'ప్రతాపాశ్వరీయము' లోని యొకపద్యముమచ్చు.

మూరెడు మీసలన్నెనిచి ముప్పిరిగాఁబలుమారుదువ్వుచున్
నేరుపుమీఱ దుస్తులను నీటుగఁ గట్టుచు వాలుఁబట్టుచున్
ధీరులమంచు నోటికసిదీఱఁగఁ బ్రల్లదమాడునట్టి యీ
భీరులఁ బోల కీవు రణభీకరవైతివి తక్కఁ గీర్తియున్.

శొంఠి భద్రాద్రిరామశాస్త్రి

1856 - 1915

జననము 1856. నిధనము 1915. జన్మస్థానము: పిఠాపురము సమీపముననున్న కొమరగిరి. వెలనాటివైదికులు. గౌతమగోత్రీయులు. తండ్రి: గంగరామయ్య. తల్లి: కామాంబ. రామచంద్రోపాఖ్యాన ప్రబంధకర్త వారణాసి వేంకటేశ్వరకవి యీయనకు మాతామహుఁడు. వంశీయులెల్లరు వేదవిదులు. కవికర్తృకగ్రంథములు: కాళిందీపరిణయము, శంతనూపాఖ్యానము (ఆంధ్రప్రబంధములు) చిత్రసీమ (కళాపూర్ణోదయమువంటి కల్పితకథా కావ్యము) శంబరాసుర విజయము (సంస్కృత చంపువు) శివరామశతకము, (ద్వ్యర్థి. అముద్రితము) ముక్తావళి (మదాలసకథగల సంస్కృతాంధ్ర నాటకములు—) మల్లిక (నవల–అముద్రితము) అహోబలపండితీయ వ్యాఖ్య–లఘుకౌముది(ఆంధ్ర టీక) జగన్నాథక్షేత్ర మాహాత్మ్యము, శ్రావణమహోత్సవ తారావళి – ఇత్యాదులు.

తిరుపతి వేంకటకవులు 'భద్రాద్రిరాముకరుణ యున్నచో మాకు లోపముండ'దని యొకనమస్కారబాణము విసరికాని పిఠాపురములో నవధానమునారంభింపలేదు. సిద్ధాంతకౌముదికిఁ బాఠము వ్యాఖ్యావిశేషములఁ గ్రోడీకరించి చెప్పువారలలో నాఁడు భద్రాద్రిరామశాస్త్రిగారు ప్రౌఢలు. "కౌముదీ యది కంఠస్థా వృథా భాష్యపరిశ్రమః" అనుసూక్తి వీరియెడల సముచితముగ సమన్వయించును. ఈయన వినయసంపద పాండిత్యమును మించినది. కర్మాచరణము కవితాపాటవమును దాఁటినది. బ్రాహ్మముహూర్తమున లేచి సచ్ఛాత్రుఁడై పిఠాపురములోఁ బాదగయాక్షేత్రమునకుఁ బోయి స్నానసంధ్యాదులు కావించి, కుక్కుటేశ్వర దర్శనము చేసి వచ్చి యింటఁ గూర్చుండి విద్యార్థులకుఁ బాఠములు చెప్పుకొనుచు సూర్యాలోకము లేకుండ జీవయాత్ర సాగించినధన్యుఁ డీయన. అలంకారగ్రంథము లాయన పెక్కుమందికిఁ బాఠము చెప్పెను.

కాని యాయనశిష్యులుమాత్ర మలంకారవిద్యాదగ్ధులు కారు. పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు భద్రాద్రిరామశాస్త్రిగారి శిష్యులు.

శాస్త్రిగారు తమయిరువదవయేట 'కాళిందీపరిణయ' ప్రబంధము రచించిరి. మచ్చునకీపద్యములు తిలకింపుడు.

కాముచ్ఛాయలు వెల్వరించు వలిపెల్ గాటంపు పీరెండఁ గెం
జాయల్ పూఁగదమ్ములంబుఁ బటవాసద్రవ్యముల్ గంధ చ
ర్చాయుక్తిం బలుతావు లీన సఖిహస్తం బూని వాహ్యాళికై
సాయంవేళల నత్తరంపుఁ దరుణుల్ జానొప్పఁ బోఁదోఁటలన్.

వలరాజు తనదుపనులన్
మొలఁగింపం జెంపకుండ నేర్పున దారిన్
గలనైచి పట్టి పసఁగాఁ
దిలకింపం దగిరి దోమతెరమంచములన్.

శంతనూపాఖ్యానము 32 వ సంవత్సరమున సంతరించిరి. అది చక్కని ప్రబంధము. ఈకవివరుఁడు కేవల ప్రాచీనకవితా ధోరణికలవాఁడే గాక నవీనపథమునఁ గబ్బము లల్లు మేధావి కూడను. వీరి 'చిత్రసీమ' కావ్యము పరికించిన నిది స్పష్టపడును. చిత్రసీమ కళాపూర్ణోదయమును బోలు కల్పితకావ్యము. ఇందుఁ గృత్యాద్యవస్థ లేదు. ఇది క్రొత్తపద్ధతి. "కలదొక రాచకూఁతురు .." అని కావ్యము నుపక్రమించినారు. ఇందలి యాశ్వాసములకు దళము లనిపేరు. అవియు ద్వితీయదళము మొదలు కొని యారంభింపఁ బడినవి. తత్కారణము గ్రంథములో విశదమగును. 'మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని శాస్త్రాణి ప్రథంతే' యనుచొప్పున నాది మధ్యాంతములందుఁ గృతినాయకుని స్తుతించుపద్యములు రచించె. ఆపద్యములు కేవలషష్ఠ్యంతములు గాక ద్వితీయాద్యంతములుగా వ్రాయుట మఱియు నూతనత. ఆపద్యములలో భూతభావికథలు సూచితములు. ఈకావ్యములోఁ గార్యముముందును, గార

ణము వెనుకను కన్పించుటచేఁ జదువుట కింపు పుట్టించుచుండును. ఇందు నాయకుఁడు చిత్రసీమ. ఈపేరులో నొకవిచిత్రము. సీమ నకారాంతము, ఆకారాంతము కూడ నుండుటచే స్త్రీత్వపుంస్త్వవ్యవహారముల కీపేరే యుపయోగించెను. ఇది యవశ్యపఠనీయకావ్యము. తెలుఁగుపలుకుబడి కొకమచ్చు.

క్రొవ్వుమెఱుంగుగ బ్బాలయు గుజ్జగుమేనులతోడ నోరఁగా
దువ్వి శిఖల్ లతల్ ముడిచి దొడ్డగు నిత్తడిపోఁగులం జెవుల్
గవ్వలపేరుల న్నదుకుఁగప్పఁగ వంకరబొల్లు డద్దిపై
గువ్వలవన్నె చేలమిడి కొందఱు చెందములు వచ్చి కొంకుచుర్.

చిత్రసీమ. 3 ఆ.

తెలుఁగునే కాక సంస్కృతమునను వీరి కవితాధార ధారావాహిని. వీరి 'శంబరాసురవిజయచంపువు' చదివితీరవలయును. అందలి కవిత్వ మిటులు ప్రవహించును.

నిర్మంజీరస్వన మవచనం సన్నకాంచీనినాదం
పశ్చాదేత్య ప్రియతమదృశా వంబుజాక్షీ పిధాయ
కాహం బ్రూహీ త్యభిహితవతీ కంకణానాం పిరావై
ర్జాతా సద్యః పులకితలసద్గాత్రయష్టి స్సభూవ.
వైదర్భ్యాదిసురీతి శ్శ్చకావళ్యాద్యలఙ్కృతి ప్రఖ్యా
సుకుమారత్వాదిగుణా రసికమనో హరతు కావ్యకన్యా మే.

పరమనైష్ఠికుఁడై, పండితశ్రేష్ఠుఁడై, కవిగరిష్ఠుఁడై చనిన భద్రాద్రిరామ శాస్త్రిగారి కృతులు చిరకాలము తెలుఁగుపుడమి నిలువఁగలవనుటకు సందేహములేదు. పోతనవలె, కూచిమంచి కవివలెఁ దనకృతులు భగవచ్ఛిహ్నితము లొనర్చిన మహాపుణ్యుఁ డీయన. ఈకవి తనవిషయమును శ్రీరామస్తవమున లగింపఁజేసి వ్రాసిన యీపద్యము చూడుఁడు :

బాల్యంబునఁ గవిత్వపటిమ చూప నొనర్చె
మృదులకాళిందీ పరిణయకృతిని
సంస్కృతకవితోరుసామర్థ్య మెఱిఁగింప
విరచించె శంబరాసురవిజయము
శబ్దార్థము ఖచిత్ర సరణికై శంతనూ
పాఖ్యాన నామకావ్యం బొనర్చె
రూపకకవితను జూప ముక్తావళి
రచియించె సంస్కృతాంధ్రములయందు
కృత్రిమకథాపటిమఁ దెల్పఁ జిత్ర
సీసుఁ గల్పించె మఱియును జేసెఁ బెక్కు
లెక్కి కవితను నిర్మింపనేనిఁ దగఁడె
రామపదసేవి భద్రాద్రిరామశాస్త్రి.

శాస్త్రిగారు ముక్తావళి యనునాటకము తెనుఁగుభాషలోను, సంస్కృత భాషలోను రచించుట మెచ్చఁదగినది. తెనుఁగు ముక్తావళిలోని పద్యములు హృద్యములు.

చ. వడఁకొదవంగఁ గొంచెముగ వంగిన గాత్రమునందు సన్నక
ప్పడమును గప్పి పిన్నిగహాభారముచేతఁ గృశత్వమంది యి
ప్పుడఁతుఁ గ్రీష్మమేఘతతి వారిదగర్భమునందుఁ గానవ
చ్చెను తొలిమించుపోల్కిఁ గనుపిక్కయుఁ గన్నులపండు
వయ్యెడున్.

తాడూరి లక్ష్మీనరసింహరాయకవి

1856 - 1936

మాధ్వమతస్థులు. తల్లి: సీతమాంబ. తండ్రి: రామారావు. నివాసము: రాజమహేంద్రవరము. జననము: 18 – 7 - 1856 సం॥ నల సంవత్సర - ఆషాఢ బహుళ ప్రతిపత్తు - శుక్రవారము. నిర్యాణము: 4–7-1936 సం॥ ధాతృసంవత్సర-ఆషాఢశుద్ధపూర్ణిమ.

కృతులు: ౧. శృంగారభూషణము. ౨. ఉన్మత్తరాఘవము. 3. రుక్మిణీ స్వయంవరము. (ఈ మూఁడు నాటకములు) ౪. భోజకుమారము. ౫. లక్ష్మీసంవాదము. ౬ చంద్రాలోకము ౭. మేఘసందేశము [పూర్వసర్గముమాత్ర మాంధ్రీకృతము] ౮. దైవప్రార్థనము ౯. భగవద్గీత (ఆంధ్రీకృతి) ౧౦. శృంగారతిలకము. ౧౧. ఋతుసంహారము ౧౨. జ్ఞానోదయము [ఆంగ్ల 'అణు' కావ్యముల ఆంధ్రీకరణము] ౧3. సనత్సుజాతీయము. ౧౪. నీతికథానిధి ౧౫. రసమంజరి [సంస్కృతమునకు తెలుఁగు సేఁత] ౧౬. చమత్కారచంద్రిక. ౧౭. పండితరాయశతకము. ౧౮. ఉద్యోగపర్వము [తెలిఁగింపు] ౧౯. బాలనీతి _ ఇత్యాదులు.

నాఁటిరాజమహేంద్రవరము - నేఁటిరాజమహేంద్రవరము కవులను బెంచుచున్న చక్కని పట్టణము. రాజరాజనరేంద్రుని మొదలు నేఁటి దాఁక, ఆపుర మొకేతీరునఁ గవులకుఁ గాఁపురము.

శ్రీవీరేశలింగముగారితో పాటు, శ్రీ సుబ్బారాయఁడుగారితో పాటు, వాసుదేవశాస్త్రిగారితో పాటు, లక్ష్మీనరసింహాంగారితో పాటు రాజమహేంద్రవరమునఁ గొన్నాళ్ళు నివాసమున్న కవులలో తాడూరి లక్ష్మీనరసింహరావుగా రొకకవి. ఈయనకు కవిగాఁ బేరున్నదిగాని, వాస్తవమునకు రాజకీయోద్యోగి. ప్రభుత్వోద్యోగులై తెలుఁగు సాహిత్యమును, గవిత్వమును సేవించినవారు మనవారిలోఁ బెక్కురు. జయంతి రామయ్యపంతులుగా రాజాతిలోవారు. ప్రకృతము మన తాడూరి లక్ష్మీనరసింహరాయకవివిషయము పరిశీలింతము. ఈయన

డిప్యూటీ తహసీలుదారు' గా, చింతలపూడి, భీమవరము, క్రొత్తపేట, కదిరి, కడప మున్నగు తావుల నుద్యోగించిరి. సాధారణముగా, ప్రతి మానవునకు అభిప్రాయ మొకటి - చేయుచున్నపని యొకటి యగుట జరుగుచున్నది. లక్ష్మీనరసింహారాయకవికి స్వతంత్రతతో జీవింపవలెనని కాని, పరాధీనమైన సేవకవృత్తిలోఁ గొట్టుకొనవలెననికాని తలఁపులేదు. కాని తప్పలేదు. 1912 సం॥ వఱకు తెలుఁగునేలలోఁ బలుప్రాంతములు పర్యటించి 'డిప్యూటీ తహశ్శీలుదారు' గాఁ బనిచేసి ప్రజలయాశీస్సులకు, అధికారుల యామోదమునకుఁ బాత్రుఁడై, గౌరవవేతనము పుచ్చుకొనెను. ఉద్యోగమునుండి విరమించిన 1912 మొదలు, ఇరువదినాలుగేండ్లు వీరుజీవించిరి. ఈయిరువది నాలుగేండ్లును సారస్వత సేవకై వినియోగ పడినవి. సేవావృత్తిని తూలనాడుచు 'భోజకుమారము' లో వ్రాసిన వీరిపద్య మిది:

సీ. చందమామను మించునందంబు గలదానిఁ
జీ! కురూపినిగాఁగఁ జేయుదాన
అలను మేరువునైన నడఁగించు దిట్టరిఁ
జీ! పదగాఁగను జేయుదాన
ఉక్కుమీఱి సురేంద్రు లెక్కసేయనివానిఁ
జీ! యస్వతంత్రునిఁ జేయుదాన
అల దేవగురునోర్చు నతిబుద్ధిశాలినిఁ
జీ! బుద్ధిహీనునిఁ జేయుదాన

గీ. అల్ల సత్యహరిశ్చంద్రు నట్టివాఁడు
చెప్ప నిజమును జీ! బొంకు సేయుదాన
అవనిని సేవ! కటకటా! యక్కటకట!
కలదె? నీ చేయలేని యకార్యమొకటి.

ఈ నాటకమున సేవాదైన్యము- అధికార మదాంధత-నిరర్థ బిరుదప్రదానము - మున్నగునవి పేర్కొని, వానిని నిరసించిరి.

1905 తరువాత నీకవి భగద్గీత - సనత్సుజాతీయములు తెలిఁగించిరి. భారతమున నుద్యోగపర్వమును వీరాంధ్రీకరించిరి గాని, యది నేఁటి

దాఁక వెలువరింపఁబడలేదు. తిక్కన సోమయాజి తెనుఁగులోఁ గొన్ని వేదాంతఘట్టములు పరిత్యక్తములయి యుండుట సహింపక, జగద్ధితమునకై భగద్గీత, ప్రజాగరపర్వము, సనత్సుజాతీయము తాడూరికవి యాంధ్రీకరించెనఁట. ఇవి పరికించి కొందఱు ప్రోత్సహింపఁగా ఉద్యోగ పర్వము సమగ్రముగా ననువదించెను. భారతపర్వములలో ఉద్యోగము సారవంతమని, లోకప్రవృత్తికి ముఖ్యమని యెంచి తెనిఁగించిరని కవి హృదయమును వారి కుమారులు వెలువరించిరి. ఈ తెనుఁగు నేత శ్లోకానుక్రమముగా నున్నది. ౧౯౦౫ లో ప్రథమపుత్రశోకము వలన విరక్తుఁడై యీకవి భగవద్గీతాదికృతులు తెనుఁగు సేసెనఁట. విదురనీతిలోని పద్యములు:

అవమానింపక యెట్టిదుర్బలుని నీర్ష్యాద్వేషియై నేర్పుతో
నపనీనాయక బుద్ధిపూర్వముగ నెయ్యన్ వైరినిం గొల్చుచున్
భువిలోఁ జాల బలిష్ఠునౌ పగతుతోఁ బోరాడ నావిక్రమం
బవురా! మేల్తఱివేచి తానెఱుఁగ నేఁడాతండు ధీరుండునూ॥

ఆపదవచ్చినప్పు డిసుమంతయు నొవ్వక జాగరూకుఁడై
యోపుచు శోభనార్థమయి యొప్పుఁ బ్రయత్నము లాచరించుచున్
సైఁచుచు నడ్మఁ గష్టమయిన న్వెలుఁగొందెడు నమ్మహాత్ముఁడో
భూప! ధురంధరుండు రిపుపుంజము నాతఁడు గెల్చునాతఁడే.

ఇఁక, ఋతుసంహారము నందలి శృంగారపద్యశైలి తీరు నారయునది.

ఒండొక పువ్వుఁబోఁడి సురతాగ్రతచే నొడలెల్ల డస్సి తా
మెందుగ రాత్రియెల్ల రతి మేల్కొనుట న్నయనంబు లెఱ్ఱనై
మండఁగఁ గొప్పువీడి భుజమండలిఁ దాండవ మాడుచుండ నీ
రెండ ప్రభాతవేళ మెయికింపుగఁ దాఁకఁగ నిద్రవోయెడిన్.

ఈ లక్ష్మీనరసింహారాయకవి కవిత యాత్మానందము నుద్దేశించి వ్రాయఁబడిన దగుటచేఁ దెలుఁగు ప్రజలు హెచ్చుగా జూడలేదు. ఈయన ధోరణిలో వ్యుత్పత్తి కంటెఁ బ్రతిభాభ్యాసముల పాలు మిక్కిలిగా నుండును. అందచందములకంటె నావేశము హెచ్చు.

కల్లూరి వేంకటరామశాస్త్రి

1857 - 1928

తల్లి: కామసోమదేవి. తండ్రి: వేంకటశాస్త్రులు. అభిజనము: గోదావరి మండలములోని 'ముగ్గుళ్ల'. నివాసము: రాజమహేంద్రవరము. పుట్టుక 16-9-1857. కడకాలము 29-5-1928. కృతులు: ౧ వంశముక్తావళి (ఆధ్యాత్మికపద్యకృతి) ౨ కోటిలింగేశ్వరశతకము. 3 హాస్యకుముదాకరము (ప్రహసనము) ౪ బాలవ్యాకరణగుప్తార్థప్రకాశిక. ౫ మేఘసందేశము (ఆంధ్రపరివర్తనము).

కల్లూరి వేంకటరామశాస్త్రిగారి కీర్తివల్లరికి గుప్తార్థప్రకాశిక యుపఘ్నము. బాలవ్యాకరణముపై వెలువడిన వ్యాఖ్యలలో నిది తొట్టతొలిది. వేంకటరామశాస్త్రిగారి సంస్కృతవ్యాకరణాభిజ్ఞత సర్వేలము. ఈవిషయమునకు గుప్తార్థప్రకాశిక ప్రత్యక్షరము సాక్ష్యమిచ్చును. వీరియభిప్రాయములలోఁ గొన్ని పొరపాటు లున్నవని విమర్శకు లెత్తిచూపిరి. అట్టివారిలో మహామహోపాధ్యాయ తాతా సుబ్బారాయశాస్త్రి, వజ్ఝల చినసీతారామశాస్త్రిగారలు ప్రముఖులు. ప్రతివాదుల విమర్శనములను మనశాస్త్రిగారు మహోపాధ్యాయులుగూడఁ జాలభాగము ప్రతిఘటించిరి. ఎవ రేమన్నను గుప్తార్థప్రకాశిక గొప్ప వ్యాఖ్య. "బ్రహ్మశ్రీ శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి పండితవర్య ప్రణీత హరికారికాంధ్రీభూత పరవస్తు చిన్నయసూరి కర్తృక బాలవ్యాకరణము" నకు వ్యాఖ్యానమని ముఖపత్త్రముపై వ్రాసికొనిగాని వేంకటరామశాస్త్రిగారు తృప్తిపడలేదు. బాలవ్యాకరణము చిన్నయోపజ్ఞము కాదనియు, శిష్టు కృష్ణమూర్తిశాస్త్రిగారి హరికారికల కనువాదప్రాయ మనియు వీరి యాశయము. దీనిని పెక్కుమంది పండితులు సోపపత్తికముగాఁ 'గాదు కా' దని ప్రతిఘటించిరి. పట్టినపట్టు వదలక పాండిత్య విశేషముచే స్వమత ప్రతిష్ఠాపనమున కెన్నో యుక్తులు ప్రకటించిరి. కాని యీవిషయమున మాత్రము వేంకటరామశాస్త్రిగారి పక్షము నెగ్గినట్లు తలంపఁజనదు.

వేద మధ్యయనించి, వేదాంత మభ్యసించి, భాష్యత్రయము పఠించి, సాహిత్యరత్నాకరము చుళుకించి మహోపాధ్యాయు లనిపించుకొనిన మహాశయులు వేంకటరామశాస్త్రిగారు. ఆంధ్రసారస్వతమున వీరి ప్రయోగపరిజ్ఞానపాటవము మిక్కిలి గొప్పది. గుప్తార్థప్రకాశికయే యీ వ్రాతను నిర్ధారించును. గుప్తార్థప్రకాశికవిషయమై విమర్శకులు వ్రాసిన విమర్శలపై "సమరాంగణ పార్థమూర్తి, ధటీ సూర్యప్రదర్శి, కన్నెపల్లి వేంకటసీతాపతిశాస్త్రి" మున్నగు పేరులతో సమాధాన వ్యాసములు వ్రాసిరి. ఈరచన లెల్ల శాస్త్రిగారి యసాధారణ ప్రజ్ఞా వైశద్యమును సహస్రముఖముల ఘోషించుచున్నవి. వేంకటరామశాస్త్రిగారిని మించిన పండితు లుండవచ్చును గాని చమత్కారముగా వీరివలె 'కాని దవు ననియు, నయినది కాదనియు' శాస్త్ర ప్రామాణ్యము చూపి సమర్థించువా రరుదు. 'సుమనోల్లాస' శబ్దసమర్థనమున నీశక్తి తెల్లమగును. ఈయన మేధాసంపత్తి యత్యద్భుతమని వీరిప్రత్యర్థులగు పండితులే శ్లాఘించు చుందురు. వేదాంత మెఱిఁగిన విద్వాంసు లయ్యు శాస్త్రిగారు శివాద్వైతులు. ఈశ్వరాసిద్ధివిషయమున వీరి వ్యాసరచన బహుళముగ సాగినది. 1885 మొదలు రాజమహేంద్రవరమున 'టౌన్‌స్కూలు'లో సంస్కృతోపాధ్యాయులై ట్రైనింగుకాలేజిలో సంస్కృత ప్రధానోపదేశకులై, సర్కారుకళాశాలలో గీర్వాణభాషాగురుపదారూఢులై, కొవ్వూరు సంస్కృతకళాశాలలో ప్రధానదేశికులై, విద్యార్థుల నెందఱనో విద్వాంసుల నొనరించిన యాచార్యశేఖరుడీయన. జ్యోతిశ్శాస్త్ర విదులైన నాఁటిపండితులలో మనశాస్త్రిగారిదే పై చేయి యన్నట్లు 'చతురస్యా' ది రచనలు చాటుచున్నవి.

వేంకటరామశాస్త్రి చరణముల తెలుఁగుకవితయు, గీర్వాణ కవితయు మాధురీభరితము.

పరిభాషావిధిశాస్త్రముల్ స్వపదసంబంధైకవాక్యత్వ వై
ఖరితో రంజిల్లి కార్యకాల మనుపక్షం బందు నున్నట్లు ని
ర్భరరాగంబున నల్లుకొన్న రసిక ప్రాచీనజాయాపతుల్
పరసౌఖ్యంబిడి ప్రోచుతన్ ! దివిని సుబ్రహ్మణ్యశ్రేష్ఠాత్ములన్.

ఈపద్యమునఁ బాండితీప్రతిభ, కవితామాధురి యొకదాని నొకటి మించి పారపాచ్ఛ్యములు లేక పొలుపొందినది. వీ రనువదించిన మేఘసందేశము లోని యొక్క పద్యము పొందుపఱుతును.

తమ్ముఁడ మేఘుఁడా! తిథులఁ దద్దయు నెన్నుచు సాధ్వి మన్నెదుం
జుమ్మి నిజంబుగా నగనెఁ జూచెదువో గమనంబు సార్థమా
నెమ్మిని నిండి పుష్పసరణిః విరహంబునఁ దీఁగఁబోండ్ల జీ
వ మ్మొఘదూడఁ జూడ సుమబంధము వైఖరి గాన నిల్చుగా.

ఈ మహోపాధ్యాయులు ప్రతిదినము స్నాన సంధ్యాద్యనుష్ఠానము గావించి పార్థివలింగపూజ, లలితామంత్రజపము చేయుచుండెడివారు. ఈలలితానుతి కనుఁగొనుఁడు.

లలితాం కలితాం కదంబపుష్పై
ర్లలితాం సాంబశివేన మాతరం
లలితాంబరధారిణీం లతాంగీం
ఫలితాం తాం రసవాచ మర్థయే.

తిక్కన సోమయాజికి గురునాథుఁడు లేఖకుఁడైనట్లు మన వేంకటరామ శాస్త్రిగారికి సుంకర రంగయ్యగారు లేఖకుఁడై గ్రంథరచనోత్సాహము కలిగించెనఁట. రంగయ్యగారు వీరికిఁ బ్రియశిష్యులు. 'గుప్తార్థప్రకాశిక' రంగయ్యగారి కర్తృత్వముద్రతో మొదట వెలువరింపఁబడినది. శాస్త్రి గారి ప్రియశిష్యుఁడగుటచే వారిగ్రంథము సంగ్రహించె నని వదంతి కాని రంగయ్యగారు పీఠికలో 'సంస్కృతవ్యాకరణవిషయ మున్నచోట గురువులు వేంకటరామశాస్త్రిగారు పూరించి పరిష్కరించి' రని వ్రాసికొనిరి. ఇట్టి గ్రంథచౌర్యము తొల్లిటినుండియు జరుగుచునే యున్నది. నేఁడు క్రొత్తగాదు.

వైయాకరణ శిరోభూషణులు, వ్యాఖ్యాతృశిఖామణులునగు వేంకటరామశాస్త్రిపాదుల కీర్తి జ్యోతిని శాశ్వతస్థితితోఁ బ్రకాశింపఁజేయునది బాలవ్యాకరణగుప్తార్థ ప్రకాశిక యొక్కటే.

మచ్చా వేంకటకవి

1856 - 1903

తెలగాణ్యులము. జననము 1856సం. రాక్షసనామసంవత్సరము. నిర్యాణము: 9. జనవరి 1903. తండ్రి: గంగయ్య, పుట్టినయూరు నైజాము మండలములోని జాల్నా. గ్రంథములు: ౧. శ్రీశుద్ధాంధ్రనిరోష్ఠ్యనిర్వచన కుశచరిత్ర ౨. వైదర్భీ పరిణయము ౩. చెన్నకేశవ రామాయణము (రామాయణ సంగ్రహశతకము) ౪. ఛాయాపుత్ర శతకము (శనిస్తవము) ౫. రుక్మిణీనాటకము ౬. ద్రౌపదీవస్త్రాపహరణము ౭. మయూరధ్వజోపాఖ్యానము ౮. అంబరీషోపాఖ్యానము (పయిమూఁడును గాన ప్రబంధములు) ౯. ముఖలింగేశ్వరోదాహరణము. ౧౦. జావళీలు. ౧౧. హరిభజనకృతులు.

మచ్చావేంకటకవి పేరు తలఁపుగొన్నపుడు మఱపురాని యీ క్రింది విషయము మామిత్రులవలన విన్నది యుండును మనవి సేయవలసియున్నది.

ఇది 1900 సం॥ ప్రాంతములో జరిగిన ముచ్చట. ఇచ్ఛాపురగ్రామమున వేంకటకవియు, దర్భా వేంకటశాస్త్రియనుపేరుగల డిప్యూటికలెక్టరు హోదాలోనున్న యొకరును గలసికొనిరి. వీరిరువురు స్వల్పమైన పరస్పర పరిచయము గలవారు. కలసికొనఁగానే వేంకటశాస్త్రిగారు వేంకటకవినిజూచి "ఓహో, మచ్చాకవి! యెప్పుడువచ్చితి" వనెను. వెను వెంటనే వేంకటకవి "ఓహో, దర్భాశాస్త్రి! మూనాళ్ళయి వచ్చితి" నని బదులుపలికెను. అపుడు కలెక్టరు హోదాలో నున్న పెద్ద మనిసి 'వేంకటకవిగారూ! వేరుగాఁ దలంపకుఁడు. మీరు వయస్సునఁ జిన్నలగుటచేఁ జనవుగొని యటులు సంబోధించితి' నని సర్దుకొనుచుండఁగా, వేంకటకవి యందుకొని "తామేల యటులు భావించితిరి? 'వేంకట' శబ్దముపయి మీ కనాదరభావ ముండెనేమో యనుకొని యిటులు సంబోధించితి"నని ప్రత్యుత్తరముచెప్పెను. ఈసమయ స్ఫురణ

మునకుఁ బ్రక్కనున్న వారు విజృంభింపబడి నవ్విరి. అధికారి సరసుఁడగుటచే వేంకటకవి యాత్మగౌరవమునకు సంతసించెను.

ఇట్టిదే వేఱొక సన్నివేశము. శ్రీవిక్టోరియా మహారాజ్ఞి గతించిన సందర్భమున పర్లాకిమిడి కళాశాలలో శోకపరామర్శసభ జరిగెను. ఆ యాసభకు రాజుగారును, మహోన్నతులయిన యాంగ్లేయోద్యోగులును, కవులును చెక్కు ఱక్కుడ నుండిరి. మన వేంకటకవి యా కళాశాలలోఁ బ్రధాన పండితుఁడుగా నుండెను. మహారాజ్ఞి నిర్యాణమును గూర్చి వేంకటకవియుఁ గొన్ని పద్యములు రచించి సభలోఁ జదువ నుండెను. కొంతతడవునకు వారివంతు రాఁగాఁ గాలిజోడువిడక గద్దెపై కెక్కి ముద్దులొలుకు గళస్వరములోఁ దన మధురపద్యములను పఠింప మొదలిడెను. అపుడు రాజుగారికార్యదర్శి చింతలపాటి హనుమంతరావుపంతులుగారు తొందరపాటున లేచి దేశభాషాపండితులకు వర్తమానగౌరవాచారపక్కి తెలియదనియు, నిట్టి వారిని వేదిక నెక్కంపరాదనియు నొక్కి సభలోఁ జెప్పెను. అంతట వేంకటకవి యేదో బదులు పలుకుచుండగా, ఆకళాశాలలో నపుడు ప్రథమ సహాయోపాధ్యాయులుగా నున్న శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు లేచి యిట్లు పలికెను: “వేంకటకవి సామాన్యకవి కాఁడు. ఆంధ్ర మండలములో నితనివంటి కవులు చాల తక్కువగా నున్నారు. ఇతని కవిత్వ పటుత్వము నేఁటివారిలోఁ గొందఱకేగాని లేదు. ఇట్టివానికి స్వేచ్ఛ నీయవలయును.” రామమూర్తి పంతులుగారి యీమాటల కచటి సభ్యులు నివ్వెఱపడి చూచుచుండిరి.

పైనుదాహరించిన రెండు ముచ్చటలవలనను మన వేంకటకవి మంచి సమయస్ఫురణము, నిరంకుశత కలవాఁడనుట స్పష్టము. కవి వ్యుత్పన్నుఁడయినపుడుగాని నిరంకుశత యాదరింపదు. కవిత్వము - వ్యుత్పత్తి రెండును గలవాఁడు మన వేంకటకవి.

ఈ కవిపూర్వులు నాఁటికి రెండునూర్లవండ్లక్రితము మచలీ బందరు నుండి విశాఖపట్టణమండలములో నున్న శ్రీకాకుళమునకుఁ బోయి

మహమ్మదీయ ప్రభుసైన్యములో సరదారులుగా నుద్యోగించిరట. ఈ కవి తండ్రి గంగయ్య పటాలములోఁ బనిచేయుచుండఁగా జాల్నా పురిలో నీయన జన్మము సంభవించెను. ఈ గంగయ్య తెలుఁగు సారస్వతము కొంత యెఱిఁగినవాఁడు. బ్రౌనుదొరకు సమకాలికుఁడు. నాఁడు జిల్లా జడ్జీగానున్న బ్రౌనుతో రాజమహేంద్రవరమున నున్నపుడు చెలిమి కలుపుకొని మన్ననలు పొందెను. ఈ సందర్భము వేంకటకవి తన వైదర్భీపరిణయ కావ్యమున నిట్లు సూచించెను.

శా. సీ. పీ. బ్రౌన్‌దొరగారు మండలపు జడ్జీ సుప్రమేయంబుగం
దేపారం జని గంగయాహ్వయుఁడు హాయింగాంచి తానాంధ్ర వి
ద్యాపాండిత్యము చూపి గ్రంథపఠనాద్యస్తోక నైపుణ్యమున్
జూపెన్ రాజమహేంద్ర పట్టణమునన్ సూర్యుత్తముల్ మేలనన్.

ఈ వేంకటకవి మూఁడేండ్ల పసిప్రాయమున నుండఁగా 'జాల్నా' లో నొకచోరుఁడు మిఠాయిపొట్లము తినఁజూపి యెత్తుకొనిపోయి, మెడలి బంగారము నూడఁబెరికికొని దవ్వుల నొక పాడునూతిలోఁ బాఱవైచెనట. ఆపసిబిడ్డ తండ్రులు సైనికోద్యోగులగుటచే నలువురు నాలుగు మూలలకు వెళ్ళి వెదకఁగా, నీరులేని పాడునూత నేడ్చుచున్న పిల్లవానిని బయటకులాగి బుజ్జగించుచున్న గొటసాకులు, వారికాబిడ్డ నిచ్చి బహుమానితులయిరట. ఆపసిబిడ్డ చెవుల నాటుబోళ్ళు చోరునిచేఁ ద్రెంచబడుట కారణముగా, చెవికమ్ములు వేంకటకవికి నుత్తి కలిమిలేదు. ఇట్టి గండము గడచిన పసిబిడ్డ పండితకవి కావలయునో?

వేంకటకవి తొట్టతొలుతఁ దండ్రికడనే తెనుఁగు పొలుపులు గుర్తుపట్టెను. సంస్కృతము తెలికిచర్ల శివరామశాస్త్రిగారి కడ నభ్యాసము. శ్రీకాకుళము హైస్కూలులో ఆంగ్లభాషాపఠనము-గంజామమండలము

లోని పురుషోత్తమ పురములో 'సబురిజిస్ట్రారు' గాఁ బనిచేయుచుండిన వేంకటకవి భావమీఁద నుక్కువతో, పర్లాకిమిడికళాశాలలో ప్రధాన పండితపదవి లభింపఁగా నది గ్రహించెను. అదిమొదలు వేంకటకవి సారస్వత వ్యవసాయమునకొక మెఱుఁగుఁగాలము. ఈయన రచనలు ప్రధానముగా నాఁటి అముద్రిత గ్రంథ చింతామణి (నెల్లూరు) పురుషార్థ ప్రదాయిని (బందరు) పత్రికలలోఁ గాన నగును. మన వేంకటకవికి సమస్యా పూరణములపై వేడుక మెండు. 'వార్తాలహరి' యను పత్రికలో త్రిపురాన తమ్మయకవి (ఆంధ్ర దేవీభాగవతగ్రంథకర్త) యొసఁగిన "ప్రద్యుమ్నాగారమందు భానుఁడు వొలిచెన్" అను సమస్యకు వేంకటకవి వ్రాసిన పూరణములెట్టి మధురధోరణిలో నున్నవో చదువుఁడు. ఏకారణముననో యివి వేంకటకవి తనశిష్యుని పేర వెలువరించెను.

క. మద్యమ్మునఁ ద్రావినావో
విద్యున్నేత్రల గుఱించి వెతఁ జెందితివో
విద్యావిహీన! యొక్కడి
ప్రద్యుమ్నాగారమందు భానుఁడు వొలిచెన్!

క. విద్యానిధి విటుఁ డొకసతిఁ
జోద్యమ్ముగఁ గూడునెడ రజోగుణ మిషచే
హృద్యమ్మగు నక్కొమలి
ప్రద్యుమ్నాగారమందు భానుఁడువొలిచెన్.

క. విద్యాధరార్చితా! యుర
పద్యమ్మున నీసమస్య పరఁగ ముంగితున్
హృద్యమ్మగు ప్రాగ్గిరి దీ
ప్రద్యుమ్నాగారమందు భానుఁడు వొలిచెన్.

ఈవేంకటకవి సాహిత్య వివాదములు మొదలగునవి యానాఁటి ఆంధ్ర భాషాసంజీవని, హిందూజన సంస్కారిణి (చెన్నపురి) బుధవిధేయి మున్నగు పత్రికలలోఁ గననగును.

మండపాక పార్వతీశ్వరశాస్త్రి యీవేంకటకవి నిటు లుట్టంకించెను :

మచ్చరము లేదు కవితలో మచ్చలేదు
మచ్చయిన లేదు నుతికి సామ్యమ్మచ్చలేదు
మచ్చయన మెచ్చఁదగు పుట్టుమచ్చగాన
మచ్చవేంకటకవినామ మచ్చమయ్యె ॥

20. 2. 1894 సం॥

బొబ్బిలి

ఆకొండి వ్యాసమూర్తిశాస్త్రి

1860–1916

ఆరామద్రావిడ శాఖీయులు. ఆశ్వలాయనసూత్రులు. ఆత్రేయస గోత్రులు. జన్మస్థానము: ఖండవిల్లి. నివాసస్థానము: కాకరపఱ్ఱు (తణుకు తాలూకా). రాజమహేంద్రవరమున నుద్యోగము. తల్లి: వేంకటాంబ. తండ్రి: వేంకటశాస్త్రి. జననము: 1860 సం. నిర్యాణము: 2-2-1916 సం. కవికర్తృక గ్రంథములు: శ్రీమహాభారతనవనీతము (పదుమూఁడు పర్వములు) ప్రబోధచంద్రోదయము, అనర్ఘ రాఘవము, శుద్ధాంధ్రఋతుసంహారము, గంగాలహరీస్తోత్రము, భామినీవిలాసము, అధ్యాత్మరామాయణము, సూర్యశతకము (మయూరకవిది- ఆంధ్రీకృతము), భారతఫక్కి (విమర్శ), పరాశరస్మృతి (తెనుఁగువచనము), కృష్ణా పుష్కర మాహాత్మ్యము.

చవులువుట్టఁ బ్రబోధచంద్రోదయముఁ జేసెఁ
దెలుఁగులలోని నిగ్గులు ఘటించి
తెలిఁగించెఁ దలలూఁపఁ బలుకులఁ దులదూఁచి
రమ్యభంగి ననర్ఘ రాఘవంబు
పండితరాజప్రబంధమ్ము లాంధ్రీక
రించెఁ దత్తద్భావరీతు లెఱిఁగి
పరివర్తన మొనర్చె బాసలోసకి ఋతు
సంహారకృతి నదోషత నెనంగ
నాంధ్రవాగ్దేవతా చతురాస్యుఁ డతఁడు
సంస్కృతోక్త్యభినవపతంజలి యతండు
ప్రథితవాగర్థరసమహోదధి యతండు
ధూర్తరిపుశస్త్రి యావ్యాసమూర్తిశాస్త్రి.

'వ్యాసమూర్తిశాస్త్రిగారి కవిత్వము స్వయంపాకమువలె శుచిగా నుండునేగాని ద్రాక్షాపాకమువలె రుచిగానుండ' దని యొకవాడుక. ఈ వాడుకకు వారు మహాపండితులగుటయే కారణము. శాస్త్రులుగారు రాజమహేంద్రవర పురవీథిని నడచుచుండునపుడు ప్రక్కప్రక్కలఁ బోవు పండితులు 'అదిగో విజ్ఞానసర్వస్వము' అని చెప్పుకొనుచుండెడివారు. ఆ మహాశయునకు జోహారులనందుకొనుటయే సర్వకళాశాలలోని యుపాధ్యాయత్వమునకు మించిన పెద్దయుద్యోగ మైపోయినది. ఆ దివ్య తేజస్వి సారస్వతపీఠమునఁ గూరుచుండి సాహిత్యగోష్ఠి సల్పునపుడు సరస్వతి వ్యాఖ్యానమును బడసినటులు కలపండువయ్యెడిది. ఆయన మహామహోపాధ్యాయులు కారు. కళాప్రపూర్ణులునుగారు ఈ మహా బిరుదములను దాఁటి యన్వర్థనాముఁడైన పండిత మూర్ధన్యుఁ డాయన. సంస్కృతాంధ్రములలో నఖండమైన పాండిత్యము. కవితారచనలో ననమానమైన వేగము. భాష్యత్రయమునకుఁ బాఠములు చెప్పినారు. అలంకార శాస్త్రములలోఁ దగిన పరిచయము. నాఁటి సంస్కృతాంధ్ర ములలో నెవరికే సందేహము వచ్చినను వీరు తీర్చుచుండెడివారు. ప్రమాణములు కావలసినను ప్రయోగములు కావలసినను నిఘంటువులు తిరుగవేయ నక్కఱలేదు ఆయనసన్నిధికిఁ బోయినఁ జాలును.

వ్యాసమూర్తిశాస్త్రిగారి కనర్ఘ రాఘవ మభిమానగ్రంథము. దాని నాంధ్రీకరించిరికూడను. వ్యాసేశ్వరుఁ డిష్టదైవము. తమకృతులన్నియుఁ గేశవమూర్తి వ్యాసేశ్వరునకే యంకితములు. ఈ యాంధ్రవ్యాసుఁ డొక తుంగచాపపై నొకయుత్తరీయమును బఱచుకొని యొకవంక సంస్కృత మహాభారతమును జూచుకొనుచు సులోచనములజోడు జారిపోవు చుండఁగా పట్టి సవరించుకొనుచు 'మహాభారతనవనీత' రచనా నిమ గ్నుఁడై యున్న ఘట్టము-ఆమహాశయుని దివ్యదృశ్యమును గనులారఁగాంచు భాగ్య మాంధ్రులకింక దురాపము. ఒకతూరుమాత్ర మొకఁడు సవరింపఁగాని

లేక తూచాలు తప్పక ఫుట్ స్టాపులతో - శకటరేఫములతో - నరసున్నలతో నిప్పటికిని నవనవముగానున్న వారి భారతపు వ్రాత ప్రతిని సాక్షి పర్వముగా నవలోకించువారిదే యదృష్టము. పదుమూడు పర్వములు మాత్రము వ్రాతలోనున్నది. అచ్చుపడినది యాదిపర్వ మొక్కటియే. మహాభారతమునుండి నవముగా నీతమైనదనుసర్థము వచ్చునట్లును, మహాభారతములోని నవనీత తుల్యమైన సారతరపదార్థ మనునూహ కలుగునట్లును దీనికి 'మహాభారతనవనీత' మనునామకరణము శాస్త్రులుగారు చేసియుందురు. ఇది మూలమునకు ముక్కకు ముక్కగాఁ జేసిన యాంధ్రీకృతి గాదు. ఈ వ్యాసభారతమునకుఁ టీక వ్రాయుచుఁ టీకాపురసంస్థాన కవులు ఓలేటి వేంకటరామశాస్త్రిగా రిట్లులనిరి.

"శ్రీ వ్యాసమూర్తి శాస్త్రులవారు తొలుదొలుత నీభారత రచనమున కారంభించినపుడు నేనును నామేనత్తకుమారుఁడు రామకృష్ణశాస్త్రియు నన్నద్దురు దేవసమానులు, నత్యంతాప్తబంధువులు నగు శ్రీశాస్త్రులుగారి యొద్ద మాకుఁగలిగిన చనవునంజేసి 'ఆర్యా! కవిత్రయాంధ్రీకృతమహాభారతము సర్వాంగసుందరమైవిరాజిల్లుచుండ మరల నీభారతనవనీతరచనకుఁ బూనుకొనుట యెందుల' కని నిర్భయముగా నడగితిమి. అప్పుడు వారు సెలవిచ్చిన యుపపత్తు లివి: "వ్యాసభట్టారక ప్రోక్తమైన శ్రీమహాభారతమును నన్నయభట్టారకాదులు నవరసభరితముగ నాంధ్రీకరించిన సంగతి వాస్తవమే. వారి కవితారచనాదులు నిరుపమానములై సర్వజనాహ్లాదకరములై యుండుటయు యథార్థమే. నేనిప్పుడు వారికవనమున లోపములు గలవనుతలంపుతోఁ గాని, వారికవిత్వము నతిశయింపవలయుననుకోరికతోఁగాని యిందులకుఁ బూనుకొనలేదు. పంచమ వేద క్షీరవారాశినుండి నేనును నాశక్తికొలఁది కొంత నవనీతము నెత్తఁ దలచితిని. ఆ గభీరవారాశిగర్భమున విలీనములైన నీతిరత్నములఁ గొన్నిటి నాంధ్రులకు వెల్లడిసేయుట యవసరమనితోఁచినది. ఇదియునుఁగాక,

నాయంతరంగమున నొకపవిత్రమైనయభిలాషయు నైతమున్నది. అది యేమనఁగా వ్యాసేశ్వరుఁడే మాకుఁ గులదేవత ఆ వ్యాసభట్టారకుని యెడల నాకెంతయో భక్తి కలదు. సంస్కృతభాషయందు వ్యాసప్రోక్తమైయున్న మహాభారతమును దెనుఁగునఁ గూడ వ్యాసప్రోక్తమొనరింపవలయు నని నాకు ముచ్చటగా నున్నది. ఆయీ కారణములచే నేనీగ్రంథమును రచింప నారంభించితినిగాని మఱియొకటిగాదు. నాయీగ్రంథము శ్రీమహాభారతమునకు మూలానుగుణమగు నాంధ్రీకరణమునుగాదు. ......"

వ్యాసమూర్తి శాస్త్రిగారికవిత్వము అన్వయకాఠిన్యము కలిగి యభూతపూర్వమైనదని కొందఱువిమర్శ. ఇంచుమించుగా నందఱ యభిప్రాయము నదియే. దానికిఁగారణము తొట్టతొలుతఁ బేరుకొంటిని. వ్యర్థపదములు వారికవితలోనుండవు. అదిగాక భారతనవనీతము నిర్వచనము. మొత్తముమీఁద శాస్త్రిగారికవితారచనము విలక్షణతాపాదక మని చెప్పవలయును

ఎఱుఁగక మేను, గిన్క ధరణీశుల నేఁ బొరిఁగొన్న పాతకం
బఱుత మనన్ ఋచీకముఖు లావర మిచ్చిరి; తత్ప్రగోంత మే
పఱఁగు శమంతపంచకము; భారతసంగరమందె సెల్లె; రూ
పఱి రిరుతొమ్మిదుల్బలము లక్షపదాదిములైనయాహినుల్.

"భారతనవనీతము"

వీరిపద్యములన్నియు నిట్లే నడచును. శాస్త్రిగారు తమకుమారుని వివాహమున కాహ్వానపత్రికపై వ్రాసినయీపద్యమెంతపొందికగా నిమిడినదో !

వినుఁడీ ! కీలకమాఘశుద్ధదశమిన్ వేగన్ స్వాధిన్ గుంభరా
శిని మత్పుత్రుఁడు కోటవెంకటసుతన్ జేనందిగో వృద్ధమా
ననమయ్యెన్ జరుగున్వివాహము జగన్నాథాచలంబందుఁ గా
వున విచ్చేయుఁడు ! బందులీనవయుగంబున్ లెస్సదీవింపఁగన్.

ఈపద్యము చదివి యాహూతులు కొందరు వేఁగ్ - విధిఁ అనుపదములు కర్త మొదలుగాఁగల వ్యర్థపదములని యాక్షేపించిరఁట. సహజసాత్త్వికస్వరూపులగు శాస్త్రులుగారు నవ్వుకొని వేఁగ్ అనఁగాఁ దెల్లవారుజామనియు, విధి యనఁగా రోహిణీనక్షత్రమనియు వారి కెఱుఁగఁ జెప్పిరఁట వీరికవిత్వములోనే గాక మాటలలోఁగూడ నిట్టి పొందికయుఁ జమత్కారములు నుండును. 'తమకు జీత మెంత యిత్తురండీ' యని యడుగ 'వయసునకు మించలేదులెండి' యనుచుండువారు.

ఈ శాస్త్రులవారు వేదుల సోమనాథశాస్త్రులవారికడఁ దర్కాలంకార శాస్త్రములు చదివిరి. ఉపనిషద్వేదాంతములు ఆదిభట్ల రామమూర్తి శాస్త్రిలవారిసన్నిధిని పఠించిరి. వీరు మొట్టమొదట ఖండవిల్లిలోను, క్రొత్తపేటలోను గల పాఠశాలలోను నధ్యాపకులై యుండిరి. తరువాత 1880 మొదలు 1915 వఱకు రాజమహేంద్రవరము బోధనాభ్యసన పాఠశాలా కళాశాలలలో సంస్కృత భాషాదేశికులై విద్యార్థుల నెందఱనో విద్వాంసుల నొనర్చి యుపకారవేతనము గొన్నారు.

వీరనువదించిన అనర్ఘరాఘవము - ప్రబోధచంద్రోదయము సూర్యశతకము చూచిన కవిప్రతిభాపాండిత్యాదులు వెల్లడియగును. 'భారతఫక్కి' యనుపేర భారతముపై విమర్శగ్రంథము నొండు వ్రాసిరి. అది భాషోపాసకుల కుపయోగకరమైన కూర్పు. వ్యాసమూర్తిశాస్త్రిగారి భారతనవనీతము సంపూర్ణముగ నచ్చునకు వచ్చునట్లు వ్యాసేశ్వరుఁ డనుగ్రహించుఁగాక! పీఠికాపుర సంస్థానకవులు శతావధానులనగు వేంకట రామకృష్ణకవులలో నొకరగు వేదుల రామకృష్ణశాస్త్రిగారీ మహాభారత నవనీతకవికి అల్లుఁడని వెల్లడించుట యవసరము.

అదియటుంచి, శాస్త్రులుగారి సూర్యశతకము తెనుఁగుసేఁత నుండి గొప్పపద్యములు కొన్ని యెన్నుకొందము.

మ. వసివాళ్వాడు బిసాభమంచుదయనో, వాతాశిలోకంబు, పే
రనమర్థం బగునంచు నే పరము లోకాలోక భూభృత్తటి
న్వెస నూర్ధ్వాబ్జజ భాండఖండదళనావేగంబునన్ దోస్థలి
న్బొసఁగంగాఁ జొర కెందునేగు రవికూర్పారంబు మేల్మ్రొకిడున్.

మ. జలధి న్విద్రుమముల్ ద్రుమాళిఁ జివురుల్ శైలంబునం జేవురుల్
బలభిత్కుంభ శిరంబునం దవిరళ ప్రత్యగ్రసిందూర ధూ
ళులు వింటన్ హరు వింటి పైడితళుకుల్, శోణద్యుతిన్ భాను దీ
ప్తి లవంబుల్ వఱువాత నేవవి భవత్ప్రీత్యావహంబయ్యెడిన్ !

మ. కులదైవంబో, గురుండో, తండ్రి, చెలియొక్కో, యార్యుఁడాచార్యుఁడో
వెలుఁగో చుట్టమొ రక్ష దివ్వో బ్రతుకో బీజంబో నేత్రంబో వే
వెలుఁగిల్లెమని నిర్ణయింపనగు నేవేళన్ సమస్తంబు లో
కుల కెల్లన్ సమకూర్చుఁ గోరికలు మీకు న్దేవుఁ డాతండిదుర్గ !

జయంతి రామయ్య

1860-1941

వెలనాటి బ్రాహ్మణుఁడు. కౌశికగోత్రుఁడు. కృష్ణయజుర్వేది. ఆపస్తంబ సూత్రుఁడు. తండ్రి: రామయ్య. తల్లి: సోమమ్మ. జననము: 18-7-1860 సం॥ రౌద్రినామ సంవత్సరమున నాషాఢ బహుళ అమావాస్య సూర్యోదయకాలము. నిధనము 9-2-1941. అభిజనము: అమలాపురముతాలూకా ముక్తేశ్వరము. మృతినొందుకాలమునాఁటికి వీరివయస్సు 81 సంవత్సరములు. విరచితగ్రంథములు: 1 ముక్తేశ్వరశతకము. 2 ఉత్తరరామచరిత్రము. 3 ఆంధ్రచంపూరామాయణము 4 అమరుకము. 5 ఆంధ్రవాఙ్మయ వికాసశేఖరి. 6 శాసనపద్యమంజరి (2భాగములు). 7 బాలరామాయణము. 8. Defence of Literary Tulegu. 9 Dravidian Lexicography- మున్నగునవి. దేశచరిత్ర స్వరూప ప్రయోజనములు - రాజరాజు, నందంపూడిశాసనము-ఆంధ్ర నిఘంటు నిర్మాణపద్ధతి-బమ్మెర పోతరాజు నివాసస్థానము-ఉత్తరరామ చరిత నాటకరస విచారము మొదలగు విషయములపై ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలోఁ బ్రకటింపఁబడిన వ్యాసముల మొత్తము 50. 1. The Southern School of Telugu Literature. 2. Krishnaraya మొదలగు వ్యాసములు ఆంధ్రేతిహాస పరిశోధకమండలివారి పత్రికలోఁ బ్రకటింపఁబడినవి 5. 'ఎపిగ్రాఫియా ఇండికా' లో వెలువరింపఁబడిన వ్యాసములు 8. ఉపోద్ఘాతములు వ్రాసిన గ్రంథములు: రాయవాచకము, సర్వేశ్వరశతకము, కవిజనాశ్రయము, విప్రనారాయణ చరితము, మన్నారుదాసవిలాసము మొదలగునవి.

ఆంధ్రభాషోద్ధరణాభిలాషులగు కొందఱు ప్రభువులచేతను, ఆంధ్రభాషా ప్రవర్ధకులగు కొందఱు ప్రముఖులచేతను 1911 లో ఆంధ్రసాహిత్య పరిషత్తు స్థాపింపఁబడినది. తదధ్యక్షులగు జయంతి రామయ్యపంతులు గారు నాఁటినుండియు నవిచ్ఛిన్నముగ నాంధ్రిసేవ చేయుచున్నారని తలంపవలయును. 'సాహిత్యపరిష' దుత్పత్తికిఁ బూర్వము పేర్కొనఁ

దగిన భాషాసంస్థలు రెండు మూఁడు మాత్రమే తెలుఁగునఁ గలవు. పరిషత్తు సేవాఫలిత మంతయు రామయ్యపంతులుగారిచేతను, పంతులు గారి గౌరవసేవయంతయుఁ బరిషత్తుచేతను బెక్కువత్సరము లనుభవింపఁ బడుచు వచ్చినది. ఆంధ్రసాహిత్యపరిషత్తును కొమార్తెగాను, సూర్య రాయాంధ్ర నిఘంటువును కుమారునిగాను భావించుకొని పంతులుగారు తమయనపత్యతావ్యథను బాపుకొని మనుగడ సాగించినారు.

రామయ్యపంతులుగారు బి. యె. పట్టభద్రులు. చదువుచున్న సమయమున వీరిబుద్ధివిశేషమును వెలిఁబుచ్చు విశేష మొకటి వారి పెద్దలిట్లు చెప్పుకొందురు. బ్రహ్మసమాజమత ప్రబోధకుఁడగు పండిత శివనాథశాస్త్రి మతప్రచారమునకు 1881 లో రాజమహేంద్రవరము వచ్చి యాంగ్లేయభాషలో గంభీరోపన్యాసము గావించెనఁట. ఆకాలమున క్లుప్తలేఖనము లేకుండుటచే నట్టియుపన్యాసములైన నచ్చులోనికి వచ్చుట కవకాశముండెడిది కాదు. మనపంతులుగా రప్పుడు రూళ్లపెని సిలు కాగితములు పుచ్చుకొని తూచాలు తప్పకుండ శివనాథశాస్త్రిగారి యుపన్యాసము లన్నియు వ్రాసి చెన్నపురిలోని యాంగ్ల పత్రికలకుఁ బంపిరఁట. శివనాథశాస్త్రిగారు తమ యుపన్యాసములు యథాతథ ముగా నాపత్రికలలో వెలువరింపఁబడుటఁ గని యబ్బురపడి యివి వ్రాసినవారెవ రని తెలిసికొన — బి. యె. తరగతి విద్యార్థి జయంతి రామయ్య వ్రాసె నని తెలినది. అప్పుడెల్లరు "ఈ చికిలికన్నుల చిన్నవాఁడేనా గంగాప్రవాహముఁ బోలు నీమహోపన్యాసము వ్రాసి నది" అని యాశ్చర్యచకితులైరఁట. పంతులుగారు చిన్ననాఁటఁ గన్నులు చికిలించెడివారని యెఱిఁగినవారు చెప్పుచుందురు.

రామయ్యపంతులుగారు 1886 లో బి. ఎల్. పరీక్షలో నుత్తీర్ణత నందిరి. ఆనాఁటి విచిత్ర మొకటి వీరినిగూర్చి చిలకమర్తి లక్ష్మీనర సింహముగారు చిఱునవ్వునవ్వుకొనుచు నిట్లు చెప్పుచుందురు. "రామయ్య

పంతులుగారు చదువునాఁటికి మదరాసు పోవుటకు రైలుత్రోవ లేదు. పొగయోడయే యాధారము. రామయ్యగారు పొగయోడలోఁ బ్రయాణము చేయుచుండ నొకసారి యోడమీఁదనుండి జారి సముద్రములోఁ బడిపోయిరి. ఓడకప్తాను చూచి తొందరగ వచ్చి పడిపోయిన పంతులు గారి జుట్టుపట్టుకొని మునిఁగి తేలుచున్న సమయమున బయటికి లాగి బ్రతికించెనఁట. ఆయనజుట్టే ప్రాణభిక్ష పెట్టినది" పరిశోధక పండితశిరోమణి కాఁదగిన యిట్టి మహాశయుఁడు జలగండము పాలగు టెట్లు సమకూడును ?

పంతులుగారు ప్రథమమున మాధ్యమికపాఠశాలలో నధ్యాపకులు. తరువాత మండలాధికారి (జిల్లా మేజస్ట్రేటు) కచేరీలో లేఖకులు. అటుపై నచ్చటనే ప్రధానలేఖకులు. అనంతరము సహాయ మండలాధికారి (డిప్యూటి కలెక్టరు), తదనంతరము రాష్ట్రన్యాయాధికారి (ప్రెసిడెన్సీ మేజస్ట్రేటు) పిమ్మట శాసనసభాసభ్యుఁడు (ఎమ్. ఎల్. ఎ.).

క్రమముగా నుపకారవేతనము పొంది కళాప్రపూర్ణుఁడై సలక్షణాంధ్ర భాషాప్రతిష్ఠాపకుఁ డని యశస్సు గాంచెను. రామయ్యపంతులుగారు తెఱపిలేని రాజకీయోద్యోగములకుఁ దమ నవయౌవనమంతయు దార వోసిన పట్టభద్రులు. ఏయుద్యోగమున నున్నను వీరికి సాహిత్యోద్యోగము మాత్రము సన్నగిల్లలేదు. పగలెల్ల నుద్యోగధర్మము నిర్వహించుకొని రాత్రులు వీరు నిరంతరము సాహిత్యకృషి చేయుచుండెడివారు. ఉద్యోగధర్మమున నేగ్రామమున కేఁగినను నచటి పండితులను గవులను సందర్శించి వారితో నేవో భాషావ్యాసంగములు నేయుచుండుట వీరికలవాటు. వీరిభాషాభిలాష క్రమముగాఁ బెరిగినది. ఉద్యోగము నిర్వహించు నోపికయుఁ దఱిఁగినది. ముక్తిశ్వరమునఁ గాలు మీఁదఁ గాలు వైచుకొని గ్రంథసమీక్షకు, భాషాతత్త్వ పర్యవేక్షణమునకుఁ గడఁగి యనేక శాసనములు పరిశోధించి యనేకరహస్యములు

వెలికిఁదీసి వెలువరించిన మహాత్ముఁడీయన. రామయ్యపంతులుగారి జీవిత కృతిలో 'ఆంధ్ర సాహిత్యపరిషత్తు' రసవదధ్యాయముగాన నీసందర్భమున దానిని స్మరించుకొనుట సముచితము.

పరిషత్తున కాదిలో నాంధ్రసంస్థానము లెన్నియో యార్థికసాహాయ్య మొనరించినవి. పీఠికాపుర ప్రభువులు, బొబ్బిలిమహారాజులు, వేంకటగిరి సంస్థానాధిపతులు, ఉయ్యూరు జమీందారులు, తుని రాణిగారు మున్నగువార లెందఱో చేయూఁత నిచ్చిరి. దానితో నాంధ్రసాహిత్యపరిషత్తు లేచినది. ఆంధ్రరచయిత లెల్లరు దాని యుత్పత్తికి గర్వించిరి. ఆంధ్ర దేశమునందలి తాళపత్త్ర గ్రంథములు, ప్రాచీన శాసనములు సంపాదించి సంశోధించి ముద్రించుట కీపరిషత్తు గొప్పపనిచేసినది. నేఁటికినిఁ జేయుచున్నది. మొట్టమొదట నీపరిషత్కార్య నిర్వాహకసంఘములోఁ బేరుమోసినపండితు లెందఱో ప్రవేశించిరి. ఆకారణమున నీసంస్థ విశేష విఖ్యాతి గడించుకొనినది. గ్రాంథికాంధ్రమునకుఁ బరిషత్తు చేసినసేవ యపారము. అఖండము.

రామయ్యపంతులుగారు మొక్కవోని గ్రాంథి కాంధ్రవాదులు. గిడుగు రామమూర్తి పంతులుగారికి వీరికి జరిగిన వాద ప్రతివాదములు జగమెఱిఁగినవే. రామయ్యపంతులుగారి గ్రాంథికవాద సారాంశమిది. "దేశమభివృద్ధి నొందినకొలఁది జనుల యాచారములు, భాషలు మొదలగు వానిలోనున్న యంతర్భేదములు నశించి క్రమముగా నవి యేకాకారమును బొందుట లోకమర్యాదయైయున్నది. దీనికి వ్యతిరేకముగా గ్రామ్యవాదులు చిరకాల సంప్రాప్తమైన యేకాకార గ్రాంథికాంధ్ర భాషను రూపుమాప యత్నించుచున్నారు. వీరియత్నము కొనసాగినచో నాంధ్రవాఙ్మయము భావికాలవుఁ దెలుఁగువారికి దురవగాహమై పఠనము లేక నశించి పోవలసివచ్చునుగదా ? లోకహితార్థము మహాకవు లించు మించుగ వేయిసంవత్సరములనుండి సంపాదించి మనపరముచేసిన సర్వాంగ

సుందర వాఙ్మయ భాగ్యమును మన మనుభవింపలేక పాడుచేసుకొన్న వార మగుదుము. తాను సంపాదించుట లేదుగదా పెద్దలు సంపాదించి యిచ్చిన దానినైనను నిలుపుకొనలేక చెడఁగొట్టుకొన్నవాఁడెట్టి ప్రజ్ఞాశాలియో యూహింపుఁడు. పెద్దలు కట్టిన దివ్యభవనమును బడఁగొట్టుకున్న పిమ్మట నిలువనీడ యెద్ది? ఎద్దియో యొకకొంప కట్టుకొందమందురా? దానికి సాధనసామగ్రియేది? అదియెన్నటికిఁ గొనసాగును? ఇఁకముందు గ్రామ్యకవులు గ్రంథములు రచింపవలసినది గ్రామ్యభాషయందేకదా? ఇది బహుముఖములుగా నున్నది. అందేభాషలో రచింతురు? గోదావరీ కృష్ణా మండలములలో విద్యార్థికులు వాడుచుండు సంభాషణభాషయందఁట. ఆభాష యేకాకారముగ నున్నదా? ఆభాషలోనున్న గ్రంథము లితరమండలములలో నున్న తెనుఁగువారికి సులభముగా నర్థమగునా? గ్రాంధికభాషను బోగొట్టి తమకర్థముగాని గ్రామ్యభాష నేర్చుకొమ్మని బలవంతపెట్టుట వీరికి ముల్లుదీసికొఱ్ఱుకొట్టినట్లగును గదా? ఈవృథా ప్రయత్న మేల? వ్యావహారిక భాష సుగమమను గ్రామ్యవాదులలోనెంతమంది చంద్రశేఖరశతకము చదివి యన్వయింపఁ గలరో? భాషీయదండకమను చిన్న పొత్తము నెంతమంది యర్థము చేసికొనఁ గలరో? అధికసంఖ్యాకులకు సులభముగాఁ దెలియుటే ప్రయోజనమైనచో విద్యార్థికుల వాడుకభాషయేల? విద్యావిహీనులైన ప్రాకృతజనుల భాష యేలకూడదు? ఏభాషను గ్రాంథికభాషగా గ్రహించినను గాలక్రమమున వానిరూపములు స్థిరపడి యిప్పటిగ్రాంథికభాషయందుఁగల వన్నదోషము లన్నియు దానికిని బట్టునుగదా? అట్టిచో నీనిరర్థకప్రయత్న మేల?

"ఆధునికాంధ్ర వాఙ్మయవికాసవైఖరి."

ఇది యటుంచి పంతులుగారి శాసన పరిశోధనశక్తి ముచ్చటించుకొందము. వీరు 1200 శాసనములవఱకుఁ బరిశోధించి తత్త్వద్విశేష

ములు వెలిఁబుచ్చిరి. ఆ శాసనములలో 400 శాసనము లాంధ్రవిశ్వవిద్యాపీఠమునకుఁ బ్రచురణార్థమొసఁగిరి. 'ఇండియా గవర్నమెంటు' వారు శ్రీపంతులుగారి శాసనపరిశీలన ప్రతిభ నెఱిఁగి యాంధ్రదేశమునకు సంబంధించిన 800 శాసనములు పరిష్కరించుటకు వీరి కొసఁగి యుండిరి. వాని నన్నిటిని సంశోధించి పీఠికలు, లఘువ్యాఖ్యలు వ్రాసి పంతులుగారు ప్రభుత్వమునకుఁ బంపిరి. అవి ముద్రితములగుట యాంధ్రులకుపకారకము. వీరు పరిశోధనము గావించిన శాసనములలో 'తొలి రమూడిశాసనము' తొట్టతొలిది. "యుద్ధమల్లుని బెజవాడ శాసనము" ముఖ్యము. ఈశాసనపఠనమున వీరగపఱిచిన ప్రతిభోన్నతికి ప్రభుత్వము ప్రశంసించినది.

రామయ్యపంతులుగారు భాషాపోషకులుగాను, పరిశోధనపండితులుగాను గీర్తింపఁబడవలసినవారే కాని కవులుగాఁ బేర్కొనఁదగినవారు కారని కొందఱయుద్దేశము. కాని వీరు రచించిన పద్యకావ్యములును లేకపోలేదు. 'అమరుకము' ననువదించిరి. ఈ యుదాత్తకృతికన్యకను యతిలోకసుందరాకారున కర్పించి ధన్యులైరి. "తెలుఁగునను పుట్టి నీకృతి తొలుత ననెడి భావమాత్మఁ దోఁచెశుభంగిఁ జెలఁగి" నీశృంగార కావ్యమనువదించిరి. అమరుకమునకుఁగల యాంధ్రానువాదములలో మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారి తరువాత వీరిదే సరసముగ నున్నది. ఈపద్యము లెంత హృద్యమగు శైలిలో నడచినవో చూడుఁడు.

అలకంబుల్ చెదరంగఁ గుండలయుగం బల్లాడ లేఁజెమ్మటం
దిలకంబించుకజాఱఁ గన్నుఁగవమొంతేఁ దాంతమై యొప్పఁగా
జలజాతాంబక కేళి సల్పెడు సరోజాతాక్షి నెమ్మోము ని
చ్చలుమిమ్ముంగృప బ్రోచెడుఁ హరిహరసబ్రహ్మాదులింకేటికిఁ.
పొగరుంగుబ్బలు పొట్టివై పులకలం బూనంగ నే నెంతయుఁ
బిగికౌఁగింటను గూర్పఁ జీర నడుము న్వీడి జాఱంగఁ దా
ళఁగ లేనింకను మానుమానుమని బల్ దైన్యంబుగాఁ బల్కునీ
చిగురుంబోఁడికిమూర్ఛయో నిదురయో చిత్తమ్మునం జేరెనో?

"పలువురింతకుఁ బూర్వమే తెలుఁగు చేసినట్టిదినిని మరలఁజేయంగ నేల, యనిన నయ్యవి కావ్యంబు గుణగణంబు, తప్పు యగుఁగాని యరయ నాతప్పగాదు." అనిచెప్పుకొని భవభూతి యుత్తరరామ చరితము నాంధ్రీకరించిరి. ఉన్న వానిలో నుత్తమమనుటకు వీలులేదు గాని వీరి యాంధ్రీకృతి చక్కఁగనున్నది. భాష బహుమృదువుగ నున్నది. సమాసములగడబిడ లేదు. మచ్చున కందలిపద్యమొకటి.

ఎండం బుల్గులు గూండ్లలోనొదిఁగి మెంతే స్రుక్కి కూజింపఁగా
కుండై కాకులుక్రిందనీడఁబురువుల్ మేయంగ మిట్టాడఁగా
గండూతిం గరులెల్లఁ దమ్ము నొరయంగా రాలు పుష్పాళిచే
నండం గల్గినభూరుహంబు లివిగో యర్చించు గోదావరిన్.

మఱియొక ముఖ్యవిషయము: ఆంధ్రసాహిత్య పరిషత్పక్షమున 'శ్రీసూర్యరాయాంధ్రనిఘంటు' వనుపేర నొకమహాకోశము రచింప బడుచున్న దని తెలుఁగుదేశ మెఱుఁగును. కొందఱు ప్రసిద్ధాంధ్రపండితుల సాహాయ్యమున శ్రీ రామయ్యపంతులుగా రీనిఘంటువునకు సూత్రపాతము వేసి రెండుసంపుటములవఱకుఁ బ్రకటించిరి. ఈనిఘంటు కృతిభర్తలు శ్రీ పీఠికాపురాధీశ్వరులు శ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దరువారు. శ్రీ మహారాజావా రీకృతికై దగ్గఱగ రెండులక్షలు వ్యయించిరి. శ్రీ వారి యౌదరాతిశయమునను, పంతులుగారి సంకల్పబలమునను నీ బృహత్కోశము పూర్తియయి యాంధ్రి నలంకరించుఁగాక!

రామయ్యపంతులుగారు ధన్యులు. వీరిపేరు నిఘంటువుతో పాటు సుస్థిరస్థాయి. గ్రాంథికాంధ్రీభవనమునకు నాలుగే యాధారస్తంభములు. ఆంధ్రసాహిత్య పరిషత్తు. శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు. పీఠికాపురాధీశ్వరులు. జయంతి రామయ్యపంతులు.

పంతులుగారు "ఆధునికాంధ్రవాఙ్మయ వికాస వైఖరి" యను గ్రంథము వెలువఱిచిరి. నూతనాంధ్ర వాఙ్మయ మెట్లు పరిణమించి నదియుఁ జక్కఁగ నిందువివరించిరి. ఇది యుపయోగకరమగు కూర్పు.

1937 లో ఆంధ్రేతిహాస పరిశోధకమండలి పంతులుగారికి a౫ వ జన్మదినోత్సవము గావించి యాంగ్లములో నభినందన సంపుటము ప్రకటించినది. ఆంధ్రవిశ్వవిద్యాలయము వీరికి కళాప్రపూర్ణ బిరుద మొసఁగి సన్మానించినది. రామయ్యపంతులుగారిది ధన్యజీవితము. సంపూర్ణ విద్యాభ్యాసము గావించిరి. మహోన్నతపదవుల నాక్రమించిరి. దీర్ఘాయుర్భాగ్యముఁ బడసిరి. సంతతహరినామస్మరణము గావించిరి. గొప్పకీర్తిప్రతిష్ఠలు సంపాదించిరి. అనాయాసమరణము, అదైన్యజీవనము చేకుఱిన మహాశయుఁ డీయన.

ఈయన విశిష్టతను గుఱించి అల్లంరాజు సుబ్రహ్మణ్యకవి 'చాటుధారాచమత్కారసార' గ్రంథమున నిటు లుపశ్లోకించెను-

శ్లో. జయంతిరామ కీర్తిస్తే సకలాశానువర్తినీ
సజాత్యపి రజోయుక్తా ప్రసూతే౽ర్థి సుతాన్‌బహూన్.

శ్లో. శ్రీరామస్య గుణాస్సు నామకలనాద్యస్మిన్ జయంతిశ్రితా
యజ్జిహ్వాంచల రంగనాట్యలలనా హాణీలసద్రామిడీ
గైర్వాణీ ఘనవైకృత ప్రభృతయో భాషా జయంత్యన్వయ
శ్రీరామార్యసుత స్సరామయసుధీర్లక్ష్యా చిరంజీవతు!

శ్లో. యస్యాజ్ఞా నరపాలఫాల ఫలకాగ్రాంచన్మణీ పట్టికా
తాదృ "గ్యాపిలు" నామహూణనృపతే స్సమ్మానసంధానితాం,
డైప్టీం, కాల్కటరీం వహన్ భువి జయంత్యన్వయ్యాపేరార్యస
త్పౌత్రః కౌశికగోత్రజో విజయతే శ్రీరామయార్యాగ్రణీః॥

శ్లో. జయంతి రామార్య మనోర్వచాంసి
జయంతి రామార్య లసద్వచాంసి
జయంతి రామార్యమనోర్యశాంసి
జయంతి రామార్యరిస న్మహాంసి ॥

పూండ్ల రామకృష్ణయ్య

1860-1904

ఆఱువేలనియోగిబ్రాహ్మణుఁడు. జన్మస్థానము: దువ్వూరు (నెల్లూరు మండలము). జననము 14-జూలై 1860 సం॥ నిధనము: 1 సెప్టెంబరు 1904 సం॥ ప్రచురణములు: అముద్రితగ్రంథచింతామణి పత్రిక. మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారి జీవితసంగ్రహము. గ్రంథటీకలు - మున్నగునవి.

పూండ్ల రామకృష్ణయ్యగారివంటి తెలుఁగుపండితు లెందఱో కలరు. కాని వారివంటి విమర్శకులు తక్కువ. వీరిది మొగమోటములేని విమర్శనము. ఆంధ్రమున వీరిపాండితి సిద్ధము. ఈయన బహుశ్రద్ధతో వెలువరించిన 'అముద్రితగ్రంథ చింతామణి' పత్రికలలోని ప్రతిపత్రమును వేలకొలఁది విలువ కలది. ఈపత్రిక ౧౮౮౭ లో ఒడయారు వీరనాగయ్యగారి సహాయసంపాదకతతో శ్రీరామకృష్ణయ్యగా రారంభించిరి. ౧౮౮౮ లో వీరనాగయ్యగారీయుద్యమమునుండి తప్పుకొనిరి. శ్రీ వేంకటగిరిమహారాజా శ్రీ రాజగోపాలకృష్ణయాచేంద్ర బహద్దరు వారు దీనికిఁ బోషకులు. ఇఁక లోకువిమి?- వీరనాగయ్యగారు విరమించుకొనినను, రామకృష్ణయ్యగారు తమ నిర్యాణపర్యంతము ౧౯౦౪ వఱకు నముద్రితగ్రంథచింతామణి నపూర్వపద్ధతులతో వెలువరించిరి. శ్రీరామకృష్ణపండితుని విమర్శకతకు లాక్షణికతకు నీచింతామణియే నికషోపలము. వీరేశలింగము పంతులుగారి వివేకవర్ధనియు, శ్రీ కృష్ణమూర్తిశాస్త్రిగారి కళావతియుఁ బ్రచురింపఁబడుచుండునాళ్ళవి. ఎన్నిపత్రికలున్నను విమర్శనవిషయమున నముద్రితగ్రంథచింతామణిదే యగ్రతాంబూలము. ఇందెన్నో ప్రాక్తనాంధ్రగ్రంథములు ప్రకటింపఁబడినవి. పత్రికాధిపతుల ప్రతిజ్ఞ యిది:

జతనము మీఱంగ నము
ద్రితసద్గ్రంథముల సేకరించి కడుఁ బరి
ష్కృతములు గావించి యథా
మతిఁ బత్త్రికఁ గూర్చెదము క్రమంబుగ వాసిన్.

తోరపు నూలుదారములతోఁ బడిలంబుగ గట్టి పెట్టియుం
జేరువ నందు జీర్ణదశఁ జెంది మొగిం గ్రిమికీటకచ్ఛటా
పూరితమై వృథాసెడు నముద్రితపుస్తకపంక్తి నెంతయుం
గూరిమి మీఱ నచ్చునను గూర్చుట సెల్లదె పత్త్రికాకృతిన్.

అముద్రితగ్రంథప్రకటనము, వ్యాకరణచ్ఛందోవిషయావిమర్శనము నీపత్రిక ప్రధానోద్దేశములు, మండపాక పార్వతీశ్వరశాస్త్రి. వేదము వేంకటరాయశాస్త్రి ప్రభృతులపాండిత్యశక్తి నీపత్రికయే చాటినది. రామకృష్ణయ్యగారి విమర్శకతి 'మయూఖము' లలో వెల్లివిరిసినది. శ్యమంతక, శబ్దవిచారము, వటుశబ్దప్రయోగము, పరిఘా పరిఘ శబ్దద్వయసాధుత్వము బిల్వేశ్వరీయకృతి విమర్శనము ఇత్యాదులు రామకృష్ణయ్యగారికి విమర్శకాగ్రేసర బిరుదము నీయఁగలవ్యాసములు. వీరి విమర్శనము కేవలశాబ్దికము కాదు. నాటకాదులలో గ్రామ్యభాషాప్రయోగము చేయవచ్చునా! ఇత్యాదివిషయములుకూడ వీరి నిశితవిమర్శకు విషయములైనవి. వేదము వేంకటరాయశాస్త్రిగారి 'నాగానందము' లోని పాత్రోచితభాషను వీరు చక్కఁగ సప్రమాణముగ సమర్థించిరి. నాఁడు వీరిప్రాఁతపండితులకు శాసనము.

అ. గ్ర. చింతామణిలో వెలువరించిన గ్రంథము లివి: ౧ ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయవిలాసము. (గణపవరపు వేంకటకవి) ౨. హరిశ్చంద్రనలోపాఖ్యానము. (రామరాజభూషణుడు) ౩ మిత్త్రవిందా

పరిణయము (కుందుర్తి వేంకటాచలకవి) ౪. చంద్రాంగదచరిత్రము (పైడిముక్కి వేంకటపతి) ౫. యాదవరాఘవపాండవీయము (నెల్లూరి వీరరాఘవకవి) ౬. వైజయంతీవిలాసము (సారంగు తమ్మయ) ఇవి ప్రాచీనములగు ప్రబంధములు. ఆధునికకృతులుకూడ నిందుఁ బ్రచురిత ములు. ఓగిరాల రంగనాథకవిగారి 'ద్విరేఫదర్పణము' మండపాక పార్వతీశ్వరకవిగారి శ్రీకృష్ణాభ్యుదయము మున్నగునవి.

సహజముగ నీయన చిన్నశక్తికలవాఁడని, కాని పద్యములు మధుర కంఠమునఁ జదువునపు డానందముగ నుండెడిదని చెప్పికొనుట.

రామకృష్ణయ్యగారొనరించిన భాషాసేవ చిరస్మరణీయము. ఈయన కడకాలములో స్మృతితప్పి పడియున్నప్పుడు వేంకటగిరి ప్రభువు వీరికిఁ గొంతధనము పంపి వారిచెవికడ 'వేంకటగిరిరాజు పంపె' నని గట్టిగా కేకవేయించి యిచ్చుటకాజ్ఞ పెట్టెనఁట. ఆమహారాజున కీయనపై నంతయభిమానము.

అల్లంరాజు రంగశాయి కవి

1860 - 1936

ఆరామ ద్రావిడ శాఖీయ బ్రాహ్మణులు. హారితసగోత్రులు. ఆపస్తంబసూత్రులు. తల్లి: చిన్నమాంబ. తండ్రి: సుబ్రహ్మణ్యకవి. జన్మస్థానము: పీఠికాపుర పరిసరమున నున్న చేబ్రోలు. జననము: 1860-రౌద్రి సంవత్సర నిజాశ్వయుక్ శుక్లతృతీయా సౌమ్యవాసరము. నిర్యాణము: 1936. యువ చైత్రబహుళదశమి. గ్రంథములు: ౧. శ్రీమదాంధ్రచంపూభారతము [ఆంధ్రీకరణము. 1913 ముద్రి] ౨. రామాయణచంపువు [సంపూర్ణముగ ముద్రణమునకు రాలేదు] ౩. రఘురామ శతకము. ౪. పరమాత్మశతకము. ౫. సర్వేశ్వరశతకము. ౬. గోవింద శతకము. ౭. లక్ష్మీశతకము. ౮. మాధవశతకము. ౯. కుక్కుటలింగ శతకము. ౧౦. గోపాలస్వామిశతకము. ౧౧. మల్లికార్జునశతకము. సంస్కృతగ్రంథములు: ౧. దైవస్తోత్రరత్నావళి ౨. నారాయణానందలహరీ. ౩. కవిమానసరంజనీ.

పండితుని పుత్రుఁడు పండితుఁడగు సంప్రదాయము లేదనుకొందురు. రంగశాయికవిగారి తండ్రి సుబ్రహ్మణ్యకవి. ఆయన భద్రాపరిణయాది మహాప్రబంధ ప్రణేత. అతనితండ్రి కవి. అతనితండ్రి కవి. వీరిచరిత్రము లన్నియు 'ఆంధ్రకవులచరిత్ర' గ్రంథము నలంకరించియున్నవి. వీరివంశమునఁ దరమున కొకకవి చొప్పున వచ్చుచున్నారు.

రంగశాయికవి సంస్కృతాంధ్రములు తలస్పర్శిగఁ జదివెను. కవిత యాయనకు నిసర్గముగ జనించినది. ఈయన ధారణాబలము, మేధాపటుత్వము శతవధానాష్టావధానములను నిరాఘాటముగఁ జేయించినది. అపారమైన శ్రీనారాయణభక్తి రంగశాయికవిగారిచే నరాంకితము గావింపనీయలేదు. కవులలో నిట్టి సాత్త్వికమూర్తి తఱచు కనుపట్టఁడని పెక్కురవలన వినుకలి. అందఱచేతను 'చాదస్తపుబ్రాహ్మణుఁ' డనిపించు

కోఁబడిన కర్మిష్ఠి. ఈయన సత్యవరతగొప్పది. ఈయన జయపురము, నూజవీడు మున్నగు సంస్థానములలో సత్కారములొంది, గోడే గజపతి రావు ప్రభునొద్ద ముప్పది సంవత్సరము లుండి బహుగౌరవములు పడసెను. బంధకవిత యందును, చిత్రకవితయందును, సమస్యాపూరణమందును, అవధానములందును రంగశాయికవి మంచినేర్పు గలవాఁడు. శ్రీ సూర్యరాయనిఘంటు కార్యస్థానమునఁ గొంతి కాలము పండితపదవిలో నుండెను. అంతే, యాయన గావించిన భృతకవృత్తి మఱి, తదితరమైన యుద్యోగము లేపయుఁ జేసియెఱుఁగఁడు. ఉన్న దానితో సంపెట్టుకొని, క్లుప్తముగ సంసారము దిద్దుకొనుచు, నయినవానిని కానివానిని యాచింపకుండ మర్యాదగఁ గాలక్షేపముచేసిన సంతుష్టద్విజుఁడాయన. కృతులు నరుల కీయలేదు. శతకములతో భగవద్ధ్యానము చేసికొని తరించెను. సంస్కృతాంధ్రములలో మొత్తమూయన పది, పంద్రెండు శతకములు వ్రాసికొనెను.

అనంతభట్టు రచించిన 'భారతిచంపువు' సాంపుగాఁ దెలిఁగించెను. భోజరాజు 'రామాయణచంపువు' కూడఁ దెలిఁగింప మొదలిడి బాలకాండము దాఁక రచించెనని వారి కుమారులవలన నేను విన్నవిషయము. రంగశాయికవిగారి కీర్తి శాశ్వతముగ నిలుపుటకు వారి 'భారతచంపువు' ఒకటిచాలును. ఆకావ్యములోని పద్యగద్యములసంఖ్య యించుమించు ౧౨౪౦ - శబ్దసంస్కార మెచ్చుటను జాఱలేదు. కవితి ధారావాహికమై 'అల్లంరాజు సుబ్రహ్మణ్యకవి' గారికి సరిపడినకుమారులు వీ రనిపించుచున్నది. చంపూభారతావతారికలో రంగశాయికవి గ్రంథరచనాకారణ మిటులు చెప్పికొనెను :

క. జననుతుఁ డగు మజ్జనకుఁడు
తనయుండా! చంపుభారతము నీవు తెనుం
గొనరిచి శ్రీమన్నారా
యణునకు నర్పింపుమా యటంచును బలుకన్.

మ. ఒక గీర్వాణపుశ్లోకముం దెనుఁగుగా నూహించి పద్యంబు పొం
దికతోఁ జెప్పఁ బ్రయాసమౌ, నయిన దీనిం గల్పనాలంక్రియా
దికముల్ వర్తిలుచున్న వన్నియును బూర్తింగల్గున ట్లెల్లవా
రికి నర్థంబగునట్లు నే సులభమౌరీతిం దెనింగించెదన్.

వ. అని యంగీకరించి పీఠికాపుర సమీపస్థిత చేబ్రోలు గ్రామంబున నివసింపుచు శాలివాహనశకంబునందు వేయు నెనిమిది నూటుల పదుమూఁడు వత్సరంబులు గడువ నడరు నందనసంవత్సర శ్రావణ శుద్ధ సప్తమీదినంబున నేతత్ప్రబంధంబుఁ దెనిఁగింప నారంభించితి......

అనఁగా, నీభారతచంపువు క్రీస్తుశకము 1891 లో నుపక్రమించి రని తెలియును. రచన కెన్నాళ్ళు పట్టినదో గాని, అచ్చుపడుట మాత్రము 1913 లో జరిగినది. సంస్కృతము లో ననంతభట్ట మహాకవి కవిత్వము చాల మాధుర్యము గలది. ఆ మాధుర్యమునకు వెలితిరానీకుండఁ దెలుఁగులో రంగశాయికవి మిక్కిలిసొంపుగ దీనిని రచించెను. రెండు మచ్చు పద్యములు :

మ. ఘనరత్నోజ్జ్వల కుండలాఢ్య ధరయుక్తంబౌ సమస్తాంగ శో
భన కర్ణత్రితయంబు మ్రోల నిరుగేల్ ఫూను గర్వోన్నతుం
డు నిజాకారగులైన తోంబదిపయిం దొమ్మండు సోదర్యులుం
దనువేష్టింపఁగ వచ్చె సైన్యపటహధ్వానావృతాకాశులై.

ఉ. పిమ్మట నెల్లచోట్లఁ బడవేసినపువ్వుల సౌరభంబులం
గ్రమ్మినదై స్వనత్పటహరాజియునై యగరూత్థధూపవా
హమ్మగు చందువల్ గలదియై మణిమంచని విష్టరాట్యఁదం
బమ్మగు నా స్వయంవరపు మంటపమెక్కిరి పాండునందనుల్.

ద్వితీయ స్తబకము - ౧౬౨

వీరి చిత్రకవిత్వమున కుదాహరణముగ నీపద్య మొకటి పైగ్రంథము లోనిదే చూపుచున్నాఁడను.

౪. మామా మీమోమామా
మామా మిమ్మొమ్మమ్మ మామమామామామేమా
మేమొమ్మము మీమైమే
మేమే మమ్మొమ్మము మోము మిమ్మామ్మ మామా.

ఇది యేకాక్షర కందము. ఈకవిగారి 'చంపూభారతము' తెలుగు బాసకుఁ జక్కనియలంకారమనుట యసంశయవిషయము.

అర్థము: మామా, మా=చంద్రునియొక్క, మా=శోభ, మీమోమామాన్= మీముఖమందు అగును. 'అన్యేష్వాః క్వచిద్భవే చ్ఛాన్యా' అనుసూత్రముచే నిచట ప్రథమకు సప్తమ్యర్థము. మామామా, మామా=మామాయొక్క, మా=మేధ మిమ్మొమ్మమ్మ, మిమ్మ=మిమ్మును, ఒమ్మన్ = అనుకూలించును. మామమామామా = మామకు మామవైనటువంటి ఓదేవా! మేమా మేమొమ్మము, మేము, ఆము= గర్వమును, ఏమి=ఏమియును ఒమ్మము= అనుకూలించము. మీమై= మీశరీరము మేమేమే=మేము, ఏమే. మమ్మ=మమ్మును, ఓము మోముము=రక్షింపుము రక్షింపుము, ఇమ్మామామా=అనుకూలము అగుమా అగుమా. నిఘంటువు: చంద్రేమాసిచ మాఃపుమాన్, మాస్త్రీమా సేవ్యతే వేలా మేధా శ్రీ మధ్య మాతృషు—అని నానార్థ రత్నమాల —

'తాతోపి పీతాయతే' అని సంస్కృత సమస్యను రంగశాయికవి గారి కేరో యిచ్చిరఁట. దాని నెటులు పూరించెనో పరికింపుఁడు:

శ్లో. క్షీరాంభోధి తరంగ శీకరరుచా కాకోఽపి హంసాయతే
కాళిందీ తటినీ జలై స్తు కలయన్ హంసోఽపి కాకాయతే!
సంధ్యారాగ సమాకులో గిరి వరో మేరుక్షితిధ్రాయతే
గౌరీలిప్త హరిద్రయా జ్వలన భూ తాతోపి పీతాయతే॥

ఈకవి శతకపద్యముల ధారాసరణి కొక్కయుదాహరణ మిచ్చెదను.

శా. కాణాదర్షివర ప్రణీతమగు తర్కం బేనెఱుంగంజుమీ
పాణిన్యారచితంబు వ్యాకరణ మొప్పం గొంచె మీక్షించితిన్
వాణీనై పుణి లేదు రాజసభలన్ వాదింప లేనన్ను నే
వాణిజ్యంబును నేనెఱుంగ నీకరంబా! లక్ష్మి! రక్షింపుమా.

కవి గర్వరాహిత్య మీపద్యములోఁ బ్రస్ఫుట మగుచున్నది. కవి సత్య వాదియనుట కీపద్యమే గొప్ప యుదాహరణము. వాస్తవముగ, రంగశాయికవికి నోటిధాటి తక్కువ. ఏదో వ్రాసికొనుచు నజ్ఞాతముగఁ గాలయాపనముచేయువాఁడే గాని, రాజసభలకుఁబోయి ఝంకారముగ లేనిపోని బొంకులాడి విత్తసంపాదనముచేయు దారు లీయన యెఱుఁగఁడు. ఈ కవివరుని సంస్కృత కవితాధోరణి మనోహరముగనున్నది. ఆభాషలో నీయన రచించినవి మూఁడు గ్రంథములు: 'నారాయణానందలహరి' లోనివి రెండు చూపెదను —

శ్లో. రసజ్ఞా ప్యేకేనా మధురరసయుక్తానపి బహూన్
పదార్థన్వేచ్ఛంతీ తవరుచిరనామ్నా మధురతాం
విదిత్వా త్వామేవ స్మరతిఖలు శశ్వద్గతరుచి
ర్భవంతం సంస్తోతుం ప్రతికల మియం కాంక్షతి హరే!

శ్లో. యథావీణాగానం తవహిత మభూ న్నారదముని
ర్యథా ప్రహ్లాదోక్త స్తుతిఘణితి రాపాభ్యుపగమమ్!
యథా సమ్యక్ప్రీతి శ్శుకవచనరీతి స్తనుభవత్
తథైవాస్మత్ప్రోక్త స్తుతిరపి మురారే భవతు తే॥

రంగశాయికవి శతకములు, తెనిఁగింపులు తప్ప స్వతంత్రకావ్య మొక్కటియు రచింపలేదు. అటులు రచించు నుద్దేశము కూడ నాయనకు లేదని విన్నాను. "అసత్య వస్తువులను వర్ణించి, యభూత కల్పనములు చేసి స్వతంత్రకావ్యములు రచించుట నా సత్యవ్రతమునకు భంగము కలిగించును

గాన మానివైచితి" నని సమాధానము చెప్పెడివాఁడఁట. నిజము; రంగశాయికవి మడికట్టుకొనిగాని కవిత్వము వ్రాయువాఁడు కాఁడు.

ఈయన పిఠాపురములో శ్రీ సూర్యరాయనిఘంటు కార్యస్థానమున నుద్యోగించిన నాళ్ళలోఁ, ద్రోవలో నేయంటరాని యాకో కాలికిఁ దగిలి నటు లనుమానము తట్టిన నింటికి వెళ్ళి సచేలస్నానముచేసి కార్యాలయమునకు వచ్చెడివాఁడని వింటిని. 'ఆఫీసు' సమయమున కాలస్యమైనను, దనయాచారమునకు లోటులేకుండఁ బ్రవర్తించిన యుపాయజ్ఞుఁడీయన : రాజకీయతంత్రములు, లౌకికయంత్రములు, తెలియక, శుద్ధవైదిక సంప్రదాయమున, జీవయాత్ర గడపిన పవిత్రమూర్తి రంగశాయికవి. ఆయన 1836 రాగనే, తనచంపూభారతములో, తనశతకములలోఁ దనజీవితము దాఁచుకొని మహాప్రస్థానము సాగించెను. "శుచిర్వ్రత శ్శుచిఃకవిః".

మేడేపల్లి వేంకటరమణాచార్యులు

1862-1943

గోలకొండవ్యాపారి వైష్ణవుఁడు. భారద్వాజసగోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. తండ్రి: రఘునాథాచార్యులు. తల్లి: లచ్చమాంబ. జననము: 10-7-1862 సం. నిర్యాణము: 1943 సం. వీరి పూర్వుల నివాసము అనకాపల్లి. (విశాఖపట్టనము జిల్లా). వీరి నివాసము : విజయనగరము. గ్రంథములు: పార్థసారథిశతకము, దేవవ్రతచరిత్రము (ప్రబంధము), సేతుబంధమహాకావ్యము (ప్రవరసేనరచిత ప్రాకృతకావ్యమున కాంధ్రపరివర్తనము), అలంకారశాస్త్ర చరిత్రము, హర్ష చరిత్రము (వచనము), లౌకికన్యాయవివరణము. సంస్కృతకృతులు: షేక్స్పియరు నాటకకథలకు సంస్కృతానువాదము, వకుళాభరణుల ద్రావిడగాథా సహస్రమునకు సంస్కృతశ్లోకములు—ఇత్యాదులు.

వేంకటరమణాచార్యులుగారు ప్రబంధకవి. ప్రాచీన సంప్రదాయములు దాఁటకుండ 'దేవవ్రతచరిత్రము' పద్యకావ్యముగా రచించిరి. కవిత్వము నాతికఠినముగ నుండి రసవంత మని పెక్కుపండితులచేఁ బ్రశంసింపఁబడినది. గ్రంథకర్తలు సంస్కృతాంధ్రములయందుఁ దలస్పర్శియగు పరిజ్ఞానముకలవా రగుటచే నెన్నియో ప్రయోగవిశేషములు వాడిరి. 'చేతు' మున్నగునవి ధారాళముగా నుపయోగించిరి. ర. ఱ లకుఁ బ్రాసములు ర. ల లకుయతులు, అఖండవిరామములు వీరు త్రోసివేయలేదు. భీష్మునిచరిత్రము నింతకుముందు రచించినవారు లేరు. భీష్మునిచరిత్ర మేగాక సందర్భానుసారముగా ద్రౌపదీవస్త్రాపహరణాదు లభివర్ణితములు, తిక్కనకు వచ్చినట్లే యీకవికిఁ గల వచ్చినది. కలలో శేషశైలపతి కనఁబడి దేవవ్రతచరిత్రము రచింపుమని చెప్పెనఁట. స్వప్నవృత్తాంతము, షష్ఠ్యంతములు మున్నగునిబంధనములను మీఱక నగరార్ణవశైలర్తుచంద్రార్కోదయాది సమస్తవర్ణనములు గావించి వీరరసప్రధానమైన యీప్రబంధము భావ భాషా బంధురముగా విరచించిరి.

కవిత్వమున నూతనత్వమును దెచ్చుటకుఁ బ్రయత్నించిన కవులుగారు వీరు. కాని శైలి ధారాళమైనది.

లీలాపాంగవిలోకనంబులఁ ద్రపాలీలాస్యసందర్శన
భ్రూలాస్యంబుల మంజువాఙ్మధుధునీపూరాప్లుతిన్ బూరుషున్
లోలుంజేసి మృషాప్రతిజ్ఞల సతుల్ లోభంబుఁ బుట్టించి గు
ర్లీలం బ్రీతిని జూపి చేయరె నిజక్రీడాశకుంతంబుగన్.

దేవవ్రత. ౧-౩౦.

ఈకావ్యమున మూఁడవయాశ్వాసములో జామదగ్న్య భీష్ముల కొక సంభాషణ మున్నది. అచటఁ గొన్నిపద్యములు ప్రబంధపద్ధతిని గాక నాటకపద్ధతిని రచింపఁబడినవి.

భీష్ముఁడు :- మేలా యీసంరంభము
హేలాసంతర్జితావనీశ్వర ! నీకున్
జామ :- బాలమణిఁ గైకొనుమీ
భీష్ముఁడు :- వాలాయము సేయనౌనె భార్గవ ! చెపుమా.

ఈ రకపు సంభాషణము నావుడు, అనవుడు ఇత్యాది పదవిరహితముగాఁ బ్రబంధములలో నున్నట్లు కానము. ప్రవరసేన మహాకవి ప్రాకృతమున రచించిన సేతుబంధమహాకావ్యము వీరు తెనుఁగున రచించిరి. ప్రాకృతమునఁ గూడ నీయాచార్యకవికి మంచిపాండిత్యమున్నది. సంస్కృతమున మహామహోపాధ్యాయులైనను బ్రాకృత మెఱుఁగనివా రెందఱో కలరు. వీరట్లుగాక ప్రాకృతము గురుముఖమున నభ్యసించి యందు కృషిచేసి 'ప్రాకృతభాషోత్పత్తి' యనుగ్రంథము కూడ రచించిరి.

ఆచార్యులుగారు వ్రాసిన 'లౌకిక న్యాయవివరణము' ను ఆంధ్ర సాహిత్యపరిషత్తువారు 1939 లో వెలువరించిరి. అందు 232 సంస్కృత లోకోక్తులు, న్యాయములు, ఆభాణకములు కలవు. ఇది విద్యార్థులకు విద్వాంసులకును బఠనీయమగు గ్రంథము.

ఈవిధముగా భాషావిషయకగ్రంథములు ప్రబంధములు వ్రాసి పేరు గాంచిన వేంకటరమణాచార్యులవారు విజయనగరము మహారాజాంగ్ల కళాశాలలో 1894 లోఁ బ్రధాన సంస్కృతోపాధ్యాయులుగాఁ

ప్రవేశించి క్రమముగా నాంధ్రపండితపదవికూడ నలంకరించి పందలకొలఁది విద్యార్థులను బండితులనుగాఁజేసి యించుమించు నలువది వత్సరము లుద్యోగధర్మము నిర్వహించిన యాచార్యశేఖరులు.

ఈయన విజయనగర సంస్కృతకళాశాలలోఁ గావ్యనాటకాదులు చదివెను. తరువాత నాంగ్లకళాశాలలోఁ బ్రవేశించి 1884 లో 'మెట్రిక్యులేషన్' లోఁ దేఱెను. పిమ్మటఁ దండ్రిగారు మరణించుటచేఁ జదువు కట్టిపెట్టి యుద్యోగము చేయవలసివచ్చెను. కొన్నాళ్లు భాండాగారికుఁడుగాఁ బనిచేసి క్రమముగాఁ గళాశాలాపండితుఁ డయ్యెను. ఈలోపున నిరంతరసాహిత్య కృషిమాత్రము మానలేదు.

వీరు సామాన్యసంస్కృత కావ్యనాటక సాహిత్యమేగాక సంఖ్యాది శాస్త్రజ్ఞానము, ఉత్తమసాహిత్యపాండిత్యము విజయనగరసంస్థానాస్థాన విద్వాంసులై మహాప్రఖ్యాతి నందిన ముడుంబై వేంకటరామ నృసింహాచార్యస్వామివారి సన్నిధిని నేర్చిరి. మనపండితాచార్యులు ప్రస్థాన త్రయము నిరంతరము పఠించుచు వ్యాసంగము చేయు నలవాటు కలవారు. స్వీయమతమున నభినివేశము కలవారైనను బరమతములను దూలనాడువారు కారు. వీరి భగవద్భక్తి చాల గొప్పది. ప్రాచీనాచారములు వీసమైనను వ్యతిక్రమించుట కీయన యిచ్ఛగింపరు. విశిష్టాద్వైతద్రావిడ వేదాంతగ్రంథములు వీరు చక్కఁగాఁ జదివిరి. అందు వీరి గురువులు మహామహోపాధ్యాయ పరవస్తు వేంకటరంగాచార్యులవారు. శ్రీ పురాణము సూర్యనారాయణతీర్థులు మున్నగు విద్వత్కవు లెందఱో వేంకటరమణాచార్యులవారి యంతేవాసులు. శ్రీమాన్ ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యులుగారికి వీరు గురుపాదులు. ఎంతశక్తికలవారైనను నీయునపినయువాదము, గురుభక్తి గొప్పవి. ఇదచూడుఁడు:

ప్రతిభ లేదు పెద్దపాండిత్యమును లేదు
శబ్దశాస్త్రవిధులజాడ నెఱుఁగ
శ్రీ ముడుంబ నారసింహాఖ్యుని కృపయె నా
కన్ని గూర్చి కృతికి వన్నెదెచ్చు. [దేవవ్రతచరిత్ర.]

గిడుగు వేంకట రామమూర్తి పంతులు

1863-1940

వీరిపూర్వులు తూర్పుగోదావరీమండలములోని 'ఇందుపల్లి' కిఁ జెందిన వారు. వీరి తండ్రిగారికి విజయనగర సంస్థానములో నుద్యోగము లభింప నక్కడకు వచ్చిరి. తండ్రి: వీరరాజు. పంతులుగారి జన్మస్థానము: ఉత్తరవిశాఖ మండలములోని పర్వతాలపేట. నివాసము: పర్లాకిమిడి, రాజమహేంద్రవరము. జననము 12-8-1863. మరణము 22-1-1940. రచించిన గ్రంథములు: 1. వ్యాససంగ్రహము 2. వ్యాసావళి 3. బాలకవి శరణ్యము 4. ఆంధ్ర పండితభిషక్కుల భాషాభేషజము 5. గద్యచింతామణి, మఱియు ననేకవ్యాసములు.

రామమూర్తిపంతులుగారిచేయి నాలుగుదశాబ్దులు వాఙ్మయములో నలిగినది. ఆంధ్రసాహిత్యపరిషత్తు ప్రారంభములో రామమూర్తిగారు సభ్యులు. క్రమముగ సవ్యసాహిత్యపరిషత్తునకు వీరు ప్రతిష్ఠాపకులైరి. పంతులుగారు వ్యావహారిక భాషాసాధననిర్మితికి విశ్వకర్మలు. వీరు పాశ్చాత్య వాఙ్మయమును దఱచి ప్రాచీనభాషాతత్త్వము గాలించి యాంధ్రసారస్వతరంగమునఁ బ్రవేశించిరి. స్వయంకృషిచేత బి. యే. పరీక్షలో రాజధానికి రెండవవాఁడుగాఁ గృతార్థుఁడైన మేధానిధి. సగము రక్తమాంసములు భాషావాఙ్మయచరిత్ర పరిశోధనములకుఁ, బురాతనవస్తుశాస్త్రపరిశీలనములకు వెచ్చించిన దీక్షితుఁడు. కళింగసామ్రాజ్యమునకు ముఖ్యపట్టనము ముఖలింగక్షేత్రమని బహుశాధారములు చూపి చాటి, యాటవికులైన సవరలకు లిపి వ్యాకరణములు పుట్టించి పుణ్యము కట్టుకొనిన శబరభాషావాగనుశాసకుఁ డీయన. వీరి పరిశ్రమను బ్రశంసించుచుఁ బ్రభుత్వము "కైజరిహిందూస్వర్ణపతకము" నొసఁగి బహూకరించుటయేగాక 'రావుబహదూరు'ను జేసినది. 1897 మొదలు 1911

వఱకు బంతులుగారు పర్లాకిమిడిరాజా వారి కళాశాలలో రాజకీయార్థిక చరిత్రాధ్యాపకులుగ నున్నారు. ప్రత్యేకరాష్ట్ర విభజనవిషయములో బర్లాకిమిడిని ఓఢ్రులు పట్టుబెట్టుకొనుట వీరి కసహ్యమైనది. పర్లాకిమిడి తెలుగునేలలో గలియుదాక తిరిగిరామని ప్రతిజ్ఞచేసి రాజమహేంద్రవరమున బ్రవేశించినారు.

గిడుగు రామమూర్తి పంతులుగారి పేరు స్మరించినంతోడనే వ్యావహారిక వాదము స్మరణకు వచ్చును. మొట్టమొదట నీవాదము బ్రతిపాదించిన వారు విశాఖపట్టణనివాసులు పి. టి. శ్రీనివాసయ్యంగారు, గురుజాడ అప్పారావుగారు, గిడుగురామమూర్తిగారును. కన్యాశుల్కము వ్రాసిన గురుజాడవారి కలము గిడుగువారి నూతనవాదమునకు సహస్రముఖముల సహకారియైనది. విశ్వవిద్యాలయములో వ్యావహారికము ప్రవేశపెట్టవలె నని రామమూర్తిపంతులుగారు గట్టిపట్టు పట్టిరి. కాని కొంతకాలమువఱకు ప్రయోజనము కలుగలేదు. మొత్తము మీద నిప్పుడు విశ్వమంతయు వ్యాపించిన దనవచ్చును. "గిడుగురామమూర్తినుడువు నిల్వకపోయె, నోగి జయంతి రామమూర్తి గెలిచె" నని యప్పట్ల వడ్డాది సుబ్బారాయుడుగారు తమపక్షమునకు గలిగినవిజయమున కానందించినారు. అప్పుడు వాదమునకు బ్రచారము సన్నగిల్లినను వాదికి మాత్రము నిరుత్సాహము కలుగలేదు. నాటికిని నేటికిని నెంత మార్పువచ్చినదో చూచుడు. పరోక్షమున నెవరెట్లు తిట్టుకొనినను బ్రత్యక్షముగా రామమూర్తి పంతులుగారి వాదమును నిరసించుటకు వీలు కలుగనీయలేదు. ఈసందర్భమున నలుగినలుగియున్న గ్రాంథిక వ్యావహారిక వివాదములు బేర్కొని సదసన్నిర్ణయ మొనరించుట యప్రస్తుతము. కాని వీరి వాద మెట్లుండునో తెలిసికొనవలయును.

కవి ప్రయోగము తప్పు అని మరి వాదించకూడదు. అది దుష్టవాదము. అది వ్యాకరణమునకు విరుద్ధముగానున్నా ఆక్షేపించరాదు.

కవివాడిన శబ్దములు చూచి అవి లక్ష్యముగాచేసికొని లక్షణము చెప్ప వలసినవాఁడు లక్ష్యము తప్పనడమునకు అధికారము కలవాఁడుకాఁడు. లక్షణములో అనేకదోషము లుండవచ్చును. చెప్పవలసినదంతా చెప్పక పోవడము ఒకదోషము. చెప్పకూడనిది చెప్పడము ఒకటి . . .

'బాలకవి శరణ్యపీఠిక.'

ప్రాచీనకవుల కావ్యములు శ్రద్ధగాఁజదివి కోశకారులు లాక్షణికులు తప్పులని త్రోసివైచిన యనేక ప్రయోగములు వానిలోనుండి యేరి యవి వ్యాకరించిరి. అదియే 'బాలకవిశరణ్యము,' నన్నయాదులకుఁగూడ గ్రామ్యము వాడక తప్పలేదని వీరు ఘంటాపథముగాఁ జెప్పిరి. (నోటి మాటయుఁజేతివ్రాతయు నొకరీతిగా నుండవలెననియు, గ్రంథములలో నున్న సలక్షణభాష పరమప్రాచీనమై యుండఁగా నందుపాటులో లేదనియుఁగనుక నదివీడి వ్యవహారభాషలో గ్రంథరచనకావింపవలెనని వీరి వాదసారము.) ఈవాదము బాగుగ నున్నదని నేఁటి పత్రికారచయితలు, నవకవులు, ఆంగ్లవిద్యాధికులు నెందఱో యీదారిని బోవుచున్నారు. ప్రాచ్యభాషాపండితులలోఁగూడ నీపద్ధతి నంగీకరించినవారు కలరు.

(పక్షపాతములు వీడి తటస్థులమై రామమూర్తిపంతులు గారినిగూర్చి ముచ్చటించుకొనినచో నాయన గొప్ప వాఙ్మయవేత్త. గొప్ప స్థిర సంకల్పుఁడు. గొప్పవిమర్శకుఁడు. గొప్పప్రయోగశిక్షుఁడు. అన్నిశక్తులను మించినది వీరిలో జ్ఞాపకశక్తి.) భారతము పదునెనిమిది పర్వములును వీరి హృదయఫలకమున నున్నవి. 'నాయనా, సీతాపతీ! శాంతిపర్వము చతుర్థాశ్వాసములో 'వేదులు' అన్న ప్రయోగము ౧౭ వ పద్యములోఁ గాఁబోలు ఉండవలెను. చూడు' మని యీవిధముగా నను చుండెడివారని పలువురు చెప్పుకొందురు. ప్రాచీన ప్రబంధములలోనే గాక యాధునిక కావ్యములందును "ఈప్రయోగ మిన్నిసారు లిక్కడవి ప్రయోగించె" నని చెప్పుచుండెడివారు.

దృఢనిశ్చయము, కార్యదీక్ష, స్వతంత్రోద్దేశము, అహోరాత్ర పరిశ్రమము- ఇవన్నియుఁగూడి 'రామమూర్తి' రూపముదాల్చినవి. ఈయన నవకవులను వెనుకనుంచుకొని గ్రాంథికపండితులమీఁది కురికి శంఖనాదము చేసినారు. రామమూర్తి పంతులుగారి బధిరము వారి వాదమునకుఁ బెద్ద సాహాయ్య మొనరించినది. పంతులుగారు గంటలకొలఁది గంగాప్రవాహమువలె భాషింపఁగల వాగ్మి. ప్రతిపక్షు లెంతగోలపెట్టుచున్నను వారికి వినఁబడదు. వారిధోరణి వారిదే. ఈయన తనకువచ్చిన యుత్తరములుగూడఁ గంఠస్థము చేసికొనెడివారు. ప్రత్యుత్తరముల నకళ్లుకూడ భద్రపఱిచెడివారు. ఈయననుగూర్చి మిత్రులొకరిట్లు వ్రాసిరి. "ఇతనిపండ్ల పటపటయందు వాడియైనతర్క మున్నది. ఈతని తీక్ష్ణదృక్కులందు మిఱుమిట్లు గొలుపు సారస్వత మున్నది. ఈతని బల్లెంపుటుక్తులయందు కోసైన మీమాంస యున్నది. ఈతని పిడికిలియందు బలమైన యాత్మవిశ్వాస మున్నది."

రామమూర్తిపంతులుగారికిఁ గల తెలుఁగు బాస తెలివిడికి వారి 'ప్రాఁదెనుఁగుఁ గమ్మ' మేలిమచ్చు. ఈకమ్మ సలక్షణాంధ్రభాషపై కత్తిగట్టి పోరినది. అచ్చతెనుఁగు కావ్యములు వ్రాసిన మహాకవులకు సైతము నిట్టిధారయు, భాషాజ్ఞానము నలవడలేదని దీనిని చూచినఁ దెలియఁగలదు.

పంతులుగారు గురుజాడ అప్పారావుగారి సహాపాఠముతో 'మెట్రిక్యులేషన్' పరీక్షఁ దేలిరి. అప్పటికంతతోఁ జదువుచాలించి యాఱు నెలలు 'కలెక్టరుకచేరీ' లో గుమస్తాపని చేసిరి. 1880 లో పర్లాకిమిడి పాఠశాలలోఁ బ్రవేశించిరి. అక్కడ పనిచేయుచునే ఎఫ్. ఏ. లో నెగ్గిరి. 1892 లో సవరభాషనుగూర్చి తెలిసికొనఁదలఁచి గొప్ప కృషి చేసిరి. ముఖలింగదేవాలయముమీఁది శిలాశాసనలిపి చదువఁదొడఁగిరి. సవరభాషలోఁగల పాటలు సేకరించుటకును, తద్భాషాతత్త్వ మెఱుఁగు

టకును పంతులుగారు ఒకయేఁడు వేసవిసెలవులలోఁ గొండలకు బయలు దేఱి పోయిరి. అక్కడ వీరిని చలిజ్వరము పట్టి పీడించినది. చలిజ్వరమునకు 'క్వైనిను' బ్రహ్మాస్త్రము. ఆ మందు సేవించుటచే పంతులుగారికి బధిర రము ముదిరినది. సవరభాషను సంపాదింపవలయు నన్న పట్టుదలతో నొక యింద్రియమునని చెడఁగొట్టుకొనిన పండితుఁ డీయన. ఆభాషలో వ్యాకరణము, నిఘంటువు వ్రాసిరి. దానిలోని పాటలు సేకరించిరి. 'తేను' అను సవరవానిని నింటఁ బెట్టుకొని వీరు పాటలు వ్రాసికొనిరఁట. సవర లకు బడులు పెట్టించిరి. కొంద ఆంగ్లేయులకు సవరభాష నేర్పించిరి. శబరభాషావాగనుశాసకుఁడగు రామమూర్తిగారు మనకుఁ జిరస్మర ణీయుఁడు.) 1913 లో వీరిని ప్రభుత్వమువారు రావుసాహెబు అని సన్మానించిరి. (వీరు భాషా సంస్కారవాదులే కాక వితంతూ ద్వాహము, హరిజనోద్ధరణము కోరిన సంఘసంస్కార ప్రియులు కూడను.| కన్నేపల్లి వేంకటనరసింహము పంతులుగా రనఁబడు వీరి శిష్యు లొకరు ఇంగ్లండులో 'బారిస్టరు' చదువు చదువుకొని వచ్చిరి. వారిని పిలిచి రామమూర్తిగారు తమయింట విందుచేసిరి. అది సనాతను లిష్టపడక వీరిని వాఁడు వెలివెట్టిరి. వజ్రచిత్తున కిటువంటి వెలియొక లెక్కా? పర్లా కిమిడి ఒరిస్సా రాష్ట్రములో నన్యాయముగఁ గలిపివేయుటను సహింప లేక, రాజాగ్రహమును దిగదుడిచి రాజమహేంద్రవరము వచ్చి కూర్చుం డిన యేకైకవీరుఁడు రామమూర్తి పంతులుగారు. "భారతీశతకము", మఱికొన్ని గ్రంథ పీఠికలు, బహువ్యాసములు వ్రాసి పేరువడయు శ్రీ సీతాపతి రావుగారు రామమూర్తి పంతులుగారి సత్సంతతి.

కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి

1863-1940

తెలగాణ్యబ్రాహ్మణులు. గౌతమసగోత్రులు. ఆపస్తంబసూత్రులు. తండ్రి: బ్రహ్మావధాని. తల్లి: సుబ్బమ్మ. జననము 2-4-1863. నిధనము 29-10-1940. అభిజనము: తూర్పుగోదావరి మండలములోని పలివెల గ్రామము. మనుగడ: కాకినాడలో. రచనలు: సంస్కారవిషయకముగా వీరువ్రాసినవ్యాసములు 24. ఆధ్యాత్మవిషయకవ్యాసములు 17. మతధర్మవిషయకవ్యాసములు 43. సాహిత్యవిషయకవ్యాసములు 60. కవిత్వవిషయకవ్యాసములు 16. ప్రకృతిశాస్త్రవిషయకవ్యాసములు 11. నన్నయ్యభట్టారకచరిత్రము, కురుపాండవ దాయభాగనిర్ణయము, మంగతాయి, సైంధవవధ (నాటకము) ఉపన్యాసపయోనిధి (1 సంపుటము) తారకతారావళి, పర్వతసందర్శనము, మధువసుప్రకాశిక, పెద్దాపురసంస్థానచరిత్రము, ప్రాయశ్చిత్తపశునిర్ణయము, భాస్కరోదంతము మున్నగునవి ప్రత్యేకగ్రంథములు. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక-భారతి-శారద-ఆంధ్రపత్రిక ఉగాదిసంచికలు-ముద్దుల మూట-గృహలక్ష్మి-సుజాత. ఈపత్రికలలో వీరిరచనలు గలవు.

"అల్పదోషమైనా కావ్యమును సహించక విమర్శ చేసేటప్పుడు యమునికన్న ఎక్కువనిర్ఘృణుడని పేరుపొందిన పండితు" లని బ్రహ్మయ్యశాస్త్రిగారిని గిడుగు రామమూర్తిపంతులుగారు ప్రశంసించిరి. వాస్తవముగా నీయన యంతటివాఁడే. హరిబ్రహ్మాదు లడ్డుపడినను విమర్శచేయుటలో నీయనకు జంకు లేదు. సముద్రపుటుప్పునకు నడవి యుసిరికకుఁ గలిగినసంబంధము వలె "కాకినాడ ట్రెజరీ డిప్యూటీకచేరీ గుమాస్తా" పనికి శాస్త్రిగారి యుద్గ్రంథ సారస్వత విషయవిమర్శనమునకుఁ జక్కని బాంధవము కుదిరినది. "అన్యథా చింతితం కార్యం దైవ మన్యత్ర" అనునట్లు భగవంతుఁ డీ విమర్శకాగ్రేసరుని 'గుమాస్తా' పని చేసికొనుమని యాదేశించినాఁడు. కఠిన మొగచోటు – మనస్సు

మఱొకచోటఁ బనిచేయుట చాలచోట్ల నున్నదేగాని క్రొత్తదికాదు. జయంతి రామయ్య పంతులుగారికి యావజ్జీవము న్యాయవాదిగా నుండవలయునని సంకల్ప ముండెడిదఁట. అట్టియదృష్ట మాయనకుఁ బట్టనే లేదు. ఇంతకును జెప్పున దేమన:- బ్రహ్మయ్యశాస్త్రిగారు లేఖకవృత్తిలో నుండికూడ జగద్విఖ్యాతమైన విమర్శనము లొనరించి 'విమర్శకాగ్రేసరుఁ' డనిపించుకొనుట బహుధా శ్లాఘనీయము.

శాస్త్రిగారు 'మెట్రిక్యులేషన్' పరీక్షలో నుత్తీర్ణులై ఎఫ్. ఏ. పరీక్షకుఁ జదువుచుఁ గారణాంతరములచే జదువువిరమించి యుద్యోగబంధములోఁ బడవలసినవారైరి. అది యొకందులకు మేలైనది. కళాశాల చదువు కట్టిపెట్టిన తరువాతఁ గాముది కట్టుదిట్టముగఁ జదివి, సంస్కృతాంధ్రములలోఁ దలస్పర్శి యగు పాండిత్యము సంపాదించిరి. "రత్నాకరమండన ముండన" మాకాలమున వ్రాసినదే. వీరు భాషాత్రయములో సమానము నసమానమునగు పాండిత్యము గడించి పండితు లనిపించుకొనినారు. ఈయనకు సాదృశ్య భాషాశాస్త్రముపై (Philology) మక్కువ హెచ్చు. ఆ సాదృశ్య పరిశీలనము భాషయందే గాక మతమునందుఁగూడఁ బ్రవేశపెట్టిరి. హిందూమతతత్త్వము లోఁతుముట్టఁబరికించిరి. వీరేశలింగంపంతులుగారికి వీరికిని జాలకాలము హోరాహోరి యుద్ధము జరిగినదని తెలుఁగువారెఱిఁగినదే. నాఁటి బ్రహ్మయ్యశాస్త్రిగారి వాగ్వజ్రప్రయోగమును బండితు లెఱిఁగినదే. విమర్శలో నింత నిర్దాక్షిణ్యుఁడు లేఁడనికదా గిడుగువారు చెప్పిరి.

బ్రహ్మయ్యశాస్త్రిగారెంతసునిశితవిమర్శకుఁడో యంత కర్మవీరుఁడు. ఎడతెఱపిలేక వ్యాసములు వ్రాయుచు, నుపన్యాసము లిచ్చుచు, సంస్థల స్థాపించుచు ధార్మికవైజ్ఞానికవిషయ ప్రబోధముచేసిన పుణ్యచరిత్రులు వీరు. చిన్ననాఁటనే నాటక కళాభిరుచికలిగి "ఆర్యబృందానంద సంధాయిని" యనునాటకసమాజము నెలకొల్పిరని చెప్పుదురు. అందు వీరి

చేత నే వ్రాయఁబడిన "త్రిపురాసురవిజయవ్యాయోగము" వీరేశలింగము పంతులుగారి "శాకుంతలము" మున్నగునవి ప్రదర్శింపఁబడెనఁట. భగవద్భక్తినిగూర్చి ప్రజాసామాన్యమునకుఁ బ్రబోధము చేయఁదలఁచి 1880 లో 'భక్తసమాజము' పేరితో నొకసంస్థ నెలకొల్పి, దాని పక్షమునఁ బ్రతిగ్రామమునకుఁ బర్యటనము గావించుచు నుపన్యాసము లిచ్చుచుండెడివా రఁట. 1883 'ఆర్యమత బోధిని' యను మఱొక సమాజము నిలిపి 'వివేకానంద పుస్తక భాండాగారము' వెలయఁజేసిరి. ఈరీతిగా హిందూమత ప్రచారమునకు యావచ్ఛక్తి వినియోగించి సత్ప్రచారము చేసిన సత్పురుషుఁడీయన. 'ఆర్యమతబోధిని' మాసపత్రిక 1905 లో వీరి సంపాదకత్వమున వెలువడుట మొదలయినది. ఈపత్రిక వలన బ్రహ్మయ్యశాస్త్రిగారి పేరు నలుమూలల వ్యాపించినది. సంఘ సంస్కర్తల యుద్దేశములు సన్నగిల్లఁజొచ్చినవి. వీరేశలింగముగారి సంఘసంస్కరణ మహోద్యమమునకు వ్యాప్తి తగ్గినది. ఆసమయముననే పంతులుగారు 'సత్యవాదిని' యనుపత్రికను స్థాపించుచు నిట్లు వ్రాసినారు. 'వెయ్యిగా వెయ్యిగా వెఱ్ఱివాఁడే గెలిచె నన్నట్లీయనవ్రాఁతలు జనుల భ్రమపెట్టి నేను వ్రాసినమహాకార్యమునకుఁగూడ విఘాతము కలిగించుచున్నందున....'

ఆనాఁడు 'ఆర్యమతబోధిని' చదువని యాంధ్రుఁ డుండియుండఁడు. ఆ పత్రిక యానిధముగాఁ బదునైదేండ్లు నడచి యమూల్యముగ సంఘ సేవ నొనరించినది. హిందూమతమును గూర్చి యొనరు నిరసనవ్యాసము వ్రాసినను బ్రహ్మయ్య శాస్త్రిగారే ప్రత్యుత్తరము విమర్శకులు నిరుత్తరులగునట్లు వ్రాసెడివారు. శ్రీ శాస్త్రిగారు మతమునేకాక సారస్వతమును గూడ నడుము కట్టి సేవించిరి.

మంత్రిభాస్కరుని గూర్చి 'కవులచరిత్ర' లో వ్రాసిన విషయములు సరిగా లేవని 'భాస్కరోదంతము' ప్రత్యేకముగా వ్రాసి వెలువరించిరి. వీరు రచించిన 'నన్నయ్యభట్టారకచరిత్రము' లో ననేకసిద్ధాంతములు

భాషాప్రపంచమునఁ జిరస్థాయులై నిలువఁగలిగినవి. 'కాగడా' శబ్దమును గుఱించి వీరు కూర్చిన చిన్నపొత్తము నరసిన వీరికిఁగల భాషాశాస్త్ర విషయ పరిజ్ఞానము విశదముకాఁగలదు.

ఈయన పద్యకవిత్వము గూడఁ జక్కనిశైలిలో వ్రాయఁగలరు. మంగతాయి నాటకమునుండి పద్యములు కొన్ని యెన్నుకొందము.

గీ. వేశ్య కాపిమోవి వెలయిచ్చువా రెల్ల
వంటఁ బట్టి పీల్చు భంగి గాన
యేకపాత్రమునను యెంగిలి నాకయే
కాఫి త్రాగుచుంద్రు కలసి జనులు.

ఆ. వె. పణ్యభామినిచేఁబడ్డ పుణ్యశాలి
పుడమి గాంభీర్యహీనుఁడై చెడకయున్నె
జలజలత యంటినంతన సరసు లోగిని
నమిత గాంభీర్యహీనత నందినట్లు.

గీ. ఆటవెలఁదుల యిండ్లను నమ్ము వారి
గుడులు గాలిగోపురములుఁ గోవెలలును
దోఁటలు పురమందిరములు పూఁటకూటి
యిండ్లు జూడఁబుసకుఁ దగు నిక్కలరయ.

వేశ్యలందు కలుగుమోజు । వేడ్కనేయ నాడిసీజు
పొందువలనఁ బుట్టు పుండు । మందువేయుమానకుండు
దేహమెల్ల నాను పుల్ల । గేహమెల్ల నాను గుల్ల
కీర్తి యంత మాసిపోవు । నార్తి హెచ్చ వచ్చుఁ జావు
ఏమిలాభమనుచు నీవు । భూమి గణిక పొందుకావు
వలదువలదు వలదునూ । దానిఁ గూడఁ జనదు నూ॥

భారతీస్తవగీతములు, గడ్డిపరక, కోకిలగీతములు, గోమహిషసంవాదము, నా విబుధలోక సందర్శనము, మొదలగు ఖండకృతులు గనిన వీరి పద్యకవితాధోరణి మెఱుఁగపడును. 'విబుధలోక సందర్శనము' ను గూర్చి కొంతవిచిత్రగాథ గలదు.

1930 సం॥ సెప్టెంబరు నెలలో కాశీభట్ట లింగమూర్తి యను నాయన రాజమహేంద్రవరమున మరణించెను. హిందూపత్రికాలేఖకుఁడు పొరపాటున బ్రహ్మయ్యశాస్త్రిగారు చనిపోయినట్లు 'హిందూపత్రిక'కు లేఖ వ్రాసిపంపెను. 'హిందూ' పత్రికను జూచి 'ఆంధ్రపత్రిక' యు నావార్త వెలువరించినది. దానినిబట్టి నాలుగైదునాళ్లలో నీ కానివార్త నలుమూలల వ్యాపించినది. సంపాదకీయవ్యాసములు, సానుభూతిసభలు, సాంత్వనలేఖలు బయలుదేరినవి. బ్రహ్మయ్యశాస్త్రిగారు హాయిగాఁ గాకినాడలో గ్రంథరచనము చేసికొనుచునేయున్నారు. ఈక్షేమము మరల ఆంధ్రపత్రికకుఁ బంపఁబడినది. పత్రికాసంపాదకులు తా మసత్య వార్తను విశ్వసించి యటులు వ్రాసినందులకు వగచుచు బ్రహ్మయ్య శాస్త్రులుగారు పూర్ణారోగ్యవంతులుగా నుండుటకుఁ బరమానందము ప్రకటించిరి. ఈ చమత్కారవిషయమును శాస్త్రిగారు 'నా విబుధలోక సందర్శన' మనుకావ్యమున వ్రాసి తమ మధురకవితాధారను తెలుఁగు వారికిఁ జూఱలిచ్చిరి.

తుని సంస్థానాధీశ్వరు లీవిమర్శకాగ్రేసరునిచే రెండువత్సరము లుద్యోగమునకు సెలవుపెట్టించి 'పెద్దాపుర సంస్థానచరిత్ర' వ్రాయించిరి. వీరి చారిత్రకపరిశోధన కది యాదర్శము. మాధవవిద్యారణ్యులు, శిష్టు కృష్ణమూర్తికవి, నారాయణభట్టు, నాచన సోముఁడు మున్నగువారి ప్రత్యేక జీవితములు వ్రాసిన చరిత్రజ్ఞుఁ డీయన. వీరి వక్తృత్వ మసన్య సామాన్యము. ఉపన్యాసము నడుమ నెవరైనఁ బ్రతిపక్షులు వికట ప్రశ్నలు వేయఁగా వీరు సద్యస్స్ఫురణము కలిగి చక్కని సమాధానము చెప్పి మఱి మాటాడ నిచ్చెడివారుకారు. మాట మధురము. భావము తీవ్రము. దీనికి బ్రహ్మయ్యశాస్త్రిగారు పెట్టినదిపేరు.

ఇట్టి మహాశయునియెడ విమర్శకాగ్రేసరుఁడని, మహోపాధ్యాయుఁడని, ఉపన్యాస పంచాననుఁడని, ఆర్య మతోద్ధారకుఁ డని బిరుదము లన్వర్థములు కాకుండు టెట్లు ?

వావిలికొలను సుబ్బారాయకవి

1863-1939

భారద్వాజగోత్రజులు. ఆపస్తంబసూత్రులు. గోల్కొండవేపారి. తల్లి: కనకాంబ. తండ్రి: రామచంద్రుఁడు. అభిజనము: కడప మోచముపేట. జననము: 1863. నిర్యాణము: 1939. విరచితకృతులు: శకుంతలచరిత్ర, సులభవ్యాకరణము, సతీహితచర్య, ఆర్యకథానిధి (ఆఱుభాగములు), నలచరిత్ర, గర్భిణి, హరిశ్చంద్రచరిత్ర, ఆంధ్ర వాల్మీకిరామాయణము, కుమారహితచర్య, కుమారాభ్యుదయము, కృష్ణలీలామృతము, కౌసల్యాపరిణయము, ఏకశిలానగరద్వయవివాదసంగ్రహము, హనుమంతచరిత్రము, భవతారకలీల, బాలికహితచర్య, భగవద్గీత, కృష్ణావతారతత్త్వము - మున్నగునవి.

శ్రీ సుబ్బారావుగారు పండితకవులుగాఁ బేరుసంపాదించిరి. భక్తాగ్రేసరులుగాఁ గీర్తిగాంచిరి. లోకమునఁ గొందఱకుఁ బాండిత్యకవిత్వములు పురాకృతవిశేషమువలనఁ గలిగి యుండవచ్చును. అట్టివారు పాండిత్య కవిత్వప్రకర్షమును దేశమున వెల్లడించుటకు రామాయణము రచింపవచ్చును. భాగవతము వ్రాయవచ్చును. అంతమాత్రమున నట్టికవులకు దైవభక్తి దైవవిశ్వాసము సంపూర్ణముగ నుండు ననుట పొసఁగదు.

అట్లుగాక, మన సుబ్బారావుగారి దైవభక్తి యవ్యాజసిద్ధమైనది. దైవభక్తియే వీరికిఁ గవిత్వలక్షణము చెప్పినది. దైవభక్తియే యీయనకు బాండిత్యవంతు నొసరించినది. భాగవతరచయిత పోతనామాత్యుఁడే యిందులకుఁ బ్రథమోదాహరణము. వీరిని మొదట భాగవతులని, పిదపఁ బండితులని, చివరఁ గవులని చెప్పుట క్రమానుగుణము. సుబ్బారావుగారికిఁ బోతన్నపైఁ బెద్దయభిమానమున్నది. నరకృతుల నీయక పోవుటలోను భగవద్భక్తి పారవశ్యములోను వీరిద్దరు సహపాఠులు. కవితారచనయందుమాత్రము వీరికి పెద్దయంతర మున్నది. భాస్కరరామాయణమునకు వెనుకను ముందునుగూడఁ దెలుఁగులో నెన్నో

రామాయణములు వెలువడినవి. కాని తెలుఁగుభాగవత మొక్క పోతనా మాత్యరచనమే. ద్విపదభాగవత మొకండున్నదనినను నది ప్రచారములో లేదు. ఆధునికులలో నైదాఱుగురు యథావాల్మీకిరామాయణములు రచించినవారును, రచించుచున్నవారును, రచింపఁదలంపు గలవారును గలరు. భాగవతము దరి కెవ్వరును బోఁజూచుటలేదు. ఇది పోతనమహా కవిలోని విశేష మేమో? ఆ కవివరునిపై మన సుబ్బారావుగారెట్టి యభిప్రాయము ప్రకటించిరో చూడుఁడు!

తుచ్ఛులు సరిగా దనినను
స్వచ్ఛపుఁ బోతనకవిత్వసంపద చెడునే
నేచ్ఛ జఱచి దూషించిన
నచ్ఛపతివ్రతను బాప మంటుట యున్నే?

(శ్రీరామాయణ పీఠిక.)

వా. సు. దాసుగారి చేతిలోఁ జాలమంది విషయరక్తులు పరమ భక్తులైరి. వీరు 'భక్తసంజీవని' యను మాసపత్త్రిక కొన్ని వత్సరములు వెలువరించిరి. దైవ, భాషా సేవ లొకదాని నొకటి మించునట్లు గావించి ధన్యులైన సుబ్బారాయకవిగారు వాల్మీకి రామాయణము యథా మాతృకముగా నాంధ్రీకరించిరి. కళాప్రపూర్ణ జనమంచి శేషాద్రిశర్మగా రొక రిట్లు వ్రాసిరి. వా. సు. దాసుగారి రామాయణకవితలోఁ బ్రౌఢతకు లోపములేదు. వీరు రామాయణము సర్వఘ్నముగా రచించి తరించిరి.

సీ. కనులకుఁ గలఁకియు గరళంబు మదికిని
తిపి యొంపఁ జేయు విత్తమ్ములేదు
కాళ్లఁ బందా లురిత్రాళ్లు కుత్తుకకును
బిడ్డల జంజాట మడ్డు లేదు
మంచి సెబ్బెర లెద స్మరియింపనీయని
యంతటి భోగంబు లమరలేదు

ఈపూఁట హరిహరీ! యేపాటఁ గడచునన్
దారిద్ర్యభీతి యింతయును లేదు
రాముఁ దలఁపఁజేయు నామయం బుండఁగ
సౌఖ్య మరయుపొంటె జాయ యుండ
నింతవలను గలుగ నిప్పుడ శ్రీరాముఁ
దలఁపకున్న నెపుడు దలఁచువాఁడ.

(శ్రీరామాయణ పీఠిక.)

రామాయణ రచనమున వీరి యుద్దేశమిది. వీరు యావజ్జీవమును గోదండ రామస్వామికే ధారవోసిన భక్తులు. ఆ యాలయము పునరుద్ధరించుటకై వీరు తెనుఁగు నాఁడు పర్యటించి పెక్కువేల ధనము సంపాదించి భగవదర్పితము గావించిరి.

పాపము! సుబ్బారావుగారికిఁ జిన్ననాఁటనే పితృవియోగము సంభవించినది. పినతండ్రి లక్ష్మణరావుగారి పెంపకమున విద్యాబుద్ధులఁ గఱచి పెద్ద చదువు చదివిరి పదునొకండు సంవత్సరములు కడపమండలమున రెవెన్యూ ఇనస్పెక్టరుగాఁ బనిచేసి, చెన్నపురి సర్వకళాశాలలోఁ బ్రధానాంధ్రపండిత పదవి నలంకరించిరి. పుష్కలముగా ధన మార్జించిరి. చేతులార నర్థులకిచ్చుకొనిరి. ఒక ఆంధ్రవాల్మీకి రామాయణమేగాక వీరివి పేరు తెచ్చుకొన్న కబ్బములు కుమారాభ్యుదయము, కౌసల్యా పరిణయము, సుభద్రావిజయము మున్నగునవి కొన్ని యున్నవి. వీరి సులభవ్యాకరణము విజ్ఞుల చినసీతారామశాస్త్రి ప్రభృతులు మెచ్చుకొనిరి. ఈయన రచనకృతు లెన్నో పాఠ్యములుగా నున్నవి.

కడపకును నందలూరునకును నడుమనున్న పల్లెటూరు ఒంటిమెట్ట. కోదండ రామస్వామి యాలయ మిచటనే యున్నది. ఈరామస్వామికే పోతన భాగవత మంకితము. ఈరామస్వామికే వా. సు. దాసు రామాయణ మంకితము. ఇరువురును జరితార్థులు.

నాదెళ్ల పురుషోత్తమ కవి

1863-1938

హారితసగోత్రులు. తల్లి. సుబ్బమాంబ: తండ్రి. కామయార్యుఁడు. జన్మస్థానము కృష్ణాతీరస్థమగు సీతారామపురాగ్రహారము. జననము: 1863 సం॥ ఏప్రిలు 23 గురువారము. నిర్యాణము 27-11-1938 సం॥ బహుధాన్యమార్గశీర్ష శుద్ధ పంచమి-ఆదిత్యవారము. గ్రంథములు: ఆంధ్ర ప్రబంధములు: ౧. అద్భుతోత్తర రామాయణము. ౨. గురుభక్తిప్రభావము ౩. కృష్ణానదీమాహాత్మ్యము ౪. యాదవాద్రీశోపాఖ్యానము. ౫. మాహేంద్ర పురాణము ౬. యామినీవినోదము ౭. బభ్రువాహనచరిత్ర ౮. రంగదాసీయము ౯. చతుర్ముఖి కందపద్యరామాయణము. ఆంధ్ర రూపకములు: ౧. అహల్యాసంక్రందననాటకము ౨. హరిశ్చంద్రనాటకము ౩. పారిజాతాపహరణము ౪. సారంగధరనాటకము. ఇత్యాదులు. శతకములు: ౧ సీతారామశతకము ౨. పూర్వకర్మశతకము ౩. మల్లికార్జునశతకము మున్నగునవి, మఱియు, స్తోత్రకృతులు, అభివర్ణనములు, కీర్తనలు, నిఘంటువులు, శాస్త్రగ్రంథములు, హిందీనాటకములు మొత్తము 112 గ్రంథములు గలవు. వీరి విశేషవిషయములు తెలియుటకు శ్రీ నాదెళ్ళ మేధాదక్షిణామూర్తిశాస్త్రిగారు సంధానించిన "ఉత్తమ యోగివృత్తము" అను కూర్పు పరికింపవలయును.

కవిత్వ మొకకళ. కళకును శాస్త్రమునకును నెంతో యంతరము. తొలినాఁడు శాస్త్రకారునకుఁ జూపిన గౌరవప్రపత్తులు, కళాకారునకుఁ జూపలేదనుట వాస్తవము. నటవిటగాయకుల గణములోనే కవుల పరిగణనము. నేఁడు తలక్రిందులై కళాజీవులు గద్దెలకెక్కి కొండాడఁబడుచుండుటయు, శాస్త్రజీవులు అజ్ఞాతులై మూలఁ నుండుటయు జరుగుచున్నది. దీనిలోనిరహస్యము, కళ వలన బ్రతుకువానికడ నాముష్మికదృష్టి లోపించి యుండుటవల్ల నేమోయని తోఁచును. కళగాని, శాస్త్రముగాని తాత్త్విక సరణికిఁ గొనిపోవలయును. అప్పుడు, ఆ కళాకారుఁడు, ఆ శాస్త్రకారుఁడు నేక శ్రేణిలోఁ గూర్చుండుటకర్హులగుదురు.

కవికి "సంధ్యావందనము బావగారు" అని తిరుపతికవులు శాబోలు చెప్పినారు. ఇది ఇటులు సార్వత్రికమనుటకు వీలు లేకుండ మహానిష్ఠాగరిష్ఠులగు పురుషోత్తములు కొందఱు కవిలోకము లో నుందురు. అట్టివారిలో నాదెళ్ళ పురుషోత్తమకవిగారొకరు. శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు వీరిని గూర్చి వ్రాసిన యీపద్యములు సరిగా దూచిన ట్లున్నవి.

అతిశాంతుం, డతిదాంతుఁడు
కృతకృత్యుఁడు, సుకవి, యెన్నియేని విషయముల్
మతినెఱిఁగినవిద్వాంసుఁడు,
స్తుతియింపందగిన పూరుషుఁడు సుకవులకున్.

ఒకనికి లోఁగని శాంతియు
సకలమ్ము నతిక్రమించు చండత, కడువై
దికకర్మ నిష్ఠయుఁ బరో
పకృతియుఁ బురుషోత్తముని స్వభావగుణమ్ముల్.

పురుషోత్తమకవి తొలుత రేపల్లె లోయగు సెకండరీస్కూలులో నుపాధ్యాయుఁడు. ఆపదవిలో నుండఁగానే జ్యోతిశ్శాస్త్రము, ధర్మశాస్త్రము మున్నగువానియందు పాండిత్యము సంగ్రహించెను. 1884 నుండి, బందరు వీరిని హిందీనాటక రచనకుఁ బ్రోత్సహించుచు వచ్చినది. అది వీరి జీవిక కొక క్రొత్త మెఱుఁగు. "నేషనల్ థియేట్రికల్ సొసైటి" అను పేర బందరున నొకనాటక సమాజము వెలసినది. వారికి హిందీనాటకములు రంతరింపఁజేసి ప్రదర్శింపవలయునని క్రొత్తరకమగు తలఁపు కలిగినది. ఆసమాజమువారి కోరిక ననుసరించి పురుషోత్తమకవి యెన్నో హిందీనాటకములు రచించెను. అవి చాల సుందరబంధములై పేరుగాంచినవి. ఈవిధముగా నీయన రచించిన హిందీనాటకములసంఖ్య ముప్పది రెండు. ఈ పరస్పరసంత నాటకరచన కల్లువ 1887 వఱకు సాగి యాగినది.

పురుషోత్తమకవి యిపుడు తెలుఁగువాఁడై, "బుధవిధేయిని" యను పత్రిక సంపాదించుట కారంభించెను. ఆయన తెలుఁగు పత్రికా సంపాదకుఁడైనను భారతీయుఁడు. తన పత్రికలో "నేషనల్ కాంగ్రెసు" ను గూర్చి ప్రచారవ్యాసములు వ్రాసి ప్రకటించెను. కాంగ్రెసుపై ఉరుదు భాషలో మహమ్మదీయుల కుపన్యసించిచెప్పిన ప్రబోధకులు పురుషోత్తమ కవిగారు. కవికి జాతీయభావములు నిండార నుండవలయునుగదా!

వదంతి, వీరు 1887 మొదలు 1908 దాఁక హిందూప్రాంచి స్కూలు హెడ్మాష్టరుగా శిష్యులను దిద్దెను. ఈయుద్యోగము లన్నియుఁ బురుషోత్తముని కార్థికములు. హార్దికముగా వీరునిర్వహించుచున్నది సారస్వతోద్యోగము. వీరు హెచ్చుగా బంధగర్భ కవిత్వాభిమానులు. చతుర్ముఖి కందపద్య రామాయణము, చిత్రకంద పద్యరత్నాకరము, మల్లికార్జున మకుటాంచ త్కందగీత గర్భితోత్పల చంపక మాలాష్టోత్తర శతకము ఇత్యాదులందుల కుదాహరణములు. చతుర్విధ కవితా ధురంధరులని వీరికిఁ గల బిరుదము. పురుషోత్తమకవి శతక కవితా ధోరణి యీతీరు గలయది:

చ. ఒగి నగుమోముతో ముదమునొందఁగఁ జేయును ముద్దుపాప తా
వగనగ నెట్టులేఁ గనెదువారి నడంబడుఁ గంటి పాప చూ
డఁగ దిగువ న్వడి న్నిలుకడం దగ కాదును నీటిపాప తాఁ
బగలెగురుంగదా మదిని బాఁపఁగఁ జేయకు మల్లికేశ్వరా!

క. నగు మోముతో ముదము నొం
దగఁ జేయును ముద్దుపాప-తా నగ నగనే
దిగువ న్వడి న్నిలుకడం
దగ కాదును నీటిపాప తాఁబగ లెగురున్.

గీ. ముదము నొందఁగఁ జేయును ముద్దుపాప
కనెదు వారి నడంబడుఁ గంటిపాప

నిలుకడం దగ కాడును నీటిపాప
మదిని బాపంగఁ జేయకు మల్లినాథ!

ఈపద్యములు మల్లికార్జున శతకములోనివి. చంపకమాలిక కడుపులో కంద - గీతములు రెండును నిమిడియున్నవి. జాగరూకతతో నీ మూఁడుపద్యములు చూచినచోఁ గవిగారెంత పరిశ్రమించిరో వెల్లడి కాఁగలదు. సాధారణముగా బంధకవితలు రచనా రామణీయకము కొఱవడి యుండును. పురుషోత్తమకవిగారి శైలిమాత్రము మధురధారాకలది-బంధకవిత్వములో నీయన యందెవేసినవారనుట కెన్నో కృతులు తార్కాణ లున్నవి. అది యటుండె; వీరి యద్భుతోత్తరరామాయణము నందలి వివిధవర్ణనాంశములు గల పద్యములు కొన్ని :

క. అసలది వసంత వనాయోహ
బనరంగు సరింప నిడిచెఁ బడఁ జల్లిన య
ట్లు సదా యలరారుఁగదా
మిసమిస గసదృశము లయ్యె మేగిఁ దరువుల్.

క. వట ఫలము చుబుక మవునవు
సటు పటు దంతములు దాడిమాంచిత బీజో
త్కటములు వాక్త్రికాండ
స్ఫుటములు సిగ్శ్రేణిఁ బోల్పఁ బొలుపగుపళులన్.

క. మదగజముల గేరెడినో
కుదిరిక యంచవులకుఁ గూర్పఁ గోరెడి నోయా
పదముల యొదుగుడు గమనిక
కుదిరెడి నే నాగకవులకు న్వర్ణింపన్.

ఏవంవిధముగా మనోహరరీతిని చతుర్విధకవితలు సంతరించిన సుకవి పురుషోత్తముల కుమారరత్నము సదెళ్ళ మేధా దక్షిణామూర్తిశాస్త్రి గారు తెలుఁగు రచయితల కెఱిఁగినవారు.

శృంగారకవి సర్వారాయ కవి

1864-1939

ఆఱువేలనియోగి శాఖీయుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. కౌండిన్యస గోత్రుఁడు. తల్లి: రామాంబ. తండ్రి పల్లమరాజు. జన్మస్థానము: గోదావరీమండలములోని ఇంజరగ్రామము. జననము ; 1864 సం. రక్తాక్షి సంవత్సర ఆషాఢబహుళ చతుర్థి గురువారము. నిర్యాణము: 1939 మార్చి 13 వ తేదీ-బహుధాన్య వత్సర ఫాల్గున బహుళాష్టమీ సోమవాసరము.

: స్వగ్రంథ సీసమాలిక :

పరికింపు లక్షణాపరిణయంబును, శివానందలహరి, మహిమ్నస్తవంబు,
మల్లేశశతకము, మతి ముకుంద శతంబు, నీతిదర్పణము, శ్రీనీతిదర్ప
ణము, సుభద్రా పరిణయము , దేవీ దండకము, నిందుముఖి వివాహమును, రామ
జననము, నవతారచరితము, గీతతారావళియును, బదరత్నమాల,
యాంధ్ర పదజ్యోత్స్న, వ్యాకృతి రాజంబు, నీతికథాళి, సునీతిచంపు
జనరలు తెలుఁగు, ప్రసంగ రత్నావళి, ప్రశ్నోత్తర ప్రదీపమును, స్తుతిక
దంబము, చాటుముక్తాళి, విదుల, బాలదీపికయు, వివేకదీపికయును,
సామెతలు, సున్నపావిజయము, ఛందోలక్షణంబు, నాటకలక్షణంబు, శబ్ద
లక్షణము, కావ్యలక్షణము, గుణప్రకాశిక, దివ్యభాగవత గీత,
గూపకమాల, కఠోపనిషత్తు (?) పురాణమణిమంజరి, గురుకుమారచరిత,
సీమరాణి, సివిక్సు, శ్రీవేంకటేశ్వర శతకమ్ము, మానసశతకము, హరి
సేవాకలాపంబు, దైవస్తుతి, వినోదవల్లి, ప్రబంధ నిబంధనంబు,
కవి జీవిత త్రయి, కావ్యవిశిష్టంబు, సంఖ్యాప్రదీప, మిశ్వార శతంబు
పర్వనిర్వచనంబు, బంధనిబంధంబు, లలిత సారస్వత లక్షణంబు,
చంద్రిక, బాలవాచకము, స్వచరిత భారతప్రయోగములు, పురాణకథలు,
ప్రహసనమాల, యుపన్యాసవితతి వినాయకాతి విలాస నాటకంబు
సూక్తి ముక్తావళి, షోడశ రాజచరిత్ర, ప్రతాపరుద్రీయము, సుగు

ణ ప్రకాశిక, సూక్తి, కర్ణచరితంబు
ప్రయత కాత్యాయన పరిణయ, మనామ
య, మను డెబ్బది యొకకృతులను రచించి
హస్తిహస్త నవేందు సంఖ్యాప్రమాణ

హేవిళంబి సంవత్సరమున కనూన భక్తి
నీకుసమర్పించితిని జామి నీరజాక్ష!

'స్వచారిత్రము' నుండి.

ఆత్మస్తుతి యగుననియో, యన్యు లేమనుకుందురో యనియో మన పూర్వులెవరును స్వీయచరిత్రములు వ్రాసికొనినవారు కారు. ఆంగ్లేయులను జూచి మొట్టమొదట మన కందుకూరి వీరేశలింగము పంతులుగారీత్రోవ దీసిరి. అదియాదిగా దెనుగులో రచయిత లెందఱో స్వచారిత్రములు పొందుపఱచుకొను నలవాటు చేసికొనిరి. చిలకమర్తి లక్ష్మీనరసింహముగారి 'స్వీయచరిత్రము' ప్రకటితమైనది. ఇట్టి వింకను జాలమంది రచనలు ప్రచురితములు కాని యున్నవి. శృంగారకవి సర్వారాయకవి సంధానించుకొనిన 'స్వచారిత్రము' వారియనంతరము, చక్కగ నచ్చులోనికి వచ్చినది. కవి తాను దన యనుభవాదికము వ్రాసియుంచుకొనుట, యతని తరువాత నదియెవరో బయటబెట్టి ముద్రించుట యనునిది చక్కనిమార్గము. దానంజేసి, తక్కువి యాత్మస్తుతి చేసికొన్నవాడుగా దోచడు. మన సర్వారాయకవిగారి స్వచారిత్రము బహుపవిత్రమైనది. అందాత్మస్తుతిగాని, అన్యనిందగాని, అసత్యముగాని, అక్కఱలేనిదికాని యొక్క యక్కరము లేదు. ఏదో జ్ఞాపకార్థము దైనందినచర్య వ్రాసికొనినటులుండెను. ఆచారిత్ర గ్రంథమే యిపుడు నాకాధారపడినది.

శృంగారకవి యనునది పౌరుషనామము. విస్సాప్రగడవారు క్రమముగ నిటులైరి. వీరిపూర్వులలో వెంకయ్యగారనబడు నొకరు శృంగార పద్యములు నాలుగు రచించి తాటియాకుపై లిఖించి తమ గ్రామమునకు వచ్చిన యొకమహమ్మదీయాధికారిదగ్గరకు వెళ్ళి చదివిరట. ఆయన యానందపడి 'శృంగారకవివయ్యా!' యని ప్రశంసించి పందుము మెఱకనేలను, ఒకగుఱ్ఱము నిచ్చి సత్కరించెనట. నాడు మొదలు సలువురును వీరిని శృంగారకవివా రనుచుండిరట. అదే యింటిపేరుగా స్థిరపడెను.

సర్వారాయడు గారి తండ్రి పళ్లమురాజమంత్రి సంస్కృతాంధ్రములు చదువుకొనినవాడు. తండ్రికడనే వీరు శ్రద్ధగ జదువుకొనిరి.

చదువయినవెంటనే 1880 సం॥ మొదలు నర్సాపురము, కిర్లంపూడి, రాజమండ్రి, పెద్దాపురము ఆంగ్లపాఠశాలలలో నుపాధ్యాయపదవి నిర్వహించిరి. 1894 లో నారంభించి 1939 దాఁక కాకినాడ పిఠాపురంరాజా వారి కళాశాలలో నధ్యాపకత సాగించి, యెందఱనో శిష్యులను ముందునకుఁ దీసికొనివచ్చిరి. సర్వారాయకవిగారు చాలమందికిఁ బద్యములు దిద్దిపెట్టినట్టుగ వారిచరిత్రయుఁ దెలుపుచున్నది. తచ్ఛిష్యులును జెప్పుచున్నారు. ఆయనిదట్టి యుపకారిబుద్ధి.

శృంగారకవిత వ్రాయుటలో వీరికి మంచిప్రవేశము కలదు. చమత్కృతిమై భాషించుట యందును వీరు నేర్పరులు. ఈవిషయములకు వీరి 'స్వచారిత్రము' లోని కొన్ని మాటలు తీసి వ్రాసెదను.

"ఒకప్పుడు ముత్తుస్వామిశాస్త్రిగారితో వీరేశలింగముగారింటికిం బోవఁ దటస్థించినది. ఆయన నన్నుఁ గూర్చుండుమనలేదు. ఎవరువీ రని యడుగలేదు. ముత్తుస్వామిగారే వీరు మాన్యులుపండితులునుమండీ! యని ముచ్చటించిరి. అప్పుడు మీయింటిపే రేవరనిరి. శృంగారకవి వారంటిని.మీపూర్వులు శృంగారకవిత్వము చెప్పువారు కాఁబోలునేయనిరి. పూర్వమె కా దిప్పుడును జెప్పుట కలదంటి. ఏమి చెప్పితి రనిరి. లక్షణాపరిణయము, ముకుందశతకము. శివానంద లహరి, మహిమ్నము మున్నగున వని చెప్పితి. మీపూర్వులేమి చెప్పిరనఁగాఁ జెక్కులున్నవి యని పల్కితిని. ఏదీ యొకపద్య మనిరి. "పరమా నురమా విరమా భరమా పరమాన్య నన్నుఁ బటుదయఁ బ్రోవన్ 'నురమానినీ నుతవిలాసరమా పరమాత్మ శ్రీవిజయగోపాలా'" యని చదువ నర్థము చెప్పుమనఁగాఁ జెప్పితి. కాని తొలుదొల్త గౌరవింపకుండుట, పదపడి పిల్లవానివలె నర్థము చెప్పు మనుట నాకుఁ గష్టమై వెంటనే —

"భరతా దరతా నరతా । విరతా మరతాపహరణ విమలహృదయ,
కుందరదా దరదా వరదా । శరదా శరదాభ శ్రీవిజయగోపాలా' యని చదివితి. అర్థమేదీ యనఁగానే మీముఖతః వినుటకుఁ జూడీ యంటి. 'ఇదే మనవారివెఱ్ఱి. ఇంత క్లిష్టముగాఁజెప్పుట యెందుకో' యనిరి. వెఱ్ఱియేమి? వివేకమే. కవిసమర్థత యిట్టివాని వలననేగదా తెలియునది యంటి. ఆయన మరల నర్థము మాట యెత్తక చాచివైచి ప్రబంధముల ధోరణిలోనికి దింపిరి. ప్రొద్దు పోవుటచే మేము వెడలి వచ్చితిమి."

ఈకవి మొత్తము చిన్నవి, పెద్దవి కలసి డెబ్బదియొక్క కృతి రచించెను. వీనిలోఁగొన్ని పాఠశాలాపాఠ్యములుగా నెన్నుకొనఁబడినవి. నాలుగైదుతక్కఁదక్కినవెల్ల నచ్చుపడినవి. ఏగ్రంథమునకుఁబెద్ద ప్రఖ్యాతి వచ్చినటులు లేదు. కవిత నిర్దుష్టముగానుండి ధారాళముగ నడచును. అంతకుఁదప్ప రసభావముల యందము వారికవితలోఁ దక్కువ. కవి నైష్ఠికుఁడు, భక్తుఁడుగాన భగవత్పరములైన దండకములు, శతకములు పెక్కులు వ్రాసెను. ఒక్కటియుఁ గక్కూరితిపడి నరాంకితములు సేయ లేదు. దైన్యముతో నన్యుల నచ్చుకొఱకై యాచింపలేదు. అది యీ కవిలోఁగల విశిష్టగుణము. వీరాంధ్రీకరించిన దండియనామస్తవములో రెండు పద్దెములివి.

ఉ. పంచశరుండు కొంచెకదఁ బచ్చని వింట విమోహనాస్త్రమ
త్రించి యహంకరించి వెనుదీయక యేయఁగఁ బంచవక్త్ర! రో
షించి కనన్ భవన్నయన చిహ్నితవహ్నిని జెంది రక్తిమా
భ్యంచితశోకమంజరి మహత్తమ ధూమ మిళిందమై చనెన్.

శా. ఆలంకాపతి రావణాసురుఁడు క్షీరాంభోధి వీచీ నమా
లోల/స్వీయభుజాయుగ ప్రథిమపాల్పుం దెల్ప నీస్థానమా

కైలాసంబుఁగదల్ప లోఁదెలిసి త్రొక్కం దావకాంగుష్ఠ రే
ఖాలీలంబడి మోములన్ రుధిర ముల్కన్ మొత్తలంబెట్టఁడే!

సర్వారాయకవిగారి నిర్యాణ మతివిచిత్రతరమైనది. 1939 మార్చి 13 వ తేదీ సోమవారము యథాపూర్వముగ మేలుకని నిత్యకృత్యముఁ దీర్చెను. తీర్చి సూర్యనారాయణస్తుతి పఠించి స్నానముచేసి, ధౌత వస్త్రములు కట్టి దేవతార్చనముచేసి భోజనము మాత్రము చేయక భూమిమీఁద ప్రాక్శిరముగ శయనించి తనువువిడిచిరి. ఇట్టి యెఱిఁగిన మరణ మెవరికో గాని తటస్థింపదు. వీరికి జ్యోతిశ్శాస్త్రమున మంచి ప్రవేశమున్నది. ఆకారణమున నిర్యాణతిథి తెలిసికొని యిటులు జ్ఞాని వలె మరణించెను.

దాసు శ్రీరామకవి

1864-1908

ఆఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. హారితసగోత్రోద్భవుఁడు. తండ్రి: కన్నయమంత్రి. తల్లి: కామాంబ. జననము 1864. నిధనము 1908. పుట్టుక: కృష్ణామండలములోని కూరాడలో. మృతి: గోదావరీమండలములోని ఉప్పు ఏలూరులో. ఈతని ప్రత్యేకగ్రంథములు ౩౪. ౧ ఆచారనిరుక్తి ౨. దురాశాపిశాచభంజని ౩. వైశ్యధర్మదీపిక ౪. ఆంధ్రవీథి ౫. అభినయదర్పణము ౬. కృతులు ౭. స్వరజతులు ౮. పదములు ౯. జానకీపరిణయనాటకము ౧౦. మనోలక్ష్మీవిలాసనాటకము ౧౧. అచ్చతెనుఁగు అభిజ్ఞాన శాకుంతలము ౧౨. రత్నావళి. ౧౩. మాలతీమాధవము ౧౪. మాళవికాగ్నిమిత్రము ౧౫ ముద్రారాక్షసము ౧౬. ఉత్తరరామచరితము ౧౭. మహావీరచరితము ౧౮. కురంగగౌరీశంకరము ౧౯. మంజరీమధుకరీయము ౨౦. సంగీతరసతరంగిణి యను బుద్ధనాటకము ౨౧. తర్కకౌముది ౨౨. అభినవగద్యప్రబంధము ౨౩. సాత్రాజితీవిలాసము ౨౪. లక్షణావిలాసము ౨౫. ఆంధ్రదేవీ భాగతము ౨౬ తెలుఁగునాఁడు ౨౭ సూర్యశతకము. ౨౮. భృంగరాజమహిమ. ౨౯ సంగీతరసతరంగిణి మున్నగునవి.

దేవీభాగవతము పదునెనిమిదివేల గ్రంథము. దాని నయిదునెలలలో గద్యపద్యాత్మకముగా నాంధ్రీకరించి యాఱవనెలలో నచ్చున కిచ్చిన యాశుకవిసింహులు దాసు శ్రీరాములుగారు. ఆశుకవితమైనను సందచెచ్చుటను గాఁబడలేదు. దేవీభాగవతమును మొట్టమొదటఁ దెలిఁగించిన కవి ములుగు పాపయారాధ్యుఁడు. దేవీభాగవతమును మొట్టమొదటఁ బ్రచురించినకవి దాసు శ్రీరాములుగారు. తిరుపతి వేంకటకవులును దీని నతిమనోహరముగా ననువదించిరి. నేఁటి కీముప్వురుకవుల గ్రంథములును ముద్రణము నందియున్నవి. త్రిపురాన తమ్మన దొరగారు

కూడ దీని ననువదించినటుల తెలియును. అదికూడ నచ్చు పడినచో నాంధ్రీకృత ప్రకటిత దేవీభాగవతముల సంఖ్య నాలుగు.

శ్రీ రామకవిగారు తల్లిదండ్రుల కేకైకపుత్రులు. ఆకారణమునఁ జిన్ననాఁటినుండియుఁ గడు గారాబముగాఁ బెరిఁగిరి. కృష్ణామండలములోని 'అల్లూరు' వీరి పూర్వులకుఁ బూర్వప్రభువు లొసంగిరి. అందుచే వీరిజీవనమునకు లోటులేదు. తొలుత వీరిని బందరు నోబులుపాఠశాలకుఁ జదువునకుఁ బంపించిరి. అచ్చట నాంగ్లము, పారశీకము చదువుచుఁ బదిమాసములు గడపిరి. ఈకవివరుని కుశాగ్రమతికి నివ్వెఱపడి నోబిలు దొర తన యింటికి నడుమనడుమఁ దీసికొనిపోవుచు నితనికిఁ బుస్తకము లిచ్చి ఫలాహారములు పెట్టుచుండెడివాఁడఁట. ఇది యెఱిఁగి శ్రీరామ పండితుని తల్లిదండ్రులు క్రైస్తవమతవాసన వీని కెక్కుడఁ గలుగునో యని యాచదువునకు స్వస్తిచెప్పించి యింటికిఁ గొనిపోయిరఁట.

క్రమముగాఁ బండితసాహాయ్యమునఁ గొంతసంస్కృతాంధ్రజ్ఞానము నాకళించి కవిత సల్ల నారంభించినాఁ డీయన. 12 వ యేఁట వ్రాసినను వీరి సోమలింగేశ్వరశతకము ప్రౌఢముగానున్నది. ఆకాలమున శతావధానప్రదర్శనమునఁ బ్రసిద్ధినందిన మాడభూషి వేంకటాచార్యులవారు నూజవీడున సంస్థాన విద్వాంసులుగా నుండిరి. ఈయన పేరుఁబ్రతిష్ఠలు శ్రీరామకవిగారు తఱచువినుచుండెడివారు. వీరికిని శతావధానము చేయవలె నని సంకల్పము ప్రబలినది. సంస్కృతవిద్యాభ్యాసము గావింపవలె నని జిజ్ఞాసయు హెచ్చినది. ఒకనాఁటి తెల్లవాఱుజామునఁ దల్లిదండ్రు లెఱుఁగకుండ నూజవీటికిఁ బయనమయి వేంకటాచార్యులవారిని సందర్శించి వారియాదరమున నొక యవధానము గావించెను. అప్పుడాయన యీ కవికిశోరుని కవితాధారకు, మతినైశిత్యమునకు మెచ్చి "పదిరెండేడుల యీడునం గవితఁ జెప్పంజొచ్చి వ్యస్తాక్షరీ" ఇత్యాది పద్యముతోఁ బ్రశంసించెను. వారికడఁ గొంతసంస్కృతభాషాజ్ఞానము

సంపాదించి మరల నింటికి వచ్చి సావిత్రీ(?) శాంతాజితీవిలాసము, (యక్షగానము - 14 వయేట వ్రాసినది) పంచనృసింహక్షేత్రము, శుకరంభాసంవాదము, కృష్ణార్జునసంగ్రహము మున్నగు కొన్నికబ్బము లల్లి 18 వ యేట నాగిరెపల్లి గీర్వాణవిద్యాపీఠమునకుఁ బోయి సాహిత్యగ్రంథములు, సిద్ధాంతకౌముది చదివి తనకవితకుఁ బాండిత్యపు మెఱుఁగు పెట్టెను.

తరువాత 'సెకండుగ్రేడుప్లీడరు' పరీక్షలో నుత్తీర్ణులై బందరులో న్యాయవాదిగాఁ బ్రవేశించిరి. బందరుపౌరులు నాఁడు వీరి పాదములు వెండిపూలచేఁ బూజించి, బంగారుపూలచే శిరము నర్చించి పల్లకి నెక్కించి బ్రహ్మరథము పట్టిరని విందుము. ఉద్యోగము చేసికొనుచు వ్యాఖ్యానపఠనము గావించుచుఁ గవితారచనము. 1884 లో జిల్లా కోర్టు పట్టా పొంది యేలూరు 'సబార్డినేటుకోర్టు' లోఁ బంద్రెండేం డ్లవిచ్ఛిన్నముగా నుద్యోగ ధర్మము నిర్వహించిన న్యాయవాది యీయన. శ్రీరామపండితుఁ డెంతధనసంపాదకుఁడో యంతదాత. పండితులకుఁ గవులకు నీయన యెన్నో సన్మానములు గావించె. కవుల యెడ సహజముగ నుండునసూయాదిగుణములు వీరియెడఁ గనఁబడవు. సంగీతాభినయగ్రంథములు చాల రచించిన కళావిదుఁ డీయన. జ్యోతి శ్శాస్త్రమున మంచిప్రవేశము. 1901 లో "శ్రావణమాస మధికమా-ఆషాఢమాస మధికమా?" యనుచర్చ రాజమహేంద్రవరమున జరిగెను. దీని పరిష్కారణమునకు ముప్పురు పండితు లేర్పడిరి. నాఁడు వీరి సిద్ధాంతమే నెగ్గిన దని పలువురు ప్రశంసించిరి. ఇదిగాక సంఘసంస్కరణము, మతాచారములు, ధర్మము, లౌకికనీతులు మున్నగు విషయములను గుఱించి వీరనేక వ్యాసములు వెలువరించిరి. 1880 సం॥లో 'కల్పవల్లి' యను పత్రిక ప్రకటించిరి. ఉపన్యాసము లిచ్చిరి.

అచ్చతెనుఁగున నిర్బంధము కలిపించుకొని యత్యంత మనోహరముగా నభిజ్ఞానశాకుంతలమునాంధ్రీకరించిన కవీంద్రుఁడీయన. మాలతీ

మాధవము, మహావీరచరితము, మాళవికాగ్ని మిత్రము మొదలగు నాటకము లెన్నియో యాంధ్రీకరించి ఘనత గాంచిరి.

వీరి కావ్యప్రపంచమునఁ జిరస్థాయిగా నుండునది దేవీ భాగవతము. రసవిలసితముగా నున్నది "తెలుఁగునాఁడు". ఇది స్వతంత్రప్రబంధము. ఇందలి పద్యములు స్వభావసిద్ధములు. మందునకుఁ గొన్ని పొందు పఱుతును.

ముదికరణాలు రాముగుడిమోసల రచ్చలుదీర్చి, భారతాల్
చదువుచు, లోకవార్తల ప్రశంసల సంద్రడు: తెలుఁగుబాస మం
చిది, మన పిల్లకాయలు పఠించెడి యింగిలిపీసు పుస్సుసన్
బెదవులు దాఁట దెంతటి 'ఎఫేయు' 'బియే' 'ఎమియే' వచించినన్.

లేవరు 'లెండు లెం" డనిన లేచినవారయినం దటాలునం
బోవరు పోవుచున్నిలిచిపోదుము పోదుము ప్రోయకుండటం
చీవరు సందు గేస్తునలయింతురు పెండిలిలో సదస్య సం
భావనవేళఁ జూడవలె బాపనసాముల సాములన్నియున్.

నమ్మిన నమ్మకున్న నది నావశమా ? జను లాడికొన్న వా
క్యమ్మును నేనుఁ జెప్పెదభయంపడిరో పడకో, నిరోగిలో
క మ్మనివార్య కార్యఘటక మ్మవుగాని పరోపకార శూ
న్యమ్మును స్వప్రయోజన పరాయణముం దలపోయ నిద్ధరణ్.

చెళ్ళపిళ్ళ కవి వ్రాసినట్లు లీరికవికవిత జనరంజకము, లోకానుభవ వ్యంజకము నై యున్నది.

అన్నే చూస్నివషే వొషే చెవుడషే అష్లాగషే యేమిషే
విన్నా వజ్ఝలవారి బుఱ్ఱినవ అవిస్సాయి కిస్సారుషే

విన్నం డెంతటివాఁడ? యేళ్ళు పదిషే......

ఈపద్య మీాయనదే.

ఈయన పోతనవలె సహజపాండిత్యుఁడు. అతఁడు భాగవతము నాంధ్రీక రించిన నితఁడు దేవీభాగవతము నాంధ్రీకరించినాఁడు. ఈయన కవితా సంపన్నుఁడేగాక మోహనరూప సంపన్నుఁడు కూడనని చూచినవారు చెప్పుదురు.

ధనము, రూపము, విద్య, వితరణము, వినయము, వివేకము కలిగిన ఈ శ్రీరామపండితునకుఁ బుత్రులాఱుగు రుదయించి పెంపొందుట యెంతటి యదృష్టమో పరికింపుఁడు. కుమారులకు కేశవనామములను నామ ములుగా నుంచెను. శ్రీరామకవి సర్వథాధన్యుఁడైన కవివతంసుఁడు. ఆంధ్రదేవీభాగవత రచయితలగు శ్రీ ములుగు పాపయారాధ్యుఁడు, దాసుశ్రీరామకవి, తిరుపతివేంకటకవులు, త్రిపురాన తమ్మనకవి తెలుఁగువారికి వందనీయులు.

ఆచంట వేంకటరాయ సాంఖ్యాయన శర్మ

1864–1933

ఆఱువేల నియోగిశాఖాబ్రాహ్మణులు. సాంఖ్యాయనసగోత్రులు. తండ్రి బాపిరాజు. తల్లి వరసాంబ. జననము 1864. నిర్యాణము 1933. వీరిపూర్వులు గోదావరీ మండలములోని ఆచంట గ్రామమునఁ గాఁపుర ముండెడివారు. సాంఖ్యాయనశర్మగారి తల్లిదండ్రులు నాగావళీనదీ ప్రాంతములకు తరలివచ్చిరి. కాఁగా వీరు విశాఖపట్టణమండల నివాసులు. గ్రంథములు: సుధానిధి (కావ్యము) మనోరమ (కావ్యము) పార్థపరాజయము, అవదాతకలభకము (స్వతంత్రనాటకములు) విక్రమోర్వశీయము, ఉత్తరరామచరిత్ర (ఆంధ్రీకరణములు) రహస్యదర్పణము, ఆంధ్ర పద్యావళి మున్నగునవి. ప్రచురించిన పత్రికలు: సుజనప్రమోదిని, కల్పలత.

వేంకటరాయ సాంఖ్యాయన శర్మగారు మహోపాధ్యాయులని ఆంధ్రభీష్ములని కొనియాడఁబడిన ప్రసిద్ధపండితులు. వీరు పండితులుగాను, కవులుగాను, ప్రతికాసంపాదకులుగాను, విమర్శకులుగాను, మహోపన్యాసకులుగాను తెలుఁగునాఁట పేరు సంపాదించిరి. సాంఖ్యాయన శర్మగారు స్ఫురద్రూపి. ఆకారమున కనుగుణమగు ప్రజ్ఞ. ప్రజ్ఞకుఁదగిన వాక్చాతుర్యము. ఈయన యుపన్యాసవేదిక నెక్కినచో నెట్టివాఁడైన నిక్కురుమనుటకు వీలులేదు. సమయస్ఫురణము, పరేంగితజ్ఞతయుఁ గల యుపన్యాసకులలో నీయనయగ్రేసరుఁడు. సమయోచితము సరసమునగు హాస్యము వీరిమాటలలో నుండి యెదుటి వారిని ముగ్ధులనొనరించెను. సాంఖ్యాయనశర్మగారి వాక్స్థానమున నే యున్నతగ్రహము లున్నవో గాని యీయన యతియందముగాఁ బొందికగా మాటాడువారు. సరస సంభాషణమునకుఁ గూడ గొప్ప ప్రతిభ యుండవలయును. మహామహోపాధ్యాయులు పరవస్తు వేంకటరంగాచార్యులు, కొక్కొండ వేంకటరత్నంపంతులు మనోహరముగా భాషించువారని విందుము.

మంగళంపల్లి సర్వేశ్వరశాస్త్రి, బులుసుపాపయ్యశాస్త్రి మాటలలో ధ్వను లుపయోగించెడివారఁట. "అరు- శుష్క- ఫలకోమల స్తనీ, పెద్దిభొట్టుగృహిణీ విరాజతే" ఇత్యాది మహావాక్యములకుఁ గర్తలగు పెద్దిభొట్టుగారు చాటూక్తిచతురుఁడని ప్రసిద్ధి. ఇటీవలి చిలకమర్తికవి, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, వేదము వేంకట్రాయశాస్త్రి చతురభాషణులలోఁ బేరుమోసినవారు వీరివాకులు కొన్ని లోకులు చెప్పుకొని యానందించుచుందురు. సాంఖ్యాయనశర్మగారిసంభాషణముకూడ దేశప్రసిద్ధమైనది. వీరిది పండితైక రంజకమైన వక్తృత్వమేగాదు. ప్రజాసామాన్యమునకు సుబోధమగు మాటనేర్పు. పైని మన మనుకొనిన వారందఱును బండితపామరమనోరంజకముగా మాటాడువారే.

సాంఖ్యాయనశర్మగారు కవిత్వము వ్రాసెను. చిత్రలేఖనము నేర్చెను. సంగీతము నెఱిఁగెను. నాట్యశాస్త్రము తెలిసికొనెను. పదార్థవిజ్ఞాన రసాయనశాస్త్రములు, భూవృక్ష క్రిమికీటక ఖనిజతత్త్వము, ప్రాచీనాధునాతన హైందవరాజ్యాంగ విశేషములు చక్కఁగాఁ బరిశీలించెను. వీరి ప్రజ్ఞాదర్పణమునఁ బ్రతిఫలింపనికళ లేదు. కుశాగ్రబుద్ధియగుటచే సంస్కృతాంధ్రములలోఁ జిన్ననాఁటనే గొప్పసాహిత్య మలవఱచుకొనెను.

క్రీ. శ. 1880 ప్రాంతమునఁ దెలుఁగుదేశమున వ్యాప్తములోనున్న ఆంధ్రభాషాసంజీవిని (కొక్కొండ వెంకటరత్నముగారిచేఁ బ్రకటితము), మందారమంజరి, ప్రబంధకల్పవల్లి మున్నగుపత్రికలు చదువుచుండుటచే సాంఖ్యాయనశర్మగారికిఁ బత్రికా ప్రచురణోత్సాహము చిన్నతనముననే కలిగినది. నాఁటికాయన వయస్సు పదునెనిమిదియేండ్లకు లోఁబడి యుండును. అప్పుడు 'సుజనప్రమోదిని' యను పేరితో నొకమాసపత్రిక నడుపనారంభించిరి. దాని తొలిసంచిక 10-6-1881 సం॥ నాఁడు వెలువడినది. 'సుజనప్రమోదిని' తో శర్మగారి నాంధ్రదేశము కొంచెము గుర్తించినది. 1885 లో వీరు శతఘంటకవిత్వము చెప్పిరఁట. ఆపద్యము

లలభ్యములు. ఆంగ్లభాషాకృషి సేయనెంచి 'మిడిల్‌స్కూలు' పరీక్షకుం బోయి రాజధానిలోఁ బ్రథములుగా నెగ్గిరి. తరువాత న్యాయవాది పరీక్షకుంజదివి యుత్తీర్ణులై పార్వతీపురము మునసబుకోర్టునఁ బనిచేసిరి. లౌకికోద్యోగము చేయు చున్నను సాహిత్యవ్యవసాయము వీడక గ్రంథరచనము చేయుచు 1892 లో 'ఆంధ్రపద్యావళి' యను పేరఁ దమఖండ రచనల నొక సంపుటముగా వెలువరించిరి. తరువాత 'రహస్యదర్పణము' ముద్రించిరి. అం దదృశ్య ప్రపంచరహస్యములు, క్రిమికీటక పక్షి జంతు యాత్రాదిరహస్యములు మొదలగువానిపై నపూర్వపరిశోధనము కలదు. విక్రమోర్వశీయము, ఉత్తరరామచరిత్రము బాసలోనికిఁ బరివర్తించిరి. వీని కంతప్రశస్తి రాలేదు. 1903లో 'కల్పలత' యను విజ్ఞానవిషయక మాసపత్రిక నెలకొల్పిరి. ఆ కల్పలత రెండేండ్లలో యశోలతయై యాఁగి పోయినది. మరల 1919లో దాని లేవఁదీసి కొంతకాలము నడపిరి.

శర్మగారు తెలుఁగున జరిగిన యెన్నో మహాసభలకు ఆధిపత్యము వహించిరి. 1923 లో గుంటూరుమండలమునందలి 'సందూరు'న జరిగిన మూఁడవ యాంధ్రసారస్వతసభకు వీరధిపతులు. ఆపరిషత్తునవే వీరిని మహోపాధ్యాయ బిరుదమున సత్కరించిరి. 1924 లో ఆంధ్రసాహిత్య పరిషత్త్రియోదశ వార్షికోత్సవమునకు వీరు సభాపతులు. 1929 లోఁ దెనాలియందు జరిగిన ప్రథమాంధ్రనాటక కళాపరిషత్తునకు శర్మగారాధ్యక్ష్యము సభ్యప్రార్థనపై నంగీకరించి యద్భుతముగా సభనునిర్వహించిరి.

ఈవిధముగా మహాసభల కధ్యక్షులై, మహోపన్యాసకులై మహోపాధ్యాయుఁ డనిపించుకొనిన సాంఖ్యాయన శర్మగారి కవితా విశేషము లిఁకఁ జవిచూతము. ఈయన కవిత రసస్ఫోరకము. సరళపద భరితము.

పట్టిన దెల్లఁ బైడియగు భంగిని పల్కు సపల్కు పద్యమై
యుట్టిపడంగఁ జెప్పిన దె యొప్పినవేదము కాఁగ సత్కథల్
కొట్టినపిండిగాఁ గవితఁ గూర్చిన ధన్యుల లోకమాన్యులన్
బుట్టను దిప్పనుం బాడమి పూజ్యతఁ గాంచినవారి నెన్నదన్.

"సుధానిధి"

ఆటవెలఁదు లున్న తేటగీతము లున్న
మనసు కరఁగిపోవు మంచుపగిది
ఆట లేక తేటపాటయు లేకున్న
వెలఁదు లున్నఁ జాలఁ వేవరాలు.

"ఆటవెలఁదులు తేటగీతములు"

సీ. నెలఁతలు చంటి బిడ్డలకుఁ బాల్గుడుపుటే
ప్రకృతిధర్మంబని పలుక రాదు
ప్రకృతిశాస్త్రజ్ఞులౌ పండితుల్ డార్విను
మున్నగువారలు కొన్ని చోట్ల
పురుషులు రొమ్మిసం బొడమినపాలతో
శిశుపోషణం బని చెప్పినారు
ప్రకృతి ధర్మంబులు ప్రభవించు నశియించు
నభ్యాస పద్ధతి ననుసరించు

మగువల కెగాని చన్బాలు మగల కెందు.
పొడమ వనుమాటలన్నియు బూటకములు
పురుషు లికమీఁద స్తన్యంబు వొడమునట్లు
రొమ్ము సవరించుకొనుట కార్యమ్ము కాదె?

"సంఘసంస్కరణము"

బిందె బిందెడు కాఫీకి పిడుగు తునుక
కట్టచుట్టలఁ గాల్చెడి పుట్టుభోగి
బుట్టెఁడాకులు నమలెడి పుణ్యభోగి
నాగరికు లన్న వేతె యున్నారె, వీరె.

"బహిస్సర్వాకార ప్రవణరమణీయుం వ్యవహరన్" అను భవభూతి శ్లోకమున కీకవియాంధ్రీకరణపుమచ్చు నిచ్చినచో వీరిశక్తి తెలియఁ గలదు.

మన సెటులుండనీ పయికి మాటలఁ జేఁతలచేత లోకరం
జన మొనరింపుచున్ దనరు స్వల్పపుదోషములైన దాఁచుచున్
జనులను మోసపుచ్చి యొరుచాడ్పున నేర్పరి తాఁ దటస్థుఁడై
తనపనిచక్కఁ బెట్టుకొనుఁ దాల్చును బిమ్మట మౌనముద్రయున్.

పానుగంటి లక్ష్మీనరసింహారావు

1865-1940

మధ్వమతస్థులు. తండ్రి: వేంకటరమణాచార్యులు. తల్లి: రత్నమాంబ. నివాసము రాజమహేంద్రవరము, పిఠాపురము. జననము: 1865 సం. నిర్యాణము: 1-1-1940 సం. రచితగ్రంథములు: సారంగధరచరిత్ర, వృద్ధ వివాహము, రాధాకృష్ణ, నర్మదాపురుకుత్సీయము, సరస్వతి, దుష్టప్రధాని, ఆనందనాథ, కల్యాణరాఘవము, కంఠాభరణము, విజయరాఘవము, కోకిల, విప్రనారాయణచరిత్ర, విచిత్ర సమావేశము, విచిత్ర మరణము, బుద్ధబోధసుధ, వీరమతి, పూర్ణిమ, ప్రచండ చాణక్యము, (ఇత్యాదినాటకములు.) హాస్యవల్లరి, పతనము, మంజువాణి, జగన్నాథమూర్తి, మోసము, జలజ, సాక్షి (6 భాగములు)

సాక్ష్యుపన్యాసములు చదువనియాంధ్రు లుండరు. జంఘాలశాస్త్రి గంభీరోపన్యాసము, వాణీదాసుఁడు, కాలాచార్యుఁడు, బొర్రయ్య సెట్టిగారల మాటలును తెలుఁగువారెల్ల రెఱిఁగినవే. వారి నాటకముల మాట యటుండనిచ్చి సాక్షివలనఁ బానుగంటివారిని దలఁచుకొని నవ్వుకొనుచుందుము. ఆంధ్రపత్రికా పాఠకులు సాక్షివ్యాసములకొఱకుఁ గాళ్లు విఱుగఁద్రొక్కుకొనినదినము లెన్నియో యున్నవి. కాని పంతులుగారి షష్టిపూర్తిసందర్భమున నొకయాంధ్రుఁ డేని నడుము గట్టినపాపానఁ బోలేదు. సాక్షి యాంగ్లములోని spectator అను గ్రంథమునకుఁ దెలిసికొనఁజాలని ఛాయయని చెప్పుదురు గాక! అయిననేమి? తెలుఁగుజాతికి 'సాక్షి' యొక యుజ్జ్వలవిజ్ఞానదీపము. మన సంఘమును, మనజాతిని, మనవాఙ్మయమును, మనదురాచారములను మెత్తమెత్తగా నెత్తిపొడుచుచు సంస్కరింపఁజూచిన మహాగ్రంథము 'సాక్షి'

లక్ష్మీనరసింహారావుపంతులుగారు స్త్రీలు - మతము - నాగరకత - వేదాంతము - విద్యావిధానము - రాజకీయములు - మున్నగు విషయము

లను గూర్చి యెక్కువ చర్చింతురు. పంతులుగారికి దేశభాషయం దింతింత యనరాని యభిమానము. దేశీయభాషలో నుపన్యసింపలేని యధ్యక్షునిగూర్చి పంతులుగారు ప్రకటించిన సూగ్రహ మనుపమానము. ఇది 'స్వభాష' యను (సాక్షి మూఁడవసంపుటము) వ్యాసమునఁ గాన నగును. స్నానసంధ్యాదినియమములు వదలివేయుట భారతీయులకు ధర్మము కాదని చెప్పు ప్రాచీనాచారపరాయణులు శ్రీ పంతులుగారు. వారివేదాంతోపన్యాసములను బట్టిచూచిన వారద్వైతవాదులు. కాని వస్తుతః వీరు ద్వైతమతస్థులు. నేఁటి విద్యావిధానమున దైవభక్తికి సంబంధించినగ్రంథములు లేవనియుఁ గనుకనే విద్యార్థులలో నాస్తికత ప్రబలముగున్నదనియు వీరు పలుమారు వ్రాయుచుందురు. రాజకీయ విషయములనుగూర్చి యెన్నికలనుగూర్చి వ్రాయుచు గాంధిగారి సిద్ధాంతములను దాము వివేకించునట్లు విలిఖించిరి. సాక్షిలో 'తోలుబొమ్మలాట' వ్యాసము చదివిన వీరి జానపదవిషయవివేకిత వెల్లడియగును.

పానుగంటిపంతులుగారు శబ్దవైచిత్రి వలచినకవి. ఆంధ్రవచన రచనలో వీరొకక్రొత్తదారి త్రొక్కిరి. కందుకూరి వీరేశలింగము పంతులుగారు గద్యతిక్కనయేగాని యావిషయము వేఱు. చిలకమర్తికవి పెద్దనవలా రచయితేగాని యదియునువేఱే. పానుగంటివారి రచన మఱియొక విలక్షణ మైనది. వీరు వ్యావహారికమునకు దగ్గఱగనుండు గ్రాంథికము వ్రాయుదురు. ప్రతిపదము పరిహాసగర్భితము. ఆక్షేపణ భరితము. చెప్పినదే మార్చి మార్చి శంకాంతరముగాఁ జెప్పుట వీరి రచనలోఁ గ్రొత్తదనము. చదివినకొలఁదిని జదువుట కుత్సాహము పుట్టించు రచనమే రచనము. అది పానుగంటికవి సొమ్ము. విషయము గప్పిపుచ్చకుండ, విసుగుపుట్టింపకుండ వేలకొలఁది నిదర్శనములఁ జూపుచు వ్రాయుటలోఁ బానుగంటి వారిదే పైచెయ్యి. పాఠకున కొకవిధమైన యుత్సాహము చిత్తసంస్కృతి యావేశము గలిగింపఁజేయుట కీయన రచన యుక్తమైనది.

వీరికిఁ బాశ్చాత్య వాఙ్మయమునఁ గూలంకషమైన ప్రజ్ఞ. పంతులుగారు భాషలోనేగాక వ్యవహారమునఁగూడ దిట్టమైనప్రజ్ఞ కలవారు. కొంత కాలము 'అనెగొంది' యాస్థానమునఁ, గొన్నినాళ్లు ఉర్లాము ప్రభుత్వమునఁ, గొంతకాలము లక్ష్మీనరసాపురము సంస్థానమున మంత్రిగా పనిచేసిరి. తరువాతఁ బీఠికాపురసంస్థానప్రభువులు వీరి వైదుష్యమునకానందించి చివరివఱకు నెలకు 116 రూప్యములు నిచ్చుచు సన్మానించిరి. పాశ్చాత్యభాషాప్రవీణులయ్యు నాంధ్రభాషాసేవ యమూల్యముగా నొనరించి తరించిన పండితు లీయన. అనుకరణము లీయన యామోదింపలేదు. అనువాదములు గావింపలేదు. 'ఆంధ్రి' ని మఱవలేదు. వీరు తీసికొనిన గాథలు పౌరాణికములు. కావ్యచిత్రణములు మాత్రము నవీనములు. వ్యాసములలోనేకాదు నాటకములలోనే కాదు హాస్యమునకుఁ బ్రాధాన్యము. సాక్షిలోని వ్యాసములకు హాస్యరస మతిమాత్రమైనను బ్రమాదములేదు. కాని వీరి కొన్ని నాటకములలోని హాస్యము ప్రధానరసతిరోధానము చేయుచు నత్యధికమైనది.

శ్రీ లక్ష్మీనరసింహము పంతులుగారి నాటకములలోని పద్యములు బండివానినుండి పండితునివఱకుఁ బాడుకొని యానందించుచుందురు. నాటకరచనకంటె సాక్షివ్యాసములతోఁ బానుగంటివారికి గొప్పపేరు వచ్చినది. సాక్షివ్యాసములకంటె నాటకరచనలో నరసింహారావు పంతులుగారిని రసవిదులెల్ల మెచ్చుకొనిరి. పానుగంటివారి నాటకములకు కూచి నరసింహముగారు 'నాంది' వ్రాయుట యొక యాచారము. పంతులుగా రాంగ్లకవిశేఖరుఁడగు 'షేక్స్పియరు' వ్రాసిన యన్ని నాటకములు వ్రాయవలె నని సంకల్పించి యొకటిరెండించు మించులోఁ దమ సంకల్పము పూరించుకొనిరి. వానిలో నయిదారు నాటకములకు నఖండప్రశంస వచ్చినది. 'రాధాకృష్ణ' వీరి నాటకములలో నాయకరత్నము. దానియందు వీరి కవిత పండినది.

మెఱుఁగుఁగుండలముల మిసమిసల్ గండభా
    గములపై నట్టిట్టు గంతులిడఁగ
రంగారుకటినుండి బంగారుపుట్టంబు
    చిఱుబొజ్జనుండి కొంచెముగ జాఱఁ
బవనపూరణమున జవుజవ్వుమని లేఁత
    బుగ్గలు బూరెలై పూఁకటిల్ల
నిగనిగల్ గల గుజ్జుసిగ నున్న శిఖిపింఛ
    మొయ్యారమునఁ దలయూఁపుచుండ

నత్తమోత్తమజన్మమై యొప్పుమురళి
నధరమున మోపి జలుజల్లుమనఁగ జగతి
గానమును జేయుకల్యాణకాంతు లొలుకు
నీదువదనంబు జూపింపు నీరజాక్ష!

ఈపద్యమునఁ గవికి వేణుగానలోలుని విశ్వరూప మగపట్టినది. ఈ నాటక కర్తకు గోపాలబాలుని మురళీరవముపై నభిమానము. ఒక్కచో రాధ కృష్ణు నిట్లు ప్రార్థించినది.

సరససంగీత మాధురీ సాధురీతి
నింక నొకసారి మురళి వాయింపుమయ్య
త్వన్ముఖామృతపూరంబు ద్రావుదాన
ఘనఘనాంబువు చాతకకాంతవోలె.

సుమధురమగు సుప్రసన్నము నగుభాషలో నాటకపద్యములు వ్రాయు నేర్పు పానుగంటి లక్ష్మీనరసింహారాయునికే చెల్లినది. తరువాత చిలకమర్తి లక్ష్మీనరసింహారాయునికే తగినది. అన్యుల కాశైలి యసహజము. వీరి నాటకములలోని సంభాషణములు సన్నివేశములు చాల సరసముగ నుండును. ఒక్కొక్కవిషయముద్రేకముతో రచింతురు. అట్టి సందర్భములయందు కొంత విరసముగనుండుటయుఁ దటస్థించును. పానుగంటి కవి సీసములు విశేషించి గీతములువ్రాయుచుండును. ఆగీతములు వచనమువలె నడచుట వీరి కభిమతము. ప్రతిపద్యమున నుపమాన ముండి

తీరును. ఆయువమలలోను నీచాధికభేదములు పాటింపని యువములు. అందులకే వీరి పద్యములు పండితపామరరంజకములు. ఒక్కొకచో వీరి హాస్యరసము వట్టోడి పరిహాసాస్పద మగుచుండుటయుఁ గలదు. రాను రాను సాక్షివ్యాసములలో నీగుణము మనకుఁ గనుపించును. కల్యాణ రాఘవము, పట్టభంగరాఘవము, వనవాసరాఘవము, విజయరాఘవము, రాధాకృష్ణ, సారంగధర, సరోజిని, సర్వదాపురుషుత్రీయము, విప్రనారాయణ ఇత్యాదులు పౌరాణికములు. ప్రచండచాణక్యము, చూడామణి ఇత్యాదులు చారిత్రకములు. కోకిల, సరస్వతి, వృద్ధవివాహము, మాలతీమాల, రాతిస్తంభము ఇత్యాదులు కల్పితములు. వీరి 'కంఠాభరణము' నాటక వాగ్దేవతకుఁ గంఠాభరణము. వీరికి బౌద్ధవాఙ్మయమునఁ గలయభిరుచికి 'బుద్ధబోధసుధ' నాటకమే సాక్షి.

పానుగంటికవి చాటూక్తి చతురుఁడు. 1922 లో ఆంధ్రసాహిత్య పరిషదేకాదశ వార్షికోత్సవసభకు వీరి నగ్రాసనాధిపతులుగా నెన్నుకొనిరి. అపుడు వా రుపన్యాసారంభమున నిటులు చెప్పిరి.

"......నేనుపండితుఁడనుగానని యీ యూరివా రెఱుఁగుదురు. పైగ్రామములవా రెఱుఁగుదురు. సాహిత్యహీనతలో జగమెఱిఁగిన వాఁడను గాని సాధారణుఁడను గాను. ఇట్టినన్నుఁ బరిషత్తువా రేల యెన్నుకొనవలయునో నాకుఁ దెలియదు. తెలిసిన విషయ మేమియో యంతకంటెఁ దెలియదు. వెనుక జరిగిన పదిపరిషత్సభలకుఁ బండితుల నెన్నుకొంటిమి గదా, యీసారి యపండితు నెన్నుకొందము. ఇంతలోఁ జెడిపోవున దేమున్నదని యూహించి మార్పుకొఱకై నన్నెన్నుకొని యుందురేమో, ఎట్లైన నేమి? అవిలంఘ్యమైన మహాజనులయాజ్ఞ తులసీదళము వలె శిరమున ధరించి గాట నిలువఁబడితిని......"

ఈ సంభాషణ మెంతయభిప్రాయ గర్భితము! లక్ష్మీనరసింహారావు గారు 'స్వీయచరిత్ర' వనవాస రాఘవ రచనము నటకు వ్రాసికొని రని తెలిసినది. అది తుదముట్టకుండఁగనే వారుగతించుట తెలుఁగువారి దుర దృష్టము.

నాగపూఁడి కుప్పుస్వామయ్య

1865 - 1951

సామశాఖీయద్రావిడ బ్రాహ్మణులు. చిత్తూరుమండలములోని "చిరుతని"దరినున్న నాగపూఁడి వీరి నివాసము. తండ్రి యజ్ఞనారాయణ శాస్త్రి. జననము : 1865. నిర్యాణము : 1941.

కృతులు: ౧. భారతసారము ౨. భోజరాజీయము 3. కాళహస్తీశ్వర శతకము ౪. స్తవరత్నావళి (సంస్కృతము) ౫. పారిజాతాపహరణ పరిమళోల్లాసము ౬. భాగవత,నిర్వచనోత్తరరామాయణాది ప్రాచీన గ్రంథముల పీఠికలు.

కుప్పుస్వామయ్యగారు విమర్శకాగ్రేసరులు. మదరాసులోని ఆనంద ముద్రాక్షరశాలాధికారులు వీరిచే గొప్ప సారస్వతసేవ చేయించిరి. వారు ప్రకటించిన భాగవతము, కంకంటి పాపరాజకృతోత్తర రామాయణము, నిర్వచనోత్తరరామాయణము మున్నగు ప్రాక్తన గ్రంథములను పాఠభేదములతో సరిచూచి సరిచేసి చక్కని పీఠికలు వ్రాసిన మహాశయులు వీరే. ఆంగ్లపద్ధతుల ననుసరించి యాంధ్ర గ్రంథముల కుపోద్ఘాతములు రచించినవారిలో కుప్పుస్వామయ్యగారిది యగ్రతాంబూలము. వీరి కావ్య-పురాణభూమికలు తరువాతవారి కొరవడి దిద్దె ననుటలో నత్యుక్తి లేదు. వీరి పాండిత్య-విమర్శకతాశక్తులను వేదము వేంకటరాయశాస్త్రి, కొక్కొండ వేంకటరత్న ప్రభృతు లుగ్గడించిరి. శ్రీపీఠికాపురాధీశ్వరులు వీరిని గౌరవించిరి.

కుప్పుస్వామయ్య చెన్నపురి క్రైస్తవకళాశాలలోఁ జదివి పట్టభద్రులైరి. సంస్కృతాంధ్ర సాహిత్యము చాలవఱకు స్వయం సంపాదితము. నాఁడు తిరుపతి సంస్కృతకళాశాలాధ్యాపకులు పట్టిపల్లి నరకంఠీరవ

శాస్త్రిగారు, కాళహస్తి సంస్థానపండితులు శతఘంటము వేంకటరంగ శాస్త్రిగారును వీరికి మిత్రులు. ఈకమ్మ యిందులకు దృష్టాంతము.

"సిరుల కిరవై, చదువులకుఁ గుదురై, యీవికిఁ దావలమై, దిట్ట తనమ్మునకు మనిపట్టై, నీటునకుఁ జోటై, ఓరుపునకు మేరయై, ప్రేము డికి గీమై, నాణెములకుఁ దానకమై, పొంకంబులకుఁ డెంకియై, చల్ల దనంబుల కిల్లై, మఱియు గొనమ్ముల కిమ్మై యిమ్మైఁ గ్రాలుచుఁ గతిం జేసియు నాయెడం దద్దయుఁ బోరామి గారాములు నెఱపుచు వఱలు నాయనుఁగు నెయ్యునకు—శతఘంటము వేంకటరంగయ్య గారికి –"

నాగపూఁడి కుప్పుస్వామయ్య బి. ఏ.

పై నుదాహరింపఁబడిన యిరువురుశాస్త్రులవలనను నీయన తన సాహిత్యమునకు మెఱుఁగులు పెట్టుకొనెను. అసలు కుప్పుస్వామయ్యగారు 1918 దాఁక న్యాయవాదులై పేరు సంపాదించిరి. కాని, వారి కావృత్తి పై మనసు లేదు. నిరంతరము భాషావ్యాసంగమే విహారరంగము. తిరుపతి సంస్కృతకళాశాలకు నాఁడు వీరు విచారణకర్తలుగ నుండిరి.

ఈవిమర్శకుని జీవిత మానందతుందిలమైనది. శిష్టానుష్ఠాన పరులు. శాంతహృదయులు. తెలుఁగన్నచో నెన్నరాని యభిమానము. వీరి కుటుంబములోని వారందఱు భారత భాగవతాదుల పారాయణములోఁ గాలవ్యయము సేయుచుందురా రఁట. కుప్పుస్వామయ్యగారి భారత సారము, భోజరాజీయము నను వచనగ్రంథములు మధురశయ్యా బంధ ములు. "కవులకుగద్యము గీటురాయి" యని దండి పండితుని యాభాణ కము. దానికిఁ దగినట్లుగా నీయన వచనధోరణి మంచిసొంపు బెడఁ గులలో నుండెడిది. చిన్నయసూరివలె నీయనయుఁ జక్కని వచనరచయిత యని నాఁడు ప్రశంసించిరి. వ్యావహారిక వాద మీయన యామోదింప

లేదు. ఉత్తరములుకూడ నీయన సలక్షణభాషలో రచించెను. సంస్కృతమున వీరి పాండితికిఁ దారకాణగా ' స్తవరత్నావళి ' నారయవచ్చును. శ్రీ శృంగేరీ జగద్గురువులు - శ్రీ కుంభఘోణము జగద్గురువులును వీరి గీర్వాణవాణీప్రౌఢిమమునకు మెచ్చి గౌరవించిరి. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి భారతమునకు వీరువ్రాసిన విపులభూమిక పరికింపఁదగినది. ఆనందముద్రాలయ, వావిళ్ళముద్రాలయ ప్రకటితములయిన పెక్కు కృతులు కుప్పుస్వామయ్యగారి పరిశీలనతో సందగించుచున్నవి.

చెన్నపురి విశ్వవిద్యాలయమునఁ బ్రాచ్యవిద్యాద్భుతపరీక్ష లుండవలయునని పోరి పెట్టించినవారిలో మొదటివాఁ డీ విమర్శకాగ్రేసరుఁడే. వీరిశిష్యు లెందఱోవందలు నేఁడును చిత్తూరుమండలమున నుండిరనివాడుక.

ఆత్మశ్లాఘ నెఱుఁగని యీయన శిష్యులు వచ్చి "మేము తమ శిష్యుల" మని చెప్పుకొనునప్పుడు "గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్న సంశయాః" అని యనువారని వింటిమి. కాళహస్తి సంస్థాన ప్రభువులగు శ్రీ దామెర అక్కప్పనాయనింగారికి వీరు కొంతకాల మాంగ్లభాష గఱపిరి. ఈ నాగపూఁడివంశ మందారుని "పారిజాతాపహరణ పరిమళ వ్యాఖ్య" ఆంధ్రసాహిత్యమున కపూర్వభూష. వ్యాఖ్యానావతరణమున నీయన యనేక జ్ఞేయాంశములు వెలిబుచ్చిరి. ఇది వీరి పాండితికి స్ఫోరకము. అయినను, ఈ వినయవాదము వినఁదగినది.

తెలిసిన దానిని వ్రాసితిఁ
దెలిసిన పని తలఁచి వ్రాసితిం దెలియక నా
తెలియమిఁ బోలసిన నలుసులఁ
దెలిపెద రని తలఁతు లెస్స తెలిసిన వారిన్.

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి

1866

వెలనాటి వైదిక బ్రాహ్మణులు. కౌశికసగోత్రులు. ఆపస్తంబ సూత్రులు. తల్లి: వేంకట సుబ్బ సోమిదమ్మ. తండ్రి: వేంకట సోమయాజి. జన్మస్థానము: ఎర్నగూడెమునొద్ద నున్న దేవరపల్లి. నివాసము: రాజమహేంద్రవరము. విరచితగ్రంథముల సంఖ్య యించుమించుగా 200. అందలి ముద్రితగ్రంథములు కొన్ని:—౧ బొబ్బిలియుద్ధ నాటకము. ౨ వేణీసంహారము. ౩ కలభాషిణి. ౪ రాజభక్తి. ౫ భోజరాజ విజయము. ౬ శ్రీనాథ కవిరాజీయము (నాటకములు) ౭. గౌతమీ మహాత్మ్యము ౮. సత్యనారాయణోపాఖ్యానము ౯. గజానన విజయము ౧౦. శ్రీకృష్ణకవిరాజీయము ౧౧. సావిత్రీ చరిత్రము [పద్యప్రబంధములు] ౧౨. బ్రహ్మానందము [అచ్చతెనుగు కావ్యము] ౧౩. సంస్కృతకవి జీవితములు. ౧౪. కాళిదాసు విలాసము. ౧౫. తెనాలి రామకృష్ణ చరిత్రము [వచనములు] ౧౬. శ్రీకృష్ణ మహాభారతము [అష్టాదశపర్వములు] ౧౭. శ్రీకృష్ణరామాయణము. ౧౮. శ్రీకృష్ణమహాభాగవతము [నేటికి ముద్రితము] ౧౯. గణేశపురాణము – ఇత్యాదులు. ఈ కవిని గూర్చి విపుల విషయము తెలియుటకు అనంతపంతుల రామలింగస్వామి విరచితమైన 'శ్రీకృష్ణ కవిజీవితము' పరికింప వలయును.

అయిదావేదుల యీడునం బ్రతిదినం బా భారతామ్నాయమున్
నియమం బొప్పఁ బురాణము న్వినిచి నిర్ణిద్ర ప్రబోధాప్తి మా
యయగా రర్థము సెప్పి తత్కథలు లో నంటింప నంతేనియుం
బ్రియ మయ్యెం జూడ నాకు భారతముపై నిత్యానుబంధంబుగన్.

నేనాంధ్రంబునఁ గించి
న్మాన్యంబుగ నూఱుకృతుల నున్నతి నొందం

గా నొనరించితి లోకము
వానిం జవిచూచి యెఱుఁగుఁ గాకఁగ నేలా !

అని, (పదునెనిమిది పర్వములలో నిండిన మహాభారతము నొక్క చేతిమీఁదుగా ననువదించి వెలుగించిన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారివంటి భాగ్యవంతులు తెనుఁగు నాఁటిలోఁ గంటికిఁ గనఁబడువారరుదు. ఆశ్చర్యముపై నాశ్చర్యము మహాభారతమే కాక శ్రీమద్రామాయణము, భాగవతము కూడ శాస్త్రులుగారి చేతిమీఁద నాంధ్రీకరింపఁబడుట. భారత భాగవత రామాయణములు మూఁడును ముచ్చటగాఁ దెనిఁగించి యచ్చువేయించి సహస్రమాస జీవితోత్సవము జరిపించుకొనియు నడుము వంచని పండితులు కృష్ణమూర్తి శాస్త్రిగారు. మహామహోపాధ్యాయులు, కళాప్రపూర్ణులు, కవిసార్వభౌములు నగు శ్రీపాద వారి శతాధికగ్రంథ రచనము కొందఱ కామోదము కలిగింపకున్నను భారత రామాయణాంధ్రీకరణము మాత్ర మాశ్చర్యానందములు కలిగించినదని చెప్పవచ్చును. వీరి తెనుఁగుసేఁత యథామాతృకముగా సాగినది. తొల్లిటి కవిత్రయము పరివర్తనము సేయక విడిచిన భగవద్గీతాది ఘట్టములు సైతము శాస్త్రులుగారు తూచాలు తప్పక తెనిఁగించిరి. భారతాంధ్రీకరణములో నన్నయాది తిక్కనలను మించి యౌచితిని పాటించితినని శాస్త్రులుగారి విశ్వాసము. కవిత్రయభారతమునందలి యౌచితీ సుందరత వేఱొక యాంధ్రగ్రంథమునందే లేదని విమర్శకుల వ్రాఁతలు విమర్శనములు శాశ్వతములుగా నుండవు.) కృష్ణమూర్తి శాస్త్రులుగారు మహాభారత పీఠికలో నొకచోట చెప్పినారు.

నన్నయ తిక్కనాది కవినాథులకన్నను మిన్నగాఁ దెలుం
గు న్నుడువంగలాఁడ నధికుండను నేనని కాదు, గ్రంథమం

దు న్నరసుల్ గొలంతలును దోఁచునటంచని కాదు వెండియుం
బన్నుట భారతేప్సితను బట్టిన చాపల మంచు నెంచుఁడీ.

శ్రీకృష్ణమహాభారతము పేరు కవిత్రయభారతము వెనుక సుస్థిరముగా నుండుననుటకు సందేహములేదు. భారతము వ్రాయుట మాటలతోఁ బనికాదు. భల్లూకపుఁబట్టు పట్టవలయును. ఏదేనొక మహోన్నత కార్యము తలపెట్టునపు డనేకాఘాతములు తగులుచుండును. అనేకాశయములు వెన్నాడుచుండును.

"ఆదరణీయసారవివిధార్థ గతిస్ఫురణంబుగా నౌచితీపోషణము చేసి కొనుచుఁ గవినాథులగు నన్నయాదులు మున్నె మహాభారత మను వదించి యాంధ్ర కవితాలోకమున నసశ్వరయశస్సు నార్జించుకొని యుండిరి. వాగనుశాసనుఁడగు నన్నయభట్టారకు నంతవాఁడుకూడ భారతాంభోనిధిని తుదముట్ట నీఁదలేఁడయ్యె. ఒక వేళ, మనమీ గ్రంథము పూర్వసుకృత బలమునఁ బూర్తిచేసినను గవిత్రయభారతమువలె రసికామోదము కలిగించునో, లేదో?"

ఇత్యాది ప్రశ్నములే తద్గ్రంథరచనారంభమునఁ బొడమి కవిమనస్సును గలఁచివైచుట సహజము. ఇదియననేల? ఏ మహోద్యమమందైన నిట్టి ప్రశ్నములేపుట్టి వ్యగ్రోత్సాహమును గొంత భగ్నమొనర్చుచుండుట తెలుచు. ఇట్టిస్థితిలో నీసంశయములు వెనుకకు దాపియొక ధైర్యస్థైర్యములతో నక్షయదీక్షతో మహాభారత మంతయుఁ బదునైదేండ్లలో సమగ్రముగా ననువదించి చరితార్థులైన కృష్ణమూర్తి శాస్త్రిగారు వజ్ర సంకల్పులు. అరణ్యపర్వ రచనా కాలములో నీకవిరాజున కెన్ని యో యిడుమలు గలిగినవి. ద్రోణపర్వము వ్రాయుచున్నపు డిక్కవికి స్మరణీయమగు నొక విషాదఘట్టము.

అతికష్టంబుగ నిట్లు కాలమును ద్రోయంజాలి యున్నప్పుడున్
కృతినిర్మాణము మానకెట్లొ యిరుమూఁడే పర్వముల్ పూర్తిచే
సితి ద్రోణంబు దొడంగి యర్జుని వధంబున్ వ్రాయుచున్నప్డు నా
సుతునింజెంద 'హతోఽసి మే సుత' యటంచున్ ఫల్గునుండేడిచెన్.

అది తెలిఁగించు నామనమునం దొకసందియ మావహిల్లె న
య్యదనున నాసుతా! యనక హాసుతయంచుఁ దెలుంగుసేయఁగా
మొదలిడినాఁడ; నాసుతుఁడు పొంత వసింపఁగరాఁగ, నిప్పుడి
ప్పదనున నుండకించు నెడఁబాపుదు నైన దిగుల్మదిం బడెన్.

ఈసంశయముతో గ్రంథము రచించుచుండ దైవవశమున నీభారత కవి కుమారరత్నము 'సుదర్శనసుధి' యనునతఁడు స్వర్గతుఁడయ్యెను. ధైర్యశాలి యగు కవిరాజు గర్భశోకము డిగఁద్రావి భారతము సాంతము రచించెను.

శ్రీకృష్ణ మహాభారతమునకు రాజరాజ నరేంద్రుఁడు ముక్త్యాల సంస్థాన ప్రభువు శ్రీరాజా వాసిరెడ్డి చంద్రమౌళీశ్వర ప్రసాదరావు. పాలకొల్లు వాస్తవ్యులు, వణిగ్వరులు నగు శ్రీ రేపాక సత్యనారాయణ మూర్తి, శ్రీ చుండూరి నారాయణరావుగారలు భీష్మద్రోణపర్వములు, కర్ణశల్య సౌప్తిక స్త్రీపర్వములు మాత్రము కృతినొంది స్వర్ణాభిషేకముచేఁ గవిరాజును గౌరవించిరి. (సంస్కృత మహాభారతము నన్నయభట్టార కాద్యాంధ్ర మహాకవిత్ర యాంధ్రీకృతమైన పిమ్మట మరల దానిని పద్య రూపముగ ననువదింప సాహసించి పరిపూర్ణముగాఁ గృతార్థులైనవారు వీరొక్కరే. ఆంధ్రవ్యాసులని కొండాడఁబడిన ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రిగారు 'ఆంధ్రమహాభారత నవనీత' మను పేరితోఁ బదుమూఁడు పర్వము లనువదించిరి.) అం దాదిపర్వము మాత్ర మిటీవల నచ్చునకు వచ్చినది. శ్రీ తాడూరి లక్ష్మీనరసింహకవి భారతాంధ్రీకరణమునకు దొరకొని

విరాటోద్యోగములు మాత్రము రచించిరి. అది నేటికి కచ్చుకాలేదు. మఱుకుమల్లి నృసింహకవి పితామహుఁడు మాధవకవి ' అభినవభారత ' మనుపేర భారత మాంధ్రీకరించె ననియు, నం దాదిపంచకము మిగిలి తక్కినది తాడిపర్తి గ్రామములోఁ దగులఁబడిన దనియుఁ దెలియు చున్నది. కవిత్రయభారతముతరువాత శ్రీకృష్ణభారతమే సంపూర్ణముగా రచింపఁబడి సమగ్రముగా ముద్రణమునకు వచ్చినది. (నన్నయభట్టారకుఁడు గంటముపట్టి భారతరచనకుఁ గడఁగిన రాజమహేంద్రవరముననే కవిరాజు కలముపట్టి మహాభారతము పూర్తిచేయుట మెచ్చుకొనఁ దగినది. శాస్త్రిగారి షష్టిపూర్తితో పాటు భారతరచనా పూర్తియు నగుట మఱియు మెచ్చుకోఁదగినది. ప్రాచీనభారతములో శ్రీకృష్ణ భారతము కూడ రసికరంజన మొనరించుఁగాక ! కృష్ణభారతకవిత యిటులు జాలు వాఱుచుండును.

ధృతరాష్ట్రుఁడు భీష్మపతనమునకు దుఃఖించు ఘట్టములోనివి :

చ. కురు వృషభుండు భీష్ముఁ డెటుకూలెనొ నేలకు నాశిఖండిచే
శరములచే హతుండయి విసంజ్ఞతనెట్లు సహించెనో సుతుల్
దొరనటు కోలుపోయి యెటు తొట్రిలుచుండిరొ నీనుడు ల్వినం
గరము మదీయమానసము గంపమునొందెడు నార్తిఁగుందెడున్.

ఉ. ఎవ్వరతండు పాండవుల కెద్దిఱఁజూపుచుఁ దర్పలంబులం
ద్రెవ్వఁగనేయ నేఁగుతఱి ధీరతతో నెనువోవఁ జాలిరో
యెవ్వరు వెంబడింజనిరొ యెవ్వరు వానికిఁ దోడుసూపిరో
యెవ్వరు వానిఁగ్రవ్వకొని యెప్పుడునుండిరొ చెప్పు సంజయా !

ఉ. వేఁడివెలుంగు చీఁకటుల వేయికరంబుల నూడ్చిపుచ్చున
ట్లోడ కతండు శాత్రవుల యుబ్బరమెల్ల నడంచివైచుచో

నేఁడు సమర్థుఁడై యెదుర నేయఁగ నుండెనో పాండవేయులే
పోఁడిమిఁ దాత కట్టిపని పుట్టఁగఁజేసిరొ ముట్టఁజెప్పవే?

మ. పదినాళ్ళుల్ పడవాలుగా నిలిచి చాపంబూని కోపంబునం
బదులున్నాఱులు వేలుకోల లోకటంబాఱం బ్రయోగించుచుం
గదనంబుం బొనరించి శత్రుసమితిం గాఱించి కారించి యా
పదినూనుండు ప్రశాంతుఁడయ్యె నకటా నా భాగ్యదోషంబునన్.

క. కాలాగ్నివోలెఁ బగఱం
దూలించుచుఁ గాల్చిపుచ్చి దుర మొనరించెన్
గాలికివిఱిగిన మ్రాన్వలెఁ
గూలెనఁటె నేల కతఁడు కుంఠితబలుఁడై.

వీరి కవితలోఁ దెలుఁగు పదములపాలు హెచ్చు. భావమున కంత గంభీరము లేకపోయినను, పద్యరచనలో మంచి ధారాళత గల తీరు కృష్ణమూర్తి శాస్త్రిగారికి నిసర్గజమైనది. కూర్చున్నవాఁడు కూర్చున్నటు లుండి లక్షలు పద్యములు రచించిన యీ కవిరాజు పట్టుదల తెలుఁగు కవుల కొకయొరవడి.

మొదటినుండియు శాస్త్రిగారికి శ్రీనాథునిపై నభిమానము మెండు. కవితారీతిలో శ్రీనాథునకు వీరికి నెంతో యంతరము; కొంతవఱకు శ్రీనాథుని జీవితములో వీరిజీవితమున కున్న పోలిక నీపద్యము వెల్లడించుచున్నది.

గౌతమీ మాహాత్మ్యకర్త కంఠముఁజుట్టు
కొని యుండెనేగదా ఋణము చిలువ
కనిమిత్తు మీనెల్లఁ జిపికించెనేగదా
యప్పులవారి వాక్యాయుధములు
క్రోతి మాన్యక్షేత్ర సమితి కోదునఁబెట్టఁ
బడెఁగదా వృషల సంభవునియొద్ద

అష్టశతావధానాధ్యున కిప్పుడు
చేరియున్న దిగదా నీరసంబు
పేటలంకల పాట లీపాటుదెచ్చె
మాల పురువులపాలయ్యె మఱిపోగాకు
అప్పు ముప్పదివేల రూప్యంబులింక
నెట్లుదీర్చెదు శ్రీపాద కృష్ణమూర్తి.

ద్వితీయశ్రీనాథుఁడని శాస్త్రులుగారిని కొందరు ప్రశంసింతురు. కవిరాజ కవిసార్వభౌమాది బిరుదములు కొల్చుట, కనకాభిషేకముఁ బడయుట యివి యిందులకుఁ దార్కాణలు. అతనివలె నీతఁడు లంకవ్యవసాయము చేసి యుప్పులపా లాయెను. పయిపద్య మాసందర్భములోనిది. జీవితములో నిన్ని సన్మానములుచేయించుకొన్న కృష్ణమూర్తి శాస్త్రి గారు రెండవ శ్రీనాథుఁడే యనుటలో సంశయములేదు.

1933 లో రాజమహేంద్రవరమున గౌతమీ గ్రంథాలయమునందు వీరికి జరిగిన గండపెండేరపుఁగాన్కయు, నాఁటి సభాసమహోత్సవము తెలుఁగుచరిత్రములో నద్భుతమైన ప్రకరణములు. ఆసభకు యాజమాన్యము వహించిన శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు కృష్ణమూర్తి శాస్త్రి డాకాలుస గండపెండేరము నిండు పరిషత్తులోఁ దొడిగి తమ సహృదయతను వెల్లడించుకొనిరి. వేంకట శాస్త్రిగారివంటి శిష్యుఁ డుండుట శ్రీపాద కవికి దర్పకారణము. ఈ గురుశిష్యుల వాగ్వాదములు కొంతకాలమునకు దేశము మఱచిపోవును. ఇఁక మఱచిపోఁజాలనిది వారి శైష్యోపాధ్యాయిక. గండపెండేరము తొడిగించుకొన్న నాఁటి సభలో శ్రీపాద కవిరాజు చెప్పిన యీ పద్యము మహోదారమైనది.

శా. నాకీరిచ్చిన గండపెండేరమిలన్ నాస్వత్వ మేనాఁటికిం
గాకుండు; న్నీనుఁడేను ప్రాణములతోఁ గన్నట్టునందాఁక నా

డాకాల న్విలసిల్లు నెప్డుచెడకుండన్, దీని నాంధ్రావనీ
ప్రాకామ్యంబగు 'యూనివర్సిటి' వహింపంజెల్లు స్వత్వంబుగన్.

ప్రాచీనకాలమునఁ బెద్దనాది కవిపితామహులు పడసిన యిట్టి మహా మహిత సన్మానము లిపు డీకవిరాజు పొందుట యానందవిషయము. మఱియు నీయన స్వదేశసంస్థానములలోఁ గొన్నింట శతాష్టావధానములు ప్రదర్శించి సన్మానితులైరి. బంగాళా రాజధానిలో 'మయూరభంజి' (మారోబంజి) పట్టణమునకుఁ బోయి యా సంస్థానాధీశుని ప్రోల సంస్కృతమున శతావధానము చేసి బహూకారము నందినటులు వారి చరిత్ర చెప్పుచున్నది. శాస్త్రులుగా రాయా సందర్భములలోఁ జెప్పిన సమస్యా పూరణములు, చాటువులు స్మరింపఁదగియున్నవి.

అవ్వాతాతా, డంకానగారా, రారా పోరా, మేనా సవారీ అను మాటలు వచ్చునటులుగా, ఊర్వశి యర్జునుంగోరి యతఁడు తనకు వశుఁడు గామింజేసి పడిన విరహామునుగూర్చి వ్రాయుమనఁగా శాస్త్రులుగా రిటులు వ్రాసిరి.

శా. ఆ పాకారి కుమారుఁడట్లు విభవం బవ్వారిగా రాఁగ, రా
రాపోరా యను సందడిం బడు సుధర్మంజూచి నే నవ్వాతా
తా పాల్మాల వరింప కేగెనను వాఁ డంకానగారా కహా
మీాపాలం బడితింజెలున్ మనుపరే మేనా సవారించితిన్.

"వడ్డాణ మలంకరించె వనితకుచములన్"— కుళీరకుమారే కరీ పరిలునాతి పంచాననమ్" ఈసంస్కృతాంధ్ర సమస్యలకు కష్ణమూర్తి శాస్త్రిగారి పూరణము లుదాహరణీయములు.

క. వడ్ఢకులు పోరుచో భూ
రాడ్ఢమ్మున నడుపనేఁగు రథసమ్మున నా
నడ్ఢాకఁ దెగడు మెడఁగొను
వడ్ఢాణ మలంకరించె వనితకుచములన్.

శ్లో. అహో మధుపసంచయః కవికులాధినాథం సదా
పదప్రచర ఉత్సృతన్ హారిగతావధానస్థితమ్,
కరోతి యది చేత్తిరస్కృతి మిహోఘయుక్తే కథా
కుళీరకుమారే కరీ పరిలునాతి పంచాననమ్

బాలాత్రిపురసుందరీ దేవతోపాసకుఁ డగుటచే నీకవివరుఁ డన్నమాట విధిగా జరిగెడిదని కొన్నాళ్ళక్రిందటివారనుక. అదియటులుండ, శ్రీ శాస్త్రులుగారు పత్రికాసంపాదకతచేఁ గొంతకీర్తి సంపాదించుకొనిరి. 'కళావతి' యను ముద్రణాలయమును మదరాసులో నెలకొలిపి పిమ్మట దానిని రాజమహేంద్రవరమునకు మార్చి యువిచ్ఛిన్నముగా దానిని పదియేండ్లు నడపిరి. 'గౌతమి' యను తెలుఁగు మాసపత్రిక 1908 లో నారంభించిరి. అది యొకయేఁడు నడచి యాఁగిపోయినది. వీరి వజ్రాయుధము, మానవసేవ, వందేమాతరం అను పత్రికలు నాఁడు మంచి ప్రచారములోనికి వచ్చినవి.

(ఈతీరుగఁ బత్రికాసంపాదకులై, శతాధిక గ్రంథరచయితలై, భారత భాగవత రామాయణాంధ్రీకర్తలై, కవిరాజులై, కవిసార్వభౌములై, కళాప్రపూర్ణులై, మహామహోపాధ్యాయులై, ఆంధ్రవ్యాసులై, కనకాభిషిక్తులై, పూర్ణపురుషాయుషజీవులై విరాజిల్లుచున్న కృష్ణమూర్తి శాస్త్రిగారి సమగ్రజీవితము వ్రాసినచో మఱియొక మహాభారతము.

కూచి నరసింహము

1866-1940

తల్లి: పుల్లమాంబ. తండ్రి: వెంకనార్యుఁడు. జన్మస్థానము కుంచెనపల్లి (కృష్ణాజిల్లా). నివాసము: పిఠాపురము. జననము 17-10-1866సం. నిధనము 7-10-1940 సం. గ్రంథములు: రూపలత, ధనవాని, గౌరాంగ చరిత్ర (2 భా) తెలుఁగు క్లాసుతమాషా, ఆగ్నేయాశుగములు, గ్రాంథిక భాష గ్రామ్యభాష. రామకృష్ణ పరమహంస చరిత్ర. ఆత్మనివేదనము, నానావిషయక విరచనములు. వివేకానందస్వామి సారాణికోపన్యాస చతుష్కము, భ్రమప్రమాద ప్రహసనము, ఆదర్శ సుఖజీవనము – ఇత్యాదులు.

రాత్రి పదిగంటలవేళ సాలువఁ గప్పికొని చేతికఱ్ఱ పుచ్చుకొని మెల్ల మెల్లఁగ విద్యార్థులు చదువుకొనుగదులకడకు వచ్చి యెవరు చదువుచుండిరో, ఎవరు చదువుటలేదో బాగేఁడుదూరమున నుండి పరిశీలించి, మరునాఁడు పాఠశాలకు వచ్చినపుడు విద్యార్థుల నొక్కొక్కరిని పిలచి "నాయనా! రాత్రి నీ వెన్ని పొగచుట్టలు తగులబెట్టితివి" అని చమత్కార గర్భముగ నడుగుచు, ముగమువాచునట్లు చీవాట్లు పెట్టుచుండువారఁట కూచి నరసింహము పంతులుగారు. ఉపాధ్యాయులలో నింత చండశాసనుఁ డుండఁడని వారి శిష్యులవలన వినికి. ఆయన యనపత్యుఁడు. శిష్యసంతానమే వారి సంతానము. విద్యార్థుల పురోఽభివృద్ధికి, వారి విజ్ఞానాభివృద్ధికి పంతులుగారనేకవిధములఁ బరిశ్రమించెడివారు. నయముననో భయముననో విద్యార్థుల నుద్ధరించుటయే ప్రధానాశయముగఁ బెట్టుకొనినారు. వీరు పెద్ద తరగతివారికంటెఁ జిన్నతరగతివారికే యెక్కువశ్రద్ధ తీసుకొని పాఠము చెప్పుచుండువారు. పునాది దిట్టముగ నుండినఁగాని గోడ నిలఁబడ దని వీ రెఱుఁగుదురు. పిఠాపురోన్నత పాఠశాలను బ్రశంసించుచు 1907 లోఁ జెన్నపుర పరీక్షా

శాఖాధికారులు యోగ్యతాపత్ర మొసఁగిరన్న సంగతి తెలుఁగువారికను మఱచియుండరు. మన నరసింహము పంతులుగారి ప్రధానోపాధ్యాయత్వమే యీ పాఠశాల కీ గౌరవముఁ దెచ్చినది. పంతులుగారు పనిచేయుచున్నపుడు మెట్రిక్యులేషన్‌లో నూటికి నరువదిడెబ్బదివఱకు నుత్తీర్ణులసంఖ్య పెరిగినది. పంతులుగారు విద్యార్థులను పైతరగతిలోనికిఁ బంపుట కెంతకార్కశ్యము కనఁబఱచెడివారో, దానికిఁ బదిరెట్లు తీర్ణులను జేయుటలోఁ గారుణ్యము కనఁబఱచెడివారు. వీరికి శిష్యులయందెట్టి యాదరమో, వీరిపై వీరి శిష్యుల కట్టి భక్తి గౌరవములు. వీరి శిష్యులు నేఁడు మహాపదవులలో నుండి గౌరవింపఁబడుచున్నారు.

1938 లో నొకమారు పంతులుగారికిఁ గొప్ప జబ్బుచేసినది. అది తెలిసికొని కాకినాడనుండి ముగ్గురు శిష్యులు రాత్రికి రాత్రి బయలుదేఱి వచ్చి వీరి చేతిలో నూఱురూపాయలు పెట్టి 'తమ రివి స్వీకరింపక తప్పదు. మా ప్రార్థనము విని నిఘంటుకార్యాలయములో నింకఁ బని చేయవలదు. నిరంతర భాషావ్యాసంగమే మీ యనారోగ్యమునకు హేతువు' అని చెప్పి వెళ్ళిపోయిరఁట. శిష్యప్రేమ యిట్టిదని పంతులు గారు మాటలవరుసలో నీవిషయము చెప్పిరి.

ఎలమంచిలి, నూజవీడు, నరసాపురము పాఠశాలలలోఁ బ్రధానోపాధ్యాయులుగా నుండి పిఠాపురాంగ్లపాఠశాలకు వచ్చి యచటఁ బెక్కువత్సరములు పనిచేసిరి. 1920 లో శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యాలయమున బండితులుగాఁ బ్రవేశించిరి. వార్ధకదశచే నదియు నిర్వహింపలేక 1938 లో మానివైచిరి. నిఘంటుకార్యాలయమున వీరు చేసినకృషి యమూల్యమైనది.

పీఠికాపురాధీశ్వరులు గంగాధర రామారావుగారు పంతులుగారికిఁ జదువు చెప్పించి వీరి యభ్యుదయమునకు సర్వథా తోడ్పడిరి. 1888 లో

బి. ఎ. ప్రథమశ్రేణి నుత్తీర్ణులైరి. నరసింహము పంతులుగారి వంటి శ్రీరామభక్తుని మఱియొకని మనము చూడము. ఆయన గ్రంథము లన్నియు రామాంకితములే చేసెను. పంతులుగారి యభిమానవిషయము వేదాంతము. కళాశాలలో వీరి గురువులు కందుకూరి వీరేశలింగముగారు, మెట్కాఫ్‌దొరగారు. విలియమ్స్‌పిళ్ల మున్నగువారు. కవితాగురువులు వీరేశలింగ కవిగారేయఁట. ఈ సంగతి పంతులుగారు తమ 'రామకృష్ణ పరమహంస చరిత్రము' న నిటులు చెప్పినారు.

అందఱును నన్ను నరసింహ మందురు; కవిత
యందు నాసక్తిఁ బుట్టించినట్టి గురుఁడు
కందుకూరి వీరేశలింగ కవిమౌళి
స్థితిగతులు నీకు విన్నవించితిని రామ !

వీరేశలింగము పంతులుగా రొకనాఁడు బడిలో "ఆటవెలఁది" లక్షణము విద్యార్థులకు చెప్పి నల్లబల్లమీఁద నీరెండుచరణములను వ్రాసి యెవ్వరైన నిది పూరింపఁగలిగినఁ బూరింపుఁ డనిరఁట.

ఆటవెలఁది మీర లారసి చేయుఁడి
చేయకున్న మీకు సిగ్గుపాటు

దీనిని మన పంతులుగా రిటులు పూర్తిచేసిరి.

సిగ్గు లెన్నియున్నఁ జెదరిపోవునుగద
ఆటవెలఁది పొంత నార్యులార !

చూచితిరా, పూరణములోని చాతుర్యము ! పువ్వుపుట్టినతోడనే దాని పరిమళమునుబట్టి యిది యీ జాతిపువ్వని కనిపెట్టవచ్చును.

పీఠికాపుర సంస్థానాశ్రయణము పంతులుగారికిఁ గవులలోఁ బెద్ద పేరు తెచ్చినది. వీరువ్రాసినగ్రంథములు చాలఁ బాఠ్యములుగా నిర్ణయింపఁబడినవి. 1904 లో శ్రీ రామకృష్ణ పరమహంస చరిత్రము పద్యకావ్య

ముగ నావిష్కరించిరి. ఈకబ్బమునఁ గవిత్వమునుగూర్చిన తమ యభిప్రాయము నిటులు వెల్లడించికొనిరి.

మాణిక్యమకుటంబు మౌళిపైఁ దాఁకింప
  రాజ్యంబునేలెడు రాజుకంటె
లలితలావణ్య విలాసినీ వక్షోజ
  పరిరంభ సౌఖ్యానుభవునికంటె
సతతంబు నానంద సాగరోర్ముల దేఁగు
  భర్మహర్మ్యస్థ సంపన్నుకంటె
ధనవయోరూప సంతానాది భాగ్యాళిఁ
  దనియ సంతుష్టుఁడౌ ధన్యుకంటె
మధురమృదువాక్యసంపద మనసుగరఁచు
కవిత యబ్బిన కవియె యెక్కువయటంచు
నెంచెదరుగానఁ దత్సుఖ మెంతసుఖమొ
స్వానుభవమునఁ గనుఁగొనఁ బూనవలదె.

శిశిరకుమారఘోషు ఆంగ్లములో రచించిన దానినిబట్టి 'గౌరాంగచరిత్రము' పద్యకావ్యముగఁ బంతులుగారు సంతరించిరి. పద్యకావ్యములే గాక 'వనవాసి' 'రూపలత' మున్నగు నాటకములు వచనకృతులును పెక్కులురచియించిరి. మొత్తము వీరికృతులలో నాంగ్లానుకరణములపాలెక్కువయనవచ్చును. ఈయన గ్రాంథికభాషా ప్రియుఁడు.

ఇన్ని చూచియే కూచి నరసింహమును, పానుగంటి లక్ష్మీనరసింహారావును, చిలకమర్తి లక్ష్మీనరసింహమును గలిపి 'సింహత్రయ' మని వ్యవహరించిరి. ఈ సింహత్రయమును పీఠికాపుర సంస్థానము భరించినది.

చిలకమర్తి లక్ష్మీనరసింహము

1867-1946

ఆరామద్రావిడశాఖీయులు. కాశ్యపసగోత్రులు. ఆశ్వలాయనసూత్రులు. తల్లి: రత్నమ్మ. తండ్రి: వెంకయ్య. జన్మస్థానము: ఖండవల్లి. నివాసము: రాజమహేంద్రవరము. జననము: 26-9-1867 సం. (ప్రభవ సం॥ భాద్రపద బ॥ చతుర్దశి రాత్రి) - నిర్యాణము: 1946 జూన్ 17 వ తేదీ. కవికర్తృకగ్రంథములు మొత్తము సంఖ్య 90. రఘుకులచరిత్ర, స్వప్నవాసవదత్తము, సౌందర్యతిలక, హేమలత, భారతకథామంజరి, సర్వశాస్త్రార్థసంగ్రహము, కృష్ణవేణి, సుధాశరచ్చంద్రము, అహల్యాబాయి, ప్రసన్నయాదవనాటకము, పారిజాతాపహరణము, పార్వతీనాటకము, మణిమంజరి, సువర్ణగుప్తుఁడు, నానకుచరిత్ర, నందనచరిత్ర, కర్పూరమంజరి, వినోదములు, వాల్మీకిరామాయణసంగ్రహము, గయోపాఖ్యానము, గణపతి, ప్రచ్ఛన్నపాండవము, గ్రీకుపురాణకథలు, మహాపురుషుల జీవితములు, మధ్యమవ్యాయోగము, వేమనకవి, రామచంద్రవిజయము, రాజా రామమోహనరాయి, రాజారత్నము, రాజస్థానకథావళి, స్వీయచరిత్రము, ఇత్యాదులు.

గయోపాఖ్యానము తెలుఁగునాట బహుజనామోదము బడసిన నాటకరాజము. ఆంధ్రుల కీనాటకముపై నసాధారణాదరము కల దనుట కది నేటికి లక్షపైఁ బాతిక వేలప్రతు లమ్ముడుపడియుండుటయే తార్కాణ. రంగస్థలములపై రక్తికట్టునాటకములలో నిది మొట్టమొదటిది. గయోపాఖ్యానము చిలకమర్తి లక్ష్మీనరసింహకవిగారు తమ యిరువది రెండవ యేట రచించిరి. ఈనాటకమే కవిగారిని మహాకీర్తిసంపన్నులను గావించినది. శ్రీకృష్ణుని సందేశముగాని యక్రూరుఁ డర్జునునితో "నీతో ముఖ్యముగా నీబావ చెప్పుమన్న సందేశము వినుము" అని యిట్లు చెప్పెను.

ప్రాఁతచుట్టాల మని నొక్కి పలుకు మనియొ
నొరులకై పగఁబూనుట యొప్పు దనియొఁ
బడుచుఁదనపుబింకమ్ములు విడువు మనియొఁ
దలకు మీఱినపని చేయఁదగని దనియొ.

దీనికిఁ బత్యుత్తరముగా యుధిష్ఠిరుఁడు 'సీ. నళినగర్భుని గన్న నారాయణుఁడు తాను బాంధవుండగుట మా భాగ్య మనుము... గయునిక్షమియించి పార్థుని గావు మనుము.' అని వచించెను. ఆసమయమున నర్జునుఁడుకూడ బావ కిట్లు ప్రత్యుత్తర మంపెను.

"అతిరాగంబు సుభద్రపైఁ బొడమ నన్యస్త్రాన్యకామస్థితిన్
మతి యొక్కింతయుఁ బ్రాజ్యరాజ్యపదవిన్యస్తంబుగాకుండ నే
యతిగానుండినవేళలం బిలిచి నెయ్యంబొప్ప నక్క సోదరీ
పతిగాఁ జేసిననాఁటి మేటికృప నాపైఁ జూపవే శ్రీహరీ!

ప్రాణంబులు మాయధీనము చేసిన విపన్నుని బగతున కొప్పగించి శరణాగతత్రాణ బిరుదాంకమగు భరతవంశమునకుఁ గళంకము తేఁజాల నని మనవిచేయుము." ఈగద్యపద్యముల సొగసు పరికించితిరా?

సుభద్ర యర్జునుని గావుమని శ్రీకృష్ణునితోఁ జెప్పినది. అప్పు డతఁడు రోషావిష్టుఁడై చెల్లెలితో "ఔను తప్పు నీమగనిది కాదు. నాదే-

నీనాథునకు నేను మేనమఱందినై
యుదయంబు నొందుట యొక్కతప్పు
అన్నయానతిఁ ద్రోసి యామహాత్మునకు ని
న్నుద్వాహ మొనరించు టొక్కతప్పు
చిన్ననాఁటనుగోలెఁ జెలిమిమై వారికి
నుపకారములు చేయు టొక్కతప్పు

గర్వితమతి వారు గావించు దౌష్ట్యంబు
 నొప్పరికించుట యొక్క తప్పు

ఒప్పులే మేము చేయుట యొక్క తప్పు
తప్పు చేయకయుంటయే గొప్పతప్పు
అన్నితప్పులు మాయందె యున్న వబల!
తలఁచి చూడఁ బార్థునియందుఁ దప్పుగలదె?"

అనెను. ద్రాక్షాపాకముతో, సుప్రసన్నశైలితో, సుమధురముగా నాటకపద్యములు నడపించుటలో లక్ష్మీనరసింహముగారిది గొప్పశక్తి. గయోపాఖ్యానమున కృష్ణార్జునుల క్రోధసంభాషణము చదువఁదగినది. 'సీ. నీచముచ్చును నాక రాచపాడి దొలంగి బిడియ మించుక లేక బిచ్చ మెత్తి... మీసహోదరులకు సాటి మీరె సుమ్ము.' అని కృష్ణుఁ డధిక్షేపించెను. 'సీ. అల్లుఁడారమ్మని యాదరమ్మునఁ బిల్చఁబంపు మామనుబట్టి చంపఁగలమె?' ఇత్యాదిగా నర్జునుఁ డాక్షేపించెను. ధీరోదాత్తులగు కృష్ణార్జునుల సంభాషణము హద్దుమీఱియున్నను గయోపాఖ్యానము సముచితవర్ణనాకరమై మనోహరముగ నున్నది. కనుకనే తెలుఁగున నీనాటక మింత ప్రశస్తి కెక్కినది.

లక్ష్మీనరసింహకవిగారు నాటకరచనలో నెట్టిదిట్టలో నవలారచనలో నంతకంటె నధికులు. వీరు కందుకూరి వీరేశలింగకవివలె నాంగ్లేయ గ్రంథానుసారముగఁ గాక చాల భాగము స్వతంత్రముగా నవలలు రచించిరి. వీరి చరిత్రాత్మకకథలలో కర్పూరమంజరి, కల్పితకథలలో గణపతియు నత్యుమస్థానము నలంకరింపఁదగిన రచనలు. కథనచాతుర్యము, కథాసృష్టి, రసపుష్టి గల గద్యరచనమున వీరు సిద్ధహస్తులు. లక్ష్మీనరసింహకవి హాస్యరసాధరము కలవాఁడు. వీరేశలింగముగారి హాస్యరచనయు, పానుగంటికవి హాస్యరచనయు కొంచెము మోటుమార్గమున

నడచినవి. చిలకమర్తికవి దట్టిదికాదు. మార్దవము తప్పని హాస్యముతో నీలక్ష్మీనరసింహకవి యెనుబదిమూఁడు ప్రహసనములు వ్రాసి ప్రకటించెను. జయంతి రామయ్యపంతులుగారు చెప్పినట్లు "వీరేశలింగముగారి హాస్యము చిక్కనిది. లక్ష్మీనరసింహముగారి హాస్యము పలుచనిది. లక్ష్మీనరసింహముగారి హాస్యము గిలిగింతలు పెట్టి నవ్వించును. వీరేశలింగముగారి హాస్యము గిల్లి బాధించును."

లక్ష్మీనరసింహముగారి "గ్రంథప్రకటనము" అను ప్రహసనమునుండి వారి హాస్యరచనకుఁ గొన్ని పంక్తులుదాహరించెద. "వెక్కిరింతల వెంగశప్ప" తాను రచించిన "వెఱ్ఱిపప్పియు" అను గ్రంథముయొక్క ఔత్కృష్ట్యము ప్రకటించుచు నా గ్రంథమునుగూర్చి యిద్దఱుపండితులిచ్చిన యభిప్రాయములఁగూడఁ బ్రకటించినారు. వారిలో మహామహోపాధ్యాయ కొంకణక్క గురులింగశాస్త్రిగారిట్లు వ్రాసినారు.

"మీ వెఱ్ఱిపప్పియును నేను సమగ్రముగాఁ జూచితిని. కాళిదాస, భవభూతి, మయూర, వ్యాస, వాల్మీకుల కవిత్వములకంటె నిందలికవిత్వము వేయిరెట్లధికముగా బాగున్నది. ఇందలి పద్యములు గారెముక్కలవలె నెంతో రుచిగా నున్నవి. వీనికి అల్లపుపచ్చడివలె చిన్నవ్యాఖ్యానముకూడ గ్రంథకర్తగారే రచించినందున సర్వజనగ్రాహ్యమైయున్నది. ఇట్టిగ్రంథము జన్మమెత్తి చూచి యెఱుఁగను. ఇఁక ముందు చూడఁబోను. ఇంకొకజన్మమునకుఁగూడఁ జూడఁగలనని నమ్మకము లేదు. ఇందలి వీరరసపద్యములు రెండు చదువఁగానే నా కావేశమెత్తి గొడుగుకామతో నాభార్యను మెత్తగా మర్దించితిని. మీగ్రంథమందలి పై రెండుపద్యములును నేను చదువుచుండఁగా దగ్గరనుండి విన్న మా నీళ్ల బ్రాహ్మణుఁడుకూడ ఆవేశము గ్రహించి కావడిబద్ద తిరగవేసి నన్ను వెన్నుపూస విరుగునట్లు కొట్టెను. కాఁబట్టి యీగ్రంథ మందఱు కొనఁదగినది.

ఈ విధముగా నప్రయత్న ప్రహసనరచనాశాశలను చిలకమర్తి కవి కలవడినవి. లక్ష్మీనరసింహముగారు బహుచమత్కారభాషి. మాట మాటకుఁ జమత్కారముచూపి మాటాడుటలో వీరిది మేనమామ పోలిక. సుప్రసిద్ధపండితులైన పురాణపండ మల్లయ్యశాస్త్రిలుగారు లక్ష్మీనరసింహకవికి మాతులుఁడు. వారి మాటనేర్పు నాంధ్రమండలిలోఁ జాలమంది యెఱుఁగుదురు.

లక్ష్మీనరసింహకవిగారి ధారణాబల మసాధారణము. తమ కుటుంబములోఁ గాని, తా మెఱిఁగియున్న బంధుమిత్రకవి కుటుంబములలోఁ గాని, యెవరే నాఁ డెన్నిగంటల యెన్ని నిమిషములకు జన్మించినదియు - ఎవ రెప్పుడే మేమి యొనరించినదియు మున్నగువిషయములు చెప్పుచు నత్యాశ్చర్యము గలిగించుచుఁ జక్కని ప్రస్తావనము సేయుచుందురు. వీరి ధారణాశక్తికి 1897 సంవత్సరమునాఁడు జరిగిన చిన్నకథ యిది.

కందుకూరి వీరేశలింగము పంతులుగారు అతిప్రయత్నముమీఁద తంజావూరునుండి నాచనసోమనాథుని "ఉత్తరహరివంశము" సంపాదించి తెచ్చి రాజమహేంద్రవరములోఁ బ్రథమముద్రణము వేయించుచుండిరి. ఆసందర్భమున మన కవిగారు ఆముద్రాలయమున నున్న " ప్రూఫు రీడరు " నొద్దకుఁ బోయి యేనాఁటికానాఁడు మెల్లమెల్లఁగా ప్రూఫు కాగితము లింటికిఁ గొనివచ్చుచుఁ గవితాప్రౌఢత కబ్బురపడుచు హరివంశమంతయు నించుమించుగ ధారణపట్టిరి. గ్రంథముద్రణము పూర్తి కాఁగా వీరేశలింగముపంతులుగారు లక్ష్మీనరసింహముగారి కొకప్రతి యీయఁబోయిరఁట. అంతట మన కవివరుఁడు సోమనాథుని కవిత్వము నుగ్గడించుచు గ్రంథములోని పద్యములెన్నో గబగబ చదివి యుపన్యాసరీతిగా విశేషములు వెల్లడింప మొదలుపెట్టిరఁట. అది విని వీరేశలింగముగా రాశ్చర్యభరితులై 'ఉత్తర హరివంశము' ప్రాచీనపుఁ బ్రతి

మీయొద్ద నేదైనఁగలదా ? యని యడుగఁ "దమ రనుగ్రహించినదే" యని సమాధానముచెప్పి జరిగినకథ వెల్లడించిరఁట.

ఇంతకును జెప్పఁబోవున దేమన ? ఏనాఁడో యట్లు ధారణపట్టిన పద్యములు నేఁటికిని వారు చదువుచుఁ బ్రాచీనకవుల కవిత్వ విశేషము లను శ్లాఘించుచుందురు.

పంతులుగారు గొప్ప యుపన్యాసకులు. వీరి యుపన్యాసము దూరాన్వయములు లేక మృదువుగానుండి హాస్యరస ప్రచురములగు నుదాహరణములతో శ్రోతల కానంద మొదవించును.

వీరు 'మెట్రుక్యులేషన్' పరీక్షలోఁ గృతార్థులై యాంగ్లసారస్వ తమును లెస్సగా నెఱిఁగిరి. గురుశుశ్రూష చేసి సంస్కృతభాష నభ్య సింపక పోయినను నేత్రావరోధము వాటిల్లినతరువాతనే భాసకాళిదాస భవభూత్యాది సంస్కృతకవుల రచనలు చదివించి స్వారస్యములఁ దెలిసి కొని భాసనాటకచక్రము (13 నాటకములు) మధురరీతి నాంధ్రీకరించి తమ యనల్పప్రతిభ వెల్లడించికొనిరి. కొన్నిపట్ల వీరి తెలుఁగుసేఁత మూలానుకూలముగ నుండకున్నను నాటకరచనలో సిద్ధహస్తులగుటచే భాసనాటకాంధ్రీకరణము మనోహరముగా నున్నది. సీసపద్యముల దిగువ నెత్తుగీతములు లేకుండ వ్రాసిరి. ఇది క్రొత్తపద్ధతి.

హోమర్ (గ్రీకుజాతీయకవి), మేధావిభట్టు, కుమారదాసుఁడు, మిల్టను మున్నగు మహాకవులవలె లక్ష్మీనరసింహముగా రంధులయ్యును ప్రకృతిరహస్యములు ప్రతిభాబలముచేఁ బ్రత్యక్షీకరించుకొని కవిత్వము చెప్పిన మహాకవులు. వీరు కొన్ని పద్యములు మనఃఫలకముమీఁద వ్రాసి యుంచుకొని యెవరైన లేఖకు లున్నపుడు వెల్లవేసినపద్యములు చెప్పు చున్నట్లు చెప్పి వ్రాయించుచుందురు. ఇట్లే వీరు లెక్కలేనన్ని గ్రంథ

ములు వ్రాసిరి. లక్ష్మీనరసింహకవి జ్ఞానైకచక్షుష్కుఁడు. వీరికి 40 వత్సరముల యీడు వచ్చువఱకు సంపూర్ణ నేత్రావరోధము కలుగలేదు. 1909 నుండి మాఱెను. 'కృపాంభోనిధి' నీకవి యీవిధముగఁ బ్రార్థించుచున్నాఁడు:

అన్నా! నీదగుమూర్తి యెట్టిదియొ జాత్యంధుండ కాలాద్యవ
చ్ఛిన్నంబై జగదేకపూర్ణమగు నీ చిన్మాత్ర దివ్యాకృతిం
గన్నారం గనుఁ బుండరీకదళసంకాశ స్ఫురన్నేత్రుఁడున్
నిన్నుం జూడఁగలేఁడు చిత్ర మిది తండ్రీ! సత్కృపాంభోనిధీ!

అందలి యమృతనిష్యందులగు పద్యములు మఱికొన్ని:

శా. తోలుంగన్నులు చూడలేవుగద విద్యుత్కోటి భాస్వత్ప్రభా
జాలాతీత జగత్ప్రపూర్ణ ఘన తేజోరాశి నీమూర్తి నిన్;
నాలోఁగన్నయినం గనుంగొను నటన్నన్ జ్ఞాననేత్రంబు లే
నేలే; దేగతి నిన్నుఁజూడనగుఁ దండ్రీ సత్కృపాంభోనిధీ!

మ. బలిమిన్ రబ్బరు లాగ సాఁగి మొదటన్ స్వస్థానముం జేరు నా
వల, నట్లే బలిమి న్మనస్సును భవత్పాదద్వయి న్నిల్ప నా
స్థలమందయ్యది నిల్వ కెప్పటియటుల్ దౌర్గత్యముం జెందు, ని
ష్ఫలమా నాజతనం, బిఁకేమిగతి దేవా! సత్కృపాంభోనిధీ!

శా. ఆకుంబచ్చల పళ్లెరంబులఁ బ్రవాళాలి న్నివాళుల్ తగన్
నీకర్పించి, విహంగనాదమను మేల్గీతంబులం బాడి, తా
మేకాలంబును బూలు కానుకలిడి తండ్రీ! భక్తివృక్షాంగనల్
నీ కాత్మీయకృతజ్ఞతం దెలిపెడు న్నేర్మిన్ కృపాంభోనిధీ!

మ. గగనం బద్భుతలీల నీదగు నిరాకారత్వమున్ గాలి నీ
దగు విష్ణుత్వము, నీరు నీకరుణ, దీప్యద్వహ్ని నీ తేజు నీ
దగు శాంతిన్ ధర చాటుచున్నయవి, యాహా! పంచభూతంబు లే
పొగడు న్నీగుణరాజి వందులయి శంభూ! సత్కృపాంభోనిధీ!

వర్ధమానులగు యువకవుల నాదరించి వారి నేదో విధముగ నభివృద్ధిలోనికిఁ దీసికొనిరాఁగోరు దయాహృదయులువీరు. వీరిమనసు కడుమెత్తన. సజ్జనశబ్దమునకు లక్ష్మీనరసింహముగారు సరిపడిన యుదాహరణము. "మృదుళం నవనీతమిాదితం నవనీతాదపి సజ్జనస్య హృత్,"

పేదవారల కెందఱకో వీరు చదువులు చెప్పించిరి. నిరుద్యోగుల నెందఱనో వాక్సాహాయ్యముచే నుద్యోగుల నొనరించిరి. వీరు కేవల కవులే కాక వీరేశలింగముగారివలె సంస్కరణాభిషులు; దేశసేవకులు. దేశమాత, మనోరమ మొదలగు పత్రికలు ప్రచురించి దేశభాషాసేవ గావించిరి. వీరేశలింగము పంతులుగారి సంస్కరణోద్యమ మందును, వారి భాషాసేవ యందును వీరి కనువమానమగుభక్తి. సర్వవిధముల వారి యుద్యమములను తృణ్ణముచేసినవారు వీరే. కందుకూరివారు ఖడ్గవాదులు. చిలకమర్తివారు కార్యవాదులు. ఇది యీ యిర్వురకును గలతారతమ్యము. 'లక్ష్మీనరసింహముగారిది యీమతము' అని చెప్పుట కష్టము. ఆయన సంస్కరవాదులగు వీరేశలింగకవిగారికిఁ గుడిభుజముగఁ బనిచేసిరి. పీఠికాపుర ప్రభువులతోఁ జెలిమి వాటించిరి. దేశనాయకుఁడు టంగుటూరి ప్రకాశముపంతులుగారిని గౌరవించిరి. 'అన్యుల మనమున్ నొప్పింపక తా నొవ్వక తప్పించుక తిరుగువాఁడు' కాన లక్ష్మీనరసింహకవిగారి నేవిషయమునను నాక్షేపించువారు లేరు.

చిలకమర్తికవి యార్జనము లక్షలు దాఁటినది. గ్రంథముల వలన నింతసంపాదనము చేసినవారు తెలుఁగువారిలోఁ దక్కువ.

మఱియొకవిషయము. 1907 లో వంగదేశమునుండి 'విపినచంద్రపాలు' అనునాతఁడు వచ్చి 'గోదావరీమండలమహాసభ'లో నుపన్యసించుచుండెను. ఉపన్యాససందర్భమున ఆశువుగ లక్ష్మీనరసింహముగారీపద్యము చదివిరి.

భరతఖండంబు చక్కనిపాడియావు
హిందువులు లేఁగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరిగొల్లవారు
పిదుకుచున్నారు మూతులు బిగియఁగట్టి.

నాఁడు కొన్నినాళ్ళీ గీతము చదువనివారు లేరు. భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు తెల్లవారను = తెల్లవారఁగా, అను నర్థము చెప్పి ప్రభుత్వము నోదార్చిరి. అప్పుడే వీరిపేరు మాఱుమ్రోగినది. బహుజనముచే నాదరింపఁబడు కవితయే కవిత. అదియే శాశ్వతముగా నిలుచును. మన చిలకమర్తి లక్ష్మీనరసింహముగారి పద్య మొక్కటైన కంఠపాఠము చేసికొననివారు తెలుఁగువారిలో నుండరు.

తుహినాద్రిమొదలు సేతువుదాఁక రాజ్యంబు జరిపె నీ యాంగ్లేయదొరతనంబె, జాతిమతాచార సర్వస్వాతంత్ర్యముల్ నెఱపె నీ యాంగ్లేయదొరతనంబె, ఇత్యాది స్తుతులతో 1895 లో చిలకమర్తి కవి పద్యములు రచించెను. ఆ చిలకమర్తి కవి మఱలఁ గొన్నేండ్లు గడచిన తరువాత నాంగ్లేయప్రచురణసంస్థవారొకరు వాచకములు వ్రాసిపెట్టుఁడని వేఁడఁగా "ఆంగ్లేయులు మనదేశములోనిగనులవలనను, టీ కాఫీలవల్లను, రైలుబండ్లవల్లను, మరి యితరసాధనముల వల్లను ధనమంతయు పట్టుకొని పోవుచున్నారు. తెనుఁగుదేశములో పుట్టి తెనుఁగుముక్కలు నాలుగు వ్రాయనేర్చిన మనము తెనుఁగుపుస్తకములవల్ల వచ్చు లాభము అనుభవించకుండ నదికూడ నాంగ్లేయులకే యీవలెనా? నేనెన్నఁడు నింగ్లీషుకంపెనీలకు గ్రంథములు వ్రాసి యీయను. స్వదేశీయు లెవరేని చేరి యొక కంపెనీ పెట్టినపక్షమున వారికి వ్రాసియిచ్చెదను. లేదా, నాకు నేనే వ్రాసికొనెదను." అని చెప్పివైచెను. ఈ విధమైన దేశాభిమాన మభినందనీయము.

నవలారచనమునను, నాటకకర్తృత్వమునను, ప్రహసనపు గూర్పునను సిద్ధహస్తుఁడై, దీనావనదీక్షితుఁడై, దీర్ఘాయుష్కుఁడైన లక్ష్మీనరసింహకవి కాంధ్ర విశ్వవిద్యాలయమువారు మొన్న 1943 లో కళాప్రపూర్ణ బిరుదము నొసఁగి సముచితముగ సత్కరించిరి. ఇట్టి యీ మహాకవి వీరేశలింగకవి తరువాత 'స్వీయచరిత్ర' వ్రాసికొనెను. వీరి స్వీయచరిత్ర, ఆంధ్రకవుల చరిత్రయు-ఆంధ్రదేశచరిత్రయు నసఁగలిగి మహోపకారకమయిన గ్రంథము.

చిలుకూరి వీరభద్రరావు

1872-1939

ఆఱువేల నియోగిబ్రాహ్మణులు. అభిజనము: తణుకుతాలూకాలోని 'ఱేలంగి'. నివాసము: రాజమహేంద్రవరము, కొవ్వూరు. జననము 17-10-1872. నిర్యాణము: 1939 సం. రచితకృతులు: రాజమహేంద్రపుర చరిత్రము. ఆంధ్రుల చరిత్రము - జీర్ణకర్ణాట రాజ్యచరిత్రము. తిక్కన సోమయాజి, తిమ్మరుసు మంత్రి - శ్రీనాథకవి - శివాజీచరిత్ర, కర్ణసామ్రాజ్యము, నవరసిక మనోల్లాసిని, స్వయంసహాయము, వరలక్ష్మీవిలాసము, హిందూసంసారము, హిందూగృహము, హాస్యతరంగిణి, సుమిత్ర, అళియ రామరాజులు, నాయకురాలి దర్పము.

వీరభద్రరావుగారు చరిత్రచతురాననుఁడు. 'ఆంధ్రుల చరిత్ర' తో వీరికఖండకీర్తి వచ్చినది. ఆంధ్రులప్రాచీనచరిత్రమును బరిశోధించి వెలువరించినవారిలో నీయనయే కనిష్ఠికాధిష్ఠితులు. వీరియనంతపరిశోధనములనుండియే నేఁటి పలువురు రచయితలు చక్కనివిషయములు సంగ్రహించి పత్రికాపాఠకుల కిచ్చుచున్నారు.

వీరభద్రరావుగా రాంధ్రభాషకుఁ బ్రాణములు ధారవోసిరి. ఆంధ్రజాతిపై వీరికవ్యాజమైన యాదరము. వీరు సంఘసంస్కృతినభిలషించిన సదాశయులు. జాతివికాసము కలిగింప నెంచి దేశోపకారి, విబుధరంజని, ఆంధ్ర కేసరి పత్రికలు ప్రకటించిరి.

పంతులుగారికలము జంకుగొంకులు లేనిది. వాదోపవాదములలో ప్రళయనాట్యము సలిపినది. కలములో నున్నంత నిరంకుశత నోటిలో లేదందురు. ఎంతయావేశముగా వాదించినను జివరకు నవ్వుకొనుచు మఱియొక సంభాషణములోనికి మార్చివైచుటమాత్రము వారియెడఁ

గల మంచిగుణము. ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసము వీరికి చేతలలో స్వాతంత్ర్యముచూపిన నిరంకుశుఁడీయన. తెలుఁగువారిలోని కొన్ని జాతులను గుఱించియుఁ గొన్ని వర్ణములనుగుఱించియు మనరావుగారు వెలువరించిన నిర్ణయములు కొన్ని సంస్థానములకుఁ గోపకారణము లైనవి. సంస్థానప్రభువులు కొందఱు వీరభద్రరావుగారిపై నాగ్రహము చూపుచుండిరి. వారు తలఁచినచో నేమి చేయలేరు? వేదము వేంకటరాయశాస్త్రిగా రిది గుర్తించి 'వీరభద్రరావుగారు! ప్రమాదము సుమండీ' యని మందలించిరఁట. వీరది లెక్క సేయుదురా? సత్యప్రకటనమే సత్పరిశోధకలక్షణమని నమ్మిననిర్భీకుఁడాయన. పంతులుగారు 'అళియరామరాయలు' అనుగ్రంథములో 'రివరెండుహీరాసు' గారి వ్రాఁతలను సయుక్తికముగ ఖండించిరి. ఆంధ్రేతిహాసపరిశోధకమండలి వెలువఱిచిన కాకతీయసంచికపై వీరిఖండనము సప్రమాణమై మెచ్చు నందినది. వీరి 'జీర్ణకర్ణాటసామ్రాజ్యము' యాంధ్రాభిజ్ఞులు పెక్కు 'రౌ'ననిరి. ఇదియే వీరి తొలిరచనము.

పంతులుగారివిమర్శనశక్తి చవిచూడనివా రుండరు. వీరి యాంధ్రుల చరిత్రలోని కొన్నికొన్నిసిద్ధాంతములు నూతన పరిశోధనములవలన నిలుచునవిగావు. ప్రథమప్రయత్నము లన్నిటిలోను గొన్ని దోషములుండుట క్రొత్తగాదు. అది యాక్షేపణీయమును గాదు. వీరివిమర్శలో మొగమోట మనునది పూజ్యము. సత్యపరిశోధనమునకుఁ దమయాస్తిని దమయారోగ్యమును దుదకుఁ దమప్రాణములను గోల్పోయిన మృతజీవులు. జననము మొదలు మరణమువఱకుఁ గష్టపరంపరలతో నిండిన జీవితము వీరిది. దానికి హేతువు నిరంతరపరిశోధనపరత్వమే. ఒకసభలో కట్టమంచి రామలింగారెడ్డి 'వీరభద్రరావుగారి విమర్శనశక్తి చాల గొప్పది. దానిని వర్ణింప నా కర్హతలే' దని యుట్టంకించినాఁడు. ఆంధ్రచరిత్రకారులలో వీరభద్రరావుగారు, లక్ష్మణరావుగారు,

రామయ్యపంతులుగారు, వీరేశలింగముపంతులుగారు నొక్క శ్రేణికిఁ జెందినవారు.

వీరభద్రరావుగారు చదివినది 'స్కూలుఫైనలు' వఱకే యనుకొందుము. అయిననేమి? వారు చరిత్రచతురాననులు. పదవులకొఱకుఁ బ్రాకులాడక యాంధ్రచరిత్ర పరిశోధనమునకుఁ దనుయావజ్జీవనము ధారవోసి కీర్తించిన యిట్టిమహాపురుషుఁడు చిరస్మరణీయుఁడు.

వీరభద్రరావుపంతులుగారి 'ఆంధ్రులచరిత్ర' యే తెలుఁగువారిలో జాతీయావేశము రగుల్కొల్పినది. భావిచరిత్రనిర్మాతల కాంధ్రుల చరిత్ర మొకపెన్నిధి. చిలుకూరివారి చరిత్రపరిశోధనరంగములోఁ బ్రాచీనాంధ్రసౌభాగ్యము ప్రాచీనసామ్రాజ్య విభవము తెరను దెఱచుకొని వచ్చి మధురనాట్యము చేసినది.

ఆయన భౌతికదేహ మింక మనకు గానరాదు. ఆంధ్రుల చరిత్రము మాత్రమే యాంధ్రదేశమందెచ్చటఁ జూచినను గనవచ్చును. నేఁడు పరిశోధకులలోఁ బేరందుచున్న శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు వీరభద్రరావుగారిత్రోవ నభినందింతురు. శ్రీ కుందూరి ఈశ్వరదత్తు బి. ఏ. గారు వీరి మేనల్లురు. వీరేశలింగము పంతులుగారి తరువాత నాంధ్ర చరిత్రకారులకు వీరభద్రరావుగా రాదర్శకులని యాంధ్రు లైకకంఠ్యముగా నంగీకరింపవలసినదే.

రాజమహేంద్రవరమునఁగల ఆంధ్రచరిత్రపరిశోధకసభా ప్రతిష్ఠాపకులలో శ్రీ వీరభద్రరావుగా రొకరు. ఇట్టి పంతులుగారికి 1928 లో నంద్యాలయందు సర్వేపల్లి రాధాకృష్ణుని యాజమాన్యమున జరిగిన 'ఆంధ్రమహాసభ'లో 'ఆంధ్రచరిత్రచతురానన' యను బిరుద మిచ్చి సత్కరించిరి.

కొమర్రాజు వేంకట లక్ష్మణరావు

1877-1923

లింగధారినియోగి. తండ్రి: వెంకటప్పయ్య. జననస్థానము: పెనుగంచి ప్రోలు (కృష్ణామండలము). జననము: 1877 సం॥ నిర్యాణము: 12-7-1923 సం॥ విరచితకృతులు: ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము (2 సంపుటలు వీరిసంపాదకత్వమున వెలువడినవి). శివాజీచరిత్ర, హిందూ దేశ కథాసంగ్రహము, మహారాష్ట్రవిజృంభణము, లక్ష్మణరాయ వ్యాసావళి, హిందూ మహమ్మదీయ యుగములు.

లక్ష్మణరావుగారు సిద్ధహస్తులైన యాంధ్ర రచయితలు. వీరు భాషా సేవకులలోఁ బ్రథమశ్రేణిని లెక్కింపఁదగినవారు. 'విజ్ఞానచంద్రిక' యాంధ్ర గ్రంథమాలలలో నెంత ప్రతిష్ఠ గడించినదో లక్ష్మణరావుగా రాంధ్ర చరిత్రోద్ధారకులలో నంతకీర్తి సంపాదించిరి. విజ్ఞానచంద్రికకు లక్ష్మణ రావుగారు జీవగఱ్ఱ. ఈ గ్రంథమాలలో నీపరిశోధకునిచేయి సోఁకని గ్రంథము లేదు. కలకత్తా యమ్. ఏ పరీక్షలో నుత్తీర్ణులైననాఁటి నుండియు వీరి హృదయక్షేత్రమున వాఙ్మయసేవాంకురములు రెక్కెత్తుచు వచ్చినవి అవియే 'విజ్ఞానచంద్రిక' కు శుక్లపక్షములైనవి. ఈగ్రంథ మాలలో పదార్థవిజ్ఞాన- పారిశ్రామిక- ప్రకృతి- భౌతిక- రసాయన- వృక్ష- జీవ- వైద్యశాస్త్రములకు సంబంధించినగ్రంథము లెన్నియో వెలువడినవి. ఈగ్రంథమాలలోఁ గావ్యనాటకములకుఁ జోటులేదు. దేశోద్ధారకులగు మహాపురుషులజీవితచరిత్రము లిందుఁ బెక్కు ప్రకటితములు. ఆయావిషయములలోఁ బ్రత్యేకప్రవీణులైన చిలుకూరి వీరభద్ర రావు- కట్టమంచి రామలింగారెడ్డి- గురుజాడఅప్పారావు- ఆచంట లక్ష్మీ పతి- అయ్యదేవర కాళేశ్వరరావు- గోటేటి జోగిరాజుపంతులు మున్నగు వారెందఱో దీనికి గ్రంథములు వ్రాసి యొసఁగిరి. 'విజ్ఞానచంద్రిక'

యాంధ్రి కఖండ సేవఁ జేసి యన్వర్థమైన స్మరణీయమహాసంస్థ. అప్రస్తుత మైనను లక్ష్మణరావుగారితోపాటు దీనిని సంస్తుతింపక తప్పదు.

లక్ష్మణరావుపంతులుగారికి వీరేశలింగముగారే లక్ష్య స్వరూపులు. వీరు తమరచనను సామాన్య గ్రాంథికముగ నడపించి జనబాహుళ్యము నాకర్షించిరి. కాని నాఁటికి, బెచ్చు పెరిగియున్న గ్రాంథిక వ్యావహారిక వాదప్రతివాదసమరములోఁ జేయిచేసికొనలేదు. ఆ తాటస్థ్యమే వీరిచే నమూల్యమగు విజ్ఞానసేవ చేయించినది. దేశభాషయొక్క సర్వతో ముఖాభ్యుదయము, దేశభాషయందు సర్వశాస్త్రములు వెలువరింప వలయునన్న యభినివేశము కలిగి కొంతవఱకుఁ గృతకృత్యుఁడైనసుకృతి యితఁడు. ఆయన యభిలషించినది భాషాజీవము, భాషాస్థిరత్వము. లక్ష్మణ రావుగారుకూడఁ గొందఱవలెఁ దెగుదెంపులేనిభాషావివాదవాగురలోఁ దగుల్కొనినచో 'విజ్ఞానచంద్రిక' యేతీరగతిగ్రంథమాలలలో లెక్కింపఁ బడవలసియుండెడిదో!

మనభాషలోలేని శాస్త్రగ్రంథము లుండరాదనియు, నప్పుడే వాఙ్మ యమునకు సుస్థిరత్వము చేకూరుట కవకాశముండుననియు. వీరి ప్రధా నాశయము. ఈయాశయమే పంతులుగారికిఁ బ్రబంధములమీఁదను, ఖండకావ్యములమీఁదను మక్కువ తక్కువచేసినది. ఇంతమాత్రమున నీయనకుఁ గావ్యకళాదృష్టిగాని, కావ్యరసాస్వాదశక్తిగాని లేదనుటకు వీలుపడదు. లలిత కళలనుగూర్చి వెలువరించిన వీరి ప్రత్యేక గ్రంథము కావ్యకళనుగూర్చిన వీరి ప్రత్యేక వ్యాసములు వీరికిఁ గళాపరిశీలకులలో, గౌరవస్థానము నీయకపోవు. కేవలకావ్యములవలన వాఙ్మయమునకు శాశ్వతత్వముకలుగ దని యొక యభిప్రాయము పెట్టుకొని శాస్త్రగ్రంథ రచన, ప్రకటనములకు జీవితమర్పించిరి.

ఆంధ్రదేశచరిత్రరచనకు శ్రీకారముచుట్టినమహాశయుఁడితఁడే. వీరు నాటినవిత్తు నేఁటికి మహావృక్షమైనది. ఈయన యేవిషయమునను

భారపడియుండలేదు. పలుసారులు పరిశీలించి కాని యేరచనము ప్రచురింపలేదు. కావున నీయనయక్షరములు శిలాక్షరములైనవి. పరిశోధక లక్షణములు వీరికిఁ బూర్తిగఁ బట్టినవి. పత్రికల కెక్కుట, ఉపన్యాస పీఠములపై గర్జించుట వీరికి లజ్జాకరము. ఈయన సంఘసంస్కారియే కాని వీరేశలింగాదులవలె సంస్కారవాదములో బయటకువచ్చి నడుము బిగింపలేదు. రాజకీయ - సాహిత్యరంగములు రెండింటను ముందడుగు వేయు స్వభావ మీయనిది. ఈయనవేషములో నొక విద్యాధికత యుండెడిది. ఆకారము స్వచ్ఛమైనది.

పంతులుగారు గౌరవకుటుంబములోనివారు. వీరి పితృపాదులు మునగాలరాజుగారి (శ్రీ నాయని వేంకటరంగారావు బహద్దరు) ముత్తవ తల్లిగారియొద్ద 'దివాను'గాఁ బనిచేసిన ప్రసిద్ధాంధ్రులు. శ్రీ మునగాల రాజుగారికిని లక్ష్మణరావుగారికిఁ బెద్దనేస్తము. పంతులుగారివలెనే రాజుగారుకూడ భాషాభిమానులు. వీ రిద్దరకు నిరంతర సాహిత్య చర్చలతోఁ గొంతకాలము గడచినది. రావుగారినద్వర్తనము భాషాపరిజ్ఞానము రాజుగారిమనస్సున కెక్కినవి. దానిచే వారియొద్ద నాంతరంగిక కార్యదర్శిగాను 'దివాను' గాను బనిచేయుట తటస్థించినది. లక్ష్మణ రాయరంగరాయలు కృష్ణార్జునులవలె వర్తిల్లిరి. ఉద్యోగముచేయుచున్నను వీరు భాషావలోడనము వీడలేదు. మునగాలరాజావారి సాహిత్యాభిరుచి పంతులుగారి భాషాశాస్త్రపరిశోధనమునకు మిగులమిక్కిలి దోహద మొనరించె నని పెక్కురు వక్కాణింతురు.

లక్ష్మణరావుగారు స్వతంత్రాశయులు. ఛత్రపతిశివాజీకి జన్మదేశ మగు మహారాష్ట్రదేశమునఁ బంతులుగారు బాల్యకౌమారదశలఁ గడపిరి. కవయిత్రియగు తనయక్కగారి యాదరమునను, తమబావ బండారు మాధవరావుగారి యభిమానమునను లక్ష్మణరావుగారు నాగపూరు

నివాసముచేయుచు మహారాష్ట్రము మాతృభాషవలె ధారాళముగ నభ్యసించిరి. ఆభాషలో వీ రనేక వ్యాసములు, పద్యములు రచించి నటులు తెలియును 'మోరోపంత్' అనుమహారాష్ట్రకవి వ్రాసిన కర్ణ పర్వమునకు మన పంతులుగారు పరిష్కర్తలుగా నుండి గన్న విషయము తెలిసినచో వారికాభాషలోఁగల పాండిత్యము తెలిసిన ట్లే యగును. వీరేశలింగముగారికి వంగభాష పై నెంతయభిమానమో, మహారాష్ట్రము మీఁద మనలక్ష్మణరావుగారి కంతమమకారము. ఆ దేశమందలి యభి మానము వీరిచే 'మహారాష్ట్ర విజృంభణము' వ్రాయించినది. ఈయన మధ్యపరగణాలలో బి. ఏ. పట్టభద్రుఁడై, వంగభాషాపరిషత్తులో ఎమ్. ఏ. పట్టము బడసిన మేధావి. సంస్కృత పరిచయము కలవాఁడు. మహా రాష్ట్రములో మంచిప్రవేశముగల పండితుఁడు. ప్రాచీనులను నర్వాచీనులను సమముగా గౌరవించినలౌకికుఁడు. నైతికముగ తిలకుమహాశయునిశిష్యత్వ మంగీకరించిన బుద్ధిమంతుఁడు. నిరంతరశాసన పరిశీలనముతోను, నిరం తర చరిత్రపరిశోధనముతోను సంసారమునుమరచిన కర్మశీలి.

'ఆంధ్రబ్రాహ్మణులలోని నియోగి వైదిక భేద కాలనిర్ణయము' - 'కృష్ణరాయలనిధనకాలము' - 'ఏకశిలానగర మోరుగల్లే' — మున్నగు చారిత్రక వ్యాసములు 'త్రిలిఙ్గమునుండి తెలుఁగుపుట్టెనా? లేక తెలుఁగు నుండి త్రిలిఙ్గముపుట్టెనా?' ఇత్యాది భాషావ్యాసములు — ప్రకృతి శాస్త్రము- రసాయనశాస్త్రము-కర్మయోగము- లలితకళలు-పంచాంగ ము-మున్నగురచనలు లక్ష్మణరావుగారి వివిధవిషయ నిష్ణబుద్ధి కౌశ లమును, సునిశిత విమర్శన పటుత్వమును వేనోళ్ళ నుద్ఘోషించుచున్నవి. ఎన్నఁడో ౧౨వ శతాబ్దినాఁటి శివతత్త్వసారమును ద్రవ్వి దానికి లక్ష్మణ రావుగారు వ్రాసిన పీఠికయుఁ దత్పరిశోధనము కనుఁగొన్నచో వారి శక్తి బహుధా తెల్లముకాఁగలదు. 'లక్ష్మణరాయ వ్యాసావళి' విజ్ఞానచంద్రికా ప్రతిబింబము.

1913 లో విజ్ఞానసర్వస్వరచనోహ పంతులుగారికిఁ గలిగినది. వారి యావచ్ఛక్తి ఆంధ్రవిజ్ఞాన సర్వస్వసంపుటము లపహరించినవి. అది యసంపూర్ణమైనను నాయన యశస్సున కనశ్వరత్వ మీయఁగల కూర్పు. పంతులుగారి యెత్తుగడలన్నియు బ్రహ్మాండమును బోలునవి. పన్నుగడ పన్ని పట్టుపట్టి నిర్వహించుట వీరిలో మెచ్చఁదగిన సుగుణము. విజ్ఞాన సర్వస్వ పునరుద్ధరణమునకు మఱియొక లక్ష్మణరావు — ఇంకొక నాగేశ్వర రావు అవతరింపవలయును ఆ యదృష్టమెన్నటికో?

ఈ మహాశయుఁ డుద్యమించిన 'ఆంధ్ర' సంపుట సంకలనము తుద ముట్టినచోఁ దెలుఁగు బాసకు వెలలేని తొడవయ్యెడిది. మల్లంపల్లి సోమశేఖర శర్మవంటివా రెందఱో లక్ష్మణరావుగారి లక్ష్యమున నడచి పరిశోధకులలోఁ బెద్దపద్దు సంపాదింపఁగలిగిరి. 'అబలా సచ్చరిత్ర రత్నమాల' రచించి తెలుఁగున మెప్పులుగాంచిన బండారు అచ్చమాంబ గారు లక్ష్మణరావుగారి సోదరీమణి.

కొచ్చెర్లకోట రామచంద్ర వేంకట కృష్ణారావు

1871 - 1919

ఆఱువేలనియోగి. దత్తతగొన్నతల్లి: కామాయమ్మ. తండ్రి: వేంకట జగన్నాథరావు. జన్మస్థానము: గోదావరీమండలములోని పోలవరము. జననము: 1871 నవంబరు 11 వ తేది. నిర్యాణము: 1919. గ్రంథములు: ౧. రాజతరంగిణి [కల్హణుని కాశ్మీరదేశప్రభుల చరిత్రమునకుఁ దెలుఁగు వచనము] ౨. అపవాద తరంగిణి [షెరిడనుకవి రచించిన స్కూల్ ఫర్ స్కాండల్ అను నాంగ్లనాటకమునకు వచన రూపాంధ్రీకరణము. ౧౯౦౧ ముద్రి.] ౩. సాహసిక కథార్ణవము [రాజపుత్రస్థానములోని చక్కనికథలు] ౪. ప్రభువిశ్వాసము [ఆంగ్ల రాజ్యారంభమునుండి నేటిదనుక మనదేశమునకు గలుగు నుపకారము లిందు వర్ణితములు] వీరు 'సరస్వతి' యను మాసపత్రికను వెలువరించిరి.

తెలుఁగుదేశమునఁగల జమీందారులలో భాషాపాండిత్యముండి కవిత రచింపఁగలవారలసంఖ్య మిక్కిలి కొలఁది. ఆ కొలఁదిమందిలోను పోలవరము ప్రభువులు వేంకటకృష్ణారావుగారు పేరుగన్నవలఁతి. ఆంగ్లములో నీయన బి. ఏ. పట్టము నందెను. సంస్కృతాంధ్రములలో నీయన పట్టములేని భద్రులు. పండితుఁడై, పండితపోషకుఁడై, కవియై కవిపాలకుఁడై, రాజకీయవేత్తయై, ఈ కవిప్రభుని జీవితము తెలుఁగురచయితల కొందఱికి వెలుఁగుచూపినది.

పోలవరమున కధిపతులైన జగన్నాథరావుగారు పాతికయేండ్ల వయస్సు మీఱకుండఁగనే కాలధర్మము నందిరి. ఆయనధర్మపత్ని కామాయమ్మగారు తమ చెల్లెలికుమారుఁడగు మన వేంకట కృష్ణారావుగారిని దత్తపుత్త్రునిగ స్వీకరించి యైదవయేఁట నుండియే పెంచి పెద్దవానిని జేసి చదువుచెప్పించి పోలవరము జమీకిఁ బ్రభువును జేసినది.

చిన్నతనమున మన కృష్ణారావుగారికి సంస్కృతాంధ్రములు, ఆంగ్లము నొకగురువునుంచి తల్లిగారింటికడనే చెప్పించిరి. పిమ్మట రాజమహేంద్రవరము చదువునకు విడువలేక కుమారుని పంపిరి. అక్కడ నుండి మన ప్రభుకిశోరుడు శ్రద్ధగఁ జదివి 1887 లోఁ బ్రవేశపరీక్ష 'మెట్రిక్యులేషన్ ఎగ్జామినేషన్' యం దుత్తీర్ణుఁ డయ్యెను. గణితమందును, భాషావిషయమందును మొదటినుండియు వీరికిఁ బట్టుదల హెచ్చు. 1888 లో రాజమహేంద్రవర కళాశాలలోనే ఎఫ్. ఏ. చదువుట కుపక్రమించిరి. కాని, కాలకర్మవశమునఁ దల్లి కామాయమ్మగారు కాలధర్మమందుటయు, కృష్ణారావుగారి దత్తత చెల్లదగినది కాదని యెవరో యభియోగములకు దిగుటయు, ఆయా చిక్కులు తటస్థించుటచే మానోవైకల్యము కలిగి వ్యాధిబాధ కలుగుటయుఁ గారణములుగ మూఁడేండ్లదాఁక విద్యాభ్యాసము సాఁగినదికాదు. 1891 వ యేఁటిచివర వ్యవహారములెల్ల సానుకూలముగఁ బరిష్కరింపఁబడి కృష్ణారావుగారికి మరల చదువుపై నభిలాష పెంచినవి. చెన్నపురి క్రైస్తవకళాశాలలోఁ బ్రవేశించి 1893 లో ఎఫ్. ఏ. యందు నెగ్గి 1896 నాఁటికిఁ బట్టభద్రులైరి. దేశచరిత్రలయందును బట్టము నందఁగోరి 1900 లోఁ జరితార్థులైరి. కృష్ణారావుగారు పట్టభద్రులైన తరువాత 'కాకినాడ' లో మేడకట్టించుకొని యుండి సంస్థానమును స్వయముగఁ బరిపాలించుకొనుచు నుండిరి. అక్కడనుండి పోలవరము జమీందారుగారి పేరు పతాకనెత్తినది.

ఈయన దేశచరిత్రమందు మేరలేనియభిమానము కలవాఁడగుట భారతదేశ సంచారము గావించి ప్రధాన పట్టణముల నన్నియుఁ జూచి చారిత్రకముగ నాయావిశేషములెల్లఁ గనిపట్టెను. ఇంకను పెద్దచదువేదో చదివికొందమని యింగ్లండు దేశమునకుఁ బ్రయాణముకట్టెనుగాని, దైవికముగాఁ గారణాంతరములచే నది చేకూరలేదు. భారతస్వాతంత్ర్య సంపాదనమునకు నడుముకట్టిన సంఘములతో నీయన చెలికారము చేసెను.

శ్రీకందుకూరి వీరేశలింగంపంతులుగారి సంస్కరణములు కొన్నిటిపై నీ ప్రభువునకుఁ బరమప్రీతి. పంతులుగారు చెన్నపురిలో నెలకొలిపిన అనాథశరణాలయమునకు వీరు వేయిరూపాయలు విరాళ మిచ్చిరి. 1895 లో నిలుపఁబడిన 'ఆంధ్రభాషోజ్జీవనీ' సంఘమునకు మన వేంకట కృష్ణారావుగా రుపాధ్యక్షులు. ఇట్లీ ప్రభువు సాంఘికముగను, సారస్వతముగనుజూచినచోఁ దెలుఁగుదేశమునకు మంచియుపకృతిగావించెను.

1898 లో నీకవిరాజు సంపాదకత్వమున 'సరస్వతి' తలసూపినది. ఆ పత్రికయే యీప్రభువునకుఁ గల సారస్వతాభిమానమునకు గీటుఱాయి. తిరుపతివేంకటకవులు, వడ్డాది సుబ్బారాయకవి, కొమర్రాజు వేంకటలక్ష్మణరావు మున్నగాఁగల యోధులెందఱో 'సరస్వతి' ని కృతిప్రసూనములచే నారాధించిరి. అదిగాక, శ్రీనాథునివి, అనంత భూపాలునివి, పినవీరభద్రునివి, మారనవి, కందుకూరి రుద్రకవివి కృతు లీ 'సరస్వతి' ద్వారమునఁ బ్రచుర ప్రచారము నందినవి. ఇటు లీ సరస్వతి యిరువదేండ్లదాఁక నడచినది. శ్రీకృష్ణారావుగారి 'సరస్వతి' కారణమునఁ దెలుఁగు కవుల కెందఱకో యుత్సాహము పెరిఁగినది. దానితో సాహిత్య పత్రికల కఱవు తీరినది. పోలవరము జమిందారుగారు గొప్పరాజకవు లన్నపేరు నాలుగు ప్రాంతములందును మీఱినది. తిరుపతి వేంకటకవులను జేరఁదీసి యాస్థానకవులుగ నాదరించుచు వేంకట కృష్ణారావుగారు మఱింత ప్రఖ్యాతి నందిరి. విశేషించి, దివాకర్ల తిరుపతి శాస్త్రిగారు మన కవిప్రభుని సరస్వతికిఁ జేదోడువాదోడై యుండువారు. 'సరస్వతి' లోఁ బ్రచురింపఁబడినగ్రంథములన్నిటియందును శ్రీతిరుపతి శాస్త్రిగారి పరిష్కరణముద్ర పడినదనవచ్చును. 'సరస్వతి' ఘనతకు శ్రీ శాస్త్రిగారును హేతుభూతు లనుట యిప్పుడు మనము చెప్పవలసిన మాట. తిరుపతి వేంకటకవుల గ్రంథములలో దేవీభాగవతము తరువాత బుద్ధచరిత్ర మొకటి బహుకాలము జీవించుగ్రంథమని విమర్శకుల యభి

ప్రాయము. అట్టి బుద్ధచరిత్రము కృతినందు నదృష్టము మన వేంకటకృష్ణారావుగారికిఁ బట్టినది.

సీ. ఎవని హూణాగమాతివిభూతి తెల్పుఁ ద
త్ప్రాపకంబైన బి. ఏ పదంబు
ఎవని భాషాభిమాన విభవంబు వచించు
నెంచి చేయించు సత్కృతిచయంబు
ఎవని కవీంద్రగౌరవము చాటించు ము
ద్రాపిత ప్రాకృతగ్రంథపటలి
ఎవని యగణ్యపుణ్యవిశేష మెఱిఁగించు
సత్తకోడండ్ర యన్యోన్యమైత్రి
యతఁడు కొచ్చెర్లకోట వంశాంబురాశి
చంద్రుఁ డురుకీర్తి సాంద్రుఁడు శాంతిపరుఁడు
రామచంద్ర వేంకట కృష్ణ రామచంద్రుఁ
డనితరప్రతిభాశాలి యనియెఁ దలఁచి.

అంకిత మిచ్చిరి గాని, సామాన్యులకీ బుద్ధ చరిత్రము కృతిగొనుటకు వీలుకానిది. ఈ కృత్యాది పద్యములు రెండిటివలనను దిరుపతి వేంకట కవులకీ ప్రభువుపైఁ గల గౌరవముతీరు విస్పష్టపడును.

చ. ఎవరికి నేని నిచ్చుపనియే మనవృత్తి యటంచు నెంచి స
త్కవులను బండితోత్తముల గాయకులం దనియించుఁగాని పో
లవరవిభుండు రక్షితకళావిదధీశుఁడు కృష్ణరావు మె
ప్పు వడయునంతపాటి బుధపుంగవులుం గలరే జగంబునన్.

క. ఇతఁ డతికవితాలోలుఁడ
మతి యని వర్ణింపనేల మాటికి నీ సం

గతి ప్రతివాసరమున నర
స్వతియే ప్రతిదేశ మేఁగి చాటుచునుండన్.

జగత్ప్రసిద్ధులైన యీ కింకవీంద్ర ఘటాపంచాననులను స్వసంస్థాన కవులుగాఁ జేసికొనుభాగ్యము పోలవరముప్రభువున కొక్కనికే తక్కినది.

చ. తిరిగితి మెల్లదేశము సదే పనిగా నిఁక మీఁద దేశసం
చరణ మొనర్పఁగా విసువు చాల మనంబునఁ గల్గెనయ్య! యీ
తిరుపతివేంకటేశకవిధీరుల నొక్కడనుండఁజేసి భూ
వరసభలందు ఖ్యాతిని నవశ్యము చెందుము! కృష్ణభూవరా!

అని చెప్పి దేశదేశములు తిరిగి విసిగివిసిగి యొకచో నుండఁగోరి వీరి నాశ్రయించి యుండిరని యీ పద్యములవలనఁ దేలుచున్నది.

శ్రీ వేంకటకృష్ణారాయ కవిప్రభువు కవిపోషకుఁడే గాక స్వయము చక్కని కవిత చెప్పఁగలవాఁడై కొన్నికృతులుకూడ రచించెను. సంస్కృతములోని కల్హణరచితమైన 'రాజతరంగిణి' ని చక్కని వచనరచనలో సంధానించిరి. అందుఁ దరంగ ప్రారంభమునఁ గావించిన స్తుతులవలన నాయన కవితసొంపుపెంపు తెలియవచ్చును.

మ. అజగోశృంగములన్ ఘటించి విలుసేయంజాలునో యెవ్వఁడా
త్మజు దేహంబునఁ గూర్చునో యెవఁడు మర్త్యత్వంబు దంతిత్వమున్
నిజదేహంబునఁ దాల్చునో యెవఁడు తస్త్రీపుంస్వరూపంబు ల
ట్టి జగన్మాన్య విచిత్రకార్యకుశలున్ డెందంబున న్నిల్పెదన్.

ఉ. పాములు నీకురుల్ రుచికిఁ బాత్రములే మదపుంస్పికంబు నా
గోమగు తావకీన గళగోపులకు నిరసించెఁ జూడుమీ
పాములకృష్టియించు నొకవాక్యము దవ్వర్థిగ నిర్వరాదున
ట్లీమెయిఁ బల్కు నర్ధవని తేశ్వరు నాలుక మమ్ముఁ బ్రోవుతన్.

ఉ. గాలియు నాకులుం దినుచుఁ గానలలోఁ దపమున్న దాని కీ
మేలనుకొందు మట్టిపె సుమీ చిలుపల్ వృషభంబు వాని కీఁ
జాలెనె ; ప్రేమచేతఁ జామి సామెయి నీకిదె భర్తఁడంచు స్వ
స్త్రీలు నుతింపఁగా నలరు శీతగిరీంద్రకుమారి నెన్నెదన్.

ఈ 'రాజతరంగిణి'యేగాక సాహసికకథార్ణవము, అపవాదతరంగిణి, ప్రభువిశ్వాసము మున్నగు పెక్కురచనలు గావించి కవిగా నీప్రభుమణి పేరుగాంచెను. రాజకీయమునఁగూడ నీయన మంచిపరిశ్రమము చేసి యెన్నొసభలలో నుపన్యాసము లొసఁగెను. శ్రీకృష్ణారావుగారి రాజభక్తి మెచ్చఁదగినది. శ్రీజార్జి చక్రవర్తి పట్టాభిషేక సమయమున 1911లోఁ దెలుఁగు కవులెందఱచేతనో పద్యములు వ్రాయించి తెప్పించి యీ 'కారొనేషన్' సంచిక శ్రీప్రభువువారి కర్పించుకొనిరి. అప్పటి కృతిపద్య మిది యొకటి.

మ. పదుమూఁడేఁడుల యీడువచ్చఁ జనిపెన్ భాషాప్రపంచంబు దో
డ్డది మా బ్రాహ్మవివాహకాల మది దాటంజేయఁగా రాదు, నీ
పదదాస్యం బొనరించుచున్ ముదమునన్ వర్ధిల్లఁగా నెంచుచు
న్నది జార్జీశ్వర! మానసరస్వతిని గావ్యం జేతుఁ గైకోఁగదే!

ఈవిధముగ రాజభక్తుఁడు, గ్రంథరచనాసక్తుఁడు, పండితపాలకుఁడు, ప్రభువరుఁడునైన శ్రీ వేంకట కృష్ణారాయకవి ప్రభువులలోఁ బ్రభువు. పండితులలోఁ బండితుఁడు. రచయితలలో రచయిత. పాపము! పోలవర సంస్థానకవి తిరుపతిశాస్త్రి 'శ్రీకృష్ణనిర్యాణము'ను గుఱించి యెంత వగచినాఁడో పరికింపుఁడు.

సీ. శతపథాన మొనర్ప సరసులు కబురంపఁ
బంపకుండఁగ మానిపింపలేదు
సర్వదేశంబుల సభలకుఁ బోవుచో
వెంట రమ్మనకుండ విడుపలేదు

పీటపైఁ గూర్చుండి పిలువనంపక యుండ
    నేదినమ్మున భుజియింపలేదు
మొదటినుండియుఁ దుట్టతుదదాఁక నొకరీతి
    గురుభావమున లోటు జరుపలేదు
ఇట్టిరీతిగఁ బదునెన్మిదేండ్లు జరిపి
కృష్ణభూపాలకుఁడు దివికేఁగె నేఁటి
కాయనకు నాకుఁ గల్గు ఋణానుబంధ
మక్కటా! దైవదౌర్బల్య మణఁచివైచె.

సీ. రచియించినాఁడ బుద్ధచరిత్ర కృతిగాఁగ
    మేలినాటకములు మృచ్ఛకటిక
బాలరామాయణ పాండవవిజయము
    ద్రారాత్రు సేద్వ్యర్థురాజవహాళి
పట్టాభిషేకముల్ పావనయుష్మదా
    ఖ్యాభూషితమ్ములుగా నొనర్చి
నీకీర్తికాంత కీలోకమ్మునందు వ
    సించుసౌధమ్ము నిర్మించినాఁడఁ
బండితుఁడు కవి మిత్రుండు బాంధవుం డ
నంగ మెలఁగితి దానికి నాకు నీవు
చేయు ప్రత్యుపకార మిస్సీ! మహాత్మ!
వదలి దివి కేఁగుటా కృష్ణవసుమతీంద్ర!

గీ. శనిమహాదశ మంచియుచ్ఛదశ యంచుఁ
బల్కుకార్తాంతికుల పల్కుబడు లనృతము
లనఁగ శనిదశలోని శన్యంతరమునఁ
గుజుఁడు పాపాత్ముఁడగుచు మాకొంప దీసె.

జనమంచి వేంకటరామయ్య

1872 - 1933

కాశ్యపసగోత్రులు. తండ్రి : బ్రహ్మావధాని. తల్లి : మహాలక్ష్మి. నివాసము రాజమహేంద్రవరము. జననము 1872 సం. నిర్యాణము 1933 సం. కృతులు : ౧. నవకుసుమాంజలి [ఖండకావ్యసంపుటము] ౨. మాలతీమాధవము ౩. విద్ధసాలభంజిక [అనువాదములు] ౪. సుప్రభాతము [ఖండకావ్యము] ౫. మేఘదూత. ౬. ఉత్తరరామచరితము. ఇత్యాదులు.

కత్తికోఁతలేదు గాజుగోట్టము లేదు
మాతనేత్రు శోధనేఁత లేదు
ఒనరుప్రేమఁ బ్రకృతి యొడిఁజేరి చనుఁగ్రోలి
మేనుమఱచి నిదురేకాని కవికి.

ప్రకృతి తనుఁబట్టి బాధించువారి కేదొ
కడుపునకుఁ బెట్టి కన్నీళ్లుమడుచుఁగాని
దాఁచిపెట్టును దనపెన్నిధాన మింక
యోగమహితుఁడు కవిన రేణ్యునకుఁగాను.

సుకృతిగాఁడె సుకవి ప్రకృతితో నేకాంత
గోష్ఠినుండుఁ గాన కోనలంకుఁ
దవసివోలె నెపుడు తత్త్వంబె చింతించు
మధురరసముఁ గ్రోలు మధుపమట్లు.

తత్త్వవేత్తకు నేది సత్యముగఁ దోఁచు
నదియె సౌందర్యరూపమై యమరుఁ గవికిఁ
జండమార్తాండ తేజఃప్రసారమె గద
నిండుచందురు పండువెన్నెలగ మాఱు.

శ్రీ జనమంచి వేంకట రామయ్యగారి సర్వకవితాహృదయము పలు పద్యములలో సురక్షితమై యున్నది. ప్రకృతితత్త్వములో నభిన్నుఁడైన యీ కవివరుని గుండెలో నమృతభాండముండె ననుటకు నిదర్శనము వీరి "నవకుసుమాంజలి." ఈ కూర్పు 23 ఖండకావ్యముల సంపుటము. ఇందలి ప్రతిపద్యము రసోత్తరము. పాలమీఁగడవలె చక్కని చిక్కని కమ్మని కవిత వేంకటరామయ్యగారి చేతిలోనున్నది. ఆయన యక్షరాక్షరము తూచితూచి వేయును. చ్యుతసంస్కారములు చేరనీయక, హాయిగలిగించు శయ్యలో వీరు మంచినేరుపు చేకూర్చుకొనిరి. వడ్డాది సుబ్బారాయుఁడుగారివలె వీరుకూడఁ బద్యము మలచి మలచి మెఱుఁగు పెట్టి మఱి వెలువరింతురు. భావములలోఁ బ్రాతక్రొత్తల సొగసులయిక వారి కవితకొకయందము. పద్యము నెత్తుకొనుటలోను, దింపుటలోను, ప్రస్తరించుటలోను వీరొక నూతనత్వమును సహజముగాఁ బ్రకటించిరి. ఆంగ్లభాషా ప్రవేశము వీరి భావనాపథమున నొక నవవికాసము కలిగించినదని చెప్పుచుందురు. జీవితము ఛాందసప్రవృత్తిలో నడపించినను, భావములు జాతీయమార్గమున మెఱుఁగులు దేఱినవి. "అమృతభాండ" మను ఖండకావ్యము వేంకటరామయ్యగారి జాతీయదృక్పథము సూచకముగ బలుక. ఈ కావ్యహృదయము కవియే యిటులు ప్రకటించెను. "హైందవ స్వరాజ్యసమితివారి రాయబారమే యిందలి ప్రకృతవిషయము. ఈ ప్రకృతము, అప్రకృతమైన గరుడయాత్రాకథలోఁ గొన్నిపట్ల స్ఫుటముగాను, గొన్నిపట్ల సూచనగాను వర్ణింపఁబడినది. ప్రకృతాప్రకృతముల నొండొంటితో సందర్భింపఁజేసి కావ్యమును కడవఱకును నేకార్థసమవేతముగా నిర్వహించుటకై రెంటియందును గొన్ని యావశ్యకములైన మార్పులుచేయఁబడెను. కావ్యాదిని ప్రతిజ్ఞాతమైన దాస్యనివృత్తికి, కావ్యాంతమునందు సిద్ధ్యసిద్ధి రూపముగాఁ జెప్పఁబడుటచే, పురాణకథకును బ్రస్తుతకథకును ఫలసమన్వయము కుదుర్పఁబడెను. ఇది

యెట్లంటేని, "వినతసమ్మోదముద్రితాస్య, యగుచు వడ్డించెనమృతంబు" అని చెప్పఁబడుటచే దేశమున సంస్కరణముల తాత్కాలికాంగీకారము, గరుడుని బంధవిముక్తిచే లోకమాన్యుని తదనంతర నిర్యాణమును, కాద్రవేయుల యాశాభంగముచేఁ బ్రజల కిప్పటి ద్వంద్వపరిపాలనము వలని యల్పప్రయోజకత్వమును సూచితములు."

కవికి లోకజ్ఞత యుండవలసిన ముఖ్యలక్షణము. రాజకీయముగాఁ దటస్థించు సంస్కృతి నెప్పటికప్పుడు గుర్తించుకొనుచుండెడి వేంకట రామయ్యగారి కడుపులోని "అమృతభాండము" కలమునుండి వెలికుబుకుటలో నాశ్చర్యమేమి? 'నాదారిలోపు' అను కావ్యములో నంటరాని వారిపై వీరు వెలిబుచ్చిన యనుకంపాభావము మఱచిపోరానిది.

క. వెలివాడఁ బుట్టినంతనె
వెలిబెట్టున యీశుఁ డతనిప్రేమకుఁ బాత్రం
బులుగాని జంతు లిలలో
పలఁ గలవే? గాలిలేని బ్రదుకుంగలదే?

క. ఒక యీశ్వరుకృప సంకటి
మొకయోడనెయెక్కి దాఁటి యొక సంద్రమునే
యొకతీరమె చేరఁగవలె
నిఁక నీసంశయములేల యిచ్చట మనకున్?

గీ. కాన సందేహపడక యోడలోనివాఁడ!
యెక్కనిమ్మమె నాతోడ నెక్కనిమ్ము
ఎక్కనిచ్చిన నీకేమి యెగ్గులేదు
తఱచిచూచిన నాకేమి తగ్గులేదు.

గీ. ధర్మజునిపోల్కి నేఁగాను ధార్మికుఁడను
అంటరానిదిగా దింతి యతని వేపి

యట్టు; లటులయ్యె మే మెక్కినట్టిదోనె
వారలెక్కిన తొలిమెట్టె స్వర్గమునకు.

వివిధవిషయ నివిష్టసూక్తియగు కవిగారి పరిజ్ఞానమునకు "నవకుసుమాంజలి" యాదర్శము. ఇదిగాక, వేంకటరామయ్యగారు మాలతీమాధవము, ఉత్తరరామచరితము, రాజశేఖరుని విద్ధసాలభంజిక రసోత్తరముగా ననువదించిరి. విద్ధసాలభంజిక ౧౯౦౯ లో రచితమై చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు వెలువరించిన 'మనోరమ' పత్రికయందుc బ్రకటింపcబడినది ఉత్తరరామచరిత్రాంధ్రీకృతి యసంపూర్ణము. వీరి రచనలు చాలవఱకుc బరివర్తనములైనను, శయ్యలో స్వాతంత్ర్యము నిండుగా నుండుటచే రక్తికట్టి శాశ్వతత్వము సంపాదించుకొనcజాలియున్నవి. తెనిcగింపులో నింతగా నింపు పుట్టించురచన యెందఱో యలవడదు. ఈపొందిక కనుcగొనుcడు:

సీ. మఱుcగc గాcగినపాలమఱపించు కరముల
గిలిగింతనేవcడు పొంగించుజలధి
భువనత్రితయము దివ్యభవనంబునకెవండు
నవసుధారస లేపనంపుcగుంచె
సిద్ధాపథంబయి చెలcగి యెవ్వనివెల్గు
మదనపల్లి నివుళ్ళు పొదలcజేయుc
జివురు విల్తునికేళి భవనాంగణమునకుc
జారుచందన పంకచర్చ యెవcడు

గీ. అతcడు వెలుcగొందుc గుంకుమన్యాసగౌర
మానినీరమ్య వదనోపమానమూర్తి
ఘటితచక్రవాక మిథున పటుతరార్తి
సాంద్రతరకీర్తి యామినీచక్రవర్తి.

ఉ. ఆడదు పూపుఁదోఁట గొని యాడదు వెన్నెల తేట బోటులం
గూడదు కేళిమండపము గుమ్మములవంకను దొంగిచూడదున్,
వేడదు వేషపోషణము, వీడదు కెంజిగురాకుపాన్పుఁ, బూఁ
బోఁడి తదీయ నవ్యమృదు మోహన వేష విభావనారతిన్.

ఇట్టి మహాకవి రాజము హేంద్రవరము మునిసిపలు హైస్కూలు సహాయోపాధ్యాయుఁడై శిష్యబృందమునకు సాహిత్యభిక్ష నందించెను. కవితా సరస్వతినిగుఱించి యీ రచయితహృదయ మిట్లు నవకుసుమాంజలి పీఠికలో బయటఁబడినది.

"ఈ శూన్యప్రపంచమం దా దేవి కొఱకే తెకే నేను కావలసినవాఁడను-నాకుఁ గావలసినదియు ఆ దేవియే. ఏమనఁగా, కవితయే నా జీవిత సర్వస్వము, కవితయే నాకు స్వర్గద్వారము, కవితయే నాకు మోక్ష సాధనము."

తంజనగరము తేవప్పెరుమాళ్లయ్య

1872 - 1921

తల్లి: శ్రీరంగమ్మ. తండ్రి రంగమన్నారయ్య. నివాసము: చెన్నపురి. జననము 1872. ఆంగీరసనామసంవత్సరము. అస్తమయము: 1921. రచనలు: ౧ భగవద్గీతవ్యాఖ్య ౨. వచనభాగవతము. ౩. వచనరామాయణము ౪. వచనభారతము. ౫. నన్నెచోడుడు (జీవితవిషయము) ౬. సర్వదర్శన సంగ్రహము. ౭. కర్ణచరిత్రము [అముద్రి] ౮. మను, వసు చరిత్రాదులకు వ్యాఖ్యానములు, పీఠికలు ఇత్యాదికము.

తేవప్పెరుమాళ్ళయ్యగారికి దేవరాజసుధి యని పండితులు వ్యవహారము. ప్రధానముగా నీసుధీమణి పీఠికాకారుఁడుగాను, వచన రచనా విశారదుఁడుగాను పేరందెను. మదరాసులో నానందముద్రాలయమువారి యాదరణమున నీయన మృదువగువచనములో భారత భాగవత రామాయణములు రచించెను. మను, వసు చరిత్రాది పూర్వకావ్యములకు వ్యాఖ్యలు గావించెను. నన్నెచోడుఁడు మున్నగు కవుల కాలనిర్ణయమును గూర్చిన వ్యాసములు 'ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక' 'భారతి' మొదలగువానిలో వెలువరించెను. రెండుభాషలయందును జక్కని చిక్కని చాటుకవిత కొంత సంతరించెను. శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యస్థానమునఁ బండితుఁడై పదార్థవిచారము చేసెను. మొత్తము నలువదితొమ్మిదేండ్లు మాత్రము జీవించెను. సుకృతీ గతాయుః.

ఈదేవరాజసుధి పూర్వులు తంజనగరరాజాస్థానమున సంగీతవిద్వాంసులుగ నుండిరి. వీరితాతగారు తేవప్పెరుమాళ్ళయ్య యనఁ బడు వారు. ఆయన మంచి పాండితి గలిగి, వాగ్ధాటియుండి భక్తియోగమును

గూర్చి యుపన్యాసము లిచ్చుచుండువారఁట. శతావధానము చేయఁగల రనియు వినికి. వీరికిఁ దంజనగరరాజ పోషణము సరిపడక చెన్నపట్టణము వచ్చివైచిరి. పట్టణమున బహుకాలము భగవద్విషయక ప్రవచనములతోఁ గాలక్షేపము చేసిరి. ఇట్టి యీ తాతగారి పేరు నిలఁబెట్టుటకు మన తేవప్పెరుమాళ్ళయ్యగారు పుట్టి, వారికంటె నూరురెట్లు ధట్టుఁడై వెలసెను. మన దేవరాజసుధి పండితుఁడుగాని, పండితపుత్రుఁడు గాఁడు. ఇతనితండ్రి రంగమన్నారయ్యగారు వ్యాపారసరణిలోఁ జేయి తిరిగిన వారు. ఆయన శతసంవత్సర దీర్ఘాయువునంది మొన్న 1921 లోఁ బుత్రశోకమనుభవించి, రెండేఁడులుండి మఱి మరణించెను.

మన తేవప్పెరుమాళ్ళయ్యకు దేవరాజసుధి యను పేరున్నటులు మన మెఱుఁగుదుము. చిన్నతనములో నీయనకుఁ జిన్నయ్య యనికూడ వ్యావహారికనామ ముండెడిదఁట. శ్రీ పరవస్తు చిన్నయసూరిగారి శిష్యులును, విశ్వగుణాదర్శాంధ్రీకర్తలు నైన తేవప్పెరుమాళ్ళయ్యగారి కడ మన దేవరాజసుధి కావ్యనాటకాదులు, వ్యాకరణము పఠించెను. పదునాలుసంవత్సరముల వయస్సు దాఁటకుండఁగనే 'మెట్రిక్యులేషన్' పరీక్ష నుత్తీర్ణుఁడై, ప్రవేశపరీక్షకుఁ జదువుచుండఁగా, సంసారపుఁజిక్కులు పెక్కు తటస్థించి, యాచదువు నంతతో నాఁపివేసినవి. విస్తారమగు బధిరత్వముండినకారణమున దొరతనమువారి యుద్యోగముల కానపడక, దేవరాజసుధి సాహుకారులదగ్గర నాశ్రయము సంపాదించుకొని కొన్నేండ్లు గడపెను. ఆసమయముననే యాంగ్లము, అఱవము చక్కఁగాఁ గృషిచేసి, తెనుఁగెల్ల స్వయముగఁ జదివి చూచి, సంస్కృతములో శ్రద్ధమై సిద్ధాంతకౌముది పఠించి, కొంతతర్కము, కొంచెము మీమాంస గురుముఖమున నధ్యయనించెను. ఆ సాహిత్యపు సాహసముతో 'భగవద్గీత' తీసి విశేషార్థ ప్రతిపాదకముగ నొక వ్యాఖ్య వ్రాసెను. ఆరచనయే యానందముద్రాలయమువారికి, దేవరాజసుధికిఁ జెలికారము

గలిపెను. తదాదిగ నీ దేవరాజు ప్రాచీన కావ్యములు, శతకములు, భారత భాగవతాది పురాణములు పాఠభేదములతో సరిచూచి సరస పాఠములెత్తి, వలసినవానికి లఘువ్యాఖ్యలు వ్రాయుచుఁ దెలుఁగు విమర్శకుల కాదరణీయములగు భూమికలు వెలయించుచు, కవి జీవితములు ప్రమాణమాన్యములుగాఁ బ్రకటించుచు నానందముద్రాలయము మూలమునఁ దెలుఁగుబాసకు వాఙ్మయపువిందు లిచ్చెను. చిన్నయసూరివచనరచన నొరవడిగా నుంచుకొని, దానికంటె నొకమెట్టు దిగువనుండు సులభభాషలో సంపూర్ణముగా రామాయణ భాగవతములు హృద్యగద్యములలో వ్రాసి వెలువరింపఁ జేసెను. వచనభారతము కొన్ని పర్వములు మాత్రమైనవి. మన దేవరాజసుధి వాఙ్మయసేవా సౌధమునకు ఆనందముద్రాలయము వాధార స్తంభాయమానులు.

ఈయన చివరిదశలో శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటు కార్యవ్యవహర్తగఁ బనిచేసి, తన్నిఘంటువునకు బహు గ్రంథపరిశీలనము గావించి పదపదార్థము లెత్తియిచ్చెను. పాండితిని మించిన వినయగరిమ కలవారీయన.

వత్సవాయి వేంకట నీలాద్రిరాజు

1881-1939

క్షత్రియుఁడు. వసిష్ఠగోత్రుఁడు. తండ్రి: వేంకట సీతారామరాజు. జన్మస్థానము: పెద్దాపురము. నివాసము: తుని. జననము: 1881. నిర్యాణము: 1939 సం. కృతులు: ౧. ఆంధ్రక్షత్రియులు [విమర్శనాత్మకము. 1920 ముద్రి.] ౨. ఆంధ్రమేఘసందేశము [1912 ముద్రి] 3. అభిజ్ఞానశాకుంతలము [1933 ముద్రి] ౪. విక్రమోర్వశీయము. ౫. మాళవికాగ్నిమిత్రము [అముద్రితములు]

ఈ నీలాద్రిరాజుగారికి దేశములోఁ గవిరాజని ప్రసిద్ధ వ్యవహారము. ఈయన తుని సంస్థాన విద్వత్కవి. రాజులలోఁ గవి యగుటయేఁ గాక, కవులలో రాజగుటయు నీయనకుఁ గవిరాజబిరుదము చరితార్థ మయినది. ఈ పద్యము వీరి వంశాది విశిష్టతను విస్పష్టపఱుచును.

సీ. రాజకేసరివర్మ రాజేంద్రచోళాది
జనపతుల్ కూటస్థ జనులు మాకు
భూలోక వైకుంఠపురు రంగ వేంకటే
శ్వరు లన్వవాయదైవములు మాకు
తెలుఁగురాయనరేంద్ర తిమ్మరాయప జగ
త్పతు లన్వయప్రదీపకులు మాకు
భగవత్పదధ్యాన పర విశిష్టాద్వైత
మత మన్వయక్రమాగతము మాకు
గీ. ననికి వెనుకంజ వేయక యసుతృణములు
వదలి దివిచూఱకోలు సద్వ్రతము మాకు

తళుకుకనకంబునకు(బరిమళము వోలె
కావ్యనిర్మాణ మతి యశస్కరము మీకు.

ఆంధ్ర మేఘసందేశావతారికలో(గవిరాజుగారు తమ సహాధ్యాయునిచే(జెప్పించుకొన్నటులు వ్రాసిన పద్య మిది.

ఈక్షత్రియకవి, మోదేకుఱ్ఱు సంస్కృత పాఠశాలా పండితులు ఆకొండి వ్యాసలింగశాస్త్రిగారిసన్నిధానమున సంస్కృతాంధ్రసాహితి సంగ్రహించెను. పాణినీయమునను గొంత ప్రవేశము కలిగించుకొనెను. కవిత్వము మంచి చిక్కని పలుకుబళ్లతో నుండి చక్క(గ నడపింప(గల నేర్పరు లీయన. పెద్దన, తిమ్మనార్యు(డు మున్నగు వారిశైలి వీరి కవిత కొరవడి. భాష నిర్దుష్టము, శిష్టసమ్మతముగ నుండును. కాళిదాసుని యభిజ్ఞాన శాకుంతలము, మేఘ సందేశము ననువదించి వెలువరించిరి. విక్రమోర్వశీయము, మాళవికాగ్ని మిత్రము కూడ(దెనిఁగించిరని తెలియ వచ్చును గాని యచ్చుపడలేదు.

కాళిదాసుని ప్రతికృతికి నెన్నో పరివర్తనములున్నవి. అందులో నభిజ్ఞాన శాకుంతలమునకు మన తెలు(గులో(బేరుపడిన యనువాదములు పదిపదునైదుదా(క నున్నవి. శ్రీ పరవస్తు రంగాచార్యులుగారు [వీరిది రెండంకములు మాత్రమే 'సకలవిద్యాభివర్ధనీపత్రిక' లో వెలువరింప(బడినది], కందుకూరి వీరేశలింగము గారు, వేదము వేంకటరాయశాస్త్రి గారు, రాయదుర్గము నరసయ్యశాస్త్రిగారు, దాసు శ్రీరామకవిగారు, వడ్డాది సుబ్బారాయు(డుగారు, నిడమర్తి జలదుర్గా ప్రసాదరాయు(డు గారు, మంత్రిప్రెగడ భుజంగరావుగారు, కాంచనపల్లి కనకమ్మగారు, పేరి కాశీనాథశాస్త్రిగారు, వీరెల్లరును శాకుంతలాపరివర్తనకర్తలు. తరువాత మనకవిరాజుగా రొకరు. వీరి తెలు(గుసేతలో విశేషములు రెండున్నవి. కేవలము మూలానుసారముగ ముక్కకు ముక్క తెలి(గింపక,

వ్యాఖ్యానసాహాయ్యమున భావ్యప్రాయముగఁ బెంచి రచించుట యొకటి. సంస్కృతమునను, దెనుఁగునను దొల్లి ప్రచురితములగు ప్రతు లన్నియుఁబట్టిచూచి, పాఠభేదములు, ప్రక్షిప్తప్రదేశములు లెన్నఁగబరి కించి పూర్వాపరసందర్భములు తాఱుమాఱుగాకుండఁ జేయుట రెండవది. కవితాధార సంగతి వేఱే చెప్పనేల? ఈతీరున జాలువాఱుచుండును.

సీ. రాలియున్నయవి కీరముల తొఱ్ఱలనుండి
చెదరి నీవారముల్ చెట్లక్రింద
తెలుపు చున్నయవి యింగుదీ ఫలోద్భేదంబు
జిడ్డులై యందంద దొడ్డశిలలు
మెలఁగుచున్నయవి నమ్మికతోడ నెప్పటి
పగిది శబ్దమునైచి మృగములెల్ల
కలిగియున్నయవి వల్కల శిఖానిష్యంద
రేఖాంకముల నీళ్ళ రేవుదాఁప్లు
మాటియున్నవి యాజ్యధూమంబువలనఁ
జివురుటాకుల కాంతులు చెన్నదరిగి
తోఁగియున్నవి గాడ్పులఁ దోలఁకి పాఱు
బోదియలనీళ్ళఁ బాదపంబుల మొదళ్ళు.

'ప్రథమాంకము'

ఉ. ఘ్రాతముగాని పుష్పము, నఖంబులఁ ద్రుంపని పల్లవం బను
న్యూతముగాని రత్నము, రుచుల్గొనఁబోని నవాసవం బఖం
డాతత పుణ్యసత్ఫలము నట్లనఘున్మగు నాలతాంగి రూ
పాతిశయంబు నెవ్వనికి నంచు విరించి సృజించి యుంచెనో!

కవిరాజుగారి మేఘసందేశపుఁ దెలుఁగు సేతలోని మచ్చు పద్యములు మఱిరెండు:

శా. ఆపీట న్నడిరేయి పీఠిఁబడి కాంతాగారమున్ జేరు న
ప్పాపుం బోణుఁ కిల్లిబిల్లిగొని చూపున్ మాపు పెంజీకటిన్
నీ వెంతే నొరగంటి పైఁడిశఖునిన్నద్దంపు క్రొమ్మించునన్
ద్రోసంజూపుదు వారలుబ్బుకదురు చిన్కన్ బ్రేమాంతలేశంబుమీ!

ఉ. పైదలిబాసె పీఁడను గృపామతి నిల్చినో లేక చెల్చినో
కాదన కిట్టిపాటియుపకార మొనర్చి మదర్థసంబు మై
నాదట నిచ్చవచ్చు నెడలందుఁ జరింపుము కార్బ్యసంగుతో
లేదవుగాక క్రొమ్మెఱగు లేఁబవియోగము నీకు ప్రేల్మిడిన్.

కవిరాజుగారు చక్కఁగ రుద్ధము - కూర్చిని మున్నగు నెరసులు కొన్ని శాకుంతలకృతిలో దొ[illegible]డిరి ఆనాటకములో నీచ పాత్రోచితమైన వాడుకభాష యెంతసొగసుగ నడచినదో?

క. ఇల నెంత చెడ్డదైనను
కులవృత్తిని విడిచిపెట్ట గూడదు గందా?
తలచదుము చదుముకొని మేఁ
కలఁ జంపే బాపనయ్య కటికోఁడయ్యా!

నీలాద్రిరాజుగారు పెద్దాపురమురాజ్యమును బరిపాలించిన శ్రీ రాజా వత్సవాయి వేంకటసింహాద్రి జగత్పతీంద్రుని యాదరమునఁ దుని సంస్థాన కవిగానుండి పేరందెను. తునిరాణి శ్రీ సుభద్రాంబిక యీకవిని బహుగౌరవముతోఁ జూచినది. నేఁటితునిరాజుగారు శ్రీ వత్సవాయి వేంకటసూర్యనారాయణ జగపతిరాజావారి పట్టాభిషేకసందర్భమునఁ బ్రదర్శనముచేయుటకై కవిరాజుగారు శాకుంతల మాంధ్రీకరించినటులు ప్రస్తావనలో నున్నది. శ్రీవారి సంస్థానమున నీయన జేగీయమానముగ శతావధానము గావించెను. ఆంధ్రభారతీ తీర్థవారు 'కవిభూషణ' యను బిరుదముతో నీయనను సత్కరించిరి. కవిరాజుగారు తాను శతావధాని నన్నసంగతి యీపద్యములలోఁ జెప్పుకొనెను.

శా. నానాసాధు సభానదార్య సుమనోనాళీకనాళ ప్రణా
ళీ నిర్వ్యాజ నిపీయమాన సువచో లీలామృతా స్వాదనా
పౌనఃపున్యరసోదయుండ సుమనః పద్మైకసంవేశిత
శ్రీనాథుండ శతావధాన కవితా సింహాసనాధీశుఁడన్.

మ. తుని రాజేంద్రుఁ శతావధాన కవితా శుస్తోత్స్వా గావించి యా
యన సమ్మాన విభూతినై 'సుకవితాయద్యస్తి రాజ్యేనకి'
మ్మనురీతిన్ గవిరాజటంచును జనం బాబాల గోపాలమున్
వినుతింప న్విలసిల్లువాఁడఁ గవితా విద్యానవద్యాకృతిన్.

నీలాద్రిరాజుగారు కవియు, శతావధానియుఁగాక మంచివిమర్శకుఁడని 'ఆంధ్రక్షత్రియులు' అనిన చిన్నపుస్తకముఁవలనఁ దెల్ల మగును. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు 'ఆంధ్రులచరిత్రము'' లో నాంధ్ర దేశమును బరిపాలించిన కాకతీయులు సూర్యవంశక్షత్రియులని తొలుత వ్రాసి, తరువాతఁ జతుర్థకులజులని మరల వ్రాసిరి. పరస్పరవిరుద్ధముగ నిటులు వ్రాయుటకుఁ గారణమేమని యడుగ మొదటిది భ్రమ యనియు, రెండవది ప్రమ యనియుఁ బిమ్మట వాదించిరి. అప్పుడు మన కవిరాజుగారు శ్రీ రావుగారి వ్రాఁతను సప్రమాణముగఁ గాదని వాదించి కాకతీయులు క్షత్రియులే యని యీ పుస్తకములోఁ దెల్చి వ్రాసిరి.

ఈ కూర్పునకుఁ బీఠికవ్రాయుచు విమర్శకాగ్రేసరులు కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు చిట్టచివర నిట్టులు తమయభిప్రాయము వెలిఁబుచ్చిరి.

" ...ప్రతాపరుద్రాదులు శూద్రులను భ్రమ పల్లురకుఁ గలిగినది. నేనును నందులోని వాఁడనే. శ్రీ కవిరాజుగారు వ్రాసిన యీ గ్రంథము చూచినతరువాత నే నిదివఱకుఁ దలఁచినది తప్పని గ్రహించి దిద్దుకొన వలసినవాఁడ నయితిని."

ఈ యుభయవాదములలోని సాధుతాసాధుతలు నిర్ణయించుకొనుట కిది సమయముగాదు. కవిరాజుగారు చక్కని విమర్శన శక్తి కలవారని

"ఆంధ్రక్షత్రియుల" వలనఁ బ్రత్యక్షమగును. అదేమనకుఁ బ్రస్తుత విషయము.

నీలాద్రిరాజుగారు అచ్చతెనుఁగులోను జక్కని చిక్కని కవిత నంతరింపఁగలరు. ఈ వృత్తాంత మీ చాటుపద్యము చాటుచున్నది.

ఉ. కూటిపులుంగులన్ మెఱఁగి కూళతనంబున నేయునట్టి వా
వేఁటలు గీటలున్ జమునివీటికి బాటలు రాచపాడికిన్
జేటులుగాక మాత్తురెదఁ జిందఱవందఱవో రొదల్ దెసల్
బీఁటలువాఱఁగా ననికిఁ బెండ్లికిఁ బోయినయట్లు పోవలెన్
సూటి కొలందికిన్ దివియఁ జూచి నిగిడ్చిన మాత్తుచేతివా
లీటె తనంత తావలచి యొక్కటిపైఁబడు పూవుఁబోఁడి మే
మీటిన చన్నదోయి వలె మీఁదికి రావలెనొక్కపెట్ట పై
పాటున క్రొత్తనెత్తుకలపమ్ములు గమ్మఁగఁ బేరురమ్మి నో
నాటవలెం దగం దనమనమ్మున మారొక్కని ముమ్మరంపుమై
తీఁటలుపోఁ బెనంగవలెఁ దేనియతేటలవోలె నెత్తురుల్
నోటఁబడంగ నొడ్డఱచి నూల్కొనఁగావలె నీడబోని పో
రాటమునం దొడల్ విడిచి గక్కున నక్కునఁ జేర్చు వేలుపుం
జోటి చనుంగవన్ మిగులఁ జొక్కవలెన్రతి పేరసంబుతో
నోటమిలేక తా బ్రతికియుండినచో మగలెల్ల వీఁడెపో
మేటిమగం డనంగఁ బుడమిం బసమీఱఁగ నేలఁగావలెన్
పాటుపడంగ నొవ్వు తమపాడికిఁ జాలక డొక్కముచ్చులై
కూటికొఱంతలేక తిని కూర్చుని యొండొరు నెక్కసక్కెపున్
మాటలనాడికొంచు వెడనవ్వులతోడన ప్రొద్దుపుచ్చి మై
పాటున నెంతయున్ జమునిపాల్పడి పోవఁగ మేమెమేమెపో
మేటి కొలంబువార మని మీసలు ద్రువ్వెదు రాచవారికిన్
గాటకమయ్యెనే? యకట! కయ్యముతియ్యము నాఁడునాఁటికిన్.

జనమంచి శేషాద్రిశర్మ

1882

తెలగాణ్య వైదిక శాఖీయులు. తల్లి: కామాక్షి. తండ్రి: సుబ్రహ్మణ్య శర్మ. జన్మస్థానము: నెల్లూరు మండలములోని కలువాయపురము. నివాసము: కడప. జననము 4 - 7 - 1882 సం|| విరచిత కృతులు : ౧. బ్రహ్మపురాణము. ౨. బ్రహ్మాండ పురాణము. ౩. కౌమారి కాఖండము (స్కాందాంతర్గతము) ౪. సర్వమంగళాపరిణయము [మహాకావ్యము] ౫. హాలాసమాహాత్మ్యము ౬. లలితోపాఖ్యానము ౭. శ్రీమద్రామాయణము ౮. సంగ్రహరామాయణము ౯. విచిత్రపాదుకాపట్టాభిషేకము ౧౦. పాండవాజ్ఞాతవాసము. ౧౧. దైవజ్ఞ సార్వభౌమ విజయము ౧౨. సీతా స్వయంవరము ౧౩. సువ్రత ౧౪. కీరవాణి ౧౫. మనోరంజని. ౧౬. యతిధర్మప్రదీపిక ౧౭. సతీతిలక. ౧౮. కడప మండలచరిత్ర ౧౯. ఉదయగిరిముట్టడి ౨౦. శ్రీకృష్ణావతార తత్త్వము ౨౧. శ్రీరామావతార తత్త్వము [కొన్ని యముద్రితములు] ౨౨. కేదారారుణాచల ఖండములు [స్కాందాంతర్గతములు] ౨౩. హృదయానందము. [కల్పిత ప్రబంధము-పద్యసంఖ్య మూడువేలు] ౨౪. శ్రీశంకర గురువరచరితము [3 వేలు పద్యములు] ౨౫. కవివిలాసము. ఇత్యాదులు.

అధునాతనాంధ్రకవులలోఁ బురాణవాఙ్మయమువంకఁ జూచినవారు నలుగురైదుగురు మాత్రము. వారిలో భారతరామాయణముల నాదరించినవారి సంఖ్య పెద్దది. సంస్కృతములో అష్టాదశపురాణములుకలవు గదా! వానిని జూచుచున్నవారు తక్కువ నేఁ డనువాద వాఙ్మయమునకు, విశేషించి పౌరాణగాథలకు మనవా రంతగాఁ జెవులొగ్గకపోవుటచేఁ గాఁబోలు భారత రామాయణాదులైన నాలుగైదు పురాణములకంటెఁ దెలుఁగుబాసలోఁ బురాణములు లేవు.

ఈలోటంత కొంతవఱకుఁ దీర్చినకళాప్రపూర్ణ జనమంచి శేషాద్రిశర్మగారు యావదాంధ్రమునకు నభివందనీయులు. వీరు ప్రస్తుతము కడపలోని

'లలితావిలాసము' న పుణ్యజీవనము గడుపుచున్నారు. వీరి యుభయ భాషాపాండిత్య మప్రతిమానము. పౌరాణికతత్త్వపరిజ్ఞాన మసమానము. ఉపనిషత్తులు చదివిరి. సూత్రభాష్యము నెఱిఁగిరి.

శేషాద్రిశర్మగారి యభినివేశ మాశ్చర్యకర మైనది. వీరు వ్రాసిన పద్యములు మొత్తము లక్షకు మించునేమో! "పాండిత్యమున నున్నవన కవిత్వమున లే" దని కొందఱివాదము. వస్తుస్థితి నిర్ణయించుట తరముకాదు. ఈ విమర్శ కాఁగినవారు పురాణకవులలో నెందఱుందురు?

వీరు శ్రీమద్రామాయణమును దెనిఁగించిరి. అది స్వేచ్ఛానువాదము గాదు. విద్యార్థులకు సైతము సులభముగాఁ దెలియుటకు శ్లోకమున కొక పద్యము చొప్పున వ్రాసిరి. విసువు విరామము లేక యిన్ని పద్యములు వ్రాయుట కవి కుండవలసిన గొప్పశక్తులలో నొకటి. శర్మగారు మూర్తీభవించినదైవభక్తి. వీరి గ్రంథము లన్నియు భగవత్పరములే. బ్రహ్మపురాణ మాంధ్రీకరించిరి. బ్రహ్మాండపురాణ మనువదించిరి. స్కాందమున కేతాముత్తి కౌమారికాఖండము కేదారారుణాచలఖండములు పరివర్తన మొనరించిరి. తాండవకృష్ణ భాగవతము - సర్వమంగళాపరిణయము-హనుమద్విజయము-కృష్ణావతారతత్త్వము (12 భాగములు)-రామావతారతత్త్వము (10 భాగములు)-సంగ్రహ భారత భాగవత రామాయణములు - ఈగ్రంథములన్నియు భగవత్సంబంధములే గదా? చరిత్రవిషయముగూడ నెఱుఁగుదు నని కడపమండలచరిత్ర - ఉదయగిరి ముట్టడి రచించి చూపిరి. శర్మగారికి మనుచరిత్ర మనిన నెక్కుడు మక్కువ. పెద్దన వీరి దృష్టిలో మహామహాంధ్రకవి. ఇతని జన్మాదికమును గూర్చియు, నీతని కవిత్వవిశేషములనుగూర్చియు వీరు చక్కని పరిశోధనములఁ జేసియున్నారు. అవి సమంజసముగా నుండును. పెద్దన బళ్ళారి మండలమునఁ గల దూపాటుసీమనుండు 'దోరాల' గ్రామమునఁ బుట్టెనని వీరేశలింగము పంతులు గారు వ్రాసిరి. ఈవిషయమున ననేక సత్య

పరిశోధనలఁ జేసి సప్రమాణముగా నాయనవాదమును గాదని వాదించిరి. ఇది వీరి చరిత్ర పరిజ్ఞానము వెల్లడించుటకుఁ బనికివచ్చును. వీరు ప్రత్యేకముగా 'మనుచరిత్ర హృదయావిష్కరణము' రచించిరి.

చిన్ననాఁట శేషాద్రి శర్మగారు కడపలో విద్యాభ్యాసము కొన్నాళ్లు చేసిరి. అక్కడ నసిగఁ జదువు సాఁగమి కాశీపట్టణమునకుఁ బదునొకండవ యేఁటఁ బయనము సాఁగించి, కాలినడకచే నాలుగేండ్లకు వారణాసిఁ జేరికొనిరఁట. అచ్చటఁ గొన్ని వత్సరము లుండి సంస్కృతవిద్యాధ్యయనముగావించి వచ్చి, విజయనగరము, కసిమికోటలలోఁ బండితసన్నిధిని స్కంధత్రయాత్మకజ్యోతిర్విద్య నభ్యసించిరి. జ్యోతిశ్శాస్త్రమున శర్మగారు చాలఁ బ్రజ్ఞావంతులు.

జ్యోతిషము చెప్పుచు నందఱ నాశ్రయించి తిరుగుట వీరి కిష్టము గాక కడపలోని యాంగ్ల పాఠశాలలో నాంధ్రపండితులుగాఁ బ్రవేశించిరి.

నెల్లూరికడనున్న జన్నవాడక్షేత్రమునఁ బినాకినీతీరమున కామాక్షీ మల్లికార్జునుల సన్నిధిని వీరు నడుమనడుమఁ బెక్కునెలలు వసించి తపము గావించుచుండురని వినికి. ఆయుపాసనామహిమచేతనే వీరు మహోత్సాహముతో గంటకువందలు పద్యములు వ్రాయుచున్నారని చెప్పుదురు. ఒకమహాశయు లిట్లు వ్రాసిరి.

ఆ. వె. ఉన్నకవులలోనఁ జన్నకవులలోన
నిన్నికృతులు వ్రాయఁ గన్న దెవరు!
రాముఁ డల్లపోతరాజునకుంబోలెఁ
బలుకుఁదోడొ యేమొ? లలిత నీకు.

వీరు నరాంకిత మొనరింపలేదు. జనమంచి శర్మగారు విద్వత్కవులేగాక సత్త్వములు, సహృదయులు, పరమభాగవతోత్తములు. దుర్విమర్శనములు దురహంకారములు వీరికినచ్చవు. ఒకప్పు డెక్కడో యొకసభలో

మన శర్మగారిని వ్యక్తిపరముగా దూషింప మొదలిడిరంట. ఆ సభలో శర్మగారును గలరు. కాని వారు నవ్వుకొనుచు నూరకుండిరంట. అయినను సభావేదికకుఁ బ్రక్కవారి ప్రోత్సాహముచే నెక్కక తప్పినది కాదు. లేచి చెప్పినమాట లివి: "మహాజనులారా! ఈసమయమున వాదప్రతివాదములు జరపుట నాకిష్టములేదు. ఏనాఁడో ఎన్నితరముల క్రితమో జనులయెడ మంచిగా మెలంగుచుండుటచే మాకు "జనమంచి" యను నింటిపేరు వచ్చినది. ఇప్పుడు నేను మొగముచెండుకొని వారి వలె ననవసరముగా నా ప్రతిపక్షుల విమర్శించితి నేని మాయింటి పేరు నేతిబీఱకాయను జేసినవాఁడ నగుదును." ఈ వాక్యములలో శర్మగారి సహృదయత వ్యక్త మగుచున్నదిగదా? మహాకవులకు మంచితనము తోడైనచో వచింపనేల? శేషాద్రిశర్మగారు దత్తమండలమునకే గాక తెలుఁగు బుడమికి వన్నెదెచ్చు కవులు. నాస్తికతా ప్రాబల్యముతో నిండియున్న నేఁటికాలమునకు శర్మగారివంటి భాగవత కవులు, వారి గ్రంథములవంటి భక్తి రసపూరిత గ్రంథములు మిన్నగా జనింపవలసి యున్నది. శర్మగారి గ్రంథములెల్ల వెలువరింప దీక్షించిన శ్రీ వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రిగారి నభినందింపవలయును.

కళాప్రపూర్ణులు, కావ్యస్మృతితీర్థులు నగు శేషాద్రిశర్మగారిని గూర్చి కట్టమంచి రామలింగారెడ్డిగారి ప్రశంస యుదహరింపఁదగినది. "వీరి కవిత్వమునకు వీరి వినయాతిశయము శోభను గలిగించుచున్నది. కవిత్వ - పాండిత్యములకును, సౌజన్యమునకును నిత్యసంధి లేదనుట మన మెఱింగిన విషయమే. వీ రెవ్వరినిగాని యధిక్షేపించినట్లు, ఎవ్వరితోగాని వాదమునకుఁ బూనుకొన్నట్లు గానరాదు. సౌజన్యము వీరి కలంకారము. ప్రఖ్యాతికై ప్రాకులాడువారుకారు......"

శర్మగారి కవిత్వము ధారాళధోరణి గలది. వీరి గ్రంథము లన్నియు ననువాదములే యగుటచేఁ గల్పనాగంభీరిమ వీ రెంతగాఁ బ్రదర్శింతురో

తెలిసికొనఁ జాలము. కౌమారికాఖండమునందలి గౌరీశంకర వివాహ ఘట్టమున వీరికవితాధార జాహ్నవి వలె నిట్లు పొంగారుచున్నది.

క. కనిపెట్టుచు బ్రాహ్మణవరు
లనూన పద్ధతిసి సాగునట్లొనరుపఁగాఁ
దనయాన్వయములఁ జెప్పం
గను బూని హిమాద్రి యనియెఁ గన్యక దీసిన్.

క. పితరుల దౌహిత్రిగ నా
సుతగా నెఱుఁగంగఁ దగును శుభగుణ సిలయన్
మతిమదర్వ్య నొసంగెద
హితమిది లోకాళి కన్న యిచ్ఛ పొలయుటన్.

క. అనియూరకుండె; నల్లుని
దనఁబడు వంశం బెఱుఁగఁ దయ్యోంగానన్
మునిముఖుల నడిగె వంశం
బన నెయ్యది శంభుని దని యంద ఱెఱుఁగమిన్.

మ. వనజాక్షుం డిటు పల్కె; నెవ్వరిని నీ వార్తన్ వచింపంగ నే
రని వారిం గని ప్రశ్న మీవడిగినన్ రా దుత్తరం బెవ్వరై
నను గుర్తింపఁగరాని యన్వయము వింతంగాంచు నీయల్లునే
యనుమోదంబునఁ బ్రశ్నచేయు; మతఁడే యావార్తలం జెప్పెడున్.

క. వినుమహీయే యహీపాదము
ల నెఱుంగుంగాని యెవఁడిలాస్థలిఁ జెప్పం
గను జాలునె తెలియుదు; నని
తన గోత్రముఁ జెప్పఁడేని తగ మదభగినిన్.

క. ఒసఁగంగ రాదు; శంభున
కనమాన్వయుఁ డగుట; ననఁగ నమ్మాటకు నం

దెసఁ గెను హాసధ్వను; లా
నుసమయ మావేశుకలకుఁ జోటయి యుండన్.

చ. హరుఁడిపుడేమి యుత్తరము నారసి యిచ్చునొ వీనులార ని
త్తరుణమునందు వింద; మని తత్తఱమందుచు సభ్యులెల్ల నుం
డిరి; ధ్వని యడ్డి తగ్గ నట నీలగళుండు విమర్శపద్ధతిన్
వరమతి నెన్ని భీతుఁడగువానివిధంబున నానతాస్యుఁడై.

గ్రంథవిస్తారరచనలో నచటనచటఁ గొన్ని వ్యర్థపదములు దొరలినను, శర్మగారి ధారావాహికమైన శయ్యలో నవి పరిగణింపఁ దగినవి కావు. కవిత్వమే తపస్సుగా భావించి, యోపికతో మనస్సు నిలఁబెట్టి యెన్నో మహాకృతులు రచించి యిచ్చుచున్న శేషాద్రిశర్మగారి సేవ రాయల సీమలో తెలుఁగుసీమలో విలువయిడరాని యొక మేలి రవ్వ.

త్రిపురాన వేంకట సూర్యప్రసాదరాయకవి

1889 - 1945

తెలగా వంశీయుఁడు. తల్లి: నారాయణమ్మ. తండ్రి: తమ్మయ్య దొర. జన్మస్థానము: శ్రీకాకుళము తాలూకాలోని సిద్ధాంతము. జననము: 1889 అక్టోబరు 31 తేదీ. నిర్యాణము: 1945. ముద్రిత కృతులు: ౧ నిర్వచన కుమారసంభవము [౬ ఆశ్వాసములు. 1913 ముద్రి.] ౨. రఘూదయము [౪. ఆశ్వా. 1924 ముద్రి.] 3. రతి విలాపము [ద్విపద కావ్యము 1926 ముద్రి] ౪. మెయిలురాయబారము [కాళిదాసుని మేఘ సందేశమునకు స్వతంత్ర దేశీయ గేయానువాదము. 1940 ముద్రి] అముద్రితములు: ౧. నిర్వచన రఘువంశము [శ్లోకమునకుఁ బద్యముగాఁ దెనిఁగించినది. 19 సర్గములు] ౨. ఇందుమతీమందారము [అజ చరిత్రము] 3. ఉత్తరరామ చరిత్రము [భవభూతి నాటకమున కాంధ్రీకృతి] ౪. కిరాతార్జునీయము [భారవికిఁ బద్యాంధ్రీకరణము] ౫. అజవిలాపము [ద్విపద ఇది 'భారతి' లోఁ బ్రకటించిరి] ౬. మృతజీవి జీవితామృతము [తమ్మయవిభూ! తండ్రీ! కవిగ్రామణీ!" అను మకుటముతోఁ దండ్రిగారి జీవితచరిత్ర ప్రతిబింబించునట్లు వ్రాయఁబడిన చిన్నగ్రంథము] ౭. శ్రీరామాశ్వమేధము [పద్మపురాణములోని పాతాళఖండము, ఇది యసంపూర్ణము] ౮. శ్రీభగవద్గీతామృతము [దేశీయచ్ఛందోగీతికలలో ద్విపాత్రనాటికగా రచింపఁబడినది].

శ్రీ సూర్యప్రసాదరాయకవి త్రిపురాన తమ్మయరాట్కవీంద్రునకుఁ దగిన తనయుఁడు. ఇంకను కొడుకు కళాప్రపూర్ణుఁడు కాలేదు, సరిగాఁ బది నాలుగు నెలలేని నిండలేదు. తమ్మయకవి భగవదాజ్ఞకు బద్ధుఁడయ్యెను. పాండితిలోఁ గవితలో వీరి రచనములను బట్టి పరీక్షించినవారికి 'పుత్రాదిచ్ఛేత్పరాజయ' మ్మనిపించును. సూర్యప్రసాదరావుగారి జననం 1889లో. ఆయనకేమి? పరులకడకుఁ బోయి చేచాఁపనక్కఱలేకుండ, స్వేచ్ఛగాఁ దిని చేతులార నింత పెట్టుకొను శ్రీమంతుల వంగడములోఁ బుట్టెను.

పసితనముననే తండ్రిని బాసినవాఁడని కడుగారాబముగఁ బెంపఁబడెను. పదునైదేండ్లు వచ్చుదాఁక వేఁటమీఁదను, ఆటలమీఁదను గల వేడుక విద్యపై లేదు. "తమ్మనదొరగారికిఁ దప్పి పుట్టితివి నాయనా!" అని యొకపెద్దమానిసి వీధింబోవుచు నన్నమాట శూలపుంబోటైె. సూర్య ప్రసాదరావుగారు వెంటనే యింటికిఁబోయి తన బుద్ధి చదువు బాటపై నడిపించెను. మనోరథము నుంచిది గానఁ దను యింటి పండితుఁడు శ్రీ ముక్కవిల్లి సాంబయశాస్త్రిగారి సారథ్యములో నడక చఱ చఱ సాఁగినది.

గురుదేవులు సాంబయశాస్త్రిగారిని గుఱించి ప్రసాదరాయ కవి 'మృతజీవి జీవితామృతము' లోఁ గనఁబఱిచిన భక్తి గౌరవ మీ పద్యములలో నారయఁగలరు.

మ. హరిభక్తుండును శేముషీ గురుఁడు నీ యాస్థాన విద్వత్కవీ
శ్వరుఁడౌ సాంబయశాస్త్రి ముక్కవిలి వంశ స్వచ్ఛ రత్నమ్ము మ
ద్గురుఁడైనాఁడు సుమయ్య! యేయ్యనఘుఁ గన్గొన్న న్గన్న నిన్గన్న యా
దరమున్ భక్తియుఁ గల్గుఁ దమ్ము యు విభూ! తండ్రీ! కవిగ్రామణీ!

మ. పదునై దేఁడుల యీడు వచ్చుదనుకన్ బాలోచితక్రీడలం
జదువుల్ మాని చరించునాకుఁ గవితాసక్తిం బ్రసాదించి యో
ప్పిదమౌదారికిఁ ద్రిప్పి తాఁ జదువుచెప్పెన్ మద్గురుండెంతు నం
త దయాళుండు గలాఁడె తమ్మయ విభూ! తండ్రీ! కవిగ్రామణీ!

మ. ధన మీవిచ్చితిగాని యేతఁడిడు విద్యాబుద్ధులే నాకు నీ
ధన సంపత్తికి మీఱి కీర్తియు మహాత్మ్యానముంగూర్చె, న
య్యనఘు న్నిన్నుఁ దలంప నెక్కుడతఁడేయౌఁ, గాని, నాకట్టియా
తని నీ విచ్చితి గాదె? తమ్మయ విభూ! తండ్రీ! కవిగ్రామణీ!

రఘువంశము మొదలగిడి, కావ్యములు, నాటకములు మున్నగాఁ జదువవలసినవెల్లఁ జదివిరి. తెలుఁగులు తనివితీఱ విసిరి. తండ్రిని స్మరణకుఁ దెచ్చుచు, పండితుల మెచ్చు లందుచు జానుదెలుఁగులోఁ దియ్యని కవితలను కట్టుటకుపక్రమించిరి. రఘువంశము, కుమారసంభవము, శ్లోకమునకుఁబద్యము చొప్పునఁ జెప్పిరి. మొన్న 1940 లో మేఘదూతమునకు కడుఁ గ్రొత్తరీతిని గేయములలో ననువాదము గావించి ప్రకటించిరి. ఆంధ్రకాళిదాసుఁడని యీయనకు బిరుదమున్నది. 'భారతీతీర్థము' లో శ్రీజయేంద్రపురాధీశ్వరునివలన వీరికి 'కవిభూషణ' యను నుపాధి లభించినది. వానిలోఁ బనేమి ? ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారు 1943 లోఁ జిలకమర్తి కవితో పాటు వీరిని 'కళాప్రపూర్ణ' లని బిరుదనామ మిచ్చి మెచ్చిరి.

సూర్యప్రసాదరాయ కవి కవితాకళలోఁ బ్రపూర్ణుఁ డనుట కతని కృతులు పరమప్రమాణములు ఇక్కవిమణికిఁ దిక్కనమఖికవిత యాదర్శముగా నుండియున్నటులు పదము పదమునఁ గానవచ్చును. పొలుపు గల తెలుఁగు పలుకుఁ గూర్పులో మంచినేర్పు మన కవిగారి కున్నది. వీరి 'నిర్వచన కుమార సంభవము' లో నెల్లను గందములు, గీతములు, పెద్దవృత్తములు పెక్కు లేవు. ఉదాహరణమున కొక మెత్తని పద్యము చూతుఁడు :

క. కటముల తీఁటలు వో గజ
ఘటలు నరళతరుల రాయుఁగాఁ బొల్పడి తత్
స్ఫుటతరపరిమళభర మ
చ్చోటున నెత్తములఁ జేయు సురభిళములుగాన్.

౧ ఆ. ౬౮ ప॥

'రఘూదయము' లోని వొక రెండు ప్రకటింతును :

మ. ఒకనాఁడొక్కమదాంధ సింధురము గండోద్భూత కండూతి కో
ర్వక యీ చెట్టునరాయ మూడె వలపారన్ దీనిపై పట్ట దా

నికి నీహార ధరాధిరాజసుత కన్నీరుట్ట శోకించె న్కం
దకుమారుండసురాశుగక్షతులు వొందం గుందు చందంబునన్.

ఉ. ఆదినమాదిగాని త్రిపురారి నను౦ గరివైరిఁ జేసి కుం
భోదర యీహిమాద్రి గుహనుండి యిటన్ దరిఁజేరు జంతువున్
గాదన కారగించుచును గావుము దీని నటంచుఁ బంచెఁ దో
డ్తో దయితాకపోలములతో నెలనవ్వులు వియ్యమందఁగన్.

—౨ ఆ. ౩౬, ౩౭ ప॥

వీరిగ్రంథములలో నే పట్టులు పట్టిచూచినను తియ్యని పలుకుబళ్లతోఁ గనుపట్టుచున్నవి. ఈయన కృతు లన్నియు ననుసృతులైనను, దెనుఁగు నేఁతలో నొక క్రొత్తఁదన ముండి యందగించుచున్నది. మేఘదూతము నకు స్వతంత్ర గేయరూపముగా వీరు గావించిన తెలుఁగు పరివర్తనము వీరి కృతుల కెల్లఁ గిరీటము. గేయరూపముగ నున్న నేఁటి సలక్షణ కావ్యములకును నిది మస్తక మాణిక్యము. శ్రీ జయపురమహారాజులు శ్రీ విక్రమదేవవర్మగారి కీ కృతిని పెంపుడుబిడ్డగ నంపిరి. వారు దానిని శ్రీరామచంద్రున కర్పించుకొనిరి. ఈకృతి తొలుత 'మొయిలు మెఱుఁగు' లలో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సూచ్చటించినటులు "... ఇది యల్ల నల్లన విరియుచు వల్పులు గొల్పుచు నమృతబిందులొలుకు నలరు రేకులఁబోలె సులలితములై జిలు జిలు మనఁ జలువలఁ జల్లుచుఁ జవులఁ జిందుచు విందులు గొల్పుచు నున్న పలుకుల పొలుపుతో మురిపపు టొయ్యారపుటూపుఁదోఁపించు శయ్యతో దేశితెలుఁగుతీరునఁ గడుఁ దియ్యమైన పాటసొరుతో నిఁక నిట్లు తెలిఁగించు టన్యుల కసాధ్యమనఁ దగిన ట్లున్నది. ...."

సీ. పువుఁదేనె సోనలై చెవులపండువు సేయు
కలికిపల్కుల ముద్దులొలుక నేర్చుఁ

బద్దెమ్ములోఁ బాట పాటలోఁ బద్దెమ్ముఁ
గూడి రా హాయిగాఁ బాడనేర్చు
నరఁటిపం డొలిచి తానరచేత నిడురీతి
భావార్థములఁ దేటపఱుప నేర్చు
గానాభినయ నాట్య కవితాకళలఁగూర్చి
యరుదార నాటకా లాడనేర్చు
సర్వగతుల నీకును సంతసమ్ముఁగూర్చఁ
గాళిదాస సత్కృతి మేఘకావ్యకల్ప
పుష్పసౌరభ లహరికా మూర్తియైన
మా మొయిలుఁ గబ్బపుఁగన్న భూమహేంద్ర!

మొయిలు రాయబారము.

పలువన్నె జోతి రేకల చుట్లతోఁగూడి
పొలుపారునే నెమిలిపురికన్ను పట్టూడి
కులరాలఁ గొడుకుపైఁగల ప్రేముడిని దానిఁ
గలువతే కిడుచెవిం గయిసేయు నాగౌరి
సెలతాల్పు శిరసు వన్నెలలచే నెంతయుఁ
దెలుపారు కన్నుఁ గొలుకులతోడి గుహుని య
ప్పులుఁగుదత్తడి నవల మలగవుల మఱుమ్రోత
లలమ బిట్టుఱెమి గొండిలికిఁ దార్పఁగదన్న!

క్రొమ్మెఱుపు...

ఇట్టికవితతోనున్న యీ 'మొయిలురాయబారము' క్రొత్తతీరుగలదై సచారువుగా నున్నదనుట నిర్వివాదము. యక్షుఁడు చిట్టచివర మేఘున కనుచున్న మాటల యందపుఁ బొందిక కనఁగొనుఁడు! కాళిదాసుని **కవితతో** వియ్యమందుచున్నదిగదా!

మొయిలురాయఁడ! యిట్లు మొదటివియుక్తిఁ
జాలశోకించు నీసకియ నోదార్చి
నంది కోరాటలఁ గనలఁగు నా వెండి
మలనుండి వేవేగ మరలి యేతెంచి
తగినగుర్తులతోడఁ దరళాయతాక్షి!
పంపినసేమంపువార్తలం దెల్పి
వేఁబోక తఱిమల్లె విరివోలెఁ బ్రిదిలి
తలరు నాజీవము న్నిలుపంగదయ్య!

* * * *

ఇట్లు నీదు మెఱుంగు టిల్లాలితోడ
నీకెన్నఁడు వియుక్తి లేకుండుఁగాక!

ఈ మొయిలు రాయబారములోని గేయముల తీరుననే "శ్రీ భగవద్గీతామృతము" కూడ రచించిరి. కృష్ణార్జును లిరువురు నిందుపాత్రలు. ఈ గ్రంథమింకను ముద్రణములోనికి రాలేదు.

శ్రీ సూర్యప్రసాదరావుగారు తెలుఁగుకవితలో మంచి మంచి మెలఁకువలు తెలిసిన సరసకవులు. కవితలో నధునాతన భావములు వీరియందున్నవిగాని, భాషావిషయకమైన సంస్కారము వీరికంగీకారము కాదు. 1927 లో బళ్ళారిని జరిగిన ఆంధ్రసాహిత్య పరిషద్వార్షిక మహాసభకు వీరి నధ్యక్షులుగా నెన్నుకొనిరి.

1922 సం॥ జూలై 13వ తేదీని జార్జిచక్రవర్తికుమారుఁడు 'ప్రిన్స్ ఆఫ్ వేల్సు' మదరాను సెనేటు హాలులో శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి, చదలువాడ సుందరరామశాస్త్రి గారలతోపాటు మన ప్రసాదరావుగారికిని సువర్ణకంకణము, సాలువలు నొసఁగి గౌరవించిరి. ఈరీతి

నెన్నో సన్మానము లందిన ధన్యులీరు. ఈయన ఇష్టదేవతాప్రార్థన మిట్లున్నది.

సీ. వాసస్థలంబు లక్ష్మీసరస్వతుల శు
ద్ధాంత మైనట్టి సిద్ధాంతమనియు
జననంబు విద్యాయశశ్శ్రీగుణాకరం
బగు త్రిపురాన వంశాబ్ధి యనియు
వస్తుదేవీభాగవతముఁ దెల్గించి పెం
పెసఁగు తన్మాతురాట్కవీంద్రుఁ డనియు
నిత్యకృత్యము భవత్ప్రీత్యర్థమై సవ్య
కృతి పుష్పపూజలర్పించు టనియుఁ
జెప్పికొనుట కుత్సాహంబుఁ జెందఁ దగిన
యిట్టి యౌన్నత్య గరిమ నా కిచ్చినావు
వినతి సేయంగఁ దరమె నీ వినయ దమన
దక్ష సత్పక్ష కరుణా కటాక్ష మహిమ.

చ. కడుకొని యన్యులంగడుపు కక్కుతితిం జెయి సాఁపకుండఁ దాఁ
గుడువఁగఁ గట్టఁగా నొరులకుం దగఁ బెట్టఁగఁ జాలినంత మె
క్కుడుసిరు లిచ్చి దానఁ బ్రతికూల మదాది వికార చేష్టలం
బడి చెడనీక నీదుపదభక్తునిఁ జేసితి వింతయొప్పదే!

తిరుపతి వేంకట కవులు

1871-1919

1870-1950

(ఈజంటకవులలో మొదటివారు దివాకర్ల తిరుపతి శాస్త్రిగారు. రెండవ వారు చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారు. తిరుపతిశాస్త్రిగారిది వెలనాటిశాఖ. అభిజనము : ఎండగండి (కృష్ణామండలము); తల్లి : శేషమ్మ. తండ్రి : వేంకటావధాని. జననము : 1871 సం. నిర్యాణము : 1919. (వేంకటశాస్త్రిగారిది ఆరామద్రావిడశాఖ. జన్మస్థానము : ఏనాము [ఫ్రెంచివారిది]. నివాసము : కడియము.) తల్లి : చంద్రమ్మ. తండ్రి : కామయ్య. జననము 1870॥ ప్రమోదూత సంవత్సర శ్రావణ శుద్ధ ద్వాదశీ సోమవాసరము. నిర్యాణము : 15 ఫిబ్రవరి 1950 సం॥ శివరాత్రి పుణ్యదినమున. (విరచితగ్రంథములు : పాండవజననము, పాండవోద్యోగము, పాండవాశ్వమేధము, పాండవ రాజసూయము, పాండవ విజయము, పాండవ ప్రవాసము, ముద్రారాక్షసము, మృచ్ఛకటికము, ప్రభావతీప్రద్యుమ్నము, బాలరామాయణము [నాటకములు]. బుద్ధ చరిత్రము, లక్షణాపరిణయము, ఏలామహాత్మ్యము, శ్రీనివాసవిలాసము, దేవీభాగవతము, పతివ్రత, సుశీల, పూర్వహరిశ్చంద్రము, శివలీలలు, నానారాజసందర్శనము, శ్రవణానందము [పద్యకృతులు]. విక్రమాంక దేవ చరిత్రము, చంద్రప్రభాచరిత్రము, హర్ష చరిత్రము, [వచనగ్రంథ ములు]. గుంటూరిసీమ, గీరతము, శృంఖలాతృణీకరణము, పశ్యాం పుశ్యాం, పశ్యశబ్దవిచారము, శనిగ్రహము [విమర్శగ్రంథములు]. శతావధానసారము, గుంటూరు శతావధానము, పినపాడు శతావధానము, వేమవరాగ్రహార శతావధానము [శతావధానకృతులు] ఇత్యాదులు.

దోసమటం చెఱింగియును దుందుడుకొప్పఁగఁ బెంచినార మీ
మీసము రెండు బాసలకు మేమె కవీంద్రులమంచుఁ దెల్పఁగా
రోసముకల్గినం గవివరుల్ మముగెల్వుఁడు - గెల్చిరేని యీ
మీసము తీసి మీ పదసమీపములం దలలుంచి మ్రొక్కమే.

అని ప్రతినపట్టి కొన్నినా ళ్లాంధ్రకవితా సామ్రాజ్యము నేకచ్ఛత్రముగఁ బరిపాలించిన తిరుపతివేంకట కవులు జగమెఱిఁగిన బ్రాహ్మణులు. ఆంధ్ర దేశమున వీరి పేరు నెఱుఁగని యభిజ్ఞుఁడుండఁడు. అభినవాంధ్ర కవులలో వీరిని గురువులుగా భావించువారు వందలమీఁద నుందురు. తిరుపతి వేంకటకవుల శిష్యప్రశిష్యుల మని చెప్పుకొని గౌరవింపఁ బడువారు పెక్కుఱు. ఆంధ్రవసుంధరలో వీరు సందర్శింపని రాజాస్థానము లేదు. (ఆరంభదశలోఁ దిరుపతి వేంకటకవులు "తిరుపతి వేంకటేశ్వరు" లనియే తెలుఁగునాఁట వాడుక.) ఈజంటకవులే మహారాజును లెక్కసేయలేదు. "అనుభవించితిమి దివ్యభోగములను రాజాధిరాజులకన్న నధికముగను" – "ఏనుఁగునెక్కినాము ధరణీంద్రులు మ్రొక్కఁగ నిక్కినాము" అని చెప్పుకొనుచుఁ బ్రతిపట్టణము, ప్రతిగ్రామము తిరిగినారు; ప్రతిదాతను దర్శించినారు. వారిచేఁ దగినట్లు సన్మానింపఁ బడినసరే - లేనిచో సహజకవితా ధోరణినిమొగము వాచునట్లు తిట్టుఁబద్దెములు చెప్పుట, ఈ కవులు సిద్ధవాక్కులని వారువెఱచి పాదాక్రాంతులగుట పెక్కుచోట్ల జరిగినది. అనిదంపూర్వమైన వీరి యద్భుతశక్తి కబ్బురపడి యనేకకవులు 'శిష్యోఽహ' మ్మని చరణములఁ బడఁజొచ్చిరి. వీరి యవధాన ప్రతిభ నరసి తెనుఁగుమన్నీ లెందఱో బిరుదముల నొసఁగిరి; సాలువలుగప్పిరి; సన్మానములు చేసిరి; ఏనుఁగులపై నూరేఁగించిరి.

(తిరుపతికవుల జీవిత మొక మహాభారతము. ఇందే పర్వము పరిశీలించినను బ్రతిజ్ఞలుసేయుట, మీసములు దువ్వుకొనుట, ప్రతిపక్షులను బరిహసించుట, పద్మవ్యూహములు పన్నుట, వానిని భేదించుట, యెదిరి యెట్టివాఁడైన సాహసించి మీఁది కురుకుట–యివిచూతుము. ఈ భారతమునఁ గూడ .రాయబారముల రభసము, శతఘ్నుల చప్పుడుము, పాశుపతప్రయోగములు, అట్టహాసములు, తాలుకుట్టనములు కలవు. ఉద్యోగ

విజయములు, రాజసూయాశ్వమేధములు దీనిలోనివే. గీరతముకూడ నీ భారతములోనిదే. ఈ భారతసంగరమునకు 'గుంటూరిసీమ' కురు క్షేత్రము. వాగ్యుద్ధములవలనఁ దిరుపతికవుల యశశ్చంద్రికలు నలు మూలల వెల్లివిరిసినవి.) ఇంత నిర్లక్ష్యముగా మహారాజులను, మహా పండితులను ధిక్కరించిన తెలుఁగు కవులు శ్రీనాథాదు లేకొందఱో మనకు వినఁబడుచున్నారు.

సంగరశక్తి లేదు, వ్యవసాయము సేయుట సున్న, నంతలో
నంగడి వేసి యమ్ముటది యంతకుమున్న హుళక్కి మ ష్టికిన్
బొంగు బుజానవైచికొని పోయెద మెక్కడికేని ముష్టి చెం
బుం గొనిపెట్టు మొక్కటి యమోఘ మిదే కద, దంతిరాణ్ణృపా

మహారాజునుగూర్చి చేసిన యీ మందలింపులో నెంతయర్థము దాఁగి యున్నదో పరికింపుఁడు.

మ. అటు గద్వాలిటు చెన్నపట్టణము మధ్యం గల్గు దేశమ్మునన్
జటులస్ఫూర్తి శతావధానములు మెచ్చం జేసియున్నట్టి మా
కిట రా జీయక యున్న దర్శనము నింకెవ్వాని కీ రాజొసం
గుట ? చెప్పంగదవయ్య పాలితబుధా, కోదండరామాభిధా !

శ్లో. రాజా విద్వాన్ భవాన్ విద్వాన్ నహో భాగ్యం మహాకవేః,
అత్రాపి దర్శనం నోచే త్కావితాయై నమోనమః.

విజయనగరప్రభుని దర్శించుటకు వెళ్ళినపుడు, వారు సభ చేయింప సన్మానింపఁగా నపుడు దివాను కోదండరావుగారిని గూర్చి తిరుప కవులు వ్రాసిన పద్యము లివి. రాజసందర్శనము ధనాపేక్షతోఁగా పాండితీ ప్రదర్శనమునకే జేసికొన్నట్లు పలు పద్యములు విశదప చేయుచున్నవి. ఈ జంటకవులలోని యొకలక్షణము నానారాజసంద నమువల్ల నిట్లు తెల్లమగుచున్నది. అవసరమగునపుడు, దాత యె

నీచుఁడైనను వాని నింద్రుఁడుగా, చంద్రుఁడుగా స్తోత్రములు చేయుటయు, తిరస్కార భావము కనఁబఱచిన రసిక ప్రభువునైనఁ దృణప్రాయముగాఁ దీసివైచుటయు వీరికి సహజము. ఇందులకు వందలు నిదర్శనములు.

(వేంకటరామకృష్ణకవులతో, కొప్పరపుఁ గవులతో వీరు గావించిన వివాదములు భాషాచరిత్రములో శాశ్వతముగా నుండఁగలతీరున నున్నవి.) గిరతము, గుంటూరుసీమ చూచునది. ఆ ప్రతిజ్ఞలు బహు భయంకరములుగ నుండును

శా. అంతుల్ మానఁడు తిర్పతిద్విజుఁడు నీరంధ్రా వివేకాన్విత
స్వాంత భ్రాంత నిరంతరానృత వచః ప్రక్రాంత దుష్కల్పనా
ధ్వాంత క్రాంత కుకావ్య నవ్యరవి దీవ్యద్భవ్య తేజోంచితా
హంతా దంతుర వాక్ప్రణాళికల నీహమ్మాన్యు కేనాటికిన్.

శా. అంతుల్ మానఁడు తిర్పతి ద్విజుఁడు పర్యాయాద్భుతానేక సా
ధ్వంతేవాసి కృతావధాన సమయ వ్యాఖ్యాన విఖ్యాపితా
శాంతస్థాయి యశః ప్రసూన కవితా సౌందర్య గాజద్గళో
పాంతుఁ డేశికుఁగూర్చి వ్రాసిన యసత్యాల్ మాన్పు కేనాటికిన్.

శా. 'రాఫుల్ వీఁడు' మటంచు మిణ్కెడవు ధీరమ్మన్యుని న్నిన్ను దు
ర్వ్యాపారుఁ సభలోని కీడ్చి భవదార్ధబాపవాదానృతా
లాపంబుల్ మ్మదలంటఁ గాల్చి వయి వాలాయంబు శిక్షించి నీ
పాపం బూడ్చి నతుల్ గ్రహించునఁట! తత్ప్రాగల్భ్య మూహించితే!

శా. 'రాఫుల్ వీడఁడు వేంకటాచల' మసారస్ఫార ఘోరానృతా
లాపాంతేవస దాన్య కిర్కట విశాల శ్వభ్ర దుర్ద్వార్బహిః
ప్రాపత్తృష్ణారతరా విలాంబు పృష దావత్ప్రాపకాత్మీయ వా
గ్రూపాసార పరంపరా విభవముల్ గుప్పింప కేనాటికిన్.

శా. 'డంబాల్ మాను' మటంచు మిణ్కెడవు ప్రౌఢమ్మన్యతాదోషమూ
ఢుంబైనట్టి భవన్మనంబునకు ప్రీడం బుట్టఁగాఁ జేయ ని

న్నం బాండిత్య నిధాను లుండు సభయందుం బట్టి రెట్టించి గ
ర్వంబున్నాన్ని యనుగ్రహించునఁట! తద్వాత్సల్య మూహించితే?

తిరుపతిశాస్త్రిగారు వెలనాఁటివారు, వేంకటశాస్త్రిగా రారామ ద్రావిడులు నైనను నేకోదరులవలె మెలంగుచుఁ బరస్పరసహకారముతో నవధానములు, ఆశుకవితలు, ఆకాశపురాణములు ప్రదర్శించుటచే వీరి పేరు త్వరలోఁ బ్రశస్తికెక్కినది. (అవధానకళకు గౌరవము తెచ్చినవారు, చులుకదనము కల్పించినవారును దిరుపతి వేంకటకవులే.) వీరికిముందు మాడభూషి వేంకటాచార్యులు, అంతకుమిక్కిలి ముందు రామరాజభూషణుఁడు మున్నగువారు శతలేఖినీ గ్రంథసంధానచాతురికలవా రున్నను, వారెవ్వరును దిరుపతి వేంకటకవులవలె జంటకవులుగా నుండి యవధానములు చేసినవారు కారు. పిఠాపురసంస్థాన కవులయిన దేవులపల్లి సోదరులును, వేంకటరామకృష్ణులు, అత్యద్భుతావధాన కవితా ప్రదర్శనముల గావించియున్నను తిరుపతికవుల తీరున నవధానవిద్యను జగద్విఖ్యాతము చేసినవారుకారు. రాయలకాలమున నంది మల్లయ్య, ఘంట సింగయ యను జంటకవులు ప్రబంధరచనము చేసిరి. వారవధానము లొనరించి యుండిరో, లేదో చెప్పఁజాలము. "జగదాశ్చర్యకరావధాన కవితాసంపత్తి" ఒక్క తిరుపతివేంకటకవియుగళమునకే తక్కినది.)

'గోణము కట్టుటాది' వేంకటశాస్త్రిగారికిఁ గవితాభిలాష యుండెడిది. ప్రఖ్యాత శాస్త్రపండితులు చర్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి యొద్ద నీ జంటకవుల వ్యాకరణాధ్యయనము. ఇరువురును మహామేధావులుగాన నచిరకాలములో నాభాష్య మధికరించిరి. దేవీభాగవతము నందు గురుస్తుతి యిట్లున్నది.

సీ. అఇఉణ్ మొదలుగాఁగ నాభాష్యపర్యంత
మే మహామహుఁడు మాకిచ్చె విద్య

కన్న సంతానమ్ముకన్న నెక్కుడుగాఁగ
నే దయాళుండు మమ్మాదరించె
పెండ్లి పేరంటముల్ ప్రియ మెలర్పఁగఁజేసి
యే గుణనిధి మమ్ము బాగుచేసె
తిండికై యిల్లిల్లు దిరుగనీయక యన్న
మేయన్నదాత మాకింటనిడియె

గీ. సకలదిగ్దేశ రాజన్యసభలయందు
దంబుమీఱ శతావధానం బొనర్చి
నిర్వహింపఁగ నెవ్వఁ డాశీర్వదించె
నట్టిగురునకుఁ గృతియిచ్చు టర్హమకద!

(బ్రహ్మయ్యశాస్త్రిగారికీర్తి పరమశాశ్వతము చేసిన శిష్యులు తిరుపతి వేంకటకవులే.) ఇదియటుండ, తిరుపతి కవులకే పరస్పరము శైష్యో పాధ్యాయికయున్నది. వయోధర్మముచే 'వేంకటతిరుపతికవులు' కావల సిన వారు వీరు. తిరుపతికవికంటె వేంకటశాస్త్రిగారు ఒక సంవత్సరము ముందు పుట్టినవారు. సహపాఠిదశలోఁ దిరుపతి శాస్త్రిగారికి బద్యలక్ష ణములు వేంకటశాస్త్రిగారే చెప్పినట్లు స్పష్టము. ఈ పద్యము దానికిఁ దారకాణ.

వితతాత్మీయ శతావధాన కవితా విద్యావయోరాశి, సం
భృత శిష్యాంబుద వాఙ్మయామృత రసప్రీతాఖిలాంధ్ర క్షమా
ధృత రజ్యద్రసికావతంసకృత వందిస్తోత్రమాలా విభూ
షితు మా వేంకటశాస్త్రి నేఁ బొగడెదన్ శిష్యస్వరూపంబునన్.

(తిరుపతికవి యప్రతిమానమైన పాండితీ ప్రతిభయుఁ జెళ్లపిళ్లకవి యసాధారణమైన మేధాబలమును బలసి తిరుపతి వేంకటేశ్వరులను దెలుఁగుకవులలో నగ్రేసరుల నొనరించినది. తిరుపతి లేనిదే వేంకటేశ్వ

రుఁడు లేఁడు. వేంకటేశ్వరుఁడు లేనిదే తిరుపతిలేదు. ఈ జంటపేరులిట్లు కుదురుటయే వీరిఘనతకుఁ గారణమని చెప్పవలయును. ఎక్కడవినినను వారిపద్యములే. ఎక్కడఁజూచినను వారిశిష్యులే. ఏ ప్రాంతమునఁ దిరిగిన వారియుపధాన ప్రశంసలే. "తిట్టుల్ తిట్టితిఁ దిట్టుఁబెంబడితి" నని యనేకుల హుంకరించినారు. అనేక పండితులను గద్దించినారు. "అటు గద్వాలిటు చెన్నపట్టనము మధ్యంగల్గు దేశమ్ము" నొక యూఁపూఁపి నారు. వేరి కాశీనాథశాస్త్రి వంటి యుద్దండపండితుల 'సబ్బా' యని పించినారు. మహామహోపాధ్యాయులు సైతము మర్యాదగాఁ దప్పించుకొని తిరుగుచుండెడివారు. అది కేవలము వారిశాస్త్రపాండిత్యము నకు జంకియనుటకు వీలుగాదు. తిరుపతికవులు సంస్కృతాంధ్రము లలోఁ బెద్దపాండిత్యము కలవారేమైనను శాస్త్రేతరములందుఁ బ్రత్యేక కోవిదులైన మహామహులను గూడ మాటాడనీయక పోవుట మాత్ర మాంధ్రలోకమున కాశ్చర్యావహమైనది.)

(తిరుపతిశాస్త్రిగారు ప్రాచ్యపాశ్చాత్య భాషలయందు విద్వాంసులైన పోలవరము జమీందారు శ్రీ కొచ్చెర్లకోట వేంకటకృష్ణారావు బహద్దరు వారికడ నిలయవిద్వాంసులుగా నుండిరి. కొన్నివత్సరములు వారియొద్ద గౌరవవేతనముఁ బడయుచు ననేకభంగుల సన్మానింపఁబడిరి.) ఇంతలోఁ గాల మీ మహాకవిని మ్రింగివైచినది. తిరుపతిశాస్త్రి యస్తమయము చెళ్లపిళ్లకవి హృదయమునకుఁ బట్టరాని కష్టపాటు కలిగించినది. ఇరువురు నభేదముగా సంచరించిన సోదరులు. వేంకటకవి దివాకరాస్తమయ మును గుఱించి యిటులు పలవించెను.

నాకన్న ధీబలమ్మున
నే కాదు తనూబలమున నెంతయు హెచ్చౌ
లోకస్తుత్యుఁడు తిర్పతి
నా కన్నన్ మున్నె యెట్లు నాకము ముట్టెన్.

వేఁబది దాఁటెరా, కతని కేఁబది కింక నెలల్ కొలంత నా,
ల్గా బుధమాన్యుఁ డిందనుక నాఁగక సల్పె శతావధాన, మే
నో బహుకాలమై యొకట నుండియు నాతని చేతియూఁతఁ బ్ర
జ్ఞా బహుళావధానపుఁ బ్రసంగము లీర్చుచునుంటి నెట్టులో

(ఈ జంటకవుల సౌహార్ద మిట్టిది. "ఒక్కరు రచియించిరేని నది కాదగు దిర్పతి వేంకటీయమై" అను మాటలో సంతర్వ్యాపించిగా వీరి సౌభ్రాత్రము వెల్లివిరియుచున్నది. తిరుపతి కవి నిర్యాణమున కిటీవల వేంకట శాస్త్రిగారు పెక్కు కృతులు రచించినారు. అవన్నియు జంటపేళ్ల తోడనే ప్రచురితములగుట యొక మహాదర్శము.)

చెళ్లపిళ్ల కవి కవిత్వపుఁగడను. అనగా, ఆయన నిలువెల్లఁ గవిత. పండు వయస్సులో నాయన కలము కొన్ని వేల గద్యపద్యములఁ సృష్టించినది. వ్యాసునివలె వ్రాసినది తుడుచుట యాయన కలవాటులేదు. కడకాలమున విజయవాడ గవర్నరుపేటయందలి యద్దెయింటఁ గుక్కిమంచముపై కౌపీనధారియై పరుండియుండెడి యా జరఠమూర్తి నెందఱో దర్శించి పోవుచుండెడివారు. ఆయన మెట్టిన ప్రదేశమే యొక దివ్యతీర్థము. మనసు వచ్చినచో వచ్చినవానిని బలుకరించును; లేనిచో బలుకరించుట కూడ నుండదు. వచ్చినవాఁడు వచ్చి కవిగారి చరణములు కనుల కద్దుకొని చక్కఁబోవును. ఆ యాగంతుకున కదే పదివేలు. యౌవనములో వేంకట శాస్త్రిగారి యుపన్యాసవాణి మేఘవాణి. ఆయన సభలో నుపన్యసించు నపుడు వేనవేలు విఱుగఁబడి వినవలసినదే. యౌవనములోనే కాదు, షష్టిపూర్తి దాటిన తరువాతఁ గూడ వారి కంఠస్వరములోని ఝంకారము, మాధుర్యము సడలలేదు. ఎంతవానినైన నప్పటి కప్పుడు ముఖపిధానము సేయు శక్తి యాయనలో గొప్పగా నుండెడిది. వీరి ప్రతి పదము ధ్వనిపూరితము. వీరి పేరు విని బందరునందలి యున్నత పాఠశాల పండితులుగా దయచేయుఁడని యాహ్వానించినది.

అక్కడ పదునైదు సంవత్సరములు తెలుఁగుపండిత పదవి-ఆసందర్భమున ననేకులు వీరి చేతిలోఁ గవులైరి. విశ్వనాథ సత్యనారాయణ ప్రభృతు లావిధముగా శిష్యులు. తిరుపతి కవుల శిష్యులము, విశేషించి వేంకట శాస్త్రిగారి శిష్యుల మనువారిలో అవ్వారి, వేటూరి, వేలూరి, కాటూరి, పింగళి కవులు ముఖ్యులు. బందరు వేంకట శాస్త్రిగారిని బ్రహ్మరథము పట్టినది. 'కృష్ణ' వీరి పలుకు విని పొంగిపోయినది. 1933 సంవత్సరమున బందరు పౌరుల ప్రోత్సాహమునను, కవిశిష్యుల యభినివేశమునను శాస్త్రిగారికి జరిగిన షష్టిపూర్తి సన్మానము చరిత్రలో రమణీయము, నవిస్మరణీయము నయిన ప్రధానఘట్టము. ఆ సుసమయమున వీరి శిష్యప్రశిష్యు లనేకులు కావ్యోపహారము లర్పించి ధన్యులైరి. ఆ దివ్యమహముననే —

పుడమిఱేఁడులు తల లడుగులు మోవంగ
　　నర్పించు కానుక లందువాఁడు
అత్యద్భుతంబైన యవధానవిద్యకుఁ
　　బ్రభవకారణమైన ప్రతిభవాఁడు
వీనుదోయికిఁ దేనె సోనలు వర్షించు
　　వాఙ్మాధురికిఁ బేరు వడినవాఁడు
చిననాఁడె వలచి వచ్చిన కవితాకన్య
　　నేకపత్నిగఁ జేసి యేలువాఁడు
పూర్ణకాముండు త్యాగియు భోగియైన
గురుని ఋణ మీఁగుపొంటె నీ చిఱుతకబ్బ
మర్హత గడించుకొనుఁగాక యాంధ్రవాణి
కడకనుల జాల్కొను ప్రసాదకణ లవాప్తి.

అని గురుదక్షిణగా 'సౌందరనంద' కావ్యము పింగళి కాటూరి కవి యుగళముచే వేంకటశాస్త్రిగారి కర్పింపఁబడినది. ఆ షష్టిపూర్త్యుత్సవము తెలుఁగువాణి కొక యుజ్జ్వలాలంకారము. ఇది యననేల? తిరుపతి

వేంకటకవులు తెలుఁగు భూమిలో నొందని సన్మానము లేదు. (కృష్ణా పత్రికాధిపతులన్నటులు 'వీరి కవిత్వము ప్రాచీనకవితకు భరతవాక్యము. నవీనకవిత్వమునకు నాంది. వీరికవిత్వమందెచ్చటఁ జూచినను సౌకుమార్యము పౌరుషము జీవము గోచరించుచుండును. ఈ విలక్షణములే యాంధ్ర దేశమున శిష్య సహస్రముల వెదచల్లినవి. వీరిరచన లెక్కవగ వీరి జీవితమునకు సంబంధించిన వగుటచే నా కవిత్వ మాత్మగౌరవమును బ్రతిష్ఠించు కొనినది. ")

ఈ శతావధానుల సారస్వత సమారాధనము 1949 సంవత్సరము నాఁటికి సంపూర్ణముగాఁ బండి, మదరాసు ప్రభుత్వముచే నిండుగా గుర్తింపఁబడినది. (శ్రీ) వేంకటశాస్త్రిగారిని మదరాసు దొరతనవుఁ బ్రథమ సంస్థానకవిగా గౌరవించుటలో భేదభావ మెవరును జూపకుండుట తిరుపతికవుల వాఙ్మయసేవ కొక విజయధ్వజము. తనయూరు దాఁటక యావత్ప్రభుత్వమును, యావత్కవిలోకమును విజయవాడకు రప్పించుకొనిన (శ్రీ) శాస్త్రిగారి వార్ధక (శ్రీ) తెలుఁగు దేశమునకు గర్వాభరణము. ఏమహాకవిని నిట్టితీరుగా దేశము సన్మానింపలేదు. శిష్య ప్రశిష్యులు బ్రహ్మరథము పట్టిరి. మదరాసు ప్రధానమంత్రులు, మంత్రులు, విశ్వవిద్యాలయాధికారులు, మహాపండితులు, కవులు పరివేష్టించియున్న నాఁటి సన్మాన సభావృత్తాంతము సారస్వత చరిత్రములో నొక దివ్య ప్రకరణము. రాయలసీమనుండి వచ్చిన గడియారము వేంకటశేష శాస్త్రిగారు నాఁడిటులు ప్రశంసించినారు.

జయమేపార శతావధాన కవితా సామ్రాజ్యపీఠంబు న
చ్ఛయశోమూలముగాఁగ నేలిన మహాసారస్వత జ్యోతి రు
చ్ఛయమా వేంకటశాస్త్రి యాంధ్రకవితా స్థానిప్రభుండయ్యె, న
న్నయ తిక్కన్నల నాఁటి వైభవము లీనాఁడయ్యె వాగ్దేవికిన్.

* * * * *

కవిసభ లిచ్చు గౌరవముగా దిది, యొక్క-నృపాలుఁ డిచ్చు గౌ
రవమునుగాదు, కావ్యరసరంజిత భావుక యావదాంధ్ర గౌ
రవమ. ప్రజాప్రభుత్వము కరమ్మున వేంకట శాస్త్రిగారికీ
నవ వరణ ప్రజ మ్మిది యనన్య మపూర్వముగాదె తెన్గునకీ.

(కవి సాధారణులు వలెఁ గాక "కవనార్థ మ్మదయించితిన్; సుకవితా కార్యంబె నావృత్తి; మద్భవ మద్దానఁ దరింతుఁ; తద్భవమ మద్భాగ్యంబు......" అని చెప్పుకొన్న మహాత్ముఁడు చెళ్ళపిళ్ళకవి. వ్యావహారిక భాషలో నాయన చివరికాలమున రచించిన వివిధ వ్యాసముల బండ్లఁ దోలవచ్చును. అవన్నియుఁ గలిపి వెలువరించిన చో 'విజ్ఞాన సర్వస్వము' పునరుద్ధరించినవార మగుదుము. అందుఁ గొన్ని రచనలు 'కథలు, గాథలు' గా నచ్చుపడుచున్నవి. వేంకటశాస్త్రిగారి వ్రాఁత యైన, నువ్వ్యాసమైన నొకరకముగానే యుండును. విషయాంతరము లోనికి తఱచు దాటుచున్నను, ఎక్కడికక్కడ హృదయంగమముగా నుండునట్లు వ్రాయుటలో, మాటాడుటలో వారిని మించిన వారు లేరు. ఆయన యేమిమాటాడిన నది ధ్వనికావ్యము. వేయేల! ఆయనయుచ్ఛ్వాస నిశ్వాసములు, ఆయనపాడుముపట్టులు, ఆయన పొన్నుకఱ్ఱపట్టులు మహాకావ్యములుగా నైనవి. పద్యములు పఠించుటలో చెళ్ళపిళ్ళకవి దొక క్రొత్తతీరు. ఆయన ననుకరించి మొందటో నేఁటికందముగాఁ బద్యములు చదువుచుందురు. ప్రతివిషయమునను తనదొక ప్రత్యేకత యున్నటులు వేంకటశాస్త్రిగారు ప్రదర్శించినారు. ప్రభుత్వ సంస్థానకవి పదవీప్రదాన సందర్భములో వారుచెప్పినపద్యములు మహోదాత్తములై శాస్త్రిగారి సర్వహృదయమును దాఁచిపెట్టుకొని యున్నవి.

శా. న న్నాస్థాన కవీంద్రుఁజేసితి; విఁక న్నా కాయురారోగ్య సం
పన్నత్వంబు నొసంగుటన్నది క్రమప్రాప్తంబ, నా యీడువా

రున్నారెందఱో విజ్ఞులల్ల ఘనులం దొండొక్క రాస్థానమం
దున్నన్ దేహబలంబుఁ గోరుదురె? నిన్నో తల్లి ! కామేశ్వరీ!

మ. పదొకండేడులపైని రెండిపుడు నాప్రాయంబు, నాబోటికిన్
గదిలోమంచమె యెల్లలోక మగుచున్ గాలమ్ము వెళ్లించు వృ
ద్ధు దయార్ద్రంబగు దృష్టిఁజూచి యిడితేదో గొప్పదౌగద్దె నా
కది భుక్తంబగుదాఁక నాయువిసుమం చర్థింతుఁగామేశ్వరీ!

మ. అనుకంపామృతవృష్టి నించినను నీ వాస్థాన విద్వత్కవీం
ద్రుని గావించితి; నేను తత్పదవియందున్ గూరుచుండంగ నే
ర్తునె మందిచ్చితి, తేనెఁగూడ నిదునుందున్నిన్ని యాదృగ్విప
శ్చనులున్ మాదృశరుగ్ణులుం గలరుసూ, కల్యాణి, కామేశ్వరీ!

శా. సన్మానిసిన్ వరుఁజేయుచో నెరవెకా సర్వంబునా కిఫ్ఫు వి
ద్వన్నేతల్ కవులేలఁగాఁదగిన "ఆస్థానంబు" నీఁజేసి తీ
యౌన్నత్యంబున కిమ్ము దీర్ఘతరమౌ నాయుష్య మట్లిచ్చుచో
నిన్నున్ మెచ్చు జగమ్ము లిట్టివరమున్నేఁ గోరఁ గామేశ్వరీ!

మ. ప్రతిసంవత్సర మింకనాకిఁకఁ బ్రజారాజ్యంబు వేయారు లు
న్నత ముద్యోగముచేసి వాసిమెయిఁ "బెన్షన్" గొన్నబల్మేటికిన్
భృతకంబిచ్చు విధాన, దీనికి భవ్రత్పేమమ్ము తోడౌచు దీ
ర్ఘతరంబాయు వొసంగఁగావలె కృపార్ద్రా! తల్లి కామేశ్వరీ!

శా. ఆయుర్దాయము మూఁడు భాగములుసేయన్ దాన 'ఎన్‌ధర్డు' బో
సేయంగా మిగిలెన్ శరీరము కడున్ జీర్ణించి శుష్కించె; శే
షాయుర్దాయము భోజ్యమౌట కడుగడ్డౌ తోఁచుఁ ద్వత్సన్నిధి
స్థాయింగా నొనరింపు మేమిటికిఁకన్ జాలంబు కామేశ్వరీ!

శా. కౌపీనంబుధరించి యీ సభకునేఁగ న్నన్ను వీక్షించిఁ రౌ
హౌ పారుం డిటుమాటే నే! వయసుచే నొండొక్కరుండయ్యె వా

గ్వ్యాపారమ్మును మాటితీరుననుచున్ గారుణ్యమొప్పార నా
వైపే చూతురు పంపుమమ్ము సభకున్ వందింతుఁ గామేశ్వరీ !

మ. కవులెల్లన్ జయపెట్టు వైభవ మొసంగన్ లేదొ తచ్ఛిష్యవ
ర్గ విభూతిన్ గరుణింపవో తనుజను ర్భాగ్యంబు గై సేయవో
నివిద్ధైశ్వర్యము లిచ్చితింక నొకటే విశ్వేశి ! నీసన్నిధిన్
గవిగానుండ ననుగ్రహింపు మిదియే కామ్యంబు కామేశ్వరీ !

శ్రీ వేంకటశాస్త్రిగారి కామేశ్వరీభక్తికీ పద్యములు నిదర్శనములు. ప్రభుత్వసంస్థాన కవితాపదవికి మెఱుఁగుపెట్టిన శాస్త్రిగారు, ఆపదవి వచ్చిన కొలఁదినెలలకే పరమపదమునుఁ జేరుట మనదురదృష్టము. ఆంధ్ర సారస్వతారామమున వసంతశోభతో వెలుఁగొందిన వసంతరేఖ యస్తమింపఁగా, ఆయన శిష్యుఁడు పింగళి లక్ష్మీకాంతకవి పాపము ! ఎట్లు వగచెనో కనుఁడు.

మరలఁ దిరుపతి వేంకటేశ్వరులజంట
కలిసి, ముప్పదియేండ్ల పై కాలమునకు
సాగఁగలదింక దిక్పాల సభలయందు
అద్భుతావహ శతావధానాంధ్ర కవిత.

* *

మాగురుం డిప్డు దిగిన వాఙ్మయపుగద్దె
యుర్వి ననధిష్ఠితంబయి యుండఁగలదు ;
ననభిగమ్యము నప్రధృష్యమ్ము నగుచు
విక్రమార్కుని సింహాసన క్రమమున.

* *

ఈజంటకవుల కావ్యములలో "బుద్ధచరిత్రము" చక్కనిపాకమునఁ బడినది. వీరి దేవీభాగవతముతో పాటు బుద్ధచరిత్రయు సారస్వత లోకమున స్థిరముగా నుండునని చెప్పవలయును. తిరుపతి కవుల కావ్య

ములకంటె, వారినిగూర్చిన గాథలు, వారు చెప్పిన చాటువులు, వారి వీరాలాపములు, వారి చమత్కార సంభాషణములు దేశములో నిలిచి పోఁగలవు. కవితకు జీవితమునకు భేదము లేదని నిర్ధారణము చేసినవా రొక్క తిరుపతి కవులే. ఈ జంటకవుల జీవిత - కవితా మాధుర్యములు పడుగుపేకల వలె విడదీయరానివై కలసియున్నవి. వీరు ప్రాచీన ప్రబంధ ధోరణి వీడి నవ్యమార్గములో వర్ణనాదులు కావించిరి. శ్రవణానందాదులలోని శృంగార వర్ణనములు కొంత హద్దుగడచి నటులు కనఁబడును. కాని, నాఁడవి రసవంతముగానే యగపట్టినవి. "రాజులెల్లరును భార్గవరాములే యన్నఁ దేజంపుఁబెంపు నుతింప వలెనె, కోమటులెల్ల జక్కులరాజులే యన్న నైశ్వర్యముల పెంపు లడుగ వలెనె ....." ఈ మొదలగు వర్ణనములు పూర్వవాసనా వాసితములు. ["మనవమా! వద్దిక నాదుమాట వినుమా మర్యాద కాపాడుమా!" మున్నగు పద్యములకుఁ దెలుఁగుదేశమున నాశనము లేదు;

('వ్యాకరణ మొకత్రోవ, మహాకవి లోకత్రోవ' యని చెప్పి తిరుపతి కవులు వ్యాకరణబంధములు నిరంకుశులై సడలించి గిఱుగువారి వాదమున కాదరువులిచ్చిరి. ఈ కవకవుల జీవనజ్యోతి సర్వాభినవ కవిరక్ష, వారి పద్యములు సర్వము శిష్య ప్రశిష్యద్వారమున లోకమెల్లెడ వ్యాప్తములై యచ్చులో లేకున్న, అయిదాఱు శతాబ్దులదాఁక నశింపని స్థితిలో నున్నవి. పాండవనాటకములు, శ్రవణానందము, మఱికొన్ని చాటువులు పారాయణము చేసికొనువారు చాలమంది కలరు.) ఈక్రింది పద్యములు మఱచిపోలేము.

శతఘంట కవనమ్ము సల్పుసంగతి యన్నఁ
"గరతలామలకమ్ము" గాదె మాకు
అష్టావధాన కష్టావలంబన మన్న
"నంబి కొండయ దండనంబు" మాకు

ఆశుధారా కవిత్వా డంబరంబన్న
"నల్లేరుపై బండి నడక" మాకు
సత్కావ్య నిర్మాణ చాకచక్యం బన్న
"షడ్రసోపేత భోజనము" మాకు
వ్యర్థమగువాదము లొనర్చు నట్టి వారి
డంబ మణఁగించు టాపోశనంబు మాకు
దాన రాధేయ! కవిసముదాయ గేయ!
పండితవిధేయ! రామభూపాలరాయ!

* * *

అభినవరామలింగ బిరుదాంకుఁడ నాకవనమ్మునందు నీ
యభణాప్పుఁ గాండ్లు తప్పు లిడ నర్హులె? కాదని తప్పు దిద్ద మా
యుభయులలోన నొక్కఁడు మఱొక్కనికిం దగుఁగాక యీర్ష్యచే
నభము శుభమ్మనుం దెలియ కార్చెడి దేబెలు మాకు లెక్కయే ?

* * *

ఏనుఁగు నెక్కినాము ధరణీంద్రులు మ్రొక్కఁగ నిక్కినాము స
న్మానము లందినాము బహుమానములన్ గ్రహియించినార మె
వ్వానిని లెక్కపెట్టక నివారణ దిగ్విజయం బొనర్చి ప్ర
జ్ఞానిధులంచుఁ బేరుగొనినారము నీవలనన్ సరస్వతీ !

* * *

నవ్యకవితావతరణమునకు భగీరథులై, ఆంధ్ర సారస్వతమున కొక యపూర్వపు వెలుఁగు కలిగించిన తిరుపతి వేంకటకవులు బాలకలానిధులు, బాలసరస్వతులు, కింకవీంద్ర ఘటాపంచాననులు, కళాప్రపూర్ణులు, శతావధానులు, శాశ్వతులు.

వేంకట రామకృష్ణ కవులు

1883-1939
1889-1918

మొదటివారు ఓలేటి వేంకటరామశాస్త్రిగారు. రెండవవారు వేదుల రామకృష్ణశాస్త్రిగారు. వీరు మేనత్త మేనమామ బిడ్డలు [వేంకటరామశాస్త్రి తండ్రి రామకృష్ణశాస్త్రి మేనమామ. రామకృష్ణశాస్త్రి తల్లి వేంకటరామశాస్త్రికి మేనత్త] ఆరామద్రావిడశాఖీయ బ్రాహ్మణులు. మొదటికవి జన్మస్థానము : పల్లిపాలెము [కాకినాడతాలూకా] తల్లి : కామేశ్వరమ్మ. తండ్రి : నారాయణశాస్త్రి. జననము : 15-11-1883 సం॥ అస్తమయము : 3-12-1939 సం॥ రెండవకవి యభిజననము : కాకరపఱ్ఱు [తణుకుతాలూకా] తల్లి : సూరమ్మ. తండ్రి : రామచంద్రశాస్త్రి. జననము : 1889. నిర్యాణము 1918. ఈ జంటకవుల నివాసగ్రామము పిఠాపురము. విరచితగ్రంథములు :- వ్యాసాభ్యుదయము, దమయంతీ కల్యాణము [అచ్చతెనుఁగు కావ్యము] పిశ్వగుణాదర్శము, ఉత్తరరామచరిత్ర, మదాలస, దమయంతి, ఇందిరాదేవి, శకుంతల, సుభద్ర, భోజచరిత్ర, కాత్యాయనచరిత్ర, కవికంఠాభరణము, సువృత్తితిలకము, పాణిగృహీతి, కొండవీటి దండయాత్ర, అత్యద్భుతశతావధానము, శతఘ్ని, అట్టహాసము, పరాస్తపాశుపతము, రామకృష్ణమహాభారతము, ఆంధ్రకథాసరిత్సాగరము [6 లంబకములు] ఇత్యాదులు.

ఆంధ్రభోజుని యాస్థాన విద్వత్కవులగు వేంకట రామకృష్ణ కవుల కవితాప్రతిభ, విమర్శనశక్తి తెలుఁగువారికిఁ దెలిసియే యుండును. 1909 సంవత్సరమున రామకృష్ణులు పిఠాపురసంస్థానముఁ బ్రవేశించిరి. నాఁటికి వేంకటరామశాస్త్రిగారి వయస్సు ఇరువదియాఱు వత్సరములకు మించదు. రామకృష్ణ శాస్త్రిగారికిఁ బదునెనిమిదేండ్లు దాఁటినవి. సంస్థాన ప్రభువులు శ్రీ రావు వేంకట కుమార మహీపతి సూర్యారాయేంద్రు లీ కవకవుల బుద్ధి చాకచక్యమునకుఁ, గవితాధోరణికి నానందపడి యవధానవిశేషములఁ గాంచుట కనుమతించిరి.

ఏ సుముహూర్తమున నీ జంటకవులు ప్రభుపురకంటఁ బడిరో యపుడే శ్రీవారి యనుగ్రహాంకురము రామకృష్ణుల యభ్యుదయ క్షేత్రమునఁ బడినది. దిగ్దంతులవంటి పండితులప్రోల నా మహాస్థానమంటపమున సత్యద్భుతావధానము సేయునపుడు రామకృష్ణుల లీలలు పలువుర కానందాశ్చర్యములు కలిగించినవి. మహీనాథుఁ డవధానానంతరము మూఁడు నూటపదియార్లు పట్టుసాలువలతో బహూకరించి యా కవులను దమ సంస్థానిలో నుండఁగోరెను.

పిమ్మట సత్యద్భుత శతావధానము, శతవిధానము [గంటకు నూఱుపద్యములు చెప్పుట] శతప్రాసము [ఒకేప్రాసముమీఁద నూఱు పాదములు గంటలోఁ జెప్పుట] అష్టావధానము మున్నగువానిచే మన కవులు మహారాజు చిత్తమును మఱింత రంజింపఁ జేసిరి. శతప్రాసము చెప్పుసందర్భమున "...ఇట్లీరవురుఁ గొన్ని పాదములనే మును గబ్బము తాత సెప్ప న, బ్బురపడి తత్సభాస్థలిని బోరన గద్దియ డిగ్గి గండ పెం, డేరము సు గృష్ణరాయఁడు శ్రీ డొగ్గె న్నృపపుంగవ!..." అని యభిప్రాయగర్భముగా నెట్లు చెప్పిరో పరికింపుఁడు.

వేంకటరామకృష్ణులు పిఠాపురసంస్థానమునకుఁ బోవుచున్నటు లింటి యొద్దఁ బెద్దవారి కేరికినిఁ జెప్పనేలేదు. పట్టుసాలువలు కప్పుకొని సింగపుఁ బిల్లలవలె వచ్చుచున్న యా యువకవులఁ గని తలిదండ్రు లానందభరితు లైరి. గ్రామస్థు లాశ్చర్యకలితు లైరి. ఈ జంటలోఁ దొంటికవి ఓలేటి వేంకటరామశాస్త్రి, ద్వితీయుఁడు వేదుల రామకృష్ణశాస్త్రి. వీరు మేనత్త మేనమామ బిడ్డలు. వీరిని స్మరించునపుడు నంది మల్లయ, ఘంట సింగన జ్ఞప్తికి వత్తురు. జంటకవులలోఁ దిరుపతి వేంకట కవుల పేరు లెటులు కుదిరినవో రామ కృష్ణ కవుల నామము లట్లు సరిపడినవి. ఈ కవికోకిల యుగళము పిఠాపుర ప్రభుని ప్రోల మధురకంఠము లెత్తి యిట్లు పాడినది.

భోజసమానున ర్థి సురభూజునిఁ జూచితిరే? పిఠాపురీ
రాజు నతండు మిమ్ముఁ గవిరాజుల నట్లు బహూకరించె? నం
చోజను గోరువారికి సదుత్తర మిచ్చి తదాననంబులం
దేజరిలంగఁ జేసెడుగతి స్సుము నీవును గారవింపుమా!

* * *

అక్షరలక్ష లిచ్చునృపుఁ డట్టి కవీంద్రులు కానరా రటం
చి క్షితివారలెల్ల వచియించెడు సుద్దుల నాలకింతె హా
ర్యక్షపదృక్ష! నీవును దిరంబుగ నేమును గక్షగట్టి ప్ర
త్యక్షము సేయఁబూనెదమె? తత్సములం గవుల న్నరేంద్రులన్.

* * *

ధారణతప్పరాదు, కవితారసమాధురి పోవరా, దలం
కారము లేగరాదు, కనఁగా నపశబ్దము లుండరాదు వా
గ్ధోరణి యాఁగరాదు తమతోడఁ బ్రగల్భములంట గాని, యె
వ్వారికినైన నిట్లు నొడువంగలవార మనంగఁ జెల్లునే?

వీరు పిఠాపుర సంస్థానమునఁ బ్రవేశించిన వెనువెంటనే సుప్రసిద్ధులైన తిరుపతి వేంకటకవులతో వాగ్యుద్ధము తటస్థించినది. రామకృష్ణకవులు వయసునఁ బసివారయ్యును నా కవుల కృతులలోని దోసములు బయటఁ బెట్టి 'శతఘ్ని' యను ఖండన గ్రంథము ప్రకటించిరి. 'శతఘ్ని' శక్తి నాఁడు పెద్దపండితులను గూడఁ దల లూఁపించినది. ఈ సాహిత్య సమరముననే రామకృష్ణ భారతము, పాశుపతము, అట్టహాసము, శృంగభంగము, కోకిలకాకము మున్నుగా నెన్నో రచనలు వెలువడినవి. ఈ వివాదము తొలుతఁ జక్కని కృతివిమర్శనములతో నారంభమై క్రమక్రమముగా శ్రుతి మించి వ్యక్తిదూషణములకుఁ బాలుపడి ముదిరినది. ఏది యెటులయిన, నాఁటి యీ వివాదము సాహిత్య జిజ్ఞాస హెచ్చించి ముచ్చటగా సాఁగినది. ఈ వాక్సమరమున దేశము

లోని పండిత కవులెందఱో కలుగఁ జేసికొని పైకి వచ్చిరి. ఇది సారస్వత చరిత్రలో మఱవరాని సరసఘట్టము. ఈ వివాదారంభమున 'కవిత' యను మాసపత్త్రిక రామకృష్ణులు నెలకొలిపి నడపిరి. ఈ పత్త్రిక తొమ్మిది పదియేండ్లవిచ్ఛిన్నముగా సాఁగి యాఁగినది. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారికి, వేంకటరామశాస్త్రిగారికిఁ గల గురుశిష్య సంబంధమును బురస్కరించుకొని యీ వివాదము ప్రారంభమైనది.

> ఎట్టొ చదివితి మూన్నాళ్ళ పట్టపవలు
> పట్టుమని రెండుముక్కలు పలుకకున్నఁ
> దిరుగఁ డీఁకనెన్ని చెప్పిన గురుఁడ ననుచుఁ
> దగులు కొన్నాఁడు నిన్నుఁ సై తానులాగు.

రామకృష్ణ మహాభారతములోని యీపద్యము వేదుల రామకృష్ణశాస్త్రి ఓలేటి వేంకటరామశాస్త్రిని గుఱించి చెప్పినది. ఈ పద్యములో యీవద్విషయము గొప్పగా సరిస్ఫురిత మగుచున్నది. శ్రీ చర్ల నారాయణశాస్త్రిగారు రామకృష్ణుల సాహిత్యగురువులు. రామడుగుల వీరేశ్వరశాస్త్రిగారు వ్యాకరణగురువులు విశ్వపతిశాస్త్రిగారు న్యాయశాస్త్రగురువులు.

దేవులపల్లి సోదరకవుల తరువాత వీరు పిఠాపుర సంస్థాన కవులై పేరొందిరి. మొత్తము రామకృష్ణకవుల కృతులు ముప్పదివఱకునున్నవి. శ్లేషయమకచక్రవర్తి వేంకటాధ్వరి రచించిన విశ్వగుణాదర్శమును దెన్గించిరి. వేంకటాధ్వరి రచనము నాంధ్రీకరించుట యేటికెదురీఁదుట. ఈతని రచనలో యమకభేదమో శ్లేషాలంకారభేదమో లేని పద్యములు మిక్కిలితక్కువ. అట్టివిశ్వగుణాదర్శమున కాదర్శప్రాయమగు నాంధ్రీకృతి గావించిన రామకృష్ణకవులు ప్రశంసనీయులు. తెనుఁగు మచ్చున కొకచోటి మూలానువాదములు మూదలింతును.

నిర్వర్తిత్తాధ్వరకృత్య ఋత్విజ మహాతీర్ణాపగో నావికం
యుద్ధార్తం సుభటంచ సిద్ధవిజయో వోఢార మాప్తస్థలః
వృద్ధం వారవధూజనంచ కితవో నిర్విష్ట తద్యావనో
ధ్వస్తాతంకచయ శ్చికిత్సక మపి ద్వేష్టి ప్రదేయార్థినమ్.

అవబృథస్నానంబు నాచరించిన సోము
యాజికి ఋత్విజుఁడన్న నలుక
యేరంతయును దాఁటి తీరమ్ముఁ జేరిన
పాంథునకు నరంగుపైఁ జిరాకు
విజయమ్ముఁ గైకొని నిజపురమ్మున కేఁగు
నవనీపతికి బంటునం దసూయ
యిష్టదేశమ్మున కేఁగిన పిదప స్వా
మికి యానవాహకుమీఁద విసువు
యౌవన మ్మంతయును జూఱలాడినట్టి
కితవునకు వారసతి యెడఁ గేరడంబు
వ్యాధి కుదిరిన వానికి వైద్యుపట్ల
వెగటు తా మీయవలసిన విత్త మడుగ.

సంస్కృతమున క్షేమేంద్రుఁడు రచించిన ఔచిత్య విచారచర్చ, కవికంఠాభరణము, సువృత్తతిలకము వీరు తెనుఁగుపఱిచిరి. ఇందిరాదేవి, సుభద్ర, శకుంతల, దమయంతి మున్నగునవలలు వీరివి చదువఁదగినవి. వీరి యుత్తరరామచరిత్రాంధ్రీకరణము నాలుగంకములు మాత్రము వెలువడినవి. ఇవికాక, యీజంటకవులు కవితాపత్రికా మూలమున నెన్నో ప్రాచీనార్వాచీనకృతులు వెలువఱించిరి. వానిలో మత్స్యపురాణము, పరమయోగివిలాసము, మైరావణచరిత్ర, అధ్యాత్మ రామాయణము, చంపూభారతము, భారతఫక్కి, ప్రబోధ చంద్రోదయము, పరాశరస్మృతి ముఖ్యగ్రంథములు.

రామకృష్ణకవులు సారస్వతములోఁ గ్రొత్త క్రొత్త త్రోవలు తీయు నుద్దేశము గలవారు. కవిత్వములో సంస్కృతిని వీరు వలచియున్నారు. 'ఆంధ్రపత్రిక' కాలయుక్తి సంవత్సరాది సంచికలో వీరు "ఆంధ్రకవు అపరాధములు" అను శీర్షికతోఁ గొన్ని పద్యములు ప్రకటించిరి. పరిహాస గర్భముగాఁ బ్రాచీనకవుల యపరాధము లందు వర్ణింపఁబడినవి. పద్యములు మొత్తము ముప్పదియే కాని తెలుఁగుదేశమున గొప్ప యలజడి రేపినవి. కొన్ని యుదాహరించుట యవసరము. రచనా చమత్క్రియకు మనము మెచ్చుకోవలయునుగదా!

గీ. ఆంధ్ర లోకోపకారమ్ము నాచరింప
భారతమ్మును నన్నయభట్టు తెలుఁగుఁ
జేయుచున్నాఁడు సరియె; బడాయిగాక
తొలుత సంస్కృతపద్య మెందులకుఁ జెప్పుఁడీ!

గీ. పామరుఁడువోలెఁ దిక్కనసోమయాజి
వెఱచి యాంధ్రీకరింపక విడిచినట్టి
భారతమ్మున వ్రేల్వెట్టఁ బట్టిగాని
యెఱ్ఱప్రెగ్గడ బండార మెవ రెఱుఁగరు?

గీ. అచ్చతెనుఁగు పదంబుల నిచ్చకొలఁదిఁ
బుచ్చి తలతిక్క యన్వయంబులను బెట్టి
పాడుచేసెను నన్నయ్యభట్టుదారి
యుభయకవి మిత్రులవ! తిక్కయొజ్జగారు.

గీ. రావు సర్వజ్ఞసింహ భూరమణుతోడ
బావ శ్రీనాథ కవిసార్వభౌముఁ డేమొ
చెప్పి తత్కృపాపాత్రుఁ జేయుపిదప
భోగినీదండకము నాడెఁ బోతరాజు.

గీ. ఎఱచితినువార లేనియు నెమ్ముమెడకుఁ
గట్టుకొందురె? శ్రీనాథకవివరేణ్య!
సానికూఁతుల తగుల మీశానునకును
బలికితివి నీస్వభావము బయలుగాను.

గీ. ప్రాలుమాలికచేఁ దాళపత్త్రపుస్త
కాటవులనర్థపుం దెరువాట్లు గొట్టి
కొఱఁతఁబడునని కుకవిని గోసరితిట్టి
పెద్దనయొసర్చినట్టి తప్పిదము నిదియె.

గీ. తనకు నంతఃపురమునకు మనసులందు
నెడమడుగు పుట్ట ముద్దులొల్కెడు నుడులను
బారిజాతాపహరణంబుఁ బల్కి మాన్చి
నట్టి తిమ్మనఋణము రా జెట్టుతీర్చు?

గీ. కృష్ణరాయఁడు చేసిన విష్ణుచిత్త
కావ్యమందలి భావము శ్రావ్యమెయగు
నెన్ని మార్లు పఠించిన నెఱుకపడని
వట్టి పాషాణపాక మెవ్వంకు నమవు?

గీ. శ్లేషకావ్యంబుఁ జేసి విశేషయశము
గనిన పింగళి సూరన గడుసువాఁడె
కాని శుభమస్తని యదేమి గారుడంబుఁ
దెలుఁగుఁ జేసినవాఁడు వైదికుని పగిది.

గీ. తగని గర్వంబునం జేసి తన్నుఁదానె
పొగడుకొనువాఁ డటంచుఁ జెప్పుదురుగాక
నాలిపలుకులు రావు తెనాలి రామ
కృష్ణ కవినోట బంగారు గిలకదీట.

గీ. ఒకఁడు స్వప్నప్రకారము నుగ్గడింప
నెల్లవారలకుఁ గలవె తెల్లవార్లు
నవ్వుదురనుకలంపు లే దెవ్వరికిని
పేరుకొననేమిటికి నట్టి బీదకవుల ?

గీ. పూర్వకవిరాజులకు నిది భూషణంబొ
దూషణమొ యనుకొనుఁడు మీతోఁచినట్లు
నన్నయాదుల పట్ల మాకన్నఁ గూర్మి
గలుగువారలు లేరు జగమ్మునందు.

ఈ యపరాధ పద్యములపై క్షమాపణము చెప్పవలసినదని ప్రతి పట్టనమున సభలు గావించి తీర్మానములు చేయుచుండిరి. అపు డీ కవికవులు కాళ్లు విరఁగఁ ద్రొక్కుకొను తెలుఁగుసోదరులఁ గని నవ్వుకొనుచు 'దేశభక్తి' యను నొకవ్యాఖ్య వ్రాసి "మేము చేసినది నిందాస్తుతిగాని కేవలనిందగాదు. ఈ విధముగా మేము ప్రాక్తనకవులనుగూర్చి వ్రాయుట యాధునికులకుఁ బ్రాచీన కవిసత్తములపై నెంతగా భక్తివిశ్వాసములు కలవో పరీక్షించుటకే" అని సమాధానము చెప్పిరి. అపుడీ నవీన పద్ధతిని గనిపెట్టి రామకృష్ణులను సరసు లభినందించిరి. విరసులు పరిహసించిరి. "కౌరవగౌరవ" మను పేరఁ బాండవులది యన్యాయమనియు, కౌరవులది న్యాయమనియు సమర్థించుచుఁ జక్కని పద్యములు 'ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక' లో నావిష్కరించిరి. అందలి విషయ మెట్లున్నను గవితా ధోరణి భారతమును బోలియున్నదని జయంతి రామయ్యపంతులుగారు మఱిమఱి ప్రస్తుతించిరి. ఇట్లే రామకృష్ణకవులు విలక్షణ భావనా పథ విహారులై యుండెడివారు. వీరి 'పాణిగృహీతి' యను ఖండకావ్యము తెలుఁగు వాఙ్మయమున నొక గళాభరణము. ప్రతిపద్యము నొక మహార్ఘమణి. కొన్నిమణులు ముందుపెట్టెదను.

వధువు — పెండ్లికూఁతురు

ఏఁ గచ్చేరికి నేఁగఁ గావలయు నోసీ! పిల్లనిం బుచ్చుకో
"వేగన్ ర" మ్మని బామ్మ యొండిఁకు వసున్ విప్రోపదిష్టార్థయై
"యే గీతంబుల నేర్చికోవలయు నేఁడీ మీఁజవా? నెత్తుకో
నీఁ గాఁగూడదె?" యుంచుఁ బల్కు వధు వెందిష్టాప్తి రంజిల్లుతన్.

సువాసిని — ఆఁడువడుచు

ఒకసాయ మ్మసివారి కేఁగిన మగండొక్కింత కే తెంచి పి
ల్వకయే తల్పును దట్టఁగా దయిత "యెవ్వార్వా" రనన్ లజ్జ మి
న్నకయుండన్ బతి; "పల్కవే" మని కృతవ్యాకారయై తల్పుఁ దీ
సి కడున్ వెల్వెలఁబాఱి ఎర్విడు మృగాక్షిన్ భర్తమన్నించుతన్.

మధ్యమ — కోమరాలు

అనువాదమ్ములఁగోఁ బురోహితుఁడు గర్భాధానఖండం బతిం
చినమీఁదం గులపాలికల్ తమకుఁ బాసెం జేక పాత్రంబులోఁ
దిసఁ బెట్టన్ బతి గిన్నలోనఁ దన చేతిం దాఁకు సారస్యమున్
గని యాపైఁ జెయి నేక దాఁ యిడని ముగ్ధన్ నేతి మోహించుతన్!

స్నుష — కోడలు

కియతిన్ వర్ణనసేయరానియువి యా కేళీవిలాసమ్ము ల
క్షయమై యుండనె మూఁడునిద్దుగలు కాఁగా సారెయుం జీరయున్
గయికొం చెట్టులొ పుట్టినిల్లు విడి సాక్షాల్లక్ష్మి నాఁ గానఁగా
నయి యత్తింటికి వచ్చు క్రొత్తడికిఁ జిత్తాహ్లాద మేపారుతన్!

గుర్విణి — చూలాలు

నెలదప్పన్ బొరుగింట్ల యాంధ్రు "కదుపా నీదైన గారాబు కో
డలికిన్? జెప్పవు, చిన్ననాఁటనె యదృష్టం" బన్న వోనత్త "యౌన్
దల లేర్పాటయి లోకులంబడినఁగాదా?" యన్నఁ, దన్నానుడిం
గల తీరద్దెను గోల నేల నడువంగా నిచ్చునే యెట్టేఁడున్.

కుటుంబిని - ఇల్లాలు

"ఏలా నీకు భయంబుఁ జెందఁ? దలపై నెక్కించుకొందు న్నినున్
బాలా! యత్తయు నాఁడుబిడ్డలును నీపంతంబు చెల్లింత్రు నా
శ్రీలన్నింటికి నీవె రాణి" వని పేర్మింబల్కి వండ్లాడి యు
య్యాలిం గూలిపడంతికై వడిఁ గనం బ్రాణంబు లెట్లొప్పెడిన్.

ఇది యటుండ, చెన్నపురమున నొక విద్వత్సమాజ మేర్పడి కృష్ణదేవరాయల కొండవీటి దండయాత్రను గూర్చి యొకకావ్యము రసోత్తరముగా రచించువారిలో నుత్తమశ్రేణికిఁ జెందిన కవికి బంగారుపతకము బహూకరింతు మని ప్రకటించిరి. ఆ పందెములో మన కవుల రచనమే నెగ్గినది. అప్పు డిటులు చెప్పుకొన్నారు.

మద్రనగరాంధ్ర విద్వత్సమాజ దత్త
నూత్న విషయ క్రియాలబ్ధ రత్నఖచిత
హేమబిరుదాభిరాములు, రామకృష్ణ
రచయితలు పీఠపుర యువరాజ గురులు.

ఇట్లీ మేనత్తమేనమామబిడ్డలు క్రొత్తపోకడలతోఁ గవితాభారతి నారాధించుచుండ ౧౯౧౫ లో ద్వితీయుఁడగు రామకృష్ణకవి యకాలమృతికిఁ బాలుపడియెను. ఇతఁ డాచార్య శంకరులవలె నత్యంత తరుణ వయస్సుననే మరణించి యేకైకపుత్రకులు సజీవులునైన తలిదండ్రుల దుఃఖాబ్ధి ముంచినాఁడు. చనిపోవునప్పటికి కీ కవికి ౨౯ ఏఁడుల యీడు. ఈ సందర్భమున నీతరుణకవి విశిష్టతఁ బేర్కొనుట యప్రస్తుత ప్రశంస కాదు. ఇతఁడు తన పదునొకండవయేఁట 'సరకాసురవ్యాయోగము' నాంధ్రీకరించినాఁడు. పదునాల్గవయేఁట 'దమయంతీ కల్యాణము' అను నచ్చతెనుఁగు ప్రబంధము సంతరించినాఁడు. అసాధారణమైన మేధాసంపద గలవాఁడు. మూఁడు భాషలలోని మూఁడు పద్యములు కలిపివైచి 'వ్యస్తాక్షరి' యీయఁగా హేలగఁ జెప్పిన బుద్ధిశాలి. కాకరపఱ్ఱున జిన్ననాఁట నితఁడు

వీథివెంబడిఁ బోవుచుండునపుడు అరుఁగులపైఁ బాఠములు చెప్పుచుండు పండితులు జంకుచుండెడివారఁట. ఇతని కబ్బినది ప్రాక్తన జన్మవిద్య గాని యభ్యస్తముగాదని యిచ్చటివారు ముచ్చటగాఁ జెప్పుచుందురు. ప్రాకృతమునఁ 'గుకవినిందనము' — సంస్కృతమున "కర్ణవిజయ వ్యాయోగము" వ్రాసినాఁడు. ఇవి యముద్రితములు. ఇంత చిన్న తనమునసే బహుగ్రంథములు సంధానించి, సంస్థాన విద్వత్కవియై పేరు మోసిన కృష్ణుఁడు కవిలోక జిష్ణుఁడు. "కృష్ణకవి నోట బంగారు గిలక దీట" సహకవి యెడఁబాటు పిమ్మట, జంటలోఁ దొంటివారగు వేంకట రామశాస్త్రిగారు —

> అనఁగు మేనత్త కొమరుఁడై యాశుకవిత
> నాకుఁ జేదోడు వాదోడునై కడచిన
> కృతి సమర్థుండు మా రామ కృష్ణ శాస్త్రి
> యున్న నీ సాయ మర్థింతునొట్టు దేవి!

> చనియెఁ గదమ్మ నీ యవరజన్మవిలాసము మాకుఁజూప వ
> చ్చినగతి వచ్చి సత్కవితచేఁ గవికోటికివన్నె దెచ్చి యం
> తన యతఁడట్లు నీతనువునన్విలసిల్లిన నెవ్వ రింక నా
> పొనరుచు నీకృతి క్రియకుఁ బూనికఁ దోడ్పడువారు భారతీ!

అని దుఃఖించుచు సోమదేవ భట్టారక విరచితము, అష్టాదశలంబ కాత్మకము నగు 'కథాసరిత్సాగరము' నాంధ్రీకరింపఁ దొడఁగిరి. ఎందాఁక లంబకము లయినవి. ఆంధ్ర కథాసరిత్సాగరములోని కవితా శైలి నన్నయ కవిత్వపుఁ దెన్నునకు దీటు వచ్చునట్లున్నదని తెలుఁగు దేశములోని పండిత కవులెందఱో కొండాడియున్నారు. ఆ కృతిపీఠికలో నాధునిక కవిత్వమునుగూర్చి వేంకట రామశాస్త్రిగారి యభిప్రాయ మిట్లు తేలినది.

బంధము లెల్లవీడి బహుభావ సమృద్ధిగ నేఁడు మత్తపు
ష్పంధయగీతి నా విరియఁ బాడుచు నున్నది తెన్గుఁగైత; మ
ద్గ్రంథముఁ గాంచుకాల మిదికా దటులైనను నేను బూర్వని
ర్బంధ కవిత్వపద్ధతులఁ బట్టియె దీని రచింపఁ బూనితిన్.

ఈగ్రంథము నొకరురచించినను 'వేంకటరామకృష్ణ ప్రణీత' మనియే ప్రకటితమగుట వారి యభేదభావమునకుఁ జక్కని గుఱుతు. ఈ కృతి పీఠికాపుర యువరాజవరులు, ప్రియచ్ఛాత్రులు నగు రావు వేంకట గంగాధరరామరాయ కవిరాజుల కంకితము. అందలి సుప్రసన్న శయ్యా తియ్యఁదన మిట్లున్నది:

శా. 'కానీచూత' మటంచు నీవడుగ వీఁకన్ జేతిలోఁ బోసితిన్
దీనారమ్ములు పెక్కు; వానికగు వృద్ధిం దే; వదట్లుండె; నా
దీనారమ్ముల నేని నాకిడవు; సందేహింప కీరీతిగా
నానా! వెండియు వచ్చితే యడుగ మూర్ఖా! సిగ్గులేదయ్యె నే!

క. ఓచెడుగా! యచ్చోఁ గల
యా చచ్చిన మూషకమ్ము నైనఁ బణముగాఁ
జూచుకొని కుశలుఁ డగువాఁ
డేచందంబుననొ ధనము నిట్టిగడించున్.

గీ. అట్టియెడ నీవు చేతిలో బెట్టినట్టి
సొమ్ము గడ తేర్చి వెండియుఁ దెమ్మనంగ
వచ్చినాఁడవు; పోసొమ్ము చచ్చినాఁడ!
దాఁచఁ బెట్టితె యిచట నీతాత మూట?

క. అని కసరుచుండ నే నది
విని యామృత మూషకమ్ము వేఁడెద నా కి

మ్మాఘహరా! యిదియ పణమ్ముగఁ
గాని నేవ ర్తకముఁ జేసికొందు నటంచున్.

క. వచ్చిన యామెలుకను నా
కిచ్చినయటు వద్దు వ్రాసి యిడి యతనికి, నేఁ
దెచ్చితి దానిం గని యతఁ
డచ్చెరువడి నవ్వు గొనుచు నభినందింపన్.

ఈతీరుగా మెత్తని నిర్దుష్ట శయ్యలో సీకృతి యున్నది. వారి చేతి మీఁదుగానే కృతి తుదముట్ట కుండుట దుర్విధి. 'నూటపదియార్లు' అనుపేరఁ బరమేశ్వరుని గూర్చి వీరు సీసములు రచించిరి. అవి సువర్ణములు. ఈ కావ్యము తెనుఁగువారి డెందము లుబ్బింపఁగల గీతాంజలి. ప్రతిభాజన్యమయిన దీనికిఁ దగినంత ప్రశస్తి దేశమున లేదు.

హృదయ పాత్రంబులో నేమియున్నదో కాని
తొలకుచున్నది నిన్నుఁ దలఁచినపుడు
ఈ మనఃఫలకమం దేమి యున్నదో కాని
మ్రోఁగుచున్నది నిన్ను మ్రొక్కినపుడు
శీర్ష పేటిక నేమి చిత్రమున్నదో కాని
మూయుచున్నది నిన్ను ముట్టినపుడు
ఈ భావవీథిలో నేమియున్నదో కాని
తారుచున్నది నిన్నుఁ గోరినపుడు
రమ్ము! నాతండ్రి! ననుఁ జేరరమ్ము! ప్రణతిఁ
గొమ్ము! కరుణించి నన్నేలుకొమ్ము! చేర
నిమ్ము! నీదర్శనంబు నాకిమ్ము! నిన్నె
నమ్మినాఁడను శాశ్వతానందనిలయ!

వేంకట పార్వతీశ్వర కవులు

(౧) 1880
(౨) 1882

నియోగి శాఖీయ బ్రాహ్మణులు. మొదటివారు బాలాంత్రపు వేంకటరావుగారు. వాధూలసగోత్రులు. తల్లి: సూరమ్మ. తండ్రి: వేంకట నరసింహము. జన్మస్థానము: మల్లాము [పిఠాపుర పరిసరము] జననము 1880 సం. విక్రమవత్సరము. రెండవవారు ఓలేటి పార్వతీశముగారు గౌతమసగోత్రులు. తల్లి: వెంకమ్మ. తండ్రి: అచ్యుతరామయ్య. జన్మస్థానము: కొమరగిరి [పిఠాపుర ప్రాంతము] జననము: 1882 సం. చిత్రభాను వత్సరము.

గ్రంథములు: నవలలు: ఇందిర-ఆరణ్యక - ఉన్మాదిని - సీతారామము - సీతాదేవి వనవాసము - నీరద - నీలాంబరి - ప్రణయకోపము - ప్రతిజ్ఞా పాలనము - ప్రభావతి - ప్రమదావనము - శ్యామల - శకుంతల - చందమామ - రాజసింహ - వసుమతీ వసంతము - వీరపూజ - రాజభక్తి - వంగవిజేత - లక్షరూపాయలు - మనోరమ - మాతృమందిరము - మాయావి - హారావళి - రజని - సాధన - కృష్ణకాంతుని మరణశాసనము - పరిమళ - సంతాపకుఁడు - చిత్రకథా సుధాలహరి. మున్నగునవి. పద్యకావ్యములు: ౧. కావ్యకుసుమావళి [2 సంపుటములు 1924] ౨. బృందావనము [1935 ముద్రి] 3. ఏకాంతసేవ [1922 ముద్రి] ౪. ధనాభిరామము [నాటకము: వేంకటరావుగారు ప్రత్యేకముగ రచించిరి] ౫. తారాశశాంకము. ౬. సువర్ణమాల [ఈ రెండు నాటకములు పార్వతీశ్వరకవిగారి ప్రత్యేకరచనములు] ౭. శ్రీ రామాయణము [వాల్మీకి రామాయణమునకుఁ జక్కని తెలుఁగుస్సేఁత: బాలకాండము పూర్తియై యిప్పుడయోధ్యకాండములో నున్నది రచన.]

వేంకటపార్వతీశ్వరకవుల కీర్తి పతాక నెత్తినది "ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల." 'ఆంధ్రప్రచారిణి' కట్టి పేరుఁబ్రతిష్ఠలు వచ్చుటకు వేంకట పార్వ

తీశ్వర కవులు కారణము. ఆంధ్రములో నభినవరీతులుగల నొకతీరు కవితకు అంకురార్పణము చేసినవా రీ జంట కవులే యని నేటి వారిలో మేటికవులు కొందఱభిప్రాయపడుచున్నారు. ఈయభిప్రాయమున కా యుగళము రచించిన 'ఏకాంతసేవ' యనుకృతి పట్టుగొమ్మ. అనుకృతి దారికిఁ బోక, సాజముగా వచ్చిన తియ్యని బాసతోఁ గొత్తవడువున భావవిలక్షణత రాణించు కవితను రచించు నేఁటివారిలో 'వేంకట పార్వతీశ్వరకవులు' కడుగౌరవనీయు లనుట స్వభావోక్తి.) ఇఁక వీరి చరిత్రాదికముఁ గూర్చి ప్రకటించెదను.

బాలాంత్రపు వేంకటరావుగారు 'ప్లీడరుగుమస్తా' పని చేసుకొనుచు నేవో యల్లిబిల్లిపద్దెము లల్లుచుండెను. ఓలేటి పార్వతీశముగారు చెలికాని లచ్చారావుగారి దగ్గర నుండి యచ్చుపనులు చూచుచుండెను. 1908 సంవత్సరప్రాంతముదాఁక నీ కవకవు లొకరినొక రెఱుఁగరు. కాని, యిరువురు పిఠాపురమునకుఁ బరిసరములోనే యున్నారు. విమర్శకాగ్రేసరులని ప్రసిద్ధి వడసిన శ్రీ నడకుదిటి వీరరాజకవిగారు విద్వజ్జన మనోరంజనీ ముద్రాలయద్వారమున సారస్వతసేవ గావించుచు నాఁడు పిఠాపురముననే కాఁపురముండియున్నారు. ఈ మహాశయుఁడే మన ప్రస్తుత కవు లిరువురకు సేతుసంధానము చేసినవారు. ఆచంట సాంఖ్యాయన శర్మగారి సంపాదకత్వమున "కల్పలత" యను పత్త్రిక నడుచుచున్నతఱియది. ఆ కల్పలతలో భాషాసంబంధములగు ప్రశ్నములు, సమస్యలు వెలువరింపఁబడెడివి. ఒకనెలఁ గొన్ని ప్రశ్నములకు వీరరాజకవియును బిఠాపురము నుండి ప్రత్యుత్తరములు వ్రాసి పంపెను. వానికే పార్వతీశముగారు సమాధానము లంపిరి. వేంకటరావుగారు నెక్కడనుండియో వ్రాసి పంపించిరి. ఒకరివిషయ మొకరెఱుంగరు. పార్వతీశముగారికి ప్రథమ బహుమానము. వీరరాజకవికి రెండవబహుమానము. వేంకటరావుగారికి మూఁడవ బహుమానము నిచ్చినటులు పత్త్రికలోఁ బ్రకటితమైనది.

ఈ మువ్వురు నొకశాఖపైనున్న కోకిలములే. ఒకరి గానమాధురు లొకరు విని యానందపడినారు. వీరరాజ కవిగారి సహృదయత మల్లాము కవిని - కొమరగిరి కవిని తీసికొనివచ్చి సంధానము చేసినది. నాఁటి నుండి వేంకట పార్వతీశ్వర కవులు. (ఈ జంట యేర్పడని సమయమున వేంకటరావుగారు 'ధనాభిరామము' నాటకము - 'సురస' యను నవల వ్రాసికొనిరి. పార్వతీశముగారు పిఠాపురము మహారాజుగారి పట్టాభిషేకమునకు 1907 లో 'సువర్ణమాల' యను నాటకమును, 'తారాశశాంకము' అను వేఱొక నాటకమును రచించిరి. ఇవియే ప్రత్యేకరచనలు. తరువాతి వన్నియు వేంకటపార్వతీశ్వర విరచితములే. కవ కలిసినతోడనే 'అనురూప' యను కావ్యము రచించిరి. అదియిపుడు 'చిత్రకథాసుధాలహరి' గాఁ బ్రచురింపఁబడినది.) ఈ కవుల మేలి కలయికవలన 1911 లో నాంధ్ర ప్రచారిణి వెలసినది. కార్యస్థానమునకు సూత్రపాతము [illegible] జరిగినది. అక్కడ నొకయేఁడుమాత్ర ముండి నిడదవోలు - రాజమండ్రి - కాకినాడ - పిఠాపురము క్రమక్రమముగ సంచారము చేసినది. 1930 సం॥ దాఁక నీగ్రంథమాల మహోన్నతస్థితిలో నున్నది. శ్రీ కొవ్వూరి చంద్రారెడ్డిగారు తొట్టతొలుత 'ప్రచారిణి' కి సహాకృతి చేసిరి. ఆయన చేతిచలువ వలన నా గ్రంథమాల కట్టి ప్రఖ్యాతి వచ్చినది. చంద్రారెడ్డి తెలుఁగు వారికి స్మరణీయుఁడైన వ్యక్తి. ఆంధ్రప్రచారిణికి దీటువచ్చు గ్రంథమాలలు మననేలలో రెండో మూఁడో. చక్కని వచన వాఙ్మయమును సేవించిన గ్రంథమాలలే తక్కువ. 1930 నాఁటికి ప్రచారిణి వెలువరించిన గ్రంథముల సంఖ్య 170. ఆంధ్రప్రచారిణికిఁ బ్రాణము వేంకట పార్వతీశ్వర కవులు. ఈ జంటకవులకు నడుమనడుమఁ బొడముచుండు మానసికములగు కలఁతలను ప్రచారిణి మధ్యవర్తినియై తొలఁచుచుండెడిది. రెండు దశలు గ్రంథమాల జాతకము విఖ్యాతముగ వెలిఁగినది. వేంకట పార్వతీశ్వరుల నవలలు తెలుఁగులో నలుమూలలఁ బేరు సంపాదించుకొన్నవి.

ఈ కవు లిద్దరును గురుముఖమున సంస్కృతమునుగాని, ఆంగ్లముగాని యధ్యయనము చేయలేదు. వీరికి వంగభాష కొంచెము వచ్చును. మిత్రునివలనఁ గన్నడములో ననువదింపఁబడిన బంకించంద్రుని నవల నొకదానిని చదివించుకొని విని, వంగ వాఙ్మయపు సొగసులకు, బంకిం చంద్రుని కల్పనముల సొంపునకు నివ్వెఱపడి మెల్ల మెల్లఁగ నాభాషలోఁ గృషి చేసిరి. ఆ కృషియైనను సాధారణమైనదే. ఏమైన నేమి! వంగము కాదు, ఆంగలము కాదు, అన్యభాష లెన్నో యెఱిఁగినవారికంటెఁ గూడ వీ రెక్కువ సేవ చేసిరి. వీరి నవలలలోని రచనసొంపు వేఱే నేను వర్ణింప నక్కఱయుండదు.

అనువాదములు గావించిరి. కల్పనములును జేసిరి వీరి రచించినను సహజత్వము శైలిలో నుండుటచే వీరి రచనలు పాఠక హృదయములను హత్తుకొనఁ గలిగినవి. వీరి నవలావాఙ్మయము తెలుఁగుతల్లి విహారము నకుఁ 'బృందావనము'. ఇఁక వీరి పద్యకావ్యముల సంగతి: 'అనసూయ' పత్రికలో మొట్టమొదట 'ఏకాంతసేవ' కావ్యము బయటఁబడినది. అదియాది వీరి నాధునికులు మెచ్చి కవులలో నొక మంచిస్థాన మిచ్చినారు. 1922 లో నా కృతి యచ్చుపడి తెలుఁగువారి కెల్లరకు నందుపాటు లోనికి వచ్చినది. వంగ సారస్వత మెఱుఁగరు. ఆంగలము తెలిసినవారు కారు. రవీంద్రుని భావోన్నతి వీరి కెట్టు లబ్బినదో యని యంద ఱబ్బుర పడినారు. 'ఏకాంతసేవ' నేటి కృతులలో రసభావపరిపూర్ణమై యున్న దని యెన్నికొనినారు. ప్రకృతి పులకించునటులు భక్తుఁడు జీవితేశ్వరుఁ డైన యా పరమేశ్వరుని గూర్చి పాడుకొన్న ప్రణయ గీతముల సంపుట మీ 'యేకాంతసేవ'.

నా మొలంగుతోఁట నామాటలోఁ దేట
నావరాలకొంగు నా వెలుంగు

నావయాళి తేప నాచూపులోఁ బావ
నిలుచుఁగాక ! తన్నుఁగొలుచుదాఁక.

అని ప్రార్థించి కృతిగానమున కుపక్రమించిరి. కవులు భావకత యను పదమునఁ బొరకులకుఁ దట్టు చుండును. నిశితమైన భావనాశక్తి గల కవులు వీరని 'యేకాంతసేవ' ఘోషించి చెప్పుచున్నది. ఈ పదములు చదువుఁడు :

తూరుపుఁగోనలో దుందుభిస్వనము
వీణాస్వనంబులో వినరాకయుండె
నానందవనములో నాగస్వరంబు
నూఁదకే కోకిలా యొక్కింత సేపు.

* *

శృంగారనదిలోన చిగురాకుదోనె
యే రాగజలధిలో నీఁదుచున్నదియొ
తలిరు జొంపంబులందలి గానలహరి
యే దివ్యసీమల కేఁగుచున్నదియొ !

పరువంపుఁ బూవులోపలి కమ్మతావి
యేవాయుపథమునం దెగయుచున్నదియొ
తారాపథంబునందలి తటిల్లతిక
యే మహాతేజమం దెనయుచున్నదియొ!

గాలిలో జాడలు కనిపెట్టఁగలుగు
దివ్యమూర్తికి నీకుఁ దెలియదఁటమ్మ!
ప్రణయవనంబులోపలి పుష్పరథము
తమ్మిదా! వేవేగ తోలితేవమ్మ!

(ఏకాంతసేవకుఁ బీఠిక వ్రాసి వ్రాసి శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు చివర కిటులు తమ యభిప్రాయము తెల్పినారు. "ఇది విమర్శనాతీతము. వంగభాషకు రవీంద్రుని గీతాంజలి యెట్టిదో, మన యాంధ్రమున కీ మహాకవుల - భక్తుల యేకాంతసేవ యట్టిది")-

(వేంకట పార్వతీశ్వర కవుల భావరాశి స్వాభావికమైనది కాని, యాంగ్ల వంగములనుండి దొంగిలిగొన్నది కాదని మన మనుకొనవలసిన విషయము. వీరి 'కావ్యకుసుమావళి' రెండు సంపుటములు చూచుఁడు! కవిత యెచ్చోటనేని సహజతలోఁ గొఱఁతపడినటులున్న దేమో!

తిన్నని నున్నని తెల్లని యెనలేని
మొగ్గలలోనుండి నిగ్గుఁదీసి
చక్కని చిక్కని సరిలేని కమ్మని
పువ్వులలోనుండి ప్రోవుఁజేసి
విఱుగని తఱుఁగని వెలలేని తీయని
తేనియలోనుండి తేటఁదీసి
నలఁగని తలఁగని నలిలేని తొలిలేని
చివురాకుదొన్నెల సేకరించి—

ఆంధ్రకవితా సరస్వతి నమ్లానపుష్పోపహారములతో నర్చించిన కవివరులు వీరు. కవితలోఁదఱచుగఁ బదముల పునఃపునరావృత్తి వీరి కిష్టము. నవ్యకవితావతారమునకు ముందే యనేక నూతన విషయములపై వీరి లేఖిని 1909 సం॥ కంటెఁ దొల్లి పత్రికలలో వెల్లివిరిసినది. కొన్ని రకముల కవితామార్గములకు వేంకట పార్వతీశ్వర కవులు దర్శకులుగాని, వీరు వేఱొకరి కవితతీరు ననుకరించినటులు మన మనుకొనరాదు. అట్టి స్వాభావికత వారి రచనలోఁ బదముపదమునఁ బరికింపవచ్చును. ఈ జంట

కవుల యభ్యుదయము గుఱించి శ్రీ పీఠికాపురాధీశ్వరుఁడు వీరి కొక ముద్రాయంత్రమునుగొనియిచ్చి తదుద్యమమునకుఁ జేయూఁతనొసఁగెను. నరసారావుపేటలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తున శ్రీ ఉయ్యాలు రాజావారి సభాధిపత్యమున నీకవులకు 'కవిరాజహంస' బిరుద మొసఁగఁ బడెను. 1943 లో రాజమహేంద్రవరమున వీరికి షష్టిపూర్తి సమ్మాన మహోత్సవము వైభవపూర్ణముగా సాఁగినది. అప్పుడు కూడిన యాంధ్ర నిక కవివర్గము వీరికి "కవికులాలంకార" బిరుదము నిచ్చి గౌరవించిరి. ఈ బిరుదములు రెండును వీరియొక్కఁ దగినట్టులుండి యలంకరించుచున్నవి.

ఉ. పావనమూర్తి నీశ్వరుని బమ్మెర పోతన రామరాజుగా
భావనచేసి పాడుకొనె భాగవతంబును; నట్లె రామభూ
మీవరు సద్గుణావళుల మేను జగత్ప్రభు లీలఁగాంచి బృం
దావన కావ్య మంకిత మొనర్చితి మాధవు పెండ్లిపాటగన్.

అని చెప్పి శ్రీ పీఠికాపుర యువరాజు గంగాధర రామరాయ ప్రభునకు 'బృందావనకావ్యము' నంకితము గావించిరి. ఈ కబ్బము శ్రీ రఘునాథ రాయల కాలమున వెలసిన శృంగారకావ్యములను దలదన్ను చున్నన నున్నది. ఈ కూర్పునేర్పు పరికింపుఁడు.

సీ. మణి కిరీటంబుపై మన్నింపలేవఁటే
కొరగాని పురినెమ్మికోడి తెక్క
అధరపల్లవముపై నానింపలేదఁటే
పెలిబోని నిరసంపు వెదురుఫుల్ల
శ్రీవత్సకాంతిపైఁ జెలఁగింపలేవఁటే
వెలలేని చిఱుమోఁక తులసిరేక
కల్యాణమూర్తిపైఁ గదియింపలేవఁటే
చొరరాని పసరాకు పుడుగునూలు

అఖిలలోకవిభుని నతిభక్తి సేవింప
నాత్మవిభుని కరుణ నభిలషింపఁ
దగనివారుఁ బడయఁదగనివా రెవరమ్మ ?
తరతరంబు లేల తడవెదమ్మ ?

ఉ. వేంకట పార్వతీశ్వర కవిద్వయ నిర్మల వాఙ్మనః క్రియా
సంకలనంబునం బొడమి సమ్మతమై ఫలపుష్పశాఖికా
సంకుల సత్కవిప్రకర సాధునుతంబయి రామరాణ్మహేం
ద్రాంకితమైన యీ కృతిసురాగమ మర్థులఁ దన్పుఁ గావుతన్ !

(మన తెనుఁగువారిలో నీ కవులను దాఁటిన కవు లున్నారు. పండితు లున్నారు. భావకు లున్నారు. తెలుఁగుపలుకుబడి యింతమధురముగా, మృదువుగా, తేటతెల్లముగాఁ, దీగుతియ్యముగాఁ దీర్చి దిద్దినవారు తక్కువగ నున్నారు. పసిపిల్లవానినుండి, పండితునివఱకు నచ్చునట్లు తేలికబాసలో నింత సంతనగా సంతరించు కవిరాజహంసలు మన వారిలో నెందఱో లేరు. 'బాలగీతావళి' పలువురు చూచియుందురు. ఎంతసేపు, సాధారణజనబోధకముగా నుండునట్టి నడక వారి సొమ్ము. అట్టులని, యర్థగంభీరత యుండకుండునా ? ప్రతిపద్యమునఁ జాల గాంభీర్యము.) ఈ జంటకవులు తమ 'లేఖిని' గూర్చి యీ రీతి యుపదేశములు చేయుచుందురు.

వ్రాయుము నిర్మలభావ వి
ధేయమ్ముగ బుధజనాతిధేయముగ జగ
ద్గేయమ్ముగ లలితసుధా
ప్రాయమ్ముగఁ బాఠకశ్రవణపేయముగన్.

ఇట్టి కరవులు గఱచిన లేఖినితో నీనడుమ వేంకటపార్వతీశ్వర కవి కోకిల యుగళము తెనుఁగులో నాదికావ్యగానము చేయఁదొడఁగినది. రచన నేఁటి కయోధ్యాకాండములోనికి వచ్చినది. అది సాంతమై గీటు ఱాతికి వచ్చుఁగాక !

అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి

1883 - 1935

తెలగాణ్యశాఖీయబ్రాహ్మణుఁడు. కృష్ణయజుశ్శాఖీయుఁడు. భారద్వాజస గోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. కన్నతల్లి: మహాలక్ష్మమ్మ. కన్నతండ్రి: రామయ్య. పెంచుకొన్న తల్లిదండ్రులు: లక్ష్మిదేవమ్మ, వెంకటప్పయ్యలు. అభిజనము: గార్లపాడు (బాపట్లతాలూకా) జననము: 1883- నిర్యాణము: 1935. కృతులు: ౧. జీవన్ముక్తి - విదేహముక్తి. ౨. సగుణోపాసన-నిర్గుణోపాసన ౩. దైవబలము (చిన్న పద్యకావ్యము). ౪. ఆంధ్రధ్వని (ధ్వన్యాలోకమున కనువాదము) ౫. తెనుఁగు కావ్యాదర్శము. ౬. కావ్యనాటకాది పరిశీలనము. ౭. మేఘము (కావ్యము-అముద్రితము).

ఆశుకవితలో నవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కాంధ్రమున మంచిపేరున్నది. ౧౯౧౦, ౧౧ సంవత్సరముల ప్రాంతమునఁ దిరుపతి వేంకట కవులకుఁ గొప్పరపు సోదరకవులకు నాశుకవితా విషయమున హోరాహోరి యుద్ధము తటస్థించినది. 'గుంటూరుసీమ' పూర్వోత్తర రంగములు తన్మూలముననే రచింపఁబడినవని తెలుఁగువారి కెల్లరకుఁ దెలియును. కొప్పరపువారితోఁ గవిత్వపుఁబోటీకి నీ సుబ్రహ్మణ్యశాస్త్రిలు గారిని నాఁడు తిరుపతి వేంకటకవులు పంపించిరి. వేమవరాగ్రహారమునఁ దత్ప్రదర్శనము గావింపఁబడినది. ఓహో! శాస్త్రులుగారి కవితాజవమునకుఁ బట్టపగ్గము లులేవు. కొప్పరపుఁగవు లోడిపోయిరి. శాస్త్రులుగారు నెగ్గివచ్చిరి. గురువులు తిరుపతి కవులు శిష్యుని మెచ్చుకొని యిట్లు వ్రాసి యిచ్చిరి.

అన్నంబెక్కడనో భుజించితివి విద్యన్నాకడ నేర్చి; తెం
దున్నీయందు లవంబు గానను జుమీ దోషంబు, దుశ్శాత్రవుల్
నన్నుం మార్కొను వారియాశువుల చందంబెల్ల నవ్వారి సు
బ్బన్నా గెల్చిఋణంబు దీర్చితివి సుమ్మా! శిష్యచూడామణీ!

'వేంకటశాస్త్రి'

ప్రకటతరాశుధారను సభాసదులెల్లరు మెచ్చుచుండ, నా
యకమణి సంతసింపఁగ నయారె! రచించినవాఁడవీవు, వా
రక యరవింద సుందర మరంద ఝరంబు స్రవించుచుండు నీ
సుకవితఁ గాచుకోఁదగవె సుబ్బనశాస్త్రి! జగద్ధితంబుగన్.

'తిరుపతిశాస్త్రి'

ఇదిగాక, సికిందరాబాదు మున్నగు ప్రసిద్ధస్థలములలో వీరుగావించిన శతాష్టావధానములు, ఆశుకవితా ప్రదర్శనములు పలువుర ప్రశంసల నందుకొన్నవి. తెలుఁగునను సంస్కృతమునను వీరు సమాన వేగముననే కవితచెప్పఁగలిగిరి. ఎట్టివాఁడైన సంస్కృతములోఁ దడవు కొనకుండ మాటాడునలవాటు మనప్రాంతీయులలోఁ గడునరుదు. శాస్త్రులుగారు నిరాఘాట ధోరణి మాటాడునపుడు పండితులు దిగ్భ్రాంతి పడువారు. ఇది యత్యుక్తి కాదు. ఏలేశ్వరపు నరసింహశాస్త్రిగారొకరు సంస్కృతాశుధోరణిలోఁ బేరుపడ్డవారు. 'ఆశుకవితిలక' బిరుదాఢ్యులగు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తమగురువుల నిటులు పేరుకొనిరి.

శ్రీయుతులు బొడ్డుపల్లి సుబ్బరాయబుధుని
కొలచల నృసింహశాస్త్రిని గురువరులను
స్తుతి యొనర్చి, యద్దేపల్లి సోమనాథ
తార్కికాగ్రణి దేశికుఁ దలఁతు మదిని. 'ఆంధ్రధ్వని'

తరువాత శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి సన్నిధికిఁజేరి, వేటూరి ప్రభాకరశాస్త్రి పాదుని సహాధ్యాయత్వమున 'సిద్ధాంతకౌముది' పాఠము చేసిరి. శ్రీ బ్రహ్మానంద తీర్థస్వాములతోఁ బ్రస్థానత్రయ మధ్యయనముగావించిరి. తర్క వ్యాకరణములు, వేదాంతము, ధర్మ శాస్త్రము, అలంకారము మున్నగు వివిధ శాఖలలో వీరి కనల్పమగు పరిజ్ఞానమున్నదనియు, నాంధ్రములో వీరి పాండితి యుద్దండమైనదనియుఁ బండితు లెన్నుకొందురు. ఈయన ప్రాచీనవాఙ్మయమును దఱచిన లక్షణవేత్తయైనను, నూతనత్వమెఱుఁగని ఛాందసుఁడు కాఁడు.

ప్రస్థానములు పఠించిన వేదాంతి యైనను, రసతత్త్వము తెలియని శ్రోత్రియమాత్రుఁడు కాఁడు. మంచి లౌకిక విజ్ఞానము కలవాఁడు. గొప్ప దేశీయాభిమానము కలవాఁడు. పతితాంధ్ర సామ్రాజ్య విభవమును గూర్చి వగచు జాతీయ కవిశిరోమణి. 'ఎండ్లూరు' పూర్వసంపదను స్మరించుకొని రచించిన యీ సీసములు సువర్ణములు.

నీమట్టిలోఁ బుట్టి నిఖిలదేశంబుల
వెలిఁగించియుండెఁగా తెలుఁగు వెలుఁగు
నీనీట తేటయై నానాస్థలంబుల
నాక్రమించెనుగదా యాంధ్రకీర్తి
నీలోని గాలిలో లీలయై పలుచోట్లఁ
జెంగలించెనుగా, త్రిలింగదీప్తి
నీపై రుపఁటల నిగ్గయి యెల్లచోఁ
దనరారియుండెఁగా, తెలుఁగుశక్తి
యే జెముడుపొదలక లోన నిమిడి దాఁగి
యుండెనో యిప్డు డల్ల నీయుచ్ఛ్రయంబు
రామచంద్ర రాజేంద్రుని రామభద్రు
భూరమణుఁ గన్నతల్లి! యెండ్లూరుపల్లి!

పుడమి వేల్పులకు నీవుత్త్రిలోసంగిన
రమ్యమహాగ్రహారముల పేర్లు
జంగము కథలలో శృంగార పూరమై
పాఱుచునుండెడి వీరరసము
తాతలనాఁటి కథల్ చెప్పుకొనుచుండు
కులవృద్ధుల బెడంగు గలుగు నుడులు
క్షాత్త్రప్రియుల్ మది స్మరియించుకొని శిర
శ్చలనంబుతోఁ జేయు శ్లాఘనములు

నీదు చల్లని కాన్పున నెగడినట్టి
పౌరుషోదార్యరేఖలఁ బ్రస్తుతించి
పోవునో యేమొ, నీ పేరు పుడమి విడిచి
శూరగర్భ యొకప్పు డెండ్లూరుతల్లి!

బళీ! ఏండ్లూరు పూర్వము శూరగర్భయఁట. నేఁడు జెముడుపొదలతో నిండియున్నదఁట. ఈ దుస్థితి కవి నెంత పరితపింపఁ జేసినదో! ఆర్ద్ర హృదయుఁడగు నీకవి హృదయ ప్రణాలికనుండి యుబికిన యీ సహజ కవితాప్రవాహము రసవిదులకుఁ దలమున్కలు చేయుచున్నది. ఇట్టి పద్యములు నాలుగే వ్రాయుఁగాక, అవినాలుగు కావ్యములుకావా? శ్రీ శాస్త్రిగారు 'భారతి' లో వెలువరించిన యీసందేశము చదువుఁడు.

"......నవీనరహస్యములను గల్పనాప్రపంచముద్వారా వాఙ్మయ ప్రణాళికలోఁ బ్రవహింపఁజేయు సుకవుల సందేశము లుగ్గుఁబాలుగ నేజాతికి జీర్ణమగుచుండునో, వారిదే యభ్యుదయము, వారిదే స్వాతంత్ర్యము, వారిదే విజయము......" భారతిప్రభృతి పత్రికలలో నప్పు డప్పుడు ప్రకటించిన ఖండకావ్యములుగాక, వీరి పద్యకృతులు ప్రత్యేకముగ నచ్చుపడినవి కానరావు 'దైవబలము' అనుపేరుగల భక్తిప్రధానమగు చిన్నకావ్యమొకటి ప్రకటితము. "మేఘుఁడు" అనుఖండకావ్యము నవీనమార్గములోఁ జివరికాలమున వీరు రచించినది ప్రచురింపఁబడలేదుగాని, శాస్త్రిగారిశిష్యపరంపర నోళ్ళలోనానుచున్న కొన్నిపద్యములు విన్నచో నది రసపరిప్లుతమగు కావ్యమని తోఁచును. వీరి యాంధ్రధ్వని, తెలుఁగుకావ్యాదర్శము, కావ్యనాటకాది పరిశీలనము మొదలుగాఁగల రచనములను జూచిన నలంకార శాస్త్రమున నీయన యెట్టి పరిశ్రమ గావించెనన్న దానికిఁ బ్రత్యుత్తరమిచ్చును. రసగంగాధర మాంధ్రీకరించిరని కూడఁ దెలియవచ్చినది. రామాయణకథను దీసికొని సంస్కృతమున నాటకములుగా నిబంధించిరనియుఁ జెప్పుకొందురు. మఱి, అవి

యన్నియు నెవ్వరికడనున్నవో? ఏమైనవో? — వేదాంతమున ననంతపరి శ్రమముగావించి గ్రంథములు, ననేకవ్యాసములు వీరు ప్రచురించిరి. శాస్త్రిగారు గద్వాల, ఆత్మకూరు, ముక్త్యాల మున్నగు వివిధసంస్థానములలోఁ బ్రతివాదిభయంకరముగాఁ గవితాప్రదర్శనము గావించుచు, బిరుదములు తాల్చుచుఁ గీర్తికాములై ప్రవృత్తిపథమున సంచరించినవారుగా స్థూలదృష్టికిఁ దోఁచినను, సామాన్యులకు గోచరింపని నివృత్తిమార్గముననే వీరిచిత్తము సంచరించుచుండెడిదని యిక్కడ జెప్పఁదగిన రహస్యము. ఆయన సహజసాత్త్వికరూపము, శాంతగంభీరభాషణము, నిత్యభాష్యపర్యాలోచనము, కర్మాచరణము స్మరణీయములైనవి. ఇట్టి గర్వగహితుఁడు, నిష్ఠాసహితుఁడు పండితులలో నూటికిఁ గోటికి నుండుననుటకు సంశయపడను. వైశ్వదేవము చేయక వీరెన్నఁడు నన్నము తినలేదు. ఈయన యెప్పుడును 'తమ పేరే'మనియడుగ 'సుబ్బయ్య' యనియే చెప్పెనుగాని సుబ్రహ్మణ్యశాస్త్రి యనుకొనలేదు. తమ యాంధ్రధ్వని మీఁదఁ బ్రతికూలాభిప్రాయము వెల్లడించి దోసఁగు లున్నవని యెన్ని పత్త్రికలోఁ బ్రచురించినపుడు, శ్రీ తాతా సుబ్బరాయ శాస్త్రిగారికి లేఖమూలమున "మహాశయ! మీరు ప్రత్రికాముఖమునఁ బ్రకటింపనేల? మీ వంటివారు ప్రత్యేకముగ నాకుఁ దెలిపిన సరిచేసికొనక పోయితినా?" యని వ్రాసి పంపిరఁట. మఱియొకసంగతి:-

కాట్రావులపల్లి (జగ్గంపేట) జమీందారు శ్రీ దామెర సీతారామస్వామిగారు రసికుఁడైన విద్వత్ప్రభువు. వారిదర్శనమునకు మన శాస్త్రిగారొకతూరి వెళ్లి, రాజగురువులను జూచి, ఆయన యేమి చదివితిరని ప్రశ్నింప "నేదో కొంచెము సాహిత్యము, కొంచెము వ్యాకరణము, కొంచెము కవితనల్లుట గురుకటాక్షమున నేర్చుకొంటి" నని చెప్పిరఁట. అప్పుడాయన 'పిఠాపురపుఁ బరీక్ష' నొసఁగితిరా? యని యడిగిరి. లేదని శాస్త్రిగారు సమాధానము చెప్పిరి. లేనిచో మాతేని దర్శనముకాదని

యాసంస్థాన గురువు చెప్పిపొమ్మనెను. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు నిష్పృహులై పోదలంచి పోవుచు, నూతనాస్థానకవి శ్రీ ద్వివేది రామశాస్త్రిగారొకచోటఁ గూర్చుండ నచ్చటకుఁజేరి, వారితో నేదో లోకవృత్తాంతము సంస్కృతభాషలోఁ బ్రసంగించిరఁట. ఆ రామశాస్త్రిగారు మన కవివరుని నిరర్గళధోరణికిఁ బాండితికి నాశ్చర్యపడి ప్రభువు దర్శనము చేయించిరనియు, నాప్రభువు ఎదుట గోడమీఁదనున్న "శకుంతలా" ప్రతిమను వర్ణింపుఁడన నాయన మనసు కరఁగునటులు సంస్కృతములో శ్లోకములు రచించి చూపిరనియు, నప్పుడు శ్రీవారు సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి వార్షికమేర్పాటు చేసిరనియు శ్రీ రామశాస్త్రిగారు "అభినవభోజచరిత్ర" లో వ్రాసిరి. ఈగాథ శాస్త్రిగారి నిర్గతికిఁ దారకాణగదా, యని పేరు కొనవలసి వచ్చినది.

వీరు తెనాలి సంస్కృతకళాశాలలోఁ గొన్నాళ్లును, బందరు "హిందూ హైస్కూలు" లోఁ గొన్నాళ్లును, బాపట్ల శంకరవిద్యాలయములోఁ గొన్నాళ్లును ఆచార్యులుగా నుద్యోగించిరి. తరువాత 1927లో కొవ్వూరు "ఆంధ్రగీర్వాణ విద్యాలయము" వారి యాహ్వానముపై వెళ్లి యచట సంస్కృతాంధ్రోపాధ్యాయులుగా నెనిమిది తొమ్మిది యేండ్లనుండి 1935 లో జీవయాత్ర చాలించిరి. కొవ్వూరి కళాశాలలో నుండఁగా శాస్త్రిగారికి, కాకినాడ విద్యార్థులు మా 'కళాశాల' కుఁ దయచేయుఁడని యుత్తరములు వ్రాయ, "నేను గౌతమీస్నానమునకుఁ గొవ్వూరిలోఁ జేరితిని గాని, ఉద్యోగము చేయుటయే ప్రధానోద్దేశము కా" దని సమాధానము పంపిరని తెలిసినది.

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు నైష్ఠికులు. పండితులు. కవులు. రసహృదయులు. శాంతచిత్తులు. వారిపేరు తెలుఁగువారు మఱచిపోరు. వారి కృతులు మనభాషకు భూషలు. ఇట్టివాఁడు కనుకనే సుబ్రహ్మణ్య

శాస్త్రినిగూర్చి కింకవీంద్రఘటాపంచాననుఁడు చెళ్ళపిళ్లకవి "పేరికతండు శిష్యుఁడని పేర్కొన కొప్పక పోదుఁగాని కై, వారను గాదు నాకతఁడు వారక దేశికుపంటివాఁడె......" యని మెచ్చుకొనెను. సర్వధా సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ధన్యులు. పుత్రసంతానములేని కొఱఁత వారి విషయములోఁ గొఱఁతయేగాదు. "పుత్రాత్సద్గతి రితిచేత్తదపి ప్రాయోఽస్తి యుక్త్యసహమ్" అను శాంకరసూక్తి నెఱిఁగినవారి కటు లనుపించదు. సంగీతసాహిత్య తత్త్వవేత్త యగు శ్రీ హరి నాగభూషణముగారు వీరి యంతేవాసి. వారేకాదు, మఱియెందఱో శాస్త్రిగారి సేవాభాగ్యము వడసి, పండితులై కవులై పేరుపెంపులు గాంచిరి.

సుబ్రహ్మణ్య శాస్త్రిగా రవధాన సందర్భములలోఁ గావించిన దేవీస్తవము లివి పరికించినచో, ఆయన యెన్ని సంస్థానములలో సత్కారములు గాంచెనో వ్యక్తమగును.

సీ. ఏ దేవి దయ జయమిప్పించె సత్కళా
        పూర్ణమౌ "నెల్లూరు" పురమునందు
ఏతల్లి బిరుదంబు లెనయించె నల "పెద్ద
        పవని భూపాలుని" సవిధమందు
ఏయమ్మ కారుణ్య మేదుగడగ నుండె
        "కందుకూరి" వధాన కార్యమందు
ఏమాత ధారా సమృద్ధుల నెసఁగించె
        నెట్టన "కనిగిరి" పట్టణమున
గీ. అట్టి లోకైకజనని, హృదంబురుహ ని
రంతరాభ్యర్చ్యమాన పాదాంబుజాత
జాతరూపమణీ విభూషా విశేష
భూషితాకార నన్ సభఁ బ్రోచుఁగాక !

"తెనుఁగు కావ్యాదర్శము" లోని పద్యము :-

సీ. లష్కరు నగరి కల్లవ్వసత్రంబున
                    నష్టావధానంబు సంతరించి
    గద్వాల నగరున విద్వత్సభ నశీతి
                    లేఖినీ కవన మల్లింపఁజేసి
    ఆత్మకూరు నగరి నాశుకవిత్వ లీ
                    లాస్ఫూర్తి రాజవాల్లభ్య మొసఁగి
    ముక్త్యాల నృపుచెంత మోహనంబైన యు
                    పన్యాసధోరణి వరలఁజేసి

గీ. తగఁగఁబలుచోట్ల నష్టావధాన సభల
    నాశుధారాకవిత్వ మహత్త్వ మిచ్చి
    నన్నుమనుచు మాతల్లి మనఃప్రమోద
    దానసంతాన వల్లిమతల్లిఁ గొలుతు.

వేలూరి శివరామశాస్త్రి

1892

తల్లి: శ్రీవిశాలాక్షి. తండ్రి: వేంకటేశ్వరావధానులు. గ్రామము: చిరివాడ (కృష్ణామండలము). జననము: 1892 సంవత్సర ప్రాంతము. కృతులు: ముద్రితములు— ౧. సోముఁడులేక ఉత్తరహరివంశ విమర్శము (1919 లో విరచితము) ౨. ముక్తాలత (ప్రబంధము. 1910 లో విరచితము) ౩. తాలఁకుట్టనము (విమర్శనము 1913 విర) ౪. తెనాలి శతావధానము, కొవ్వూరు, చట్రాయి, తెనాలి, బెజవాడ, గుంటూరు కాలేజీ శతావధానములు. ౫. కృతకసూత్రము (ఖండకావ్యము. 1910) ౬. మాధవవర్మ (నాటకము) - 1920 ముద్రితము.) ౭. ఉపగుప్త. ౮. బిడాలోపాఖ్యానము (పద్యకథ. 1911 ముద్రి.) ౯. ఆత్మకథ (మహాత్మా గాంధి జీవితము. వచనానువాదము. ౨ సంపుటములు) ౧౦. కథలు - గాథలు [రవీంద్రుని వంగభాషలోని 'కథా' యను గ్రంథమున కనువాదము 1940 ముద్రి.] ౧౧. ఏకావళి. [ఖండ కావ్య సంపుటి. 1940 ముద్రి.] ౧౨. రాముని బుద్ధి మంతనం. ౧౩. సర్వేను వీలునామా. ౧౪. తీరనికోరికలు. ౧౫. బాపనపిల్ల. [ఈ నాలుగును శ్రీ శరచ్చంద్రుని నవలల కనువాదములు.] ౧౬. కథాషట్కము. ౧౭. కథాసప్తకము.

శివరామశాస్త్రిగారు కావ్యరచనలోఁ గథారచనలోఁ గ్రొత్త వాటములు తీసిన గొప్ప రచయితలు. ఆంగ్ల వాఙ్మయమున, వంగ వాఙ్మయమున, పరాసు వాఙ్మయమున వారెఱుఁగని గ్రంథములును జూచిరి. సంస్కృతమునఁ జెప్పనేల! వ్యాకరణము, న్యాయము, వేదాంతము గురుకుల క్లిష్టులై యధ్యయనముచేసిరి. ఆంధ్రవిషయమున వారి కృషిని గూర్చి వేఱే వ్రాయను. శతావధానములు పలుచోటులఁ బోటీగాఁ జేసిరి. ఆశుకవిత్వములు 'నీవా? నేనా?' యని ప్రదర్శించిరి. ప్రబంధములు, ఖండకావ్యములు నవీన రీతులతో నంతరించిరి. సంగీ

తము గురుముఖమున నేర్చికొని, రాగధోరణిని పద్యములు చదువుచు మధువు లొలికించిరి. నేఁడును శివరామశాస్త్రిగారు సూరవరపుఁ దోఁటలో నిల్లు కట్టుకొని యున్నారు. అపుడపుడు పత్రికలలోఁ బద్యములు, కథలు, సాహిత్య విమర్శములు వెలువరించుచున్నారు. నడుమ నడుమ సభలలోఁ బాల్గొని, తీయని గొంతెత్తి విసరుచున్నారు. కాని, మానసికముగాను, కాయికముగాను పూర్వోత్సాహము, పూర్వదార్ఢ్యము తఱిఁగి "తేహినో దివసా గతాః" అనుకొనుచుఁ గాలక్షేపము చేయుచున్నారు. శాస్త్రిగారి జననము 1892 లో. అనఁగా నీ రచన నాఁటికి వారి కేఁబది యేడవ యేఁడు సాఁగుచున్నది. ౧౯౨౬వ సంవత్సరము శాస్త్రిగారి జీవికలో నొక పెద్ద మార్పు తెచ్చినది. ముప్పది నాల్గేండ్ల వయస్సు దాఁటిన తరువాత నున్న శివరామశాస్త్రి గారు వేఱు. దానికిఁ గారణము క్రమముగా ముందుఁ దెలిసికొందము.

శివరామశాస్త్రి గారు కలిగిన కుటుంబములోని వారు. వీరి పూర్వులెల్ల మంచి శిష్టులు. వీరి తండ్రిగారు వేంకటేశ్వరావధానులుగారు. తగిన గురువులతోఁ గావ్యనాటకాదులు పఠించి, సిద్ధాంత కౌముది నధ్యయనించి శ్రీ జయంతి భగీరథ శాస్త్రిగారి సన్నిధిని 'వ్యాకరణ మహాభాష్యము' పాఠము చేసికొనిరి. ఈ లోపుననే తర్క-వేదాంత గ్రంథములు కొన్ని సందర్భము ననుసరించి యాయా పండితులకడఁ జదివిరి. శ్రీ భగీరథశాస్త్రిగారి గురుత్వమే శివరామ కవికిఁ బేర్కొనఁ దగినదై నది. భార్యతోఁ గాఁపుర ముండి 'యింజరము' లో భగీరథ పండితునికడ మహాభాష్యము చదువుకొనుట, శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారి గురుత్వమున సాహిత్యపుఁ బొలుపులు, శతావధానపు మెలఁకువలు తెలిసికొనుట, శివరామ శాస్త్రిగారి విద్యార్థి దశలలోని విశేషములు. పేరునకు విద్యార్థి యన్నమాట గాని, యప్పటి కప్పుడే శివరామశాస్త్రి మంచిపండితుఁడై, మంచి కవియై చాలగ్రంథములు

రచించెను, రచించుచుండెను. వేంకటశాస్త్రిగారి వెనుక సభలకు, సంస్థానములకు, శతావధానములకుఁ దిరుగుచు ముందునకు వచ్చెను. వచ్చి 'గుంటూరు కళాశాల' లోఁ బ్రతిజ్ఞజేసి 'సహిప్రతి' యన్నట్లు శతావధానము గావించెను. అప్పటికి శివరామకవి కిరువదియేండ్లు దరిలో నుండును. 1911 సంవత్సర ప్రాంతము. తిరుపతివేంకటకవులకు, కొప్పరపు సోదరకవులకు వాగ్యుద్ధములు జరుగుచున్న సమయ మది. తిరుపతి కవులకు శిష్యుఁడగుట శివరామకవి గురువిరోధుల నెదురుకొని యిట్లు సింహాగర్జనము గావించెను-

మ. అనిమిత్తంబుగఁ గాలుద్రవ్విన త్వదీయా హంత నాఁపుం దలం
పున నీ నీరస నిర్గుణాశుకవనంబుం జెప్పి నిన్గెల్వ నెం
చిన యస్మద్గురువర్యులన్ సుకవితా శ్రీధుర్యులన్ మానిపిం
చి నినున్ గెల్వఁగ వచ్చినా నిదె సభం జేయింతువో? వత్తువో?

గుంటూరు కళాశాలలో నేర్పాటు చేయఁబడిన యవధాన మప్పటి పరీక్షార్థమే. నిరాక్షేపముగ శతావధానము కొనసాఁగినది. సభాసదులు మెచ్చిరి. గురువులు తిరుపతికవులు శిష్యుని శివరామకవిని మెచ్చి యిటులు దీవన లిచ్చిరి-

మ. జగతీనాథులు పెక్కుమంది ముదితస్వాంతంబునం గాన్కలం
పఁగ సాంగంబు సలక్షణంబుగ శరద్ద్వావింశతిం బేర్మి హె
చ్చఁగ మాయేలిన యీావధాన కవితాసామ్రాజ్య భారంబు మో
యఁగఁ బూనంగదవయ్య! తండ్రి! శివరామయ్యా! చిరంజీవివై.

శా. బాల్యోద్రేకముమై నెదిర్చితివి కొప్రంపుంగవిన్ గ్రంథసా
కల్యంబుం బొనరింతొ లేదొ యని నీకై కొంకు నస్మన్మన
శ్శల్యం బిప్పటి కూడఁదీసితివి వత్సా! సత్సభాశోభివై
కళ్యాణంబులఁ బొందుమయ్య! యిఁకవీఁకన్ శిష్యచూడామణీ!

దానితో వేలూరికవి తెలుఁగువారికి బహుధా ప్రశంసనీయుఁడయ్యెను. క్రమముగఁ దెనాలి, బెజవాడ, కొవ్వూరు, చట్రాయి మున్నగు పలుతావుల నవధానములు గావించెను. చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారి ప్రధానశిష్యులలో నొకరుగఁ బ్రకటకీర్తి నందెను. 1915 లో వ్యాకరణము ముగించి యింజరమునుండి చిరివాడ చేరికొనెను. ఇంజరములో నున్నప్పటి వీరిచరిత్రము వినఁదగినది కలదు.

సదాచారసంపన్నుఁడగు నొకబ్రాహ్మణకుమారుఁడు పెండ్లి చేసికొనుటకు డబ్బులేక తంటాలు పడుచుండెను. అప్పుడతనికిఁ దమయింటఁగల బంగారునగ నమ్మివైచి వివాహమునకు వలసినంతసొమ్ము నొసఁగెను. అట్టియుదార హృదయు మాయనగారు. శతావధానము నభ్యాసము చేయుట కింజరములో నూఱుగురు పృచ్ఛకులు దొరకుదురా? పెద్ద మామిడితోఁటలోనికిఁ బోయి, యొకమిత్రునిచేఁ బ్రశ్నము లన్నియుఁ గాగితపుముక్కలపై వ్రాయించి కొమ్మలకుఁ గట్టించి పద్యములు చెప్పుచుండు వారు. అట్టి ధారణాబల మాయనది.

చిరివాడ చేరికొని వ్యాకరణ గ్రంథములు పాఠము చెప్పుచుఁ బద్మపురాణము నాంధ్రీకరించుచు కొనుచు, నాంగ్లము పఠించుచు శాస్త్రిగారు రెండేండ్లు గడపిరి. ఇంగ్లు, పరాసు భాషాగ్రంథములు చదువఁ జదువ సాధారణమైన తెలుఁగు కవితపై మన శాస్త్రిగారి కొకవిధమగు నేవము కలిగినది. అపుడు యతిప్రాసములు విడిచిపెట్టి మహాభారతములో నాడు సభాపర్వములు, షేక్స్పియరు ననుకరించి, పదినాటకములు ఋగ్వేద ఋక్కులు కొన్నియుఁ దెనుఁగులో వ్రాసి వెనుదిరిగి చూచుకొనిరి. ఆవిప్లవ మాయన యంతరాత్మకే నచ్చలేదు. అప్పుడు నిబంధనములు విడువక 'మణిమేఖల' యను నేడాశ్వాసముల ప్రబంధము రసభావ బంధురముగ రచించిరి. అందలి కవిత్వపు సొగసును గూర్చి, నాఁడు విన్న వారివలన వినుకలియే గాని యీ గ్రంథ మిపు

డుత్పన్నమై పోయినది. 'మణిమేఖల' రచించుకాలముననే 'సాహిత్య దర్పణము' నకును, 'రసగంగాధరము' కు ఆననము, 'ధ్వన్యాలోకము' సంపూర్ణముగను దెనిగించియుంచిరి. పై గ్రంథములెల్ల 'మణిమేఖల' తో పాటు పెట్టెలోఁ బెట్టుకొని యేలూరు శ్రీ దివాకర్ల తిరుపతి శాస్త్రుల వారి స్మృతి సభకు వెళ్ళి యుటనున్నప్పుడు, మకాములోఁ గల యాపెట్టె ధనాశచే రాత్రి దొంగలెత్తుకొని పోయిరఁట. అది మొదలు శివరామకవికిఁ గొంతరోఁత కలిగినది. ధైర్యముతోఁ గానీ యనుకొని పిదప వంగ వాఙ్మయము చదివెను. పరాసు గద్యవాఙ్మయము చూచెను. చదివి చూచి యప్పుడే యించుమించు నూఱుకథలు, ఐదు చిన్ననాటకములు సంఘటించెను. సాంఖ్య, న్యాయ, వైశేషిక దర్శనములు చదివి భాష్యములతోఁ దెనిఁగించెను. యోగవాశిష్ఠము నిర్వాణప్రకరణము వఱకు ననువదించెను. వేదాంతమునకు సంబంధించిన వేవేవో చిన్నచిన్న పుస్తకములు వ్రాసెను. పద్మపురాణమునఁ గొన్ని ఖండములపుడు వ్రాఁతలో నున్నవి. ఆసమయములో గ్రంథభాండారముతో నిండిన వీరి యింటిపై నలిగి యగ్ని మండిపడినది. సంస్కృతాంధ్రాంగ్లాది భాషలకు సంబంధించిన గ్రంథములెన్నో వీరి భాండారమున నున్నవి. శివరామ శాస్త్రిగారు నిత్యమక్కడనే కూర్చుండి ప్రతిగ్రంథము చదువుచుఁ, జదివిన గ్రంథముపైఁ దమ యభిప్రాయము వ్రాసి యాగ్రంథములోనే పెట్టి యుంచువారఁట. ఆయా గ్రంథములు తాము రచించి, యచ్చు వేయింతమనుకొనుచున్న గ్రంథములు సమస్తము 1926 సంవత్సరములో నగ్ని కాహుతియై క్షయించినవి.

ఈ పద్యము చదువుఁడు :

క. క్షయ వత్సరమున నాతప
భయమగు వైశాఖ కృష్ణపక్షంబున సూ

రయ దినమునన్ ద్వితీయో
దయమునఁ జిరివాడ యెల్ల దగ్ధంబాయెన్.

శివరామకవి నెత్తురుఁజుక్కలైన తన గ్రంథము లట్లు భస్మమైనవు డిటులు వగచెను:

ఉ. పెంచితిఁ బెద్దచేసితిని; ప్రీతియుతంబుగ రాణివాసమం
దుంచితి రాజయోగ్యకుసుమోపవనంబులు గ్రుమ్మరిల్లని
ర్మించితి విస్మరించితిని మేదిని మించిని నొక్కపెట్ట న
గ్నించితి నిన్ను నగ్గికిని బెన్ బలిగాఁ గవితాసరస్వతీ!

ఉ. కాల్చితి విల్లు సర్వమును గాల్చితి పాత్రము లూఁచుముట్టుగాఁ
గాల్చితి వెల్లయున్ ధనము కాల్చితి వెల్లయు ధాన్యరాసులన్
గాల్చితి వున్న వెల్లయును గాల్చినఁ గాల్చితికాక గ్రంథముల్
కాల్చననీకు నోజ్వలన! కడ్పుది నిండెనొ? కాలునిండెనో?

సీ. ఋగ్వేదమా! యష్టదిగ్గ్రంథులను నన్నుఁ
గన నెంతయడలితో కాలు నపుడు
వేదాంతమా! నన్ను వీక్షింప యోగదృ
ష్టతి నెంతవూనితో మాఁడు నపుడు
వ్యాకృతీ! యులయుజ్ఞగంతమా 'దృశి' నెంత
వఱపితో నాకయి చరమవేళ
కపితాకుమారి! నన్ గనుపొంబె నెన్నిము
ఖాలదుఃఖించితో గ్రాఁగుతఱిని

గీ. కట్ట! సాహితిరో నన్నుఁగౌఁగిలింప
నెంత చేతులు చాఁచితో యేమనందు
నన్నుఁ గంకాళమును జేసి చన్నవారె
పుస్తకములార! విజ్ఞానవుటములార!

అంతనుండి శివరామకవి యుత్సాహము సన్నగిల్లెను. అగ్నిప్రమాదమున కొకసంవత్సరము వెనుకనే యేకాంతవాసము కోరి మనశాస్త్రిగారు నూరవరమున నొకతోఁటకొని యందిల్లుకట్టి నాలుగేండ్లం దొంటరిగ నుండిరి. మొదటియింటిపై నగ్ని కోపించినతరువాత భార్యతోఁ దోఁట యందే కాఁపురము స్థిరపడెను. ఏకాంతవాసమున కీకవి యిటులఁ పలవరించును :

ఉ. ఏయొకరుండు లేని యొక యేటిసమీపతలంబునం దర
ణ్యాయతనంబునందును దటాకతటంబునయందుఁ దోఁటయం
దాయతశైలశృంగమునయందు జనించు మహావనీజమం
దూయెల యొందు వాసనము నొందును దప్పక నాకుఁగావలెన్.

శివరామ శాస్త్రిగారు వ్యుత్పత్తియుఁ బ్రతిభావమునుగల కవి. భావనలో వారికి దీటు వచ్చువారు నేఁటివారిలోఁ దక్కువగనున్నారు. "ఒక్కభాషగాడు తక్కినభాషల నన్నిఁ గూడ నేర్వుమయ్య యాంధ్ర!" యని ప్రబోధించి యన్యవాఙ్మయము లెన్నిఁటితోడనో పరిచయము గలిగించుకొన్న కవివరుఁడాయన. రవీంద్రుఁడు వంగభాషలో రచించిన 'కథా' యను గ్రంథమును 'కథలు, గాథలు' అనుపేరు పెట్టి తెనిఁగించెను. శ్రీ శరచ్చంద్రుని నవల లెన్నో తెలుఁగులోనికి మార్చెను. పరాసు వాఙ్మయపుఁ బోకడలతోఁ గథలు వచనమున వందలు వ్రాసెను. అన్నిరచనలయందుఁ దెలుఁగు స్వతంత్రతను ముద్రించుకొనెను గాని, యనువాదము లనిపించునట్లు రచింపలేదు. తెలుఁగు పలుకు చదువని యాంధ్రు నీకవిగారు సహింపక యీ విధముగ నిలువఁ దీయుచున్నారు.

క. తెలివికి సంస్కృతమున్ మఱి
కలిమికి నాంగ్లేయమో యిఁకం దురకంబో

విలువ యిడి నేర్చి యీ నీ
తెలుఁగెవ్వరి పాలు చేసి తిరిగెద వాంధ్రా!

శివరామ కవిగారు 'పురాణ మిత్యేవ నసాధు సర్వం నచాపి కావ్యం నవ మిత్యవద్యమ్' అను సిద్ధాంతము కలవారు. వేదఋక్కుల నుండి, యుపనిషత్తులనుండి వాక్యము లెత్తిచూపి, నేఁటి 'భావ కవిత్వ' మనఁబడు నుత్తమజాతి కవితతో వానికి సామరస్యము చూపుదురు. ప్రాచీనాలంకారికులు పేర్కొనిన భావధ్వని - రసధ్వని యను వానికి నేఁటి భావకవితకు సాజాత్యము సప్రమాణముగఁ జూపి, యట్టి కవిత యిప్పటి వారిలోఁ దక్కువమంది కలవడినదని వీ రందురు. ఆంధ్ర భాషలో నేఁడు పొడచూపుచున్న విప్లవము లన్నియు శివరామశాస్త్రి గారికిఁ గ్రొత్త లనిపించవు. వీరి మనస్సులో నాంధ్ర కవిత్వముపై నెన్నో తడవలు విప్లవభావములు పుట్టినవి. అవి కార్యరూపమును గూడఁదాల్చినవి. యతి ప్రాస బంధములతో కవిత్వము వ్రాయుటయే గాక, ప్రాచీన ధోరణితో అష్టాదశ వర్ణనములతోఁ బ్రబంధము వ్రాయుటయు నీయన మనస్సునకు నచ్చినది కాదు. "ముక్తాలత" కల్పిత కావ్యము 1910 లో రచించెను. "అందు వచ్చు పాత్రలు ముగ్గురు. శమజయంతు లిరువురు సహాధ్యాయులు, చెలికాండ్రు. వారిలో శముఁడను వానిని 'ముక్తాలత' యను వారకామిని కామించెను. అదిమెచ్చఁగి ముక్తాలతపై మనసుంచుకొని జయంతుఁడు శమునిఁజంపెను. మనమొందుల కని ముక్తాలత మడిసెను. దానితో జయంతుఁడును బ్రాణములు విడిచెను." ఈ కల్పనము మన పూర్వ కావ్యసంప్రదాయమునకు విరుద్ధము. 'మాధవవర్మ' యను నాటక మొకటి వీరు విషాదాంతముగా రచించిరి. ఈ రకముగఁ బాశ్చాత్య సంప్రదాయములు మన తెనుఁగులో నెన్నియో జొనిపి 'శివరామశాస్త్రి కూడ విప్లవకారుఁ' డన్న పేరు గొన్నారు. శాస్త్రిగారికిఁ గల యీ సంస్కృతిభావములకు

గారుపు లోకరు లేరు. ఆంగ్ల, వంగాది భాషా గ్రంథావలోకనమే యక్కడ ముఖ్యకారణము. అది యటుండె, ఈయనకుఁ జాలకళలలోఁ జక్కని మెలుక యున్నది. సంగీత మెఱుఁగుదురని వ్రాసియుంటిని. అభినయ కళలోఁ బ్రవేశ మున్నది. నాటకము లన్నను, చలన చిత్రము లన్నను మక్కువ చూపుదురు. 'జయాపిల్మ్సు' వారి 'జరాసంధ' కు కథాసంవిధానము గావించినది వీరేగదా? ఇంక కథారచనములోఁ జెప్పవలసినపుడు వీరు సిద్ధహస్తు లనవలయును. ధ్వని ప్రాయముగ నున్న వారి పలుకుఁబళ్ళు కథలలోనైతము కావ్యత్వమును స్ఫురింప జేయుచుండును. సాధారణముగ వీరి కథలెల్ల సలక్షణ భాషలోనే నడచినవి. ప్రతి కథ యందును, సాహిత్య వాసన యుండును. భావ గంభీరత యుండును. కథా కల్పనము విషయమున నీయనను మించినవారు నేడు కొందఱున్నారుగాని, వచన రచనా విషయమున నీయనను దాఁటిన వారు నా దృష్టిలో మిక్కిలి తక్కువ. భాష సలక్షణ మగుటయు, భావము గంభీర మగుటయుఁ, బలుకుబడి మితముగా నుండుటయు, ధ్వనికిఁ బ్రాధాన్య మిచ్చుటయు వీరి వచనములోని ప్రచురగుణములు. మచ్చున కొక కథలోని పంక్తులు పది తీసి చూపెదను.

'నా బయటి తెర ఉష్ణాని పోయినదికాని నామనస్సుపై దట్టముగా పడినది. వెన్నెల, సెలయేళ్లు, ఉద్యానములు, తీవలు, పూవులు, మలయ వాయువులు, ఋతువులు, హంసలు, నెమళ్లు, కోయిలలు, తుమ్మెదలు, జలయంత్ర శాలలు, అంగరాగములు, శయ్యలు పుటముపెట్టఁగా, శరీరపు మూసలో నామానసము తుకతుక ఉడికిపోయెను. అపూర్వమైన కాంతి మండలము నా ప్రత్యవయవమును గుడికట్టెను. కపోల విన్యస్తహస్తనై న నన్నప్పుడు ధర్మారెడ్డి చూచినఁజాలును. నరోత్తమరెడ్డి చూడకున్నఁ జాలును. అంచుమట్టముగాఁ దేనెపోసి రేకులు కుట్టివైచిన పూవువలె నే నవు డుంటిని. ఈశ్వరుఁడు నన్నొక సుఖపిపాస కాలవాలము కావిం

చెను. నాలో నేనే దహించుకొని పోయితిని. నా కీ జగతి యంతయు నిస్సారముగాఁ దోఁచెను. ధర్మారెడ్డి చిత్తరువేని లేనియెడల నామీఁద చపుటిదిబ్బగా నుండెడిది. ఒకరేయి యంతయు నేనాచిత్తరువు నెదుట నుంచుకొని కూరుచుంటిని. కొంతసేపు దానితో వినోదించితిని. క్రమ క్రమముగా నాకనులవెంట బాష్పములు స్రవించినవి. తెల్లవారు లటులే కూరుచుంటిని. అపుడు మయూరము లొకటొకటి లేచి స్తంభమెక్కి కూయఁదొడఁగెను... నేను స్వప్నమున ధర్మారెడ్డి కొక ఉత్తరమును వ్రాసితిని. వ్రాఁతకుపకరణము కలముకాదు. వ్రాఁత కుపయోగించినది కాగితమును గాదు. ఇచ్ఛ నా మానసముమీఁద నన్ను కరఁగించి కరఁగించి కరకరాకు సిరాచేసి అక్షరములుగా పోసినది. అపుడు ధర్మారెడ్డి నాలో ఒకభాగముగా నుండెను. నాన దానిని పఠించెను....'క్షమాపణ' కథ 'భారతి' ప్రభృతులగు పత్రికలలో వెలువరింపఁబడిన వీరి కథానికలు కుప్పలుఁగూరలు. వానినెల్ల సంపుటీకరించి ప్రచురించుట తెలుఁగు బాసకుఁ గడు మేలుసేఁత.

వ్యావహారికమునకూడ శాస్త్రిగారు తఱచు వ్రాయుచుందురు. శ్రీ శరచ్చంద్రుని చిన్న నవలలు వాడుకభాషలోనే వ్రాసినారు. ఏమి వ్రాయునిందు, ఏభాషలో వ్రాయునిందు, తీరుతియ్యములు గల నిందుఁ దెలుఁగులో రసవిలసితముగ వ్రాసి పాఠక హృదయముల వలపైచి లాగుదురు.

గాంధిమహాత్ముని 'ఆత్మకథ' రెండుసంపుటములలో వీరు తెనిఁగించి 'ఆంధ్రగ్రంథమాల' వారి కిచ్చిరి. అందలి వచనరచన దిరిసెనపుఁ బువ్వు వంటి మెత్తఁదనముతో నున్నది. శాస్త్రిగారి ప్రకటిత గ్రంథములలో 'ఆత్మకథ' కన్నాకు. శివరామకవికి మహోదాత్తమైన విద్వత్తయున్నది. మహనీయమైన భావనా పటుత్వమున్నది. పద్య గద్యరచనలలో వాట మైన వడుపుసొంపు లున్నవి. అన్య వాఙ్మయ కవితా రహస్యములలో

నెక్కడలేని యెఱుకయు నున్నది. కాని, వానికన్నిటికి ననురూపమైనది కాదు వారి సాహిత్యసేవ. యౌవనము ధారవోసి వ్రాసినగ్రంథము లెన్నో మసిమైపోవుటయు దొంగలెత్తుకొని పోవుటయు జరిగి శాస్త్రిగారి యుత్సాహ మూడనిచ్చెను. ఇప్పటికిఁ బది పండ్రెండేండ్లనుండియు హృదయ దౌర్బల్యముపొడమి మఱింత దిగాలుగనున్నారు. అయినను, ఓపిక వచ్చినపుడెల్లఁ గథయో, కావ్యమో, వ్యాసమో వ్రాసి తెలుఁగు వారికి విందు లొనర్చుచునే యున్నారు.

శ్రీ శాస్త్రిగారి ఖండకావ్యసంపుటము 'ఏకావళి' లోని 'పదములు' అను శీర్షికతో నున్నపద్యములలో నొకపద్యము చిట్టచివర స్మరణకుఁ దెచ్చుకొని చాలించెదను.

సీ. వీణియపైఁజేయి వేయదు వాగ్దేవి
మానైజ సంగీతమహిమ వించు
నలినాననుని నాల్గునగుమోము లెక్కడె
క్కడ నంచుమాకు స్వాగత మొసంగు
మానివర్యులు మనోమందిరంబుల యందు
నలరింత్రు మాకు సింహాసనంబు
కవిరాజు లమృతంబు కడఁగఁగఁ బెట్టి మ
మ్మాదరింతురు భావమేదురముగ
మేములేకున్న మూగలు మీరలెల్ల
మేమువచ్చిన వాక్పతుల్ మీరలెల్ల
మేములేకుంట మీచెవి మింటిగుంట
మేముకలమేని మీచెవి మేజువాని.

తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి

1892

వెలనాటి శాఖీయ బ్రాహ్మణుఁడు. ఆపస్తంబ సూత్రుఁడు. భారద్వాజ సగోత్రుఁడు. తల్లి: లక్ష్మీదేవమ్మ. తండ్రి: కృష్ణశాస్త్రి. జన్మస్థానము: గుంటూరు మండలములో మంగళగిరి క్షేత్ర సమీపమున నున్న కాజ గ్రామము. జననము: నందన సంవత్సర భాద్రపద బహుళ షష్ఠీ సోమ వాసరము. 12-9-1892.

కృతులు: ౧. కావ్యావళి. [రెండు భాగములు] ౨. హృదయేశ్వరి [ఉపకావ్యము] ౩. పద్మావతీ చరణ చారణ చక్రవర్తి [పద్య నాటిక ౧౯౩౬ ముద్రి] ౪. రాజజామాత. ౫. సహజయానపంథీ. ౬. నోణక భార్య ౭. వరపరీక్ష [ఈ నాలుగు గీతి నాటికలు] ౮. వకుళమాల [గీతికాస్వగతము] ౯. రత్నాకరము [గీతికాసంవాదము] ౧౦. ఆవేదన [ఖండకావ్యము] ౧౧. కవిప్రియ [పద్యనాటిక] ౧౨. యక్షరాత్రి [గీతినాటిక] ౧౩. సాధకుడు [వాకోవాక్యము] ౧౪. కవిరాజు [సర్గ బంధము] ౧౫. వ్యాకరణ దర్శన చరిత్ర [ఆంధ్రీకరణము ఈ రెండును రచనలో నున్నవి] ౧౬. మహారాష్ట్ర జీవనప్రభాతము. ౧౭. జీవనసంధ్య. ౧౮. మాధవీ కంకణము ౧౯. రమాసుందరి. ౨౦. కాంచనమాల. ౨౧. కుంకుమభరణి [అచ్చుపడిన నవలలు] ఇత్యాదులు.

'శ్రీకృష్ణలీలాతరంగిణి' రచించిన శివనారాయణతీర్థులు పూర్వాశ్రమములో తల్లావఝ్ఝలవంశీయు లని ప్రసిద్ధి. రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయఁడుగా రీవంశమువారికి నాలుగువందల యకరముల మాగాణి బహుమానమిచ్చినారు. అదియిపుడు విచ్ఛిన్నమైపోయినదేమో, కాని నేఁటికిని కాజగ్రామములో "తల్లావఝ్ఝలవారిచెఱువు" అనియున్నది. పెక్కుతరములనుండి తల్లావఝ్ఝలవారు సంగీతసాహిత్యములలో మంచి నిపుణత గాంచి వచ్చుచున్నటులు వినుచున్నాము.

శ్రీశివశంకరశాస్త్రిగారి ప్రతిభ యీనాఁడు సాహిత్యలోకములోఁ బ్రత్యక్షముగఁ గనుచున్నాము. ఆయన మంచి సంస్కృత పండితుఁడని

వాడుక. వాడుకయేగాని రెడ్డిగముప్పై చుకొని శిష్యులకుఁ బాఠప్రవచనము చేసినవాఁడు కాఁడు. ఆయన, అథమపక్షము 'మెట్రిక్యులేషన్' పరీక్షలో నైన సముత్తీర్ణుఁడు కాకపోయియుండఁడని కొందఱ నమ్మకము. నమ్మకమే కాని, నిజమునకాయన యటులు కాలేదు. పరీక్షకుఁగూరుచుండి 'జామిట్రి' పశ్న పత్రము చూచుసరికి విరక్తి కలిగి, కాగితములపై బొమ్మలుగీసి యిచ్చివై చెనఁట. ఆ యుచితజ్ఞుఁడు రేఖాగణితమునకు రేఖలతోనే సమాధాన మీయవలయు ననుకొన్నాఁడు కాఁబోలు! శివశంకరశాస్త్రి గారికి పాళీప్రాకృతములు, వంగము, మహారాష్ట్రము, హిందీ, మున్నగు వాఙ్మయములతోఁ జక్కని పరిజ్ఞానమున్నదఁట. గ్రీకు, లాటిన్, జర్మన్, సారస్వతములు సవిమర్శముగ జూచిరఁట. శాస్త్రిగారు మహాకవులని నేఁటి సాహిత్య ప్రపంచమున నొక ప్రతీతి. ఆలోచించినచో నచ్చుపడినంతలో నాయనవి మహాకావ్యములు లేవు, ఉపకావ్యములు, ఖండకావ్యములు, గీతినాటికలు, పద్యనాటికలు తప్ప తల్లావఝ్ఝలవారు మంచికథకులని దేశములోఁ బ్రథితి. వంగమునుండి హిందీనుండి యనువాదములే హెచ్చు. "నీలకంఠం కథలు" మాత్రము చాలవ్యాప్తిలోనికి వచ్చినవి. శాస్త్రిగారికి సంగీతములో నుత్సాహమున్నదిగాని, మధురముగాఁ బద్యము చదువఁగ నేను వినలేదు. ఆయనకు శిల్ప- చిత్రకళలలో నెనలేని యభిమానమున్నది. వానిలోఁ బ్రత్యేకమైన పరిజ్ఞానముకూడ సంపాదించిరి.

ఇదంతయు శ్రీ శివశంకరశాస్త్రిగారి జీవన గ్రంథమునకుఁ జిత్రమైన నా తొలిపలుకు. శాస్త్రిగారు నవ్యసాహిత్య ప్రపంచములో కవులుగా, రచయితలుగా, కళాభిమానిగా, సభాపతిగా, పేరుగన్నవారు. ఒకవిధముగు నాధునిక సాహితికి శివశంకర శాస్త్రిగారిది యాచార్యపీఠము. ఆయన ప్రతిష్ఠకుఁ బ్రధానముగా నాయనలో వెలసిన మూఁడుగుణములు కారణము. కవిసామాన్యమున కుండని సహనశక్తి కలిగి, వినుగు విరామములేకుండ యువకవుల రచనలు

సరిచేసి యొసఁగుట యొకటి-అనేక వాఙ్మయములలో నచ్చుపడిన గ్రంథము లెల్లఁ జూచి, ఆయా సారస్వత రహస్యము లర్థము చేసికొని సంభాషణసమయములో సాహిత్య సముద్రుఁడువలెఁ దోఁపింపఁజేసి కొనుట రెండు-పద్యరచనలో, వచనరచనలోఁ బత్రికా సంపాదకతలోఁ గ్రొత్తదారు లేసిచూపుట మూఁడు- శివశంకరశాస్త్రిగారు ఏవంవిధ గుణత్రివేణీ సంగమ తీర్థము. ఈ తీర్థములో నవగాహించిన తెలుఁగు యువకు లెందఱో!

శాస్త్రిగారు పండ్రెండవయేఁటనే కవితకు శ్రీకారము చుట్టుకొనిరి. నోరి హనుమచ్ఛాస్త్రిగారికడ ఛందస్సుకూడ నేర్చిరఁట. ఛందస్సుకూడ నొక శాస్త్రముగాన, ఆ శాస్త్రీయవిషయము లేవో కొన్ని గురుముఖమున వినుటయేగాని పద్యములల్లుట నేర్చుకొనఁగా వచ్చునది కాదు. అభ్యాసాగత మైనది యట్లయుండును. మనశాస్త్రిగారికిఁ గవితాగురువు ప్రతిభయే. వీరి కననేల! సహజకవుల కందఱకుఁ బ్రతిభయే గురుత్వము చేయును.

'మెట్రిక్యులేషన్' వఱకుఁజదివి శాస్త్రిగారంతతోఁ బాఠశాలచదువు చాలించి, కంభంపాటి సీతారామ శాస్త్రిగారు, వేదాంతం శ్రీ రామ శాస్త్రిగారల సన్నిధిని సంస్కృత సాహిత్య గ్రంథము లధ్యయనము చేసిరి. వేదాంతము లక్ష్మీపతి శాస్త్రిగారియొద్ద వ్యాకరణము, శ్రీ జగద్గురు కల్యాణానంద భారతీ స్వాములతో వేదాంతము పాఠము చేసిరి. కురుగంటి శ్రీ రామశాస్త్రిగారి కడ నైయాయిక గ్రంథములు చదువుకొనిరి. ఆతరువాత దర్శనములలో స్వయంకృషి. వినఁబడినభాష, కనఁబడిన గ్రంథము చదువక విడువలేదు. వివిధ సారస్వతములలో సొగసులు కనుపట్టి తెలుఁగులోఁ జొనుపు నేరుపు వీరి కధికముగనున్నది. 'సాహితీసమితి' కి సభాపతిత్వము నిర్వహించి యువకవుల నెందఱనో ప్రోత్సహించెను. 'నవ్యసాహిత్యపరిష' న్నిర్మాణ కర్మకారులలోఁ బెద్ద

భారము మోసినవారు శివశంకర శాస్త్రిగారు. సాహితి, సఖ, పత్రికలకు వీరు సంపాదకత సాగించి నవ్యసాహిత్య పత్రికలకు మెఱవడిగల యొరవడి పెట్టినారు. 'ప్రతిభ' కు సంపాదకవర్గములోనివా రని జగ మెఱుఁగును. ఆఖ్యాయికాపరంపర, సాహితీ సమితి పరంపర, సరస్వతీ గ్రంథ మండలి, విశ్వజనీన గ్రంథావళి, ఆంధ్రప్రచారిణీ గ్రంథమాలలకుఁ బడిన శాస్త్రిగారి సంకలనముద్ర లోకవిదితమైనది. అదిగాక, శివశంకర శాస్త్రిగారి కచ్చుపనులలో నసాధారణమైన తెలివియున్నది. ముద్రణ సౌందర్యము కొఱవడిన గ్రంథమాయన ముట్టఁడు. ఆయన వ్రాతపుస్తకము ముద్రిత పుస్తకములవలె సంతరించుకొనును. అచ్చుతప్పులున్న గ్రంథము నాయన మెచ్చఁడు సరికదా, అది తెలుఁగువారి యసడ్డయని విసుగుకొనును. తాను సంపాదించిన పత్రికలకుఁ బంపిన వ్యాసములకు సొంతముగా మఱియొక ప్రతివ్రాసి మఱి యచ్చున కిచ్చుచుండు నలవాటీయనలోనున్నది. రమణీయార్థము నెంత యారాధించునో, గ్రంథ బహిస్సౌందర్యము నంతగా నారాధించుకవివరులు శివశంకర శాస్త్రిగారు.

కవితతోపాటు శిల్పము- చిత్రకళ ఈరెండు వీరిని వలపించిన కళలు. ప్రత్యేకించి యీకళలలో రెండుమూఁడేండ్లు పరిశ్రమించిరి. ప్రాచ్య పాశ్చాత్య శిల్ప-చిత్రకళలతో వీరికిఁగల పరిచితి, ఖండాంతర వాసుల పరిచయమును జేకూర్చినది. కాని, శాస్త్రిగారిది చేసిన శిల్పము, గీసిన చిత్రము నేనరయలేదనుట చిత్రము కాదు. అయిననేమి! ఆ యీ కళా విజ్ఞాన సంబంధి గ్రంథము లెన్నో వాఙ్మయములలో వారు చదివి యుందు రనుటలో నాశ్చర్యములేదు.

వయస్సుతోపాటు శాస్త్రిగారి వేషములో మార్పులు చాల వచ్చుచున్నవిగాని, భాషావిషయకముగ మనసు మార్చుకొనని నవ్య సాహితీయోధుఁ డాయన. పద్యము గ్రాంథికభాషలోను, గద్యము వాడుక భాషలోను, గేయము మిశ్రమభాషలోను వ్రాయుట వీరికి

మతము. యతిప్రాసములు, శబ్దాలంకారములు విసరి పాఱవేయ వలయు నన్న యభిప్రాయము వీరికిలేదు. పద్యములనడుమ వచనము నిఱికించు టను శాస్త్రిగారు సహింపరు. అందులకే వీరివన్నియుఁ బద్యనాటికలు, గీతినాటికలును. కావ్యాత్మ రసమన్న వాద మనుసరింతురు. ఉపాసనలో శైవము, మతములో నద్వైతము వీరారాధింతురు. రాధాకృష్ణ భక్తి యనిన యాసక్తిమెండు. "పద్మావతీ చరణ చారణచక్రవర్తి" రచనము నీభక్తియే పురికొల్పియుండవచ్చును. శాస్త్రిగారికి బౌద్ధములో మంచి ప్రవేశ మున్నది.

1930-1931 లోను, 1932 లోను రాజకీయవిషయకముగ సంచరించి కారాగార ప్రవేశము చేసిరి. అక్కడ యువకుల నెందఱనో కవులుగ, నటకులుగ, కథకులుగ దిద్ది ప్రోత్సహించినారు. తెలుఁగులో నన్నయ - తిక్కన - శ్రీనాథులు వీరి ప్రేమకు స్థానమైన కవులు. భట్టుమూర్తి మీఁద, అంతకంటె వేయిరెట్లులు పోతనమీఁద వీరికి భక్తి హెచ్చు.

అభినవాంధ్రకవి నిర్మాణమునకు శాస్త్రిగా రొక యంత్రమని చెప్పుకొందురు. నాలుగు గేయములు గొలుకు కవిదగ్గరనుండి, మేలిమి కావ్యములు సంతరించు కవిదాఁక బుజ్జగించి చేరదీసి యోపికతో వారి రచనములు సరిచేసి, అవసరమైనచోఁ దా నొకప్రతి వ్రాసి, ప్రచు రణమున కుపాయములు సూచించు సహృదయత శాస్త్రిగారిలో ఘనముగ నున్నది. కృష్ణా గుంటూరు మండలములలో వీరిమూలమునఁ బేరునకు వచ్చిన రచయితలు పెక్కు రున్నారు. శాస్త్రిగారి నెవరోగాని 'చాకిరేవు' అని పరిహాసము చేసిరఁట. దీని యంతరార్థము, "ఎందఱో కవులు తమరచన వస్త్రము లిక్కడ ఉదుకుకొని పోవుదు" రని - నవ్య సాహిత్య పరివ్రచురణములపై వీరిచేయి పడనిది లేదన వలయును.

శివశంకరశాస్త్రిగారు వంగభాషలోనుండి శ్రీ శరత్ చంద్ర చట్టో పాధ్యాయుని రచనములు తెలుఁగులోనికిఁ దెచ్చిన వారిలో మొట్ట

మొదటివారయి యుందురు. ఇది సిద్ధాంతము కాక పోవచ్చును. సరస్వతీ గ్రంథమండలివారు వీరి "అరక్షణీయ" వెలువరించిరి. ఎందఱో తరువాతఁ దరువాత శరత్ చంద్రుని పూర్తిగాఁ దెలుఁగు వానిఁగఁ జేసికొన్నారు. అన్య సారస్వతములలోని యంద మెఱిఁగి యా రచనలు తెలుఁగులోఁ బెట్టవలెనని ప్రోత్సాహము చేసినవారిలో శాస్త్రిగారొకరనుటలో సంశయింపఁ బనిలేదు. హిందీనుండి, వంగము నుండి చాల రచనలు వీరనువదించినవి ప్రచురితములై యున్నవి. శాస్త్రిగారి వచనరచన బహు - సుందరముగనుండి సులభముగ నర్థమగు తీరున జాలువారును. పద్యరచనాసౌందర్యము వీరి కలములో నంతగా వెలయలేదని కొందఱి యభిప్రాయము. కాని, యఖండమైన వేదన నుండి వీరి కవిత ప్రాదుర్భవించినది. "హృదయేశ్వరి" యిందు లకు నిదర్శనము. ప్రణయ కవితకీ కృతి యాకరము.

మన్ననమ్మున లీనమై మాటు వడిన
విమల కవితా ప్రవాహము వెగ్గలించు
నిన్ను వర్ణింప నెంచిన నిమిషమందు
నీవు నాకు సరస్వతీదేవి వమ్మ!

ఇది వారి విశ్వాసము. ప్రేయసి యీయన దృష్టిలో మహాదేవి. ఆమె నొక పవిత్ర దృష్టిలో సంభావించుట వారి తలఁపు. రాధా కృష్ణుల ప్రేమ సౌభాగ్యము శివశంకర శాస్త్రిగారికి మేలు బంతి.

నిన్ను ధ్యానించు కొలఁది నిర్నిద్ర మగుచు
ప్రమదమునఁ జేరు మానస బంభరంబు
రాధికానాథు పాద నీరజ యుగమ్ము;
వింత గొల్పెడి నా ముక్తికాంతవమ్మ!

జీవిత సర్వస్వమయిన హృదయేశ్వరి శాస్త్రిగారి దృక్పథములో నెట్లు నిలిచి యున్నదో, యీ పద్యములు తారకాణించును.

"తలఁచుచున్నాను నా ప్రియతమ వటంచు
ఎంచుచున్నాను నిన్ హృదయేశ్వరి గను
వలచుచున్నాను జీవితేశ్వరిగ నిన్ను
భావనము సేయుచుంటి నిన్ దేవిరీతి.
నీవు ప్రాణాధికవు నాకు నిశ్చయముగ
వాంఛనీయ సుఖాధి దైవతమ నీవు
సాటిగానని నా సరస్వతివి నీవు
వాస్తవమ్ముగ భాగ్య దేవతవు నాకు.
నిన్ను ప్రేమించుచున్నాను నిశ్చయముగ
నీ యెడఁ జెలంగు నా ప్రేమ నిర్మలంబు
నిండు హృదయుంబుతో నన్ను నీకె మున్ను
అర్పణము చేసికొంటి సహర్షముగను."

బిల్హణుని కథ పద్యనాటికగా వీరు సంతరించిరి. దాని పేరు కవిప్రియ. బహుళముగాఁ బద్యనాటికారచనమే శాస్త్రిగారి కిష్టము. సంభాషణము సర్వము ఛందోబంధితమై యుండుటచేఁ గవిత్వ చారుత్వము కొంత కొఱవడియుండుట సహజము. వీరి 'కావ్యావళి' ప్రథమ భాగము ముద్రితమైనది. భానుమతి, లోపాముద్ర, శిష్యురాలు ఇత్యాది శీర్షికలతో వీరేటుకొన్న ప్రతి చరిత్రయుఁ బ్రాచీన సంస్కృతిని గుఱుతింపఁ జేయునవి. రచన ప్రాబంధిక ధోరణీ సనాథము. 'దివ్యలోచనాలు' అను ఖండకావ్యములోని యీ వృత్తములు చిత్తరంజకములు.

భగవద్రామానుజులు

పరమాకారణ జాయమాన కరుణాపాంగ ప్రసారంబునన్
భరితాజ్ఞాన దురంత సంతసమునన్ భంజించుచున్, విష్టప
స్థిర సంరక్షణ భార మూనిన మహాశ్రీరంగనాథా! భవ
చ్చరణాబ్జంబుల కే నొనర్చెద నమస్కారంబు భక్తప్రియా!

అవలోకింపుము వత్స! అల్లవె రమాహ్లాదానుసంధాన వై
భవముల్, ధిక్కృతభానుమండల రుచుల్, బ్రంహాండసందీపక
చ్ఛవులున్, భక్తిభరప్రసన్నజనతా సంరక్షణ ప్రాభవో
త్సవముల్, రంగశయాన దివ్యకరుణా సంఫుల్ల నేత్రాబ్జముల్.

ధనుర్దాసు

అహహా! యెంతమనోహరంబులు త్వదీయప్రస్ఫుర న్నేత్రముల్,
మిహిరప్రస్ఫుట చండమండల సమున్మేష ప్రభల్ కల్గియుం
దుహినాంశుద్యుతి శీతలమ్ములయి సంతోషంబొసంగెన్; భవ
న్మహిమంబొప్పు మహాద్భుతమ్ముగను శ్రీమద్రంగధామప్రభో!

అవలోకింపఁగనైతి నేఁటి వఱకు న్హాహాదుర్విపాకంబునన్
భువనత్రాణన భూరి శీతల కృపా పూర్ణ ప్రభావ స్ఫుర
ద్భవదక్షిద్వితయంబు! దేశికదయాప్రస్యంది వాఙ్మాధురిన్
నవసౌభాగ్యముకల్గె నక్కజముగా నాకో జగన్నాయకా!

స్థిరతాత్పర్యముతోడఁ గన్గొనినచో దేవా, భవన్నేత్రముల్
తిరుగన్నేర్చునె బుద్ధి యన్యనయనోద్రిక్త ప్రమోదంబునన్!
పరమప్రీతిని భృంగ మానసవసుధాపానాభిలాషన్ దళ
త్సరసీజంబుల వ్రాలుఁగాని యితరాబ్జంబులం జేరునే!

దుర్భాక రాజశేఖర కవి

1888

ములికినాటి శాఖీయ బ్రాహ్మణులు. తల్లి : సుబ్బమాంబ. తండ్రి : వేంకటరామయ్య. జన్మస్థానము : జమ్ములమడుగు. నివాసము : ప్రొద్దుటూరు. జననము : 18-10-1888 సర్వధారి సంవత్సర కార్తిక శుద్ధ పంచమి. కృతులు: ౧. వీరమతీచరిత్రము [3 ఆశ్వాసముల పద్యకావ్యము] ౨. చందన్నపాలచరిత్ర [పద్యకావ్యము] 3. సీతాకల్యాణము ౪. సీతాపహరణము ౫. పద్మావతీ విజయము [ఈ మూడును నాటకములు] ౬. విలయమాధుర్యము [స్వప్నకావ్యము] ౭. వృద్ధిమూల సంవాదము [నాటకము] ౮. అవధానసారము ౯. రాణాప్రతాపచరిత్ర [౫ ఆశ్వాసముల పద్యకావ్యము] ౧౦. The Heroines of Hindusthan [ఆర్యావర్త వీరనారీమణులు – ఆంగ్లభాషా వచనగ్రంథము]

శ్రీ దుర్భాక రాజశేఖరముగారు తొలుతఁ గవియై, తరువాత నవధానియై, పిమ్మట మహాకవియై రాయలసీమలోను యావదాంధ్ర సీమలోను మంచి యశస్సు నార్జించుకొన్నారు. వీరికి దేశము కావ్యకళానిధి, కవిసింహ, అవధాని పంచానన, కవిసార్వభౌమ, మహాకవి చూడామణి, వీరకవితా వీర, అభినవతిక్కన, వీరప్రబంధపరమేశ్వర, చారిత్రక కవిబ్రహ్మ, సుకవిరాజరాజ, కవితాసరస్వతి, వీరగాథా విధాత, చారిత్రక కవితాచార్య, వీరరస రత్నాకర, మహాకవి మార్తాండ మున్నగు నెన్నో యుపాధు లొసఁగి వందించుచున్నది. ఇది దేశమున కున్న వెఱ్ఱి గాని, రాజశేఖర కవి కివియేవియు నవసరము లేదు. కవి, దానిని దాఁటఁ దలఁచినచో 'మహాకవి' యన్న బిరుదము చాలును. దీనిమొదటఁ బై పట్టిక సర్వము వంది వాఙ్మయములోనికిఁ జేరును. దేశము తన కర్తవ్య మింతమాత్రమేయనుకొని కొంతవఱకు నాచరణలోఁ బెట్టికొన్నదేగాని, ఎవని నుద్దేశించి లోక మిట్టి బిరుద సంతాన

ప్రదానము గావించెనో, ఆయుద్దిష్ట కవి దృష్టికి మాత్రము 'ఆత్మ స్వప్రత్యయం చేతః' అనునక్షరములు తాటికాయలంత లేసి కనబడు ననుట వాస్తవము. ఆ తీరున నారయునివాఁడు అంతర్ముఖుఁడు కానివాఁడు.

శ్రీ రాజశేఖరకవి నావిమర్శన పథములోఁ బెక్కు-చోట్ల మహాకవి. అక్కడక్కడ కవి. ఒకానొక కవి తనజీవితమునెల్ల నొకే గ్రంథములో దాఁచఁబెట్టును. ఒకఁడు దానినే చిన్నచిన్న పది గ్రంథములకుఁ బంచి యిచ్చును. అసలు, ఒకఁడు గ్రంథములో బ్రతుకే పోయులేక పోవును. సంపూర్ణజీవదాతృత్వము గలమహాకవి జీమూతవాహనుని వంటివాఁడు. అతని వితరణమునకు బ్రహ్మాండ సుందరి హారతి పట్టును. జీవనదాతలగు కవులు నలువురున్నఁ జాలును. దేశము సువర్ణము పండును. మన రాజశేఖరకవి జీవనప్రదాత. ఆయన సారస్వతజీవితము రెండుగా విభగించి వ్రాయఁబడుచున్నది. ఇందు, పూర్వార్థము జీవి. ఉత్తరార్థము జీవుఁడు నని కోవిదులకు వేఱుగా వివరింప నక్కఱయుండదు.

వీరికిఁ బ్రాథమికవిద్య ప్రసాదించిన యూళ్ళు జమ్ములమడుగు-ప్రొద్దు టూరును. తరువాతఁ గడప హైస్కూలులోఁ జదివి 1907 సంIIలో 'మెట్రిక్యులేషను' పరీక్షయందు నెగ్గి యాంగ్లముమీఁది మక్కువ యింకను జదువు మని హెచ్చరింపఁగా, మదరాసు క్రిస్టియన్ కళా శాలలో ఎఫ్. ఏ. చదువుటకుఁ బ్రవేశించిరి. "నాయనా! నాకడుపునఁ బుట్టినబిడ్డఁడవు. సవతాలి పలుకులకు మరఁగితివా!" యని తెలుఁగుఁదల్లి యొకనాఁడు రాజశేఖరుని బుజ్జగించి చెప్పినది. ఆనాఁటినుండి యాంగ్లపుఁ జదువునకు స్వస్తిచెప్పి వెనుకకువచ్చివైచెను. ఈలోపున 1904-07 నడుమ కందాళ్ళ దాసాచార్యులుగారి సన్నిధిని సంస్కృతాంధ్ర సాహితీ గ్రంథ ములు పాఠముచేసి కవిత్వము కట్టుటలో దిట్టతనము సంపాదించిరి. కళాప్రపూర్ణ జనమంచి శేషాద్రిశర్మగారికడఁ గూడఁ గొన్ని దినములు చదివిరి. 1908 లో ఆంగ్లము చదువు విరమించి మదరాసునుండి వచ్చి

ఆ యేఁడే ప్రొద్దుటూరు 'జిల్లా మునసబు కోర్టు' లో నుద్యోగించుట కుపక్రమించిరి. అది పదుమూఁడేండ్లు సాఁగినది. అదియే స్వారాజ్య సముద్రమునకు మంచి పోటుసమయము. మోహనదాసు కరుణా చంద్రుఁడు పదారుకళలతో స్వరాజ్యపు వెన్నెల వెలుఁగుతో భారతా కాశమున వెలుంగుచున్న పార్వణసమయము. అట్టి స్వతంత్రపుఁబోటులో కోర్టు ఉద్యోగమునకు రాజీనామా నిచ్చిన దేశాభిమానులు రాజశేఖర కవిగారు. కోర్టు ఉద్యోగసమయమునఁ గూడ సాహిత్యోద్యోగము నేమఱలేదు. అపుడే యవధాన ప్రదర్శన వాంఛ యంకురించి తమకుఁ దోడుగ శ్రీ గడియారము వేంకటశేషశాస్త్రిగారు కూడి రాఁగా, "రాజ శేఖర వేంకటశేష కవులు" అను జంటపేరు పెట్టుకొని 1920 నుండి 1927 దాఁక దత్తమండల భాగముల కాహ్వానింపఁబడి యనేకావధానములు గావించిరి. తరువాతఁ దరువాత నవధానయుగము మాఱి యాకవు లెవరికి వారు స్వతంత్రకావ్యవిరచనమునకు దొరకొనిరి. కలసి యుండఁగా వీరికి గౌరవించి యిచ్చిన బిరుదములు కవిసింహ, అవధాని పంచానన ఇత్యాదులు. పిమ్మట నీజంట చెలికారముతోనే వేఱయినది. అవధానసార మను గ్రంథము నాఁటి వీరి కలయికకు గుఱుతు.

రాజశేఖరకవి వాఙ్మయమును దేశమును సమానప్రపత్తితో సేవించెను. దేశసేవకై యుద్యోగమునకు నీళ్ళువదలిరి. ప్రొద్దుటూరు మ్యునిసిపలు సంఘ సభ్యులుగాఁ బెక్కువత్సరములు పనిచేసి 1928 లో ఉపాధ్యక్షులు (Vice chairman) గా నెన్నుకోఁబడిరి. అదిగాక 1927 మొదలు 1932 దాఁక ప్రొద్దుటూరు తాలూకాబోర్డు ఉపాధ్యక్షులుగాఁ గూడ నుండిరి. పదపడి, మదరాసు సెనేటు సభ్యత - వేదపాఠశాలాకార్యదర్శిత మున్నగు ప్రజాహితోద్యోగములు వీరికి దక్కినవి.

నేఁటికి వీరి వయసు షష్టి దాఁటినది. దేశ – భాషాభిరతుఁడైన యీ మహాకవిని త్రిలిఙ్గలోకము గుర్తించి యెన్నోసారులు సన్మా

నముతో బ్రహ్మరథము పట్టినది. ఇంత సేయుట కాయనలో వెల్లి విరిసిన కవితావేశము కారణము. ఈ కవిసింహము 'వీరమతీచరిత్ర' మను పద్యకావ్య మొండు రచించెను. అందలి పద్యసంఖ్య తొమ్మిది నూఱులు. 'చండనృపాలచరిత్ర' యేడువందల గ్రంథము. వీరచరిత ములపై, దేశగాథలపై వీరికి మమకారము హెచ్చు. 'ఆర్యావర్త వీర నారీమణులు' అను వీరి యాంగ్లభాషాకృతి బహుప్రశస్తమయినది. వీ రేలుకొన్న యితివృత్తములు పెక్కు వీరగాథలే. ఈ కవి మొత్తపుం గవిత్వరచనలో నుండునవి రెండు దృక్పథములు. ఒకటి వీరము, రెండు భక్తి. సీతాకల్యాణాదులగు పౌరాణికనాటికలు రెండవదృక్పథమునకు సూచకములు. కాఁగా, మిగిలిన కృతులెల్ల వీరగాథా గ్రథితములు. ఆ కృతు లన్నింటిలో 'ప్రతాపసింహచరిత్రము' కన్నాకు. రాజశేఖ రునకు జీవము పోసిన దా మహాకావ్య మొక్కటే. దాని ప్రశంస యిఁక నవసరము.

రాణా ప్రతాపసింహచరిత్ర

పఠితల కేకావ్యముమీఁదఁ బెద్దయభిమానముండునో, ఆ కావ్యము మీఁదఁ దత్కర్తకుఁ గూడ నంత మమకార ముండియుండునని యూహింపవలయును. యథా లాభముగా వ్రాసివైచిన గ్రంథముపై పాఠకునకు నంత యపేక్ష యుండదు. "నా కావ్యము ప్రతిరసికమాన నము నావర్జింపవలయు" నను పట్టుదలతోఁ గవి రచన సాగించుచో నారచన మట్లు చేసితీరును. ప్రకృతము రాజశేఖరకవి 'రాణా ప్రతాప సింహ చరిత్ర' విషయము.

ప్రపంచ విఖ్యాతుఁడైన అక్బరు పాదుషాతో నిరువదైదు వత్సరములు సంగరము చేసి భారతస్వాతంత్ర్య పతాక నెగురవైచిన విశ్వవీరచూడా మణి మహారాణా ప్రతాపసింహుఁడు. అట్టి ధర్మవీరుని చరిత్రాంశములు

కొన్నేండ్లుగా నూహించి భావించి ధ్యానించి తన్మయులై రాజశేఖర కవిగారు కవితలోఁ జొనిపి యతని నజరామరుని గావించిరి. పద్యచరిత్ర గ్రంథములకు నీ ప్రతాపసింహ చరిత్ర యొరవడి దిద్దెననుట సత్యమునకు సమీపస్థమగు మాట. తెలుఁగులోఁ బురాణయుగము వెంటఁ బ్రబంధ యుగము, దానివెంటఁ గావ్యయుగము, అనువాదయుగము తలసూపి ముంచివైచినవి ఈ నవీనశకమున రెన్నో మార్పులు వెలసినవి. నేఁడు పురాణముల మీఁదఁ గంటె, చరిత్రకృతులపై మక్కువ యెక్కువగ నున్నది. భారతదేశ స్వాతంత్ర్యమునకు బహుధా పోరాడుచున్న కాలమున "ప్రతాపసింహచరిత్ర" వంటి కృతులు వెలసి యుపకరించి నవి. ఇట్టి చరిత్రకావ్యములకు రాజశేఖరకవిగారిది మార్గదర్శకస్థానము.

ప్రతాపుఁడు పవిత్రనాయకుఁడు. ప్రాచీనధర్మప్రతాపరాయణుఁడు. పసి పూరి రొట్టెలు తిని యడవులలోఁ దపము చేసి యిరువదైదేండ్లు పాదుషాతో సంగ్రామము చేసి కృతకృత్యుఁడైన భగీరథుఁడు. అక్బరు ప్రతిపక్ష నాయకుఁడు. "ప్రతిపక్ష గుణవర్ణనము – తజ్జయమువలన నాయకోత్కర్షము" అని యాలంకారికులు. ఈసమయము రాజశేఖర కవిగారు చక్కఁగా నీ గ్రంథమున సమన్వయపఱచి వివరించినారు. గ్రంథము కడముట్టఁ జదువుదాఁక, ఈ కబ్బములోని నాయకుఁడు అక్బరో, ప్రతాపుఁడో పాఠకునకుఁ దెలియదు. ఏసంవర్ణమునను బ్రతి నాయకుని దీసికట్టుగా వర్ణింపని కవిగారి యుదారహృదయమునకు మహమ్మదీయులు కృతజ్ఞులై యుండవలయును. శ్రీ గాంధి మహాత్ముని మనస్తత్త్వమును లెస్సగా గుఱుతించుకొని దేశసేవలో నలగినవా రగుటచేఁ గవిగా రిటులు సంతరింపఁగలిగినారు. ఈ చరిత్ర కావ్యమునఁ బ్రతాపునితోపాటు అక్బరు, మానసింహులు లమృతులగు నాయ కోత్తములు.

ప్రతాపుఁడు చరిత్రపురుషుఁడైనను మనకవిగారి చూపుచేఁ బురాణ

పురుషుఁడుగా, నవశారపురుషుఁడుగాఁ జిత్రింపఁబడియున్నాఁడు. భారత జాతీయధర్మము పరాధీనము కారాదను పట్టుదలతో ధర్మసమరము గావించిన లోకజ్ఞుఁడు ప్రతాపుఁడు. అక్బరుజలఁగముముందు ప్రతాపుని పక్షము చాలఁ దక్కువ. అతఁడు పాదుషాతోఁ బ్రతిఘటించి యుద్ధము చేయుటకుఁ గొంత జంకినాఁడు. కాని, ఓర్చి ధర్మసమరమే సేయవలయు ననుకొన్నాఁడు. క్షురకర్మ పరిత్యజించి నిద్రాహారములువిడిచి యడవులలోఁ దపించు జాతికి స్వాతంత్ర్యభిక్ష పెట్టినాఁడు. ప్రతాపుని కాలమునాఁడు మన మెవరము గానో బ్రతికియుందుము గాని, నేఁడు ప్రతాపుఁడు లేఁడు. అతనిచరిత్ర మెఱపు మెఱపులుగా భారత దేశాకాశమున మెఱయు చున్నది. ఆమెఱపుల నన్నిటిని కేంద్రీకరించి నిలుపుచేసి తెలుఁగునేలలో మూటగట్టి పెట్టినవారు రాజశేఖర కవిగారు. వారిమేలు మఱవరానిది. నాయకునితోఁ దాదాత్మ్యము నంది రచించిన కృతియిది – ఈ పద్య ములు చదువుఁడు:

నే నెల్లప్పుడు భావనాబలమునన్ నీరూప నామక్రియా
ధ్యానంబుం గొని తన్మయత్వమున నన్యాకాంక్ష లేకుంటి; నీ
వే నేనైతినో, నేన నీవయితినో? రూపింపఁగ నాకేల? ని
త్యానందంబు ఘటించె నీకృతి ప్రతాపా! విశ్వలోకార్చితా!

దినరాజుంబలె నుగ్రకోపనుఁడవై తీండ్రించి శైలంబు నిం
డిన తౌరుష్కులఁ దాఁకి నీ నడపు హల్దీఘాటు యుద్ధాంగణం
బున విశ్వోన్నతమైన నీదువిభవంబుం గొంత నేఁ బంచుకోఁ
గనకున్న న్నినుఁగూర్చి యింతయనురాగం బిట్టు లుప్పొంగునే?

ఇలఁగల వీరపుంగవుల నిట్టి బలోన్నతుఁ డిట్టి ధీరుఁడుం
గలుగఁ డటంచుఁ బేర్గనిన గండడ వీవిక; నిల్లువీడి వీ
థులఁ జరియింపలేని కడుదుర్బల దేహుఁడ, నన్ను నెట్టులన్
వలచితొ, నీచరిత్రమును వర్ణననేసి జగానఁ జాటఁగన్.

భవదుదార శౌర్యమును భావన మొనర్చి
రసమునను జొక్కి గ్రంథంబు వ్రాయునపుడు
త్వద్వశుండనై యానందబాష్ప వితతు
లాణిముత్యాల వలె రాల్తు నహరహంబు.

ఈ నాలుగు పద్యముల గర్భమునఁ బ్రతాపచరిత్రము, రాజశేఖర కవియు దాఁగియున్నారు. తాదాత్మ్యములేని పద్యము లీకృతిలో లెక్కకున్నవి. అట్టివి చరిత్రగతి కొఱకును, దృష్టిదోష పరిహృతికొఱకును గలవా యనిపించును. "నిజముగా తాము ప్రతాపుఁడే యనుకొని యాయా ఘట్టములు చదివి వినిపించుచు నానందబాష్పములు రాల్చుచుందు" రని రాజశేఖరకవిగారినిగూర్చి కొందఱు చెప్పఁగా విందుము. ఈ కబ్బమునందలి పద్యములు మంచి వాటముగా నడచినవి. సీసముల మీఁద హెచ్చుపాలు ప్రీతి ప్రదర్శింపఁబడినది. సర్వవృత్తములు తీవ సాఁగినట్లు సాఁగుచున్నవి.

మ. ఉదయాస్తాచల మధ్యగంబగు జగం బుబ్బూఁత లూఁగించె; బె
ట్టిదుఁడౌ పుత్త్రిఁడు; ఘోరసంగర కిరీటిప్రాయుఁడై కీర్తి సం
పద నార్జించెను దండ్రి; యె ట్లితఁడు మేవాడ్రాజ్య మందారశా
ఖఁ దినం జొచ్చిన పుప్పియట్లు వొడమెన్ గీర్తిం గళంకించుచున్.

ప్రథమాశ్వాసము.

మ. అకటా! నీయెడ నెయ్యపుంబలిమి నే నట్లాడితిం గాక యే
టికి నాప్రార్థన మియ్యకొందు, వెపుడున్ డెందంబునన్, దేశమా
తకు వాటిల్లు విపత్తుకై వగచి చింతం గ్రాఁగు నీ వగ్గి గ్రిం
గక స్వాతంత్ర్యము దక్కుదాఁక నొకచోఁ గాలూని కూర్చుందువే?

ద్వితీయాశ్వాసము.

మృదువు దప్పని జాతీయములు వాడుటలో రాజశేఖరకవిది మంచి నేర్పు. అభిమన్యుపై చేయి — ఇది పెదవి దాఁటు పల్లని మొపుడో విడిచి

తేమిసేయుదు నాభాగ్యమిట్టులుండె – ఎద్దీనెనన్న వెనంగొట్టమునందుఁ గట్టుఁ డనుచందంబయ్యె – తల్లిఁ జంపువానికిఁ బినతల్లి చేతులు గణింపఁ జిపుల్లను చొప్పెఱుంగవే? – మొదలన్నెత్తురు పంచుకొం చనుజుఁడై పుట్టాండె – నీసుఖము నందె ప్రొద్దు పోడుచునె? – పిల్లికిన్ జ్వరమనం గాఁజెల్లె – కాడుగా మాటి పాండవబీడుదేలె – చెంతఁజింతామణిని వీడి చిల్లిగవ్వ కెగుబుజము చూవ నెవ్వాని మొగము వాచె – వట్టి పెడసరి కట్టె యన్పించుకొనుటె – ఇత్యాదులెన్నో ప్రతాపసింహచరిత్రలోని కవితకు సొగసుమెఱుఁగులు తెచ్చుచున్నవి. ఈక్రిందిగీతము లెంత మెలఁకువగా నడిపిరో కనుఁడు :

చాలుపండిన యామహమీడా లతాంగఁ
జిచ్చుటెండ కెడారిలోఁ దెచ్చి పెల్లఁ
బూఁప పిందెల బ్రొమ్మావి మొక్క నకట!
తీవ్రదావాగ్నిలో నీడ్చి తెచ్చుటయ్యె.

ఎట్టి బ్రహ్మ ప్రయత్నంబునేనిఁ జేసి
యుదయపురలక్ష్మికిఁ గిరీట ముంతుఁ దలను
గాక దైవోపహతుఁ డనై కడిమి చెడిన
రక్తతతిఁ గూర్తు రతనాల రావిరేక.

వీరి సీసపు నడక శ్రీనాథుని స్మరణకుఁ దెచ్చుచుండును.

సీ. జ్యోత్స్నాగోళమును ముంచు గాఢాంధతమసంబు
గరదివ్వెతో నార్పఁ గడఁగునట్లు
అత్యగాధము సాగరానంత జలముల
కేతమ్ము వేయ నూహించునట్లు
వసుధ బొగ్గుగఁ గాల్చు ప్రళయాగ్నిహోత్రంబు
గన్నీటిచే నార్ప నున్నయట్లు

క్షయకాలమున రేఁగు సప్తమారుతధాటిఁ
దేఁటిరెక్కల నాఁపఁ దివురునట్టు
గీ. లని జగము నన్నుఁ బరిహాసపాత్రుఁగాక!
యొక్కటిని నిల్చి బలమెల్ల నెదురువెట్టి
విధికి మాఱొడ్డి స్వాతంత్ర్య విజయలక్ష్మి
యడుగులకు నిత్తుఁ గల్యాణహారతులను.

ఇఁట 'హారతి' వైకృతము. కల్యాణ శబ్దముతో దీనిని సమసింపఁ జేసిన కవిగారి నిరంకుశత మెచ్చఁదగినది. ఆమాత్రము స్వాతంత్ర్యము కవి తీసుకోవలయును. 'పలువిధాలంకరణములు' మున్నగు ప్రయోగములు కొన్ని 'ప్రతాప' లోఁ జూపట్టును. సువర్ణఖండములవంటి యీ దిగువ సీసములు పఠింపఁదగినవి. రాజశేఖరకవిలో నకృత్రిమమైన భావనావేశ ముండుటచే నాయనశైలి యమృత వాహినివలె నడచును. మఱి యివి యెంతబాగుగానున్నవి!

సీ. తెగినహారమున ముత్తియములువోలె భా
రతరాజ్య మది పెక్కు ప్రక్కలగుచుఁ
జినచిన్న పాయలై చెడె; రాష్ట్రపతులలో
నొండొరులకు మైత్రి యొదవదెపుడు;
నిత్యలక్ష్మి శుభనిలయములై యుండ
వలయు రాజ్యములు శాశ్వత రణముల
ధనజన వస్తువాహన శూన్యమై పాడు
వడి శ్మశానములట్లు ప్రభఁదొలంగె
గీ. నిట్టి దుర్భావతారంబు తెల్లఁబోయి
భరతఖండ మఖండైక భాగ్య విభవ
నిలయమై యుండఁ జూడఁగా వలయుననుచుఁ
గడుపులోఁ గొండయంతాస గలదు నాకు.

సీ. ఒక్కొక్కరుఁడు సమస్తోర్వీతలము నిండ
నిరుపమామోదంబు నెఱపునట్టి
పూవు లసంఖ్యముల్ పూచె, రాజస్థాన
నందన దేవ మందార తరువు;
తడవోకింతయు లేని తౌరుష్క వాహినీ
జైత్ర యాత్రా ప్రభంజనము ధాటిఁ
గూఁకటి వ్రేళ్ళతోఁగూడఁ గంపించెఁ జె;
ట్టా పూవు లన్నియు నవనిరాలె
గీ. నీ వనెడి దొడ్డ పూవైన నిలుచుఁ బొలుచు
విశ్వ విశ్వంభరామోద విజయలక్ష్మి
నలుదెసల నించునంచని తలఁచుచుండ
నక్బరనెడి ఝంఝూనిలం బలమె నేఁడు.

ఇట్టి ధారాచారుత్వము గల పద్యములకుఁ బ్రతాపచరిత్రము పుట్టినిల్లు. ఈకావ్యమును మించు కావ్యములుపుట్టుచున్నవి. ఇంతయావేశముగల కవిత బయలుదేరుట మాత్రము కష్టము. అభినవ చరిత్ర కావ్య నిర్మాతలలో నీయన మొదటివాఁ డనుటలో నాక్షేపణ ముండదు. నన్నయ - తిక్కన - పోతనాముల కవితా శైలులు నలవఱుచుకొని, క్రొత్తపోకడలు పెక్కు లాకళించుకొని, చక్కని యితివృత్త మేరుకొని, యుగమున కనుగుణుఁ డైన నాయకుని సంపాదించుకొని, తియ్యని చిక్కని తెనుఁగులో నిట్టి యుదాత్త చరిత్ర కావ్యము సంతరించి తెలుఁగు మాతకుఁ గానుక పెట్టిన శ్రీ రాజశేఖరకవి కృతార్థ జీవి.

రాజశేఖర శతావధానులు చాల గ్రంథములు రచింపనిందు; రచించి యుండనిందు; వానియెల్ల ముందు 'ప్రతాప చరిత్ర' ధ్రువ తారంబై నిలఁబడు కబ్బము. కవిగారు తమ యీ కావ్యము కామేశ్వరీ దేవి కంకిత మిచ్చుచు వ్రాసిన యీ రసఘుటికలు విలువ కట్టరానివి:

సీ. కలశపాథోరాశి గర్భమందు జనించు
నలల బంగారు టుయ్యాలలందు
నల చతుర్దశ లోకములను బావన మాచుఁ
దనరు మణిద్వీప తటములందు
గొడుగులు వంచినట్లడరు కదంబ వృ
క్ష వితాన శీతల చ్ఛాయలందు
శ్రీలఁ జెన్నారెడి చింతామణీ భద్ర
సింహాసనము పార్శ్వ సీమలందు
పాల కడలి చలువఁ దేలు తెమ్మెరలందు
నీడు లేని పసిఁడి మేడలందు
గౌరి లోకజనని కామేశ్వర స్వామిఁ
బ్రిప్పి కూర్మి నాదరించుఁ గాక!

క. ఈ మహనీయ గ్రంథముఁ
గై మోడ్చుచు నంకితమ్ముగా నిచ్చెద నేఁ
బ్రేమఁ గొనుప నోఁచని నా
కామేశ్వరు నత్తి పెంచు కామేశ్వరికిన్.

గడియారము వేంకట శేష శాస్త్రి

1897

ములికినాఁటిశాఖీయ బ్రాహ్మణుఁడు. మైత్రేయసగోత్రుఁడు. ఆపస్తంబ సూత్రుఁడు. తల్లి: నరసమాంబ. తండ్రి: రామయ్య. (జన్మస్థానము: కడపజిల్లా జంబులమడుగుతాలూకాలోని 'నెమళ్ళదిన్నె'. నివాసము: ప్రొద్దుటూరు.) జననము: 3-4-1897 సం.

కృతులు: ౧. శ్రీ శివభారతము [8 ఆశ్వాసముల శివాజీప్రబంధము. 1943 ముద్రి.] ౨. మురారి. ౩. పుష్పబాణవిలాసము. ౪. వాస్తుజంత్రి [ఈ మూఁడును ముద్రితములు కాలేదు.] ౫. మల్లికామారుతము. ౬. వాల్మీకి [అసమగ్రములు] ౭. శ్రీకృష్ణదేవరాయ చరిత్రము [ప్రస్తుతము రచనలో నున్నది.]

౧౯౪౩ సంవత్సరమునకుఁ బూర్వము 'గడియారము వేంకటశేష శాస్త్రి' యనిన పేరు తెలుఁగువారిలో నెఱిఁగినవా రేకొందఱో. నామట్టుకు నేను వారినిగూర్చి విన్నవాఁడను గాను. ఎన్నఁడో, ఆయన 'శవధానిపంచానన' యని బిరుదమిచ్చి పండితులు మెచ్చుకొనిరఁట. ఆపేరైనను రాయలసీమ దాఁటి రాలేదు. మాడభూషి వారు, దేవులపల్లి వారు, తిరుపతివేంకటకవులు అవధానపుగారడీతో నూరూరఁ బేరు గాంచిరి. వారినిజూచి, అందులో విశేషించి తిరుపతికవులను జూచి కవితచెప్ప నేర్చినవాఁ డెల్ల నవధానము చేసినఁగాని ముక్తి లే దనుకొని, ఆ కళ నభ్యాసముఁ జేసెను. అప్పటి యాతెలుఁగులోకము గతానుగతికము. పలువురతోపాటు శేషశాస్త్రిగారును విద్యాధ్యయన మైన పిమ్మట, సహజకవితలోఁ బ్రవీణత నందినపిమ్మట శతావధాన వ్యాయామముచేసెను. మఱియొకకవితోడుతీసుకొనిగాని, యవధానములు సేయుట నాఁడు తక్కువ. అప్పటియాచారప్రకారము తనకన్నింట సరిసాటియగు శ్రీ దుర్భాక రాజశేఖరకవితో జతపడి యవధానములు చేయసాఁగెను.

1920–1930 సంవత్సరముల నడిమికాల మది. 1932 నుండి ప్రొద్దు టూరు మ్యునిసిపలుహైస్కూలులో శేషశాస్త్రిగారికిఁ బండితపదవి కుదురుపడినది. నాలుగయిదవధానములు చేసినంతమాత్రన, పాఠ శాలలోఁ బండితులైన మాత్రన, అనుకరణధోరణిలో నేవో ప్రబంధ ములు రచించినంతమాత్రన శేషశాస్త్రిగారి ప్రతిభోన్నతి తెలుఁగు జగ మేమెఱుఁగును?

వసంతమునఁగాని రసాలమువైపు తుమ్మెదలు చూడవు. కోకిలము గొంతెత్తదు. "...వృక్షస్య సంపుష్పితస్య దూరాద్గంధో వాతి.—" పేరుప్రతిష్ఠలకు దేశకాలములు ప్రధానకారణము. ౧౯౪౩లో 'శ్రీ శివ భారతము' వెలువడినది. అదిచూచి తెలుఁగుమహాకవులెల్ల తెల్లతెల్ల వోయిరి. 'ఇట్టి మహాకవి యీవఱకుఁ బుట్టలేదని కాదు,' ఇన్నాళ్ల దాఁక నీ కవితావసంతుఁ డేసందుగొందునుండె" నని. క్రమముగా నేఁటికి శేషశాస్త్రిగారి నెఱుఁగని పండితుఁడు, తెలియని కవి, వినని తెనుఁగు రసికుఁడు కోటికొకఁడుండునేమో! ఆయన 'శివభారత' కవిత సాహిత్య సభలలో గానముచేయుచున్నారు. హరికథగాఁ బాడుకొనుచున్నారు. పురాణముగాఁ బారాయణము గావించుచున్నారు. విన్నంతలో, కన్నంతలో, శేషశాస్త్రిగారి 'శివభారతము' విని శిరఃకంపముగావింపని కవి లేఁడు. నేఁడు శాస్త్రిగారి యీడు అయిదవపడి పైఁబడినది. శివ భారత మించుమించు నాలుగు దశాబ్దుల భారతీతపస్సు. ఈకృతి శతా బ్దులు, సహస్రాబ్దులు తెలుఁగువారల కడుపులు నిండించు రాయలసీమ పంట. గ్రంథకర్త విజ్ఞప్తి యిటు లున్నది:

'......ఈగ్రంథరచనవఱకు నదియొక కవితాతపస్సు. మూఁడుపర్వ ముల ప్రాయముతో అరణ్య – అజ్ఞాతవాసముల సంస్కారముతోఁ బర్వ మయిన భారతగాథ – అది. సోమయాజి కవిత్వమున ఉత్తరగోగ్రహణ ముతో విధిగా నీ శివభారతరచనయారంభమైనది. ఇంతయు ధర్మదేవతా

వరప్రసాదము. అప్పటి నాయితరకృతులు లోకమెన్నఁడో చదువవచ్చును. నాకవిత్వ మనుపేర నిప్పటికి శివభారతము చాలును......'

ఈ పలుకులు విలువ గట్టరానివి. శివభారత మంతయు నొకయెత్తు. ఈ యక్షరములన్నియు నొకయెత్తు. ఇది విశ్వసూర్తిగ వ్రాసినమాట. వారికృతి పూర్తిగఁ జదివి చూచి నాయనయున్నట్లే నే ననుకొంటిని "శేషశాస్త్రిగారూ! నన్నయ్యమూర్తి తరముగ సోమయాజులా మీరు? కవిత్రయభారతమువలె 'జగము లున్నంతవఱకు నెల్లజనులు చదివి తనియుటకు' శివాజీ ప్రబంధము రచించి శివభారత మని పేరుపెట్టుకొంటిరా? ఎంత గడుసుదనము! ఔను. తిక్కన భావనాశక్తి, తిక్కన పలుకుబడి సొంపు, తిక్కన కథావేత్తృత్వము, తిక్కన రాజకీయవిజ్ఞానము మీరొక్కరే తెక్కించుకొంటిరి కాఁబోలు! కానిచో, మీగ్రంథాది విజ్ఞప్తిలో నటులు వ్రాసికొనుట కెన్నిగుండె లుండవలయును!" అని —

శేషశాస్త్రిగారు 'నాంది' లో నన్నయాదిప్రాక్తనాద్యతనాంధ్ర కవుల నభినుతించినపిమ్మటఁ బ్రత్యేకముగ సోమయాజికి చంపకము కానుక నిచ్చెను.

హరిహరనాథ శాంత మధురాకృతి చిత్తనివాసున్, బురా
చరిత తపఃఫలం బుభయగు సత్కవిమిత్రుని వెల్గ, ధ్యాన త
త్పరుఁడయి భారతాగమము సత్కవి తిక్కన వాక్కువెంటఁ ద
త్కరమునఁ దాఁడవించు నగరాయుని తిక్కని, నే భజించెదన్.

తిక్కనశర్మ పలుకుబడి యొప్పఁగ, ఒక్కొక్కచో నూతనభావములు మెఱపడఁగ, "ఉభయమార్గసమన్వయధోరణీ గుణాఢ్యముగ", "భారతామ్నాయము దీటుగ" శివభారతము రచించి సాహిత్యపితృపూజాసుమ స్రజంబుఁ జేసి కృతకృత్యులైరి. శివభారతము మహాకావ్యము. ఇందలి యెనిమిది యాశ్వాసములందును మొత్తము ౨౫౦౦ పద్యములించు మించుగ నున్నవి. (దీనికి ఉపోద్ఘాతము వ్రాసిన శ్రీ రాళ్లపల్లి అనంత

కృష్ణశర్మగారి హృదయ మిట్లున్నది: "......ఆధునికాంధ్ర సాహిత్య మందు నాకుఁగల యల్పానుభవములో మహాకావ్య మనుపేరున కింత తగిన గ్రంథమును నేఁజూడలేదు...... ఈ భారతము భాష గొప్ప వర్చస్సుతో ప్రసన్నమధురముగా ప్రవహించుచున్నది. పలుచోట్ల 'తెలుఁగు కింత లగువు బిగువు కలదా' యని యాశ్చర్యపడునట్లు చేయు నుడికారము లిందుఁ గలవు..."

శ్రీ శాస్త్రిగారికి వశమైన [illegible] యెట్టిదో, యీ పద్యము స్పష్టపఱుచును.

చ. పరహితత, [illegible]ప్రతి, [illegible]బోధన గౌరవాది వి
స్ఫురణము [illegible] [illegible] [illegible]యించి, మాధవున్
ధరఁ జరితార్థుఁ [illegible] [illegible] బంచుచు
స్వర[illegible] [illegible] [illegible] [illegible]శేఖలన్.

'శ్రీ శివభారతము' [illegible] [illegible] [illegible], దాని మాధుర్యము [illegible] [illegible] [illegible]. అయినను, నాహృదయము విప్పక [illegible].

('శివభారతము' [illegible] [illegible] [illegible] తీరుఁదీయముగల కవితతో సాఁగినది. గ్రంథ[illegible] [illegible] విశేషించి, లుకజీ–జీజియాల సంభాషణము, దక్షిణమున [illegible] రాజ్యములు – పరిపాలన పరిస్థితి, శివాజీ పుణెలో రాజ్యాంగ శిక్షణము, దాదోజీ చరమదశ– శివాజీకృతజ్ఞత, రామదాసుదర్శనము – ధర్మోపదేశము, సయీబాయి సలహా–భవానీప్రార్థనము, శివాజి పాదుషా కొత్తగనుగ్రామాయుట, షాజీ విడుదల, బాజీప్రభు మరణము, శివాజీ సానుభూతి, షాజీ మరణము, శివాజీవిచారము, శివాజీ పాదుషా కొల్వున కేఁగుట, తానాజీ ప్రతిజ్ఞ– సింహగడము లగ్గపట్టుట, సూర్యాజీ సింహగడము గెల్చుట, తానాజీ నిర్యాణము, శివాజీ సంతాపము, పట్టాభిషేక పూర్వరంగము, శివాజీ

భవాని కోవెల కేఁగి చేసిన విన్నపము - ఇవి బహు రసవద్ఘట్టములు. జాతీయసూక్తులు వాడుటలోఁ, జిక్కనిపలుకు లేఱికొని పొదుగుటలో, వైపు వాటము లెఱిఁగి పద్యములు నడపుటలో, నడుమనడుమఁ బౌనక ములో మిరియపుఁ బలుకులవలె సంస్కృతపదములు సంధానించుటలో, నాఁటి, నేఁటి రాజ్యాంగవిధానముల సమన్వయ పఱుచుటలో, ఔచితి పాటించుటలో శివభారతకవికిఁ గల జగజాణతనము మన తెనుఁగునేలలో నీనాఁడు పలుచగ నున్నది. ఉభయ స్కంధముల బలిమితో సారస్వత సాగరము లోఁతులు ముట్టి రసామృతకలశమును జేపట్టిన మహాకవులలో శేషశాస్త్రిగారు నొక మహాకవి యని, శివభారతము జెండా నెగుర వైచినది. కొన్ని మచ్చులు.

లుకజీ తన్నుఁ జంపవచ్చినపుడు కూఁతురు జీజియా యనుచున్న మాటలు :

ఉ. కెవ్వన హుంకరించి యడికించెద, వాయుధ మెత్తనుంటి వీ
వెవ్వరిపైన ? నీయెడఁద కింత వివేకము చాలదయ్యెనే ?
గువ్వలుఁగూడఁ గాన్పులను గూరిమిఁ బెంచు జగంబునందు నీ
వెవ్వఁడవయ్య ? యాదరణ కెక్కరె యల్లుఁడు నాఁడుబిడ్డయున్.

చ. కనికర మింతలేని కొటికాఁడవు నన్నిటు పెంచనేల ? పు
ట్టినయపుడే గళ మ్మొటమటించినఁ బోవదె ? వెంటనంటి యి
య్యనువున వేఁటలాడ మనసయ్యెనె ? కన్నని సుంగుఱ్ఱింగు వ
ర్తన మది సర్వజాతికిఁ గదా ! యొకమానవుఁ డిట్లు సేయునే ?

సీ. అనురాగ నిలయ నాజనని మాల్యాదేవి
కడుపులోఁ గార్చిచ్చుఁ గనలఁజేసి
కన్నీటిబుగ్గ బుగ్గలజాఱఁ గుమిలిపో
యెడు నన్న 'యక్లోజి' యెడఁదఁ ద్రుంచి

తల్లిదెక్కల ప్రోవుఁ దలఁగని సాంభాజి
భావి జీవితనౌక భంగపఱిచి
కమియమాఁగినపందు గర్భపిండ మగల్చి
కఱకుఁ గాఁకలదాలిఁ గ్రాఁగఁజేసి
ఇంత ప్రళయంబుఁ గలిగింప నేలనయ్య
కనికరము లేదొ, పాపసంకటము రాదొ,
కన్నతండ్రివికాదొ, యక్కసముపోదొ,
వలదు వలదయ్య వచ్చుని యిలు రగుల్చ.

ప్రథమాశ్వాసము.

జీజియాబాయి చంటిబిడ్డ శివాజి కుగ్గుఁబాలతో, జోలపాటతో, వీరచరితములు నూఱిపోసినది. దాదోజీ గురుత్వమున శివాజి చక్కఁగఁ జదువను వ్రాయను నేర్చి, అంకగణితము నెఱిఁగి రాజ్యాంగవిధానముల మెలఁకువలు తెలిసికొనెను. మాతృోపదేశము కరఁడుగట్టిన శివాజికి మతముమీఁద - దేశముమీఁద నున్నంత యభిమానము, పట్టుదల శాస్త్రములమీఁద నుండకపోవుట వింతగాదు -

మ. కలఁతం జెందెదు నాత్మదేశమతముల్ గాపాడ, శస్త్రాస్త్ర వి
ద్యలుఁ జాణక్య తపంబులున్ జదువు విద్వాంసుల్, మహారాష్ట్ర వీ
రులు వేదాంగము లెత్తి యర్థముల మార్పుం దీర్పు చర్చించు తా
తల తాటాకుల మీఁది గంటముల వ్రాఁతల్ గోఁతలున్ మెత్తురే!

ఈ నాలుగు పంక్తుల పద్యములోను గవిగారికి దేశస్వాతంత్ర్య కాంక్ష యెంత యున్నదో వెల్లడియగుచున్నది. వేదములు, వేదాంగములు, కళలు అన్నియు నొకమెట్టు - ఆత్మదేశ సంరక్షణ మొకమెట్టు. శేష శాస్త్రిగారీ ఘట్టమున శివాజీయయి వ్రాసియుండిరి.

పునహాలో శివాజీకి దాదోజి రాజ్యాంగపద్ధతులు శిక్షించినాఁడు. ఆ శిక్షణక్రమ మిటులున్నది:

సీ. ప్రత్యూష పవనముల్ పారాడఁ జలువ లూ
రిన వాలుకా వితర్దికలయందు
ఫలితోపవనవాటికల శీతలచ్ఛాయ
లలమిన హరిత శాద్వలములందుఁ
బరువంపు వెన్నెలల్ వాఱి చుక్కలు దేలు
పఱపైన మీఁద యుప్పరిగలందుఁ
బాగఁజోపి చిఱువత్తు లెగఁద్రోసి చదురు దీ
పాలిడ్డ విధి సోఫాలయందు

శిష్యగణముతోఁ శివరాజుఁ జేర్చికొనుచు
భారతాదుల భావసంపదలఁ దెలిపి
ఘనుఁడు దాదోజి తనవిమర్శనము లిచ్చి
నవ్య సాహిత్య బోధసంతతుల నడిపె.

సీ. ఆవులించిన మాత్రఁ బ్రేవు లెంచఁగ నేర్చి
నీటిలోఁ జాడలు నెఱుక నేర్చి
పాలు నీరును వేఱుపఱుచు నాణెము నేర్చి
కనుపాపనీడలఁ గాంచ నేర్చి
బాలెంత బెబ్బులి పాలు పిండఁగ నేర్చి
దళము లంటక తేనెఁ ద్రావనేర్చి
మొండపోఁకుల దప్పి వెడలింపఁగా నేర్చి
శిలలకు గిలిగింత గొలుపనేర్చి

పాత్రమునఁ గాక ప్రకృతిలోఁ బుటలు విప్పి
పదములనుగాక భావముల్ పట్టి తెరచి,
యన్వయ వ్యతిరేక దృష్టాంత గతుల
నరసి, భావుక పండితుం డయ్యె శివుఁడు.

ఈ పద్యములలో 'నవ్యసాహిత్య యోధసంతతుల నడిపె' "భావుక పండితుండయ్యె శివుఁడు" అనుటలో నెంతో యంతరర్థ మున్నది. కవిగారి సాహిత్యదృష్టి కీపద్యములు రెండును గన్నులు.

సప్తమాశ్వాసమున :— శివాజీపాదుషా కొలువునకు వెళ్ళినపుడు, వారియమర్యాదసహింపక —

"పాదుషా యొక్కఁ డొకమాట పల్కుచున్నఁ
గాదన మాకేమి ? తనకేమిగొప్ప కలదు ?
నమ్మికొలువున్న వారి మనంబులందు
మేలుకొనుఁగాక యిర్ష్యర మేలు కీను"

అనెను. పాదుషా కోపించి యెవరతఁ డనెను. అప్పుడు రామసింగు పాదుషాతో నిట్లు చెప్పెను: అక్కడి పద్య మిది:

మ. అమృతప్రాయ దలీఘరీ విపిన సహ్యా స్వైర సంచార ధీ
ర మహారాష్ట్ర మృగేంద్రుఁ డీతఁడన సమ్మాడంచితాస్థాన దు
ర్దమ సమ్మర్ద నిదాఘ దాహాకులిత ప్రత్యగ్ర ఘర్మాయితాం
గములన్ గర్జిల సాఁగె, శీతల కటాక్షం బిందు సారింపుఁడీ !

వీరరస స్ఫోరకమగు నిట్టి దీర్ఘ సమాసములు పోడులవలె నక్కడక్కడఁ బొదిగించిరి. తక్కినపట్టుల నెక్కడఁ జూచినను జాను తెనుఁగు నొడి కారమే గౌరవస్థానమున నున్నది.

తానాజీ సింహగడము మీఁదికి యుద్ధయాత్రకేగుట, కోటఁ బ్రాఁకి లోనికి వెళ్ళుట, అక్కడ వెనుదీయక ఘోరముగాఁ బోరుట మొదలగు ఘట్టములు చూచినచోఁ దిక్కనసోమయాజి స్మరణమునకు రాక మానదు. 'శివభారతము' పేరుసార్థకముగ నెన్నో ఘట్టము లుదాహరింప వచ్చును. తానాజీ నిర్యాణానంతరము తమ్ముఁడు సూర్యాజీ పోరు సలుపును. ఆ ఘట్టము మఱియు రమణీయతరము. తానాజీ మరణము

విని శివాజీ పలవించిన ప్రకరణము చదివికొని కటికవాఁడు కంటనీరు పెట్టుకొనును.) భారతములో, నభిమన్యువధ విన్నయర్జునుఁడుసైత మట్టు లేడువలేకపోయినాఁడేమో !

సీ. పరతంత్రతాభుగ్న భారతోద్ధరణోద్య
మమున నా నాయకత్వముఃవరించి
మొనలేని నీసర్వధన జనబల జీవి
తముల నర్ఘ్యార్పణ ధారవోసి
రణరంగముల నంగరక్షకతన్ బొంచి
కనుఱెప్పవోలె నన్ననుసరించి
దుస్సాధతర వైరి దుర్గ భేదన వజ్ర
పాత్రమై బహుళాహవముల గెలిచి
యనుచరుండు – చమూనాథుఁ – డంగరక్ష
కుఁడు – బహిఃప్రాణ మనఁగ నన్ గొలుచు నిన్నుఁ
గోలుపోయినయపుడ నేఁ గోలుపోని
దొకటి యున్నదే? తానజీ! యొంటినైతి.

గీ. శివపతి యెవండు? తానజీస్నిగ్ధహృదయ
బలముఁ ద్రావి, పెన్పొందిన భద్రమూర్తి,
నిజము ; తానజీ ! యీనాఁడు నీవులేని
శివపతి యెవండో ! యెంతలో పవలు – రేయి.

* *

శా. తానా! నీవిఁకఁ బల్కు, వీహృదయ బాధల్ తీఱు తీరేది? నీ
దీనానాథ కుటుంబ శోకదహనార్తిన్ బాపు ప్రావేది? నా
పైనం బైకొను శత్రుసంహతులఁ గూల్పం దెంపు పెంపేది? య
న్నా! నీయొక్కనిలేమి యెల్లెడలఁ దానై యెంత గుందించెడిన్.

శా. నా కీవంత — కొలంత వో; దయిన దానా ! నీవుధన్యుండ ; వ
ట్ట్రాకల్ లోకువ లన్నియున్ దులిపి వీరస్వర్గముం గొంటి ; వే
కైకస్థాన ముదాత్తవీర ఘనుమ త్యాగార్హ భోగాంకమై
నీ కాహ్వానము వెట్టె, నేల్కొనుము తండ్రీ! వీరభోగ్యంబుగన్.

'సప్తమాశ్వాసము'

అష్టమాశ్వాసములో శివాజీరాజు పట్టాభిషేకము, గాంగభట్టు ధర్మనిర్వచనము మున్నగు ఘట్టములు కవిగారి శ్రుతిస్మృతిపురాణ నివిష్ట బుద్ధిని ప్రస్ఫుటీకరించుచున్నవి. ఎట్టి శుష్క విషయమునైనను కళ కట్టించి కవితలో లలిత మనోహరముగాఁ బెట్టఁగల నేర్పు తీర్పు వేంకటశేషశాస్త్రిగారి కతివేలముగ నున్నది. నిజమునకు, శివాజీ చరిత్రములో నచ్చు వ్యక్తులలోఁ గవికెక్కుడగ్గ కళాశక్తి లేదు. వారెల్ల మనకవి వసంతుని చేతిలోఁబడి పుష్పించి పరిమళించిరి.

పట్టాభిషిక్తుఁడగు శివరాజు భవాని కోవెలకేఁగి యిట్లు ప్రార్థించినాఁడు —

చ. చిఱునగవ్వూరు మోవి, వికసించిన చెక్కులు, సోఁగకన్నులం
గురియు దయామృతం, బలిక కుంకుమరేఖయుఁ జంద్రమఃకళా
పరిగత మౌళియున్ నయన పర్వముగా మది గోచరించి నా
యరగలిఁ బాపు నీయుభయహస్తమునీడ భజింతు శాంకరీ !

(ఈ శివాజీ ప్రబంధమునకు 'భారతము' అని పేరిడుటలో నొక విశేషమున్నది. ఇందుఁ దఱచుగ భారతములోని యుపమలే యీయఁబడినవి. అవియెల్ల నిట నేఱిచూపను. తత్తదుదాహరణములకు గ్రంథము పఠింతురుగాక !

శ్రీ వేంకటశేషశాస్త్రిగారి జీవిత ప్రబంధములో 'శివభారతము' కీర్తనీయమైన స్వర్ణ ఖండము. దానిని తొలుతఁ బేర్కొనిగాని, వారి చరిత్రవిషయములు ముచ్చటించిన సొగసు లేదు.)

శాస్త్రిగారు 1897 లో జన్మించిరని తెలిసికొంటిమి. ఈగ్రంథరచన నాఁటికి వారికి, ఏఁబది మూఁడేండ్ల వయస్సు. శాస్త్రిగారు పదుమూఁడేండ్లు వచ్చినతరువాత 'సానుశ్ళదిన్నె' నుండి ప్రొద్దుటూరు వచ్చి యచ్చట రూపావతారము శేషశాస్త్రులుగారి సన్నిధికిఁ జేరి కావ్య నాటకాలంకారసాహిత్యము, తర్క-వ్యాకరణశాస్త్ర నైపుణ్యము సంపాదించిరి. పిమ్మట పద్దర్శనము వానుదేవావధానులుగారిని సేవించి యజుస్సంహితామూలము, యజురారణ్యకోపనిషత్తులతో సప్రయోగ స్మార్తమంత్రపాఠము అధ్యయనించిరి. జాతక – ముహూర్త – వాస్తు ప్రకరణములు చదువుకొనిరి. సంస్కృత పాండితిలో గురుకులక్లేశములు పడి గడిదేఱినతరువాత, ఆంధ్రకావ్యములు చూచి, మహాభారతము పారాయణము చేసి, ఛందశ్శాస్త్రము నెఱిఁగి, తొలిజన్మమునానే వలచి వెంట వచ్చిన కవితాసుందరిని గిలిగింతలు వెట్టి చేరఁదీసికొన్నారు శాస్త్రిగారు.

1912 – 13 సంవత్సరప్రాంతములో శ్రీ దుర్భాక రాజశేఖర కవితో మన ప్రకృతకవికి నేస్తము తటస్థపడినది. "రాజశేఖర వేంకటశేషకవులు" అను జంట యేర్పడి కవితావ్యాసంగమున కుపక్రమించినారు. తపస్సున కొకఁడే యుండవలెను. అధ్యయనమున కిరువు రున్నఁగాని పసిపడదు. 1915 లో బృందావనమున శరన్నవరాత్రమహోత్సవ సందర్భమున జరిగిన కవిత్వపుఁబోటీలోఁ దొలి బహుమానము మన కవకవులు సంపాదించిరి. ఈకవులజంట విడనప్పుడు 'వీరమతీచరిత్రము' అను పద్యకావ్యము, సీతాపహరణము, కీచకవధ అను నాటకములు సంఘటించి యుండిరి. 1920 మొదలు 1926 దాఁక జతవిడక 'రాజశేఖర వేంకటశేషకవులు' అష్టశతావధానములు పలుచోట్లఁ గావించిరి. గుత్తి పురములో, కడపలో వీరికి సువర్ణకంకణములు కానుక-వెట్టిరి. ఉయ్యాలవాడలో 'అవధానిపంచానన' బిరుద మిచ్చిరి. మఱొకచో 'కవిసింహ'

బిరుద మొసఁగిరి. వేయి బిరుదము లిచ్చి నాలుగువేల సన్మానములు చేయనిండు. వేంకటశేషశాస్త్రిగారికిఁగల 'శివభారతకవి' యన్న బిరుదముతో సవిసరిరావు. రాజశేఖరకవిగారికున్న 'ప్రతాపసింహచరిత్ర కవి' యను బిరుదముతో నవి సరిరావు.)

శేషశాస్త్రిగారు జన్మభూమిలోనుండి పోతనవలె హాలికవృత్తిఁ జేసికొనుచు, వీలుపడినపుడు పురములకుఁబోయి యవధానములు ప్రదర్శించుచు భారతి, మల్లికామారుతము, పుష్పబాణవిలాసము తెలుఁగు పఱచిరి. 'హరికథలు' రచించి తమ అన్నగారు వేంకటసుబ్బాశాస్త్రులుగారిచే నాపరిసరమున నచట నచటఁ గాలక్షేపములు చేయించిరని వినుకలి.

1930 లో నెమ్మళ్ళదిన్నె విడిచి ప్రొద్దుటూరు చేరుకొని 'కన్యకాపరమేశ్వరీ సంస్కృత పాఠశాల'లో నధ్యాపకత నిర్వహించుచు, 'బ్రహ్మనందినీ' పత్రికకుఁ బ్రచ్ఛన్న సంపాదకత సాగించుచుఁ గాలము గడపిరి. 1932 లో, ప్రొద్దుటూరు 'మ్యునిసిపల్ హైస్కూలు' న ఆంధ్రోపాధ్యాయులుగాఁబ్రవేశించి నేఁటికిని ఆపదవియందే యుండిరి.

వాస్తుజంత్రి, ఔర్మిళాలక్ష్మణము, అనర్ఘరాఘవాంధ్రీకరణము మున్నగు రచనలు రచించిరని తెలియవచ్చెను. కొన్ని యసమగ్రములు, కొన్ని యప్రకటితములు, కొన్ని యుత్పన్నములును ఈనాఁటికి సంపూర్ణముగ రచితమై చక్కఁగఁ బ్రచురితమైన గ్రంథ మొక శివభారతము మాత్రము. గడియారము వేంకట శేషశాస్త్రిగారి కీర్తి తెలుఁగునఁ గలకాలము నిలుపుట కీ కృతి చాలును. ఇటీవల వారు రచించుచున్న 'శ్రీకృష్ణదేవరాయ చరిత్ర' పూర్తియై వెలువడినచో నది తెలుఁగు బాసకుఁ దొడవుపై తొడవు.

విక్రమదేవవర్మ

1869

శ్రీ జయపుర సంస్థాన ప్రభువు. క్షత్త్రియుడు. కాత్యాయనసూత్రుఁడు. భారద్వాజసగోత్రుఁడు. తల్లి: రేఖాదేవి. తండ్రి: శ్రీకృష్ణచంద్రదేవ మహారాజు. జననము: 1869 జూన్ 28 వ తేదీ, [శుక్ల సంవత్సర జ్యేష్ఠ బహుళ తృతీయాగత చతుర్థి భానువాసరము. గ్రంథములు: ౧. శ్రీనివాసకల్యాణము [నాటకము] ౨. మానవతీచరిత్ర 3. నీతిగీతితతి ౪. శృంగారగీత వ్రాతము ౫. శ్రీ మహారాజ విక్రమదేవవర్మ రచనలు [1940 ముద్రితము] ౬. కృష్ణార్జున చరిత్ర టీక [మంత్రిప్రెగడ సూర్యప్రకాశ కవి రచించిన ద్వ్యర్థి కావ్యమునకు వ్యాఖ్యానము] ౭. రాధామాధవనాటకము [ఉత్కలము] ఇత్యాదులు.

ఆంధ్రరాజులలో 'కృష్ణదేవరాయలు' అద్వితీయుఁడుగాఁ బరిగణింపఁబడినాఁడు. శౌర్యసంపదను మించిన యుత్సాహము, భాషాభిమానమును మించిన కవిత్వశక్తి, విద్యాపోషణమును మించిన కళాదరము నతనియం దుండి తెలుఁగుమన్నీల కతని దొరతనపుఁ దెన్ను మేల్బంతియైనది. 'ఆముక్తమాల్యద' నీమహారాజశిరోమణి రచించినట్లుగాఁ బరిశోధక మహాశయులు నిర్ధారించియున్నారు. ఈ వాస్తవవిషయమును సులుఁగు పఱుచుటకు, ఆంధ్రకవితాపితామహుఁడు నాస్థానకవియునగు 'పెద్దన' చే రచింపఁజేసి తనపేరు పెట్టుకొనె నని విపరీతవిమర్శనములు బయలుదేఱఁదీసిరి. మృగయావ్యసనశీలురు సమరలంపటులు నగు మహారాజులెక్కడ? కావ్యరచన యెక్కడ? అదిగాక, ప్రౌఢార్థబంధురమగు విష్ణుచిత్తీయము వంటి కావ్యము నొక పండితకవి రచించెనని చెప్పవలయును గాని, మహారాజపదవిలో నున్నవాఁడు వ్రాసె ననుట సమంజసము కాదని కొందఱి విరుద్ధవాదము. సత్యమేవ జయతు!

దేశీయసంస్థానములలో 'జయపురము' నకు మ[illegible] కలదు. నేఁటి జయపురాధిపతులు శ్రీ విక్రమదేవవర్మగారు. ఈమహారాజును సాహిత్య

సభలలోఁ దఱచు చూచి యుందుము. ముదిమిచేఁ దటస్థించిన చిన్న యొదుగుగల మధుర కంఠస్వరముతో నీ మహారాజు తెలుఁగుభాషలో నభిభాషించునపుడు తెలియనివారేమనుకొందురు? లక్షల కొలఁది రాఁబడి వచ్చు సంస్థానమునకుఁ బ్రభువు లని యూహింపఁగలరా? కాలు క్రిందఁ బెట్టనక్కఱలేని రాజ్యాధిపతి యని తలంపఁగలరా? ఏమను కొందురు? — చక్కఁగా నుపన్యసింపఁగల యొకరో వృద్ధవిద్వత్కవి యని మాత్రము తెలిసికొనఁ గలుగుదురు.

శ్రీ విక్రమదేవ వర్మగారు ఆంధ్రమునసే కాదు, ఆంగ్లముననుమృదువుగా నుపన్యసింపఁ గలుగుదురు. ఉత్కలభాషలో వీరికి మంచి ప్రవేశ మున్నదని చెప్పుట ఆ భాషలో "రాధామాధవ నాటకము" నంఘటించినారని తెలియుచున్నది. సంస్కృతవాఙ్మయములో వీరికి ధారాళమైన సాహిత్య మున్నది. ఆభాషలో రచించిన వీరి శ్లోకములు చక్కని ధోరణిలో సాగినవి.

శ్లో. సంసృత్య పారజలధే స్తరణైక పోతౌ
పాపాంధకార పటలీ దివసాధినాథౌ
భక్తాళినిత్య సుఖకైరవ షండసోమౌ
చైతన్య దేవచరణౌ శరణం ప్రపద్యే.

శ్లో. సంసార పాశబద్ధానాం ప్రాణినా మతిదుఃఖినాం
ముకుందనామ వర్ణాళి స్మరణం ముక్తిసాధనమ్.

వీరు సంగీతకళలోఁగూడఁ బరిచితిగలవారు. జ్యోతిషము తెలియును. నాట్యము నెఱుఁగుదురు. ఇట్టి విజ్ఞతలు వారిలో నున్నవనుటకు రచనలు నిదర్శనములు. కావ్యరచనయందును, కథాగ్రథనమునందును వీరికి మంచిచాతుర్యము కలదు. పెక్కు గ్రంథములు వ్రాయలేదు కాని వ్రాసినవి నిర్దుష్టముగా నుండును. వీరి కవితాశయ్యలో శుచిత్వము హెచ్చు. రుచి కొంచెము తక్కువ. వీరి మానవతీచరిత్రము, శ్రీనివాస

కల్యాణము పరికింపవలయును. 'రాజధర్మము'నుగూర్చి వీరి పద్యములు చూడుఁడు.

గీ. రాజు నిజదేశమునకును బ్రజలకు దొర
ననుచుఁ దలఁపక తన్ను శ్రీహరిజనులకు
సేవ చేయుట కొఱకే సృజించె నంచు
నెంచి వినయమ్ము గలిగి సంచరించు టొప్పు.

గీ. ప్రజలు శ్రమపడి యార్జించి భక్తిఁ దనకు
నిచ్చినధనంబు వారికై వెచ్చపెట్ట
కాత్మభోగాళి కొఱకును ఖ్యాతికొఱకు
వమ్ముసేయుట తగునె నృపాలకులకు.

ఆ॥ వె॥ తనదు ప్రజలు వెతలఁ గనుచుండ వారిని
తలఁప కన్యదేశములకు నేగి
సామి యలరఁ దగునె? జనుల రంజింపని
వాని నృపుఁ డనంగఁ బాడి యగునె?

గీ. ప్రజల సుఖదుఃఖములు ధరావరుఁడు దనవి
గాఁ దలంచుచు నీతిమార్గమునఁ జనుచు
సజ్జనుల గౌరవించుచు న్యాయము పడక
పరమపురుషుని భక్తిచేఁ బరఁగవలయు.

ఈ రాజధర్మములగీఁటు దాఁటకుండఁ బ్రజాపాలనము చేసిన విక్రమదేవవర్మ యభినందనీయుఁడుగదా! ౧౯౪౦ సం॥లో "శ్రీమహారాజ విక్రమదేవవర్మ రచనలు" తలిసెట్టి రామారావుగారు ప్రచురించిరి. అందనేక గద్య పద్యము లున్నవి. "నేఁటి తెలుఁగు" అను శీర్షికతో శ్రీవిక్రమదేవవర్మగారు వెలువరించిన రచన నిచటఁ బ్రచురించెదను. ఈ వ్యాసములో నాధుని కాంధ్రమును గూర్చి శ్రీవారి యభిప్రాయము సర్వము సువ్యక్తమగుచున్నది.

" సజీవ నిర్జీవ యుక్తంబగు జగంబు నియమయుతంబయి విలసిల్లు చుండుటవలన నియమ మత్యావశ్యక మనుట యతిశయోక్తి గాదు. అట్లగుటవలన విజ్ఞులు నియమమును విడనాడుట యసమంజసము. ప్రవర్తన నియమమును స్మృతి విధించునట్లు భాషానియమమును వ్యాకరణము శాసించెడిని. కనుక వ్యాకరణవిరుద్ధ పదములతోడ వెలయు కైత గర్హితము యగును. నానోములగు బాసలందు మిన్న యని యెన్నంబడు తెలుఁగుబాసకు సమగ్రమగు వ్యాకరణము నేఁటికిని లేకుండుట మిక్కిలి శోచనీయము. వ్యాకరణ మసమగ్ర మను నెపము చేత నున్న నియమములను మీఱుట యుక్తము గాదు... ..'వాఁడు' యొక్కయు 'అవి' యొక్కయు ద్వితీయావిభక్తిరూపము 'వానిని'. కనుక విభేదము కొఱకు 'అవి' యొక్క ద్వితీయావిభక్తిని "వాటిని" అని వ్యవహరించుట యుక్తము. "అయితే" – "కూఁతురును" మొదలగు కొన్నిరూపములు గ్రామ్యములని నాయాశయము. భాషాభిమానముగల పండితులొకచోటఁ గూడి గ్రహింపఁ దగిన రూపములను నిర్ణయింప వలెను. మఱి యవియే వాడఁ బడవలెను. అట్లు కానిచోఁ దెలుఁగు బాస కోదుబాస కంటె నీచతర మగును."

భాషావాద విషయములో విక్రమదేవవర్మగారిది మంచి పట్టుదల. గ్రామ్యవాదమును సహింపనేరరు. అదియటుండ, ఏగుధాతువు – అమర సింహుఁడు, ధాగుణీరూపము, నన్నయభట్టుయుగము మొదలగు రచనలవలన వీరి విమర్శన నైశిత్యము వెల్లడియగును. కథారచనలోఁగూడ వీయనకుఁ జాతురి యున్నది. వయనప్పుఁ జెలికాఁడు – మునలిమగఁడు అనుకథలు 'ఆంధ్ర' పత్రికలోఁ బ్రకటింపఁ బడినవి. మంత్రిప్రెగడ సూర్యప్రకాశకవి " సీతారామచరిత్ర " మను ద్వ్యర్థికావ్యము రచింపగా, దానికి వీరు టీక రచించిరి. దానివలన వీరి పాండితీ విశేషము స్పష్ట పడుచున్నది. ఆంధ్రసరస్వతిని వీరనేక రీతులఁ బోషించుచున్నారు.

'ఆంధ్ర విశ్వవిద్యాలయము' సాలునకు నూఱువేలు వీరి వలనఁ బడయు చున్నది. దానికి వీరు ప్రధానాధ్యక్షులు. విశ్వవిద్యాలయము మీఁది యభిమానముచేఁగాఁబోలు, ఈపండిత ప్రభువు 'విశాఖపట్టణము'లోఁ దఱచు మకాముచేయుచు 'హవామహలు' విశాలమైన వరండాలో దర్శింపవచ్చిన విద్వాంసులను, కవులను, అర్థులను దత్తదుచితరీతి నాద రించి గౌరవించుచు నిరంతరము గ్రంథపఠనమునందో, గ్రంథ రచనము నందో నిమగ్నుఁడై యుండును. వీరు 8-6-1931. వ తేదీని జయపుర సామ్రాజ్య సింహాసనమునకు వచ్చిరి. రాజ్యమునకు వచ్చిన పూర్వము, పరముకూడ వీరి స్వభావము గర్వరహితమైనదే.

ఈయన "సాహిత్యసామ్రాట్టు" గాఁ బేరుమోసి యెందఱో తెలుఁగు కవుల వలన మధురకృతులు పొందిరి. రసజ్ఞుఁడు, విద్వాంసుఁడు, మహా రాజు నగు నీ విక్రమదేవవర్మకు శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు 'మేఘ దూత' కావ్యము నంకిత మొసఁగినారు. ఒసఁగుచు వారు వ్రాసిన పద్యమిది:—

ప్రజలు బెగడొంద యుద్ధ లంపటుఁడుగాని
కృష్ణరాయఁడు, తెలుఁగున మృదుల కవన
మును బొనర్పఁగ నేర్చిన భోజరాజు
తలఁప విక్రమదేవ విద్వత్ప్రభుండు.

కొణ్డ వేంకటరత్నముగారు 'సింహాచలయాత్ర' విక్రమదేవ వర్మగారి కంకితము చేసిరి. విఖ్యాత విద్వాంసులగు బులుసు పాపయ్య శాస్త్రిగారు తాము రచించిన 'అలంకారసంగ్రహము' న నీ సాహిత్య సామ్రాట్టును లక్ష్యముగా నిడికొనినారు. ఆ కృతి నూఱుపేరు "విక్రమ దేవవర్మ మహారాజీయము." ఇది ప్రతాపరుద్రీయ, చమత్కార చంద్రికా, నరసభూపాలీయాదులవలెఁ జిరస్థాయిగా నుండి యా మహా రాజుపేరు నిలఁబెట్టఁగలదు. కళా ప్రపూర్ణ త్రిపురాన వేంకటసూర్య

ప్రసాదరాయ కవి 'మొయిలురాయబారము' విక్రమదేవవర్మ కంకితము గావించెను. కృతికర్తయు, కృతిభర్తయు నగుట మంచియదృష్టము. అది పట్టిన మహారాజు విక్రమదేవవర్మ. సంస్కృతాంధ్రములు, ఆంగ్లము కాక 'హిందీ' కూడ వీరికి సుపరిచితమైన భాష. తులసీదాసుని వర్షఋతు వర్ణనము, శరదృతువర్ణనము పద్యరూపముగా వీ రనువదించిరి. బహుభాషాప్రవేశము గలవారే యసలు తక్కువ; మహారాజులలో మఱియుం దక్కువ.

శ్రీ విక్రమ దేవవర్మగారు పూరించిన యీసమస్యలు కొన్ని మీ ముందుపెట్టెదను. ఆయన యెట్టియాలోచన కలవారో నిర్ణయించుకొనుఁడు.

సమస్య :— కొడుకును దా వలచి యొక్కకూఁతుం గనియెన్.

క. పుడమికి మేనక యనియెడు
పడతుక దివినుండి వచ్చి పావనమగు కా
ఆడవిని నృపుఁడగు కుశికుని
కొడుకును దా వలచి యొక్కకూఁతుం గనియెన్.

సమస్య :— అంధుఁడు భాస్కరునిఁజూచి యానందించెన్.

క. అంధత్వహరుండగు రవి
బంధురకృప గ్రుడ్డితనము వాయఁగఁ గవితా
సింధువు మయూరుఁ డనెడు పు
రాంధుఁడు భాస్కరునిఁ జూచి యానందించెన్.

సమస్య :— తల్లీ! దండం బటంచు దారకు మ్రొక్కెన్.

క. ముల్లోకంబుల మేలున
కల్ల మహిష దనుజుఁ జంపు మను తఱియందే
యెల్ల సురలతో భర్గుఁడు
తల్లీ! దండం బటంచు దారకు మ్రొక్కెన్.

ప్రౌఢార్థప్రదీపితములు, భావభూషితములు నగు నీ జయపురాధీశ్వరుని పద్యరచనలు పరికించినచో "కృష్ణదేవరాయలు విష్ణుచిత్తీయకృతికర్త కాఁ"డను దుర్వాదము సడలిపోవును. ఆ కవిరాజు వ్రాసికొన్న 'కవిజన్మకుండలి' యిం దుదహరించుట యెందుకేని మంచిది.

గీ. అజము లగ్న మచ్చోటనే యమరగురుఁడు
యుగ్మమున రవి బుధ శుక్రు లొప్పుచుండఁ
గర్కి రాహువు కుజుఁడు సింగంబునందు
వృశ్చికంబున శని కర్మ గృహమునందుఁ
జంద్ర కేతువు లుండంగఁ జంద్రనంద
శైల శశి శాలివాహన శకసమఁ దగు
మిథున మాసేష్టు శశిదిన మిళిత శుక్ల
పక్ష శుక్ర మాసా పరపక్షమందుఁ
జవితి నినవారమున ధనిష్ఠా ద్వితీయ
పాదమున విక్రమేశ్వరవర్మ వొడమెఁ
గుజదశా శేషమగు నాలుగు సమ లైదు
నెలలు నిరువది యేడు నాళులు గణింప ॥

[శాలివాహనశకము ౧౭౯౧ శుక్ల సం॥ జ్యేష్ఠ బ ౪ ఆదిత్య]

మంత్రిప్రెగడ భుజంగరావు

1876 - 1940

ఆఱువేల నియోగి శాఖీయ బ్రాహ్మణుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. హారితస గోత్రుఁడు. లక్కవరము జమీందారు. దత్తత గొన్న తల్లిదండ్రులు: విజయలక్ష్మమ్మ, మల్లికార్జున ప్రసాదరావు. కన్నతల్లి: వెంకమాంబ. కన్నతండ్రి: మల్లయామాత్యుఁడు. జన్మస్థానము: ఏలూరు. జననము: 1876, ధాతృసంవత్సర చైత్ర బహుళ పంచమీ గురువారము. నిర్యాణము: 1940 సం॥ గ్రంథములు: దిలీపచరిత్రము, స్తవరాజము, హరిశ్చంద్ర నాటకము, మైరావణుఁడు, మోహలేఖావళి, మాల్కుసువార్త, మార్కండేయేశ్వరచరిత్రము, పాండవాజ్ఞాతవాసము, పరమ పురుషాన్వేషణము, పదార్థ విజ్ఞాన శాస్త్రము, నిరపవాద ప్రహసనము, చిత్ర హరిశ్చంద్ర నాటకము, చారుమతీపరిణయము, ఉత్తరరామ చరితము, ఆధునిక కవిజీవితములు, కలియుగ నటనామృతము, విజయాంక సాహసము, అభిజ్ఞాన శాకుంతలము, వచననైషధము, వాసంతిక, వ్యవసాయ, మార్కండేయశతకము, రాజహంస, మధుప విహారము, తత్త్వమీమాంస, ఆంధ్ర కథా సరిత్సాగరము, గోఖలేచరిత్ర, లూకా సువార్త, దీనరక్షామణి శతకము, అగ్గిరాముని మరణావేదనము-ఇత్యాదినాటకములు, నవలలు, విమర్శనగ్రంథములు, వివిధవిషయక గ్రంథములు వీరివి శతాధికముగా నచ్చుపడినవి.

శ్రీ భుజంగరావుగారిని జమీందారులు గాను, కవులుగాను మన మెఱుఁగుదుము. వారు సామాన్య రచయితలుగాక శతాధిక గ్రంథ రచయితలు, దర్శనాచార్యులు, వితరణ చతురులు కూడను. వీరికి సంస్కృతాంధ్రములలోఁ దగిన సాహిత్యమున్న దని కృతులు ప్రకటించుచున్నవి. ఆంగ్లమునందును బ్రజ్ఞ గొప్పది. గ్రంథరచన మందే కాక 'మంజువాణి' పత్త్రికా ప్రచరణముచేఁ దమ ప్రతిభ వితతముగా వెలువరించుకొనిరి. అంతతోఁ దృప్తిపడక విలాసార్థ మవధానములు చేసినారు. వీరు చేసిన యష్టావధానమునకు సభాపతులైన కొక్కొండ

మహామహోపాధ్యాయునకు బంగారు వృత్తములో నిట్లు భుజంగరాయ కవి నుగ్గడించెను.

వాకట్టుఁ గట్టించి వరలెదవఁట నీవె
యందఱ కిష్ట మృష్టాన్నభుక్తిహర్షమునఁగాఁ
గట్టెంతు వఁట నీవె పుట్టంబులన్నె యొందఱనో
ప్రబంధుండన నెనయ ముదము, ఘనుఁడవుగా
ముసుఁగువేయించుచు నొసఁగెదవఁట నీవె
సత్పండితులకు సాలువులను శ్లాఘ్యముగాఁ
జేకట్టు కట్టించి చెలఁగెద వఁట నీవె
కవివరులకుఁ బైడి కడియములన్నె, ఖ్యాతిగదా
ధర్మభూయంత్రములను స్తంభన మొనర్చి వంద్యుఁడయా
నాప్రభాకరునే యాఁగితేఁట యెటువలె నారసెదో
యొక్కఁ డిక్కవిమణి నీకుఁ జిక్కె నిపుడు చక్కఁగాను
సత్కవీశ్వరరాజ భుజంగరాయ! సర్వగేయ!

విశ్వతోముఖమగు బుద్ధిబలమును బ్రసరింపఁజేసి కవులలోఁ గవులై, పండితులలోఁ బండితులై, విమర్శకులలో విమర్శకులై, ప్రభువులలో బ్రభువులై, దాతలలో దాతలై ఖ్యాతినందిన యదృష్ట జీవనులు భుజంగరావుగారు.

మత్తయిసువార్త, క్రైస్తవగూఢార్థ దీపిక, మార్కుసువార్త, యోహానుసువార్త ఇవి వీరు పద్యములుగా వ్రాసి తమక్రైస్తవ మతాభిమానమును జాటుకొనిరి. ఇట్లని ప్రాచీన మతాచార్యుల యా దర్శములను శిరసావహింపనివారు కారు. ఇటీవల వీరు వెలువరించిన యెనిమిది నూర్ల పద్యములతోఁ గూడిన 'తత్త్వ మీమాంస' చూడుఁడు. ఇందు శంకర, రామానుజ, మధ్వాచార్య, చైతన్య, బుద్ధ, క్రీస్తు, మహమ్మదుల మతాశయములు సరిచూపుతోఁ బరిశీ

లితము చేసి ప్రకటింపఁబడియున్నవి. వీరి శతాధికగ్రంథములలోఁ గల కవితాధారయెల్ల యతిప్రాసములకుఁ దడవుకొకుండ నడచిపోవుచున్నట్లుండును. రసభావదృష్టితో విమర్శించినచో నిలఁబడుపద్యములు మిక్కిలితక్కువగానుండును. చ్యుతసంస్కారములు దొరలుచుండుటయుఁ గలదు. కాని ధోరణి యెత్తుపల్లములు లేక యొకే తీరున సాగుట మెచ్చుకోఁదగిన ముఖ్యవిషయము. బహుగ్రంథ రచనమునందే వీరికి వేడుక కలిగియుండిన కారణమున, శాశ్వతస్థాయిగా నుండఁగల గ్రంథమొకటియును వ్రాయలేక పోయినారు. వ్రాసినవానిలోఁ గొన్ని కొంతపేరు సంపాదించుకొన్నవి యున్నవి. A History of telugu literature అనుపేర వీ రాంగ్లములో నొక గ్రంథము వెలువరించిరి. దాని రచనలో పి. చెంచయ్యగారు తోడ్పడిరి. అది కొంత పేరుగొన్నకూర్పు. "ఆధునికాంధ్ర కవిజీవితములు" అను పేరుపెట్టి వీ రొకగ్రంథము నచ్చు కొట్టించిరి. అది వీరి ప్రథమ పుత్రిక పరిణయ సందర్భమున సమావేశమై ౨౩౩ విద్వాంసులు చేసిన యాశీస్సులు గల కృతి. అందు విశేష మేమనఁగా వారివారి సంక్షిప్త చరిత్రములు కూడఁ జేర్పఁబడి యున్నవి. ఆ కారణమున, ఆపుస్తకము దాఁచుకో వలసినదిగాఁ దోఁచును. కొమార్తెల వివాహములు మహావైభవముగాఁ జేసి భుజంగరావుగారు మంచిపేరు కవిలోకములో సంపాదించుకొనిరి. ఒక కవి యిట్లు వ్రాసినాఁడు.

క. రాజా భుజంగరాట్కవి
భోజుఁ డహో! దేవదుందుభులు మ్రోగించెన్
భూజనములఁ బూజనముల
భోజనములఁ దనిపి ప్రథమపుత్రిక పెండ్లిన్.

అభిజ్ఞాన శాకుంతలము, ఉత్తరరామచరితము వీరు మధురముగా నాంధ్రీకరించిరి. 'తత్త్వమీమాంస' యనుకృతి పండువయస్సులో

వ్రాయఁబడినది. కావున నందుండి కొన్ని పద్యములు స్మరించుకొందము. ధారాళత యెంతో శ్రుతిసుఖముగా నుండును. విషయము సుపవిత్రము.

సీ. ఏపరేశు నమోఘ హృదయ సంకల్పముల్
బ్రహ్మాండ మండలోత్పాదనములు
ఏచిదాత్ము కటాక్షవీక్షణాసారముల్
జీవకోట్లకు సుధాసేచనములు
ఏమహాత్ముని యుద్దామ వాగ్వైభవముల్
మునిజన సంశయోన్మూలనములు
ఏదయాళు నిరంకుశోదార కృత్యముల్
ప్రాణి సంరక్షా పరాయణములు
అట్టి పరమేష్ఠి వదనగహ్వర చతుష్ట
యంబునుండి యనాది కాలంబునందు
నాశుధారా ప్రవాహ సామ్యంబు దోఁప
నగణితామ్నాయ సముదాయ మవతరించె.

ఉ. ఆ నిగమంబు లెన్నఁగ ననంతములై పరధర్మ బోధనా
స్థానములై జగత్స్థితి విధానములై పురుషార్థ సాధనో
ద్యానములై మహాగుణ నిధానములై విలసిల్లి సంతతా
నూన కళావిలాసముల నొప్పుచునుండె జగత్త్రయంబునన్.

గీ. అట్టి యామ్నాయ నిచయ మహాంబురాశి
యందలి మహత్తరార్థంబు లఖిల జనుల
కాది నెంతయు దురవగాహములు గాఁగ,
వాని విభజించె నప్పు డా వ్యాసమౌని.

చ. ఎనసిన యబ్ధులట్లు భరియింపఁగ శక్యముగాని వేదరా
శిని విడఁదీసి కొంత ససిజేసిన వ్యాసమునీంద్రు దివ్యశో
ధనమున నాఁట నుండియు నుదారతర శ్రుతిసంచయంబు న
య్మునివరు లెల్ల శిష్యులకు బోధయొనర్చుచునుండి రాదటన్.

గీ. ఆకులారావు ; గంటంబు లసలె కావు ;
కాగితంబులు కలము లెక్కడను లేవు ;
ఒక్కయక్కర మైన వ్రాయుపనిలేక
యెల్లశ్రుతులును వల్లించి రెల్ల ఋషులు.

గీ. తనువులకు జీవకళపోల్కిఁ దరణి చంద్ర
ములకుఁ బ్రభవోలె నా వేదపుంజమునకు
నస్ఖలితమై వెలుంగు మహాస్వరంబె
ముఖ్యముగ నెన్నఁబడె ఋషిముఖులచేత.

ఈ రకముగు కవితాధారతో శ్రీభుజంగరావుగారు శతాధికములు కృతులు సంతరించి రనఁగానది పురాజానుష మైన పుణ్యఫలము "కవియు రాజును, మంత్రిప్రగడ భుజంగ, రావు బహదూరు, హేలాపుర ప్రధాని, నయశతాధిక గ్రంథకర్త, యవధాని దగ్గనాచార్యబిరుదమ్ముఁ దనరఁ బూని." అని యాయన వ్రాసికొనట్లుగా సకలభాగ్యములు వీరికిఁ బట్టినవి. శ్రీ కొత్తపల్లి సుందరరావుఅను కవివరునొకని తనసంస్థానములోఁ బెట్టుకొని గౌరవించిన యీ కవిప్రభువు శీలసంపత్తి గణనీయము.

ఆకొండి రామమూర్తి శాస్త్రి

1875

ఈయన ద్రావిడశాఖీయబ్రాహ్మణులు. ఆత్రేయసగోత్రులు. జన్మస్థానము: కేశనకుఱ్ఱు పోలవరము. తల్లి: లచ్చమ్మ. తండ్రి: రామస్వామి. జననము: భావసంవత్సర కార్తిక శుద్ధ ప్రథమ. 1875 సం॥ రచనలు:- ౧. స్వప్నానసూయ [కావ్యము] ౨. దేవీభాగవత నవమ స్కంధము [తిరుపతివేంకటకవుల దేవీభాగవతమున తొమ్మిదవ స్కంధము మాత్ర మీ కవి తెనిఁగించెను] 3. జీవానందన నాటకము [అముద్రితము.]

రామమూర్తి శాస్త్రిగారు ప్రత్యేకముగ రచించి ప్రకటించిన కావ్యము "స్వప్నానసూయ" ఈ యొకకావ్యమునుబట్టియే కాక దేవీభాగవత నవమస్కంధ రచనవలనఁగూడ నీయనకు రచయితలలో స్థానమేర్పడినది. నవమస్కంధము తెనిఁగించుటలో శాస్త్రిగారొకరే కాదు, వీరికి మఱియొకకవి సాయపడినాఁడు. ఆయనపేరు నిశ్శంకుల కృష్ణమూర్తి. వీరిరువురును కలసి రామకృష్ణకవులు.

తిరుపతి వేంకటకవులను వినని వారుండరు. వేంకటరామకృష్ణ కవులను విద్వత్కవు లందఱు నెఱుఁగుదురు. ఇప్పు డీ "రామకృష్ణుల" జంట నెఱిఁగినవారు చాలఁ గొలఁదిమంది. దానికిఁ గారణము వీరు పెక్కు కృతులు రచింపనులేదు; పత్రికలలో వీరిపేరు మనము పఠించుచుండుటయు లేదు. చిత్రములు కవిత్వమందున్నను వృత్తులు వేఱగుటచేఁ గవిలోకములో వీరికెక్కుడు పేరుఁ బెంపులు లేకపోయినవి. ఆకొండి రామమూర్తి శాస్త్రిగారు అనాదిప్రసిద్ధాయుర్వేద వైద్యములో నందె వేసినచేయి. నిశ్శంకుల కృష్ణమూర్తిగారు కాలు కదప నక్కఱ లేకుండ మంచి వగటుగా గ్రామ కరణపుఁబని చేసికొనుచుండు నేర్పరి. ఇరువురు మురుమళ్ళ పోలవరమే కాఁపురముగాఁ గలవారు. ఇరువురు

పెద్ద సంసారమునకుఁ జాలినంతయున్నవారు. శ్రీ ఉప్పులూరి రామ జోగన గురుముఖమున సంస్కృతాంధ్రములు చదువుకొని నిసర్గజమైన కవిత్వ ధోరణిని బెంపు చేసికొనిరి.

తిరుపతి వేంకట కవులతో రామమూర్తి శాస్త్రి గారికి మంచి మైత్రి. విశేషించి, వేంకట శాస్త్రిగారితో బాంధవము. చెళ్ళపిళ్ళకవి రామ మూర్తి శాస్త్రి కడనే తఱచు ఔషధసేవ చేయుచుండుట యలవాటు. 1902 లో వేంకటకవి కనారోగ్య మేర్పడి పోలవరము వెళ్ళి మందు సేవించుచు రెన్నెలలు నిలువయుండెను. శాస్త్రిగారి 'జాతకచర్య' యీవిషయమును దారకాణించుచున్నది. అప్పుడు తిరుపతివేంకటకవుల దేవీభాగవత రచన సాగుచున్న సమయము. నవమస్కంధాంధ్రీకరణము పీఠికలోని యీపద్యము లీ పూర్వోత్తర సందర్భమును బూసగ్రుచ్చినట్లు ముచ్చటించుచున్నవి:

గీ ... ...
ప్రథిత చరకాది వైద్యశాస్త్రప్రవీణుఁ
డమలమతి రామమూర్తి నామాంకితుండు.

క. తిరుపతి వేంకట కవులం
దిరువురిలో నొకఁడు వేంకటేశ్వరకవికిన్
జిరజీర్ణ కృచ్ఛ్ర రుజమును
సరసౌషధముల నొసంగి సాధించె నడిన్.

గీ. శ్రీలలితమైన యుట్టి మాపోలవరము
నందు మాసద్వయం బుండి యౌషధంబు
పుచ్చుకొనియెను వేంకట బుధుఁడు నాఁకు
మువ్వురకు నేస్తమయ్యె నప్పుడు దృఢముగ.

క. నీరుజుఁడై విశ్వాసము
ప్రేరేపన్ జెళ్ళపిళ్ళ వేంకటకవి మా

లో రామమూర్తి గుణసం
భారము వ్రాక్రుచ్చి నొక్క మత్తేభమునన్.

వ. అది యెట్లంటేని —

మ. కవిత నైపుణిగాంచి చక్కఁ జతురంగంబాడఁగా మించి, గా
న విధిం బద్యములం బఠింపఁదగు విన్నాణంబు నార్జించి వం
శ వళంబై యెడఁబాయకున్న దగు భైషజ్యంబునం జక్రవ
ర్తివినై యొప్పితి రామమూర్తి! శమితార్తీ! కీర్తికి న్మూర్తివై.

ఉ. ఈవును కృష్ణమూర్తియును నేకముగా నొకచోఁ బఠించుచున్
భావము కబ్బ మొక్కగతి భాసిలు మిత్రులు మీర లిర్వురున్
గావున నిచ్చవచ్చు నొకస్కంధముఁజూచి తెలుంగు సేయుఁడీ
దేవిచరిత్ర మందు భవదీయ గుణోన్నతి వెల్లడిల్లెడున్.

అని వేంకటశాస్త్రిగారు సానురాగముతో నీ రామకృష్ణులకు నవమ స్కంధము నాంధ్రీకరింప నిచ్చిరి. ఆ కవులకు మెచ్చు వచ్చునటులు వీరాస్కంధము తెనిఁగించిరి. "ఈ కృతివరంబు, తెలుఁగుసేయుచు రామమూర్తియును నేను రామకృష్ణులమైనవారము కలయిక" అని స్కంధాదిని వీరు వ్రాసికొన్నటుగా నీ కృతి రచనమునందు మాత్రమే యీ కవ యిటులు కూడినది. దీనికి ముందుగాని, వెనుకఁగాని, వీరు జతగా విరచించిన గ్రంథము లేదు. ప్రత్యేకముగా, కృష్ణకవి 'కీచకవధ' యనునాటకమును రచించెను. రామమూర్తి 'స్వప్నానసూయ'కావ్యము సంతరించెను.

1929 లో సహపాఠి స్వర్గస్థుఁడైన తరువాతనే రామమూర్తిగారు స్వప్నానసూయ రచన 1936 లోఁ గావించెను. పాలకొల్లువాస్తవ్యుఁడు శ్రీకృష్ణ భారతకృతిభర్తయు [కర్ణ-శల్య-సౌప్తిక-స్త్రీ పర్వములు] నగు చుండూరి నారాయణరావను వైశ్యవరుని కోరికపై పతివ్రతాధర్మ

భరితమగు చరిత్రముతో స్వప్నానసూయ రచింపఁబడినది. కృతిభర్త రామమూర్తికవికడకు వచ్చి సమ్మదాశ్రు పూరిత నయనయుగళుఁడై

ప్రతిపదరమణీయము రం
జిత కమనీయార్థ గుణవిశేషము భవ ద
ద్భుత కవితాగుంఫన మో
కృతమతి ! నీ వెట్టి పరమ కృతకృత్యుఁడవో !

అనిప్రార్థించి యీ కావ్యము తన ధర్మపత్ని పేర వ్రాయఁ గోరును. నిర్దుష్టము, భావరసపరిపుష్టము నగు నందలి కవితాసృష్టి యిటు లుండును. ఇవి సీతాపాతివ్రత్యప్రభావ వర్ణనములోని పద్యములు.

సీ. అడ్డులే కొకపల్కు నాడింపలేదయ్యెఁ
బ్రాజ్యదై తేయ సామ్రాజ్యలక్ష్మి
కనుఁగొనసైనఁ గన్గొనఁ జేయలేదయ్యె
భువనరమ్య కుబేర పుష్పకంబు
మాఱు మొగంజేసి మరలింపలేదయ్యె
గంభీర దశకంఠ గౌరవంబు
ఒకపాటి తలనైన నూపింపలేదయ్యె
నతి శాత్రతర చంద్రహాసధార
యద్దిరా ! నిర్భర ప్రణయ ప్రఫుల్ల
రామచంద్ర పదాంభోజ రాగ భరిత
చరిత యగు సీత సౌశీల్య సద్గుణ ప్ర
తాప మహిత పతివ్రతాత్వ ప్రశస్తి.

* * *

సీ. ఒనర నాఁగేటిచాలున నయోనిజయయి
పొడమె నీబోటి యన్ బుద్ధిఁగాదు
జనక నామక మహా చక్రవర్తి కుమారి
యనియెడు గౌరవంబునను గాదు

తులలేని త్రిభువన దుర్లభ సౌందర్య
విభవంబు గలదన్న వేడ్కఁ గాదు
వివిధ విభ్రమ కళా విష్కృతాత్యద్భుత
చాతుర్యవతి యను ప్రీతిగాదు
ప్రేమతత్త్వజ్ఞుఁడైన శ్రీరామమూర్తి
సీతయెడ నట్టి కూరిమి సేఁత యరయ
ధర్మసతి యంతరంగంబు మర్మ మెఱిఁగి
కాని, వేఱొండు కతమునఁ గాదు సూవె!

రామమూర్తిశాస్త్రిగారికి 1944 లో సప్తతి పూర్తి మహోత్సవ సన్మానము గావింపఁ బడినది. ఆసందర్భమున శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు వ్రాసిన పద్యములలో నీక్రిందివి పారాయణము చేయఁ దగినవి.

మ. ఇతఁ డస్మత్కులుఁ డంతె, శిష్యగణమం దేనాఁడునుం గాఁడు,తి
ర్పతితోఁపాటు కవిత్వపున్ రచనలో భాగస్థుఁ, డేతన్మహా
మతిసోదర్యుఁడొకండు శిష్యుఁడగుట న్మన్నించి దీవింప న
ర్హత నా కున్నది, వృద్ధుఁ డీతఁ డగుటన్ భ్రాజిష్ణుఁడున్ జిష్ణుఁడున్.

చ. తిరుపతి శాస్త్రిఁ దక్క గణుతింపని నే నితనిన్ గణించి మా
విరచన నున్న భాగవతవీధిని జోటు నొసంగినట్లు ధీ
వరమణు లెల్లవా రెఱుఁగు వారలె, వా కొననేల! దీనికిన్
దిరుపతిగూడ నొప్పుకొని దేవునిసైత మతండు మెచ్చునే?

చ. తిరుపతి యొండె వెంకనయొ తెల్గొనరింపక దంటకూడదు
స్తరమని యెంచి వేఱొక భిషక్కునకున్ స్థలమీరు, రామమూ
ర్తి రసికుఁ డౌటచే నతని తేఁకువ తా గ్రహియించి వేంకటే
శ్వరుఁడిడెఁ జోటు తిర్పతియు సమ్మతిఁ జూపె యథార్థమింతియే.

చ. నలువురనోళ్ళఁ బొగ డబడుట నచ్చదువో మనరామమూర్తి కై
య్యలఘుని యుత్సవంబునకునై తలపెట్టితి రుత్సవంబు మీ
రలు మహనీయు లెంతయు భరంబని మీసభ కేఁగుదేర సి
గ్గిలి మొట డాఁగునో, తెలిపి కేల్గవ పట్టుక నిల్పుఁ డెట్టులో.

ఉ. ఈయన నూత్న నాగరక తేచ్ఛకు లోఁగెడివాఁడె యైనచోఁ
బాయని కీర్తితోడ నిరపాయపు రాఁబడి పోల్పరంపుఁ జూ
చాయల వేలు లక్షలును సాగుచు ముక్కుచుఁ దాండవించు, నే
మాయయు మర్మమున్ సలుపు మాటలతోఁ బనిలేదు లేశమున్.

గీ. ఈతనికి నాకు విద్యాంబు నెనయుకోర్కి
కలిగియుండెను లే వయఃకాలమందు
కైతలో నప్డు ఘటియించెఁ గడచులోటు
మనుమరాలు శ్రీమతి ద్వారమున ఘటించె.

ఇన్ని పద్యము లిటులు చెళ్ళపిళ్ళ కవివి యుదాహరించుట యెందుల
కనఁగా, వీరిద్దర హృదయ బంధుత లిట్టి వని చదువరులకుఁ దెలుపు
టకే. వాస్తవముగ కొంకమహాకవిచే మెచ్చఁబడుటయే ఘనతకుఁ
గారణముకాదు అసలు, రసికమానసములూఁపఁగల శక్తి యేదేని
రచయితలో నుండవలయును. అదికొంత రామమూర్తిశాస్త్రిగారి
స్వప్నానసూయలోఁ గనఁబడుచున్నది. ప్రధానమైన వైద్య వృత్తిలోనే
యుండిపోయి, యథాలాభముగాఁ గవిత వ్రాయుచుండుట జరుగుటచేఁ
గాఁబోలు, వీరిపద్యములు తెనుఁగునాఁట హెచ్చుగా నల్లుకొనలేదు.
ఈసంగతి వారుకూడ గుర్తింపలేకపోలేదు.

నా పాండిత్యము నాకవిత్వరచనా నైపుణ్యముం గాంచి మీ
రీపట్టన్నను సత్కరింపరసియే యేనెంతు ; నొక్కింత యే
దో పేరున్నది నాకుదేశమున నాయుర్వేదమం, దద్దియుఁ
మాపిత్రార్జితవృత్తియుం జెతిఁగి నంభావింపుఁడీ సోదరుల్ !

చర్ల నారాయణ శాస్త్రి

1881-1932

ఆరామద్రావిడశాఖీయ బ్రాహ్మణుఁడు. జన్మస్థానము : కాకరపఱ్ఱు. తల్లి: వెంకమ్మ. తండ్రి : జనార్దనశాస్త్రి. జననము 1881, వృషసంవత్సరము. నిర్యాణము : 27 నవంబరు 1939, రచనలు : ౧. వృషభశతకము [ఆంధ్రీకరణము] ౨. నారాయణీయాంధ్ర వ్యాకరణము. ౩. దూతాంగదము [ఆంధ్రీకృతనాటకము] ౪. భర్తృహరి నిర్వేదము [ఆంధ్రీకృతనాటకము] ౫. కావ్యాదర్శము ౬. నీలకంఠవిజయచంపువు. ౭ మహాభారత మీమాంస [మొదటి రెండుకృతులే ముద్రితము లైనవి. తక్కినవి యింకను ముద్రింపఁబడలేదు].

నారాయణ శాస్త్రిగారు మంచి విమర్శకులు గాను, పండితులు గాను పేరుగాంచిరి. కవిగా వారికిఁ గలపేరు తక్కువ. ఆయన శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటు కార్యాలయమునఁ బండితాధికారిగాఁ బెక్కునాళ్లు పనిచేసి భారతికిఁ గావించినసేవ గొప్పవిలువ గలది.

"మేకాధీశ" శబ్దార్థమున సకలప్రపంచమును జోడించిచూపిన మహావిద్వాంసుఁడు చర్ల భాష్యకారశాస్త్రి మున్నగువారికి నెలవైన 'కాకరపఱ్ఱు' నారాయణశాస్త్రిగారియూరు. ఈయన పితామహుని సన్నిధిని కావ్యములు చదువుకొని, అక్కొండి వ్యాసలింగశాస్త్రితో నలంకార గ్రంథములు పాఠముచేసి, రామడుగులవీరయ్యశాస్త్రిగురువుల దగ్గఱ వ్యాకరణ మభ్యసించి పండితస్థానము నందెను. సంస్కృతాంధ్రములలో నిశితమైన పాండితీపాటవము. ఈ పాండిత్యమునకుఁ దోడు సంగీతాది కళలలోఁగూడ జక్కని పరిచయము. మద్దెలవాయించుటయు గురుముఖమున నేర్చినారు. అంతటి కళాభిరుచి! ఒకచిత్ర మేమనఁగా, నారాయణశాస్త్రిగారు నాఁడు ధైర్యవంతుఁడైన సంస్కారవాది. తణుకులో జరిగిన అస్పృశ్యతానివారణ మహాసభకు ఆహ్వానసంఘాధ్యక్షత వీరిదే. ఆసమయము 1935 ప్రాంతము. సహాయనిరాకరణోద్యమములో వీరు నడుము కట్టి పనిచేసినారు. కాకరపఱ్ఱు

'పంచాయితీబోర్డు' నకు యాజమాన్యము. తెనుఁగు జాతీయ పాఠశాల కార్యవర్గమునకు అధ్యక్షత. ఇవన్నియు మనము యోచించుకొన్నచో నారాయణశాస్త్రిగారు లౌకికప్రజ్ఞావంతులని విశదమగును. పండితుఁడై యుండి పాఠములు చెప్పుకొనుచుఁ గాలక్షేపము చేయకుండ, రాజకీయముగాఁ గలుగఁజేసికొనుట వీరి చరిత్రములో గమనింపఁ దగిన సంగతి.

ఆంధ్రవైయాకరణులలో నారాయణశాస్త్రిగారికి గౌరవప్రదమైన తావు ఏర్పడియున్నది. దానికిఁ గారణము వారు శ్రమించి కూర్చిన నారాయణీయాంధ్రవ్యాకరణము. నన్నయా థర్వణు లిరువురు సంస్కృతములో సంతరించిన "ఆంధ్రశబ్దచింతామణి, వికృతివివేకము" అను వ్యాకరణముల కిది తెలుఁగుగ్రంథము. విశేషము, వీరిది పద్యరూపముగా సంధానించిరి. వారి కుమారులు గణపతిశాస్త్రిగారు దానికి వివరణము వ్రాసిరి. తండ్రి కొడుకుల చేతులమీఁద నడచిన యీకృషి చూచుటకు ముచ్చటగా నున్నది. నారాయణశాస్త్రిగారి కవితారీతి యీ లక్షణగ్రంథములో నిటులు నడచుచున్నది. మనపూర్వులందఱు వ్యాకరణము, ఛందస్సు, తదితరసమస్తశాస్త్రములు పద్యములలోనే నిబంధించి యున్నారు. లక్షణగ్రంథములు పద్యబంధనములై యుండుట కవితాధారవాహితకు మిక్కిలి యడ్డు. కాని, మనవారు శ్రమించి దానికిఁ గొఱంత రాకుండఁ జూచుకొని కొంతవఱకు సఫలులైనారు.

క. సకలశ్రేయస్సాధన
ము కావ్యము; మయ్యది యదోషము గుణాలంకా
రకలితము నైన వాగ
ర్థకాయమున నొప్పు; వాక్కు రసజీవ సుమీ!

క. రసముచెడకుండ నాయా
రసములకనుగుణము లయిన రసవత్తర వా
గ్విసరంబు తోడఁ గావ్యము
రసికులు తముఁగోలఁది నుడువరాదొకొ దానన్.

గీ. సిద్ధ సాధ్య భేదంబులఁ జెలఁగుచున్న
యర్ధ పూర్ణరూపంబుల నగు ద్వివిధము;
హ్రస్వముపయి ఖండంబు పూర్ణంబు నగుసు;
గాదు ఖండంబున కది దీర్ఘంబు మీఁద.

నారాయణశాస్త్రిగారు పీఠికాపురసంస్థాన విద్వత్కవు లగువేంకట రామకృష్ణకవుల గురువులు శాస్త్రిగారు తెనుఁగుపఱచిన 'మహిష శతకము' చక్కని గ్రంథము. మహిషముమీఁదఁ బెట్టి దురధికారులను దూషించు నన్యాపదేశశతక మది. అనువాదమే యైనను గవితాధో రణి సాధుమధురముగా నున్నది.

ఉ. కొండొక దున్నపోతు నినుఁ గూర్చి ప్రబంధశతంబుఁ జేయు ను
ద్దండత నుత్సహింతు నిది తన్మహిమంబునఁ జేసికాదు; క్రూ
రుం డొకఁ డాధికారికుఁడు ద్రోహ మొనర్పఁగఁ గోపగించి వా
గ్దండముఁ దత్తిరస్కృతిపథంబున నుగ్రప్రభులందు వైవఁగన్.

చ. అతివిధవాభిమానులు దురాగ్రహు లంతియు జాతిసంభవుల్
వితత కఠోరభావనులు వేరలొ యా చెడుగండ్ల మోములన్
క్షితిఁ బరికించుకంటెఁ బరికించుట మేలగు నీదు పృష్ఠ; మ
కృతమునఁ బొట్టనిండ దొరకంగల దన్నము సైరిభేశ్వరా!

ఉ. సైరిభ! నీవు తాపమునుసైఁచి గడింపఁగ ధాన్యముల్ నుచే
దారుఁడు కొంతసొమ్ముపలెఁ దత్ఫలంబు హరించెడున్ బలా
త్కారముఁ జేసి, దాని కొక కారణ మున్నది విన్ము పిత్ర్యముల్
దారకులే హరింతురు గదా విభుఁ జెల్మినొ కల్మినొ లేక బల్మినో.

ఈలీరుగల శయ్యలో దూతాంగదము, భర్తృహరిని ర్వేదము శాస్త్రి గారు తెనుఁగున ననువదించిరి. ఇవియెల్ల నొకయెత్తు; నారాయణ శాస్త్రిగారి నారాయణీయాంధ్రవ్యాకరణ మొకయెత్తును. తెలుఁగు లాక్షణికులలో శాస్త్రిగారికీర్తి నిలఁబడుట కీ కూర్పు చాలును.

వడ్డెపాటి నిరంజన శాస్త్రి

1877 - 1937

స్వర్ణకారవంశీయుఁడు. తల్లి: భద్రమ్మ. తండ్రి: కోటయ్య. జన్మస్థానము: తెనాలితాలూకాలోని దుగ్గిరాల. జననము: 14-10-1877, ఈశ్వర సంవత్సరాశ్వయుజ శుక్లాష్టమీ భానువాసరము. నిర్యాణము: 17-10-1937 సం. ఈశ్వరసంవత్సరాశ్వయుజ శుక్లత్రయోదశీ భానువాసరము. ప్రకటితగ్రంథములు: ౧. కల్యాణకౌముది [కావ్యము] ౨. కుమారాభ్యుదయము [కావ్యము] ౩. బ్రహ్మానందలీలలు. [ఎనిమిదంకముల నాటకము 1937 ముద్రి] అముద్రితములు: ౧. ధర్మపాల చరితము. ౨. భీష్మోదయము. ౩. మాఘమాహాత్మ్యము. ౪. సూర్యశతకము. 'శ్రీ నిరంజనవిజయము' కొండూరి వీరరాఘవాచార్యులు రచించినది చూడవచ్చును.

వడ్డెపాటి వారిది విశ్వబ్రాహ్మణవంశము. ఆవంశమునఁ బుట్టిన నిరంజనశాస్త్రి తండ్రి కోటయ్య యనునతఁడు కమ్మరీఁడు. అతఁడు కులోచితమగు కమ్మరము చేసికొనుచు స్మార్తము గురుముఖమున నధ్యయనము చేసినవాఁడు. ధనసంపత్తి విషయములో నతనికుటుంబము సామాన్యమైనది. నిరంజనశాస్త్రి తండ్రికడనే పసితనమునఁ జదువుకొని, యువనీతుఁడైన పిమ్మట వేదాధ్యయనమున కుపక్రమించెను. వేదము పాఠము చేయుచునే జ్యోతిశ్శాస్త్రమును గేరళమును సొంతముగఁ జదువుకొని, తెలియనిది తజ్జ్ఞులవలనఁ దెలిసికొనుచుండెను. 'బంగారువంటి కోమటి సంగీతముచేత బేరసారము లుడిగె' నటులు కాకుండఁ గులవృత్తి యగు కమ్మరమునుగూడ నిరంజనశాస్త్రి వీలుకలిగినపుడెల్ల నలవాటు చేసికొనుచుండెను. క్రమముగ వయసు వచ్చుచున్నకొలఁది సంస్కృతవిద్యపై నభిలాషము పెరిఁగి నిరంజనశాస్త్రి పండితుల దరికేఁగి కావ్యములు, నాటకములు, కొన్ని యలంకారగ్రంథములు బహుశ్రద్ధగఁ జదువుకొని, ఆ సాహిత్యమునకు మెఱుఁగుపెట్టు కొంచెము వ్యాకరణపరిచయము కలి

గించుకొనెను. తరువాత బందరునందుండి 'పర్వతము నృసింహశాస్త్రి' యను పేరుగలవారియొద్ద నాధానపంచకము, శ్రౌతగృహ్యాధర్మసూత్రములు మున్నగు వైదికక్రియావిధానములను సంపూర్ణముగ నభ్యసించెను. మొదటినుండియు సహజముగు గవితచెప్పు నేర్పు కలవాఁడు గావునఁ బదునెనిమిదవ యేఁటనే 'కల్యాంధకౌముది' యను పేరు పెట్టి కావ్యము వ్రాయ మొదలిడెను. ఇందలి యితివృత్తము వీరేశ్వర లీలావర్ణనము. అది మూఁడుప్రసారములుగ రచింప నారభించి యొక ప్రసారముతో సమాప్తి చేసెను.

మ. ఇది శ్రీ సానగగోత్ర సంజనిత కోటీశార్య సంతాన సం
 పద, వీరేశ్వరయోగి పాదయుగ సేవాశీలి, నిర్వ్యాజకో
 విద విశ్వాసి నిరంజనుండు సమనాప్తింజేయు కల్యాంధకౌ
 ముది లోసం బ్రథమప్రసారము ప్రజామోదంబు నంధించుతన్.

'పౌరుషేయాన్వయ మహాపురుష రత్నమాల' అను గ్రంథము రచింతమని ప్రారంభించెను. ఆ గ్రంథ మవతారికా పద్యములవఱకు వచ్చి యాఁగిపోయినదఁట. తరువాత 'కుమారాభ్యుదయము' అను నాటకమొకటి శైవమత సమ్మతముగా రచించెను. అది ప్రచురింపఁబడినది. ధర్మపాలచరితము, భీష్మోదయము, సూర్యశతకము, మాఘమాహాత్మ్యము మున్నగు పెక్కు కృతులు రచించుట కుపక్రమించుటయు, నిందులో నొకకృతియుఁ దుదిముట్టక, నట్టనడుమనో, మొట్టమొదటనో యాఁగిపోవుటయు, దటస్థించినటులు 'శ్రీనిరంజన విజయము' అను జీవిత చరిత్రమువలనఁ దెలియుచున్నది. నిరంజనశాస్త్రివని ప్రచురింపఁ బడినవి కుమారాభ్యుదయనాటకము గాక, 'బ్రహ్మానంద లీలలు' అను మఱొకనాటకము. తక్కినవెల్ల నముద్రితములు, నసంపూర్ణములును. ఈరెండునాటకములలోని కవితతీరును, మిగిలిన యసంపూర్ణకావ్యములలోని రచనతీరును బరికింప నిరంజన శాస్త్రిగారు మంచి రచయితలని

తోఁచుచున్నది. తాను రచించు 'మాఘమాహాత్మ్యము' నిదుబ్రోలు వాస్తవ్యులు శ్రీ పాములపాటి సుబ్బరాయఁడుగారి కంకిత మీయఁదలఁచి 'సుబ్బరాయతారావళి' యను పద్యములు చెప్పెను. అవి యెంత సొగసుగ నడచినవో, రెం డుదాహరించెదను జూడుఁడు.

మ. అరి నిర్భేద్యము నీదుగుట్టు, సకలవ్యాపారసౌకర్య దు
స్తర పాండిత్యము నీదుకట్టు, నిఖిలాశామండలీ మండన
స్ఫుర కీర్తిప్రభ నీదురట్టు, ముదివేల్పుంజెట్టు నీపెట్టు, బల్
సిరి నీవాఁకిటి కాటపట్టు, బళిరా! శ్రీ సుబ్బరాయాగ్రణీ!

మ. కవితాకన్యక లెందఱో నిను సమాశ్లేషించి పెంపొంది రం
చు విచారించి బహుప్రియారమణుఁడవై శోభిల్లు నీమాడ్కి వై
భవ మబ్బున్ నిజచాకచక్యనిపుణీభావంబు జూపింప వ
చ్చె వరింపందగు మత్కవిత్వరమణిన్ శ్రీ సుబ్బరాయాగ్రణీ!

అసంపూర్ణమైన వీరి 'మాఘమాహాత్మ్యము' లోని పద్యములు మచ్చుచూపినచో నిరంజనశాస్త్రికి విశ్వబ్రాహ్మణ సంఘసభలో నొసఁగఁబడిన 'కవిశేఖర' బిరుద మన్వర్థమే యనిపించును.

[మాఘమహిమ వర్ణనము]

సీ. పొరాడునినువు లబ్రపు టెద్దుఁ బలుకులఁ
గిలకిల లాడు ముంగిళులు గలిగి
సిరులు దుటారింప విరిఁబోండ్లయాటలఁ
దలతలల్ తొలఁకు మోనలలు గలిగి
పాటలప్రామిన్కు పదటుల మిన్నంది
కనకనల్ గొను శుభధ్వనులు గలిగి
తనివాఱు మొనవి గట్టునఁ బ్రదేఁపునతిథుల
మొదనెడఁ దొడరుసందడులు గలిగి

వెలయుగీముల నిండారు వేడ్కలలర
రోహిణీదేవి శచియు నరుంధతియు వె
లందిలోకంబులందు వలంతులగుట
మాఘమునం గ్రుంకువెట్టిన మహిమగాదె;

[పెండ్లికాలపుం బేరటాండ్రవర్ణనము]

సీ. పసిమి జగ్గుల యొడల్ పసుపునీటం దోలంచి
గడిమడుంగులు రింగు లడరంగట్టి
జిలుంగుపట్టంచురైకలు గుత్తముగం దొడ్గి
వలంతికుంకుమబొట్టు లలరవెట్టి
విరిగుత్తిగుబ్బల విరిసరుల్ రవణించి
వలుచగందమ్ము చెక్కుల నలంది
క్రొమ్ముడిం గెందమ్మి కెమ్మలిమ్ముగం జెక్కి
వసపుం బారాణిని పదముల నిడి
మృదులవాక్కుల వినయమ్ము జదురపఱిచి
కులపురంధ్రులు నట్టింట నిలిచినపుడె
సదన మతిదీవ్యమానమై సందడించెం
బెండిలికిం బేరటాండ్రలోకో నిండుసొగను.

ఈ నిరంజనకవి తన గోత్రఋషియగు సానగ మహర్షిని బ్రతి గ్రంథాదిని ప్రార్థించెను. ఇతండు విశ్వబ్రాహ్మణసంఘము నుద్ధరించుటకు 'ప్రబోధిని' యనుపత్రిక 1907 నుండి నడపనారంభించెను. మహాసభలం జేయించెను. ఏతత్పత్రికాద్వారమునను, సభాసమావేశమూలమునను విశ్వబ్రాహ్మణ సమాజమునకు నిరంజనకవి గావించినసేవ గొప్పదని చెప్ప విందుము. ఇతండు దుగ్గిరాల స్థానిక సంఘోన్నత పాఠశాలలోం బ్రధానాంధ్రోపాధ్యాయుండుగా నించుమించు పదునైదుసంవత్సరములు పనిచేసెను.

నిరంజనకవి ఆంధ్ర కర్నాట మహారాష్ట్రాది దేశములు పర్యటించి శిల్పగ్రంథము లెన్నో సంగ్రహించెను. ఇతఁడు విశ్వబ్రాహ్మణ సంఘమునకు, సారస్వతమునకు శ్రద్ధమెయి సేవచేసికొని తరించెను. కవిత్వము జాను తెనుఁగులో బహువృద్యము మధురముగఁ జెప్పి మహాకవులను మెప్పించెను. మొత్తముమీఁద నిరంజనకవి వ్యుత్పత్తిని దాఁటిన ప్రతిభ కలవాఁడని చెప్పనొప్పును. అచ్చుపడిన యతని 'బ్రహ్మానంద లీలలు' నాటకమునుండి మూఁడు పద్యములిచ్చెదను.

మ. తను మాయామహిమన్ జనించునవి, కాంతాగాంతరావాసు లు
 త్తమగార్హస్థ్యజనుల్ భజించునవి, యద్వైతామృతంబున్ సమ
 స్తమతాధ్వంబులఁ గ్రుమ్మరించునవి, సిద్ధశ్రీ మనోమంగళా
 ర్థ్యములై నట్టివి దన్పుఁగాత! మిము బ్రహ్మానంద లీలావిధుల్.

ఉ. పాటిదొలంగి వాసనలు పైఁబడ సంసృతిఁగ్రుంకు నీ ప్రజా
 కోటి కనంతమోద మొసఁగూర్పఁగ మోక్షకవాట పాటవో
 ద్ఘాటన దివ్యరంగముఁ బ్రదర్శనముం బొనరించు నాజగ
 న్నాటక కర్త యీకథకు నాయకుఁ డౌట యెఱుంగవే సఖ!

గీ. ప్రకృతి చెలువ వెంటఁ బ్రాకులాడక యున్న
 జగము బ్రహ్మమెట్లు జరుపనేర్చు?
 దానగాదె లోకతత్త్వర క్రీడమై
 బాలుఁడౌట మునులపజ్జఁగనుట.

ఉమర్ అలీషా కవి

1885 - 1945

ఇస్లాంమతస్థులు. తండ్రి: మొహియుద్దీన్. నివాసము: పిఠాపురము. పుట్టుక: 1885 సం. నిర్యాణము: 23 జనవరి 1945 సం॥ గ్రంథములు: పద్మావతి, మణిమాల, స్వర్గమాత, విషాదసౌందర్యము, మదాలస. బ్రహ్మవిద్యావిలాసము, శాంత, చంద్రగుప్త, విచిత్ర బిల్హణీయము, దానవవధ. సూఫీ వేదాంతదర్శము, ఇలాజిల్ గుల్భా, ముసద్దాస్ అలి, ఉరుపత్తూరు చక్రవర్తి, శ్రీమ ద్వాల్మీకిరామాయణము. మున్నగునవి.

అలీషాకవి మాతృభాష ఉరుదు. మతము ఇస్లాము. ఇట్టివాఁడు తెలుఁగు బాసలో దిట్టమైన సాహిత్యము కలిగించుకొని కవిత్వము కట్టి పేరు సంపాదించుట మెచ్చుకోఁదగిన సంగతి. ఈయన తెనుఁగులో నొకటి రెండు పుస్తకములు కాదు, ఏబది గ్రంథములవఱకు సంతరించి రసఁగా నతిశయోక్తము కాదు. కవితాధోరణి యా సులభరమణీయమైనది. భావనావేశము సరేసరి. గ్రంథరచనా విషయ మటులుంచి, యీయన తెనుఁగులో నుపన్యసించుట విన్నవారున్నచో నదుగవచ్చును అచ్ఛమైన మధువాహిని యొడిగిలునటులుండెడిది. భాషలో నిర్దుష్టత - పలుకుబడిలోఁ గ్రొత్తబెడఁగు, ధారాళత వీరియుపన్యాసములకు మెఱుఁగులు తెచ్చినవి. మాటనేరుపు, వ్రాఁతతీరువు సరితూఁకముగా నలవడిన యీ కవి ధన్యుఁడు. తెలుఁగుబాస కడుపునఁ బుట్టిపెరిగినవారికే దిక్కు లేదు. ఈయన యంతసొగసుగాఁ గవిత కట్టెను! అలీషాకవి తండ్రి అరబ్బీ పారశీక సంస్కృతములు చదువుకొనెను. ఒక ఆధ్యాత్మిక విద్యాపీఠమునకు వీరి కుటుంబము వారిది యాచార్యత్వము. తండ్రి సాహచర్యమునను, మఱికొందఱు గురువుల సేవ వలనను మన ప్రకృత కవి అరబ్బీ పారశీకములు, సంస్కృతాంధ్రములు, ఆంగ్లము తగిన తీరునఁ జదువుకొనెను. ఈ చదువునకు సహజమైన కవితాధోరణి తోడు. పదునాఱవ

యేఁటనే కవిత్వమునకు శ్రీకారము చుట్టుకొనెను. పదునెన్మిదవయేఁట 'మణిమాల' యనునాటకము వ్రాసెను. అదిమొదలు క్రమముగా బహు గ్రంథరచన. దేశమును భాషను సమ్యక్తిపత్తితో సేవించుకొనుచున్న వీరినిఁ జాలమంది పిలిచి యుద్యోగము నిత్తుమని యడిగిరి. అల్పములైన పనుల కిష్టపడక 1934 సం॥లో వీరు అఖిలభారత శాసనసభకు సభ్యులై యామరణ మాయుద్యోగమే నిర్వహించిరి. 1936 సం॥లో, International Academy of America ఉమర్‌అలీషాకవికి Doctor of Literature బిరుదమునిచ్చి మెచ్చినది. 'సూఫీ వేదాంత దర్శము' అనుపద్యకావ్యము మొదల నీకవి స్వీయగాథ కొన్నిపద్యములలో హృద్యముగా వర్ణించుకొనెను. అవి మన కవసర పడును.

క. ఆ మొహియుద్దీన్ బాద్షా
నామ మహాయోగి కగ్రనందనుఁడను నా
నా మహితాగమ హిత వి
ద్యామతి 'ఉమ్రాలిషా' మహాకవి నేనున్.

సీ. రచియించినాఁడ విభ్రాజితదివ్య ప్ర
బంధముల్ పది కావ్య బంధములుగ
వ్రాసినాఁడను కల్పనాసక్తమతి పది
నాటకంబులను గర్ణాట ఫక్కి
కూర్చినాఁడను గళా కోవిదుల్ కొనియాడ
నవలలు పది నవ నవల లనఁగ
తెలిఁగించినాఁడ నుద్దీపితాఖండ పా
రసి కావ్యములు పది రసికు లలర

గీ. రసము పెంపార నవధాన క్రమములందు
నాశువులయందు పాటలయందు కవిత
చెప్పినాఁడ నుపన్యాససీమ లెక్క
యవని "ఉమ్రాలిషా కవి" యనఁగ నేను.

ఉ. రాజులఁ జూచితిన్ సుకవిరాజుల నోర్చితిఁ బేరు ద్రోయు, రా
రాజుల యోలగంబున విరాజిత పండిత సత్కవీంద్ర వి
భ్రాజిత మాలవీబిరుద పట్టములందితి యూనివర్సిటిన్
దేజముమీఱ సభ్యుఁడయితిన్ మతబోధకుఁడైతిఁ గ్రమ్మఱన్.

ఉ. వ్యాసములున్ విమర్శనలు భావకవిత్వ రసైక చారు వి
న్యాసములుగ మతాంతర మహాపరివర్తన తత్త్వ రూపకో
పాసనముల్ పురాణములు వ్రాసితి భారతభూమి నే నువ
న్యాసము లిచ్చుచున్ దిరిగినాఁడను 'ఉగ్రమలిపా' కవీంద్రుఁడన్.

సీ. సాధించితిని యోగసాధనంబులు హిమా
గమ మెక్కి మతిని చక్కాడి యాడి
బోధించితిని జ్ఞాన సాధన క్రమములు
చెవినిల్లుగాఁ జేసి చెప్పిచెప్పి
సవరించితిని పెద్ద సారస్వతంబును
శబ్ద శాస్త్రంబులు చదివిచదివి
చూపించితిని రాజ్యలోపంబు లాంగ్లప్ర
భుత్వంబు ముంగిర మోపిమోపి

గీ. ఇప్పుడప్పుడె నలువదియేండ్లపైన
దాఁటిపోయెను వయసు నీనాఁటికైన
శాంతి గలుగదు నీకథాధ్వాంతమందు
జీవితము తెన్ను నుడిబోవు నావఁబోలు.

ఉ. ఏను హిమాలయంబుపయి నెక్కి తపస్విలఁ జూచి వారి వి
న్నాణములన్ గ్రహించి విజనంబగుచోట రచించినాఁడ నా
నా నవకావ్య మార్గములనంతముగా హృదయాంతరంగ వి
జ్ఞానము విశ్వరూపముగఁ గన్పడు నట్లు దృశంబు మార్చుచున్.

వఝ్ఝుల చిన సీతారామస్వామి శాస్త్రి

1878

ఆరామద్రావిడ శాఖీయుఁడు. తల్లి: వేంకటాంబిక. తండ్రి: ముఖలింగేశ్వరుఁడు. నివాసము విశాఖపట్టనము. జననము: 1878 జూను 25వ తేదీ, బహుధాన్య సంవత్సర జ్యేష్ఠ బహుళ చతుర్థి. గ్రంథములు: ౧. చింతామణీ విషయ పరిశోధనము. ౨. వైయాకరణ పారిజాతము 3. కర్ణచరిత్రము ౪. మార్గోపదేశిక ౫. స్త్రీవివాహవయోనియమనము. ౬. వీరసింహుఁడు [కావ్యము] ౭. బాలసరస్వతీయ. ఆథర్వణ కారికావళి, హరిశ్చంద్రనలోపాఖ్యానాది గ్రంథములకు భూమికలు.

సీతారామశాస్త్రిగారిలో మహావిమర్శకునకుండవలసిన లక్షణములు సంపూర్ణముగ నున్నవి. కావున వీరు లక్షణవాఙ్మయమున కఖండమగు సేవ గావింపఁగలుగుచున్నారు. తమ సిద్ధాంతములపై రాద్ధాంతములు పత్రికలలో వెలువడుచుండును. వానికి సాధారణముగాఁ బ్రతివిమర్శనములు ప్రకటించుటకు వీరిచ్ఛగింపరు. తానొకధోరణిలో వ్రాసికొనిపోవుచు, వచ్చిన 'టపా' కూడఁ బరికింపఁడని వీరినిగూర్చి చెప్పుకొందురు. అంత యేకతానత! వీరిమేధ నిరంతరము నాలోచనానిమగ్నము. ఐరోపామహాసంగ్రామము వారి కలజడి కలిగింపదు. ప్రత్యేకరాష్ట్రాందోళనము వారి చెవుల కెక్కదు. వారి పరిశోధనమే వారిది. తెలుఁగు వ్యాకరణముల యాస్తికతకు వీరు పెట్టినది భిక్ష. పాణినీయము, ముగ్ధబోధము మున్నగుసంస్కృతవ్యాకరణములు పరిశ్రమించి పఠించినవారగుటచే బాలవ్యాకరణ-చింతామణ్యాదులు బాగుగా విమర్శించి నిగ్గు వెల్లడింపఁ గలుగుచున్నారు. వీరు రచించిన "చింతామణీ విషయ పరిశోధనము" వలన వీరి విశ్వతోముఖాంధ్ర వ్యాకరణ సమీక్షాపాటవము సుస్పష్టమగుచున్నది. చింతామణికిఁ బూర్వము తెలుఁగు వ్యాకరణములు లేవని వీరాధారములు చూపిరి. "వైయాకరణ పారిజాతము"

తొలిసంపుటము ఆంధ్రవిశ్వవిద్యాలయము వెలువఱిచినది. ఇది సమగ్రముగా వ్రాయఁబడినచో శాస్త్రిగారి యభిప్రాయ వ్యక్తీకరణమునకు నిలువుటద్దము వంటిది కాఁగలదు. వీరి యభిప్రాయ సామ్రాజ్యమున నన్నయభట్టారకునకుఁ బ్రాజ్యగౌరవమున్నది. అతని శబ్దశాసన బిరుద పౌర్వాపర్య విషయమునఁ బ్రచురించిన వీరి సిద్ధాంతములు మెచ్చుకోలు వడయఁదగినవి.

బాలసరస్వతీయమునకు, అథర్వణకారికావళికి, హరిశ్చంద్రనలో పాఖ్యానమునకు వీరు వ్రాసిన పీఠికలు విపుల విషయములను జర్చించు చున్నయవి. వీరి యొకొ్కక పీఠిక యొకొ్కక గ్రంథము. సమాజ సార స్వతమునఁగూడఁ గొన్నాళ్లు వీరు పరిశ్రమము సలిపిరి. "స్త్రీవివాహ వయోనియమము" దీనికి సాక్షి. "రజస్వలానంతర వివాహమే ధర్మ శాస్త్రముచే నుత్తమకోటి నధిరోహించుచున్నది. ప్రకృతమున ఋతు మతీ వివాహ మంతరించిన మాత్రమున నది యాపత్కల్పమనుట యసం గతము. శారదాబిల్లు క్షేమకరము." ఇది సీతారామశాస్త్రిగారి యాశ యము. సహజముగా నీయనకు వైదిక కర్మనిష్ఠ తక్కువ. కర్మిష్ఠులనిన గౌరవము లేనివారు మాత్రము కారు. వ్యావహారికవాదము నిష్టపడరు. కాని, వ్యావహారికముపై కత్తినూఱువారి నొకపట్టుపట్టును. గిడుగు వారి 'ప్రాఁదెనుఁగుకమ్మ' పై ' అంపగమి ' వఱపిన పడింతుఁడీయనయే.

పెక్కేండ్లు విజయనగర సంస్కృతకళాశాలాంధ్ర పండిత పదవి నిర్వ హించిరి. అప్పుడే వీరిమూలమునఁ బెద్దశిష్యులు బయటఁబడిరి. స్వర్గీయులు దూసిరామమూర్తిశాస్త్రిగారు వీరి శిష్యులు. ఆయనరచించిన "బాల వ్యాకరణ సారస్యసర్వస్వపేటిక"లో "వజ్ఝుల వారిశిష్య్య" దన్న విషయము పుట పుటకుఁ దట్టుచుండును. విజయనగరసంస్కృత కళాశాలలోనే యుద్యోగించి విశ్రాంతి గయికొనుచున్న ఆకొండి వేంకటశాస్త్రిగారికి వీరు గురువులు. ఆంధ్రవిశ్వ విద్యాలయముచే నేఁ డాదరింపఁబడుచున్న

పండితులు శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు వఝ్ఝలవారి యను యాయులు. ఈ తీరున నెందఱో మన శాస్త్రులుగారి యాచార్యకముచే విద్వత్పదవులలో నున్నారు.

వీరు చెన్నపురి విశ్వవిద్యాలయాంధ్ర భాషాపరిశోధకసభ్యులు, ఆంధ్ర విశ్వకళా పరిషదాంధ్ర పరిశోధకపండితులు నై ప్రతిష్ఠ సంపాదించినారు. విశ్వకళాపరిషత్తు నుండి విశ్రాంతితీసికొని ప్రస్తుతము వ్యాకరణ సమగ్రతా రచనకుఁబూనుకొని యున్నారు.

ఈయన కాంగ్లభాషాప్రవేశము లేక పోయినను, పాశ్చాత్య విమర్శన విధానములు తెలియును. వసుచరిత్ర విమర్శనములో నిది తెల్లము కాఁగలదు. వీరివ్యాకరణ శాస్త్రపరిశోధనము నేఁటి భాషాతత్త్వశాస్త్రము ననుసరించియుండును. కవిత్వము కూడ బ్రాయఁగలనని 'వీరసింహుఁడు' కావ్యముగాఁ గట్టి చూపిరి. శ్రీశాస్త్రిగారి పితామహభ్రాతృసుతుఁడైన చింతామణిశాస్త్రి యుపదేశమహత్త్వము, మహామహోపాధ్యాయ తాతా సుబ్బారాయశాస్త్రిగారి యుపదేశ మహత్త్వము వీరిలోఁబడి ఫలవంతము లైనవి. తెలుఁగు వ్యాకరణముల కొఱకే యవతరించిన విచక్షణులు సీతారామస్వామి శాస్త్రిగారు!

కోటగిరి వేంకట కృష్ణారావు

1890

పద్మనాయక వంశీయుఁడు. గంపలగూడెము జమీందారు. కన్న తల్లి సుబ్బయ్యమ్మారావు. దత్తతగొన్న తల్లి: సుబ్బయ్యమ్మా రావు. కన్నతండ్రి: చిన్నయ్యారావు. దత్తతగొన్నతండ్రి : జగన్నాథరాయణింగారు. జన్మస్థానము : నూజవీడు. జననము: 1890 సం. ఖర సంవత్సర ఫాల్గున బహుళ ప్రథమ. గ్రంథములు : ౧. శృంగార తిలకము. [ఆంధ్రీకృతి 1916 ముద్రి] ౨. యౌవననిగ్రహణము 3. చాటుపద్యములు ౪. శ్రీకృష్ణరాయనాటకావళి [అభినవ పాండవీయము-పాదుషాపరాభవము _ బెబ్బులి-ప్రణయాదర్శము అను నాలుగు నాటకముల సంపుటము] ౫. మాతృదేశము ౬. విధి [పద్యకావ్యము] ౭. దేవదాసి [నాటకము] ౮. ఘోషావ్యాస ఖండనము [అముద్రితము].

జననం బందితిఁ గీర్తికెక్కిన సువంశంబందు; రవ్వంత స
జ్జన సాంగత్యము చేతనే తెలుఁగు బాసన్ జ్ఞాన మొక్కింత గ
ల్గెను; నన్నింకను స్వైరిణీరమణి పాల్సేయంగఁ బోకమ్మ, యౌ
వనమా! సాహస మింత కూడదు సుమా, బాగోగు లూహింపుమా.

ఈపద్యము 'యౌవననిగ్రహణ' మను చిన్నపుస్తకము లోనిది.

సీ. క్షైత యందునఁ బ్రొద్దు గడపెద నందునా
భావనాశక్తి నీపైకి మరలు
వ్యాయామ మొనరింపవలె నను కొందునా,
యడుగులు నీ యుప్పయందె చేరు
గ్రంథావలోకన కార్యంబుఁ దలఁతునా
చిత్తమ్ము నీయందు హత్తియుండు
హితదర్శనా యత్తహృదయుఁడ నైతినా
నీ రూపమె యెదుట నిలచియుంను

నవయవములే పరాధీన మయ్యెనాకు
నింక నాస్థితి నీవ యూహించుకొనుము
యీవు మాత్రము వేఱె యూహింపనేల
పడఁతి! నాయల్లె స్వానుభవంబు గాదె!

ఈపద్యము 'చాటుపద్యములు' అనుచిన్న పొత్తమునందలిది. పై యౌవననిగ్రహణము, ఈ చాటుపద్యములు అను రెండుకృతులే కాక 'శృంగారతిలకము' అను కృతితో మొత్తము మూఁడు శృంగారగ్రంథములు కోటగిరి వేంకట కృష్ణారావుగారు రచించిరి. ఈమూఁడును వీరి తొలికృతులు. ఇవి చదివినవారికి కృష్ణారావుగారు శ్రీనాథుని వంటి వాఁడని యనిపించును. చాటుపద్యములను బట్టి స్వభావమును లెక్కించుట కొందఱికి యభిప్రాయము. క్రీడాభిరామమును బట్టి శ్రీనాథుఁడు పచ్చిశృంగారి యని మనసు నిశ్చయించినట్లు విలువడను.

శృంగార - వీరములే కవి కుపాస్యములైన రసములు. మన కోటగిరి శృంగారరస మెంతసొగసుగాఁ గవితలో జాలువాఱించెనో, వీరరస మంతకు మిగులఁగా ప్రదర్శించెను. పాదుషాపరాభవము, బెబ్బులి యను వీరనాటకములు చూచినవారికి హాస్యము తేలిపోవును. ఈ కవి సామాన్యుఁడు కాఁడు. గంపలగూడెము జమీందారియు బహుమహాకవులను గౌరవించుచున్న కవి. నాటకాంతకవిత్వము వ్రాసిన మహాకవి. ఈయన కవిత కింత బిగువులగువులు వచ్చుటకుఁ బురాజన్మ సుకృతము హేతువు. ఏ మహావిద్వాంసుఁడు వాడలేని యటులు మంచి పొంకముగా బింకముగాఁ బదసంధానముగావించును. సమాస భూయస్త్వము వీరికవితకుఁ దఱచుగా నుండు గుణము. ఆ గుణము వీరరస భరితములైన వీరనాటకములు కొన్నింటికి గొప్ప రమణీయత నిచ్చినది. 'శ్రీకృష్ణరాయనాటకావళి' యనుపేర వీరు రచించి వకటించిన నాలుగు నాటకములు చాలగొప్పవి. వీనికి శ్రీ విశ్వనాథ

సత్యనారాయణగారు మహోదాత్తమైన పీఠిక వ్రాసినారు. దానియందు సర్వవిషయములు విమృష్టములు. 'బెబ్బులి' లోనున్న పద్యములు కొన్ని యేప్రబంధకవులు వ్రాయ నేరని తీరులలో వీరువ్రాసిరి.

సీ. ఆత్మగౌరవ రక్షణార్థమై యుసురు తృ
ణప్రాయ మెంచుఁ బెనంగవలయు
వెల్మ కులద్వేషి విజయరాముని సంహా
రింపఁ గంకణము ధరింపవలయుఁ
బాశ్చాత్యసేనకు భరతపుత్త్రుల బలో
ద్రేక మింతూరి బోధింపవలయుఁ
జచ్చియో సగతుల వచ్చియో దశదిగ్వి
శద యశశ్ఛట వెదచల్లవలయు

గీ. మరణ మున్న దొకప్పుడు మానవులకు
సద్యశం బొక్కటే చిరస్థాయి గాన
యుద్ధరంగాని కుఱుక సన్నద్ధ పడుఁడు
దళిత పరిపంథులార! ఓ వెలమలార!

శా. వాలున్ డాలును గేలఁ గీల్కొలిపి మహోగ్రాహవ ప్రాభవో
ద్వేలాభీల కరాళ విక్రమ కళావిస్తారులై భారతీ
యాలోక ప్రతిభావిశేషమున రాజ్యస్థాపనోత్సాహులై
లేలెండీ! యిఁక వెల్మవీరులు యశోలేశంబు నాసింపుఁడీ!

* * *

సీ. హైదరు జంగు పాదాశ్రయ మొనరించి
దురముఁ గల్పించిన ద్రోహబుద్ధి
ఉన్నంతలోఁ దృప్తి నొందక వెలమరా
జ్యం బేలఁ గోరు దురాశయంబు

ఖండాంతరుల మైత్రిఁ గావించి భారతీ
యుల కెగ్గు రోసిన తులువతనము
పద్మనాయకకుల ప్రాభవ ధ్వంసనో
పాయ పంకిలమయా పాపవృత్తి
గీ. రొక్కటై విధిబలము చేయూఁతనొసఁగ
తాంధ్రకులుఁడు నిమిత్తమాత్రంబుగాఁగ
నీదు వధ విధానంబును నిర్వహించు,
నాత్మ సంరక్షణోపాయ మరసికొనుము.

* * * *

మ. శరమానేనియు రామరాజ వరరక్తస్నిగ్ధ శాపాయ వి
స్ఫుర దాభీల తను ప్రకాశితుఁడనై చూపట్టునన్ దాఁకుఁ డో
పరివంధుల్! చవిగొంద్రు తాంధ్రకుల పాపారాయ బాహాభయం
కర శాత్త్రీయ రణ ప్రభాకలిత తీక్ష్ణక్రోధ విక్రాంతినిన్.

వేంకటాద్రి అప్పారావు

1893

నూజవీడు సంస్థానమునకు సంబంధించిన 'ఉయ్యూరు' జమీందారు. పెంచినతండ్రి : శ్రీరాజా రంగయ్యప్పారావు, వెలమకులీయులు. నివాసము : నూజవీడు. జననము 1893 ఏప్రిలు 29 వ తేదీ. గ్రంథములు: గోవర్ధనోద్ధారణము, దుర్యోధనాంతము, పృథ్వీరాయుని యంతము, స్నేహలత, శ్రీశోభనాచలమాహాత్మ్యము, జ్యోతిర్లీల, ఆంధ్రాష్టపదులు-ఇత్యాదులు.

ఉయ్యూరు సంస్థానాధిపతులు రంగయ్యప్పారావుగారి సంస్కృతాంధ్రభాషాభిరతి కొంత ప్రసిద్ధమైనది. 'పర్షియా'లో నాగరికత దిద్దేటిన విద్వాంసులంట ఆజ్ఞాయకుని ప్రసిద్ధినందిన "షాహనామా" యను చరిత్రగ్రంథము కొంతభాగము నాంధ్రీకరించి ప్రకటించుట యందులకుం దారకాణ. వీరి తరువాత వేంకటాద్రి అప్పారావుగారు సంస్థానమునకు వచ్చిరి. ఈయనకుం గవితాధార నిసర్గముగా బుట్టినది. ఆ కారణమున వట్టి 'మెట్రిక్యులేషన్' పరీక్షాపాత్యములకుం దృష్టిపడక సంస్కృతాంధ్రములు చదువుకొనవలసిన శ్రద్ధ కలిగినది. గురుముఖమునం గొంతవఱకుం బఠించి వలయు పాండిత్యమును గలిగించుకొనిరి. ఆపిమ్మట గోవర్ధనోద్ధారణము, శోభనాచల మాహాత్మ్యము, జ్యోతిర్లీల మొదలగు నాటక-కావ్యాదులు రచించెను. ఈయనకు నాట్యము, జ్యోతిషము, చిత్రకళ, సంగీతము మొదలగు విద్యలలో నుంచి ప్రవేశమున్నది. ఈకళలెల్ల వీరిని స్వయంవరించినవి. చిత్రకళలో వీరికిం గల సృజనశక్తి కంటె నభిమానము హెచ్చు. కవితావిషయమున వీరు గావించిన పరిపుష్టికంటె రచనాసృష్టి యున్నతస్థానమున నుండందగినది. వీరి సంగీతసాహిత్యాభిమానములకు 'ఆంధ్రాష్టపదులు' దృష్టాంతము. ఇటీవల నందమైన

యాకృతిలోఁ దీర్చిదిద్ది యాంధ్రీకరించిరి. వచస్సందర్భశుద్ధి నెఱిఁగిన జయదేవుని మధురగేయములను దెనుఁగుఁబాటలుగాను, శ్లోకములను బద్యములుగాను మార్చి 'ఆంధ్రజయదేవుఁ' డనిపించు కొన్నా రప్పారావుగారు. ఈరాజకవి రసోత్తేజకమైన రచనా రామణీయకమున కీపద్యము మచ్చు :—

జారెన్ బిల్లనగ్రోవి చేనడలి కన్సైగన్ వ్రజస్త్రీతతిన్
ఓరం దొల్గఁగ కన్బొమ్మల్ మెలచి యెంతో భీతి లేఁజెమ్మటల్
గారన్ నగ్గని సిగ్గు చిన్నవగవున్ గన్మోడ్పు తబ్బిబ్బులన్
దోరంబౌ హరిఁ జూడ లోఁగలఁగె సంతోషంబు రోషంబునున్.

తెనిఁగింపు పొందికగా నుండి యింపు పుట్టించుచున్నను నాత్మప్రత్యయము చాలక "ఆ జయదేవుసత్కవి సరసమృదుశైలియు భావరక్తియున్ నైజ మనోహర ప్రతిభ నా తెనిఁగింపునకెట్లు వచ్చు ?" నని వినయముగాఁ జెప్పుకొన్నారు.

ఈయన రాధాకృష్ణప్రేమోపాసకుఁడు. వీరి చిత్రకళా నికేతనము దీనికిఁ బతాక. రసికత నెఱిఁగిన కవి యాట శృంగారరసవిలసితములైన యితివృత్తములే వీరి రచనలకు సమధిక ప్రోత్సాహమిచ్చినవి. వంశము పౌరుషవంతమైనదగుట వీరగాథలు కూడ వీ రేఱుకొని కబ్బములుగాఁ గూరిచినారు. ఎఱ్ఱపంచె కట్టి, తెల్లని పొట్టి చేతులచొక్కా తొడిగి, చిన్న తువ్వాలు పయిని పడవైచికొనియుండు నీ భాగ్యవంతుని వేషము దేశమున కొరవడి. ఈయన జ్యోతిర్లీల నాటకము మొదట నిటులు చెప్పుకొనెను.

సీ. కన్నారు నన్ను వేంకటరంగయప్ప రా
యలు నారయామ్మ నిర్మల విభవులు

రాజ రంగయ్యప్పరాయ బహాదరు చెల్ల
యామ్మ ప్రేమను బెంచి రథిపదవికి
ధీరతా ధీయుతా సారంబు గూర్చిరి
గురువర్యు లెందఱో కోవిదులును
మత్స్యాభవార్ధనమ్మతులు నయ్యారాది
బహుజనపదవాటి రహితకోటి

గీ. వంశవర్ధనుల్ సుతులను వరతనయుల
నేలు గృహవర్తి వేణుగోపాలమూర్తి
వేంకటాద్ర్యప్పరాయఁడ, విశ్వసుజన
హిత విధేయుఁడ వైష్ణవమతపరుండ.

1927 సం॥ లో కాకినాడయందు జరిగిన ఆంధ్రసాహిత్య పరిషద్వార్షిక మహాసభకు వీ రధ్యక్షులుగా నుండి చెప్పిన యుపన్యాసము తెనుఁగు బానకుఁగై సేఁత.

గురుజాడ వేంకట అప్పారావు

1865-1915

నియోగిశాఖీయులు. నివాసము: విజయనగరము. రచనలు:- ౧. కన్యాశుల్కము ౨. కొండుభట్టీయము 3. బిల్హణీయము ౪. ముత్యాలసరములు - చిన్నకథ ౫. నీలగిరిపాటలు ౬. సుభద్రాపరిణయము [అముద్రిత ప్రబంధము] మున్నగునవి.

(అప్పారావుగారిని 'గురుజాడవాల్మీకి' యనికూడ వ్యవహరింతురు. వాస్తవమున కాయన నవీనాంధ్ర వాఙ్మయమునకు వాల్మీకివలె నాదికావ్యము రచించి పోయినాఁడు. ఆ యాదికావ్యము కన్యాశుల్కము. అది దృశ్యకావ్యమే యైనను 'శ్రీమద్రామాయణము' వలె నేఁడు పారాయణగ్రంథమై యున్నది. 'ముత్యాలసరములు' తీసికొని వచ్చిన వారప్పారావుగారు. ఆదికవి నోటినుండి "మానిషాదప్రతిష్ఠాం త్వ" మ్మనుఛందస్సప్రయత్నముగా వెలువడినటులు గురుజాడ కవినుండి యపూర్వవృత్తములు వెలువడి లోకమును గదలించినవి. ఆ యీ కారణములు చూచుకొని యప్పారావుగారిని 'వాల్మీకి' యని యందురు.)

౧౯౧౪ సంలో ప్రభుత్వము సంస్కృత భాష యొక్కయుఁ దత్సంబంధులైన యితరభాషల యొక్కయుఁ బరిశోధనమునకొరక పండితపదవి నియమించినది. అందుకై మన దేశమునుండి దరఖాస్తులు వెళ్ళినవి. దరఖాస్తు పెట్టినవారిలో నెవ్వరు సమర్థులు వారికిఁ గనఁబడలేదఁట. వయోనియమమును బట్టి గిడుగు రామమూర్తి పంతులుగా రా స్థానమునకుఁ బోవ పిలువఁబడలేదు. మఱి, తెలుఁగువారి కెరికిని తత్పదవి దొరకలేదు. ఏయఱవయో, ఏకన్నడియో యా స్థానము నలంకరించి యాంధ్రభాషాతత్త్వమును బరిశోధించుటకు సిద్ధపడును. సిద్ధపడుటయేకాదు, తెలుఁగు భాష దేశభాషలలో నక్కఱ

మాలినదిగా నతఁడు సిద్ధాంతము చేయును. ఈవిషయమున అప్పారావు పంతులుగా రెంతో సంతాపపడి తెలుఁగుచదునరి కొఱకు బహుయత్నములు చేసిరి. కడకు, బధిర శంఖారావము !

శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారికి వ్యావహారిక వాదమునఁ గుడిబుజముగాఁ బనిచేసిన వ్యక్తి అప్పారావుగారు. రామమూర్తిగారు లక్షణము—అప్పారావుగారు లక్ష్యము. వీరి కన్యాశుల్కము, ముత్యాల సరములు రామమూర్తి పంతులుగారికి నాఁడు వాదాధారములైనవి. గురుజాడ కవి పిండలి కట్టిన రసజీవనమే కన్యాశుల్కము. వీరివలన 'గిరీశము' శాశ్వతుఁడాయెను. గిరీశము మాటలు తెలుఁగు నాఁట జాతీయములుగాఁ బాదుకొనెను. అప్పారావుగారికి వేఱే పేరు లేదు, 'గిరీశమే' ఆయనపేరు. సమాజజీవనమున కింత దగ్గఱగానుండి, గుండెలకుఁ బట్టుకొను వీరిరచన వేఱొకరికి లభించుట సంభవము కాదు. కన్యాశుల్కమునకుఁ బూర్వము సాధారణముగా 'కంపెనీకవులు' నాటకములు రచించుచుండువారు. ప్రాచ్య పాశ్చాత్య సంప్రదాయముల నెఱిఁగిన అప్పారావుగారివంటి వారు నాటకరచనకుఁ బూనుకొనుట సంఘమునకు మంచి మేలిచ్చినది. కేవలము సంఘసేవయే యారచనలోఁ గలయుద్దేశము. ఇదిక్రమముగా సారస్వత పరిణామమునకుఁగూడ దారితీయించినది. గిరీశము పలుకుబళ్ళు పెక్కులు తెలుఁగువారిలో సామాన్యములుగా నుండుటకు అప్పారావుగారి కలములోఁగల నైసర్గిక ప్రతిభ హేతువు. ఇదికాక కొండు భట్టీయము, బిల్హణీయము ననురచనలు వీరివి మఱిరెండున్నవఁట. విజయనగరము మహారాజ్ఞిని నవ్వించుటకు 'కొండుభట్టీయము' రచించుచుండెడివారని చెప్పుదురు. ఏలికయగు నాగాణి యీహాస్యములో నాయాఘట్టములు విన్నపుడు మహానందము పొందుచుండెడిదఁట. 'బిల్హణీయము' కొంత భాగము ప్రచురితమైనది. శృంగార ప్రధానమైన యితివృత్తము తీసి

కొని వ్యావహారికములో గొప్పతీరుగా వీ రీనాటకము వ్రాయుటకు దొరకొన్నారు. కాని పూర్తి కాలేదు.

విజయనగర రాజ్యమునకు సంబంధించిన కీర్తులు, నాఁటి విశేషములు నెన్నో కథలుగా, కావ్యములుగా వీరువ్రాయుటకు సంకల్పించికొని రని తెలియుచున్నది. పంతులుగారికి తెలుగునాటకరంగమును నూతన విధానములతోఁ దీర్చి దిద్దవలయునని గాఢాభిలాషయున్నటులు స్పష్టపడిన సంగతి. విజయనగరము మహారాజా ఆనందగజపతి నిరంతర సాహిత్య వ్యాసంగి. ఆయనకు అప్పారావుగారు హృదయము. ఆనందగజపతి యానందమునకు నాటకములు వ్రాయవలెనని అప్పారావుగారి తలఁపు. ఈతలఁపుతో నీయన నాటకరచన కుపక్రమించెను, క్రమముగాఁ బుణ్యవశమున నది యాంధ్రమునకు ఆనందకారణమైనది. గ్రీకు, రోమన్, ఇంగ్లీషు నాటకములు నిశితదృష్టితోఁ బరిశీలించుచు, నెప్పుడును నవ్యతకుఁ ద్రోవలు చూచు నలవాటు అప్పారావుగారిలో నున్నటులు విన్నాను. ఆయనవ్రాసికొన్న "డైరీలు" చాలభాగము శ్రీ బుఱ్ఱా శేషగిరిరావుగారు ప్రకటించిరి. అది గొప్ప మేలుసేఁత. ఈ దినచర్యలలో నెన్నో క్రొత్తవిషయములు గోచరించును. 1895 స॥ ఏప్రిల్ 29 తేదీని వీరి 'డైరీ' యిటులున్నది. "నాటకములలో నాయికలు తక్కువ—వసంతసేన భోగముపిల్ల - భూమికి ఆకర్షణీయమే. కాళిదాసుని నాయికలు శృంగారమునకే ప్రసిద్ధి — నాటకములో దాంపత్య శృంగారమే — సంఘటనములు తక్కువ — నాయిక లేకుండా నాటకము — గ్రీకునాటకములలో గ్రీకుల సాంఘిక పరిస్థితులు — ఇంగ్లీషులో ఆంగ్లులవి — ఇండియను నాటకములలో హిందూపరిస్థితులు కనఁబడవు."

నటకులను గూర్చి, అభినయమును గూర్చి రంగస్థలమును గూర్చి వీరు వ్రాసికొన్న యక్షరములు శిలాక్షరములుగా నున్నవి. ఇవి అప్పారావుగారి 'డైరీ'ల యందలివని శేషగిరిరావుగారు చూపిరి.

"వచనం సరసంగా, సహజంగా, యాసలేకుండా పాత్రోచితంగా చెప్పడము వీళ్లెవళ్లకీ తెలియదు. గబగబా స్కూలు పిల్లలు పరీక్షాధికారి యెదుట యేకరువు పెట్టిన ట్లంటారు. పందెంపెట్టి యెవరు ముందు ముగించుతారా అన్నట్లు చెబుతారు. పలుకులు సక్రమంగాఉండవు. యాసగా ఉంటవి. . మదరాసీలకు దీర్ఘోపన్యాసాలూ, పాటలూ తప్ప మరియేమీ మది కెక్కవు. కేవలం వచనానికి మంటే ఏ దా స్మరంతికే పోరేమో!" "నాటకపుజట్టులోనికి పడుపు కన్యలను చేర్చుట చాలా ప్రమాదకరమని నా భావం. అందకత్తెయై తెలివైన నటి పడుపుకన్యయైతే సంఘమునకు చాలా ముప్పు తేగలదు. ఆమెకు ఎన్నికైన సౌందర్యం లావణ్యం నాగరికతా వుంటే కలుగగల అల్లర్లకు మేర వుండదు."

"బాలామణి జట్టులో దుష్యంతుడుగా బాలామణిచెల్లెలు వచ్చింది. రూపము వికారంగా ఉంది. నడక రంగేలాతనంగా ఉంది. కంఠం విప్పితే ఆడది అని తెలిసిపోతూ వుంది. బాలామణి తప్ప ఆ జట్టులో చెప్పతగ్గ మరివొక మనిషి కనబడలేదు. కల్యాణరామయ్య జట్టులో దుష్యంతుణ్ణికూడా చూస్తిని. ఆతని వేషం మరీ పాడుగా వుండెను. అట్టి మనిషి కావేషం ఎందుకు వేసిరా అనిపించినది. అతడే వాళ్లలో 'హీరో' కాబోలు. నల్లగా లేదు కాని అందమైనవాడు కాడు. వేషం మీద రూపం అందంగా కనబడేటట్టు చేసుకోవడం కూడా ఎరిగినట్టు తోచదు. సాక్సు, నల్ల ట్రౌజరు, కోటూ వేసుకుని మిలటరీ ఆఫీసరులాగ దిగబడ్డాడు. తలమీద టోపీ కూడాను. చిన్నపలుచని మీసకట్టూ, నుదుట తిరుచూర్ణ మూ—యూ వేపు సాతానిభిక్షువుని జ్ఞాపకమునకు తెచ్చినది. మూతి కొంచెం ముందుకుంటున్నది. మీదిపెదవి గుండ్రము; పెదవులలో ఇముడని పొడుగుపళ్లు—ఇట్టి ముఖములో లావణ్యము గాని చురుకుతనముగాని యేలాగు కనబడవు! ఈతనిలో ధీమాగాని,

చలాకీగాని, పౌరుషంగాని వెతికితే కానరావు. వేషంలో మోటుతనము గాని యుక్తతయేమీ లేదు. ”

ఇది యిటుండఁగా, 1895 సం॥లో అప్పారావుగారు చమత్కారమునకు వ్రాసికొన్న కొన్ని 'డైరీ' లోనివిషయములు శ్రీ శేషగిరిరావుగారు వెలువరించినవే నాయుపయోగార్థము చూపించెదను. నిజమునకు, వారిచరిత్రమునుగూర్చి తెలిసీ తెలియని సంగతులు పేర్కొనుట కన్న, వారివ్రాతలే యిచట నుదాహరించుట వినోదముగానుండును.

“ 19.4.'95' పదిహేనోతేదీని ఒకసంగతి జరిగినది. తలుచుకుంటే నవ్వు వస్తున్నది. పచ్చయ్యప్పకాలేజీలో మీటింగుకు వెళ్ళి యింకా కొంత వ్యవధి ఉంటే “ యీవినింగు బజారులో తచ్చాడుతూ ఉంటిని. ఒకపుస్తకాల స్టాలువద్ద వుండగా ఒక బికారివాడివంటివాడు వచ్చి ఆ అంగడివాని కొక కళ్ళజోడు అమ్మజూపినాడు. అతడు రు. 1-6-0 యిస్తానంటే వాడు రు. 3/- యిమ్మన్నాడు. నేను రు. 1-8-0 ఇస్తానంటిని. వాడు కొంచెం గొణుగుకొని యిచ్చివేసినాడు. అది వెంటనే కళ్ళకు పెట్టుకొని చూస్తిని: సరిపడలేదు. ఎట్లు సరిపడును? నా కప్పటికి చత్వారమూలేదు. హ్రస్వదృష్టీ లేదు. బూట్సు, స్పెక్టకిల్సుతో యేదో లేనిఘనత వచ్చినట్లు మహాదర్జాగా అవి కళ్ళకు వుంచుకొని కాలేజీలోకి వెళ్ళిపోయినాను. కాని ఆ కళ్ళజోడులో దూరపుచూపున కొక ముక్క, చదవడమునకొక ముక్క అతికివుండడముచేత దృష్టి చెదిరి మెట్ల మీదనే ద్వారములోనే జారి చాలా హాస్యాస్పదముగా చతికిల బడిపోయినాను!”

“ముఖమునకు కనుబొమలు కొంత అందం యిస్తవి. పొటకరించుకొని బొద్దుగా ఉండేవి బాగుండవు. చర్మమునకు అంటుకొని పోయినట్లుంటే క్రూరత్వమును సూచిస్తవి. అతి సున్నితముగా పెన్సిల్ గీతవలె వుంటే చులకన మనిషి అని సూచన. క్రమముగా విల్లువలె వంగి

సాధారణవు దళసరి కలిగి కండ్లకు అతిదూరముగాగాని, అతిదగ్గరగాగాని కాకుండావుంటే అదీ ముఖమున కందమిస్తుంది. ఏక వరుసగా లయినుగా కాకుండా యెగుడుదిగుడుగా వుంటే తెలివి తేటలను సూచించును."

"14 తేదీ మెయి : క్రిస్టియను కాలేజీలో కెల్లెటుగారిని చూస్తిని. ఒకగంట సేపు చాలసంగతులు మాట్లాడితిమి. * * * పోలికలూ భేదములూ నిరూపించుతూ గ్రీసు రోము రాజ్యముల చరిత్ర నన్ను వ్రాయమని వారు ప్రోత్సహించిరి. అది నాశక్తికి మించినపని అంటిని— 'కాదు — మీరు వ్రాయగలవారు ' అనిరి."

అప్పారావుపంతులుగారీ తీరుగా నెన్నో సూక్ష్మాతిసూక్ష్మ విషయములు హృదయమునకుఁబట్టించుకొని, మానసికతత్త్వములు గుర్తించుకొని 'డైరీ' లలో దాఁచుకొన్నారు. విజయనగరము కళాశాలలోఁ జెక్కునాళ్ళు ఉపన్యాసకులుగా నుద్యోగించి, విజయనగరప్రభువు ఆనంద గజపతి మహారాజునకు కాంతరిక మిత్రుఁడై యాయన రాజయోగముతో మెలఁగెను.

1895 సం॥ ప్రాంతములో పంతులుగారు మహారాజు సొంతపనులను నిర్వహించుటకును, ఔషధసేవ చేయుటకు మదరాసులో మకాము చేయవలసి వచ్చినది ఆసమయమున వీరు క్రిస్టియను కాలేజి, ప్రెసిడెన్సీకాలేజి, పచ్చయప్పకాలేజి, బెంగుళూరుకాలేజి-యివన్నియుఁ జూచి యక్కడి ప్రొఫెసరులతో పాఠప్రవచనములను గూర్చి, విద్యావిధానములను గూర్చి చర్చలు సలిపి వచ్చిరట. వీరి సేవ విజయనగర కళాశాలా యశస్సునకు దివ్యసౌరభము.

ఎంతచులకనైన విషయమైనను లోఁతుగుండెతో విమర్శింపఁగల అప్పారావు పంతులుగారు 'కన్యాశుల్కము ' నట్లు వ్రాసెననఁగా నబ్బురము కాదు. మానవసంఘములోని క్రుళ్లు కడిగి దేశమున కొక పవిత్ర సందేశము నందీయవలెనని యాయన యూహించెను. 'గిరీశము'

వలన సంఘసంస్కరణోద్యమము వేళాకోళము లోనికి దిగి దేశమున కుపకృతికిమారుగ అపకృతియే ఘటిల్లె" ననియు, "కన్యాశుల్క మసలు నాటకమే కా" దనియుఁ గొన్ని విమర్శనములు లోకములో నున్నవి. ప్రకృతమున కవి యక్కఱలేని సంగతులు. మన మొకటి యనుకొన వచ్చును. 'కన్యాశుల్కము' సాంఘికముగాఁ బెద్ద విప్లవమేమియుఁ గలిగింపఁ జాలేదుగాని, భాషావిషయకముగా గిడుగువారి వాదమునకు మూాదల మైనది. 'కన్యాశుల్కము' సంఘములోఁగూడ మంచి సంస్కృతి నిచ్చినదని యన్నచో నేను కాదనను. ఆ రచన, ఆ పాత్రపోషణము, ఆ జాతీయములు, ఆ సంవిధానము 'కన్యాశుల్కము' ను తెలుఁగు వారి జీవితములలో నభిన్నమును జేసివైచినవి. గిరీశము-రామప్పంతులు-కరకటశాస్త్రి-మధురవాణి వీరందఱు అప్పారావుగారి ధర్మమా యని చరిత్ర పురుషులు పురాణపురుషులుగా నయిపోయిరి. ఆయన కలములో నొక్క పాటవ మున్నది. కన్యాశుల్కము తరువాత వేదమువారి ప్రతాపరుద్రీయము కొంత ఖ్యాతిగడించుకొన్నది. ఎవరెన్ని వ్రాయనిండు! అప్పారావుగారిదే యావిషయమున నగ్రస్థానము.

కాఁగా, నవ్యకవిత్వమునకు 'నాంది' పాఠము చేసినకవి అప్పారావుగారే యని నూతన కవుల వ్యవహారము. "వైతాళికులను" మేలుకొలిపినవాఁ డనియు, మార్గదర్శి యనియు, చక్కని వాడుకభాషను ప్రవేశపెట్టి ముత్యాలసరాలు కూర్చి భాషకు శాశ్వతోపకారము చేసిన వాఁడనియు నేఁటివారికి గురుజాడకవిమీాఁద మంచి ప్రత్యయ మున్నది. "కొత్త పాటలమేలు కలయిక కొమ్మెఱుంగులు చిమ్మగా" వీరి కవిత యువకహృదయములఁ గదలంచినది. క్రొత్తతీరు వృత్తములైన ముత్యాల సరములతోఁ దెలుగునాఁట నొక సంచలనము రేఁగినది. అప్పారాయకవి నాశ్రయముగాఁ జేసికొని బసవరాజు, అధికార్లవారు మున్నగా గేయములు పాడఁజొచ్చినారు. కథారూపముగా విషయము ప్రబోధించి దేశభక్తిని పుట్టించుటకు వీరి ముత్యాలసరములు తగినటు లుండును.

(దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్! గట్టిమేల్ తలపెట్టవోయ్!)

*

పాడిపంటలు పొంగిపొర్లే, దారిలో నువు పాటు పడవోయ్
తిండి కలిగితె కండ కలదోయ్, కండ గలవాడేను మనిషోయ్!

*

యీసురోమని మనుషులుంటే, దేశమేగతి బాగుపడునోయ్?
జల్దుకొని కళలెల్ల నేర్చుకు, దేశిసరుకులు నించవోయ్!

*

దేశాభిమానం నాకు కద్దని వొట్టిగొప్పలు చెప్పుకోకోయ్,
పూని యేదైనాను వొకమేల్ కూర్చి జనులకు చూపవోయ్!

*

ఆకులందున అణగి మణగీ కవితకోవిల పలకవలెనోయ్,
పలుకులను విని దేశమం దభిమానములు మొలకెత్తవలెనోయ్!

ఈగీతములలో రసికమానసముల లోఁతులు కదలించు శక్తి యంతగా లేకున్నను, దేశీయులను మేలు కొలుపఁగలశక్తి యేదో యున్నది. మరల, నీదిగువ గేయము పాడుకొనుఁడు కొంత యెదలోఁతులకుఁ జొచ్చుకొను గుణ మీ పాటలో నున్నది.

ప్రేమ పెన్నిధి, గాని యింటను
నేర్ప రీకళ, ఒజ్జ లెవ్వరు
లేరు, శాస్త్రము లిందు గూరిచి
తాల్చె మౌనము, నేను నేర్చితి
భాగ్యవశమున కవులకృపగని ;
హృదయమెల్లను నించినాఁడను

ప్రేమ యను రతనాల, కొమ్మా!
తొడవులుగ నవి మేన తాల్చుట
యెటుల నంటివొ, తాల్చి తదె, నా
కంట చూడుము! నతులసా రను
కమల వనముకు పతులప్రేమయె
వేవెలుగు!

[ప్రేమ కలుగక బ్రతుకు చీకటి!

కవిత్వము రసికాధికారులకే కాక సాధారణులకుఁగూడ నుపకరింప వలయునని తలఁపు అప్పారావు పంతులుగారిలో నుండి వ్యవహారభాషలో నెన్నోగీతములు వారిచే వ్రాయించినది. వీరి 'నీలగిరి పాటలు' ప్రసిద్ధి లోనికి వచ్చినవి. వీరిపాటలు నాటకములు సంఘసంస్కారమున కుప యుక్తమగునటులు వ్రాయఁబడినవి. చాటుమాటులు లేకుండ నూటిగా అప్పారావుగారు చెప్పఁదలఁచిన విషయమును చెప్పఁగలరు. ఆయన పాటలతోఁగంటె "కన్యాశుల్క నాటకము" తో నప్పుకీర్తి యైనటులు భావించెదము.

విజయనగర కళాశాలలో పన్యాసకులు గాను, ఎప్టేటు ఎపిగ్రాఫిస్టు గాను, శ్రీమదానందగజపతి ప్రాణప్రాణముగాను, తెలుఁగుదేశములో నాదర్శవ్యక్తిగాను, నాటకకర్తగాను విస్మరింపరాని మహోదయులు అప్పారావుగారు.

విశ్వనాథ సత్యనారాయణ

1893

వెలనాటి శాఖీయులు. తండ్రి: శోభనాద్రి. జన్మస్థానము: నందమూరు. నివాసము: బెజవాడ. జననము: 1893సం. గ్రంథములు:-నవలలు: ౧. వేయిపడగలు ౨. చెలియలికట్ట ౩. మాబాబు ౪. ఏకవీర ౫. జేబుదొంగలు ౬. హాహాహూహూ ౭. స్వర్గానికినిచ్చెనమెట్లు ౮. ధర్మచక్రము- ఇత్యాదులు. నాటకములు:- ౧. నర్తనశాల. ౨. సౌప్తిక ప్రళయము ౩. అనార్కలీ ౪. వేనరాజు. ౫. త్రిశూలము. ౬. కళింగ రాజ్యము-ఇత్యాదులు. పద్యకావ్యములు:- ౧. ఆంధ్ర ప్రశస్తి ౨. ఆంధ్రపౌరుషము ౩. గిరికుమారుని ప్రేమగీతాలు ౪. వరలక్ష్మీ త్రిశతి ౫. శృంగారవీధి. ౬. విశ్వేశ్వర శతకము ౭. శశిదూతము ౮. ఋతుసంహారము. ౯. శ్రీమద్రామాయణ కల్పవృక్షము మున్నగునవి. పాటలు:- ౧. కిన్నెరసాని పాటలు. కోకిలమ్మ పెండ్లి, ఖండకావ్యములు, కథలు, వ్యాసములు మున్నగునవి.

"శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారిని నవలారచయిత లెఱుఁగుదురు. నాటకకర్త లెఱుఁగుదురు. ప్రబంధకవు లెఱుఁగుదురు. పత్రికాసంపాదకు లెఱుఁగుదురు. ఉపన్యాసకు లెఱుఁగుదురు. విమర్శకు లెఱుఁగుదురు. సనాతను లెఱుఁగుదురు. సంస్కర్త లెఱుఁగుదురు.

సత్యనారాయణగారు నేఁటి యాంధ్ర సారస్వతమున విశిష్టస్థానము నాక్రమించిన రచయిత. వీరికి నవీన వాఙ్మయముపై నెంత యభిమానమో, ప్రాచీన సాహిత్యములో నంత యభినివేశము. వీరి కవిత్వములో నాముక్తమాల్యదా కాఠిన్య ముండును; పెద్దనగారి ముద్దు పలుకుల పొందికయు నుండును. ప్రాయికరచన గ్రాంథికము. వ్యావహారికము నిషిద్ధము కాదు. నవ్య కవుల ఖండకావ్యముల ధోరణి చక్కఁగా సాగింతురు. గేయములు హాయిగా వ్రాయుదురు. శతకములు వ్రాసిరి. నేఁడు రామాయణము మహాప్రబంధముగా రచించుచున్నారు.

ఆంధ్ర భాషోద్ధారకులలో "కాశీనాధునివా" రట్టివారో, ఆంధ్ర భాషా కవులలో విశ్వనాథవా రట్టివారు.) నాగేశ్వరరావుగా రాంధ్ర సాహిత్య పరిషత్తును గౌరవించిరి; నవ్యసాహిత్యపరిషత్తు బహూకరించిరి; కాంగ్రెసుతోఁ గేలు గలిపిరి; మఱియొక పక్షమును మర్యాదచేసిరి. మంచియే వారి కుపాదేయము. ('విశ్వనాథ' కవికిని సనాతనాధునాతన కవితల యందు సమభావమే. కాశీనాధునివారు శైవమతావలంబకులు. విశ్వనాథ వారి 'త్రిశూలము' దానికిఁ దారకాణము.)

కవి వివిధవిషయ నివిష్టబుద్ధి కావలయును. అట్టివారు నేఁటికవులలో లెక్కకుమాత్రమే కలరు. వారిలో సత్యనారాయణ గారొకరు. నేఁడు ప్రాచీనకవితలను 'హంబగ్' అనువారు కొందఱును, నవీన కవిత్వమును 'అబ్బే' యనువారు కొందఱును. వారికి రసాస్వాదకులలో గణన యుండదు. సారస్య మెచట నున్నదో యరసి దాని నాస్వాదించుట రసికధర్మము. పూర్వ- నవ్య విచారణముతో నతనికిఁ బనియుండరాదు.

పద్యము వ్రాయు కవి గద్యము వ్రాయలేకపోవచ్చును. గద్యము రచించుకవికిఁ బద్యము సాగకపోవచ్చును. గద్యపద్య రచయితయైనను నాటకము రచింపలేకపోవచ్చును. నాటకకర్త విమర్శనశక్తి కలవాఁడు కాకపోవచ్చును. సర్వతోముఖసమర్థత గలవాఁడు దీక్షతో గ్రంథములు వ్రాసి లోకమున కందీయఁజాలక పోవచ్చును. ఇవన్నియుఁ బట్టినవాఁడు సమగ్ర కళాప్రపూర్ణుఁడైన జాబిల్లివంటివాఁడు. (సత్యనారాయణగారు నవలారచయితలలో నేఁడు మంచిపేరు సంపాదించుకొన్నారు. ఆయన 'వేయి పడగలు' మెచ్చుకొని ఆంధ్ర విశ్వవిద్యాలయము బహుమాన మిచ్చినది. విశ్వవిద్యాలయము మెప్పు మనకక్కఱలేదు. అది యొక 'నవల' మాత్రము కాదు. ఆంధ్రవిజ్ఞానసర్వస్వమునకు మాఱుపేరుగా వెలసిన గ్రంథము. దానిలో సత్యనారాయణగారి సారస్వత-సాంఘిక సిద్ధాంతము లన్నియుఁ గరడుగట్టి యున్నవి. గొప్ప యెత్తుగడతో, కడదాఁక

సూత్రవిచ్ఛిత్తి సేసికోకుండఁ జూచుకొనుచు నిట్టి మహోత్తరగ్రంథము సంధానించుట బహుకష్టమైన కృషి. ఈ కృషిలో వీరి ప్రాపంచిక విజ్ఞానము పంట పండినది. సత్యనారాయణగారి వచన రచనలో నొక క్రొత్తదనము, చిక్కఁదనము గోచరించును. తిక్కన పద్యరచనలో వలె వీరి రచనలోఁ గ్రియాపద బాహుళ్యము ఎక్కడికక్కడ భావము తెగి పోయి పాఠకునిలో మెల్ల మెల్లగాఁ జొచ్చుకొనును. ఈయన భావన యగాధమైనది. దానిని భాషలోఁ బెట్టునపుడు కొంత క్లిష్టతయనివార్యము. 'పాషాణపాకప్రభువు' అను ఖ్యాతి సత్యనారాయణగారికి వచ్చుటలో నర్థమున్నది. ఆయన శిరీషకుసుమపేశలముగా వ్రాసికొని పోవుచుఁ, బట్టరాని భావసంధానమునకు బడినపుడు ప్రహ్లాదమువంటి సమాసము లుపయోగించును. ఆ యుపయోగము ప్రయత్నించి తెచ్చుకొన్నది కాదు. ఆయన కది యనాయాసజము. పద్య—గద్య రచనలు రెండింటను వీరీయాచారముతో సాగుదురు. గమనింపవలసిన దేమనఁగా, పాఠకుని నిలఁబడనీయకుండ లాగుకొనిపోవు శక్తి వారి వచనములోఁ బ్రచురముగా జాలువారుచుండు ననుట. ఈ ధోరణిలో 'వేయి పడగలు' గాక మఱి తొమ్మిదిపది నవలలు వెలువడెను. 'చెలియలి కట్ట' సాంఘికము. 'ఏకవీర' పైకి రొమాన్సుల బసిబిడ్డయే కాని విశ్వనాథవారి 'నవలా' సంతానములో నది మేలికవంటి రచన. చరిత్రాత్మకములై యీకూర్పులో అప్రసిద్ధములై యుండియున్న దేశమర్యాదలు పెక్కు పేర్కొనఁబడినవి. ఆంధ్రుల పరిపాలనము, నాగప్రతిభ యిందు రమణీయ దృశ్యములుగాఁ గనఁబడును. కథాసంవిధానము, పాత్రపోషణము గొప్పవి. 'ఏకవీర' లో సందర్భోచితముగా వర్ణితమైన కూచిపూడి భాగవతుల భామకలాపము, గొల్లకలాపము సత్యనారాయణగారి ప్రాచీన కళాభిజ్ఞతకు గుఱుతులు. 'ఏకవీర' యే విశ్వనాథవారికి 'నవలా' కారులలో కురిచీ వేయించి కూర్చుండఁబెట్టినది. తరువాత 'వేయి పడగలు'

ప్రధానపీఠాలంకరణము. ఈ విషయమునఁ గొందఱు భేదాశయములుండవచ్చును! 'చెలియలి కట్ట' లో రత్నావళిని సాహిత్యవేదినిగాను కవయిత్రిగాను వీరు చిత్రించిరి. శాస్త్రి రత్నావళికి జరుపు చెప్పినని చెప్పుచు ఆంగ్లకవులు, ఆంధ్రకవులు, వివిధకావ్యములు మున్నగా నెన్ని సంగతులో జోడించిరి. ఏదో విధముగాఁ బ్రతికథనమునను సాహిత్య వాసన యనుబంధింపఁజేయుట వారి యలవాటు. వేయి పడగల లోని ధర్మారావు మహోత్తమాదర్శములుగల భాషావేత్తగాఁ జిత్రితుఁడు. అతఁడు ఆముక్తమాల్యద — పాండురంగమాహాత్మ్యము, భాగవతము మున్నగు తెలుఁగు గ్రంథములమీఁద లోతయిన చర్చలు చేయును. విగ్రహారాధనము, స్త్రీ స్వాతంత్ర్యము మొదలయిన సమస్యలెన్నో యిందు విమృష్టములు. ఆయా సిద్ధాంతములు ప్రదర్శించునపుడు సత్యనారాయణగారి కలము మంచి మోఁకునఁబోలెఁ బాలపముగా సాగును.)

విశ్వనాథవారి నాటకములలో 'నర్తనశాల' కు మంచి పేరు వచ్చినది. ఉత్తరా పాత్ర ప్రవేశ మీ నాటకమున కొక మెఱుగు తెచ్చినది. క్షేమేంద్రుని మెప్పింపఁగల యౌచిత్యశోభ సత్యనారాయణగారి రచన కందినది. అనార్కలీ, వేనరాజు, త్రిశూలము మధురనాటకములు. 'త్రిశూలము' ప్రారంభమున వీరిటులు చెప్పుకొనిరి

నన్ను నెఱుఁగరో! యీ తెల్గునాఁట మీఁగు
విశ్వనాథ కులాంభోధి విధుని బహు వి
చిత్ర చిత్ర ధ్వని బహు విచ్ఛిత్తి మనః
హాకృతి ప్రణేత సత్యనారాయణాఖ్యుని.

నాటక నవలా రచనలలో నందెవేసిన యీయన పద్యకావ్యరచనలోఁ గూడఁ బటుతరమైన పదవి నందుకొనఁగలుగుట విశేషము. సత్యనారాయణగారి ఆంధ్రప్రశస్తి, ఆంధ్రపౌరుషము తొలినాళ్ళలోఁ బారాయణ గ్రంథములుగా నుండెడివి. ఎందఱికో యందలి పద్యములు కంఠస్థ

ములు. జాతీయ కవితాశాఖనధిష్ఠించి కూసిన కలకంఠములలో విశ్వనాథకవి తొలివాఁడో, మలివాఁడో!

సీ. గోదావరీ పావనోదార వాఃపూర
మఖిలభారతము మాదన్ననాఁడు
తుంగభద్రాసముత్తుంగ రావముతోడ
కవులగానము శ్రుతి గలయునాఁడు
పెన్నానదీ సముత్పన్న కైరవదళ
శ్రేణిలోఁ దెన్గు వాసించునాఁడు
కృష్ణాతరంగ నిర్ణిద్రగానముతోడ
శిల్పమ్ము తొలి పూజ సేయునాఁడు
అక్షరజ్ఞాన మెఱుఁగదో యాంధ్రజాతి ?
విమల కృష్ణానదీ సైకతములయందు
కోకిలపుఁబాట పిచ్చుకగూండ్లు కట్టి
నేర్చుకొన్నది పూర్ణిమా నిశలయందు.

'వేఁగిక్షేత్రము' పురావైభవము తలఁచుకొని విశ్వనాథకవి గుండె జల్లుమన్నది. ఆర్ద్రమానసుఁడైన కవి కార్చిన వేఁడి కన్నీళ్లు కరళ్లుకట్టి యిట్టులు పద్యము లయినవి.

సీ. ఏరాజు పంచెనో యిచట శౌర్యపుఁ బాయ
సమ్ములు నాగుల చవితినాళ్ళ
ఏ యొట్టసంజలో నెలమి పల్లవరాజ.
రమణులు కాళ్ళఁ బారాణు లిడిరో
చిత్రరథ స్వామి శ్రీరథోత్సవములో
తెలుఁగుపిల్లలు కత్తిత్రిప్పిరెపుడొ,
యేరెండు జాముల యినుని వేఁడిమి వచ్చి
కలిసిపోయెనొ త్రిలింగ ప్రభువుల

నాజగచ్ఛ్రేయసనంబులై యలరు తో
వేంగిరాజుల పాదపవిత్రచిహ్న
గర్భితమ్మైన యీ భూమి ఖండమందు
సశ్రువులు జార్తు జీవచ్ఛవాంధ్ర జనులు.

*

ఇట వేఁగీశుల పాదచిహ్నములు లేవే! లేవుపో! భావనా
స్ఫుట మూర్తిత్వమునైనఁ బొందవు నెదో పూర్వాహ్ణదుష్కాలవుం
ఘటికల్ గర్భమునం దిపుడు చ్చుకొనియెం గాఁబోలు నీపల్లచో
టట లోకాద్భుతదివ్య దర్శన మఁటే యాభోగ మేలాటిదో!

*

సీ. ఈ నా పదార్పితక్షోణి నేరాజు ధ
ర్మాసనం బుండి సత్కృత్యర్థ మనెనో,
ఈ నా దృగావృతంబైన భూములలోన
నే శౌర్యధనులు శిక్షింపఁబడిరో,
ఈ నా శరీరమం దివతళించిన గాలి
యెంత పౌరాతన్య మేచుకొనెనో,
ఈ నా తనూపూర్ణమైన యాకాశమ్ము
నే క్రతుధ్వనులు శబ్దించినవియొ
అస్మ దజ్ఞాత పూర్వ దివ్యత్వ మొప్పు
నీ పునీతావనీఖండ; మిచట నిలిచి
యస్వతంత్రత దొరలు నా యాంధ్రశక్తి
నన్నుఁ గంపింపఁ జేయుచున్నది భృశమ్ము.

ఈ రకమైన కవితాశయ్య భావులకుఁగాని దొరకని భావపటుత్వము కలది. (అన్వయములోఁ గొంత కఠినత, పదప్రయోగములోఁ గొంత బిగువు నుండుటచే 'విష్ణుచిత్తీయ' పాకము వలె వీరిది సుఖము మరగిన సుకుమారులకు ఆపాతమధురముగా నుండఁజాలదు. సత్యనారాయణ

గారు సంస్కృతవాణి నెంత స్వాధీనముఁ జేసికొని వాడుదురో, జాన తెనుఁగు కూడ నంత ప్రీతితో వాడఁగలరు. "మాఁగనోము" నుండి రెండు పద్యములు:—

బియ్యపు గింజలన్ జిగురు పేడిన గందపు వచ్చి బొట్టుతో
తియ్యని చిన్ని నీ నొసలి తీరులు కుంకుమ తీర్చి ముంగిలన్
తొయ్యలి! నోము చాటికలతో వసపాడిన ముద్దరాలు నీ
పయ్యెద వ్రాల నీవు నతి పట్టిన దీవన లీయఁ జూచెదున్!

*

నీ తెలిపట్టు చీర మెయి నీడలు పారి ముసుంగు సంజ క్రొం
బూతల తెల్ల లే మొగిలుపోలిక వాలిక గాలిఁ దూలిపో
నేత బెడంగు కుచ్చెలలు నీ చిఱుకాళుల ముద్దు తోఁచెనో,
లేఁతపొరాడు పయ్యెద చలించిన పచ్చని తాళి తోఁచెనో!

ఈతీరుగా 'విశ్వనాథ' కవి కవితాహేతి రెండువైపుల వాఁడి కలది. శృంగారవీధి - శశిదూత్యము - ఋతుసంహారము ఇత్యాదులలోఁ కవితారీతిలో నీ రెండురకములైన రచనలు కనఁబడుచుండును. ఈయన వ్రాసిన యెన్నో కావ్యఘట్టములు భట్టి కావ్యమును జ్ఞప్తికిఁ దెచ్చు ప్రయోగములతో నిండియుండును. నేఁటి - నాఁటి సాధారణ కవులు అసాధారణ కవులుకూడ వీరివలె ప్రయోగ వైచిత్రీవ్యామోహము కలవారు తక్కువ దాక్షిణాత్యులవలెఁ బ్రియశబ్దితులు వీరు. రామాయణ కల్పవృక్షము చూచి చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారన్నారఁట చమత్కారమునకు: "ఈగ్రంథమునకు వైశ్వనాథ సాత్యనారాయణీయమని పేరు పెట్టుట బాగుగనుండు" నని — రామాయణ పీఠికలో వీరు వ్రాయుచున్నారుగదా,

నన్నయ్యయుఁ దిక్కన్నయు
నన్నావేశించిరి పరిణాహ మనస్సం

ఛన్నత వారలుపోయిన
తెన్నున మెఱుఁగులను దీర్చి దిద్దుచుఁ బోదున్.

నన్నయ తిక్కనల యొరవడి సత్యనారాయణగారి కవితకు శయ్యా సౌభాగ్యములోనా? భావనావైభవములోనా? యని మనసంశయము. అక్కడక్కడ నన్నయ్య తిక్కనల నడకతో నున్నకొన్ని పద్యము లున్నవికాక! మొత్తముమీఁద సత్యనారాయణగారి కవితాశయ్యకు రామకృష్ణుఁడు - కృష్ణరాయలు - శ్రీనాథుఁడు - నాచన సోమనాథుఁడు వీరే యాదర్శ కవులుగాఁ దోఁచెదరు. ఇఁక, భావనావైభవములో వీరి దొక ప్రత్యేకత.) "దీపితాలాతమువోలె నామది విలంబన మోర్వదు నిత్యవేగి నాచేతము శబ్దమేరుటకుఁ జిన్నము నిల్వదు భావ తీవ్రతన్" అని రామాయణ పీఠికలో. ఇంతభావతీవ్రతగల కవి శబ్దము లేరుకొని శైలియే పరమార్థ మనుకొన లేఁడు. అది యటుండె,

శ్రీ సత్యనారాయణగారి కవితాగురువులు చెళ్ళపిళ్ళవారు. వేంకట శాస్త్రిగారిని గూర్చిన యీకవి హృదయము మహోదారమైనది.

తనయెదయెల్ల మెత్తన కృతప్రతిపద్యము నంతకంటె మె
త్తన తనశిష్యులన్న నెడఁదం గలప్రేముడి చెప్పలేని మె
త్తన యయి శత్రు పర్వత శతారము సక్కవి చెళ్ళపిళ్ళ వేం
కన గురువంచుఁ జెప్పికొనఁగా నది గొప్ప తెలుంగునాఁడునన్.

*

అల నన్నయ్యకు లేదు తిక్కనకు లేదా భోగ మస్మాదృశుం
డలఘుస్వాదు రసావతార ధిషణా హంకార సంభార దో
హల బ్రాహ్మీమయ మూర్తి శిష్యుఁడయినాఁ డన్నట్టి దావ్యోమపే
శలచాంద్రీ మృదుకీర్తి చెళ్ళపిళవంశస్వామి కున్నట్లుగన్.

ఈరెండవపద్యములో సత్యనారాయణగారి కవితాహంకారము రూపము కట్టియున్నది. ఈ అహంకారము వాస్తవమైనదేకాని, యుండరానిది

కాదు. సత్యనారాయణగారి 'అహం' కారము కేవల కవితాపరము, లౌకికము నగు నర్థము కలదికాదు. ఆయన సత్యమైన 'అహం' పదార్థ జిజ్ఞాసకల వ్యక్తి.) రామాయణ కల్పవృక్షము బాలకాండాంతమున నిట్లు విశ్వేశ్వర ప్రార్థనము చేసినారు.

అమరీ కైశిక పారిజాత కుసుమోహాస్వాదు వీబాలకాం
డము నీభక్తుఁడు శోభనాద్రి దగు సంతానంబు జన్మాద్యపా
యము తప్పించుత ! యెన్ని పుట్టువుల పెట్టితిన్ శివా ! యేమి కా
మము? కోపం బదియేమి? యేమియగునీ మాత్సర్యమోహాలో, ప్రభూ!

ఇది మెచ్చెదరో మెచ్చరొ
యిదియును జదివెదరు చదువ రేలా నాక
య్యది ? నామొద మ్మీతో రా
చెద నద్దానికి ఫలంబుఁ జెందించు శివా !

హాళిఁ జరించుఁ గావ్యరచనాత్త యశఃకృత నాకసౌఖ్య వాం
ఛా లులితంపుటాత్మయె పొసంగదు నాదెసఁ బొందుగాక ము
క్త్యాలధరాధినాయకుఁ డదంతయు ; నాతపమెల్లఁ బంతి యు
ద్వేలజనూరుజావితతి విచ్చెడినట్టు లనుగ్రహింపవే !

ఈవిధమైన కోరికతో ('విశ్వనాథ' కవి రామాయణము రచించుచుండె నననగా నది వట్టి కావ్యమాత్రముకాదు, రసాఖండమైన మహాకావ్యమునుగాదు, ఆధ్యాత్మిక తత్త్వమునకు మహాభాష్య రచనయే కాఁగలదు. "కృతిచే నచూత్తమగుఁ గీరితి స్వర్గ, ద మంతే ; సేవరింపను స్వర్గం బతిరూక్ష చింతనాగ్రస్థిత తేజము శివుఁడు నన్నుఁ జెందెతుఁ గాతన్ !" అన్న వాంఛ యుత్తమ జాతి మహాకవికిఁ గాని పొడమదు. "అనృషి కావ్యము రచింపలేఁ" డను మాటపరునకు నిట్టిసందర్భములో నెంతో వ్యాఖ్య చేయువలసి యున్నది ! ఇపుడు వలదు. అందఱు

రచయితలనుండి కొన్నిపద్యములేఱి పాఠకుల సుచ్చుటకై యిచ్చుట యీ రచనలోని యాచారము. ప్రసంగములో సత్యనారాయణగారి పద్యములు మున్నె కొన్ని తెలిపితిని. వారి ప్రత్యక్షరము నన్నుఁ దగ్గదే యైనను 'రామాయణ కల్పవృక్షము' నొకకొమ్మదులిపి కొన్నిపూలు రాలిచెదను.

క. పరసుఖ దశా పరీపా
క రామణీయక మెఱుంగుఁ గచసాన్నిధ్యా
త్తరమణఁ బ్రథమ స్పర్శ
ప్రహూతి మొదవొలిచె నూత్రబంధనవేళన్.

గీ. కరరుహాంబులు చర్మంబు గాకపోయె
నవియుఁ బులకించునేమొ ప్రియాగళాత్త
మైన స్పర్శసుఖాప్తిఁ బ్రియాగళంబు
నంటి బాధించు పీని కేలా! సుఖంబు.

క. తలఁ బ్రాల వేళఁ బడుచును
నలఘుచ్ఛవి నెగురు ముత్తియంబుల మిసచే
నలు కేళకుళులు వొలిచెను
నలుగురు దంపతులు మోహనస్తంభములై.

గీ. నాలుగవ పాలుగా నింద్రనీలమణులు
మణులు కలియుంగఁబోసిరో యనఁగ బొలిచె
ముత్తెములు చతుర్దంపతి ముగ్ధతను స
మాత్తనీల రక్తచ్ఛవుల్ హత్తుకొనఁగ.

గీ. అలుపములు రెండు మూఁడు ముత్యాలు నిలిచి
సీతపాపటలోఁ జిఱుచెమట పోసె
హత్తుకొని గండపూఁత ముత్యాలు రెండు
రామచంద్రుని మీఁద తారకలు పొలిచె.

మ. పదిదోసిళ్లకు నొక్కదోసిలి త్రపావర్యంతమై సేసబ్రా
లొదిగించెన్ జనకాత్మజాత పతిపై నొయ్యారపున్ లజ్జయున్
జదురా యొల్లటి వెంట్రు డిగ్గుచుఁ బ్రసన్నాశైథిల్య మార్గంబునన్
బెద రావేళకుఁ దీరినట్టి కనులన్ వీక్షించుచున్ రాఘవున్.

ఆ॥ వె. చంద్రరేఖపై ని సన్నని తెలిమొయి
ల్లాడినట్లు ముత్తియపుమ్రొలాడెఁ
దల్లి మేనిపైని నల్లనియాకాశ
మట్లు రామచంద్రుఁ డందెయుండ.

ఉ. అల్లవివాహమంటపమునై చనుచోటికిఁ జిత్రచిత్రముల్
కొల్లలుగాఁగ వచ్చు వెలుఁగుల్ వెసఁ బెండిలివారలెల్ల ద్వా
ర్వల్లితదృష్టులై చినుకు వెక్కసమౌ చిఱుజల్లువానలో
ఫుల్లవిచిత్రవర్ణములు పూవులు చూచిరి లంబమాలలన్.

క. ప్రతిచైత్రశుద్ధ నవమికి
వితతంబుగఁ దెలుఁగునేల విరిసెడుజల్లుల్
సితముక్తా సదృశంబులు
ప్రతనులు తలఁబ్రాలవేళ వచ్చుఁ జిటపటల్.

* * *

సత్యనారాయణగారి కిన్నెరసానిపాటలు తెలుఁగునాఁటఁ బ్రాకినవి. సభలలో నాయన యుపన్యాసము చెప్పి యూరకున్న తరువాతనో నట్ట నడుమనో సభ్యులలో నెవరో లేచి కిన్నెరసానిపాటలు పాడవలయునని శాసింతురు. ఆయన వీలుగా నున్నచోఁ బాడుదురు. లేనిచో కన్ను మంతురు. 'విశ్వనాథ' కవి యుపన్యాసవాణి పటుత్వము కలది. ఆధ్యక్ష్యము వహించుటకుఁగగిన బిగువు వారిలో నున్నది. "విప్రుని యలుకయుఁ దృణవహ్ని తాశనంబు దీర్ఘముగునె!" ఈయెటుక కలవానికి సత్యనారాయణగారు వెన్నవంటిహృదయము కలవారు.

ప్రకృతము వారియుద్యోగము బెజవాడ కాలేజీయందు. ఇదివరలో రెండు మూఁడు సారులు స్వాతంత్ర్యవాంఛా ప్రభంజనము రేఁగి కొన్ని యుద్యోగముల నూదిద్రొచినరి. మహోదారము, స్వతంత్రమునైన హృదయముగల సత్యనారాయణగారు ఎమ్. ఏ. పట్టభద్రులయినా రన్న విషయము కొందఱు సనాతను లెఱుఁగరు. సభావేదికమీఁద నాయన మాటాడునపుడు సాధారణముగా నాంగ్లవాసన వేయనీయరు. శుద్ధ శ్రౌతి - కర్మిష్ఠి లోకజ్ఞత గలిగి సంభాషించుచుండెనా యనుకొందుము. సత్యనారాయణగారు శ్రౌతధర్మములు పెక్కులు తెలిసికొనిరి. స్మార్తము పాఠము జేసిరనియు వినుకలి. ఇన్ని యర్హతలు గలవా రాధునికులలో "ద్విత్రాః పంచషావా."

(నన్నయభట్టారకుని యక్షరాక్షరము సత్యనారాయణగారు పరిశీలించి "ప్రసన్న కథాకలితార్థయుక్తి"—"నానారుచిరార్థసూక్తినిధి" అనువాని నాధారముగాఁ దీసికొని 'భారతి' లో వెలువరించిన యమోఘవ్యాసములు వీరి లోఁతుగుండెకు సూచికలు. 'అమృతశర్మిష్ఠ' యని పేరుపెట్టి శర్మిష్ఠాయయాతి చరిత్రము వీరు సంస్కృతభాషలో నాటకముగా సంతరించిరి. వేయిపడగలు నా విష్ణుకొన్ని సత్యనారాయణ గారి ప్రతిభావ్యుత్పత్తులను గుర్తించి 'కవిసామ్రాట్' బిరుదము నిచ్చి మెచ్చుటయు, గజారోహణోత్సవము గావించుటయుఁ దెనుఁగుభూమి చేసిన ఘనకార్యములు!)

కట్టమంచి రామలింగారెడ్డి

1880

(పాకనాటిరెడ్డి. తండ్రి: సుబ్రహ్మణ్యారెడ్డి. జన్మస్థానము: కట్టమంచి. నివాసము: చిత్తూరు. జననము : 1880. రచనలు : ౧. కవిత్వతత్త్వ విచారము ౨. వ్యాసమంజరి ౩. ముసలమ్మ మరణము ౪. నవయామిని [ఖండకావ్యములు] ఇత్యాదులు.)

ఒకజాతీయ నాయకుఁడుగా, అంతర్జాతీయ రాజకీయ వేత్తగా నుండువాని ప్రశస్తి రామలింగారెడ్డిగారి కున్నది. రచయితగా ఆయనకుఁ గల ప్రసిద్ధియుఁ జక్కనిది. రెడ్డిగారు తెలుఁగువారే కాని, ఆంగ్లభాషా కోవిదులైన భారతీయు లేపదిమందిలోనో యొకరు. ప్రభుత్వము బహుమాన వేతన మీయఁగా 'ఇంగ్లండు' నకుఁ బోయి పాశ్చాత్య శాస్త్ర తత్త్వము పుడిసిలించి వచ్చిన పండితు లీయన. ఖండాంతరములలో నున్నను, తెలుఁగుఁగలకండపుఁదీపి మఱచిపోయినవాఁడు కాఁడు. అది మన విశ్వవిద్యాలయపు భాగ్యము. రాధాకృష్ణపండితుఁడు 'ఆక్సుఫర్డు' లో వేదాంత విద్యాగురుత్వము వహించుచున్నను, కాశీ విశ్వకళా పరిష దుపాధ్యక్షతా పదవిలో నున్నను, రష్యా రాయబారిగా నున్నను ఆంధ్ర జనయిత్రి కడుపు చుమ్మలువాఱఁ గన్నబిడ్డఁడే !

మన రామలింగారెడ్డిగా రేండ్లతరమునఁ బాశ్చాత్యదేశమున నున్నవారే యైనను మానసములో మాతృపూజ మానలేదు. కళాపూర్ణోదయ కథా సంవిధాన సమీక్ష చేయుచునే యుండెడివాఁడు. "కవిత్వతత్త్వవిచార" బీజము లప్పుడే యీయన హృదయక్షేత్రమునఁబడినవి. పింగళి సూరనార్యునితోఁ గట్టమంచి కవికి బ్రహ్మాండమంత మైత్రి. అందువలననే యతనిలోఁ బొరపాటులని తోఁచినవి మొగమోటమి లేకుండ మొగముముందఱఁ జెప్పివైచుటకు సాహసము. ఇది కొంత

అతడు మోటుగానుండును గాని, కవితావిమర్శకున కుండవలసిన లక్షణములలో నిదియొక మంచిలక్షణము. ఆయన విమర్శనములలోఁ బాశ్చాత్య సంస్కారవాసన పాలు చాలఁగాఁ గనుపట్టుచుండును. అట్టులని, వారి సంస్కృతులన్నియు నితఁడు సహింప నేరఁడు. సహ్యములుగాని శృంగారవర్ణనములు చేయుటను రామలింగారెడ్డి రోయును. ఈపత్రోనకు గుఱిగాని వారొక భారత కవులే. వారిలోను 'కవిబ్రహ్మ' రెడ్డిగారి దృష్టిలో విశిష్టుఁడు. "ఆంధ్రలోక పరిశుద్ధ తపఃపరిపాక రూపుఁడు — కవితాప్రపంచరవి" తిక్కనయే యఁట. తిక్కన 'కడిఁది యాశక్తి కాంతిపలుక వ్యక్తములైన విశేషములతో కవిత్వ తత్త్వ విచారము సేసి విరచించి' రఁట. ఈతత్త్వవిచారములోఁ దేలిన సిద్ధాంతములంపై రాద్ధాంతములు వెలువడకపోలేదు. అగుఁగాక! కట్టమంచి రచయిత నేమి యుక్తమైనను నిష్పాక్షికమై నిశితమై యుండుననుట నిర్వివాదాంశము. సాంఘికమునఁ గూడ రెడ్డిమాటలు సూటిగా, వేడిగా నాటుకొనుచుండును.

జాతీయ కవితాభిమాని యగు రెడ్డియూహాలో వేమనకుఁ గారణ విమర్శనశక్తికిఁ బట్టాభిషేకము చేసిన మహాత్ముఁడు, ప్రతిభాశాలియు నగు మహాకవి. "ప్రకృతి యనఁగా మనవారి కనేకులకు నిఘంటువులలో నుండు ప్రకృతియేగాని, మాలింటికి బయటనున్న ప్రకృతి నెన్నఁడైనను తమసొంత కన్నులతోఁడఁ జూచిన పాపమునఁ బోరు. అట్టివారికి వేమన యనుసరణీయమైన త్రోవచూపినాఁ డనుటలో నించుకయు గుణాధిక్య స్తుతి లేదు" ఇది కట్టమంచి విమర్శకుని వాఙ్మూలము. ఈ రచయిత అర్ధశాస్త్రము నాంధ్రీకరించి యాకృతి స్మరణీయ యగు ప్రేయసి కొసఁగినాఁడు. దానికొఱకై వ్రాసిన యంకితపద్యములు పదో పంద్రెండో. అన్నియుఁ జక్కనివి. ఒక్కటిమాత్రము వ్రాసెదను.

కల్లోల మాలికాకరముల వీచుచు

నెలఁ గెత్తి పిలిచెడు జలధినుండి-

నిండార నెఱపిన చందువెన్నెల డాఁగి
    నవ్వెదు నాతోడ నభమునుండి
గుసగుసల్ వోవుదు కోర్కిమై సురభి శ్రీ
    తల మంద మారుతావళుల నుండి
తేనెలఁ దావుల జానగు పువుల హి
    మాశ్రు లుర్లఁగఁ జూచె దవనినుండి
ఛట ఛట రవరాజి ప్రస్ఫుటముగాఁగ
ననుచితము సేయఁ గోపింతు వగ్నినుండి
సకల భూత మయాకార సార మహిమ
నీవు లేకయు నాకు నున్నా వెపుడును.

*

'నవయామిని' రామలింగారెడ్డిగారు 1936 లో రచించిన ఖండ కావ్యము. ఇది బిల్హణీయ కావ్యమునకు మార్పుచేసిన కథాసందర్భము గల కృతి. ప్రాచీనకావ్యమగు బిల్హణీయము అనాదరణీయమైన కావ్యమనియు, మంచిదికాదనియు, కల్పన సత్యమునకు నైజమునకు విరుద్ధమనియు రెడ్డిగారి యభిప్రాయము. ఆకథ నంతను సొంతయూహతో మార్పుచేసి 'నవయామిని' కూర్పులోఁ బ్రదర్శించినారు. రెడ్డిగారి భావాంబరవీధి విహరించు యామినీ బిల్హణుల ప్రకృతు లివి:—

౧. బిల్హణుఁడు:— పండితుఁడు. వయస్సు చెల్లినవాఁడు కాకున్నను కొంతవఱకు ముదిరినవాఁడు. ధర్మబుద్ధి నిగ్రహశక్తి ఏమాత్రములేని విషయలోలుఁడు కాఁడు. నిజశీలము చలితమయ్యె నేని పునరాలోచనమై సమర్థించుకొనఁ జాలిన నిగ్రహపరుఁడు.

౨. యామిని:— వయస్సునను, వర్తనమునను ఆర్య. పరిశుభ్ర మనోగతి గలది. సచ్ఛీల. గయ్యాళి కాదు. మృదుత్వము స్థిరత్వము కలిసిన హృదయము కలది. భావములు వెన్న. పలుకులు తేనెలు. ధర్మసంకల్పము వజ్రము వంటిది.

ఈ ప్రకృతులు గల నవయామినీ—బిల్హణులతో నీ కావ్యము రెడ్డిగారు సంతరించిరి. కథానిర్మాణము ప్రకృతము మనము చూడవలదు. ఆయన కటులు తోఁచినది. పూర్వపు బిల్హణీయకథ యనౌచితీ దుష్ట మని యాయన నమ్మినాఁడు. కాదుకాదని విమర్శకులు వాదములు చేయుచున్నారు. పోనీ ! అందలి కవితావైభవ మెట్లున్నది ! ఈ ఖండ కృతిలో మొత్తము ముప్పది పద్యములకంటె మించిలేవు. కాని, మంచి కండగల రచన.

పరవశుఁడగాక యిన్నేండ్లు బ్రతికి, నేఁడు
నాకు నీవశంబగుట నంతనమ కాని ;
కాలుతప్పి, కాలము సెడి కర్షకుండు
విత్తు చల్లిన ఫలమున్నె ? వెఱ్ఱిగాదె ?

*

నీవు మనోజ్ఞ మూర్తివి, వినిర్మల కీర్తివి జ్ఞానమందు వి
ద్యా విభవంబునందుఁ బరమాద్భుతశక్తివి ; నాకుఁ జూడఁగా
దైవముఁ, దండ్రియున్, గురువుఁ, దల్లియు నీవ సఖుండవున్ సదా;
కావున సాహసించితిని కర్మము ధర్మము పూని తెల్పఁగన్.

నీప్రతిబింబముగద నే
నో పావనమూర్తి, కినియనోపుదె నాపై
నీపోషించిన లతికను
నీ పట్టున నలరనిమ్ము నిర్మల నియితిన్.

*

చిఱునవ్వు రేకులఁ జెన్నారు మొగము దా
మర సౌరభము మది కరఁగ నాని
కలికి తనము మీాటఁ దెలివి మెఱుంగులఁ
కెలఁగించు కనుల కాంతులకుఁ దల

నవ్యముల్ హృద్యముల్ నర్మగర్భితములౌ
 తళుకు పలుకుల తీపిఁ దవిలి చిక్కి
మనసు మైనము కరఁగ మచ్చుమాయలఁ జల్లు
 తెలియని ముగ్ధ చేష్టలకు భ్రమసి
బుద్ధి వెనుకకుఁ జిత్తంబు ముందునకును
బోవు భిన్నత శాంతి గోల్పోయి, తగును
దగద యను నిలుకడ లేమిఁ దాల్మి వొలియఁ
గోర రాదని తెలిసియుఁ గోరినాఁడఁ
జేర రాదని తెలిసియుఁ జేరనాఁడ.

*

మెత్తని, తియ్యని, చల్లని
చిత్తముఁ, జిఱునవ్వుల రుచులు, సిగ్గు మొగముఁ, గ
న్నెత్తని రూపము, హృదయో
న్మత్తతఁ గలిగింప నిట్టి మాటలు బ్రేలెన్.

*

రెడ్డిగారి రచనలలో 'ముసలమ్మ మరణము' నకు మంచి యశస్సు వచ్చినది. ఈ చిన్న కబ్బము చెన్నపురి క్రైస్తవ కళాశాలకు సంబంధించిన ఆంధ్రభాషాభిరంజనీ సమాజము నెలకొల్పిన బహుమాన కావ్యపద్ధతిలో నెగ్గినది. నాఁడు తత్సమాజపోషకుఁడు సమర్థి రంగయ్యసెట్టి.

బ్రౌను దొరగారు ప్రకటించిన 'అనంతపురచరిత్ర' యను గ్రంథము నుండి యీ యితివృత్తము కైకొనఁ బడె నని రెడ్డిగారు పీఠికలో వ్రాయుచున్నారు. ఈ కృతి బాల్యములో రచింపఁబడిన దగుటచేఁ బ్రాచీన కావ్యానుకరణఫక్కి ముప్పాలుగానుండెను. హృదయము నూఁపించు క్రొత్త వర్ణనములును గలవు.

మచ్చునకు :—

లేఁగ మైనాకుచు లీలమై మెడ మలం
 చిన గోవుఁ బిండెడు వనరుహాక్షి
బొండు మల్లెల తోఁటఁ బువ్వులు గోయుచు
 వనలక్ష్మి యన నొప్పు వనజగంధి
బీదసాదుల నెల్ల నాదరించుచుఁ గూడు
 గడుపారఁ బెట్టెడు కన్నతల్లి
వ్యాధి బాధల నెవ్వరైన నడల రెప్ప
 వేయక కాచెడు వినుత చరిత
బిడ్డ లెల్లరు తమవారి విడిచి చేరఁ
జంక నిడు కొని ముద్దాడు సదయహృదయ!
అమ్మ! నీ కిట్లు వ్రాయంగ నౌనె బ్రహ్మ
కనుచు నూరివారందఱు నడలియడలి.

*

కన్నెఱ్ఱ వాఱిన ఖర కరోదయకాల
 మల్లన గ్రుంగు జాబిల్లి యనఁగ
జ్వాలదగ్ని శిఖలపై నెలనవ్వుతోఁ బోవు
 ధాత్రీ మహాదేవి తనయ యనఁగ
కెందామరల బారు సుందర మగు లీల
 నల్ల నల్లనఁ జొచ్చు నంచ యనఁగ
కాలమహా స్వర్ణకారకుం డగ్నిలోఁ
 కరఁగించు బంగారు కణిక యనఁగ
ప్రళయకాలానల ప్రభా భాసురోగ్ర
రంగ దుత్తుంగ భంగ సంఘాతములకుఁ
గలఁక నొందక దరహాస మలర, మంద
మందగతిఁ బోయి, చొచ్చె నమ్మగువ నీట.

ఈ తీరున విద్వాంసుఁడై కావ్యరచనము గావించిన కట్టమంచి కవి వంగడము సాహిత్యాభిరుచి కొన్నితరములనుండి కలిగి వచ్చుచున్నది. దానికిఁ దారకాణగా మనరామలింగారెడ్డి యపుడపుడు వ్రాసిన కృతి పీఠికలలోని కొన్ని బంతులు గమనింతము.

"ఒకానొకప్పుడు శిష్యులైన కుప్పనయ్యంగార్లు బురదలో దిగఁబడి నడవఁజాలక, గనిమమీఁదఁ బోవుచుండిన రామలింగారెడ్డిగారిని [మన రెడ్డిముత్తాత] వచ్చి చేయూఁత నిమ్మని సంస్కృతములో నాక్రోశించిరి. ఆకూత సవ్యాకరణముగా లేనందున, దానిని దిద్ది పునశ్చరణము చేసిననేకాని రానని కోపించుకొనిరఁట. ఈయితిహాసము కుప్పనయ్యం గారే యొకానొకప్పుడు క్లాసులోఁ జెప్పిరి. ప్రాణాలకైనను వ్యాకరణము హెచ్చేమో యాకాలపు గురువునకు! ఈయన మహాకవి యని మాబంధువులలో గొప్పప్రసిద్ధి. నేనుపుట్టిన లగ్నమును, మఱికొన్ని చిహ్నములును, భావిపాండిత్య సూచకములని కుప్పనయ్యంగార్లు వారిపేరు నాకుఁ బెట్టిరి."

*

"కవిత్వము మహాసాహస కార్యమని నాతండ్రికి భయము. ఒకవిధ ముగాఁ జూచిన నిజమే! కాని, వారి కారణములు వేఱు. విమర్శ ములు పడి యెవరికేచేటు వాటిల్లునో యని వెఱుపు పెద్ద. తెనుఁగులో నాకుండు పాటవముఁ జూచి వీఁడెప్పుడు కవిత్వరచనకుఁ బ్రారంభించి నాశనమగునో యని దిగులు చెందుచుండును. సాక్షాత్తు తన కంఠ స్వరముతోనే తాను జదివెడు మూడిక్కనే భారతమును నేను జదువు నప్పుడు పరమానందమును, సీతుంటరి కవిత్వమును మొదలుపెట్టి యిల్లు కూల్చునో యనుసంశయమును జనిపోవువఱకుఁ దాల్చియుండెను. కవిత్వ మనఁగా మరణయోగములలో నొకటి!"

"మాతండ్రి గారు ప్రచురించిన గ్రంథములు రెండు. భారతసార రత్నావళి, భాగవతసారముక్తావళి. సొంతకవనము పొంతఁ బోఁగూడ దను నియమముఁ దాల్చినవా రగుటవలన, నీ సంపుటీకరణములతోఁ దృప్తిఁజెందిరి."

*

"ఆంధ్రలోక గురువులలో వేమన మొదటివాఁడందుమేని, సుమతి రెండవ వాఁడు ...... మావంశమున కేదివచ్చిన రానిండు. తెలుఁగు భాష యొక్కటిమాత్ర మక్షయముగ నిలిచియుండినఁ జాలును."

*

రెడ్డిగారి 'వ్యాసమంజరి' మైదుఖండములుగా విభజింపఁబడి యున్నది. పూర్వఖండము, అభిజనఖండము, భాషాఖండము, ఆధునిక కవితాఖండము, సాంఘికఖండము నని - ఈరచన లన్నింట నొక్కొక్క క్రొత్త తెన్ను కనఁబడును. విషయము సూటిగా మొగమోటమి విడిచి వ్రాయుటలో రెడ్డిగారిదొక ప్రత్యేకత. ఆయన మాటలో వలె వ్రాఁతలో సున్నితమైన ధ్వనిమర్యాద యుండును; హాస్య రేఖలు నుండును. వచనపు నడక చాలదొడ్డది రెడ్డిగారి కలవడినది. పరిశుద్ధమైన లక్షణావిరుద్ధభాషలోనే వీరి రచనలెల్ల సాగినవి.

వీరి వ్యాసమంజరికి ఉపోద్ఘాతము వ్రాయుచు పింగళి లక్ష్మీకాంతముగారు: "విమర్శకులలో వీరికెంత ప్రాధాన్యమున్నదో వ్యాస రచయితలలోను అంతప్రాధాన్యమున్నది. సాహిత్యాంగముగాఁ బరిగణింపఁదగినవ్యాసరచన ఆంగ్లభాషలోవలె మనభాషలో ఇంకను పరిణతావస్థకు రాకున్నను, జరిగినంతవఱకు దానిపెంపునకుఁ గారణభూతులైన విద్వాంసులలో వీరొకరు. గ్రంథములకుఁ బీఠికలు వ్రాసినను పత్త్రికలకు వ్యాసములు వ్రాసినను, తాత్త్వికముగా విషయచాలన మొనర్చి పటుత్వముగల భాషలో సోపపత్తికమైన సిద్ధాంతము చేయు నేర్పు వీరి

వాక్కునకు సహజగుణము. వీరివ్యాసములకు ఇదియే ప్రథమాలంకారము. రెండవది శైలి..." ఇత్యాదిగా ప్రశంస చేసినారు.)

(ఉచితనియమనిబద్ధమయిన రెడ్డిగారి వచనశైలిలో మాధుర్య రేఖలు తెలుచుగా నగపడుచుండుననుటలో నెవ్వరికి సంశయముండదు. ఈవిధముగా విమర్శకులలో, వ్యాసరచయితలలో, కవులలో నొక మంచి తావు నేర్పఱచు కొన్న 'కట్టమంచి' రచయిత) జీవితమును వేఱొక చూపుతోఁ జూచినచో, ఆయన పెక్కేండ్లు ఆంధ్ర విశ్వ విద్యాలయోపాధ్యక్షతా పదవి నిస్సమాన్య ప్రతిభతోఁ బరిపాలించి, యిపుడు మైసూరు విశ్వవిద్యాలయమునకుఁ గూడ నదే పదవిలో నుండి సేవ గావించుచున్న మహావ్యక్తి. ఈ రెడ్డివంటి స్వాతంత్ర్య కాంక్షిని తెలుచుగా మనము చూడఁ జాలము. రసలుబ్ధుఁడైన యాతని సౌహార్దము కొందఱభినవాంధ్రకవులకు మూలశక్తియైనది. [రాయప్రోలు - అబ్బూరి - దువ్వూరి - పింగళి - మున్నగువారి యభ్యున్నతి కీయన 'అసరా' మేలయినది. సుప్రసిద్ధ కవులు విశ్వనాథ సత్యనారాయణగారు 'ఋతుసంహార' కావ్యము రామలింగారెడ్డి కంకితము చేసిరి — రాయప్రోలు సుబ్బారావుగారు కట్టమంచి కవిని గూర్చి యిటు లుట్టంకించిరి.

పిండీ పిండని పాఁడి యాఁబోఁదుఁగులన్ బింబింపఁ గాఁదంబిసీ
కాండం బుర్వర పచ్చ కోకలను సింగారింప నీవేళఁ బూ
దండల్ దక్కనుద్వారబంధముల సంధానించి ప్రేమోదయా
ఖండ స్వాగత మిత్తు రాంధ్రు లనురాగస్ఫూర్తి రెడ్డ్యగ్రణీ!

*

ఆజిన్ మార్గోగమీఁక, దిగ్విజయ కన్యా కంచుకంబా కుసుం
బాజెండా నెగఁగట్టి వాఙ్మయ సరోవాద్ధ్వీ పిపాసారతిన్
మోజుల్ మీఱఁగ మాయునుఁగుఁ దేమఁగుం బూఁదోటఁ బోషించి రే
రాజుల్ తత్ప్రతిభాంక రెడ్డికులధీర ప్రాచురీచ్ఛాయ నీ
తేజోరూపమునందు చూచెదము ప్రీతిన్ రామలింగాగ్రణీ!

మల్లాది సూర్యనారాయణ శాస్త్రి

1880

వెలనాటి వైదిక బ్రాహ్మణులు. తల్లి: వేంకమాంబ. తండ్రి: శ్రీరామావధానులు. జన్మస్థలము: చినకడియపులంక [దీనికి బుఱ్ఱిలంక-మల్లాదివారిలంక యని నామాంతరములు] జననము 20. 2. 1880 సం|| ప్రమాధి మాఘశుద్ధదశమి. గ్రంథములు: ౧. సంస్కృతవాఙ్మయచరిత్ర [2 భాగములు. ఆంధ్రవిశ్వకళా పరిషత్ప్రచురణములు. ౧. వైదిక భాగము. ౨. లౌకికభాగము] ౨. ఆంధ్రభాషానుశాసనము [2 భాగములు. చరిత్రాత్మకవ్యాకరణము] ౩. ఆంధ్రదశరూపకము [తెనుఁగుసేఁత] ౪. భాసనాటకకథలు[వచనము. 2 భాగములు] ౫. ప్రేమతత్త్వము [స్వతంత్ర పద్యకావ్యము] ౬. ఉత్తరరామచరిత్ర [ఆంధ్రీకృతి] ౭. భీష్మప్రతిజ్ఞ [స్వతంత్రనాటకము] ౮. ఆంధ్రభవిష్యపర్వము [పద్యప్రబంధము] ౯. భవభూతినాటకవచనము. ౧౦. విదురనీతి. ౧౧. స్త్రీధర్మబోధిని. ౧౨. సత్యకీర్తినాటిక ౧౩. కవివిడంబనము. ౧౪. మహాభారత విమర్శనము.

సంస్కృతరచనములు: ౧. బ్రహ్మసూత్రార్థదీపిక. ౨. రజోఽనన్తర వివాహము. ౩. సంస్కృతభాషా [ఇవి 'షష్టిపూర్తి' సంపుటములో ముద్రితములు] అనేక పత్రికలలో వ్యాస రచనలు.

శ్రీ సూర్యనారాయణ శాస్త్రిగారు సంస్కృతాంధ్రములయందుఁ గావలసినంత నికరమైన పాండిత్యము కలవారు. ఈ పాండిత్యమునకు దీటయినది వారికిఁ గల యభినివేశము. సంస్కృతవాఙ్మయ చరిత్ర, ఆంధ్రభాషానుశాసనము మున్నగా వారు రచించిన కృతులు శాస్త్రి గారి పట్టుదలను బ్రదర్శించుటకుఁ బట్టుగొమ్మలయినవి. ఆయనకుఁ గవిగానున్న కీర్తి కంటె, అధ్యాపకుఁడుగా విమర్శకుఁడుగానున్న పేరు పెంపులు పెద్దవి. ఏమనఁగా, సూర్యనారాయణశాస్త్రిగారు నలువది సంవత్సరములు ఉపాధ్యాయ పదవి నిర్వహించిరి. ఆ నిర్వహణములో

వారికిఁగల శ్రద్ధానియమములు చక్కనివి. మహా పండితులు చర్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి సన్నిధిని వ్యాకరణశాస్త్రాధ్యయనము చేసి, తెనుఁగులు స్వయంకృషినిజూచి యుభయభాషావిశారదులై 1900 లో అమలాపురము హైస్కూలున నుపాధ్యాయులుగాఁ బ్రవేశించిరి. అది నాలుగేండ్లయినతర్వాత ఆంధ్రసాహిత్యపరిషత్తు వ్యవహర్తగా నొకయేఁడుద్యోగ నిర్వహణము. 1915 లో, రాజమండ్రి ట్రైనింగుకాలేజిలో నధ్యాపకత. ఆపదవి యొక వత్సరము. పదపడి, అనంతపురము కళాశాలలో మూఁడేండ్లు. మరల రాజమహేంద్రవరము ఆర్ట్సు కాలేజిలో 1919–1931 నడుమ పండ్రెండు వత్సరములు పండితస్థానము. అక్కడి నుండి ఆంధ్ర విశ్వవిద్యాలయ కళాశాలలో పదియేండ్లపాటు విద్వత్పదవి. మొత్తముమీఁద నాలుగుదశాబ్దులు పఠనపాఠనములలో శాస్త్రిలుగా రాణిఁ తేటిరి. ఈలోపుననే వీరు కొన్ని గౌరవోద్యోగములు నిర్వహించిరి. వేంకటగిరి రాజావారి సంస్థాన కవితాపదవి 1909–1919 మధ్య. జటప్రోలు సంస్థానవిద్వత్ స్థానము 1910–1917 నడుమ. నారయ్యప్పారావు సంస్థాన విద్వత్కవిత్వ పట్టము 1919–1926 నడుమ. ఈవిధముగా సంస్థానకవులై యుపాధ్యాయులై యంతేవాసులకెందఱకో విద్యాభిక్ష పెట్టియుండుటచే సూర్యనారాయణ శాస్త్రిగారికి సుస్థిరమైన యశస్సు చేకుఱినది. దీనికిఁదోడు గ్రంథరచన. శాస్త్రిగారను వాదములేకాక స్వతంత్రరచనలు కూడఁ గావించిరి. వారి కృతులన్నియుఁ బాఠ్యములుగా నిర్ణీతములు. 'సంస్కృత వాఙ్మయచరిత్రము' వీరిది శాశ్వతముగా నుండఁ దగినగ్రంథము. ఒకదశాబ్దము చేసిన నిరంతరకృషి ఫలము. వైదికవాఙ్మయము, లౌకికవాఙ్మయమునని రెండుభాగములుగా నీ గ్రంథము విభజింపఁబడి వ్రాయఁబడినది. ఆంగ్లములో నీవఱకు సంస్కృతవాఙ్మయ చరిత్రమునఁ గలపొరపాటులు పేర్కొని, మనోహరము నిర్దుష్టము నగు పక్కిలో నీ గ్రంథము సంధానించిరి.

శ్రీ వెంకటగిరి సంస్థానాధిపతుల ప్రోత్సాహముచే "సంస్కృత కవిజీవితములు" శ్రీశాస్త్రిలుగారు తెనుఁగులో రచించి వెలువరించిరి. ఈ రెండు గ్రంథములు సూర్యనారాయణ శాస్త్రిలుగారి యశోలతకుఁ బ్రాకులు.

పింగళి సూరనార్యుని 'కళాపూర్ణోదయము' ముద్రణదోషముల తోను, విరుద్ధపాఠభేదములతోను నుండి యర్థావగతికిఁ గష్టపెట్టుచున్నదని శాస్త్రులుగారు పరిశ్రమించి, పాఠభేదములు గుర్తించి సరిపఱిచి భావప్రకాశిక యను టీకతో, ఆమహాకావ్యమును లెస్సయగు తీరులోనికిఁ గొనితెచ్చిరి. ఇది ముద్రింపించినవారు పీఠికాపురాధీశ్వరులు. మల్లాదివారి పాఠములు కొన్ని సరియైనవి కావని తరువాత విమర్శనములు తలసూపినవి. ముఖేముఖే సరస్వతీ! శాస్త్రులుగారి వాఙ్మయ వ్యవసాయము నిస్సామాన్యమైనదికాని, అందఱకు నందునది కాదు. ప్రాచ్య భాషాపండితులలో నట్టి ప్రగాఢమైన యభినివేశము గలవారు పెక్కురు లేరు; ఇట్టి లోకజ్ఞతాసంపత్తి గలవారును దక్కువగా నుందురు. వీరు ఆంధ్రవిశ్వకళా పరిషత్తు 'సెనేటు అకడమిక్కు-కౌన్సిలు, ఓరియంటల్ ఫాకల్టీ' మొదలగువానిలో సభ్యత నంది పండితులకు మన సంస్కృతాంధ్రములకు సంబంధించిన తీరుమానములు తెచ్చుచు నందు గొన్నింటిని సఫలము కావించి యున్నారని ప్రముఖులు చెప్పుచున్నారు. ఇది శాస్త్రులుగారి లోకజ్ఞతకును గుఱుతు. 1927 సం॥లో శాస్త్రిగారి యధ్యక్షతనంది "ఉపాధ్యాయ పండిత పరిషత్తు" నేఁడు తెలుఁగునేలలో నలుమూలలఁ బ్రాకి దొరతనము వారిచేఁ గొన్ని యుపయోగములు చేయించుకొన్నది.

శాస్త్రులుగారి 'సంస్కృత భాషారచనలు' వారి షష్టిపూర్తి సన్మానసంచిక చివరఁ బ్రచురితములయినవి. అవిచూచినచో గీర్వాణ వాణిలో వారికిఁ గల నైశిత్యము నైపుణి వెల్లడి కాఁగలవు.

'ఆంధ్ర భాషానుశాసనము' అను పేరుగల వీరి వ్యాకరణగ్రంథము నకు గొప్పప్రతిష్ఠ వచ్చినది. ఈయనుశాసనమునకు శాస్త్రులుగారు పడిన పరిశ్రమ మనంతము. ఎన్నో ప్రాచీనాధునాతన గ్రంథములనుండి ప్రయోగములు సేకరించిరి. ఈకృషి వ్యావహారిక పదశాసకముగా నుండుటవలనఁ గొందఱు గ్రాంథికవాదవీరులు శాస్త్రులుగారిని మెచ్చరు. పోనీ, వారికి మెచ్చులక్కఱలేదు. తోఁచి గొప్పకృషి చేసినారు. ముందు నాళ్ళు వారి శాసనము శిరసావహింపఁగల వని నేఁడు సూచనలు కనఁబడుచున్నవి.

ఉత్తరరామచంద్రాంధ్రీకరణము వీరిది చక్కఁగానున్నది. 'అద్వైతం సుఖదుఃఖయో' రిత్యాదిశ్లోకమునకు శాస్త్రులుగారి యనువాదపుఁ బొందిక యెంత సుందరముగానున్నది!

సకలావస్థల నేది కష్టసుఖముల్ సైరించునో యేకమై
వికలంబైన మనంబు నెందుఁ గనునో విశ్రాంతి యెందొప్పు వా
ర్ధక మందుం దమిఁ బెండ్లియాది మృతి పర్యంతంబుగాఁ బ్రేమసా
ర్థకమౌ నెయ్యది నిత్యభద్రమయి యాదాంపత్య మేపారెడున్.

వేటూరి ప్రభాకరశాస్త్రి

1883

వైదిక బ్రాహ్మణులు. తల్లి: శేషమ్మ. తండ్రి: సుందరశాస్త్రి. నివాసస్థానము: తిరుపతి. జననము: 1883 ఫిబ్రవరి, సర్వజిన్నామ సంవత్సర మాఘ బహుళైకాదశి మంగళవారము. గ్రంథములు: ౧. నీతిసిద్ధ [వచనము] ౨. కడుపుతీపు. ౩ కపోతకథ. ౪. విశ్వాసము. ౫. మూన్నాళ్ళముచ్చట [ఈనాలుగును ఖండకావ్యములు] ౬. ప్రతిమానాటకము. ౭. కర్ణభారము. ౮. మధ్యమవ్యాయోగము [ఈమూఁడును భాసకృతులకను వాదములు] ౯. భగవదజ్జుకము [బోధాయనకృతి ప్రహసనమునకను వాదము] ౧౦. శృంగారశ్రీనాథము. [శ్రీనాథుని కాలము, కృతులు మున్నగు విషయములపై విపులవిమర్శనము] ౧౧ తంజావూరు ఆంధ్ర రాజుల చరిత్రము. ౧౨. కనకాభిషేకము [శ్రీనాథునకు సంబంధించిన చరిత్రము] ౧౩. చాటుపద్యమణి మంజరి. ౧౪. ప్రబంధరత్నావళి. ౧౫ తెలుఁగు మెఱుఁగులు ఇత్యాదులు.

ఎడతెఱిపిలేని భాషాపరిశ్రమము—గడిదేఱిన యుభయసారస్వత పాండిత్యములు — వడిగల కార్యదీక్షా దక్షత — చెదిరిపోని తలంపులు_ ఒడిదొడుకులు లేని తేటతెనుఁగు కవితారచన — కడదాఁకిన తాత్త్వికదృష్టి — ఈ విశిష్టలక్షణములతోఁ బుట్టిన మహారచయితలు వేటూరి ప్రభాకరశాస్త్రి గారు. ద్రావిడము నెఱుఁగుదురు. ఆంగ్లము నవలసినంత పరిచయము. అచ్చుయంత్రముల మొగమెఱుఁగక మట్టిఁబుంగిన తాటియాకులను బట్టుకొని కన్నులు చిల్లులుచేసికొనెడి నిరంతర వ్యవసాయము. దానికి సాయము చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోఁ బరిశోధకపదవి. పెక్కు వత్సరములు ప్రభాకరశాస్త్రిగారాపదవిలోనుండి మదరాసు పండితులచే జోహారులు చేయించుకొనుచుఁ బరిశోధనము గావించినారు. ఈ పరిశోధన ఫలితము శృంగార శ్రీనాథాదిగ్రంథద్వారమునఁ దెలుఁగువారు చూఱలాడుచున్నారు.

శ్రీనాథుఁడు ప్రభాకరశాస్త్రిగారికి నచ్చిన మహాకవి. ఆయనపద్యములలోని రహస్యపుమెలఁకువ లెన్నో యెన్నుకొని శాస్త్రిగారి శరీరము పులకితమగును. 'క్రీడాభిరామము' నకు సువిశాలమైన పీఠిక వ్రాసి దానికి వెలుఁగుచూపిన మహాశయులు వీరు. "హరవిలాసము" వీరు సరి చూపఁగా నానందముద్రణాలయమువా రచ్చువేసిరి. వీరొకతీరునకుఁ దెచ్చిన కాశీఖండము వావిళ్లవారు వెలువరించిరి. శ్రీనాథుని గ్రంథములలో నెన్నో పాఠములు ప్రభాకరశాస్త్రిగా రమూల్యపరిశోధనము గావించి యెత్తిచూపిరి.

ప్రబంధరత్నావళి — చాటుపద్యమణిమంజరి — శాస్త్రిగారి పరిశోధనపుఁ బంటలు. 'తంజావూరి యాంధ్రరాజులచరిత్ర' కు వీరురచించిన 'తొడిమ' గొప్పది. ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ప్రకటించిన 'రంగనాథరామాయణము' నకు వీరిసహాయత పెద్దలు ప్రశంసించిరి. 'తెలుఁగు మెఱుఁగులు' అనుకూర్పులోఁ జాలఁగ్రొత్త విషయములు మనము గ్రహింపఁగలుగుదుము. 'దేశికవిత' సేకరింపవలెనన్న యాశ వీరికిఁ గొండంతయున్నది. ఇది యిటులుండఁగా, శాస్త్రిగారియాధ్యాత్మికదృష్టి సాధారణుల కందరానిది. పరమేశ్వరప్రీత్యర్థమను సంకల్పముతో వీరు ప్రతి కార్యము చేయుదురు. యోగనిష్ఠాగరిష్ఠత యున్నది. మానసికశాంతి శారీరకస్వాస్థ్యము విడినవారు వీరివాగమృతముచే సుపరితృప్తులగుచుండుట కనుచున్నాము. 'స్వయంతీర్ణః పరాంస్తారయతి' ఈయాభాణకము శాస్త్రిగారి పట్ల వర్తించును. మానవసంఘము విజ్ఞానవిలసితము కావలయు ననఁగా ప్రభాకరశాస్త్రిగారి వంటి రచయితలే తెలుఁగునేల కవసరము. గాంధిమహాత్ముని పవిత్రాశయములు వేటూరివారి కొజ్జబంతులు. వీరి 'గాంధిరామాయణ' సంకలనవిషయము నిటీవల వినియుందురు. ఈశ్వర తత్త్వము గుర్తించిన మహాత్ముఁడు గాంధియే యని వారివిస్రంభము. ఎట్టి శక్తియున్నను, ఆకుమూల పిందివలె నడఁగి

యడఁకువతోఁ దన పాండితీ ప్రతిభలు దాచుకొనుచున్న పండితుఁడు ప్రభాకరశాస్త్రి – ఈ వినయవాదము వినుఁడు.

“ ......అఱవము వాడుకభాష తప్ప గ్రాంథిక భాష నాకురాదు. ఇంగ్లీషు అసలేరాదు. చిరశ్రవణమున నేదో గుఱికిఁ గొంతయెడముగా నర్థమగుట గాని యందు నా కేమాత్రము నెఱుకలేదు. తెలుఁగులో నేదోకొంత తంటాలు పడితి ననుట తథ్యము. ఆంధ్రవాఙ్మయ సౌధ నిర్మాణ కర్మకారులలో నేను నొకఁడ నగుదు ననుకొని కొన్నాళ్లు కూలి పనిచేసి మట్టి ముద్దలు మోసితిని. చేతులు కడిగికొను దశలో నివ్వున్నాను – నా యాధ్యాత్మిక పరిశ్రమమునకు సంబంధించిన విషయము లితరులకుఁ దెలియవలసినవి గావు......... తెలుఁగు నేను నేర్చిన నాలుగు ముక్కలకు పూజ్యులు, గురువర్యులు నగు చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారి గురుత్వానుగ్రహము ప్రధానకారణము........వాఙ్మయవిషయమున నాపైఁ గొన్ని యప్పులున్నవి. అవి యెప్పుడో తీర్పవలసినవి. కాని పెక్కేండ్లనుండి యుపేక్షతోనే యుంటిని. ఈశ్వరానుగ్రహమున్న నందుఁ గొన్నింటినేని యిఁకఁ దీర్చుకొనఁగలుగుదు నేమో !”

‘ భారతి ’ ప్రమాథి కార్తికము.

నిరాడంబరమైన యిట్టిబ్రతుకు ఆర్థికముగా ముందునకు సాగకపోయినను, ఆధ్యాత్మికముగా నందన వనము వంటిది. ‘ వేటూరి ’ వారికి సతీర్థ్యులగు విశ్వనాథ సత్యనారాయణగారు ‘ త్రిశూలము ’ పీఠికలోఁ బ్రభాకరశాస్త్రిగారి యుపేక్ష కిటులు చింతించినారు.

వేటురి వారి వ్యాఖ్యలును బీఠికలుం దెలుఁగుం బొలంతికిన్
బేటులు రేఁగు గందవొడి వెట్టిన పూఁతలు ; నంతయయ్యు వా
రేటికొ వట్టి పేదతనమే భజయింతురు, నెంతయయ్యు నో
నాటకు నెక్కటో ! తెలుఁగునాఁటికి నాఁటికి నాఁటి కక్కటా !

భాషాపరిశోధకులు, విమర్శకులు కవులుగా నగుట యసదు. ఆ యదృష్టము ఒక్క ప్రభాకరశాస్త్రిగారికే పట్టినది. కడుపుతీపు-కపోత కథ - మూన్నాళ్ల ముచ్చట - మత్త విలాసము - భగవదజ్జుకము - ప్రతిమా నాటకము మున్నగు కృతులు శాస్త్రిగారు వెలయించినారు. వీనిలో సగము ఆంధ్రీకృతులు - సగము ఖండకృతులును. ఖండకావ్యములు కలకండములు. వేటూరి కవి తెనుగుదనముల కూర్పునేర్పు నబ్బురముగా నభ్యసించుకొన్న చతురుడు. పద్య - గద్యముల రచన మంచి చిక్కగ నుండును. పెద్దనవలె రచనకు గొప్ప బింకము నిచ్చు సమర్థత యున్నది. ఎఱుకఁ దవిలిన నొకసీసము వ్రాసెద.

కురులు చిక్కార్చి దిక్కులు గాంచి చేలాంచ
లము లెగ్దుకొని కంచెలం దోలించి
మొగము మంగళసూత్రమును నోలగందంబు
పసుపునఁ బూసి మన్ విసవైచి
గుములొత్తు పులకల నిమిరి పొక్కిలిబంటి
నీట నీరెండ మైవాట డిగ్గి
గుమ్మడి మాటగాఁ గూర్చుండి చిగురాకు
దొప్ప గోసిళ్ళ నీ రప్పళించి
దరిని గల బ్రాహ్మణుండు మంత్రములు పలుక
నల కనకగాత్రి కృష్ణలో జలక మాడెఁ
గరఁగఁ బోసిన పొంకు బంగార మనఁగ
నంగ కాంతులతోడఁ దరంగలాడ.

'కడుపుతీపు' లోనిది.

పదముల కుదిరికను, భావము పొదుపును గ్రింది పద్యములలో నరయవచ్చును.

బాలింతతనము తోడను
సూలింత తనమ్ము వచ్చి సోలించుట ని
ల్లాలికిఁ బని తోడని నెల
కూలికి నొకదాసిపనుచుఁ గుదిరిచె నతఁడున్.

ఎల్లిదాని పేరు నల్లనిచాయది
వయసు పదియు నాలు వత్సరములు
కూలి నాలి చేసుకొనుచుండెడిది గానఁ
జిక్క_నయిన మేని చెలువు గలది-

'మూన్నాళ్ల ముచ్చట' నుండి –

ఇవియెల్ల నీలాగుననుండఁగా, శాస్త్రిగారు 'నాగతి' యను శీర్షికతోఁ గొన్ని పద్యములు రచించిరి. వానిలోఁ గొన్నింటినే యిటఁ బ్రదర్శింతును. సాహిత్య పరమార్థము నేవిధముగా నారు గుర్తింపఁగలిగిరో తెలియఁ గలుగును.

అంబన్ సరస్వతిన్ భా
వాంబరవీథీ విహార నట్టే ధ్యానిం
పం బూనితి నాభావం
బంబరవీథిన్ మహావిహారము సలిపెన్.

*

ఆకసముకేసి చూచితిఁ
బైకిఁ బయికి నింకఁ బైకిఁ బయికిం బయికిన్
దూకుచు నెట్టో పోయిన
పోకై నాభావ మెందొ పోయెం బోయెన్.

*

అనంతమైన యాకాసంబునందు నెందో యెట్లో యే
మనన్ గలన్ మహాకి గుంటి యుఁతకంటె వేగమై

కనుంగొనంగ రాక పోక గంద్రగోళమయ్యె ; నా
మనంబు, నేను, లేను – యేమొ మాయమయ్యె నయ్యెడన్.

*

మూర్ఛయేమొ లోన మూల్గు వినంబడె
నసుఱు గల దొకింత మసలినాఁడ
తోఁచె నాడలిలో నెదో చేతన–యెటో గ్ర
హింప నాస్వభావ మింపు లోలికె.

*

దానిగుర్తు పట్టి యానంద మందితి
నట్టె దాని నంటి పట్టి కొంటి
ప్రజ్ఞ వెలసెఁ గన్ను పఱపితి; నది లోన
లోన కాంచు వెలికి రాని రాదు.

ప్రభాకరశాస్త్రిగారి తాత్త్వికదృష్టి యీ పద్యములలో సుస్పష్ట పడుచున్నది. కవితాపారమ్యమును గుఱించి వారి సందేశము మనము మననము చేసికోవలసియున్నది.

"...తాత్త్వికునిలో కవితాంశములును, కవిలో తాత్త్వికతాంశములును గూడ ననుగతములై యుండవచ్చును......తాత్త్వికుల తత్త్వజ్ఞానము పెరుగఁగా పెరుగఁగా, తన్మూలమున కవితలో తాత్త్వికతాంశములు పెరుగఁగా పెరుగఁగా సాధుమున తాత్త్వికతాశ్రద్ధ పెచ్చుపెరుగును. అపుడు కవిత తేట దేరి క్రమపరిణామముతోఁ బరమార్థపరాయణ మగును. కృత్రిమ కవితాపిడంబనముల కపుడు తా వుండదు. కవి కపుడు సత్యప్రతికృతి కల్పన మనావశ్యక మగును. సౌందర్యసముచిత మయిన యీ పరమార్థమే, అనఁగా సత్యమే యప్పుడు వాఙ్మయాకృతి దాల్చును. పదునాఱువన్నె బంగారమును మించిన మేనిసౌరు గల శుద్ధసాత్త్వికతేజో విరాజితునకు బంగారపు టలంకారములతోఁ బనియేమి?........."

ఇట్టి దివ్యసందేశము లందిచ్చు రచయితలు మహాత్ములు కారా? ప్రభాకరశాస్త్రిగారి జీవితము మనరచయితలు కోరదగినదిగా నుండవలసినది. తిరుపతి కళాశాలలో నుపాధ్యాయవృత్తిలో నిపుడున్నారు. గ్రంథముల వలనఁ గొంతరాఁబడి వచ్చుచున్నది. ఇది యంతయు నతిథ్యభ్యాగతుల సత్కారమునకు వినియోగింపఁబడుచున్నది. భోగ త్యాగములు సరిగా నలవఱుచుకొన్నవారిలో శాస్త్రిగారిది యుత్తమస్థానము. మఱి యొకటి: సమాజసంస్కారమును వాంఛించుటయే కాక, ఆచరించి చూపుట వీరిలో గొప్ప విశేషము. శ్రీ పిన్నా అప్పారావుగారు, ప్రభాకరశాస్త్రులుగారును విభిన్నశాఖీయు లయ్యును వియ్యమంది రనుట చెప్పఁదగిన విషయము. ఎన్నో విశిష్టలక్షణములతో నిండారియున్న వేటూరి పండితుని సాహిత్యసేవ శాశ్వతమైనది. ఆయన రెడ్డి రాజ్య చరిత్ర పరిశీలనము, చారిత్రకులకు మేలిబాట చూపినది. ఆయన పీఠికలు మహాగ్రంథములై పొలుపారుచున్నవి. ఆంధ్రకవిత, అరసున్న, ఆంధ్ర లిపి సంస్కారము, వింతనిఘంటువులు మున్నగువిషయములపై వారు చర్చించి ప్రకటించిన సత్యములు మఱచిపోరానివి. ముద్దుముద్దుగా, రసకుల్యలుగాఁ బ్రవహింపఁజేసిన వారి ఖండకావ్య రచనలు సమాస్వాదింపఁదగినవి. భాషా—సారస్వత పరిశోధనములందు ప్రసిద్ధులైన ప్రభాకరశాస్త్రిగారి జీవనము విద్వత్కవిలోకమునకు విజయ వైజయంతిక.

చిలుకూరి నారాయణరావు

1890

జన్మస్థానము : విశాఖపట్టణ మండలములోని పొందూరు దగ్గఱ నున్న ఆనందపురము. ప్రకృతనివాసము : అనంతపురము. జననము : 1890 సం॥ గ్రంథములు : మతము :- ౧. అథర్వవేదము [మూలము ప్రతిపదార్థము తాత్పర్యము] ౨. ఋగ్వేదసాయన [భాష్యోపోద్ఘాతమునకు తెలుఁగు] ౩. భగవద్గీత [ఆంధ్రవచనము] ఇత్యాదులు. స్మృతిగ్రంథములు : ఆపస్తంబ ధర్మసూత్రములు ౨. గౌతమధర్మసూత్రములు [తెలుఁగు వచనము] ఇత్యాదులు. ఇతర మతగ్రంథములు :- ౧. త్రిపిటకములు ౨. ధమ్మపదము ౩. అశోకుని ధర్మశాసనములు [పాలిమూలము, సంస్కృతము తెలుఁగు] ౪. గౌతమ బుద్ధునిజీవితము ౫. జైనమతము ౬. శైవసిద్ధాంతము ౭. బసవేశ్వరుని చరిత్రము ౮. అద్వైతసిద్ధాంతము ౯. కురాను షరీఫు [ఇస్లామూమూలగ్రంథమునకు తెనుఁగు] ౧౦. బైబులు [ప్రాఁత క్రొత్త నిబంధనలకు తెలుఁగు] ౧౧. సర్వమత సామరస్యము— సంస్కృత భాషాకృతులు :- ౧. సిద్ధాంతకౌముది [మూలము, తెనుఁగు వివరణము] ౨. విక్రమాశ్వత్థామీయము- ఇత్యాదులు. శాస్త్రగ్రంథములు :- ౧. తర్కసంగ్రహము ౨. శిశుమనశ్శాస్త్రము ౩. ప్రసవశాస్త్రము ఇత్యాదులు 25 శాస్త్రగ్రంథములు. చరిత్రకృతులు :- రోమను, గ్రీసు, రష్యా, చీనా, జపాను, బర్మా, ఆంధ్ర ఇత్యాది దేశ చరిత్రములు మొత్తము 20. జీవితచరిత్రములు ; గాంధీ చరిత్ర, టాల్‌స్టాయి చరిత్ర మున్నగునవి 8. భాషాశాస్త్రకృతులు :— ౧. ఆంధ్రభాషా చరిత్ర [2 భాగములు] ఇత్యాదులు మొత్తము 8. సంస్కృత ప్రాకృతాది వాఙ్మయ చరిత్ర గ్రంథములు 14. భాషాస్వయంబోధినులు 15. విద్యావిధాన గ్రంథముల మొత్తము 10. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము [10 సంపుటములు] కవి జీవితగ్రంథములు మొత్తము 20. నాటకములు :- ౧. అంబ లేక పెండిశిఖండి ౨. అశ్వత్థామ ౩. అచ్చి లేక కాపురలపు ౪. పెండ్లి ౫. వాడే [పరిశోధకము] ౬. నాటక నాటకము. [హాస్యము] ౭. తిమ్మరుసు. ౮. బొమ్మపొత్తికలు ౯. మధురాంతకి ఇత్యాదులు మొత్తము 20. పద్యకావ్యములు :- ౧. రుబాయత్ [ఉమార్ ఖయామ్]

౨. తుకాంబ ౩. జపానుదేశ కవిత [తొలిసంజ- తెలిచాయలు] ఇత్యాదులు మొత్తము 11. నిఘంటువులు :- ౧. సంస్కృతాంధ్ర నిఘంటువు. ౨. అచ్చికపద నిఘంటువు. ౩. నన్నయ భారత పద కోశము ౪. తెనుఁగుసామెతలు [1,50,000 సామెతలు తెలుఁగుదేశము లోనివి] ఇత్యాదులు 18.

WORKS IN ENGLISH

(1) Translations from Tikkana. (2) Translations from Potana. (3) The songs of Tyagaraja (4) The dance of the Rain-drops (Modern Poetry,) (5) A Survey of Telugu Literature (6) Modern trends in Telugu literature—

పయిని పేర్కొనఁబడిన గ్రంథములలోఁ గొన్ని మాత్రము ముద్రితములు.

డాక్టరు చిలుకూరి నారాయణరావుగారి పేరు తెలియనివారుండరు. ఆయన ఎమ్. ఏ. పి హెచ్, డి, ఎల్. టి. అనంతపురము 'ఆత్రేయాశ్రమము' వారి యునికి. కాని, ఆంధ్రభాషాచరిత్ర ప్రచారమునకు నారాయణరావుగారు యావదాంధ్రము సంచారము చేయుచుందురు. ఇప్పటి, వారి వయస్సు షష్టి. ఈముదిమిలో భావపుష్టి కలిమిఁ, దెలుఁగుదేశమే కాదు భారతభూమి సర్వము పర్యటింపఁ గలుగుచున్నారు. ఈమానిసి భౌతికముగా ద్రఢిష్ఠుఁడు కాఁడు. 'దర్భపుల్ల' వలె సన్నమైన గాత్రము. ఒకకన్ను కొంచెము మెల్ల. మఱి, వ్యక్తిని జూడఁగా, సపాద లక్షపుటల పరిమితిగల వాఙ్మయమును సృష్టించిన మహారచయిత యీయనయేనా, అని సంశయించుకొనునంతటి చిత్రము. ఈ నడుమనే కర్ణాటక దేశయాత్రలో ధార్వాడ, హుబ్బళ్ళి, బిజాపురము, బెళ్ఘ్వారు మున్నుగా నెన్నో పట్టణముల సంచారము గావించి యాంధ్రవాఙ్మయ ప్రశస్తి నగ్గడించివచ్చినారు. దర్భంగ, వారణాసి మున్నుగానున్న

పట్టణములలోనున్న అఖిలభారతరచయితల మహాసభలోఁ బాలుగొని తెలుఁగు దేశభాష విశిష్టతయిట్టిదా! యనిపింపఁ జేయునటులు మాటలాడినారు. ఆంధ్రరాష్ట్ర ప్రత్యేకతకై నడుముకట్టిపనిచేయు కర్మవీరులలో నారాయణరావుగారు నొకరు. ఆయనది వజ్రసంకల్పము. ఆయన కావించిన భాషా—వాఙ్మయ చరిత్ర పరిశోధనము లనంతములు. ఆంధ్రవిశ్వవిద్యాలయము ప్రకటించిన రెండు పెద్ద సంపుటములలో నారాయణరావుగారి భాషాచరిత్రపరిశీలనకు రూపము కట్టియున్నది. ఈ గ్రంథము రావుగారి సేవకు లక్ష్యమే కాకుండ, మనభాషకు మండనము. ఈ గ్రంథములో గతానుగతికమైన విమర్శనము కాక, సొంతమైన పరిశ్రమము హెచ్చుగా నున్నది. అది కారణముగా నిట్టి కృతులు పెక్కుకాలము సమారాధన యోగ్యములు కాఁగలయవి. తెనుఁగునకు ద్రావిడ భాషా సంబంధమునుగూర్చి నెఱపిన 'కాల్డ్వెల్' సిద్ధాంతమును గాదనుచు నారాయణరావుగారు చేసిన యమోఘ కృషికి వారి 'ఆంధ్రభాషాచరిత్ర' మెలిపంట. వీరి సిద్ధాంతములపై రాద్ధాంతములు వెలువడుచుండుటయు గమనించుచున్నాము. ఏమైనను, ఒకరి దారి ననుకరించుచుఁ జేసిన విమర్శనముకంటె, స్వతంత్రులై చేసిన విమర్శనము హృదయములకు హత్తుకొని నిలవగా నుండుటకును వీలగును. ఇట్టి స్వతంత్ర పరిశ్రమము నారాయణరావుగారిని వలచినది. వాఙ్మయ చరిత్ర విషయములో నారాయణరావుగారి దారులు కొన్ని ప్రామాణికములు కావనుకొందురు. ఈ విషయమున నేను బొత్తిగా నజ్ఞుఁడను.

చరిత్రపరిశోధన మొక బండపనియనియు, చరిత్ర పరిశోధకుల హృదయములు రసార్ద్రములు కావనియు ననుకొనుట పరిపాటి. అది నేఁటి కాలమున చాలభాగము తగ్గినది. శ్రీ ప్రభాకరశాస్త్రి, సోమశేఖరశర్మ ప్రభృతులు ఇరువైపుల వాఁడిగల పండితులు. నారాయణరావుగారినిగూర్చి యోచించినపుడు, వీరేశలింగముపంతులుగారు స్మర

ణకు వత్తురు. పంతులుగారు పేరుగొన్న చరిత్రశోధకులే. వారి కవితా కళాభిరతియు జగద్విఖ్యాతము. కావ్యములు, ప్రహసనములు, నవలలు, నాటకములు వందలుగా రచించిరి. వారివలెనే పరిశోధనశక్తికిఁ దోడు కవితా సౌందర్యము నుపాసించిన కవులు నారాయణరావుగారు. వీరి 'అంబ' — 'అచ్చి' మొదలయిన నాటకములకుఁ దెలుగునాటఁ బేరు వచ్చినది. నవ్యసాహిత్యపరిషత్తు సంస్థాపకులలో, అధ్యక్షగణములో నారాయణరావుగారొకరు. అభ్యుదయ రచయితలలోను వీరికి సభ్యత యున్నది. అసలుగా ఆధునిక సాహిత్యదృష్టి వీరి కత్యధికముగా నున్న దనుట. ఆయన పద్యములు ఛందోబంధమున వ్రాసెను. పాటలును వ్రాయును. 'మహానటుని మాయూరనృత్యము' అను పేరుతో కాశిలో జరిగిన అఖిల భారత రచయితల మహాసభలో ఆశువుగాఁ బాడినగేయ మొకటి నారాయణరావుగారు ప్రకటించినారు. అది కొన్ని చరణములు మనవిచేసెదను. అఱువదియేండ్లు నిండిన రావుగారు, ఈపాటలో ఇరువది యేండ్ల యువకులై కనిపించుచుండె నని నా కానందము.

ఈసదామహాశ్మశాన - వాసి కాశికావిభుండు
విశ్వనాథుఁడిపు డిదేమొ - యీ చిదంబర ప్రచండ
కాలమేఘరాశి జూచి - యానందం బంతకంత
కతిశయింపగా మయూర - నృత్యముతో మూదలించి
నందికేశనాట్యరీతి - ధుంతినాథ లాస్యఫణితి
మించి తాండవించె నేఁ డిదేమొ - రండు, గణనాథులు!

*

కాళ్ళకు గజ్జెలు - కటిపై పులితోల్
హస్త, కంఠ, భుజ - మస్తక ఫూత్కృ
తసర్ప భూషణుఁడు - మహానటుడు
నృత్యమాడు లాస్యమాడు తాండవించు

నోంకార శ్రుతితో నారాయణ రాయరచిత
గీతమునకు నా సహృదయసభ్యులెల్ల
తాళగతుల జతులతోడ మనోవిధి
తాముగూడ తాండవింప - ఇదిగో నృత్యము
భారత భూమీ వాయువ్య దిశా
ప్రచలిత ఝంఝూ మారుత ప్రేరితంబై
భారభారాలసంబై క్రూరదృక్ క్షోభితంబై
తధిగిణ తళంగ్
తళంగ్ ! తళంగ్ ! తళంగ్

*

ఇదిగో, ఇదిగో ప్రచండ తాండవ మిదిగో,
పాకిస్తాన్ - ద్రవిడస్తాన్
కొట్టేస్తాన్ - చంపేస్తాన్
ఖణిల్ ! ఖణిల్ !
ఢమా ! ఢామ్.

ఈ యావేశము నవీన కవులలో నందఱికిని లభింపని యావేశము. నారాయణరావుగారికి దేశ మనఁగా భాష యనఁగా నెక్కడలేని యుత్సాహము పుట్టుకొని వచ్చును. వీరు వ్యావహారికభాషావాదులు. గిడుగువారి గురుత్వము. వ్యావహారికభాషలో రసవంతమైనట్టిదియు, జీవవంత మైనట్టిదియు నగు మార్గము గ్రంథరచనానుకూలమైనది యున్నదని నారాయణరావుగారు సనిదర్శనముగాఁ జాటుచుందురు. ఈయన విమర్శనము మొగమోటము లేకుండ సూటిగాఁ బోవును. 'సజీవభాష' ను గూర్చి నారాయణరావుగారు నిష్కర్షించి ప్రకటించిన యభిప్రాయమిది:-

"...సజీవభాషయనఁగా...జీవముతో కూడిన భాష. ప్రాకృత జన భాషితమైనభాష. ఆ ప్రాకృతజను డిప్పటివాడే కానక్కరలేదు. ఏనాటి

వాడైనా కావచ్చు. ప్రాకృతానుభవములు నాభాషలో ఎన్నడైనా వ్యక్తపరిచిఉంటే అది సజీవభాషే అవుతుంది. కాబట్టి యీలక్షణము కలిగి ఉన్నంతసేపున్నూ కావ్యభాష సజీవభాష కాదనడానికి వీలులేదు. కావ్యములలో ఉపయోగింపబడక పోయినంతమాత్రముచేత అది సజీవ భాష కాకపోదు. భాషాప్రయోజనము సిద్ధిస్తున్నంతసేపున్నూ అది సజీవ భాషే. కాని, ఆభాష కేవలవ్యావహారికమై స్థూలజగత్ప్రచారములో ఉన్నా కావ్యజగత్తులో తాండవించి సూక్ష్మేంద్రియగ్రాహ్యము మాత్రమే అయినా సంస్కృతవాణికి లక్షణములుగా ఆలంకారికు లేర్పఱిచిన దశవిధ గుణభూషితమై దశవిధ దోషవర్జితమై మనోహర రస, రీతి, పాకశయ్యాలంకార శోభితమైఉంటే అంత ఆదర పాత్ర మౌతుందని వేరే చెప్పనక్కఱలేదు. భాషాశోభ కుపకరించి దాని జీవమును ప్రకటించే విధానము నాలంకారికు లేర్పరించియున్నారు. "

భాషా — వాఙ్మయములకు నిరంతరసేవ గావించు నారాయణరావు గారి విద్యాభ్యాసాదులను గూర్చి ముచ్చటించు కొనవలయును. ఆయన జన్మస్థానము విశాఖపట్టణ మండలములోని ఆనందపురము. కాని, ఆయనకు రాయలసీమవారుగానే పరిగణనము. నేనిట్లనను. నారాయణ రావుగారిది తెలుఁగుదేశము సర్వమును. ఈసీమల ద్వైతభావము నశించినఁగాని మనకు ముక్తిలేదు.

పర్లాకిమిడి కళాశాలలోను, విజయనగరము మహారాజ కళాశాల లోను రావుగారి ఆంగ్ల విద్యాభ్యాసము. విజయనగరములో నుండగనే సాహిత్య కృషికి బీజావాపము జరుగుట. మదరాసు విశ్వవిద్యాలయమున, తెలుఁగు, కన్నడములలోఁ బట్ట భద్రతా లాభము. తరువాత కొలఁది కాలమునకే నారాయణరావుగారు "డాక్టరు ఆఫ్ ఫిలాసఫీ". ఈ బిరుదము 11 వ శతకములోని తెలుఁగు రచనను గూర్చి చేసిన పరిశోధ

నముననకుఁ బంట. అసలు, పసినాఁటినుండి రావుగారికి భాషా—సారస్వత చరిత్రపరిశోధకతలో మంచియాస్థ. బోధనచాతుర్యము వీరిది గొప్పది. విశాఖమండలములోని 'అరసవిల్లి'లో రెండుపాఠశాలలు నారాయణ రావుగారు నెలకొల్పిరనఁగా, ఆయన సేవాపరాయణత యెట్టిదో భావింపుఁడు. ఆపాఠశాలలో నొకటి రైతుపిల్లలకు, రెండవది హరిజను లకు నుపయోగించునవి. వ్యవసాయము మీఁద రావుగారి కెంతో మక్కువ. గంజాం జిల్లాలో జరిగిన నూతన వ్యవసాయ పరిశోధనపుఁ బోటీలో వీరికి బంగారు పతకము బహూకృతి లభించినది. ఉత్తరసర్కారు జిల్లాలో ఇంగ్లీషు బోధనశక్తి ప్రచారము చేయుటకుఁగా "ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్సు" ఉద్యోగము రావుగారి కీయఁబడినది. ఈ యవకాశ ములో వీరు జర్మను-అమెరికా సంయుక్తరాష్ట్ర విద్యావిధానములను గూర్చి తెలుఁగునఁ బ్రచారముగావించిరి. తరువాత, అనంతపురము కళా శాలలో నాచార్యకము. సుగృహీతనామధేయులగు నెందఱో శిష్యులు రావుగారి పేరు చెప్పుకొనుచున్నారు. ఈయదృష్టము వారిది మెచ్చఁ దగినది. మదరాసు, మైసూరు, ఉస్మానియా విశ్వవిద్యాలయములలో నెన్నో సంఘములకు వీరు సభ్యులుగా నుండి గౌరవముల నందిరి. రాజ మహేంద్రవరము నందలి 'ఆంధ్రేతిహాస పరిశోధకమండలి' కిఁ బెక్కు కాలము అధ్యక్షులుగా నుండి నారాయణరావుగారు చేసిన పరిశోధన కృషి యమోఘమైనది. ఆ మండలికి తాళపత్త్రగ్రంథములు, కొన్ని వందలు వీరు దారవోసిరి. చాల కాలమునుండి సేకరించిన శిలా— తామ్ర శాసనములు, నాణెములు మండలికే యిచ్చివైచిరి. ఈ యౌ దార్యము చారిత్రకులకు శిరోధార్యమైనది. రాయలసీమలోని కృష్ణ దేవరాయ విద్యాపీఠసంస్థకు స్థాపకత్వము, అధ్యక్ష్యము నారాయణ రావుగారిది. ఇట్టి భాషా లోకోపకారకములగు కార్యముల వలనఁ జిలుకూరి వంశ తిలకుఁడు మాయని యశస్సు సంపాదించెను.

చిలుకూరి నారాయణరావు

నారాయణరావుగారు వ్రాసిన గ్రంథములు శతాధికములుగా నున్నవి. ఆయన సారస్వతమునకు సంబంధించిన ప్రతిశాఖలోను విలువ గల వ్యవసాయముచేసి యెన్నో కృతులు పండించెను. నవలలు—నాటకములు—జీవిత చరిత్రములు—భాషాచరిత్రములు—పద్యకావ్యములు—గేయములు—ఇవన్నియు వ్రాసికొన్నారు. ఉపనిషత్తులు, భగవద్గీత, అథర్వవేదము ననువదించినారు. 'ప్రపంచమతగ్రంథమాల' నెలకొలిపి పెక్కు వాఙ్మయములలోని రచనలు తెలుగులోనికి వారు పరివర్తనముచేసి యిచ్చినారు. కురాను షరీఫు—జెండావెస్తా ఇత్యాదులు నారాయణరావుగారి లేఖిని శతాధిక గ్రంథములు సృష్టించునట. ఆయన వాఙ్మయ తపస్వి; సారస్వతయాజి; వాఙ్మయద్వారమున దేశారాధనము, ఈశ్వరసేవ సాగించుచున్న మహాశయుడు.

శ్రీ రావుగారి కృషిని గుర్తించి బ్రిటిషుదొరతనము 1947 జూనులో 'మహామహోపాధ్యాయ' బిరుదము నిచ్చినది. నాడు ఇండియా ప్రభుత్వము, పరప్రభుత్వములిచ్చిన బిరుదములను నిషేధించినందు వలన వీరు దానిని స్వీకరింపలేదు. 1947 నవంబరులో కాశీ సంస్కృత విద్యాపీఠము 'మహోపాధ్యాయ' బిరుదముతో జోడు సాలువల నిచ్చి రావుగారిని సన్మానించినది. వీరి నాటకరచన, విమర్శన శక్తి గమనించి "ఆంధ్ర బెర్నార్డుషా" యనియు వ్యవహరింతురు. సత్యమైన సేవా పరాయణత గల కళాప్రపూర్ణులకు బిరుదభారముతో పనియుండదు. ఓరిమి — పరిశ్రమ పేరిమి — ప్రతిభా వ్యుత్పత్తుల నేరిమి కలసి చిలుకూరి నారాయణరావుపేర వెలసినది. అనంతపురమున, ఆత్రేయాశ్రమ వాసములో సుపవిత్ర జీవితము గడుపుచున్న చరితార్థులు వారు.

మల్లంపల్లి సోమశేఖర శర్మ

1891

జన్మస్థానము : మినుమించిలిపాడు అగ్రహారము. నివాసము ప్రకృతము మదరాసు. జననము: 1891 సం. రచనలు :- ౧. ఆంధ్రవీరులు ౨. అమరావతీస్తూపము. 3. చారిత్రకవ్యాసములు ౪. ఆంధ్రదేశచరిత్ర సంగ్రహము ౫. రోహిణీచంద్రగుప్తము [నవల] ఎన్నో వ్యాసములు, శాసన పరిష్కారములు, పీఠికలు మొదలగునవి. ఆంగ్లగ్రంథములు :- 1. Forgotten Chapter of Andhra country. 2. The History of the Reddy Kingdoms.

నేఁటిచరిత్రపరిశీలకులలో సోమశేఖరశర్మగారి స్థానము మహోత్తమమైనది. కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారి తరువాతఁ బ్రామాణికత వీరిదే యని తెలుఁగువారికిఁ జక్కని విశ్వాసము కలదు. లక్ష్మణరావుగారు, వీరభద్రరావుగారు తొలుత శర్మగారికి లక్ష్యభూతులు. విజ్ఞానసర్వస్వ రచనలోఁ బెద్దకాలము లక్ష్మణరావుగారికి శర్మగారి సాహాయ్యసంపత్తి చేకుఱినది. నిశితమైన చూపు — నిర్మలమైన మనస్సు — సహజమైన కళారసికత — సందర్భశుద్ధమయిన వాక్కు — నిక్కమయిన చరిత్రజ్ఞాన — నిరంతరాయమైన పరిశోధనము — ఇన్ని సుగుణములరాశి, శర్మగారనఁగా సాధారణుఁడు కాఁడు. శాసనపరిష్కారములో నేఁడున్నవారిలో వారినిదాఁటినవా రుండరు. లిపిశాస్త్ర మీయన చక్కఁగా నెఱుఁగును. శాసన దర్శనమునకు లిపిరహస్యజ్ఞత సుధాంజనము. ఆ మేలి కాటుక శర్మగారి సొంతము. ఈయనసంగ్రహించి ప్రకటించిన శాసనము లిన్ని యన్ని యని యెన్నఁజాలము. ప్రాచీనదక్షిణహిందూదేశ చరిత్రము సర్వము శర్మగారికిఁ గరబదరము. బౌద్ధయుగమును గూర్చిన వీరిపరిశీలనము గొప్పవిలువగలది. రెడ్డియుగమును గూర్చిన వీరి

యమోఘము, నపూర్వమునగు విస్మృతవిషయ సందోహము మహాగ్రంథమైనది. సాతవాహనులు – చాళుక్యులు – కళింగ గాంగులు – కాకతీయులు – వీరివీరియుగములను గాలించి పరమరహస్యము లెన్నో వెల్లడించిన పరిశోధకతల్లజులు మల్లంపల్లివారు. నిజమున కాయన గొప్పయుద్యోగములో నుండవలసినది; లేదా, మహాధనవంతుఁడుగా నైననుండఁగిదనవాఁడు. ప్రస్తుతమీ రెండును నెఱసున్నలు. ఆయనకు విడవరాని మహోద్యోగము పరిశోధన మొక్కటే. ఆయనకున్న మహాధనము ఆంధ్రవాఙ్మయ మొక్కటే. తెలుఁగువారి పూర్వసంస్కృతి త్రవ్వి త్రవ్వి తండములయిన వ్యాసములలో మనకందిచ్చిన శర్మగారు పూజనీయులు. శాసనపరిశోధకులు, భాషాపరిశీలకులు నైనవారికి సాధారణముగాఁ గళావిలాసములు తెలియవు. అది హేతువుగా, రచనా సౌందర్యమును వారు ప్రదర్శింపలేకపోవుదురు. శర్మగారి కటులు కాదు. ఈయన యెన్నఁదగిన కళార్ద్రహృదయముగల వ్యక్తి. కవిత్వము లోఁతు లెఱుఁగును; కళల నెన్నింటనో పరిచితియున్నది. అందుకే, యీయనరచన సహృదయహృదయములను స్పందింపఁజేయు మాధురీ మార్దవములఁ బొదిగించుకొన్నరచన. గ్రాంథిక – వ్యావహారికములు రెండును వడిగా, వాఁడిగా వ్రాయఁగలుగుదురు. గహనములయిన చరిత్రవిషయములు వీరి కవిత్వములోఁబడి సౌలభ్య వాల్లభ్యములై ప్రజాసాధారణమునకు సుఖలభ్యములగును. ఆవేశోత్సాహములు జనింపఁజేయు నింపయిన రచన శర్మగారిచేతిలో నున్నది – ముచ్చటకుఁ గొన్ని మచ్చుపంక్తులు :-

" ......వామనుఁడు తనపాదత్రయముచే ముల్లోకముల నావరించినట్లు భారతధర్మ సంస్కృతి యీమూఁడు ప్రస్థానములయందును దిశాష్టకము నాక్రమించి యతిశయిల్లినది. అప్పటికి నిప్పటికిఁ బ్రపంచ చారిత్రమున ధర్మ సామ్రాజ్యమును స్థాపింప యత్నించిన వారును, స్థాపించినవారు నొక్క భారతీయులే. భారతీయుల ధర్మసంస్కృతి

సామ్రాజ్య చారిత్రము అపూర్వమైన యొక ధర్మ విజయ గీతము; ఒక అహింసావిజయగాథ. అది భారతీయుల మంజుల మధుర మనోహర స్వాప్నిక గానము.

ఏమో ఎవ్వరెఱుఁగుదురు, ఎప్పుడు పుట్టి పెరిగి యంతటి పెద్దవాఁడయ్యెనో? ఎంత కాలమునుండి యచ్చట నివాసముండెనో? చరిత్రకు కొంతప్రాజ్ఞత వచ్చునాఁటికే ఆ యుష్మంతుఁడయిన ఆర్యకుమారుఁడు భారతభూమికి వచ్చినట్లు రుచేయుచున్నాడు, వనలక్ష్మి యంగాలు దిద్దుకొని సాంద్రాటవీ సీమల మధ్య ఆశ్రమపదములు నిర్మించుకొని పర్ణకుటీరము లందు కర్మపరతంత్రుఁడై విరాజిల్లెను. ముం దగ్నిహోత్రముతో పార్శ్వములయం దధ్యయన పరాయణమైన ఛాత్ర బృందముతో వేదఋక్కులు వల్లెవేయుచు, నెడ నెడ సామగానము నాలపించుచు తాను త్రొక్కినంత మేర భూతలమును కర్మనిబద్ధముగను, ధర్మనిబద్ధముగను గావించి తనచూపు ప్రాఁకినంత తెక్క తానే పెద్దనని గడ్డము సవరించుకొనుచు దర్పముతో ప్రవర్తించిన కర్మవీరుఁ డతఁడు. జగత్తింకను నిద్రాపరవశమై యుండఁగనే తొలుదొలుత మేలుకాంచి తెలివి తెచ్చుకొని పెద్దఱికము వహించిన ప్రోఢ యువకుఁడు. ఎవ్వ రెఱుఁగుదురు? ఎప్పుడు పుట్టి పెరిగి యంతటి పెద్దవాఁ డయ్యెనో? ఎంతకాలమునుండి యచ్చట నివాసముండెనో?......"

'చారిత్రకవ్యాసములు' 8 పుట

చక్కని తీరుడల యిట్టిరచనలో నెన్నో క్రొత్తవిషయములు శర్మగారు తెలుఁగువారి కిచ్చుచున్నారు. విజ్ఞాన దృష్టికి మల్లంపల్లి వారి జీవిత మొక వసంతారామము. ఆర్థిక దృష్టిలో, ఆయన నిరంతర శ్రమజీవి. బాల్యమునుండియుఁ బేదఱికమునకుఁ బాలుపడి విజ్ఞాన సమార్జనము చేసికొనెను. మనుగడలో నొడుదొడుకులు, దుందుడుకులు రానిచ్చుకొనని స్వభావము మొదటి నుండియు నున్నది. ఆంగ్ల విద్యలో నున్నత

పట్టములు పడయు వలయునసడి తీవ్రాశను, ధనాభావము సన్నవడఁ జేసినది. పసినాఁట సంస్కృత విద్యాభ్యాసము. మేనమామగారి సహకారముతో "స్కూలు ఫైనలు" ఉత్తీర్ణత. అప్పటి శర్మగారి యీడు పదునారేండ్లు. ఆలేతవయస్సులో నుద్యోగము కోసము నవసి నవసి మెచ్చటను స్థిరపడక యుండెను. నాఁటి జాతీయ మహోద్యమ నాదములు శర్మగారిలో నొక నూతనచైతన్యము రేఁపినవి. 1911 సం॥ ప్రాంతములో నుద్యోగ గవేషణము వదలుకొని మదరాసు ప్రయాణము. అచట, ఆంధ్రులచరిత్ర గ్రంథము సంధానించుచున్న మహామహుఁడు చిలుకూరి వీరభద్రరాయనితోఁ బరిచితి యేర్పడినది. శర్మగారికి రావుగారితోఁ జరిత్రపరిశోధనము గావింపఁ దలంపు కలిగి నది. ఆదిలో, "కన్నమరా గ్రంథాలయము" న నచ్చుగాని కృతులకుఁ బ్రతులు వ్రాయుట శర్మగారి యుద్యోగము. చాలీ చాలని యక్కడి జీతముతో జీవితము సాగించుకొనుచు నున్న శర్మగారికి, లక్ష్మణరావు గారి చెలికారము భావ్యర్థ సమవలంబమైనది. 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ' రచనా సహకృతితో శర్మగారికి లక్ష్మణరావుగా రర్థసింహాసన మిచ్చి యభినందించిరి.

1912 లో, ఆంధ్రుల చరిత్ర రచన ముగిసి వీరభద్రరావుగారు రాజమహేంద్రవరము వచ్చివేసినారు. శర్మగారును మదరాసు మకాము మాని రాజమహేంద్రవరమే వచ్చి యుండి 1914 మొదలు నాలుగేండ్లు చిలకమర్తి లక్ష్మీనరసింహారావుగారి 'దేశమాత' పత్త్రికకు సంపాదకత నిర్వహించిరి. ఈ సంపాదకత్వము శర్మగారి పరిశోధన రచనా ప్రణాళిక కొక జక్కని త్రోవలు తీయించినది. మఱియొకటి చెప్పఁదగిన సంగతి; వీరు "ఆంధ్రాభ్యుదయ గ్రంథమాల" నెలకొలిపి ఆంధ్రవీరులు, ప్రాచీన విద్యాపీఠములు, ప్రాచీనాంధ్ర నౌకా జీవనము మున్నగాఁ గొన్ని గ్రంథములు వెలువరించిరి. ఈతీరున సారస్వతమును సేవించు మల్లంపల్లి

శర్మగారికి, మరల మదరానునుండి కొమర్రాజు వారి యాహ్వానము. దుర్నియతి యటులుండి, శర్మగారు చెన్నపురి చేరిన కొలది నాళ్ళకే లక్ష్మణరావుగారి యస్తమయము. అది 1923 సంవత్సరప్రాంతము. 'విజ్ఞాన చంద్రిక' సన్నవడినది. విజ్ఞానసర్వస్వమునకు అదియాది పెక్కేండ్లు శర్మగారు చేసిన కృషి మఱచి పోరానిది. ఈ వ్యవసాయము నకు ఫలముగా ఆంధ్రవిశ్వవిద్యాలయమువారు చరిత్రపరిశీలక పండితు లుగా రమ్మని శర్మగారిని పిలిచిరి. వారచటఁ గావించిన యమోఘ పరి శ్రమమునకు సాక్షులు "ఎ ఫర్గాటన్ చాప్టర్ ఆఫ్ ఆంధ్ర హిస్టరీ"—"ది హిస్టరీ ఆఫ్ ది రెడ్డి కింగ్డమ్స్"—అను రెండుచరిత్రగ్రంథములు.

శర్మగారిది సంస్కృతాంధ్రాంగ్లభాషలలో 'డిగ్రీలు' లేని నిశితప్రజ్ఞ. ఆంధ్రవీరులు, రోహిణీచంద్రగుప్తము, కొన్ని చిన్నకథలు వీరి కళా రచనాభిరతిని దృష్టాంతీకరించుచున్నవి.

ఈయన చారిత్రకవ్యాసములలో బౌద్ధ సంస్కృతి రూపు కట్టి యున్నది. 'రేడియో' లోఁ బ్రచారితమగు వీరి 'ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము' సంగ్రహమైనను బహూపయోగియగు కూర్పు. సహృద యులు, చరిత్రపరిశీలకశేఖరులు నగు వారి యునికి ప్రకృతము చెన్న పురిలో. నిర్బంధోద్యోగపు టుచ్చులలో నిచ్చలు ఉండలేని స్వతంత్ర జీవులు శర్మగారు. ఆంధ్రచరిత్ర— సంస్కృతులను గూర్చి యింక నెన్నో నూత్నవిషయములు మనకు వారీయఁగలరు.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారితో శర్మగారికి మంచి నేస్తము. ఆయన 'ఆంధ్ర ప్రశస్తి' యీయనకుఁ గృతియిచ్చుచు నిట్లు వ్రాసెను:—

నీ వనుకోను లేవు, మఱి నేనిది చెప్పను లేను, కాని య
న్నా, వినవయ్య నేఁటి కిది నా చిఱుపొత్తము నీకు నంకితం
బై వెలయింపఁ జేతు హృదయంబులు నీకును నాకు మాతృదే
శావిల దుఃఖ దారితములై శ్రుతిగల్పె విషాద గీతికన్.

*

డిగ్రీలు లేనిపాండిత్యంబు వన్నెకు
రాని యీ పాడుకాలానఁ బుట్టి
నీ చరిత్ర జ్ఞాన నిర్మలాంభఃపూర
మూపర క్షేత్రవర్షోదకమయి
చాడీలకు ముఖప్రశంసల కీర్త్యర్థకు
స్థానమై నట్టి లోకాన నుండి
నీయుచ్ఛతర కమనీయ శీల జ్యోత్స్న
అడవి గాసిన వెన్నెలగుచు చెలఁగి
అంతె కాని గాఢశంకరాచ్ఛ శృంగ
తుంగము త్వదీయము మనస్సు పొంగి తెలుఁగు
నాఁటి పూర్వ చరిత్ర కాణాచి యెల్ల
త్రవ్వి తలకెత్త లేదె యాంధ్రజనములకు.

*

కొదమ తుమ్మెద ఱెక్కలఁ గుస్తరించు
మీసముల నీప్రసన్నగంభీర ముఖము
కన్నులంటఁగఁ గట్టినట్లున్న నిన్ను
మఱచి పోలేను జన్మ జన్మములకైన.

రాయప్రోలు సుబ్బారావు

1892

జననము: 1892. నివాసము: హైదరాబాదు. గ్రంథములు: ౧. కవితాంజలి [తృణకంకణము, స్నేహలతాదేవి, స్వప్నకుమారము గల సంపుటము] ౨. జడకుచ్చులు ౩. మధుకలశము ౪. రమ్యాలోకము ౫. తెనుగుతోట ౬. ఆంధ్రావళి ౭. లలిత ౮. వనమాల ౯. మధురయాత్ర ౧౧. మాధురీదర్శనము – ఇత్యాదులు.

అభినవాంధ్ర కవితావతరణమునకు దారిచూపినవారిలో రాయప్రోలు సుబ్బారావుగా రొకరు. సారస్వతపురోహితులగు సుబ్బారావుగారే యొకజాతి తెలుఁగుకైతకు 'భావకవిత్వము' అను నామకరణ చేసినట్లు విందుము. నేఁడు 'భావకవిత్వము' సర్వతోముఖముగా విస్తరిల్లినది. కవిత్వములో నవ్యమార్గము గురుజాడ అప్పారావుగారితో నారంభమైనదని కొందఱు, సుబ్బారావుగారితోఁ బుట్టినదని కొందఱును. అదియెట్టు లయినను, సుబ్బారావుగారితో నూతనకవిత్వమున నొకమెఱుఁగు వచ్చినదని చెప్పవచ్చును. ఈగౌరవము వారిమీఁద మన తెనుఁగు వారిలోఁ జాలమందికిఁ బొందుపడినది. సుబ్బారావుగారి ప్రాఁతలు క్రొత్తలో యువకవుల హృదయములలో నూతన సంస్కృతి బీజములు నాఁటినవి. ఈయన కలిగించిన సంస్కారములవలనఁ గలిగిన యొగ్గు లగ్గులు ప్రస్తుతము ముచ్చటింపరాదు.

'భావకవిత్వ' మను పేరిలోనే పెద్దపోరు. "భారతాదులలోఁ గవిత్వము లేదా? భావములేదా?" అని ప్రశ్నములు చాలఁబుట్టినవి. అందు గొన్ని సందర్భములేని ప్రశ్నములు. ఆలంకారికదృష్టి లేనివారు మాత్రమే 'భావకవిత్వము' అనుపేరు లెస్సగా లేదనుటకు సాహసింతురు. కాని ఒకటి. 'నవ్యకవిత్వము నాస్తిక కవిత్వము' అనుమాట కొందఱిలో కలిగించినది మనవారే. భాషాసంస్కారమున బహుస్వల్పముగానున్న కొందఱు

నూతనకవులు చేయఁగాని ప్రాఁతలు వ్రాసి, వానిపై భావకవిత్వ ముద్ర వేసి బ్రతుకు తెరువు చూచుకొనుచుండుటవలన నీ కొంపయునగ మైనది.

రాయప్రోలువారు పరిపక్వమతులు; పాశ్చాత్య సాహిత్యవిశారదులు; నవ్యకవితోపాసకులు. పదమూటి కవులందలి ప్రకృత్యారాధన పరత్వము వీరిలోఁ బుంజీభవించినది. వీరిభావన గభీరము ఘనమైనది. స్వరకల్పనము అభినవమైనది. వీరికవితకు ద్రాక్షా-కదళీపాకములు సహజములు.

మామిడి కొమ్మ మీఁద గల మంత్రపరాయణుఁడైన కోకిల
స్వామికి మ్రొక్కి నేఁ భినవస్వర కల్పన మభ్యసించితిన్
గోమల గౌతమీ రుచులకుం గదళీఫలపాక సిద్ధికిన్
లేమలబేరు నా తెనుఁగు లేఁతముదల్లు కాలొత్తు వేడుకన్.

రమ్యాలోకము

(1912 సం॥న నవ్యకవిత్వ నేపథ్యమునుండి క్రొత్త నడలతోఁ గొత్తవిలాసములతోఁ గ్రొత్తహావభావములతో 'లలిత' కావ్యము రంగమునకు వచ్చినది. తోడనే రసజ్ఞభావుకుల చక్షూరాజీవములు దానిపైఁ బడినవి. 'లలిత' తో యువకవు లువ్విళులూరిరి. ప్రాచీనసాహిత్య పరాయణులు 'లలిత' స్వేచ్ఛాప్రవృత్తికి లోలోపల బాధపడిరి. ఆంగ్లేయవాసన పట్టి క్రమముగాఁ దెలుఁగువారు నవ్యకావ్య పఠనమున కలవాటు పడినారు. 'తృణకంకణము' వెలువడినది. శాబ్దికముగాఁ గొన్ని దోసఁగులు దొరలినను సుబ్బారావుగారిది మంచి నిబ్బరమైన కవితా ధోరణి యగుటచే యువకుల గుండెలకుఁ బట్టుకొన్నది. కష్టకమల — స్నేహలతాదేవి — స్వప్నకుమారము — తెలుఁగుతోట — ఆంధ్రావళి — రమ్యాలోకము మున్నగా నెన్నోకృతులు వీరివి విరివిగా వ్యాపించినవి.

రాయప్రోలు కవి 'శాంతినికేతనము 'నఁ గొంతకాలముండి రవీంద్ర సాహచర్య మనుభవించెను. ఆ సాహచర్యము వీరికవితా శక్తికి వికాసము. పెక్కుభాషల నెఱిఁగి ప్రకృతిరహస్యముల నాకళించి రవికవి

కవితాచ్ఛాయలు తెనుఁగునకు దింపుచు రాయప్రోలుకవి పలువురపాగ డ్తలకుఁ బాత్రుఁ డయ్యెను. కట్టమంచి రామలింగారెడ్డి యీయనను స్తుతించినాఁడు.

మఱియొకటి: శ్రీ సుబ్బారావుగారిలో జాతీయాభిమానము సహజమైనది. ఈయన అచ్చముగాఁ దెనుఁగువాఁడుగా వర్తించును. ఆంధ్రోద్యమము వీరి కవితకు రంగస్థానమైనది. 1913 నాఁటికి "రాయప్రోలు" జాతీయ కవితావాహిని పొంగినది. ప్రాంచీనాంధ్ర సామ్రాజ్యమహోన్నతి, ప్రాచీనసాహిత్యకళోన్నతి కన్నుల కెదురుగాఁ గట్టి యీ కవి మురిసిపోవును. "జారిన దేశగౌరవము చక్కఁగ దిద్ది మహాంధ్రమండలీ, భారము శ్లాఘనీయముగఁ బాలన చేసి సమానరాష్ట్రముల్, కూరిమి నాసఁ జేయఁ దెలుఁగుం బుడమిన్." సముద్ధరింపుఁడని తెలుఁగువారికి మేలుకొలుపు పాడిన రాయప్రోలు 'జాతీయకవు'లలో మొదటివాఁడు. ఈయన 'ప్రబోధము' సూర్యకిరణము వంటిది.

అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయములు స్థాపించునాఁడు
ఓరుఁ గల్లున రాజవీర లాంఛనముగాఁ
బలు శస్త్రశాలలు నిలుపునాఁడు.
విద్యానగరరాజ వీథులఁ గవితకుఁ
బెండ్లి పందిళ్లు కప్పించునాఁడు
పొట్నూరికి సమీపమున నాంధ్రసామ్రాజ్య
దిగ్జయస్తంభ మెత్తించునాఁడు,
ఆంధ్రసంతతికే మహితాభిమాన
దివ్య దీక్షాసుఖ స్ఫూర్తి తీవరించె
నా మహావేశ మర్థించి యాంధ్రులార
చల్లుఁ డాంధ్రలోకమున నక్షతలు నేఁడు.

తనగీతి యుజ్జ్వల జాతిని పాటకులను గా
డిద్ది వర్ధిల్లిన తెనుఁగు వాణి
తనపోటులు విరోధి తండంబులకు సహిం
పనివిగా మెరసిన తెనుఁగు కత్తి
తనయందములు ప్రాంతజనుల కభిరుచి వా
సన నేర్పి నలరిన తెనుఁగు రేఖ
తన వేణికలు వసుంధరను సస్యశ్యామ
లను జేయఁ జెలఁగిన తెనుఁగు భూమి
అస్మదార్ద్రి మనోవీధి నావహింప
జ్ఞప్తి కెలయించుచున్నాఁడ ; చావలేదు,
చావలేదు, ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర !
హృదయములు చీల్చి చదువుఁడో సదయులార!

రాయప్రోలు కవిగారి యీప్రబోధము ప్రజలనే కాక, యువకవు లను సైతము తొలి దినములలో లేపినది. పయిపద్యములు జీవన్మూర్తులై నేఁడు తెలుఁగునాఁడున సంచరించుచున్నవి. సుబ్బారావుగారి రచనలు రెండుగా వేఱుపఱుచుకొన్నచో నొకటి జాతీయ రచనల సంపుటము, రెండు ప్రేమకావ్యసంపుటము కాఁగలదు. వీరి ప్రేమ తత్త్వ సిద్ధాంతములు పవిత్రములయినవి. ఆధ్యాత్మిక తత్త్వ జిజ్ఞాస రాయప్రోలు కవీంద్రునిలో నుండవలసినంతగా నున్నది. "సచ్చిదానంద కల్యాణ సదన మయిన, యీ మనోహర జగతికి నేగుదెంచి ప్రేమలక్ష్మి నారాధింపవేమి యకట !" యిది వీరి యభిప్రాయము. కావ్యములలో సుబ్బారావుగారు ప్రదర్శించిన ప్రేమ లౌకిక సాధారణమైనదికాదు.

నడచి బడలిన యాయాన మెడలలేదు,
చీర చెఱఁగుల తడి యైన నాఱలేదు,

లేడి నరసిస యప్పుడె ముద్దాడి కొనియె,
నహహా ! యెంతటి ప్రేమార్ద్రి నూనెమె మనసు.

'తృణకంకణము'

*

ప్రియసఖుతోఁ బెంచికొన్న తీవియలు కొన్ని
విషలత లటంచుఁ దోఁచి నన్ బెరికి వైతొ ?
పూలు పూయవొ ? పరిమళంబులను విడవొ ?
చూడ సుందరములు కావొ ? సొగసులాడి !

'కష్టకమల'

*

నరనారీ సంబంధము
పరిభావింపుము దిశావిభాగము వరుసన్
ధర, జననీ భగినీ సహ
చరీ కుమారీ క్రమము నిజం బగుట సఖా !

'మాధురీదర్శనము'

*

తేనెమీఁద సుతారంపు తీవి నిలిచి
పగలఁ బడి నవ్వు పువ్వుపై కొగయు అళిని ;
ప్రియుఁడు ప్రియురాలి సట్లు చేర్చె నొక సుకవి,
బిడ్డ తల్లిని భాతి కల్పె మరొకండు.

'రమ్యాలోకము'

ప్రవిత్ర ప్రేమతత్త్వమును గనుఁగొన్న రాయప్రోలుకవి ధన్యజీవి. ఈ కవిశేఖరునిలోని ఆధ్యాత్మికదృష్టికి అప్పారి సుబ్రహ్మణ్యశాస్త్రి గారి యనుగ్రహము పుష్టి నిచ్చినది. శాస్త్రిగారు సుబ్బారావుగారి మేన మామ. ఆబ్రహ్మణ్యునిపోలిక యీాయనలోఁ జాలభాగ మున్నది. మేన మామతోఁగలసి కొంతకాల మవధాన ప్రదర్శన యాత్రసాగించి, బుచ్చి

రెడ్డి పాలెములో మనస్సు హఠాత్పరివర్తనము పొందఁగా నాస్తికవితా సన్న్యాసము చేసిరని సుబ్బారావుగారిని గూర్చి చెప్పుకొందురు. దైవ దయ నిండారుటవలనఁ గలిగిన యీ మార్పు సుబ్బారావుగారిచే రస భావ భరితమైన కబ్బములు వ్రాయించినది. (రవీంద్రుఁడు – విధుశేఖర భట్టాచార్యులు – ఆంధ్రరత్న గోపాలకృష్ణుఁడు – సముద్రాల అప్పలా చార్యులు మున్నగాఁగల సహృదయుల సాహచర్యము సుబ్బారావు గారి భావమణులకు శాణోపలము. సాహితీ సమితి కార్యదర్శి నోరి నరిసింహ శాస్త్రిగారు వీరిని గురించి యిట్లు ప్రశంసించుచున్నారు.

"సుబ్బారాయ కవిశేఖరునకు కవితావతారము, అక్షరరమ్యత అభి మాన పాత్రములైన విశిష్ట విషయములు. వీరి నీకవి రమణీయమార్గ మున బహుముఖముల ప్రదర్శించుచుండును. కవులు ఉత్తమ విషయ ములను సందర్భానుసారముగా లోకమునకు ఆస్థ దృఢమగుటకు వివిధ వివిధములవర్ణించుట మనపురాణకవుల నాఁటినుండియు సంప్రదాయ సిద్ధమే. ఈకవి ప్రకృతి శోభను మైత్రిని భక్తిని, జగత్కల్యాణమును కావ్యసందోహములో నిబద్ధముచేసి రమణీయోపదేశవ్యంజనచే ఉత్తమ బోద్ధ అయినాఁడు."

శ్రీ సుబ్బారావుగారి కబ్బములకు మొదటికళలో నున్న ప్రజాదర ణము నేఁడు కొంత కొఱవడినది. అనఁగా, తెలుఁగు చదువరులలోని భావుకత సన్నగిల్లుచున్నదనియే విచారింపవలసిన యొక పెద్ద మానిసి సమాధానము. ఆధ్యాత్మిక శక్తి సంవలితమైన యీయన యగాధభావన, అక్షరరూపము తాల్చునపుడు మిక్కిలి చిక్కఁగా బిగు వుగా నుండును. అది పాఠకసాధారణ్యమున కందదు. అదిగాక యన్వ యములోఁ గొంతతికమకగా నుండును. కాన, దీన – సుఖాంతుఁడైన చదువరి రాయప్రోలు వారి రచనలు నేఁడు పాడుకొనుట తగ్గించినాఁడు. ఈనాఁటి పాఠకునకు అపాతరుచిరమైన శైలి కావలయును గదా! దానిలో, పిండి యున్నను లేకున్నను వాని కిబ్బందిలేదు!

ఇందాఁక, సుబ్బారావుగారి యాశుకవితా సన్న్యాసమును గూర్చి యనుకొంటిమి. ఈ పద్యము లాసన్న్యాసవేళములోనివి :-

*

సతముఁ ధేనువ కొండవారి నిజవాసంబందు మృష్టాన్న సం
గతసౌఖ్యం బమరెన్, వధానమును సాంగం బయ్యె వట్టాభిరె
డ్డి తురాసాహుని మ్రోల నాశు కవితోద్దీన క్రియావేళ నా
యత వాగ్బంధనమున్ తవిల్చితి తుషారాహార్య వృత్తీ! యిదే
హితమం చెంచితె బుచ్చిరెడ్డి నగరీ శృంగాటకంబందునన్.

*

తెనుఁగే తీయని దందు పద్యపద రీతిక్రీడ లెత్యంత మో
హనముల్ శోభనముల్ తదీయరసరక్తాలాపనంబుల్ లభిం
చిన వాగర్థ కలా కలాప జయలక్ష్మిన్ గాలికిం బుత్తునే
జననీ, యేమిటి కింక, ఆశుకవితా సన్న్యాస మిప్పింపవే !

*

రసమో, భావమొ, జీవదర్థ సుకుమార వ్యంజనా పుంజ శ
బ్ద సమాసారచనంబొ, సాధు హృదయస్పంద ప్రతిష్ఠా కథా
వినరంబో సకలార్థశూన్యమగు నీ వేగాతివేగోక్తి దు
ర్వ్యసనం బేటికి త్రిప్పు మింక జననీ, రమ్యాక్షరక్షోణికిన్.

ఈపరిణామముతో నక్షరరమ్యత సుబ్బారావుగారిని వలచివచ్చినది. పద్యబంధములేకాక, పాటలుకూడ రాయిప్రోలుకవి తియ్యగాఁ బాడుకొనెను.

వడవేచలి, కాళ్ళగజ్జియల్, రవళింపఁగ పెదుళ్ళపల్లికిన్
తొలి ప్రొద్దుల చల్ది యన్నమున్, తిని త్రిమ్మరవచ్చు స్వేచ్ఛగా
మధుమాసపు కన్నె యెండలో, ఎలకొబ్బరితోట నీడలన్
పసుపాడిన నిమ్మచెంగటన్, వయసారిన మావిపొత్తునన్

ఎల కోయిల యీల నేర్పఁగా, పసి తెమ్మెర సేద తీర్పగా
చేయి చేయి బిగించి యింపుగా, విహరింతము తోడు తోడుగా.
మనరూపము వ్రాయగా పొనల్, మన వేసము దాచగా పొదల్
మనసోపని పచ్చి ముచ్చటల్, తనివోవగ చెప్పికొందమో!

(కవితలో నవీనరుచులు పొదిగించిన యీ కవికోకిలము ఉస్మానియా విశ్వవిద్యాలయమున నుపన్యాసకుఁడుగా నుండి ప్రకృతము విశ్రాంతి గయికొనుచుండెను. 'త్రివేణి' లో వీరి ఆంగ్ల రచనలు ప్రచురితము లయినవి. ఆంగ్లసాహిత్యమున లోఁతులు ముట్టి ప్రాచ్యభాషాపాండిత్యము సంపాదించి సుబ్బారావుగారు కృతిగాఁ బేరు పెంపులు సమార్జించిరి.)

"శాంతి నికేతనము" రవీంద్రుఁడు ఈయుత్తరము లాయున మొదలు పొంగించుచుండును. రవీంద్రాస్తమయము నంతట 'రాయప్రోలు' ఇటులు వగచినాఁడు.

సీ. ఆరిపోయినది దివ్య స్వైహాశ్వంగార
దీపంబు నివ్వాళి తీసినట్లు
పండిరాలినది పరబ్రహ్మపాదఫలంబు
మొలక మోజున క్రమ్మరిలినయట్లు
నిష్క్రమించినది నాందీముఖోజ్జ్వల తార
చిత్రాంక యువనిక చినిగినట్లు
తెగి జారినది జగత్ప్రియ రాగ మాలిక
గాంధర్వ జీవాళి కదలినట్లు
సోలినది శ్రీరవీందుని సుస్వరంబు
వ్రాలినది సుకవీంద్రుని రమ్యరచన
మ్లానమయ్యె నుపాసనామందిరంబు
ఖిన్నమయ్యెను శాంతి నికేతనంబు.

నినురించున్ శ్రుతులాపి కిన్నరలు, పన్నెల్ చిత్రపాత్రంబులన్
చెదరుల్ చిన్నెలు మాటి, కావ్యకలకంఠీ కంఠరాగంబు గ
ద్గదికాలాపము నందికుందును రవీంద్రా! సర్వసౌభాగ్య సం
పద మానం బగు తావకీన చరితాశ్వాసాంత సంధ్యాగతిన్.

రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ

1893

శ్రీవైష్ణవ బ్రాహ్మణులు. శఠమర్షణగోత్రులు. పెంచుకొన్న తండ్రి: అనంతాచార్యులు. అభిజనము: రాళ్ళపల్లి [అనంతపుర మండలము కల్యాణ దుర్గము తాలూకాలోనిది] కన్నతండ్రి: శ్రీవత్సగోత్రులు కర్నమడపల కృష్ణమాచార్యులు. కన్నతల్లి: అలవేలమ్మ. జననము. 23 జనవరి 1893 సం. నందన సంవత్సర మాఘ శుక్ల షష్ఠి. ప్రకృత నివాసము: మైసూరు. రచనలు:— ౧. తారాదేవి ౨. మీరాబాయి [పద్య కావ్యములు] 3. లీల [వచనము-కల్పితగాథ] ౪. వేమన ౫. సారస్వతోపన్యాసములు ౬. నాటకోపన్యాసములు. ౭. శాలివాహనగాథా సప్తశతి [400 పద్యములు-ఆంధ్రీకరణము] ౮. స్వప్నగ్రా కావ్యము [సంస్కృతము] ౯. మహీశూరరాజ్యాభ్యుదయాదర్శము ౧౦. రఘువంశ భాషాంతరీకరణము [చివరివి రెండును ముద్రితములు కాలేదు].

మాధురీ మార్దవములకుఁ దావలమైన వచనరచన యెవనిసొమ్మనఁగా, అది రాయలసీమలో నుదయించి మైసూరున నివసించువారిదని వెంటనే వచ్చు సమాధానము. రసభాసములకు నిదానమైన పద్యరచన యెవని సొత్తనఁగా, ప్రత్యుత్తరము వెనువెంటనే రాలేదు. నేఁటి తెలుఁగునాఁట, పద్యరచయితలు పెక్కురనియు, గద్యరచయితలు తక్కువ యనియు దీని పరమార్థము. సర్వాంధ్రము మొత్తమున, వచనరచనా విశారదుఁడు ఒక్కఁడే యనుట యతిశయోక్తికిఁ జేరుమాట. ఇట్టి చిక్కులు రాకుండు పరిష్కార ముండనేయున్నది. అది, "అనంతకృష్ణశర్మగారు నేఁటి ప్రముఖ వచనరచయితలు నలువురైదుగురిలో నొక్క" రనుట. శర్మగారు మంచి వచనము వ్రాయుదురు. వీరి పద్యరచనయు బహు మనోహరము. ఈ కూర్పు నేర్పులకు వారికిఁ గల కోవిదత్వము దోహద మిచ్చుచున్నది. సంస్కృతాంధ్రములలో పారు చేసినది. గీటురాతికి వచ్చు మేలి బంగరువు వంటి కృషి; ప్రాకృత సారస్వతపు లోఁతులు

తెలిసినవారు; ఆంగ్లములోని మెలకువలు వినుపించుకొన్నవారు.) పైగా, సంగీతకళలో నఖండమైన మెఱుఁగు. నోటిపాట పిలిచి తీయనై శ్రుతి పేయముగానుండును. సంగీత-సాహిత్యములలో పరిపూర్ణముగల విజ్ఞానము శర్మగారిలోనే రాణించుచున్నది. ఈ సౌభాగ్యము చేకూరి నవారనేకులు లేరు. (అనంతకృష్ణశర్మగారి విమర్శన వైయాత్యమునకు వారి 'వేమన' సాక్షిగ్రంథము. తెలుఁగులో నిట్టి విమర్శన కృతులీవఱకు లేవనుటయు సాహసము కాదు. "ఈ పద్యము హృద్యముగా నున్నది. ఈభావము రమణీయముగా నున్నది-" ఇత్యాది గతానుగతిక వైతాళిక ఘోష విమర్శన వేషముతో సంచారము చేయుట సహింపరానిది. మన విమర్శకుల దృక్పథమును మంచిదారులకుఁ జేరఁబెట్టిన 'రాళ్ళపల్లి' వారి మేలు మఱవరానిది. నాచన సోమనాథుని కవితా తత్త్వమునకు వీరు గావించిన భాష్యము 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' వారి బహుమానమునకుఁ బాత్రమైనది. (పక్షపాతము లేని నిక్కపు విమర్శనము శర్మగారి చేతిలో నిగ్గులు దేఱి 'ఉత్తరహరివంశ' సమీక్షారూపమున బయటికి వచ్చినదని జయంతి రామయ్యపంతులు మున్నగువారు నాఁడు మెచ్చుకొనిరి. ఇంత దిట్టమైన విమర్శన శక్తికల మానిసికి రసవంతమైన కవితాప్రాభవమును జేతనుండుట యొక సుయోగము.

శర్మగారు రచించిన 'మీరాబాయి'-'తార'- ఈ రెండు కావ్యములు రెండు మధుకుల్యలు. ఆయన ప్రాకృతమునుండి తెనుఁగుపఱిచిన 'గాథా సప్తశతీసారము' వాడని మల్లెపూలప్రోవు.) శిరీషపేశలమైన తన తెనుఁగు పదబంధమునకు నొప్పడిన కావ్యము నేరుకొనిరని నాకు ముచ్చట. రచయిత యేరుకొన్న యితివృత్తములోనే, ఆతని హృదయ మత్తుకొని యుండును. 'సప్తశతి' లోని మృదు ముగ్ధమైన జాను తెనుఁగుదనము, ఇదిగో!

వసపు నీళ్ళాడి దువ్వైన పండ్ల నడుమఁ
జిక్కుకొనియున్న మైలను జిన్నముల్లు

గ్రుచ్చి తీసెద వెవ్వని కోర్కె పండఁ
జేయు నున్నావు తెల్పవే చిన్నదాన!

*

పత్తి చేను దున్నఁగలసి మంచిదినాన
మడకపూజ చేయఁ దొడఁగినపుడు
కోర్కు లాత్మ గుబులుకొన గడగడమని
వడఁకెఁ దొడఁగెఁ గాపు చెడిపె కేలు.

*

కొండసెలయేటి సుడికిఁ జిక్కుకొని కలఁగి
తిరుగుచును గేసరంబులు విఱిగిపోవ
కొంత మునుగుచుఁ దేలుచుఁ గొదమ తేటి
వెంట నంటఁ గడిమిపూవు వెల్లబోయె.

*

అద్దమందు నీడ యంటున ట్లెవ్వని
యాత్మ నొరుల వగపు లంటుకొనవొ
అట్టివాని తోడ నెట్టు నెప్పుడు నత్త,
మనసు వ్రక్కలయిన మాన గాని.

*

పూని యూదేదు నెఱజాణ! ప్రొయ్యి మీఁద
నలుక కొనఁ బోకు; రక్త పాటల సుగంధ
మైన నీయూర్పుఁ జవులకు నాసగొనుచు
పొగ లెగయుఁ గాని మండ దీ ప్రొయ్యి నగ్గి.

*

కనులు కానరాని కటికి చీఁకటిరేయి;
వలస పోయె మగఁడు; వట్టి యిల్లు;

దొంగ లెవ్వరైన దోతురు సుమ్ము; ని
ద్రింప వలదు ప్రక్కయింటి వాఁడ !

ఇంత ప్రియ్యమైన తెనుఁగు శయ్య ప్రాక్తన పుణ్యవాసన కలిమి అనంత కృష్ణశర్మ గారి కందినది. ప్రమాణమునందు పయి పద్యములు పొట్టి వైనను, గుణమునందు గట్టివి. కట్టమంచికవి శర్మగారి సప్తశతీ సారమునకుఁ బ్రస్తావన సేయుచు నిటులనెను: "...ఈగాథసప్తశతి బౌద్ధయుగమునాఁటి యుత్కృష్ట జీవితమును దెలుపుచున్నది. భావములు కోమలములు. వానికి దీటైనది అనంతకృష్ణ శర్మగారి శైలి — మధురము, లలితము, రమణీయము. వీరి సరసత్వము అర్హతకొలఁది పొగడుట అసాధ్యము...............ఒక్కపద్యమే వ్రాయవలయును. అది మెఱుఁగుఁ దీఁగవలె మసలఁ గ్రమ్మియుండు నంధకారము నొక్కక్షణము పోఁద్రోలి నూతనలోకమును హఠాత్తుగ గోచరింపఁ జేయవలయును. ఆలోకము, ఒక్కనిమిషము మాత్ర మెదుట నున్న నేమి? దాని రామణీయకము జీవము నంతయు నాక్రమించి చచ్చు వఱకును తదేక ధ్యానములో మునుఁగున ట్లొనరించును. అట్టిదియ కవిత. గుణము ప్రధానము. రాశి కాదు ..."

శ్రీ రామలింగారెడ్డిగారికి, శర్మగారికి మంచి యనుబంధము. శర్మ గారిని సరససాహిత్య ప్రచారమునకుఁ బ్రేరేచినది 'కట్టమంచి' వారి సౌహార్దమేయఁట! సహజ ప్రతిభామనోజ్ఞత కలిగి కవితాగానము చేయుచున్న అనంత కృష్ణశర్మగారి శమీపూజ, పెనుగొండ పాట — మొదలైనవి తెలుఁగులో నిలిచి వెలుఁగొందు మెఱపులవంటి వని పెద్దల హృదయము. ఇది యిటుండ, రసికత్వ - కవిత్వములకు విజయ పతాక నెత్తిన అనంతకృష్ణుని సంసార మాధురియు భావించుకోఁ దగినది.

అనంతపుర మండలములోని రాళ్ళపల్లి వీరియభిజనము. వీరి మాతామహులు అనంతాచార్యుల వారి కాయూరు వంశ పరంపరగా వచ్చిన శ్రోత్రియ గ్రామము. పుంనంతానము లేమి నా యనంతా

చార్యులకు శర్మగారు స్వీకృతపుత్త్రుఁడాయెను. ఆ కారణమున 'రాళ్ళపల్లి' వీరికి సంక్రమించినది. శర్మగారిఁగన్న తలిదండ్రులు ధన్యులు. వారికిఁ బుట్టిన నలుఁవురు బిడ్డలలో వీరు ద్వితీయులు. వీరి యన్నగారు గోపాల కృష్ణమాచార్యులును సుప్రసిద్ధులు. అనంతపురపు రెవిన్యూ శాఖలో హుజూరు శిరస్తాదారులుగా పనిచేసి యిపుడు వారు విశ్రాంతివేతనము పుచ్చుకొనుచున్నారు. సంస్కృతాంధ్ర సాహితీ సంపన్నులు. ప్రాచ్య పాశ్చాత్య జ్యోతి శ్శాస్త్రపు సిద్ధాంత ఫలభాగములం దసాధారణ పరిచయము గలవారు. 'భారతి' లోఁ బ్రచురితము లగుచుండు వారి రచనలు తెలుఁగు వారికి విందులు. 'రాళ్ళపల్లివారి' దట్టి విద్వ దన్వయము. మన శర్మగారు చిన్ననాఁట పితురంతేవాసియై సంస్కృతాంధ్రములు వ్యాసంగించెను. తరువాత మైసూరు పాఠశాలలో సంస్కృత ప్రాకృత వ్యాకరణములు, అలంకార గ్రంథములు పాఠము చేసినారు. 1912 సం॥ లో మైసూరు కళాశాలలో బండితపదవీ లాభము. నేఁటికిని వారాపదవిలోనే యున్నారు. సంగీత సాహిత్యములలో శర్మగారు చేయుచున్న సాధనము తెలుఁగువారి కారాధ్యమైనదని యామోదము ప్రకటించుచు 'వేమన' లోని వారి దివ్యవాచకములు కొన్ని స్మరించెదను.

"......త్యాగరాజు వంటివారి కీర్తనలలో భక్తి యెంత యున్నను వారి గానపాండిత్యము దానిని గప్పి పెట్టినది. పల్లవిదాటులను జూపుద మనిపించునే కాని, వానిని పాడునపుడు ప్రాయికముగ భక్తిని ప్రకటింతు మనిపింపదు."

"......వేమన పద్యము లట్టివికావు. అతనివి చిటికలో ముగింపఁగల చిన్న పలుకులు; అచ్చ తెనుఁగు పద్యపునడక; గుండుదెబ్బ వలె గుఱి తప్పని చిక్కని చెక్కినమాటలు. నోరుగల తెలుఁగువారందఱును నేర్వవచ్చును."

"బాలవ్యాకరణము, అప్పకవీయము మొదలగువాని దెబ్బలకు వేమన పద్యము లెంత నులినులి యైనవో చెప్పలేము."

"మనలో నయముతోడి హాస్యము లేదని మొదలే విన్నవించితిని. నవరసములలో హాస్యమును గూడఁ జేర్చియున్నను ప్రాచీనుల హాస్యము అసహ్యములను అసభ్యములను వర్ణించుట యందు మాత్రము చరితార్థ మయినది."

"నిజముగా తెనుఁగు భాషకు పుట్టు మొదట హాస్యరసము చవి చూచిన ధీరుఁడు గురుజాడ అప్పారావుగారే. వారి కన్యాశుల్కమునం దున్నంత హాస్యరసనైర్మల్యము తక్కిన యెవరి గ్రంథములందును లేదనుట యతిశయోక్తి కాదు."

తెలుఁగువంటి బ్రతికియుండు భాషలలో 'ఇవే యపశబ్దములు, ఇవే సుశబ్దములు' అని నికరముగా శాశ్వతముగా నిర్ణయించుటకుఁ బూనుకొనుట వట్టి వెఱ్ఱితనని యిన్నాళ్ళకును తెలిసికొనలేకపోవుట మనతప్పు గదా!"

ఇవియెల్ల అనంతకృష్ణశర్మగారి హృదయమునుండి చిందిలిన సందేశ సుధాబిందువులు. 'ప్రబంధకళి' సి గంటి చిన శర్మగారి యాశయము తెలుపు గీతములతో నీక నీ వ్యాయసము ముగియుచున్నది.

ఇంతవృద్ధుడ వంతయు నెఱిఁగినావు
తెలిసికోఁ జాలవేమి మా తెలివిలేమి!
అర్థమేకాని పద్యము లల్లనేల?
వీథివీథుల వినువారి వెదకనేల!
అచ్చుతేటల శాశించునట్టి మమ్ము
తాటియాకుల కంతలో దార్పఁ గలవె?
పూర్తి లేనట్టి వ్రాఁతలో పొలుపు నెఱుగు
కన్ను లెప్పరికున్న వీ కాలమందు:
భావములు మ్రింగియున్నట్టి బంధములను,
ఆదియంతము లేని నానార్థములును
నోరు తిరుగని పదముల తీరుపులును
విచ్చి చూపెవు గాని నీవెంట దిరిగి
తెలిసికొనఁ మాకు బ్రతుకులో తీరికేది?
మఱచిపోయిన జ్ఞాపించు మార్గమేది?

పింగళి లక్ష్మీకాంతము
—౨
కాటూరి వేంకటేశ్వరరావు

1894
1895

ఇరువురు, ఆఱువేల నియోగులు. లక్ష్మీకాంతముగారు గౌతమస గోత్రులు. అభిజనము: కృష్ణాజిల్లా చల్లపల్లి తాలూకాలోని చిట్టూర్పు. నివాసము; విశాఖపట్టణము. తల్లి: కుటుంబమ్మ. తండ్రి: వేంకటరత్నము పంతులు. జననము: 10-1-1894 సం॥ తేదీ.

వేంకటేశ్వరరావుగారు శ్రీవత్సస గోత్రులు. తండ్రి వేంకటకృష్ణయ్య. పాలించిన తలిదండ్రులు: లక్ష్మమ్మ, కొండయ్య. జన్మస్థానము: కృష్ణా మండలములోని కాటూరు జననము 15 అక్టోబరు 1895 సం॥ రచనలు:- ౧. సౌందరనందము ౨. పౌలస్త్యహృదయము ౩. తొలకరి [ఈమూఁడు కావ్యములు ఇరువురిపేరఁ బ్రచురితములు] ౧. బగ్ బౌరలు [ఆంగ్ల నవలకు ఆంధ్రీకరణము] ౨. ప్రతిజ్ఞాయౌగంధరాయణము ౩. స్వప్నవాసవదత్త [భాసనాటకములకుఁ దెలుఁగుసేఁతలు) ౪. నల్లకలువ [ఆంగ్లమునుండి తెనుఁగు—పయిని, ఒక—వేంకటేశ్వరరావుగారి పేరనే ప్రకటితములు) ౧. మధుర పండితరాజ్యము—ఇత్యాదులు లక్ష్మీకాంతముగారి సొంతము.

ఇటీవలి సంప్రదాయము ననుసరించి 'లక్ష్మీకాంత వేంకటేశ్వర కవులో - 'పింగళికాటూరి కవులో' కావలసినవారు వీరు. అదిగాక, వీరు తిరుపతి వేంకటకవుల శిష్యులగుట కారణముగా, విధిగా జంటపేరు సంధించుకొనవలసి యున్నది. అటులు సేయక — స్వేచ్ఛముగా నిరువురు వేఱువేఱు పేరులు కృతుల ముఖపత్రములపై వేసికొనుట — వీరి గతానుగతికధర్మాసహిష్ణుతకు, పురాతన సంప్రదాయకృతశ్రద్ధాగౌరవ దృష్టికిని గుఱుతులు. తెలుఁగునఁ బ్రబోధచంద్రోదయ ప్రబంధ రచయితలగు

జంట కవుల హృదయము లంటుకొనియుండ లేదా! వట్టి - పేళ్లు జతపఱిచి నంతమాత్రమునం గాదు; కవితాస్నిగ్ధములగు యెదలు శబ్దార్థముల వలె విడఁదీయరానివి కావలయును; అదియే జీవాత్మలజంట వంటి జంట. నా కొక విషయము ముచ్చటగానుండును. సౌందరనందాదులగు కొన్ని కావ్యములు పింగళి – కాటూరి కవులు కవగా వ్రాసిరి. కొన్ని యెవరి మట్టునకు వారు విడిగా వ్రాసికొనిరి. తత్త్వదృష్టికి నిది యొక యందమే యని నా యానందము. "ఒక్కరు రచియించిరేని యది కాదగుఁ దిర్పతివేంకటీయమై" అన్న జంటకవుల ప్రతిజ్ఞలోని పరమార్థము పూర్ణము కావలయునుగాని, కాపీరైటు తగవులాటలకు దిగునది కారాదుకదా! ప్రస్తుత కవుల గురువులు తిరుపతివేంకటకవులు సర్వధా అభిన్నులెట్టులైరో, పింగళికాటూరి కవులు నట్టివారని రుజువు చేయుదును. ఇందులకు సౌందరనందములోని యీ పద్యములు నాకుఁ బ్రధానమైన యాధారముగాఁ గనిపించినవి.

మేలేర్చి నందుండు పూలు గోసి యొసంగ
  సరము లందముగ సుందరి రచించు
మోఁత పర్ణమ్ములు మేళవించి యిడంగ
  హారువుమై సతిఁడు చిత్రరుచు వ్రాయుఁ
బతి యపురూపభావము పచించిన నను
  దూవ పద్యమునఁ గూర్చును లతాంగి
అతివ చక్కనిరాగ మాలపించిన వీణ
  పలికించు నతఁడు మై పులకరింప
నెఱ్ఱసెరల నంచుని చూపు లింతి యూన
నేయమునకుఁ గెంపు సివాళులెత్త, నతివ
కజ్జలపుఁ జూడిక ప్రియుని వక్షఃకవాటిఁ
గట్టుఁ దోరణములు నల్లకల్వపూల.

*

ప్రాలేయ గిరికందరా వినోదవిహార
　　　　పరులైన సిద్ధ దంపతు లనంగ
విబుధ తరంగిణీవీచికా డోలలఁ
　　　　దూఁగెడి రాయంచదోయి యనఁగ
కవి మనఃపంకజానవ సిక్తమై రసా
　　　　గ్రముల నాడెడి పదార్థము లనంగ
నానంద పరిఫుల్ల మౌనీంద్ర దహర తా
　　　　రాధ్యమం దాడు జీవాత్మ లనఁగఁ
జీకుచింతల దిగఁ ద్రావి, చెన్ను మిగిలి
హృదయ సంవేద్య మయ్యు నాత్మైకగమ్య
మైన యక్షయ సౌఖ్య రసామృతమ్ము
ననుభవింతురు వారు నిరంతరముగ.

*

ఈ అభినవ కవుల కవ తొలుత మైత్రీబంధముతోను, పిదప బాంధవముతోను గలసి వచ్చినది. అనఁగా, కాటూరి కవి మేనకోడలు పింగళికవి బావమఱఁదికి భార్య. ఈ చుట్టఱికము సాహిత్య బంధుత్వము కంటె గట్టిదని నే ననను. ఇట్టివీరి కలయిక నవ్య కవితా లోకమునకు తొలకరి. అదే హేతువుగా వీరి తొలికృతికిఁ దొలకరి యని పేరు వచ్చియుండ వచ్చును. ఇది కొన్ని ఖండ కావ్యముల రాశి. అవి యన్నియు భిన్నవిభిన్న విషయకములు. ఈ ఖండకావ్య రచనాశక్తి వీరి నుండియే వచ్చెననఁగాదు. మఱికొందరును, దాని వేరుపఱిచిరి. వానిలో వీరిదియు నొకటి. పాశ్చాత్యసంపర్క లబ్ధమైన యీమేలి వెలుఁగు తెలుఁగునాఁట మిక్కిలిగా నేఁడు నెలకొన్నది. రసిక మానసా కర్షకమైన పదబంధము పింగళి కాటూరి కవుల కవితలోఁ దొట్ట తొలుతఁ దొలకరించిన గుణము. అది మెల్లగా 'సౌందర నందము' నకుఁ

చేరుసరికి భావరస వర్షావారివాహ మైనది. 'తొలకరి' నాడు, కవితను గురించిన యీ జంట కవుల తలఁపు లిటులున్నవి :—

సీ. చూతురా, దీసిని జూతపల్లవ ఖాది
 ని పికాంకనా గాన నిస్వనంబు
కొందురా, దీనిని గ్రొమ్మొల్లుంగుల జిల్గు
 పనికిఁ గాఁదగిన కుందనపుఁ దళ్కు—
కావలెనా, యిద్ది, కలువపూరేకు పొ
 త్తములఁ జిప్పిలెడు మెత్తందనమ్ము
వలయునా, మలయ పర్వత సానువులనుండి
 దిగుమతి యగు కమ్మ తెమ్మెర లివి
తీయుదుర, దీస వెన్నెల తేట నిగ్గు
ఒరయుదుర, దీనిఁ బచ్చ కప్పురపుఁదావి
కోరికొందుర, దీనిఁ బటీరజలము
త్రావిచూతుర, తీయని పూవుఁదేనె.

'తొలకరి' కిఁ దొలిపలుకు వ్రాయుచు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి చిట్టచివర నిట్టులని ముగించెను.

"ఈకవులు నిక్కముగా స్వతంత్రులు. ఆర్యాంగ్లేయాది వాఙ్మయముల సారములఁ బీల్చి తమయందు లీనమగునట్లు చేసి దానిచేఁ గలిగిన పుష్టిచేఁ బుష్కలముగా వ్రాయువారు. వీరి కవిత్వమున నిక్కంపు మంచి నీలము లున్నవి. తళుకు బెళుకు రాళ్ళు లేవు. అయినను, రత్న పరీక్షయందు సమర్థులగువారికిఁ గాని సామాన్యులకు వానిగుణము నెఱుంగ నలవికాదు. సుకవిభోగ్యము లిచటి వస్తువులు, నలిపివేయుకుఁ డటు నిటు కలచివైచి—"

'సౌందరనంద' రచనతో వీరికి, సిద్ధహస్తులయిన మహాకవులుగాఁ బరిగణనము వచ్చినది. ఆకావ్యమునకుఁ దెలుఁగుదేశమున రావలసిన

స్థానమును వచ్చియున్నది. ప్రతిభావ్యుత్పత్తులు నికరముగా నున్నవాఁడు కాని కవి రాణింపఁడు. వీనిలో, లేనిపాలు వెలితిపడినను, అది కవికిఁ గొఱంతయే. ప్రకృతము, పింగళి కాటూరి కవులను గుఱించి. వారు మంచి ప్రతిభానము గల మేధావులు. దానికిఁ దగినటులు వ్యుత్పన్నతయుఁ జక్కనిది. ఈ గుణద్వయమునకుఁ దోడు నిడని యభ్యాసమొకటి. 'సౌందరనంద' మీ సమ్మేళనము పండినపంటయై, నందనారామమై పండువుచేయుచున్నది. 'బుద్ధచరిత్ర' రచయితలు తిరుపతి వేంకటకవుల కీకావ్యము గురూపహారముగా నీయఁబడినది. కాదేని, వారిలో నభిన్నులుగానుండిన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారికే 'గురుదక్షిణ' యనుకొందము. గురువుగారి షష్టిపూర్త్యుత్సవావసరమున నీకబ్బ మర్పనము సేయఁబడ్డది. అప్పటి సమర్పణ పద్యము, లీశిష్యుల జంట యుగధర్మయు మధురహృదయమును దోయిళ్ళఁ బట్టికొన్నది. అందలివి కొన్ని:—

కేతనతోడి పొత్తునకుఁ గేల్ కలపం దలపోసికాదు, సు
ఖేతము మెచ్చఁగాఁ గవిత చెప్పఁగ నేర్తు మటంచుఁగాదు, వి
ఖ్యాతికిఁగా, దిఁకేమనిన, నద్యతనాంధ్ర కవిప్రపంచ ని
ర్మాతకు భక్తిమై నుడుగరల్ ఘటియించెడి పూనికయే సుమీ!

*

సంచితపూర్వపుణ్యము లసంగు ఫలమ్ములు వోలె వాసనల్
మించుకొనన్ నవప్రసవముల్ విరబూచుచునున్న దీవు క
ల్పించిన పాదులందుఁ బ్రభవించిన నూత్న కవిత్వవల్లి; యీ
కొంచెపుఁ బూలమాలఁగయికొమ్ము గళాభరణమ్ముగా గురూ!
భావ విశుద్ధి దోఁపఁగ భవత్పదముల్ భజియించునాఁటి మా
సేవలు మెచ్చి యాదర విశేష మలర్పఁగ సల్పినట్టి మీ
దీవన నిక్కమై యొసఁగెఁ డియ్యని కావ్యఫలమ్ము నేఁటికిన్;
నీ విడినట్టి భిక్ష యిది నీకె యొసంగెద మిష్ట విందుగాన్.

సంస్కృతమున అశ్వఘోషుని మహాకవి సౌందరనంద కావ్యము సంతరించెను. అందముగా నున్నదని యాగ్రంథనామము వీరు పెట్టుకొనిరి ఇతివృత్తములో దానితోఁ గొంత పోలిక. ఇంతే. ఇఁక మిగిలిన యావత్కవితాచమత్క్రియయు వీరి సొంతము. కథావస్తువు ధర్మనిష్ఠ కలయది. కవిత్వము తగినట్లు రసపుష్టమైనది. కావ్యము, రాశిలో వాసియైనది కాకపోవచ్చును, గుణసంపత్తిలో నుత్తమజాతికిఁ జెందుచున్నది. ప్రాచీన సంప్రదాయములు తూలనాడకపోవుట - క్రొత్త దారులలోని మేలు నేరుకొనుట యీజంటకవులకుఁ గల విశాలగుణము. అభ్యుదయపథములో నంగలు వేసికొనుచున్నార మన్నకొందఱు వీరి కవిత నేమందురు! - కవిత నిత్యనవీనము కావలయును, అనఁగా పురాణము కావలయును. నేలవిడిచి సాముచేసిన వీలుకాదు. 'సౌందరనందము' పురాతనాధునాతన కవితలకు సేతుబంధము.

అలనాటినడిరేయి సర్వరాజము వెన్న
    చమరి పిడ్కొని నట్టి స్థలము దాఁటి
చెన్నటి దాలఁ దోఁచిన రాజగృహలక్ష్మి
    పుల్కు పుల్కునఁ దన్నుఁ బోల్చికొనఁగ
నెలగోలు మూఁకల యెల్గుల సౌధ వా
    తాయనమ్ము లపావృతములు గాఁగఁ
దలుపులు తెఱచి పౌరుల కిమితి బ్రువా
    ణులగుచు వెఱగంది నిలిచి చూడ
నాత్త పరతత్త్వ బోధమహా నాత్మతేజ
మానసేందుని పరివేషమై భజింపఁ
బురము చొత్తెంచి నిలిచిన బోధి సత్త్వుఁ
గనుకనిన్ గని పౌరులు గములు గూడి—

'ప్రథమసర్గము'

*

నడపుల రాజహంస, తెలినవ్వుల వెన్నెలవాఁక, ప్రేమలూ
రెడు సుమఁబల్కుఁ దేనెపెర, రెమ్మలువై చు విలాసవల్లి, వ్రే
ల్మిడి హృదయమ్ము నుచ్చిచను మేలిమిచూపు మదాళియైన యా
పడఁతుక నందభాస్కరుని బాయఁగ నోర్వదు ఛాయయుం బలెన్.
తానా, సుందర నందుఁ; డవ్వెలఁదియా, తన్వంగ మాధుర్య లీ
లా నందైక నిధాన; మొండొరుల ప్రేమాలాప కేళీ వినో
దానూనానుభవమ్ములా, మదన విద్యా దైశికమ్ముల్; సముల్
కానన్ రారుగదోయి, కామిజనలోకమ్మందు నాడోయికిన్.

*

పద్యములకుఁ బ్రకరణము స్పష్ట పడుచుండుటచే వ్రాయుటలేదు. మఱి కొన్ని యుదాహరించుటకు మనసు పడుచున్నాను. రసభావాభ్యుదయ మిందెంతదాఁక సాగుచున్నదో మీరే యెన్ను కొనవలయును.

బ్రతుకు నిక్కమ్మయేని యవ్వారిపట్ల
విరతిలేని స్వప్నమ్మునా జరుగఁ బోలు
బ్రతుకు నిక్కముగాక స్వప్నమగునేని
సత్యమై తోఁపఁబోలు నాజంపతులకు.

*

రాగరంజిత మన్మనోరత్న మింత
యింత శకలమ్ము లొనరించి యింతి! నీదు
కంఠహారమ్ము నొనరింతుఁ, గడమ యిడక
వినుతు హృదయ ప్రబంధమ్ము విశద ఫణితి!
వెలది! యీ రాగలతలు పుష్పించు నట్టు
లీ మనోరథములు ఫలియించు నట్లు
దరు లొరసి పాఱు నీ మమతాస్రవంతిఁ
దేలిపోదము పెఱతలంపేల మనకు!

*

ఎన్ని విధాలనో హృదయమిచ్చి భజించితి విట్టి క్రూరునిన్
నిన్నుఁ దలంచి చిత్త సరణిన్ విలపింతున, జాలి నింతునా?
ఇన్ని విధమ్ములన్ హృదయ మిచ్చిన ప్రేయసి పీటఁ బుచ్చితిన్
నన్ను గుఱించి వల్లటిలనా, పెనుసిగ్గున మ్రుగ్గిపోదునా?
ఎన్నఁగరాని కూర్మి నిలువెల్ల నొకింతగ రాగపూర్ణమౌ
పొన్నపుఁ బానపాత్రయగుచున్ గరయుగ్మమునందు నిల్చు నా
పెన్నిధి, నిష్టదైవమును పీటఁడినై యిటు పాఱవైచి కొం
టి, న్నిరుపేదనై యులమటించెద దిక్కఱి రిత్తజోగినై.
వలపుల్ వడ్డికిఁ బాఱఁ గౌఁగిట గదింపం బాత్రవై, నిండుచూ
పులకల్ వెన్నెలవై, శ్రవోయుగళి కింపుల్ నింపు గానమ్మవై
యలరుందావియయ్యు నూర్పులకుఁ, బై నాత్మైక భోగ్యంబవై
తలఁపుల్ దాఁటి, యభిన్నవై, తుది మహాత్మా! నాకు లేవైతివే.

*

వసివాళ్వాడ, దొరకప్పుడుఁ
గసు గందదు, మేల్మిచాయ కగ్గదు, తావుల్
కొసరు, మరందము చిలుకును
విసువక మొదఁ దాల్తు నట్టి ప్రేమసుమమ్మున్.

నాకీలోకముతోఁ బనేమి, వినుమన్నా! పాలమున్నీటిలో
నేకాంతమ్మగుచోఁ బ్రవాళములచే నేపారు ద్వీపమ్ములో
నాకుల్ రాలని పూలువాడని వసంతారామ మధ్యమ్ములో
రాకాచంద్ర సహస్రముల్ వెలుఁగు హర్మ్యాగ్రంబునం దొక్కటన్.
నాకుం బ్రాణము ప్రాణమైన చెలితో నానాసుఖమ్ముల్ లతా
నీకమ్ముల్ పెనఁగొన్న డోలికలలో నిఃఖేద దివ్యామృత
స్వీకారమ్ము భజింపుచున్ నియమముల్ సీమల్ వెసఁ దాఁటి,
కాకారమ్మును నిత్యమై నెగడు నయ్యానంద మర్థించెదన్.

*

ఇటు లుదాహరించుకొనుచుంబోవుచో, సౌందరనందము సమగ్రముగా నిచటం బ్రతివ్రాయవలసినవాండ నగుదును. తొంటి కవిత్వమున కనుకరణముగాం గనిపించు పద్యములింపు తక్కువ. వానిలోంగూడ ననుసరణచ్ఛాయలు తోంపనీయని స్వతంత్రతయే యెక్కువ. కథావస్తువు, గ్రథననైపుణి శుచిత్వ రుచిత్వ సంకలితములగుటవలన సౌందరనంద ముత్తమకావ్యమయినది. మఱి, యేతత్కావ్యకర్తల గురుకులవాస క్లేశము లెంతటివి!

పింగళిలక్ష్మీకాంతముగారు రాముమ్మాయుణులు. వీరి తండ్రి చల్లపల్లి జమీనుకిం జెందిన 'ఆముదార్లంక' లో మునుగడ సాగించుచు, నాయూరం బెత్తనము వహించిన వ్యవహర్త. అన్నదానములో నాయన పలుకుబడి గొప్పది. ఆయన యన్నదాన వ్రతము ఫలింపంజేసిన కుటుంబిని కుటుంబమ్మగారు. లక్ష్మీకాంతకవి యీ దొడ్డతల్లి కడుపు. ఆమె మోచర్ల వారి యాడుంబడుచు. మోచర్ల — పింగళి వంగడముల వారికి వియ్యము నాలుగైదు తరములనుండి వచ్చుచున్నది. లక్ష్మీకాంత కవిగారి భార్య లక్ష్మీనరసమ్మగారు కొంత సాహిత్యము తెలిసిన యామె. శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు కంటిజబ్బు చికిత్సకై 1933 లో విశాఖపట్టణమునం గొంతకాల ముండిరి. మకాము లక్ష్మీకాంతముగారి యింట. అపుడు వారికి లక్ష్మీకాంతముగారి యిల్లాలు చేసిన యుపచార గౌరవము గొప్పదనియు, శాస్త్రులుగారు ఆమెకు సంస్కృతకావ్యములు పాఠములు చెప్పి శిష్యురాలిని జేసికొనిరనియు 'జాతకచర్య' ఇటీవలి భాగమునం గనంబడినది.

లక్ష్మీకాంతముగారి యాంగలపుం జదువు స్కూలుఫైనలు దాంక బందరు హిందూస్కూలులో. ఎఫ్. ఏ; బి. ఏ లు బందరునందే యున్న నోబిలు కళాశాలలో. మూండవ 'ఫారము' చదువుచుండంగా 1909 లో లక్ష్మీకాంత మున్న హైస్కూలులో తిరుపతి వేంకటకవులు శతావ

ధ్యానము చేయుట ఉటస్థించినది. ఆప్రదర్శనము చూచిన వెంటనే యీతనికిఁ గవితాస్థ యంకురించినది. అదియాది, వేంకటశాస్త్రిగారి యాదరాశీస్సులంది మూఁడేండ్లు మూఁడునెలలు గురుకులక్లిష్టుఁడై సంస్కృతాంధ్రములు చదువుకొనెను. ఆ గురు సేవాప్రసాదము లక్ష్మీకాంతమును నేఁడు మహాకవయితగా దిద్దఁగలిగినది. 1912 లో, స్కూలుఫైనలు పరీక్షోత్తీర్ణతనంది, వెంటనే 'ఇంటరు'న, చేరఁ జాలక రెండేండ్లకుఁ జేరి 1919 నాఁటికి పింగళికవి బి. ఏ. పట్టభద్రుఁడయ్యెను. ఆవెంటనే 'నోబిలుపాఠశాల'లోఁ బ్రధానాంధ్రపండితస్థానలాభము. మఱి నాలుగేండ్లకు, కళాశాలలోఁగూడ నధ్యాపకత. అచట కొకనాలుగేండ్లు. పదపడి మదరాసు విశ్వవిద్యాలయమునఁ దెలుఁగు పరిశోధకశాఖలో 'ఫెల్లో' పదవి. అది మూఁడేండ్లలో నయిపోఁగా, తంజావూరు సరస్వతీమహాలునఁ గూర్చుండి నాయకరాజులనాఁటి తెలుఁగు తాటియాకుఁ బొత్తములు చదివి యెన్నో క్రొత్తవిషయములు లక్ష్మీకాంతకవి సేకరించెను. మదరాసులో నుండఁగనే 1930 లో ఎం. ఏ మొదటి తరగతిలో నుత్తీర్ణుఁడై యుండిన హేతువున, 1931 సంవత్సరముననే ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు – ఏర్పాటు చేసిన తెలుఁగుశాఖలో నాచార్యస్థాన మొసఁగిరి. తంజావూరిలో లక్ష్మీకాంతకవి నాఁడు చదివిన చదువే, ఆంధ్రవిశ్వవిద్యాలయమున అచ్చటివాఙ్మయ మంతయు 'కాపీ' చేయించి తెప్పించి ప్రకటింపఁబూనుకొనునటులు చేయుటకు హేతువైనదని చెప్పెదరు. ఆమహాప్రయత్నమున మొదటిదిగా 'ద్విపదభారతము' మొదటిసంచిక యచ్చునకు వచ్చినది. దానికి లక్ష్మీకాంతముగారిపీఠిక విపులమైనది యున్నది. తంజావూరి యక్షగానములను గురించి యీయన యెంతో వ్రాయఁగలవారు. శ్రీ ప్రభాకరశాస్త్రి పరిష్కృతమైన 'రంగనాథరామాయణము'నకు వీరి భూమిక యాభరణమై యున్నది. ఎన్నో పీఠికలలో, ఎన్నో పత్రికా ప్రచురిత రచనలలో లక్ష్మీకాంతముగారి వాఙ్మయపరిశ్రమము విశదమగుచున్నది.

శ్రీ కాటూరి వేంకటేశ్వరరావుగారిదియు సుపరినిష్ఠితమైన సారస్వతవ్యాసంగము. ఆయన భోగ త్యాగములకు వలయునంత యున్నవాఁడు. ఆదిలో, వీరు కలపటపువారు. నాలుగైదు తరములుగా 'కాటూరు' చేరిన తరువాత 'కాటూరి' యని యింటిపేరు మాఱినది. పినముత్తాతగారికి దత్తుఁడై వేంకటేశ్వరరావుగారు పెంపొందెను. సంపత్తితోపాటు మహాకవిత్వమునకు వలయునంత వ్యుత్పత్తియు నున్నవాఁడు. గురువుల నాశ్రయించి చదువుకొన్నవాఁడు. పింగళి కవియు, నీయనయు సతీర్థ్యులు కావుట విశేషము. వీరికిని చెళ్ళపిళ్ళ శాస్త్రులుగారే సంస్కృతాంధ్ర సాహిత్యభిక్షా ప్రదాతలు. వేంకటేశ్వరరావుగారు బి. ఏ. సీనియరు చదువుచు 1921 లో, సహాయనిరాకరణోద్యమమునఁ జదువు విరమించివైచిరి. 1930 లో జరిగిన యుద్యమమున నాఱు నెలల కారావాసదండనము. కాటూరికవి దంతటి దేశాభిమానము. 1932 మొదలు 39 వఱకు ఆంధ్రోపాధ్యాయుఁడుగా, 39 సం|| మొదలు 43 సం|| దాఁక ప్రిన్సిపాలుగా బందరు ఆంధ్ర జాతీయ కళాశాలలో నుద్యోగనిర్వహణము. ప్రకృతము కృష్ణాపత్రికా సంపాదకత. ఆంగ్లభాషలోని యుదాత్త సాహిత్యము నీయన తనివారఁ జూఱలాడియు, నార్యసంప్రదాయములు వీడక కవితాగ్రథనముఁ గావించెను. కావలసినంత స్వస్థాన వేషభాషాభిరతి కల వ్యక్తి వేంకటేశ్వరరావుగారు. మెత్తని హృదయము, మఱీ మెత్తని పలుకుబడి. ఒడలెఱుఁగని యుపన్యాసధోరణి సాగించుగుణము లేదు కాని, తియ్యతియ్యగాఁ బద్యపాఠము చేసి సభ్యుల నూరించును. నిర్లిప్తుఁడు; ఒకరి లక్ష్యము లేదు. అట్లని, ఎవరిని జెండనాడఁడు. వచనశైలిలో పింగళి వారిది, పద్యశయ్యలో కాటూరి వారిది పై చేయిగా నుండునని దేశమునఁ బలుచనైన యొక వాడుక యున్నది. రసజ్ఞుల చెవుల కెట్టి వాడుకలు వినఁ బడవు. వారిరువురిది సరియగు జత. సౌందరనంద

మొకటి మాత్రము, యీ యిద్దఱి కీర్తికిని పతాక. కలసి వ్రాసిన 'పౌలస్త్యహృదయ' మను చిన్నకావ్యమునుండియు రెండు రత్నముల నిచ్చి యింకఁ జాలింతును.

[శ్రీరాముఁడు లంకపై నెత్తివచ్చుట చూచి సముద్రుఁడు రావణునితోఁ జెప్పఁబోఁగా రావణుఁ డనినమాటలు]

పసవల్పు చెక్కిళ్ళ వయసున లజ్జయై
ముని యాజ్ఞ దాఁటక తనువు సొగసు
జనపాలువ్రేలు నీడున శైవచాపము
విఱిచిన శృంగార వీరమహిమ
పసపు బట్టల సిగ్గుపడ భార్గవక్రోధ
సంధ్య మాయించిన శౌర్యసార
మాలిఁ బాసిన క్రొత్త యాలఁతియై వజ్రసా
రుస వాలి నొక కోలఁ దునుము పటిమ
వింటియేకాని — ఇన్నిటికంటె రాచ
పట్టముదొరంగి నారలు గట్టి కాన
మెట్టినట్టి నెక్కొ-సగ్గమైన దిట్టతనము
వింటి — సామికే[illegible]గునను కొంటె కాని,—

శ్యామలకాంతి మోహనము, సౌమ్యగభీరము సుప్రసన్న రే
ఖామృదు హాసభాసురము, గన్నులపండువునైన రాము నె
మ్మోమును మున్నుఁ బోలెఁ గన నోమను గాదె; కఠోరవృత్తినై
సామిని మున్న ఘోరగరళ సత్రసమంత్రితుఁ జేసి యుంచుటన్.

మాడపాటి హనుమంతరావు

1885

బ్రాహ్మణులు. తల్లి: సుబ్బమ్మ. తండ్రి: వేంకటప్పయ్య. జన్మస్థానము: కృష్ణాజిల్లా, నందిగామ తాలూకాలోని పొక్కునూరు. నివాసము: హైదరాబాదు. జననతిథి: తారణసంవత్సర మాఘశుద్ధ షష్ఠి. 1885 జనవరి. రచనలు:- ముద్రితములు. ౧. మల్లికాగుచ్ఛము ౨. మాలతీగుచ్ఛము 3. క్షాత్రకాలపు హింద్వార్యులు. ౪. తెలంగాణా ఆంధ్రోద్యమము (1 భా.) అముద్రితములు: ౧. గ్యారిబాల్డి చరిత్రము ౨. మహాభారత సమీక్షణము. 3 తెలంగాణా ఆంధ్రోద్యమము. (2వ భాగము) ౪. రోమక సామ్రాజ్యచరిత్రము (అసంపూర్ణము)

జన్మదేశము కృష్ణామండలమే కాని హనుమంతరావుగారు హైదరాబాదు నివాసులు. నిజాము రాజ్యములో రాజకీయ ప్రాముఖ్యము వహించిన తెలుఁగువారిలో వీరు ప్రథమశ్రేణికిఁ జెందినవారు. ఆయనను రచయితలుగా నెక్కువమంది వినియుండరు. ఏమనఁగా, హనుమంతరావుగారు రచించిన గ్రంథముల పుటల ప్రమాణములోఁ దక్కువ. అవియైనను, సాహిత్యసంబంధము కలవికావు. ఎక్కువ, దేశభక్తి సముత్తేజకములు. చరిత్ర విషయకములును. ఆంధ్రోద్యమము వీరి ప్రాణప్రాణము. తెలంగాణా ఆంధ్రోద్యమము వీరిది ప్రథమ భాగము ముద్రితమైనది. మల్లికా – మాలతీ గుచ్ఛములు రెండు ముద్దయిన గ్రంథములు. అందలికథలు ప్రాచీనాంధ్రుల విశిష్టతకు మహాదర్శములు. తెలుఁగులో గ్రాంథికశైలి వీరిది తీరుగానుండి విందుసేయును. మల్లికాగుచ్ఛమునఁ జారిత్రకములు సాంఘికములు నగుకథలు మధురధోరణిలో నున్నవి. రుద్రమదేవి మున్నగా నున్న గాథలు వీరి చరిత్ర దృష్టికి మంచి నిదర్శనములు.

హనుమంతరావుగారు బి. ఏ., బి. యల్. పట్టమునందిన న్యాయవాదులు. ౧౯ వత్సరముల యీడునుండి యిరువది యేడేండ్లు యీడు

వచ్చువఱకుఁ బ్రభుత్వము వారి విద్యాశాఖలో నుద్యోగము. అంతటి నుండి, యాఱు వత్సరములు హైదరాబాదు శాసన నిర్మాణ సభలో నాంధ్రానువాదక పదవీనిర్వహణము. పిమ్మట నిరువదినాలు గేండ్లు నిండుగా హైకోర్టు వకీలువృత్తి. ప్రకృతము విశ్రాంతి. హనుమంత రావుగారికి ఆంగ్లము, ఆంధ్రము సందేశాక సంస్కృతము, ఉరుదూ భాషలలోఁగూడ మంచిపాండితి యున్నది. వీరికి శ్రీ కందుకూరి వీరేశ లింగము పంతులుగారి రచనా విధానము ఆదర్శమఁట. వ్యావహారిక భాషయం దెక్కువ యాదరముగాని దాని యుపయోగమును గూర్చి యెక్కువ విశ్వాసముగాని కలవారు కారు.

విశేష మేమనఁగా హనుమంత రావుగారు హైదరాబాదు రాజ్యములో నేఁటి ప్రజోద్యమములయందుఁ బాలుగొని గొప్ప కీర్తి గడించినారు. రచయితలలో వారికీయఁదగిన గౌరవము, ఆకీర్తిని పట్టి కాక సాహిత్య-చరిత్ర సంబంధమైన వారి మల్లికా గుచ్ఛ, మహా భారత సమీక్షణాది కృతి రచనమువలన నని గుర్తింపవలయును.

సురవరము ప్రతాపరెడ్డి

1896

రెడ్డివంశీయులు. తలిదండ్రులు రంగమ్మ, నారాయణరెడ్డి. జన్మస్థానము గద్వాల సంస్థానములోని బోరవెల్లి. జననము దుర్ముఖి - అధిక జ్యేష్ఠ బహుళ ప్రతిపత్తు. 1896 సం. రచనలు : ౧. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. ౨. హైందవధర్మవీరులు. ౩. రామాయణ విశేషములు. ౪. హిందువుల పండుగలు. ౫. ప్రజాధికారములు. ౬. తుకారాము [నాటకము] ౭. ఉచ్ఛల విషాదము [నాటకము] ౮. యువజన విజ్ఞానం. ౯. మొగలాయి కథలు. ఇత్యాదులు.

హైదరాబాదు, ఆంధ్రసాహిత్య రచయితలు — అను తలంపులో తోట్టతొలుత సురవరము ప్రతాపరెడ్డిగారు తగిలి వేఱొకరు తట్టదరు. "ఆంధ్రుల సాంఘికచరిత్ర" గ్రంథరచనతో — మెఱపు మెఱపులుగా విరిసియున్న ప్రతాపరెడ్డిగారి యశస్సు స్థిరపడి నిలిచినది. ఇట్టి యుత్తమ రచయితి జీవన సింధువునుండి యథాశక్తి సేకరించుకొన్న కొన్ని బిందువు లిక్కింవివి.

ప్రతాపరెడ్డి గద్వాల సంస్థానములోని బోరవెల్లి గ్రామములో జన్మించి, యేడేండ్లదాఁక నచటనే పెరిగెను. మొదటి గురుత్వము తండ్రిది. పిదప నెనిమిదవయేట 'కర్నూలు' లోఁ జేరి 'మెట్రిక్కు' వఱకు విద్యాభ్యాసము. ఎఫ్. ఏ. హైదరాబాదునందు, బి. ఏ. మదరాసు ప్రెసిడెన్సీ కాలేజీయందు చదువుట. బి, ఏ వఱకును సంస్కృతము ద్వితీయ భాషగా గ్రహించి పఠించుటచే నాభాషలోని మెలఁకువలు ప్రతాపరెడ్డి గారికిఁ దెలియును. అదిగాక, గురుముఖమునఁ గావ్యపంచకము లఘు కౌముదియును జదువుకొని తమశక్తికి మెఱుఁగుపెట్టుకొనెను. బి. ఏ చదువుచుండఁగనే 'ఉచ్ఛల' నాటకము వీరు సంఘటించిరి. న్యాయవాది పట్టము వడసి హైదరాబాదులోనే, ఉర్దూభాషలో నెనిమిదేండ్లు

ప్లీడరుపని చేసిరనఁగా, ప్రతాపరెడ్డిగారి కాభాషలోని ప్రవేశమెంతటిదో తెలియఁగలదు. 'పార్సీ' యందును వీరి పరిశ్రమను ప్రశంసనీయమైనది. మొత్తముమీఁద సంస్కృతము, ఉర్దూ, పార్సీ, ఆంధ్రము, ఆంగ్లము - భాషలలోఁ జక్కని పరిచయము ప్రతాపరెడ్డిగారి కున్న యది. ఇట్టి విజ్ఞతలతో నీయన సారస్వతోద్యోగము నిర్వహించుచున్నారు. రాజకీయోద్యోగములు కోరిన మూలిసి కాకపోవుటచే ప్రతాపరెడ్డి యధికారి కాలేకపోయెను. పోనిండు! ఆయన గ్రంథములు నేవేలు విలువకలవి కావచ్చును.

నిండుగా నిరువది నాలుగేండ్లు ప్రతాపరెడ్డిగారు నెఱపిన మహోద్యోగ మొకఁ డున్నది. అది "గోలకొండ" పత్రికాసంపాదకత. వీరి యధికారములో 'గోలకొండ' అర్ధవార పత్రికయై మంచి ప్రఖ్యాతి ప్రచారములు వడసివచ్చినది. ఇటు లుండఁగా 'లిమిటెడ్ కంపెనీ' వారు వచ్చి దానిని దినపత్రికగా మార్చి నడపుచున్నారు. కారణాంతరములచే వారితోఁ గుదురక రెడ్డిగారు సంపాదకత వదలుకొని 'ఇటికాలపాడు' అను గ్రామములోఁ బ్రకృతము గడపుచున్నారు.

చరిత్ర, పరిశోధనము—అనఁగా వీరి కెంతో సంబరము. వీరియిల్లు చరిత్ర భాండారమని చెప్ప వచ్చును. ప్రతాపరెడ్డిగారి కథలు, సారస్వత వ్యాసములు, చరిత్ర, పరిశోధన రచనలు మొత్తము నూరులు సంఖ్యకుఁ బైబడియున్నది. నాటకములు వ్రాసిరి. పద్యరచన చేసిరి 'ప్రజాధికారములు' మున్నగా నెన్నో రాజకీయ విషయములపై చాల గ్రంథములు వెలువఱచిరి. హైందవ ధర్మవీరులు, రామాయణ విశేషములు, హిందువుల పండుగలు మున్నగునవి రెడ్డిగారి కూర్పులు వారి వివిధవిషయజ్ఞతకు నిదర్శనములైనవి. ఈయన పద్యకవితయు సాధుసుధురమైనది. తెనుఁగు భాషామతల్లిపై వ్రాసిన యాసీసము చూడవలయును;

పరిపూర్ణ పావనాంభ స్తరంగోద్వేగ
గౌతమీ గంభీర గమనమునకు
ఆలంపురీ నందనారామ విభ్రాజి
మల్లోబ ఫలరాజి మధురరుచికి
ఆంధ్రీ కుమారీ సమాయుక్త పరిపూత
తుంగా పయస్సు మాధుర్యమునకు
ఖండ శర్కర, జాతి, ఖర్జూర, గోక్షీర
ద్రాక్షాదియుత రామ రసమునకును
అమృత నిష్యంది వల్లకీ హ్లాదమునకు
రాగిణీ దివ్య సమ్మోహ రాగమునకు
తేనె తేటల నవకంపు సోనలకును
సాటి యగును మా తెనుఁగు భాషామతల్లి.

'ప్రణయిని' పై వీరు కట్టిన కవిత యెట్టులున్నదో యరయవచ్చును

ఉ. నీ నునుఁజెక్కులున్ మరియు నీ చిరునవ్వును దంతకాంతియున్
నీనయగారముల్ కలికి! నీదు మిటారపు గుబ్బదోయియున్
నీనడయాడుకొ నరయ నీచికురంబును కెంపుమోవియున్
చానరో! నాకు నామెడఁద సంశయ ముండిన చీల్చి చూడుమా!

ఉ. ఎచ్చటికేఁగినన్ మరియు నేమి యొనర్చిన నీదురూపమే
యిచ్చ దలంచుచుండు, కృపయించుక పూన వదేమొ, ఓర్వగా
వచ్చునె యీమనోవ్యథల వారిజలోచన! నీకటాక్షమున్
నచ్చితి నింక తాళగలనా, లలనా! చలమూన పాడియే!

ఉ. నీ సరసంపు ముచ్చటలు నీ తరళాయిత నేత్రయుగ్మమున్
వీసరవోని మోహమున వేమరు చిత్తములో స్మరించుచున్
వేసర కెల్లవేళలను ప్రేయసి! నిన్ గనఁగోరునాకయో!
ఆసలుగొల్పి యేచదగునా, మగువా! వగ పెంచుచున్నదే!

ప్రతాపరెడ్డిగారి, ఇత్యాదికమైన కవిత్వ మంతయు నొకయెత్తు, వారి 'ఆంధ్రుల సాంఘికచరిత్ర' గ్రంథ మొకయెత్తును. 1929 సంవత్సరము నుండియు రెడ్డిగారు తెలుఁగువారి సంఘమర్యాదలను, ఆయా కవుల గ్రంథముల ద్వారమును గుర్తించుకొనుచు వ్యాసరూపమున వెలువరించుచున్నారు. ఆ కృషియంతయు 1949 నాటికి పంటకు వచ్చి యేతద్గ్రంథరూపమున మనకు భుక్తమైనది. కాకతీయ సామ్రాజ్యము నాఁడు, రెడ్లపాలనమునాఁడు, విజయనగరరాజులు యేలుబడినాఁడు, మఱి వివిధప్రభుత్వములనాఁడు సాంఘికముగాఁ దెలుఁగుల మర్యాదలు, నడతలు నెట్టివో యీ కూర్పున హృదయంగమశక్తితోని ప్రదర్శింపఁ బడినవి. ఈ రచనవిషయమై రెడ్డిగారు కావించిన గ్రంథపఠనము, చరిత్ర పరిశోధనము గణనీయములైనవి. ఈకృతి చిరకాలస్థాయిగా నుండి తెలుఁగువారి కుపయోగపడు ననుటలో విప్రతిపత్తి లుండదు. వీరి రచనయు నిండుగా సొంపుగా నడచినది. వారు వ్రాసినట్లు:—

"రాజుల రాజ్యాల చరిత్ర వ్రాయుట అంతకష్టము కాదు. కాని సాంఘికచరిత్రము వ్రాయుట కష్టము. దీని కాధారములు తెలుఁగు సారస్వతము, శాసనములు, స్థానిక చరిత్రలు (కైఫీయత్తులు) విదేశీజనులు చూచి వ్రాసిన వ్రాఁతలు, శిల్పములు, చిత్తరువులు, నాణెములు, సామెతలు, ఇతర వాఙ్మయములలోని సూచనలు, దానపత్రములు, సుద్దులు, జంగముకథలు, పాటలు, చాటువులు, పూర్వవస్తు సంచయములు (Collections) — ఇవి సాంఘిక చరిత్రకు పనికి వచ్చు సాధనములు"

ఇంత సామగ్రితో శ్రమించి సంధానించిన రెడ్డిగారి సాంఘిక చరిత్రము నేఁటి సారస్వత కృతి సంభారమున నొక వెలుఁగు నిచ్చి, మెచ్చుకోలు పడయఁదగిన గ్రంథమై, వారి యశోలతకు మారాకు హత్తించు నదిగ నున్నది.

దువ్వూరి రామిరెడ్డి

1895-1947

రెడ్డి బిడ్డ. జన్మభూమి: నెల్లూరిమండలములోని పెమ్మారెడ్డి పాలెము. జననము: 9. నవంబరు 1895 సం. నిర్యాణము: 1947. రచనలు: ౧. పానశాల ౨. కృషీవలుఁడు 3. కుంభరాణా ౪. వనకుమారి ౫. సీతా వనవాసము ౬. నలజారమ్మ అగ్నిప్రవేశము. ౭. పలితకేశము ౮. Voice of the Read [ఆంగ్లకవితాసంపుటము] మున్నగునవి.

అభినవాంధ్ర కవితారసాలశాఖ నధిరోహించి మధురగానము చేసిన కవిపుంస్కోకిలము దువ్వూరి రామిరెడ్డిగారిజీవితము స్మరణీయమైనది.

ఆయన కలిగినరైతుబిడ్డ. ఆకలిమికిఁదోడు విజ్ఞానసంపత్తి. ఆసంపత్తికి సాయము తీయనైన కవితాధోరణి. ఈసమ్మేళనము చక్కనైనది. ఇది కవిసామాన్యమున కందని విందు. నెల్లూరిజిల్లాలోని పెమ్మారెడ్డి పాలెములో రామిరెడ్డిగారి పుట్టుక. అచటి పల్లెబ్రతుకుల మెలఁకువలో, వారికవిత యుట్టియులమీఁద నవనీతము మెనవి యార్ద్రమైనది. మెత్తని హృదయము; మెత్తని రచనాసంపత్తి. ఈభాగ్యముతో నాయన ఖండకావ్యము లెన్నో సంతరించెను. నాటికలు, కథానికలు, వ్యాసములు రచించెను. ఏమివ్రాసినను, స్వాతంత్ర్య దీప్తి ప్రదర్శించెడి నేర్పు కలములో నున్నది. నిసర్గమధురమైన పదబంధము రామిరెడ్డిగారికి జన్మతోభవము. ఈసిద్ధివలన నీయన పూర్వ పద్ధతులను దాఁటి నడచుచున్నానని సాహసముతో వచించెను. ఈదిగువ పద్యముఁలు పరికించునది:

చ. వనలతమైన నాకవిత పత్రపుటంబులఁ బూవురెమ్మలన్
దనదిన జృంభమాణమయి తేజరిలెన్ సహజ ప్రరోహవ
ర్ధన నియమాను సారముగఁ దల్లతమెన్నఁడుఁ దోఁటమాలి పా
ణిని గనుఁగొని నవ్యరమణీయతఁ జిల్కు నపూర్వ పద్ధతిన్.

గీ. పంజర నిబద్ధ కీరంబు బయలుగాంచి
యడ్డుకమ్ముల దాఁటంగ నాశచేయు
నటు బహిర్నియమంబుల నతికరించి
మన్మనంబు స్వాతంత్ర్య సీమకుఁ జరించు.

గీ. కాన నెవరేమి యనుకొన్న దాన నేమి
గలుగుఁ; గాల మనంతము; ఇల విశాల;
భావలోకము, క్రమముగాఁ బడయునూర్పు
ఏలహృదయంబు వెలిపుచ్చ నింతయుళుకు.

ఈచివరి పద్యభావము భవభూతిని స్మరింపఁ జేయునదికదా! ఈయన వ్రాసికొన్నంతగా భాషా—భావ స్వాతంత్ర్యములు హెచ్చు తీసికొన కుండఁగనే సంప్రదాయములం బాటించుచుఁ గవిత సాగించుట కానగును. ప్రాచీన కవిశాసనములపై దండెత్తి యుద్వృత్తుగా నక్షత్ర వీథులలో నెగురు కొందఱనంటి వాఁడు కాఁడు రామిరెడ్డిగారు. ఆయన భావ వైభవావేశమునకు సరిపడు భాషాభార ప్రవేశము కలవాఁడు. ఆంగ్ల పారసీక వాఙ్మయములలోని పలుకుబళ్ళు లెస్సగా గుర్తించిన వాఁడు. సంస్కృత వాఙ్మయపుఁ బొలుపులును దెలిసి కొన్నవాఁడు. సహజముగా సౌజన్యమూర్తి. ఈవయిని, కవిత్వమెటులుండునో భావింపుఁడు. ఈకవి యభిప్రాయమిది:

వేగు జామున వికసించు విరులయందు
రేకు వెడలించు సంజపూరెమ్మలందు
కావ్యమునఁ బోలెఁ బఠియింతు కౌతుకమున
ప్రకృతి సామ్రాజ్య పాలన పద్ధతులను.
చటులకల్లోల రవనల సాగరంబు
పవలు రేయి నాలాపించుపాటలందు
అనితర గ్రాహ్యధర్మంబులై చెలంగు
విశ్వసృష్టి ప్రకారముల్ వినుచునుందు.

గుజురుతుంపర ముత్యాల కాన్క లిడుచు
తెరలు సెలయేటి పాటలో దాగియున్న
రాగతత్త్వంబు నామని రాత్రులందు
కూయు కోయిల కడ నేర్చికొందు వనుల.

*

(ఇట్టి తత్త్వములో నీ రెడ్డి కవి కోకిలము మధురకావ్యగానముచేసినది. వీరి కృషీవలుఁడు- పానశాల మున్నయినకృతులు చాలఁ బ్రశస్తికెక్కియున్నవి. పల్లెటూరి రైతుబ్రదుకు 'కృషీవలుఁడు' కావ్యమున మూటకట్టినట్టులు ముచ్చటగాఁ గనవచ్చును.

అన్నా హాలిక! నీదు జీవితము నెయ్యం బార వర్ణింప మే
కొన్నన్ నిర్ఝర నావవేగమున వాక్పూరంబు మాధుర్య సం
పన్నంబై ప్రవహించుఁ గాని, యితరుల్ భగ్నాశులై యీర్ష్యతో
నన్నుం గర్షక పక్షపాతి యని నిందావాక్యముల్ పల్కరే!

రామిరెడ్డి కవిత్వమునకు హాలికుఁడు ఉద్దీపకుఁడైనాఁడు. గతానుగతిక మార్గమున సాగక, దేశకాలస్థితులు గుర్తించి తన తీయని కైతలో జానపద వాతావరణము రాణింపఁ జేసిన యీ రెడ్డికవి మఱువరానివాఁడు. ఈయన కవిత వివిధవిషయములయందును బ్రసరించినది.)
'ప్రణయాహ్వానము' ఎంత మెత్తగా నున్నదో, చూడనగును:

చంద్రికా ముగ్ధ శర్వరీచ్ఛాయలందు
జీవలోకంబు సుఖసుప్తి చెందుచుండ
కవి మనంబును బ్రకృతియు కలయుచుండ
పోదమా కాంత, సెలయేటి పొదలదరికి.

పులుఁగులు గూళులం జెదరిపోయిన రెక్కల నొత్తికొంచు, గొం
తులను పరస్పరంబు బిగితోఁ బెనవైచెడి వేళ, నెప్పుడుం
దెలుపని హృద్రహస్యముల తిన్నగ వీనులవిందుసేయ నా
చెలి సెలయేటి సైకతము చేరుదమా, మన కేలి యాత్రలన్.

జిలిబిలి కమ్మగానములు చేసెడి యా సెలయేటి యొడ్డునన్
పులకల విస్తరిల్లి నను బోడిమి జూపెదు నీదు బుగ్గలన్
దోలకెడిసిగ్గుడాలు కడదోపని ముద్దుల గ్రుమ్మరించి యి
వ్వాల మధురోక్తులం గడిగి వైచెదఁ గోమలి, రమ్ము మెల్లగన్.

*

(శ్రీ రామిరెడ్డిగారికి బెక్కుసారస్వతములతోఁ బరిచితి యున్నది. ఈయన ఆంగ్లకవితయు స్తుతిపాత్రమై యున్నది. విజ్ఞానశాస్త్ర పరిశోధనము లన్నచో నీయన కధికప్రీతి.) శాస్త్రపరిశోధకుల గౌరవనిధి పదివేలు మీఁదుగట్టి యుంచిన యీ రెడ్డిమహోదారత తెలుఁగునాఁట రత్నజ్యోతియై నిలువఁగలదు. శ్రీమత్కుటుంబమున జనించి, చేతులనిండ విత్తమార్జించి, దుర్వ్యసనములకుఁ బోక విజ్ఞాన నిక్షేపముగా వెచ్చించిన రామిరెడ్డి సాహిత్యధనము పవిత్రమైనది; స్థిరతరమైనదియును. కవితాకళయుండే కాక, లోకవ్యవహారములందును వీరికిఁ జాతుర్యము కలిగి యుండెడిది. 'సినిమా' దర్శకత్వములో నిరూపితమైన యీయన నైపుణ్యము గణ్యమై యున్నదిగదా!

విజ్ఞాన పరిశోధన ఫలము కవిత్వకళలో రంగరించి పొంగారఁజేసి యీమధురకవి వ్రాసిన "పలితకేశము"–"రవి, కవి," యను కావ్యములు చక్కనివి.) రెండవ కావ్యమునుండి రెండుపద్యములు:

చ. మునుపటినుండి మానవ సమూహము గాంచిన యున్నతస్థితుల్
పొనరిచినట్టి కార్యము లపూర్వ మనోబలసిద్ధులుం, జిరం
తనమగు దేశనాగరికతల్ బహుశాస్త్ర సమార్జనంబు జె
ప్పినఁ బదియేండ్లు పట్టుఁ; బృథివింగల దంతయుఁ జెప్పసాధ్యమే!

ఉ. వీనికి మూలకారకులు విశ్రుతబుద్ధి వివేక పూర్ణ వి
ద్యానిలయుల్ సమర్థులు నుదారగుణాఢ్యులు పూజ్యులైన మా
మానవులేగదా, తెలివిమాలి వచించితి వింత నేవు నో
భానుఁడ! చాలు చాలు, నిఁకఁ బల్కకు మేల వృథాప్రయాసముల్.

దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి

1897

[తెల్లగాణ్యశాఖీయ బ్రాహ్మణులు; తండ్రి: తమ్మనశాస్త్రి అను నామాంతరముగల వెంకటకృష్ణశాస్త్రి. జన్మస్థానము: చంద్రమపాలెము. నివాసము: పిఠాపురము, మదరాసు. జననము: 1897 సం. రచనలు:- ౧. కన్నీరు ౨. కృష్ణపక్షము. ౩. ప్రవాసము; ఊర్వశి. ౪. ఋగ్వేది. [ముద్రితములు] ౧. మహతి [గేయ సంపుటి] ౨. కార్తికి ౩. ఆకలి [జాతీయగీతములు] ౪. బదరిక [పద్యము] ౫. రేడియోనాటికలు ౬. సుప్రియ [సాహిత్య వ్యాసములు - అముద్రితములు] మొదలగునవి.

నేఁటి కవిలోకమున కృష్ణశాస్త్రిగారి దొక ప్రత్యేక స్థానము. దేవులపల్లిసోదరులను పీఠికాపుర సంస్థాన విద్వత్కవులుగా వింటిమి. ఈ జంటలో రెండవవారైన తమ్మనశాస్త్రిగారి కుమారుఁడీయన. తమ్మనశాస్త్రిగారి యసలు పేరు వేంకటకృష్ణశాస్త్రి. తండ్రికొడుకుల పేరు లొకటే. నాఁడు తండ్రిపేరు కంటె, నేఁడు కొడుకుపేరు విన్నవారి జనసంఖ్య పెద్దది. కాని, తండ్రిముందు కొడుకు వ్యుత్పత్తిలోఁ బేదవాఁడు. శివస్వరూపుఁడైన తమ్మనశాస్త్రి తేజస్సు ముందు కృష్ణశాస్త్రి కుమారమూర్తి. ఆయన కూర్చుండుటకు మేలిజాతి మణివితర్దిక కావలయును. ఇతనికి మెత్తని పూలపానుపుమీఁదఁ గాని నిదుర పట్టదు.

కృష్ణశాస్త్రికిఁ దొలుతొలుత పిఠాపురము హైస్కూలులో ఆంగ్లపుఁ జదువు. నాఁడు కూచి నరసింహముగారి గురుత్వము కళార్థుల నెందఱనో భావుకులనుగా దిద్దినది. ఆయన యంతేవాసియై యాంగ్ల కావ్య నాటకములలోని మెలఁకువలు గుఱుతించి కృష్ణశాస్త్రి తన ప్రతిభకు మెఱుఁగు పెట్టుకొనెను. 'స్కూలుఫైనలు' వఱకుఁ దండ్రితో నుండి

సాహిత్యతత్త్వము తెలిసికొను భాగ్యము. అవిమ్మట నాయనగారి నిర్యాణము. పినతండ్రి సుబ్బారాయశాస్త్రిగారుకూడ గతించినారు. తండ్రుల నెడబాసిన తనయుఁడు వారి యుపదేశములు నెమరునకుఁ దెచ్చుకొనుచు, వారి రచనలు పారాయణము చేసికొనుచుఁ గొంత కాలము గడపెను. కూచివారి యాచార్యకము కృష్ణశాస్త్రి యనూచానమైన ప్రతిభాసంపదకు మెఱుపడి కలిగించినది. మంచి చుఱుకైన బుద్ధి. విన్నది కన్నది వెంటనే పట్టుకొను నైశిత్యము! అప్పటి కప్పుడే కనఁబడిన గ్రంథమెల్లఁ జదివివాఁడు. 'స్కూలుఫైనలు' పరీక్షలో ను త్తీర్ణుఁడైన నాఁటికి వయస్సు పదునైదు సంవత్సరములు. పయిచదువున కొకయేఁడు ఆఁగవలసి వచ్చినది. ఈ సంవత్సరములో నాంధ్రసాహిత్య పఠనము. గ్రాంథిక వ్యావహారిక భాషావివాదము పెల్లురేఁగు నా కాలము కృష్ణశాస్త్రి ప్రభృతులకు వినోదస్థానము.

నాఁడు కాకినాడలోని కళాశాలకు రఘుపతి వేంకటరత్నము నాయుఁడు గారి యాధ్యక్ష్యము. నాయుఁడుగారి యుపన్యాసములు కృష్ణశాస్త్రికిఁ గ్రొత్త యుత్తేజనము కలిగించినవి. ఆయనలోని యాధ్యాత్మిక జిజ్ఞాస, మార్గదర్శకమైనది. 1919 లో 'ఇంటరు' లో గెలుపు. 1918 నాఁటికి బి. ఏ. పట్టభద్రత. విద్యార్థిదశలోనే బైబిలు, కురాన్, భగవద్గీతలలోని మెలఁకువలు, వెలుఁగులు నాయుఁడుగారు చూపించినారు. రామమోహనరాయల సిద్ధాంతములు, సాహిత్యములో అప్పారావుగారి పోకడలు గుండెకు పట్టుకొన్నవి.

ఇంక, విద్యార్థిదశదాఁటిన కృష్ణశాస్త్రిగారికి భాషా-సంఘసంస్కారములు కావలయునన్న భావము దృఢపడినది. కాకినాడలో బ్రహ్మసమాజము నాటకసమాజము వీరి సంస్కారణోద్దేశమున కొకదీప్తి కలిగించినవి. మొదట 'మిషన్' స్కూలులో నుద్యోగము. బ్రహ్మసమాజములో విడుమర లేని కృషి. 1919 సంవత్సరమునుండి కృష్ణశాస్త్రిగారి జీవితములో

నొక నూతన ప్రకరణ మారంభమైనది. గిడుగు రామమూర్తి పంతులు గారి వ్యావహారిక వాదముపై సంపూర్ణమైన విశ్వాసము పాదుకొన్నది. చింతా దీక్షితులుగారి సాహచర్యముతో వ్యావహారిక రచనా ప్రాచుర్యము కొనసాగించిరి. నేటికి, (రవీంద్రుడు—షెల్లీ, భవభూతి, పెద్దన, గురుజాడ అప్పారావు ఇత్యాదు లందఱు కృష్ణశాస్త్రిగారిలోఁ దీయతీయని తలఁపులు రేపిరి. దాని ఫలమే 'కృష్ణపక్షము'.) కొవ్వూరిలో నుండి యథాపథసేవ చేసికొనుచు 'కృష్ణపక్షము' ముగించిరఁట. 1921 జాతీయోద్యమమునకు వీరిని పురికొల్పిన వత్సరము. ఆయేఁడే దైవవశమున కృష్ణశాస్త్రిగారికి సతీవియోగము. ఆ పిదప పిఠాపురము హైస్కూలులో ఉద్యోగధర్మము; ద్వితీయవివాహమును. మహారాజు కృష్ణశాస్త్రిగారి జాతీయభావములు సహింపలేక యుద్యోగమునుండి తొలఁగించివైచెను. తరువాత మఱికొన్ని సంవత్సరములకు 1932 మొదలు 1941 వఱకు కాకినాడ కళాశాలోద్యోగము. అంతటితో దానికిని స్వస్తి. ఆత్మగౌరవమును బాటించుకొన నని కృష్ణశాస్త్రిగారు ప్రతిజ్ఞపట్టినచో, ఆయన కీపాటికి 'ప్రిన్సిపాలు' పదవి వచ్చియుండవచ్చును. ఆదురదృష్ట మాయనకుఁ బట్టలేదు. ఇది కృష్ణశాస్త్రిగారి జీవితములోఁ గొండటికే విందుగూర్చు భాగము. ఈ పయిది భావుకులకు విడువరాని యాతిథ్యము.

"తలిరాకు జొంపములు సం
దుల త్రోవల నేలువాలు తుహిన కిరణ కో
మలరేఖవో! పువుదీవవో!
వెలఁదీ, యెచ్చోటి కేగెదో? (?) సీవవిటపీ వనిలోన్."

కారు మొయిళ్ళ కాటుగ పొగల్ వెలిగ్రక్కు తమాలవాటి నే దారియుఁ గానరాదు, నెలఁతా! యెటు వోయెద వర్ధరాత్రి? వి స్ఫార విలోచనాంధ తమసమ్ములఁ జిమ్ముచు వేడివేడి ని ట్టూరుపులన్ నిశీథ పవనోర్మి వితానము మేలు కొల్పుచున్.

అది శరద్రాత్రి ; శీతచంద్రాత పాంత
రాళరమణీయ రజత తల్పంబు నందుఁ
జల్లఁగా నిద్రవోవు ద్రేపల్లెవాఁడ
సకల గోపాల గోపికా గణముతోడ.

*

ఎలదేటి చిఱుపాట సెలయేటి కెరటాలఁ
బడిపోవు విరికన్నె వలపు వోలె,
తీయని మల్లెపూఁ దేనె సోనల పైని
తూగాడు తలిరాకుదోన వోలె,
తొలిప్రొద్దు తెమ్మెర త్రోవలోఁ బయనమై
పరువెత్తు కోయిల పాట వోలె
వెల్లువలై పాఱు వెలఁది వెన్నెలలోన
మునిఁగిపోయిన మబ్బుతునక వోలె,
చిఱుత తొలకరి వానగాఁ, జిన్నసోనగ,
పొంగి పొరలెడు గాల్వగా, నింగి కెగయు
కడలిగాఁ బిల్లగ్రోవిని వెడలు వింత
తీయఁదనముల లీనమైపోయె నెడఁద.

*

జిలిబిలి పట్టురేకుల వెంట దొట్రిలు
మల్లియయెద దాఁగు మధుపరవము
కనుచూవు దాటు నామనిఁబాయు కోయిల
గొంతులోఁ జిక్కు వసంతగీతి
విభువీడి శుష్కించు విరహిణి సెలయేటి
కడుపులో నడగిన కడలి మ్రోత

తేనికై వెదకెదు జిక్క చూపులలోనఁ
జెఱవడ్డ నింతుచందురుని పాట
యిట్లు నీ దీన గోపికా హృదయ మంది
రాంతరాళములోనఁ ద్రుళ్లింతలాడు
వేణు నాదంబు వినిపించు విశ్వమోహ
నాకృతిఁ గిశోరగాయకు నరయు చుంటి.
ఇది నాచరితము, విని, నీ
వదరెదు, తొట్రిలెదు, వడఁకు, దటు నిటు కనులన్
జెదరెదు చూపుల నేదో
వెదకెదు, ఎవ్వాతెవు నీవవిటపీస్థలిలోన్.

('అన్వేషణము' అను శీర్షికతోనున్న ఖండకావ్యమునందలి కొన్ని పద్యములివి. ఈరచనలోఁ దొల్లిటి ప్రబంధముల వాసన లేఁత లేఁతగా నున్నది. శైలిలోఁ దెనుఁగుఁదనము, కొన్నిశబ్దంపులలోఁ గ్రొత్తఁదనము, సంవిధానములోఁ దియ్యఁదనము జక్కగాఁడి శ్రుతుల కతిథి గౌరవము నొనఁగుచున్నవి. కృష్ణశాస్త్రిగారి భావన 'అన్వేషణము' తో నారంభమై నేఁటికి లోతులు ముట్టినది. ఈయన తెలుఁగు వారి కిచ్చిన కావ్యములు ప్రధానములైనవి: ప్రవాసము; ఊర్వశి – కృష్ణపక్షము. ఈ కవినుండి యుబికిన యక్షరములు తక్కువ. కాని, వాని బరువెంతో యెక్కువ. ఆయన ప్రత్యక్షరము ముట్టి చూచినచో నార్ద్రమైన యొక్కొక్క కలువపు రేకు చుట్టినటులు తోఁచును. కాఠిన్యము సహింపని యీ కవి జయదేవుని వలె పదములేఱుకొని, భవభూతి వలె పాడినాఁడు. క్షీరసాగరము వంటి హృదయము; చెమ్మగిల్లుచున్న కన్నులు! బ్రతుకుపై నిరాశ!)

ఏను మరణించుచున్నాను; ఇటు నశించు
నాకొఱకు చెమ్మగిల నయనమ్ములేదు;

పసిఁడి వేకువ పెండ్లిండ్ల బడిన యెవరు
కరగనేర్తురు జరఠాంధకారమృతికి ?
నామరణశయ్య పఱచుకొన్నాను నేనె !
నేనె నాకు పీడ్కోలుపు విన్పించినాను !
నేనె నాపయి వాలినా, నేనె జాలి
నెద నెద గదించినాను, రోదించినాను.
బ్రతికియున్న మృత్యువునైన ప్రవాస తిమిర
నీరవ సమాధిఁ గ్రుక్కి క్రుంగినపుడేని
నిను పిలిచినానా, నాపూల్గు నీడ ముసిరి
[illegible]ములు నేమొ నీ [illegible]నోత్సవముల ననుచు
[illegible]దియు నాచితి, [illegible]తి నేనె దీని
వదలిపోని యా[illegible] వాంఛ గాఁగ ;
పడకని కరాలు రగులుచు దుడుకు చిచ్చు
లాలనల నింత నుసిగాఁగ కాలు త్రుటిని !
అలయు వాతెఱ యూర్పు గాలులు కదల్చి
రేపునంతె నా శాస్త్రాల రేగుమంట
మును బ్రతుకునట్ల నాదేహమును దహింపు !
పడదు లే ఆర్పగా నొక బాష్పమేని!

పడమటికవులు షెల్లీ, బైరను మొదలగువారిట్టి యీభావనకు దారి చూపినవారనుట సత్యమగుఁగాక! మన కృష్ణశాస్త్రిగారి కెందఱికో యందని తేనెబిందువులు దొరకినవి. అవి యాయన కవితలో నక్షరములై వెలికుబుకును. ఆయన పద్యము కాదు పాటకాదు మలచి మలచి, తూకము సరిపెట్టుకొని బయటఁ బెట్టునలవాటు గలవ్యక్తి. భావన లోఁతునకు, పదముల కూరుపునకు హెచ్చు కుందు లుండవు. ఆ సుగుణముగల కవులు తక్కువ సంఖ్యలో నున్నారు. రచనలోని యీశిల్పము లీరు చూడుఁడు.

రేయికడుపున చీకటి చాయవోలె
తమవు బెడఁద దివాంధగీతము విధాన
ఘూక రావాన వలవంత లేక రీతి
నా విషాదమ్ములో దాగినాఁడ నేన!

(దేవులపల్లి కవితాగానము ముప్పాతికపాలు కరుణాత్మకము. కరుణలోనే మధురిమ నించి పాఠకుల నూరింపఁజేయు శక్తి ఆయన కల ములోఁ దులకాడుచుండును. దేవులపల్లి కవి యాత్రోవ నవీన కవు లెందఱో యనుసరించినారు. "కవి మృతుఁడైపను చనిపోవరా" దని కృష్ణశాస్త్రిగారి వాణి. బ్రతికియుండియు మరణించుచున్న-జీవచ్ఛవము లైన కవులను జూచి కృష్ణశాస్త్రిగారికి జాలి. రవీంద్రుని యడుగు జాడ లలో పీరినడక. తెనుఁగు కవులలో నన్నయ - రామకృష్ణుఁడు ఇత్యా దులు కొందఱే పీరాయన దృష్టిలో మహాకవులు. జయదేవుఁడు, అమర కుఁడు, కాళిదాసు, భవభూతి వీరిపేళ్లు చెప్పి కృష్ణశాస్త్రిగారు పొంగి పోదురు. వేంకటరత్నము నాయఁడుగారు గురుస్థానము.) ఆయనమీఁద గొప్ప హృదయముతో నీయన రచించిన పద్యములు భావింపఁ దగినవి; విస్మరింప రానివియును.

ఈ జడజీవితమ్ము పలికించితి, వీ యఘపంకమందు సం
భోజము మొల్వఁజేసితి, వపూర్వము నీదయ, యానిశీథి నీ
రాజన మెత్తినావు, విపులమ్మగు నీయెద నిండెనే శర
ద్రాజిత చంద్ర కాంతు లమృతమ్ములు స్వర్గలతాంత వాసనల్.

*

నాయెదలోఁ ద్వదీయ చరణమ్ముల చిహ్నము లెన్నఁడేనియున్
మాయవ, యేనిశీథపుఁ దమస్సులు మూసినఁగాని జీవయా
త్రాయత వీథి నొక్కఁడఁ బ్రయాణము సేయుదు నక్షయంపుఁబా
థేయముగా గ్రహించి గురుదేవముఖస్రుత గీతికాసుధల్.

*

ప్రతిఫల మ్మిసుమంత వలవక కర్మముల్
సేయు నీమెయి కురుక్షేత్ర మగును,
ఆశాంతములకుఁ జరాచరమ్ములకును
దరలు నీయెడఁద బృందావన మగు,
వివిధ ధర్మజ్ఞాన వేణీ సమాశ్లేష
మైన నీమనసు ప్రయాగ యగును,
పాతాళమును స్వర్గపద మొక ముడిలోన
నతుకు నీవే వారణాసి వౌదు
నీవు కప్పడ నెదుట గా నిలిచినట్లె
మ్రోలను పురాణ భారత పుణ్యభూమి!
మాకు దినదిన దివ్యయాత్రా కృతోత్స
వానుభూతి నొసంగు బ్రహ్మర్షి వీవు.

గురువునెడల దేవులపల్లికవి భక్తిప్రపత్తులకే కాక, ఆధ్యాత్మిక దృష్టి నైశిత్యమునకుఁగూడ నీరచన తారకాణ. కృష్ణశాస్త్రిగారిలో నొక విశేషమున్నది; వీరి భావన మృదుల మృగులముగా నుండి లోఁతుల నంటుకొనును. ఆ పలుకుల మెత్తఁదనము హాయి యనిపించును. ఎంతసేపు, కవికి శైలిపై చూపు. ఆయనపాట లందుకే తెనుఁగునాఁట ముచ్చటగాఁ బాడుకొనుచుందురు.)

ఎవరో హో, ఈ నిశీథి
నగసి నీడవోలె నిలిచి
పిలుతు రెవరో, మూగకనులు
మోయలేని చూపులతో
ఎవరో హో! ఎవరో హో!
ఇవుడా నను బలుకరింతురు!

ప్రేమాయుతేని నీరవగళ
మున జరించు కోరికతో
ఇపుడా నను బలుకరింతురు!
ఎవరని ఈరేయి నిదుర
హృదయ మదర, వేయి రేయి
చాయలాడ పెనుచీకటి
సైగలతో నాకన్నుల
రక్తమురల లాగికొందురు!

*　　*　　*　　*

ఇది మున్నుగా నెన్నో కృష్ణశాస్త్రిగారి పాటలు ప్రశస్తి గొని యున్నవి. "జయజయజయ ప్రియభారత జనయిత్రీ!" "యువపతాక నవ పతాక, అరుణారుణ జయపతాక" ఈపాటలు గానము చేయని సభలు నేడు తక్కువ.

అభినవాంధ్ర కవులలో నొక ప్రత్యేకత సంపాదించుకొన్న దేవుల పల్లి కవి పరసేవాహైన్యము ననుభవింపలేని ఆత్మగౌరవశీలి అయినను 1932 మొదలు 1941 దాక పి. ఆర్. కాలేజీలో ఉపన్యాసక పదవిలో నుండవలసి వచ్చినది. పెనుకటి యుద్యోగముల వలెనే యీ పదవికూడ స్వాతంత్ర్య మారుతము ధాటి కాగలేక పోయినది. ఆ తరువాత కృష్ణశాస్త్రిగారి మనుగడ మదరాసులో. 'మల్లీశ్వరి' మొదలగు చలన చిత్రములకు పాటలు, మాటలు వ్రాసి యిచ్చుచు, రేడియోలో నాటికలు ప్రసారముచేయుచుఁ గాలక్షేపము. చిన్న చిన్న కావ్యము లేవో కొన్ని రచించి, యొక రకమైన కవితాపథమునకు దర్శకత్వము సంపాదించనే కాని, కృష్ణశాస్త్రిగారు రెడ్డికము వేసికొని మహాగ్రంథ మేదియు వ్రాయలేకపోవుట యొక కొదవ యని కొందఱి విమర్శ.

సంపుటములు పెంచకపోయినను, బయటఁబెట్టిన యక్షరములు రస స్రోతస్సులు! ఆయన యిట్లు పాడుకొనుచున్నాఁడు.)

నా హృదయమందు విశ్వ వీణాగళమ్ము
ఘోరు ఘోరున నీనాఁడు మ్రోఁత వెట్టు
దశదిశా తంత్రు లొక్క సుధాశ్రుతిని బె
నంగి చుక్కల మెట్లపై వంగి వంగి
నిలిచి నిలిచి నృత్యోత్సవమ్ములఁ జరించు.

*

వెలుఁగులో, అమృతాలొ, తావులొ, మరేవొ
కురియు జడులు జడులు గాఁగ, పొరలిపాఱు
కాలువలు గాఁగ, పూర్ణకల్లోలములుగ
కలదు నాలోన క్షీరసాగరము నేఁడు.

గుఱ్ఱం జాషువ కవి

1895

జననీజనకులు : లింగమాంబా, వీరయ్యలు. జన్మస్థానము : వినుకొండ. జననము : 1895 అక్టోబరు 28 తేదీ. కృతులు : ౧. ఖండకావ్యము [మూఁడుభాగములు] ౨. పిరదౌసి ౩. గబ్బిలము ౪. స్వప్నకథ ౫. కాందిశీకుఁడు ౬. ముంటాజమహలు ౭. నేతాజి ౮. స్వయంవరము ౯. బాపూజీ [ఖండ కావ్యములు] ౧౦. వీరాబాయి [చరిత్రాత్మక నాటకము] ౧౧. తెరచాటు [సాంఘిక నాటకము] ఇత్యాదులు మొత్తము నేఁటికి రచితములు ౨౧ గ్రంథములు.

నేఁడుసాగుచున్న యిరువదవ శతకమునకు ఖండకావ్యశకమని పేరు పెట్టుటలో నాక్షేప ముండదు. మహాకవి కాళిదాసు ' మేఘదూతము ' ఈ నూతన శకము మేలుబంతి. ఈ కాలమున జనించిన మహాకావ్యములు వ్రేళ్ళలెక్కకు వచ్చునవి. ఖండకావ్యము లసంఖ్యాకములు. అనేక కారణములవలన నేటి పాఠకులు సుకుమార హృదయులైనారు. పాఠకుల చిత్తవృత్తుల కనుగుణముగా రచయితలును. లేదా, కొన్ని హేతువు లుండి రచయితలు కవితలో మితభాషులుగానున్నారు. రచయితల ననుసరించి పఠితలును. నేఁటికవుల చూపులలోఁ గొత్త మెఱుఁగు లున్నవి. వారేఱుకొనవలసిన యితివృత్తములే వేఱు. జాతీయమైన సంచలనము, రాజకీయమైన పరిణామము, భాషీయమైన వికాసము - ఇత్యాదు లెన్నో తెనుఁగున వెల్లిగొని కవిత్వమున నూత్నమార్గములు లేచినవి. పెఱ వాఙ్మయములతో మన కేర్పడిన సాన్నిహిత్యము కూడ నీ నవోదయమునకుఁ జేయూఁతనఁ దగిన యాదరువు. దాన, దీన - స్వల్పకాల పఠన సాధ్యమగు ఖండకావ్యగానమునకు నేఁడు సుప్రచారప్రశస్తులు పరిఢవిల్లుచున్నవి. ఖండకావ్యములు రెండు మూఁడు పద్యములనుండి, రెండు మూఁడు నూఱుల పద్యముల వఱకు నున్నవి

యీనాఁడు వెలువడుచున్నవి. పద్యముల రాశితోనే కావ్యత్వ సిద్ధి యనరాదుగదా! "అమరుక కవేరేకః శ్లోకః ప్రబంధశతాయతే." కావ్యముయొక్క ఏకదేశానుసారియైనది ఖండకావ్య మని సాహిత్య దర్పణకారుఁడు. దీనికే సంఘాత మని నామాంతరము. ఇది యపూర్వము కాకపోయినను, పూర్వ కవులలో ఖండకావ్య రచయితలు మిక్కిలి తక్కువ. నేఁడో మూఁడువంతులు ఖండకావ్యముల కారు.

ఏతాదృశ కావ్య వాఙ్మయ మధుమాసమున 'జాషువకవి' కషాయ కంఠమున గాన మొనరించుచున్న పుంస్కోకము. ఆయన ఉభయ భాషా ప్రవీణులు, కవితా విశారదులును. చరిత్ర ప్రసిద్ధమైన వినుకొండలో జాషువకవి జన్మించుట పేర్కొనఁ దగినది. ఈ ధన్యత్వము, ఆయన గుర్తులో నుంచుకొని యిట్లు వ్రాసికొనెను:

శ్రీరాముఁ డేకొండ శిఖరానఁ గన్నీట
నాలించె సీతాపహరణగాథ
దాటించె నేపీటి దాపున నైతమ్ము
పట్టి మేల్కొట్టేలి వాహనంబు
కోట కొమ్మలమీఁద గ్రుచ్చినా రేపీటి
తెలుఁగురాజుల విరోధుల శిరాలు
ముత్యాలతో నారబోసినా రేపీటి
నృపతు లేటేటఁ బండిన యశస్సు
భాస్కరుని దానధార కేపట్టణంబు
చారు చరితకు బంగారు నీరు వోసె
నట్టి వినుకొండ కనుపునఁ బుట్టుకతన
ధన్యుఁడను నేన యుత్తమోత్తముఁడ నేన.

జన్మస్థానము వినుకొండ యగుఁగాక, తెలుఁగుమండలము సర్వము జాషువకవి కీర్తికి స్థానమైయున్నది. సాధారణ ప్రజానీకములోనైతము

మెచ్చుకోలుపడయఁగల కవితారచన జాషువకవిగారికి నైసర్గికమైయుండి వచ్చినది. రసికవిద్వాంసులు వీరికృతులు చూచి మురిసిపోవుదురు. ఏమనఁగా, తియ్యనైన శయ్యావైభవముతో, నిర్దుష్టమైన భాషాప్రాభవముతో హృదయములో నున్నవిషయమంతయుఁ బాఠకున కందీయఁగల కూర్పునేర్పు వీరి కబ్బినది. అబ్బిన చాతుర్యమును నిరంతరాభ్యాసమువలనఁ బెంపుచేసికొనిరి. దానితో, ఆయన ప్రతిపద్యము హాయి యనిపించునట్లు వ్రాయఁగలఁగును. బంగారు తీగవంటి యేదో యొకధారాళత! వృత్తములు, విశేషించి సీసములు, క్రొత్తధోరణిలో క్రొత్తసొంపులు పెట్టి వ్రాయుటలో నీకవి పేరువడెను. ఈయన రచించిన ఖండకావ్యములన్నింటను శైలి సరిగా నొకేతీరున సాగుచుండుట గమనింపఁదగినది. ఆయన పలుకుబడులు, జాతీయములు, విదేశీయపద ప్రయోగములు, ఎత్తుగడలు — ఎక్కడకు వెళ్లినను మారిపోవు. అదీ ఆయన ప్రత్యేకత. ఈ పద్యములు కొన్ని చూడుఁడు :

వేగిరాజుల నతీ వితతికి గరువంపు
 నడక నేర్పినది నన్నయ్యరచన
తెనుఁగుభాషా పదమ్మునకు జారని వన్నె
 బట్టించినది కవిబ్రహ్మపలుకు
కంచుఢక్కల నోరు గట్టించి జయకేత
 నముల నెత్తినది శ్రీనాథుజిహ్వ
ప్రతిలేని యపవర్గ పదవి వంకకు రహ
 దారి తీసినది పోతన చరిత్ర
విజయనగరాధిపుల పురావేదికలకు
నందలంబుల మోయు మర్యాద గరపి
తనివి గొన్నది మొన్న పెద్దన కవిత్వ
మాంధ్ర భారతీ ! నీ తేజ మద్భుతంబు.

*

విజయ విలాసుని వినుతింపఁ దలఁచిన
జక్కన్న కోరమీసాలు దువ్వె
జక్కన్న కవనంబు చక్కఁజేసిన పల్కు
పినవీరకవి నాల్క వెళ్లఁ బెట్టె
పినవీరకవి పల్కు వెలఁదికి మురుగఁ దన్న
గండ పెండారంబు ఘల్లు మనియె
పెద్దన్న కవితకుఁ బెదతాత యనిపల్కు
రామభూషణుఁ డంబరంబు నూచె
భట్టుమూర్తికి కవిరాజపట్ట మీయ
శెట్టి లింగడు చేపల బుట్ట నూపె
గందఱుందఱు మహాపీఠము లని తలంచి
యొక్క నమస్కార మొనరించి యూరకుంటి.

*

కరుడైపోయిన వీరలోకమున కై కన్నీరు వర్షించుచున్
గరముల్ మోడుచు మందభాగ్యదశ కింకన్ దావు లేకుండఁగా
దొరకె న్నాకు విచిత్ర దిగ్విజయ వస్తుశ్రేణి బాపూజిచే
తరమే మమ్మెదిరింప నన్యులకు ఛత్రగ్రాహి ఖండాళికిన్.

"స్వయంవరము"

*

ఆడంగుల్ కలవారి తోయ్యలు లనూర్ధ్యంపశ్యలై, హాయిగా
మాడీలం బరదాలలో మెరయు శంపావల్లులై యొప్పగా
నాడుం గొండల కోనలన్ గృషికకాంతల్ మూవులం బావల
ల్లాడం గష్టము చేయు దృశ్యములు నాయాత్మం బ్రపీడించెడిన్.

"కాందిశీకుడు"

*

ఇట్టి శయ్యాసౌష్ఠవము తఱచుగా నేఁడు మనము చూడఁ జాలము. విజాతీయ పదములకు మాఱిపోని తెలుఁగుముద్ర వేసినకవి జాషువయే. ఆయన ఖండకృతులలోఁ దొలుత మంచిపేరువడ్డది "పిరదౌసి". దాని వెనుకఁ బాలకృతులాయన వెలువరించెను. ఇవియెల్ల 'పిరదౌసి' కావ్యమునకు ఆమ్రేడితములు. గబ్బిలము – అనసూయ మున్నగు వీరిరచనలు వ్యథాభరితమైన హృదయమునుండి పొంగి వచ్చినవిగాఁ దోఁచును. ఈయన కెంత యుత్సాహోద్రేకము లున్నవో, అంత యావేదన మున్నది. ఆ వేదనమునుండి సముత్పన్నమగు కవిత రసార్ద్రమైయుండి రసిక మానసములు కరగించుటకు సమర్థమగును. కర్ణుని గూర్చి ఆయన రచించిన పద్యములు గొప్పవి. శ్రుతిసుఖమైన జాషువకవి కోకిలము కవిత్వ గానము విద్యార్థులు, విద్వాంసులు, పామరులు ధీమంతులు కూడ విని తనియుటకుఁ దగును. అన్వయములో పెళుసుతనము, పదముద్రలో బిగువుఁదనము లేక కమ్మెచ్చునఁ దీసినట్టులు నడచు వీరి కవితాశైలి తెలుఁగువారి పారాయణముగా జాలువాఱుచున్నది.

జాషువకవి యుభయభాషాప్రవీణ బిరుద విభ్రాజితుఁడు. 1919 నుండి గుంటూరున ట్రెయినింగుస్కూలులో 1928 వఱకు నుద్యోగించెను. తరువాత, 29 సం॥ నుండి 15 సంవత్సరములు గుంటూరు జిల్లా బోర్డు పాఠశాలలో తెలుఁగుపండితపదవి. 42 సం॥ నుండి మూఁడు వత్సరములు మదరాసున యుద్ధవిషయికమైన ప్రచారశాఖలో పాటలు వ్రాయుచు, ఉపన్యాసములిచ్చుచుఁ గడపెను. 47 నుండి యుద్యోగ విరమణము. ఈవిశ్రాంతిలో నెన్నో కావ్యములు రచించుటకు వీరు సమర్థులు.

కావ్యరచనోద్యోగము ముందు, ఈ యుద్యోగములన్నియు లెక్కలేనివి. ఆయన ఆధునిక కవులలోఁ జెఱిగిపోని తఱిగిపోని యశస్సు నమార్జించుకొన్న కవి. గండపెండరములు తొడిగి, ఏనుఁగు నెక్కించి, కనకాభిషేకము చేసి, సహస్రద్రవ్యములు కానుకగానిచ్చి, తెలుఁగునేల జాషువకవిగారిని గౌరవించుచున్నది. ఈ గౌరవములకు వారికావ్యములు దోయిలించుచున్నవి.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

1891

వెలనాటి వైదిక బ్రాహ్మణుఁడు. కౌశికసగోత్రుఁడు. తల్లి: మహాలక్ష్మిసోదెమ్మ. తండ్రి: లక్ష్మీపతిసోమయాజులు. జన్మస్థానము: పొలమూరు [రామచంద్రపురము తాలూకా] నివాసము: రాజమహేంద్రవరము. జననము: 23 ఏప్రిలు 1891. ఖరసంవత్సర చైత్రశుద్ధ చతుర్దశీ గురువాసరము. రచనలు: ౧. మహాభక్తవిజయము ౨. వీరాంగనలు ౩. భారత రమణీమణులు ౪. ప్రేమపాశము [నాటకము] ౫. వారకాంత ౬. మిథునానురాగము ౭ స్మశానవాటిక ౮. రక్షాబంధనము ౯. అనాథబాలిక. ౧౦. వీరపూజ. ౧౧ రాజరాజు [నాటకము] ౧౨. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు [నేఁటికిముద్రితములగు సంపుటములు] ౧౩. పాణిగృహీత శ్రవణానందశృంఖల ౧౪. ఆయుర్వేద యోగ ముక్తావళి. ౧౫. వైద్యక పరిభాష [ముద్రితములు] ౧౬. కర్ణవధ. ౧౭. ఊరుభంగము. ౧౮. బొబ్బిలియుద్ధము. ౧౯. నిగళబంధనము [పయి నాలుగును నాటకములు] ౨౦. ఆత్మబలి [నవల] ౨౧. శ్రీమద్రామాయణము [వ్యావహారిక వచనములో] ౨౨. ఖండకావ్యములు, ఇత్యాదు లముద్రితములు.

నేఁటి తెనుఁగు కథా రచయితలలో, మునుముందుగా జ్ఞప్తికందు కొందఱిలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారొకరు. ఒకరనుటకంటే, మొదటివారనుటయు నతిశయోక్తము కారాదు. కారణము, ఆయన వ్రాసిన ప్రత్యక్షరము సహజప్రతిభనుండి పొటమరించినది; ఆయన చేసిన ప్రతికల్పనము ప్రత్యక్షమున కవిరుద్ధమైనది; ఆయన పాత్రలచేఁ బలికించిన ప్రతిపదము, ఇరుగుపొరుగుల మనసు వినుచున్నది; ఆయన ప్రదర్శించిన ప్రతి సంవిధానము మన యనుభూతులకు దవ్వుగానిది; ఆయన కట్టిన కథ లెల్ల తెలుఁగుదేశపు టెల్లలు గడచిపోయినవి. ఈ తీరున సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అచ్చమైన తెనుఁగుఁదనమును వలచి

వచ్చిన రచయిత. ఆంగలముకాని, వంగముకాని, మఱియొక వ్యాఙ్మయముకాని మర్యాదకైనఁ జదివి చూచినవారు కారు. విశేషించి, 'హిందీ' ని, చేరఁదీయరాదని చిరకాలమునుండి వారి వాదము. ఇంక, సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కూడఁబెట్టుకొన్న సంపత్తి సంస్కృత సాహిత్యమొక్కటే. ఇటులు, విజాతీయమైన సంస్కారధోరణికి దూరముగా నిలచి, కృతకత్వగర్హితముకాని యాంధ్రత్వము నారాధించిన రచయిత రచన లెట్లుండును? అనుకరణములుకాని, అనువాదములుకాని చేయవలసిన ప్రారబ్ధము సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి లేదు. యథార్థముగా ఆయన చూపులకుఁ గనిపించిన వస్తువు, ఆయన చెవులకు వినిపించిన మాటలు మూటఁగట్టుకొని కథలలోఁబెట్టి కళ కట్టింపను. ఉత్తమజాతి రచయిత చేసెడి పనియు, చేయఁగలిగిన పనియు నింతే! దీని వివరణము ముందు మనవిచేసెదను.

శ్రీపాదవారిది యనూచానమైన పండితవంశము. శ్రౌత స్మార్తములు, జ్యోతిషము వీరి వంశ విద్యలు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి తండ్రిగారు యజ్వ. ఆయన కన్న ముప్వురు కుమారులలోను మన శాస్త్రిగారు మూఁడవవారు. వంశస్థులందఱివలెనే వీరుకూడ శ్రౌత - స్మార్తములు, పారాయితము అధ్యయనము చేసినారు. జ్యోతిషము స్కంధత్రయము పఠించినారు. అదికాక, పల్లూరిలో గుంటూరి సీతారామశాస్త్రిగారు, వేట్లపాలెములో దర్భా బైరాగిశాస్త్రిగారు, తమయింట, అన్నగారు శివరామ శిద్ధాంతి దీక్షితులుగారు గురువులుగాఁ గావ్యపాఠము చేసిరి. పసినాఁటనే తెనుఁగులపై నభిరుచి యంకురించిన దగుటచే శాస్త్రిగారు, గురువుల చాటున నాంధ్రకృతులు చదువుచును, ఏవో చిన్న చిన్న రచనలు చేయుటయు సాగించినారు. సరియైన యుపదేశ మున్నఁగాని కవితారచన చేయరాదని ౧౯౧౦ సం॥లో సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి నిశ్చయము కలిగినది. ఈ సునిశ్చయముచే, పీఠికాపుర సంస్థాన కవులగు

వేంకట రామకృష్ణులను శాస్త్రిగారికి కవితా గురువులుగాఁ జేసినది. ౧౯౧౦ - ౧౧సం॥లో రామకృష్ణకవుల సాహచర్యమున నెన్నో సాహిత్యపు మెలఁకువలు, కవిత్వపుఁ బొలపములు శాస్త్రిగారు గుర్తింపఁగలిగినారు. ఇరువదియేండ్ల యీడు వచ్చుసరికి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు సానఁబెట్టిన రత్నము.

ప్రధానముగా, వీరి జీవితములో మెచ్చఁదగిన విషయము, వీ రే యధికారిని దోసిలియొగ్గి "నెలకూలి చాకిరీ"కొడఁబడకుండుట - వీరివలె నాత్మగౌరవము నధికముగా నిలఁబెట్టుకొనువారు తక్కువ. అట్లని, పరనిరపేక్షముగా జీవింపఁగల విత్తవంతుఁడును కాఁడు. ఆయనలోని తలఁపులు పయిమాటలు నొక్కటిసూటిగ నుండును. దాఁపరికము లేదు. చెప్పినదానికిఁ దిరుగుడు లేదు. ఎదుటివాఁడు సహృదయుఁడయినచో హృదయము ముద్దగట్టి ముందుంబెట్టును. కానిచో, పిలిచినను, పెడ మొగము పెట్టును. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి యథార్థవాదిత బంధు విరోధమునకుఁ గారణము కారానిది. ఇది యిటులుండఁగా, వారి తొలిరచన 'వారకాంత' యను నాటకము. కవిత్వము నాటకాంతము కావలయునన్న పెద్దలమాట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ముందునకుఁ దెచ్చినారు. ఈసందర్భమున వారొకప్పుడు చెప్పిన 'రేడియో' ప్రసంగము స్మరణకు వచ్చుచున్నది.

"పాఠకునకూ, ద్రష్టకూ రసానుభవం కలిగించి తన సందేశం స్ఫుటంగా వినిపించాలంటే, రచయితకు, తక్కిన కావ్యాలకంటే నాటకం చాలా మంచిసాధనం. కాని నాటకరచన చాలా కష్టమైనది. కావ్యసామాన్యం రచించే టప్పటికంటే నాటకం రచించేటప్పుడు రచయిత గొప్పబాధ్యత వహించవలసివుంటుంది. తనజాతివారికి సభ్యత అలవడజేయడమూ— అదితప్పిపోకుండా చూడడమూ—ఇదే ఆబాధ్యత. కవికి ఇంతశక్తి బాధ్యతా ఉందని తెలుసుకొన్నప్పుడు, శక్తిఉందా

లేదా అని చూసుకోకుండానే నేను నాటకరచనకి పూనుకున్నాను. నేను మొట్టమొదట రాసిన నాటకం—అంటే, నాకు నేనై రాసిననాటకం—"వారకాంత". కాని దానికర్తృత్వం నేను మరచిపోతున్నాను. నా నాటకాలలో నేను చెప్పుకోగలవి "ప్రేమపాశం", "నిగళబంధనం", "రాజరాజు"— ఇవి. వీటిలో ఒకటీరంగస్థలం ఎక్కలేదు. చదివిన వారు మాత్రం అనుకూలంగానూ ప్రతికూలంగాను కూడా మాట్లాడారు. కొన్ని ఏకాంకికలున్నూ రాశాను. వాటిలో నాకు మిక్కిలీ ప్రీతిప్రాత్రం "కలంపోటు".—"

ఈ 'వారకాంత' నాటకములోఁ బద్యములుకూడఁ జేర్చినారు. ఇది ప్రత్యేకించి చెప్పుటలో, సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ౧౯౩౮ నుండి బొత్తిగా పద్యబంధ ప్రాతికూల్యము వహించుట కారణము. ఈ ప్రతికూల భావము వారికి పద్యము హృద్యముగా వ్రాయలేక పోవుట వలనఁ గలిగినది కాదని యీ క్రింది పద్యము సాక్ష్యము చూపుచున్నాను.

బ్రతుకు ఘటించు నోషధి కరాళవిషంబున, నుక్కుతీవలం
దతి మృదునాదమున్, దహనునందు ప్రకాశము, నువ్వుసిటిలో
రతనము లాణిముత్తెములు రాళ్ళను, కప్పకు జీవనంబులున్
చతురతఁ గూర్చువెయ్యది యసాధ్యమునీకికఁ దీనబాంధవా!

"అత్త - అల్లుడు" - "అలంకృతి" - "అభిసారిక" - "బాలిక, తాత" మొదలగు ఖండకావ్యములు సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. మనోహరముగా రచించినవి యున్నవి.

శ్రీ శాస్త్రిగారి మొదటినవల 'మిథునానురాగము' అట్లే మొదటి కథ ౧౯౧౫ఫిబ్రవరిలో వెలువడినది. "ఇరువురమొక్కచోటికే పోదము" అని దాని పేరు. "ఇదియాది, ౧౯౩౩ సం॥ దాఁక గ్రాంథికములోనే శాస్త్రిగారు రచనలు సాగించుచు వచ్చిరి. క్రమముగా రెండుమూఁడేండ్లకు సంపూర్ణముగా వ్యావహారిక భాషావతరణము. విశేషమేమనఁగా

వీరు గ్రాంథికము వ్యావహారికము కూడ సహజమధురమైన శైలిలో వ్రాయఁగలవారు. శాస్త్రిగారు మున్ముందట వెలువరించిన చరిత్ర గ్రంథము వీరపూజ. ఆగ్రంథ మందలి గ్రాంథికశైలీ సౌభాగ్యము చాల విలువగలది. శ్మశాన వాటిక, రక్షాబంధనము ఇత్యాదులగు వీరి నవలలు ప్రజానీకములో సువ్యాప్తములై యున్నవి. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి వచనరచనలోఁ జలువ చందనము వంటి దేదో యుండి హృదయమునకు రాసికొనుచుండును. సమాసముల గడబిడలు, అన్వయముల తిరుగుడులు మచ్చునకును రానిచ్చు స్వభావ మాయన కలముకు లేదు. ఎంతసేపును, శాస్త్రిగారి చూపు సహజత్వముమీఁద. ఇది యటుండె,

౧౯౨౧ సం॥ నుండి శ్రీసుబ్రహ్మణ్యశాస్త్రిగారి స్వసిద్ధాంతములకు బీరమై 'ప్రబుద్ధాంధ్ర' వెలసినది. శాస్త్రిగారి సంపాదకత్వమున నీపత్రిక తొలియేఁడు ప్రతిపక్షమునకు వెలువడుచు, రెండవ యేఁటినుండి మాస పత్రికగా మాఱినది. ఆదిలో, ప్రబుద్ధాంధ్ర సగము సంస్కృతభాషా రచనలతోను, సగము తెలుఁగు రచనలతోను, వెలువడుట శాస్త్రిగారి యుభయభాషా వైదుష్యాభిమానములకు నిదర్శనము. అల్పకాలము ననే 'ప్రబుద్ధాంధ్ర' తెలుఁగునేల మూలమూలలకుఁ బ్రాకి పాఠకులను వలవైచిలాగినది. ఈ ఆకర్షణమునకు మహోత్తమరచయితల వ్యాసములే కాక, శాస్త్రిగారి వ్యాఖ్యలు, విమర్శనములు హేతువులైనవి. వీరి కలమునకు జంకుగొంకులు లేవని తొలుతననుకొంటిమి. గతానుగతికధర్మావలంబన మాయన బొత్తిగా సహింపలేరు. దానినిబట్టి హృదయములో నుండియో ఉండకో నూటికిఁ దొంబదిమందిచేఁ ద్రొక్కఁబడుచున్న సిద్ధాంతమును అమాంతముగా శాస్త్రిగారు గర్హింతురు. వట్టి గర్హణముతో సరిపెట్టక వాఁడికల వ్రాఁతలోఁబెట్టి సుప్రచారము చేయుదురు. ఆయనలోనున్న యీగుణమునకు వారి 'ప్రబుద్ధాంధ్ర'

నిలువుటద్ద మైనది. "హిందీ – గాంధి – ఖద్దరు" ఈమూడును శాస్త్రిగారి సిద్ధాంతములకు విరుద్ధమైన పదార్థములు. బౌద్ధుల త్రిరత్నములవలె, భారతీయుల పారాయణములోనున్న యీమూడు శబ్దములను విమర్శించుచున్న శాస్త్రిగారి గుండెనిబ్బరమునకు, అబ్బురమైన పట్టుదలకు మనము మెచ్చవలయును. 'ప్రబుద్ధాంధ్ర' తొమ్మిదియేండ్లునడచి మంచిప్రసిద్ధిలో నాఁగిపోయినది. సుబ్రహ్మణ్య శాస్త్రిగారి జీవన వైభవమునకు 'ప్రబుద్ధాంధ్ర' సాగిన దశాబ్దము మెఱుఁగు కాలము. ౧౯౩౮ సం॥ నుండి ఆపత్రికలో పద్యప్రకటనము నషేధించి, వచన రచనలే ప్రచురించెడివారు. కావున వచనవాఙ్మయమున కాపత్రికచేసిన మేలుమఱువరానిది. శాస్త్రిగారి సర్వగ్రంథరచనము నొకయెత్తు, ఈ పత్రికా ప్రచురణ మొకయెత్తుగా సాగినది. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ౧౯౧౬ మొదలు నాలుగేండ్లు కళాభివర్ధనీ నాటకసమాజము నడపిరనియుచటఁ జేరుకొనుట వారికళాభిరతికి గుఱుతు. నాటకములలో స్త్రీ–పురుష వేష ధారణము చేసెడివారనియు వినికలి. సంగీత కళపై పరికెక్కువ మక్కువ. సుమారు నూరుకృతులు గురుముఖమునఁ జెప్పుకొనిరఁట. కాని, గొంతెత్తి పాడఁగానేను వినలేదు. ౧౯౪౭ నుండి సంగీత సాహిత్య సభలు జరిపించుచు వీరు రాజమహేంద్రవరమున నూత్నకళా గౌరవము చాటుచుండుట ప్రశంసింపఁదగిన సంగతి. నన్నయ – శ్రీనాథ జయంతులు జేగీయమానముగా నడపించుచున్న శాస్త్రిగారి ప్రాచీన సారస్వతాదరణము నమస్కరణీయమైనది.

ఇంక, ప్రకృతము, వారు చిన్నకథలు వ్రాయుదురు. కాని, అవి గుణమున, పరిమాణమునఁ గూడ పెద్దకథలు. సంభాషణములసంతనలో నింత పరిపక్వత గల కథారచయితలు తక్కువ. పాత్రల మాటలలో వ్యక్తులతీరులు, భంగిమములు సుస్పష్టముగా మనకు గోచరింపఁ

జేయుదురు సాంసారికమైన ముచ్చటలు, సాంఘికమైన యాచారములు ప్రదర్శించుటలో శాస్త్రిగారిది యందెవేసినచేయి. వైదికకుటుంబముల లోని నడతలు వీరికథా ప్రపంచమున నచ్చుగుద్దినట్లు కానుపించును. 'వడ్లగింజలు – మార్గదర్శి – కన్యా కాలే యత్నాద్వరితా' – ఇత్యాదులయిన వీరికథలు రసవాహినులు. ప్రేమపాశం, నిగళబంధనం, రాజరాజు, కలంపోటు మొదలయిన సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నాటికలకు 'తెలుగునాట' సుప్రసిద్ధి వచ్చినది. నాయుద్దేశములో 'రాజరాజు' వీరి నాటకముల కన్నిటికిని కన్నుకు వంటి దని – అందులో నన్నయపాత్ర పోషణము అనన్య సాధారణమైన తీరులో శాస్త్రిగారు తీర్చినారు. రాజరాజుకడ, ఆత్మగౌరవము వీసమంతయినను చెడిపోకుండ నన్నయచేత బలికించినపాటవము సుబ్రహ్మణ్య శాస్త్రి గారికే చెల్లినది. ఇది యన్నమాట కాదు, ప్రతిపాత్రయును రాజరాజులో జీవమ్మూర్తులై కనిపించును. ఇట్టి 'రాజరాజును' సాహిత్య సామ్రాట్టు విక్రమదేవవర్మ మహారాజు కృతిపొందుట యభినందనీయము. 'కలంపోటు' మొదలగు నాటికలు వీరివి యెన్నిసారులు చదివినను జదువవలయు ననిపించును.

నాటికారచనలో, కథారచనలో, పత్రికా సంపాదకతలో శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారిది తెలుగు భూమిలో నొక ప్రత్యేకపీఠము. నాలుగుదశాబ్దులనుండి బహుగ్రంథ రచనలచే భారతీ సమారాధనము చేయు శాస్త్రిగారి వయస్సు నేటికి షష్టిలో నున్నను, భౌతిక పుష్టియు, భావపుష్టియు గలిగియుండిన ధన్యులు. వారికృతు లెన్నో మునుముందు మనము పఠింపగలము.

సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి

1897

వైదికబ్రాహ్మణులు. తల్లి: బుచ్చివరసమ్మ. తండ్రి: సుబ్బయ్య. నివాసము: సికింద్రాబాదు. జననము: 10. 2. 1897సం. గ్రంథములు: ౧. తత్సమ చంద్రిక ౨. కావ్యాలంకార సంగ్రహము (వ్యాఖ్యాన సహితము) ౩. జాతక కథాగుచ్ఛము (౨, భాగములు) ౪. కీరసందేశము - ద్వంద్వయుద్ధము. ౫. గోవర్ధనాచార్య సప్తశతీ సారము ౬. పుష్పలతోట (ఖండకావ్యసంపుటి) ౭. కావ్యమంజరి ౮. నడుమంత్రపు సిరి (అధిక్షేప కావ్యము) ౯. ఖడ్గతిక్కన ౧౦. అమృతకణములు ౧౧. వాసవదత్త ౧౨. రేణుక విజయము ౧౩. వివేకానందము (కావ్యములు) ఇత్యాదులు.

జాతక కథాగుచ్ఛాది పద్యరచనల వలనను, తత్సమ చంద్రికాది లక్షణ గ్రంథరచనలవలనను సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి గారిపేరు తెనుఁగువారు తెప్పగా విన్నదియై యున్నది. ఆయన మంచి పండితులు. గొప్పకవులు. వ్యాకరణమున, అలంకార శాస్త్రమున, వీరు ప్రధానముగాఁ గృషిచేసిరి. వారి వ్యాకరణ కృషికి తత్సమచంద్రికయు, అలంకార శాస్త్రకృషికి కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్యయు నిదర్శనములుగా నిలుచు గ్రంథములు. వేదాంతమున, ప్రస్థానత్రయపాఠము చేసిరి. ఇట్టి వ్యుత్పత్తి గౌరవముతో, శ్రీ వేలూరి శివరామ శాస్త్రిగారి గురుత్వముతో సూర్యనారాయణ శాస్త్రిగారు సహజమైన కవిత్వమును వృద్ధిపఱుచుకొని, మెన్నో కృతులు రచించిరి, రచించుచున్నారు.

శ్రీశాస్త్రిగారి పట్టుదల మిగులమెచ్చఁ దగినది. ఆయన కావ్యాలంకార సంగ్రహవ్యాఖ్య ౭౦౦ పుటలు పరిమితిగల గ్రంథము. ఆలంకారికుల సర్వసిద్ధాంతములు పరిశీలన చేసి వా రావ్యాఖ్య సంఘటించిరి. కావ్య

స్వరూపము – రససిద్ధాంతము మున్నగు కొన్ని స్థలములలో మన ప్రాచీనాలంకారికులు భిన్నవిభిన్నములుగాఁ బ్రదర్శించిన మతములు వీరు గుఱుతించి వాని నెల్ల నీవ్యాఖ్యలో బయలుపఱుచుట వీరి పరిశ్రమకుఁ దార్కాణమైన విషయము.

వారి "తత్సమచంద్రిక" యు నమోఘ కృషి ఫలితము. సిద్ధాంతకౌముది, మఱి యితర పాణినీయవ్యాఖ్యాగ్రంథములు శాస్త్రిగారు బాగుగాఁ బరిశీలనము చేసినా రని యీ కృతి తెలుపుచున్నది. పయి రెండులక్షణగ్రంథములు వీరికి లాక్షణికులలో మంచిస్థానము నిచ్చుటకుఁ జాలియున్నవి.

ఇదియిటులుండగా, సప్తశతీసారము, జాతక కథాగుచ్ఛము, వివేకానందము, దానవదత్త మొదలయిన వీరిపద్యరచనలు పాఠ్యములై ప్రసిద్ధిగొన్నవి. తెలుఁగు పలుకుబడి వీరిది సుఖముగానుండును. వ్యాకరణవిశేష విశిష్టములయిన ప్రయోగములు వీరి కవితలోఁ దఱచు. అన్వయములో నెడనెడఁ దిక్కనగారి తీరులు. యతిప్రాసములకుఁదడవు కొన్నటు లుండదు. కాని, శాస్త్రిగారు యతిప్రాసబంధములు పద్యకవితకుఁ దగిలింపరాదని యొకప్పుడు వాదము నెఱపినవారు.

కావించె నేపతి తన వజ్రకాయుంబు

ఆహా ! వివరించి వ్రాయుటకుఁ బట్టదు కావ్యమొకండు

ఇత్యాదులుగాఁ గొన్నిపద్యములలో యతులు తప్పించి చూపిరి. ఈ పద్ధతి సార్వత్రికము చేయుట నచ్చకయో, వారు మరలఁ గృతుల నన్నింట సలక్షణత పాటించుచునే వచ్చుచున్నారు. అచ్చటచ్చటివి సూర్యనారాయణ శాస్త్రిగారి కావ్యములనుండి మచ్చు తునుకలు.

క. మీసాల తేనె నాఁదగు

  నీ సంస్కృతి సుఖముఁగోఱకు గృహమేధము నో

చీ సంరక్షింపఁగ స
న్న్యాసి పటాటోప మట్టు లర్థింత్రు జనుల్.

*

క. విడిది నికుంజాంతరములఁ
బడక శిలాతలములందుఁ; బ్రాశము బిసముల్
మడుఁగులు నారలు కాఁగా
గడఁగిరి తపమునకు నియమగతి నా భ్రాతల్.

*

శా. సాయాహ్నంబులఁ దమ్ములంద ఱొక వృక్షచ్ఛాయఁ గూర్చుండఁగా
ప్రేయశ్శ్రేయములం గుఱించి యతి గంభీరం బుపన్యాసముం
జేయుం; దేల్చును దారతమ్యమును దత్త్వజ్ఞుఁడు; వారెల్లరుం
బీయూషంబును గ్రోలు చందమునఁ దృప్తింబొంది హర్షింపఁగన్.

ఇవి జాతక కథా గుచ్ఛమునందలివి. 'వివేకానందము' నుండి మఱి మూఁడు :—

మ. అడుగంటెన్ మన భారతీయమగు విద్యల్; పుచ్చిపోయెన్ గడున్
గడు ధర్మంబులు; వేషభాషణములుం బాశ్చాత్యలోకంపుఁ బో
కడలన్ మైలవడెన్; సమస్తజనలక్ష్యం బర్థకామంబులై
పెడదారింబడెఁ; బూతిగంధియగు నీ విశ్వం బిసీ! కన్పడున్.

*

తినఁగా మూల్గుచు నెంగిలాకులపయిన్ దీర్ఘంబుగాఁ బెన్నిద్రవిం
జనుచున్ సీ! గవులూఱు గుంటలకు, వృక్షచ్ఛాయలంబందు చెం
డను వానన్, మొయిఁ జింకిపాఁతలను మానంబెట్లో! రక్షించు కొం
చును జీవించెడి పేదలం గనఁగఁ జించున్ దుఃఖ మీడెందమున్.

*

చాలుక్ మూలము లేసి సాంఘిక దురాచారంబులే యయ్యెఁ బో
మేలుంబంతులు జాతికీ భరతభూమిం; దత్పురోవృద్ధికిన్
ఆలోచింపఁగ వేరుఁబుర్వులు మతాధ్యక్షుల్; పురోధోగణం
బేలా, పెక్కులు! దయ్యముల్ కరణి నెంతేఁ బట్టిపల్లార్చెడిన్.

*

ఏవంవిధముగా మధురమైనదియు మృదువైనదియు సాధువైనదియు నగు కవితారచనతో శ్రీ సూర్యనారాయణ శాస్త్రిగారు పెక్కు కబ్బములు సంతరించుచున్నారు. నిజాంరాష్ట్రమున, ఆంధ్ర సారస్వత పరిషత్తువారి మహాదరణ గౌరవములకు వీరు పాత్రులయినారు. యావదాంధ్రమున వీరి రచనలు ప్రాకుచున్నవి. మహబూబు కాలేజిలో తెలుగు పండితులై మూడు దశాబ్దములనుండి శిష్యుల నెందఱనో తీర్చి దిద్దుచున్నారు. వీరు సాహిత్య శిరోమణి, విద్వాన్, పి, ఒ, యల్ మున్నగు పట్టములు బడసినారు. సకల సౌభాగ్య సంపన్నులై, పండిత కవులై విరాజిల్లుచున్న సన్నిధానము శాస్త్రిగారి సారస్వత జీవితము చక్కనిది.

వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి

1896

వెలనాటిశాఖీయబ్రాహ్మణులు. తల్లి: మణికర్ణికాసోమిదేవి. తండ్రి: వేంకట చయనులు. జన్మస్థానము: ఇందుపల్లి. పెంచుకొన్న తలిదండ్రులు కామమ్మ. రామయ్య. దత్తత, కొమానపల్లి. జననము: దుర్ముఖినామ సంవత్సర–అధిక జ్యేష్ఠశుద్ధషష్ఠి–ఇందువాసరము. 1896 సం. రచనలు:– ౧. వేంకటేశ్వరశతకము ౨. మునిత్రయచరిత్రము ౩. శంకరవిజయము. ౪. శబర శంకర విలాసము – ఇత్యాదులు..

ప్రతిభా వ్యుత్పత్తులు సరితూకములో నున్న కవులెందఱో యుండరు. ఆవిధముగా నున్న నేటి కవులు కొందఱిలో వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగా రొకరు. వీరు ‘ శంకరవిజయ ’ ప్రబంధకర్తలుగా నేఁడు మంచివిఖ్యాతి నందుచున్నారు. వీరి ‘మునిత్రయచరిత్ర’ ప్రౌఢార్థప్రచురమైన రుచిరకావ్యము. ఈ రెండు కృతులును శాస్త్రిగారికి మహాకవితా పట్టముఁ గట్టించుటకుఁ జాలియున్నవి.

శ్రీ సూర్యనారాయణశాస్త్రిగారు శిష్టవంశీయులు. వారితండ్రి వేంకటచయనులుగారు ఆహితాగ్నులు. చయనాంత క్రత్వనుష్ఠాతలును. తల్లిమణికర్ణికాసోమిదేవి. ఈ పుణ్యదంపతుల కడుపు మనశాస్త్రిగారు. వీరు చిననాఁట శ్రీ మరువాడ కాశీపతిశాస్త్రిగారితోఁ గాళిదాసత్రయము పఠించిరి. పదపడి, చావలి లక్ష్మీనరసింహశాస్త్రిగారి సన్నిధిని సాహిత్య గ్రంథములు, లఘుకౌముదియు నధ్యయనము చేసిరి. అప్పుడే యాంధ్రకవితాభిరతియు నంకురించినది. లక్ష్మీనరసింహ శాస్త్రిగారి యాచార్యకము నెడల మన శాస్త్రిగారి కృతజ్ఞత చక్కనిది.

మ. కలమున్ జేతను బూని పద్యమని యేకాసంతయున్ వ్రాయఁగాఁ
దలఁపుం జెందినముందు మ్రొక్కవలెఁగాదా, సంస్కృతాంధ్రమ్ములన్

గల మర్మంబులు నాకుఁదెల్పి కవితా నైపుణ్యముంగూర్చు చా
వలి లక్ష్మీనరసింహశాస్త్రి గురుదేవ స్వామికిన్ భక్తిమై.

౧౯-౨౫ ప్రాంతమున పిఠాపురమున నుండి, శ్రీ దర్భా సర్వేశ్వరశాస్త్రి గారి కడ వీరు వ్యాకరణ శాస్త్రాధ్యయనము గావించినారు. ఈక్రింది పద్యము చూడుఁడు:

శా. తర్కవ్యాకృతి పారదృశ్వ నిఖిలాంధ్ర జ్యోతిషాంగ్లోక్తి సం
పర్కున్ సూర్యబుధేంద్ర శిష్యమణి దర్భావంశ్య సర్వేశ వి
ద్యార్కున్ వ్యాకరణోపదేశికు ద్వితీయానంతు నెంతున్ శుభో
దర్కత్వంబు కృతజ్ఞతం బడసి మత్కావ్యంబు రంజిల్లగన్.

"మునిత్రయచరిత్ర"

మహామహోపాధ్యాయ శ్రీ తాతా సుబ్బరాయశాస్త్రిగారికి వీరు 'మునిత్రయచరిత్ర' నంకిత మొసంగిరి. ప్రత్యేకముగా "రాయుడు శాస్త్రి యశశ్చంద్రిక" కావ్యము రచించి మహామహోపాధ్యాయుల షష్టిపూర్తి సన్మానసందర్భమున సర్పించిరి. ఇవన్నియు నేల పేర్కొనుచుంటి ననగా, శ్రీ సూర్యనారాయణశాస్త్రిగారి హృదయములో పండితగురువులపట్ల నిట్టి భక్తి ప్రపత్తు లున్నవనుటకు.

సంస్కృతాంధ్ర వైదుషీ భూషితులైన వీరు ౧౯-౨౦ సం॥ లో అమలాపురము బోర్డుహైస్కూలున తెలుఁగు పండితులుగాఁ బ్రవేశించి రెండేండ్లు అచ్చటనుండిరి. తరువాత కాకినాడ నేషనల్ స్కూలులో మఱిరెండేండ్లు పండితోద్యోగము. పిదప, పాణంగిపల్లి జమీందారు శ్రీ సబ్నవీసు కృష్ణారావు పంతులు (బి. ఏ) గారికి సంస్కృతాంధ్రోపాధ్యాయత్వము. అప్పుడే ప్రొద్దుటూరి 'కవి' వ్యాసపు పోటీపరీక్షలో ద్వితీయ బహుమానము. ఈ పురస్కారము కారణముగా జమీందారు "కవిసింహకంకణము" చే సూర్యనారాయణ శాస్త్రిగారిని బహూకరించెను. "జీమూతవాహనచరిత్ర" మను ఖండకావ్యము పాణంగిపల్లి

ప్రభావమునకు శాస్త్రిగారంకిత మిచ్చినారనుట ప్రకృతము తెలుసుకోవలసిన విషయము. ఇది యిట్లుండగా, శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటు కార్యాలయమునకు పండితులుగా నుండి వీరు కావించిన వాఙ్మయసేవ మఱచిపోరానిది. ౧౯౨౯ సం॥ నుండి ౧౯౩౨ వఱకు వీరా కార్యాలయోద్యోగము నిర్వహించిరి. ఈ యుద్యోగమువలన శాస్త్రిగారి మేధాసంపద మఱింత మెఱుఁగులు దేఱినది. ఆంధ్రప్రబంధములలోని రహస్యములు వెంపరాల వారికిఁ దెలిసినన్ని వేఱొకరికిఁ దెలియవేమో యనిపించును. ఆయన కున్న ప్రయోగపరిజ్ఞానము నిస్సమానమైనది. ఆయనకు వేలకొలఁది పద్యములు నోటికి వచ్చును. ఒక ప్రయోగమునకుఁ బది యుదాహరణపద్యములు వెంట వెంటనే చదివి చూపఁగలరన్నది యతిశయముగా నన్నమాట కాదు. ఇట్టి ధారణాపాటవముగల వీరు సూర్యరాయ నిఘంటు కార్యాలయమునకుఁ జేసిన యుపకృతి కృతజ్ఞతకుఁ బాత్రమైనది.

మఱి, శాస్త్రులుగారి కవితారచనలోని విశిష్టత యేమనఁగా, వారు ప్రయోగవైచిత్ర్యమును వలచిన రచయిత లగుటచే నడుగడుగున నూతన ప్రయోగములు కనఁబఱచెదరు. ఇంచుమించుగా వారి కావ్యములోని పెక్కుఘట్టములు భట్టి కావ్యమును స్ఫురణకుఁ దెచ్చుచుండును. పాణినీయము నామూలచూడము చుళుకించినవారు కావున వారి కవిత యిటు లుండుటలో నబ్బురమేమి? ప్రయోగదృష్టి యెంత యున్నదో శాస్త్రులు గారికి రసదృష్టియు నంతేయున్నది. ఆ హేతువున వారి కృతులు పండిత హృదయరంజకములై యున్నవి. మునిత్రయ చరిత్రము నందలి కొన్ని యుదాహరణములు :

ఉ. వియ్యపురాలటుల్ తినెడు వేళకు వచ్చుటకాని యింత సా
హాయ్యముసేయ దాఁడుదికదా పసిపాప విలాపమొందఁగా

నుయ్యాల నూఁపరాదొ జలమొక్క- పసంబేఁడు తేరరాదొ తే
దెయ్యెడ నిట్టిదంచు గణియించు గరాసయి తోడి కోడలిన్.

*

సీ. చెదపుర్వు గమి గ్రసించిన కప్పునుండి యౌ
పాసనాగ్నల ధూమపటలి వెడల
ముంజూరిలకు వంగిపోవుట లోనికి
వచ్చి యేఁగెడు వారు వంగిపోవల
గోడలపాఁతు నాల్గుదెసల నిల్చిన
కంపపిందడుకలు గాలిఁ గదల
నుసిరాలి లోపలి పస పూఁసి నిట్టురా
డొకప్రక్క- కొక్కింత యొదిగియుండ
గోమయ విలేపనంబు గ్రుగ్గులనుమాత్ర
మమర దారిద్ర్యదేవి విహారసౌధ
మనఁదగిన వృద్ధగురు ప్రాఁతయాకుటిల్లు
లోచనంబుల కెదురుగా గోచరింప,

*

ఈలీలైన సాధుప్రౌఢశయ్యలో శాస్త్రులుగారు "శంకరవిజయము" మహాప్రబంధముగా సంతరించిరి. ఆకృతి శాశ్వతముగానుండుటకుఁ జాలియున్నది. మహాకవితా పట్టము శంకర విజయమువలన శాస్త్రులుగారికి లభించుచున్న దనుటలో విప్రతిపన్ను లుండరు. వారు రచించుచున్న 'విద్యారణ్య చరిత్ర' తెలుఁగు కవితాశాఖకు కైసేత కాఁగలయది. ఆస్తిక బుద్ధి సంపన్నులు, వ్యుత్పన్నులునైన సూర్యనారాయణశాస్త్రి గారు తీసికొన్న యితివృత్తములన్నియు సుపవిత్రములై యుండుట సుప్రశంసార్హమైన విషయము.

భమిడిపాటి కామేశ్వరరావు

1897

వెలనాటి శాఖీయబ్రాహ్మణుఁడు. తల్లి: లచ్చమ్మ. తండ్రి: నరసావధానులు. జన్మస్థానము: ఆకివీడు. నివాసము: రాజమహేంద్రవరము. జననము: 30 ఏప్రిలు 1897. రచనలు: ౧. కాలక్షేపం ౨. ఇప్పుడు. ౩. అవును ౪. నిజం ౫. అప్పుడు ౬. మాటవరస ౭. గుసగుసపెళ్లి. ౮. పెళ్లిట్రయినింగు. ౯. రెండురెళ్లు. ౧౦. అన్నీతగాదాలే. ౧౧. మేజువాణి. ౧౨. మనతెలుఁగు. ౧౩. కాలక్షేపం. [2 భాగాలు] ౧౪. లోకోభిన్నరుచిః. ౧౫. తనలో. ౧౬. మాయలమాలోకం. ౧౭. చెప్పలేం. ౧౮. మృచ్ఛకటిక. ౧౯. ముద్రారాక్షసం. ౨౦. ప్రణయరంగం. ౨౧. త్యాగరాజు ఆత్మవిచారం- ఇత్యాదులు.

ఈనాఁటి హాస్యరచయితలలో శ్రీభమిడిపాటి కామేశ్వరరావు గారి స్థానము ప్రత్యేకము విశిష్టము నైనది. బాగుబాగు—ఎప్పుడూ ఇంతే—కచట తపలు—తప్పనిసరి—వద్దంటే పెళ్లి—ఘటన—ఈ మొదలయిన ప్రదర్శనాల సంవిధానముతో వేఱుచేయలేని కామేశ్వరరావుగారి పేరు యువప్రపంచమున నిత్యవిహారము కలది. ముఖ్యముగా, కళాశాలలలో వీరి నాటికలు ప్రాయికముగా ప్రదర్శితము లగుచుండుట గమనింపఁదగినది. విద్యార్థుల హృదయములు కృతకసంసార దూషితములు కానివి; పరమస్వచ్ఛములైన వారి యాత్మ లానందమయములు. కనుకనే తత్త్వావధారణమునకు దారిచూపు హాస్యరసముపైనే వారికిఁజూపు. సంసారబంధితుఁడు తఱచుగా నవ్వలేని కుటిలుఁడు. సత్యమును సత్యముగా గుఱుతింపలేకపోవుట హాస్యమునకుఁ గారణమగుచున్నది. ఈగుఱుతుగల సంసారులు అరుదుగానుందురు. అనఁగా, తత్త్వనిర్ధారణమునకు చర్చాగ్రంథమైన హాస్యరసము నాస్వాదించుటకు సంయతాత్ముఁడే అధికారి యగుచున్నాఁడు. బ్రతుకును పొడిగించుకొనఁ దలఁచినవారికి నృత్య—హాస్యముల యక్కఱ మిక్కిలి కావలసియుండును. కాఁబట్టి హాస్యము

నకుం దపస్సుతో సాదృశ్యము చెప్పవచ్చును. ఈ యభిప్రాయ మాలం కారికులు సూచించినదియును.

ప్రకృతము; భమిడిపాటి కామేశ్వరరావుగారి ప్రతిరచనయు హాస్య రసప్రచురము. ఆయన రచన చేతిలోనున్న పాఠకుఁడు, ఏయవస్థలో నున్న వాఁడైన నవ్వును; చిఱునవ్వును; అంతలో, పెద్దపెట్టున నవ్వును; మరల మందహాసమున కవతరించును; అంతలో, అట్టహాసమున కధిరోహించును. ఇట్లు చేయింపఁగల సుగుణము, ఆయన వ్రాఁతలలోను, మాటల లోను, సరితూకముగానే యున్నది. కామేశ్వరరావుగారి కూర్పులలో భావముతోపాటు, భాషయును హాస్యరసోత్పాదకమగుట విశేషము. ప్రహసనకర్తలలోఁ బేరుమోసిన వీరేశలింగముపంతులు, చిలకమర్తి కవియు దీనిని నకృత్తుగాఁ బాటించినారు. "కన్యాశుల్క" కారునిలో స్వేష్టకృత్తుగా నీలక్షణ మున్నది. 'భమిడిపాటి' వారికి 'గురజాడ' వారి దారి యొరవడి కావచ్చును. కామేశ్వరరావుగారి రచన వినీవినఁగనే భాష, మొదల నవ్వించును; భావము పిదప నవ్వించును. వీరి భాషలో ఆపాత రమణీయహాస్యము భావములో విచారిత రమణీయహాస్యము నుండెనని నే ననుకొందును.

"...నాగరికత అబ్బి, జెంటిల్ మెన్ అనగా పెద్దమనిషి అవడానికి సర్వ విధములా పెరుగుతూన్న నన్ను ఈన ఇంతడౌన్‌రైటుగా ఇన్సల్ట్ చేయుట చూచి ఎటులఊరుకొనుట? దేర్ ఫోర్ తమషా బికేమ్ కసి. చదువుకోనివాడు ఏదేనాచేస్తే తప్పూ. అదే చదువుకున్నవాడు చేస్తే పామరులకి తప్పులా కనిపించినా దానిగర్భంలో గొప్పప్రిన్సిపల్ ఉందని సమర్థించి, తప్పుకాదని స్థాపించి, అది ఒకవేళ నలుగురికీ భరించకపోతే కాంట్ హెల్ప్ అనగా సహాయముచేయలేము అనిచెప్పిపారేసినెగ్గొచ్చు...." "బాగుబాగు" నుండి

ఊరకే మచ్చుకొఱకై యీపంక్తులు పేరుకొంటిని. స్థూలరూపముగా నుండిన యిక్కడిభాషలోను సూక్ష్మరూపముగానుండిన భావములోను మనస్సులను గదలించి నవ్వింపఁగల తీరు స్పష్టముగాఁ దోఁచుచున్నది.

ఇట్లే కామేశ్వరరావుగారి ప్రదర్శనములు, ఉపన్యాసములు, కథలు బహిరంతర్హాస్యరసవాహినులు! ఆయన రచనల పేళ్లు, వానిలోని వ్యక్తుల పేళ్లు కూడ వింత పుట్టించునవి. కచటతపలు—వద్దంటేపెళ్లి—ధుమాలమ్మ ఓఘాయిత్యం—శానయ్య — మరకమ్మ—చిక్కేశ్వరరావు — ఈ నామకరణములు మఱి యెటువంటివి? శ్రీ కామేశ్వరరావుగారి రచనలో కొన్నిపట్టులు, చెవినిబడిన కొంతసేపటికి నవ్వుపుట్టింపక, చర్వణమయిన తరువాతఁ గడుపు చెక్కలు చేయును. నాయుద్దేశమున 'భమిడిపాటి' వారి హాస్యములో ఉత్తానమైన వాచ్యతకంటె, ఉదాత్తమైన వ్యంగ్య మర్యాదపాలు హెచ్చుగా నుండునని(యే) ఒక ప్రసిద్ధవిమర్శకుఁడు లక్ష్మీనరసింహముగారి హాస్యమునకును వీరేశలింగముగారి హాస్యమునకును భేద మున్నదని చెప్పుచు నిట్లు తేల్చెను: "వీరేశలింగముగారి హాస్యము చిక్కనిది. లక్ష్మీనరసింహముగారి హాస్యము పలుచనిది. లక్ష్మీనరసింహముగారి హాస్యము గిలిగింతలుపెట్టి నవ్వించును. వీరేశలింగముగారి హాస్యము గిల్లి బాధించును" అని. రచయితకు ప్రజాప్రబోధదృష్టి నిండుగా నుండునపుడు, వాని రచనలు వాచ్యార్థమువైపునకు మొగ్గుచూపుట తప్పదు. వీరేశలింగము పంతులు సాంఘికముగా సంస్కారపు మెఱుఁగులు పరిదిద్దవలసిన సుప్రచారకుఁడు 'చిలకమర్తికవి' కూర్పుతీరులు కోరినంతగా, వీరేశలింగముపంతులువలె ప్రబోధదృష్టి పరిపుష్టముగాఁ గలిగియున్నవాఁడు కాఁడేమో? అందుకే, ఆ యుభయుల హాస్యరచనలకు నిట్టియంతరమేర్పడినది.

ఇపుడు మన కామేశ్వరరావుగారు కూడ ప్రబోధదృష్టిని మించిన కళాదృష్టి కలవారని నేను నిశ్చయించుకొన్నాను. వీరు అనువదించిన 'మోలియర్' ప్రదర్శనములు, స్వతంత్రించి వ్రాసిన ప్రదర్శనములు, మొత్తముమీఁద సొంతరచనలవలెనే యుండుట మెచ్చదగిన విషయము అనుసరణమును గూడ స్వతంత్రముగానే తీర్చఁగల చాతుర్య మాయన కలములో నున్నది.

'బాగుబాగు' కామేశ్వరరావుగారు తొట్టతొలుతగా వ్రాసిన 'ఆట'. దానిరచనాకాలము ౧౯౨౩ సం. అది కళాశాలావిద్యార్థుల కోరికపై వ్రాయఁబడ్డది. ఈ 'ఆట' నాఁటికి, నేఁటికి సుప్రచారప్రశస్తుల నందుచునేయున్నది. మొదటిరచన కీర్తి ప్రసిద్ధివచ్చుట యెక్కడనో కాని యుండదు. కామేశ్వరరావుగారి "ఆట" లన్నియుఁ బ్రదర్శితములగుట శ్లాఘనీయము.

ఉత్తమ హాస్యరచయిత తత్త్వావధారణమునకు మార్గదర్శి యను కొంటిమి. ఇట్టి దర్శకత్వము 'భమిడిపాటి' వారిలో నున్నది. ఉదాహరణమునకు 'అద్దెకొంపలు' రచన యొక్కటి చూతము.

ఇంచుమించుగా నిరువది పుటలు అద్దెకొంపలనుగూర్చి సామాన్య ధోరణిలో వ్రాసివ్రాసి చిట్టచివర ఈ దిగువ పంక్తులు సంధానించిరి:

"...అద్దెలధోరణిబట్టిచూస్తే భౌతికలోకంయొక్క అస్థిరత్వం స్ఫురణ కొస్తుంది. కొంపలేకాదు ఊళ్లూ, జిల్లాలూ, ఈఇండియా, ఈప్రపంచము ఇవన్నీకూడా అద్దెవ్యాపారాలే కదా అనిపిస్తుంది! రోగింపల్లో, బెడద చేతో, అవాంతరం మూలానో, కూనీ ద్వారానో, ఆత్మహత్య రూపం గానో, దారిద్ర్యం ధర్మమూ అనో ఏదో తరవాత తరవాత మాత్రమే మానవులకి గోచరించే కారణాన్ని పురస్కరించుకుని జీవుడు శరీరం ఖాళీ చేసి పోతూండడం ఆరగారగా చూడగా ఎవడిమట్టుకువాడికే తెలిసే దాన్నిబట్టి—జీవుడికి శరీరాలు అద్దెకొంపలు."

పయినున్న యాపద్రచనకును, దిగువనున్న యీపదిపంక్తులు జీవము పోసినవి. ప్రాణమునంటి యీ 'పేరా' లేనిచో 'అద్దెకొంపలు' వ్యాసము సర్వము వట్టి శరీరముగదా! నిస్సారమైన యీ వస్తువును హాస్యరసస్ఫూర్తితోఁ జిత్రించుటలోఁగల విశేషముకంటె, దానిని తత్త్వసరణిని సమన్వయపఱచుటలోఁ జూపిన విశేషము ప్రశంసాభాజనమని నేను భావించెదను. ఇది యొకటి కాదు, కామేశ్వరరావుగారి రచనలలో

కొక్కొంట నిట్టి మెఱపులు తట్టుచుండును. ఇట్టి తత్త్వదష్టిలేని హాస్య రచయిత హాస్యాస్పదుఁడు కావలసినదే.

శ్రీ కామేశ్వరరావుగారి ప్రదర్శనములు, తదితర రచనలు నిటు లుండగా, "త్యాగరాజు ఆత్మవిచారం" వారి కూర్పులలో గొప్పతావు నాక్రమించుకొనిన గ్రంథము. ఆరువందల సంఖ్యకుఁ బైబడియున్న త్యాగరాజు కీర్తనములను తొమ్మిదిభాగములుగా విభజించి, కీర్తనార్థములు చక్కని వచనములో సంతరించినారు. పాఠవైవిధ్యమువలన దుర్గమార్థములైయున్న కీర్తనల పరసార్థములు తేర్చి సహజమధురమైన భాషలో నీగ్రంథము రచితమైనది. ఈకృతిలో శ్రీ కామేశ్వరరావుగారి విమర్శన పాటవము, సంగీతములో వారికిఁగల యభిమానము రూపము కట్టియున్నది. ఆయన యశస్సున కీగ్రంథము వైజయింతి. పద్యమునకు రాగమక్కఱలేదను వీరి సిద్ధాంతము జగమెఱిఁగినది.

వీరు ఆంగ్లమునఁ బట్టభద్రులగుటయే కాక, సంస్కృతమునఁ జక్కని సాహిత్యము కలవారును. ౧౯-౨౦, ౨౧ సంవత్సరములలో మదరాసు "ఎక్కౌంటెంటు జనరల్ ఆఫీసు" లో నుద్యోగించిరి. వాఙ్మయారాధన దృష్టి ప్రబలముగాఁ గలవారగుటచే, అది విరమించి రాజమహేంద్రవరము వచ్చి వీరేశలింగోన్నత పాఠశాలలోనుండి యిందాఁక అధ్యాపక పదవి నిర్వహించుచున్నారు.

వేదుల సత్యనారాయణ శాస్త్రి

1900

తల్లి గురమ్మ. తండ్రి కృష్ణయ్య. జన్మస్థానము భద్రాచలము. జననము వికారి సంవత్సర ఫాల్గుణ బహుళ షష్ఠి బుధవారము. 22-3-1900. రచనలు. ౧. దీపావళి ౨. విముక్తి 3. మాతల్లి ౪. ఆరాధన ౫ ముక్తావళి. [కావ్యములు] మరికొన్ని నవలలు, నాటకములు, వ్యాసములు ఇత్యాదులు.

'వేదుల' వారి పేరు తలపోయఁగనే 'దీపావళి' స్మరణకుఁ దగులును. దీనికిఁ గారణము కవితన్మయుఁడై రచించిన కావ్యకదంబ మా కూర్పులో నుండవలయును. నిజమే.

శ్రీ సత్యనారాయణ శాస్త్రిగారు సంస్కృతాంధ్రములలోఁ జక్కని సాహిత్య సంపత్తిగలవారు. గురుకుల వాసముచేసి గొట్టుపుళ్ల శ్రీనివాసాచార్యులవారికడ కావ్యనాటకాలంకారములు పఠించిరి. చిలుకూరి సోమనాథశాస్త్రిగారి సన్నిధానమున వ్యాకరణాధ్యయనము సాగించిరి. చల్లా వేంకట నరసయ్యగారి దగ్గఱ స్మార్తము కూడ పాఠము చేసిరి. కవితాగురువులు కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రులవారు. దివ్యమైన యీగురుత్వ భాగ్యముతో "వేదుల" వారు సంగ్రహించిన వైదుష్యము ప్రశంసనీయమైనది కాదా! విద్వత్పట్టభద్రులైన శాస్త్రిగారు కాకినాడ, పెద్దాపురము, పేరూరు హైస్కూళ్లలో నిరువది నాలుగేండ్లుగా నాంధ్రోపాధ్యాయ పదవి నిర్వహించుచున్నారు. పెక్కురు జమీందారులు వీరిని గౌరవించి వార్షికబహుమానము లిచ్చుచున్నారు. వీరు శతావధానులు. కాని, దేశకాలస్థితులు గుర్తించిన లోకజ్ఞత వీరియందుండి, అగారడీ పనులను కట్టిపెట్టించినది.

ప్రకృతము :(అద్యతనాంధ్రకవులలో వేదుల సత్యనారాయణశాస్త్రి గారి స్థానము మంచిది. ఆయన ప్రతిభ సముంచితమైనది. వ్యుత్పత్తియు దానికి దీటయినదని తెలిసికొంటిమి. దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రభృతుల చెలికారముతో నీయనకు పాశ్చాత్య కవితారామణీయక మాకళింపునకు వచ్చినది. తనకు, ఆజానజమైయున్న ప్రాచ్యసాహిత్య ప్రతిభ కా యదృష్టము తోడైనది. ఈసన్నివేశముతో నెన్నో ఖండకృతులీయన సంతరించెను. పదముద్రలో నీకవి బహుభద్రత గలవాఁడు. పలుకుబడి చిక్కగా, చక్కగా, కుదిరికగా నుండును. సంస్కృతవాణిపై మక్కువ పెంచుకొన్నను, వాడిన తెనుఁగునుడి యెంతో ముద్దుగా నుండును. భావన లోఁతుకలది. ప్రాక్తన సంప్రదాయములకు సమీపస్థుఁడై, క్రొత్త చవులు పుట్టించునట్లు కవిత్వము కట్టుటలో 'వేదులకవి' మంచినేర్పరి. ఆనాఁడు శ్రీనాథుఁడు సీసములకుఁ బేరుపడినట్లుగా, ఈనాఁడు 'వేదుల' వృత్తములకుఁ బేరుపడెను. శయ్యాసౌందర్యము చంపకుండఁగా జాగ్రత్తగా, మునువెనుకలు చూచుకొని వ్రాయుట యీయనలో నలవాటు. అందువలన, ఆయనప్రతిపదము మలయమారుతమువలె చదువరిని సుఖపెట్టును. ఈమార్గమునకు సంస్కృతకవులలో జయదేవుఁడు తెనుఁగు కవులలో ముక్కు తిమ్మనగారు దర్శకులు) వేదులవారి 'విముక్తి' కావ్యమునుండి మూఁడు ముక్తలు.

ప్రాకుల్ వెట్టిన చిమ్మచీకటుల యీపాషాణ కారాగుహా
ప్రాకారమ్ములు వ్రీలి నాబ్రతుకుపై ప్రాభాత శోభామయా
శాకాంతిప్రసరమ్ము సాగెడిని స్వేచ్ఛామారుతాహ్వాన గీ
తాకోలాహల మేదొ నాయెడఁద నుత్సాహమ్ము లూగించెడిన్.

*

ఊపిరి యాడనీని కఠినోపలబంధములో, కలా కలా
లాపముగాని, నర్తన విలాసముగాని, ధరా పరీమళా

పాపముగాని, లేనిపుటపాకపు చీకటి జీవితంబు నె
ట్లోపితినో గదా, యవలియొడ్డగుపింపని కాల మీదుచున్.

*

ఎన్నఁడు సోకునో తరఁగ లెత్తగ తెమ్మెర తావియూర్పునా
యున్ననమేన, ఎన్నడు దయారుణరాగ మనోజ్ఞతల్ జగా
వన్న పసిండిపూఁత చెలువమ్ముల నాపయి గ్రుమ్మరించునో
యన్న నిరంతరాశ బ్రతుకాపిన దాగిరి గర్భపుం జెఱన్.

'మాతల్లి' కావ్యమునుండి మఱిరెండు ఉదాహరింపకుండ నుండలేను.

అరనికోర్కెగా బ్రతుకునందు రగుల్కొనుచున్న దొక్కటే
కోరిక, నీకృపావనికి కోయిలనై నతమాలపింతు, మం
దార సుమారుణద్యుతి వితానముగొల్పెడి నీమనోహరా
కారమునన్ మధూదయ వికాసము నింపుము తల్లి, నామెదన్.

*

ఏయను భూతిలేక రసమొండి, వివర్ణత దోగి వాసనల్
వోయిన నాహృదంబుజములో నొలికింపు మొకింత నవ్య సం
ధాయకమైన నీయడుగుఁదమ్ముల పుప్పొడి తోడితేన; త
ల్లీ యదె చాలు నాకు ఫలియించును ప్రోవిడుకొన్న నాకలల్.

ఈ రచనలో భావస్ఫుటత, భాషాపటుత యెటులు విద్యమందు చున్నవో చూచితిరి. ఎప్పుడో హరీంద్రనాథుఁడు 'దీపావళినాఁడు' అను పద్యములకుఁ దలయూపె నని చెప్పి, యిప్పుడు సత్యనారాయణ శాస్త్రిగారి రచనలు గొప్పగానుండునని బలవంతముగా మన మెప్పు కొన నక్కఱలేదు. ఆయన కూర్పులో సాజముగా నట్టి లగువు బిగువు లున్నవి. అట్టి భావానాశైశిత్య మున్నది. అట్టి శిల్పసంపత్తి యున్నది.

ఈ గుణములుగల కావ్యములకు దీపావళి రాశి. అందుకే, వేదులవారి పేరు విన్నవెంటనే, ఆకూర్పు స్మరణకు వచ్చుట. శాస్త్రిగారు కొన్ని నాటకములు, కథలు, విమర్శనములు వ్రాసిరి. ఏవి వ్రాసినను, ఆయన పద్యకావ్యరచనలోనే శ్రద్ధధానులు.

ఈ 'శాతవాహనశోకిలము' కాంక్ష యిటులున్నది:

కానుకనై ధరాధిపుల కాళ్లకడం బొరలాడి వాడిపో
లేను, ధరావరాగ పటలీ మలినమ్మగు ద్వారతోరణా
స్థానమునం దురిం బడఁగఁజాలను, దోసిటి పేరి ఘోరకా
రా నరకమ్మునం దుసురు రాల్పగలేను నిమేషరక్తిమై.

*

నీచపు దాస్యవృత్తి మననేరని శారత మాతృదేశ సే
వా చరణమ్మునం దసువు లర్పణఁజేసినవారి పార్థివ
శ్రీ చెలువారుచోటఁ, దదస్రుగుచులన్ వికసించి, వాసనల్
వీచుచు రాలిపోవగ వలెం దదుదాత్త సమాధి మృత్తికన్.

నోరి నరసింహ శాస్త్రి

1900

హారితస గోత్రులు: ఆపస్తంబ సూత్రులు. జన్మస్థానము: గుంటూరు. ప్రకృతనివాసము: రేపల్లె. తల్లి: మహాలక్ష్మమ్మ. తండ్రి: హనుమచ్ఛాస్త్రి. జననము: వికారి వత్సర మాఘశుద్ధ సప్తమి. 6-2-1900 సం॥ తేది. రచనలు:- ౧. గీతమాలిక ౨. భాగవతావతరణము [పద్య నాటిక] 3. సోమనాథ విజయము [నాటకము] ౪. ఖేమాభిసుని ౫. వరాగమనము ౬. ఆత్మస్మృతి ౭. తేనెతెట్టె ౮. పతంగయాత్ర. ౯. స్వయంవరము. ౧౦. షణ్ణవతి [ఇత్యాది నాటికలు, కావ్యములు] ౧౧. నారాయణభట్టు ౧౨. రుద్రమదేవి [నవలలు] ఇంకను, అనేక కథలు, వ్యాసములును.

శిష్టాచార సంపదలో నోరివారి వంశము పేరు మోసినది. నరసింహ శాస్త్రిగారి తండ్రి హనుమచ్ఛాస్త్రిగారు గుంటూరు "మిషను కళాశాల" లో సంస్కృతాంధ్రాధ్యాపకులు. వీరు పాదుకాంత దీక్షితులు. వారితండ్రి గోపాల కృష్ణయ్యగారు మంత్రశాస్త్రకోవిదులు. ఇట్టి శిష్ట వంశమున నరసింహ శాస్త్రిగారి పుట్టుక. వీరి పినతండ్రి గురులింగ శాస్త్రిగారు సుగృహీతనాములు వారు చెన్నపురి తొండమండలము హైస్కూలులో పండిత పదవిలో నుండెడివారు. వ్యాకరణము, వేదాంతము, జ్యోతిషము, మున్నగు శాస్త్రములలో వీరిది గట్టిచేయి. తెలుఁగువచనములో ననేక పురాణములు వ్రాసినారు. భగవద్గీతా గుప్తార్థ ప్రకాశిక వీరు వ్రాసినదే. ఆంధ్రవాఙ్మయ సూచికలో, ముద్రితములైన వీరి రచనలు చాల నున్నట్లు కనఁబడుచున్నది. మహాభారతము, స్కాందపురాణము, మార్కండేయ పురాణము, జైమిని భారతము మున్నగు గ్రంథములకుఁ దెలుఁగువచనములు వీరు రచించియున్నారు. బహూరి త్యాగరాయ శాస్త్రులు అందునన్నువారు వెనుక

వెలువరించిన కృతులలో ముప్పాతికపాలు గురులింగశాస్త్రిగారివే యనవలయును. ఇట్టి బహుగ్రంథములు రచించిన విద్వాంసుల వంశము నరసింహశాస్త్రి గారిది.

శ్రీ నరసింహ శాస్త్రిగారు అద్యతనాంధ్రకవులలో సంప్రదాయ సిద్ధమైన రచన సాగించుచున్నారు. ఆయన దేవీభాగవత రచన నేఁడు సుప్రసిద్ధమగుచున్నది. నారాయణభట్టు — రుద్రమదేవి మున్నగు నవలలు వారివి మన్ననతోఁ జదువుచున్నాము. నాటికలు కూడఁ దఱచుగా నరసింహశాస్త్రిగారు వ్రాయుచున్నారు. వారి విమర్శనములు పత్రికలలోఁ గనుచుందుము. అనఁగా వీరికలమునకు బహుముఖములుగా సాగునేర్పు కలదని స్పష్టపడుచున్నది. ఇట్టి ప్రముఖ రచయిత జీవితవిశేషములు పేర్కొనఁదగినవి.

౧౯౧౮ వఱకు నరసింహశాస్త్రిగారు గుంటూరున 'ఇంటరు' చదివిరి. పదపడి, పచ్చయప్ప కళాశాలలో బి. ఏ. చదివి యుత్తీర్ణత. పట్టభద్రులయిన తరువాత, గుంటూరు కళాశాలలో రెండేండ్లు ఉద్యోగము. ౧౯౨౫ సం॥ లో బి. యల్. పరీక్షలో నెగ్గి గుంటూరిలో న్యాయవాదిత్వమునకుఁ బ్రారంభము చేసినారు. ౨౭ సం॥ నుండి 'రేపల్లె' కు మకాము మార్చి నేఁటిదాఁక నక్కడనే వృత్తినిర్వహణము. సంస్కృతాంధ్రములు గురుముఖమునఁ జదివినారు. పదవయేటనే కవి కావలెనన్న కోరిక నరసింహ శాస్త్రిగారిలో మొలకయెత్తినది. ఈ మొలకను దోహదముచేసి, మొక్కగాఁ బెంచిన యుదారులు శ్రీ శివశంకర శాస్త్రిగారు. కొండవటిగంటి వేంకటసుబ్బయ్య, త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి, పెద్దిభట్ల పూర్ణశర్మ, కోపల్లె శివకామేశ్వరరావు — మున్నగు ప్రథమ 'సాహితీసమితి' కవుల స్నేహములో మన నరసింహశాస్త్రిగారికి నవ్యసాహిత్యములో నొక వెలుఁగు కానిపించినదఁట. పదునెనిమిదేండ్ల వయస్సు నిండువఱకు వీరు వీరగ్రాంథిక

వాదులు. తరువాత, వ్యావహారిక భాషావాదులు. పద్యరచనకూడ వ్యావహారికములోనే సాగింపవలెనని కొన్నాళ్లు వీరిపట్టు. అది క్రమముగా సడలి పద్యమునకు గ్రాంథికము, గద్యమునకు వ్యావహారికము కావలెనని కొంతకాలము. ఇప్పుడు పూర్తిగా నరసింహశాస్త్రిగారిలోం గ్రొత్తమారుపు. వ్యావహారికభాష వచనరచనకుంగూడ అనుకూలము కాదని నిశ్చయము చేసికొన్నారట. శాస్త్రీయ విషయములు నిరూపించు వ్యాసములు, పూర్వకాలమునకు సంబంధించిన కథలు, నవలలు గ్రాంథికవాణిలోను, నేటి కాలమునకు సంబంధించిన కథలు, నాటికలు, సిద్ధాంతములు చేయని వ్యాసములు వ్యావహారిక వాణిలోను నుండవలయునని నరసింహశాస్త్రిగారిప్పటికిం జేసికొన్న సిద్ధాంతము. ౧౯౩౦ నుండి, శాస్త్రిగారిలో కర్మశ్రద్ధ ప్రబలినది. ౧౯౧ సం॥ నుండి పూర్ణదీక్ష. వంశీయమైన ధర్మము తప్పింపం దరముగాదు.

శ్రీ నరసింహశాస్త్రిగారికిం గథారచనలోను శ్రద్ధ యున్నది. గులాబిపువ్వు, శ్యామసుందరుడు, గానభంగము, చేసుకున్నవారికి చేసుకున్నంత, భవిష్యత్తు, వధూసర — ఇత్యాదులగు వీరి కథలు సాహితి, సఖి, భారతి, ఆంధ్రవార్షిక సంచికలలో చూచియుందురు. శాస్త్రిగారి నాటికలు సోమనాథ విజయము, క్షేమాక్షి, నాగానందనము, ఆత్మస్మృతి, పతంగయాత్ర, షణ్ణవతి, ఇత్యాదులు రసికమానసములు కరగించునవిగా నున్నవి. శ్రీ శివశంకరశాస్త్రిగారి వలెనే వీరెక్కువగాం బద్యనాటికలు వ్రాయుటకు మక్కువ చూపినారు. ప్రధానముగా నరసింహశాస్త్రిగారి 'నారాయణభట్టు' పేర్కొనందగిన మంచి నవల. వీరి గద్యరచనా విధానము చాల సరస మధురమైనది. పాత్రల సంభాషణము ఉదాత్తముగా నడపింతురు. కథాసంవిధానము మీంద కంటె, విషయ విమర్శనము మీంద వీరు ప్రీతిచూపెదరు. ఈ గుణము "నారాయణభట్టు" లోం గననగును. పలుమొగాల వెలి విరిసిన

నరసింహశాస్త్రిగారి వాణి నేడు దేవీభాగవత రచనలోఁ బరిణతమై యున్నది. అందలి సుందరధోరణి యీతీరు గలది.

శా॥ ఆలీలన్ శుకయోగి తండ్రిడరి గార్హస్థ్యంబు వెళ్ళించి పై
కైలాసాచల శృంగభూమి పితృసంగంబున్ వధూసంగమున్
బాలాపుత్ర సమస్త సంగతులు పోవంబెట్టి నిశ్చింత మే
ధాలక్ష్యం బగుపేర్మి నిశ్చలత నాత్మధ్యానినై నిల్చినన్.

శా॥ అంతం గొండొకకాల మేగ శుకుఁ డాత్మారాముఁడై సిద్ధుఁడై
వింతం గొల్పుచు సర్వభూతములకున్ విద్యుత్ప్రభాపుంజ భా
స్వంతుండై నెగసెన్ విహాయసిని భాస్వద్బింబ సంభేదియై
భ్రాంతంబై గిరిశృంగ మచ్చట ద్విధా వ్రయ్యంగ నుత్క్షిప్తమై.

మ॥ సకల త్రైదశ మానిసిద్ధ బహుధా సంస్తూయమాన ప్రథన్
శుకుఁ డాకాశపథంబునందు వృషదశ్వుండట్లు స్వచ్ఛందుఁడై
ప్రకటాశాళి ద్వితీయ భాస్కరుని తేవన్ వెల్గుచుం బోవ, తం
డ్రికి నుత్పాత పరంపరల్ కనఁబడెన్ భీశోకముల్ కూర్చుచున్.

ఇట్టి హృదయంగమ శైలిలో దేవీభాగవతము నాంధ్రీకరించు శ్రీ నరసింహశాస్త్రిగారిని 'కవిసామ్రాట్' బిరుదముతో దేశము సత్కరించినది. సాహితీసమితి కార్యదర్శిగా వారు చేయు సాహిత్య ప్రచారము విశేషించి గౌరవార్హము.

తుమ్మల సీతారామమూర్తి చౌదరి

1901

కమ్మవంశీయులు. తల్లి: చెంచమ్మ. తండ్రి: నారయ్య. జన్మస్థానము: గుంటూరు మండలములోని కావూరు. జననము: 25-12-1901. రచనలు:- ౧. ఆత్మకథ ౨. రాష్ట్రగానము ౩. ఆత్మార్పణము ౪. ధర్మజ్యోతి. ౫. అమరజ్యోతి ౬. పఱిగపంట. ౭. పెద్దకాపు [కావ్యములు] ౮. మహేంద్రజననము [నాటకము] ౯. రామలింగేశ్వర శతకము ౧౦. రామశతకము ౧౧. గాంధీతారావళి — మున్నగునవి.

తెలుఁగువారి కవితా శాఖలో నిరువదవ శతాబ్దివచ్చి వసంత రేఖలు దిద్దినది. ఈ శతాబ్ది యవతారముతోపాటు జన్మించిన కవి తుమ్మల సీతారామమూర్తి చౌదరి. ఆయన కృతులు ఆంధ్రరాష్ట్రమున గానము చేయఁబడుచున్నవి. వారి "రాష్ట్రగానము" పేరు విననివా రుండరు. సీతారామమూర్తి చౌదరిగారు మహాత్ముని "ఆత్మకథ" కావ్యరూపముగా సంతరించిరి. అది సుప్రసిద్ధము. ఆయన ధర్మజ్యోతి, అమరజ్యోతి, పఱిగపంట, పెద్దకాపు ఇత్యాదులు యువరసికులకు నిత్యపారాయణమున నున్న కృతులు.

పుఱ్ఱెకొక్క బుద్ధి పుట్టు జిహ్వకు నొక్క
రుచి జనించు నంట రూఢియైన
నరసులెల్ల మెచ్చ మెఱయింతుఁ గైతలోఁ
గమ్మఁదనము మత్కులమ్మునవలె.

ఇది చౌదరిగారి నియమము. ఈ నియమము తప్పకుండ కమ్మని కవిత గల కూర్పులు మన కెన్నో వా రందిచ్చిరి. తొల్లింటి కవుల ధర్మములు వీసమెత్తు కాదనుటకు వీ రిష్టపడరు. రస భావ పరిపుష్టమైన రచనావైదగ్ధ్య మాయనలో వలసినంత యున్నది. భాష నిర్దుష్టము.

పలుకుబడి బింకమైనది. ప్రాఁతమాటలకు క్రొత్త ప్రాఁతపూఁతయు కూర్పు నేర్పు చౌదరిగారి కెన్నఁడో యలవడినది. ధర్మనిష్ఠకు నదవిష్టమైన యితివృత్తము లాయన యేఱుకొనఁ గలవారు. ఉభయ భాషలయం దును చక్కని సాహిత్యము. సంస్కృతాంధ్ర శబ్దముల బరువులు, ములు వులు పట్టిచూచి, తూఁచి పద్యములలో సంధానింపఁ గలుగుటలో సీతా రామమూర్తికవి చెయితిరిగిన చతురుఁడు. సుశిక్షితులైన కవులు నేఁటి వారిలోఁ బలుచబడుచున్నా రన్నమాట కొందఱికి కోపకారణము కారాదు. చౌదరగారివలె ధారాళముగాఁ గవిత కట్టువారు లేరనికాదు. ఈ సౌభాగ్యమునకుఁ దోడు సౌష్ఠవము కూడ నుండవలయును. దానికి, సంస్కృతాంధ్ర కావ్య పరిజ్ఞానమేకాక, వ్యాకరణ ప్రవేశముకూడ విధిగా నుండవలసినది. ఈయుభయము మన సీతారామమూర్తి చౌదరి గారిలో నున్నవి. ఈ యస్తిత్వము చూచుకొని పండితకవులును వీరిని గౌరవించుచున్నారు. విద్వత్కవులగు తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రి గారితోఁ గాళిదాసత్రయము చౌదరిగారు పాఠముచేసిరి. ఆయన యాచార్యకము వీరి భాషాజీవితమున కొక మేలిదారి నగపఱచిన దన వచ్చును.) ఈ కృతజ్ఞతి చౌదరగారిలో నున్నది.

> ఏకశ్లోక రహస్య బోధనముచే నెవ్వాఁడు శిష్యున్ సుధీ
> లోకాగ్రేసరుఁ జేయు నవ్విబుధుఁ గొల్తున్ వెంకటప్పార్యు న
> స్తోక శ్లోక మయూఖరాజదఖిలాశున్ రామగాథామృతా
> ఖ్యాక గ్రంథమితణ్ణికా జనకు మద్దైర్వాణ భాషాగురున్.

[illegible] లో వీరు ఉభయభాషాప్రవీణ పరీక్షలో నుత్తీర్ణత నంది నారు. ఒట్టిగూడూరు పాఠశాలలో వీరికి గురుత్వము నెఱపిన శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రిగారిని గూర్చి 'ఆత్మకథ' లో నిటులు స్తుతి చేయుచున్నారు.

"శబ్దశాస్త్రాది లక్షణ సంప్రదాయ
మెవ్వఁ డెఱిఁగించె నాకు నయ్యెద్ద చరితుఁ
బ్రస్తుతించెదఁ బుంభావ పద్మజాత
రమణి దువ్వూరి వేంకటరమణ శాస్త్రి"

ఈ యుదాహరణము లెందు కనఁగా, సీతారామ మూర్తిచౌదరి గారు గాలిచదువు చదివిన వారుగాక గురుకుల క్లిష్టులై శాబ్దాదుల యందుఁ గృతి పరిశ్రము లనుటకు - వాస్తవమునకు, వారియేపద్యము పట్టి నను, ఈవిషయము వెల్లడి యగును. "ఉభయతోముఖ గవాయుత దాన ఫలదాత్రి" - "దేశభక్తి పదవీ నదవీయసి" "తచ్ఛ్రవణ సాహితి దుశ్శక మెట్టిపాటకిన్" - "పుంసపు రీడ్యమాన" "శ్రద్ధధానుఁడు" - "రామాభిధానపు న్నిరి యార్చ్రరంగ" - ఇత్యాదులైన రహస్యములు శిక్షితునకుఁగాని తెలియవివి. ఇట్టివి చౌదరిగారు కృతులలో వందలు వాడినారు. అట్లని, కేవల ప్రయోగ వ్యామోహము కలవారే యనుకొనరాదు. రసదృష్టిలోఁ జూచినను వారి రచనలకు మంచి స్థానమున్నది. శయ్యా సౌందర్యము మంచిది. భావనయు గంభీరమైనది. ఆవేశమును ప్రశంసనీయమైనది. పోకడలు ధర్మనిష్ఠానిష్ఠితము లయినవి. ఇఁక వారి ధోరణి యెటు లుండును? అందులో, నిండుగాఁ దెలుఁగుఁ దనమును వలచిన రచయితలు చౌదరిగారు. పరభాషా-వేష సంస్కార సంపర్కములు బొత్తిగా నీయనకు నచ్చవు. జాతీయ మైన పరమ ధర్మము నీయన దివ్యమంత్రముగా నుపాసించుచున్నారు. ఆయన రాష్ట్రగానాదులు దీనికిఁ దారకాణగా నిలఁబడురచనలు. క్షేత్ర జీవులు, ఆదర్శజీవులు, శిథిలక్షేత్రములు - ఇవన్నియు చౌదరిగారి కవితా వాహినీ పూరములోఁ బరిపూతములగు వస్తువులు.

అమ్మ తల్లులవంటి యావు లింటింటిలోఁ
గదువులై యమృతంబు పిదుకఁజేసి
కండబింకము నూపి కొండలైనను మోసి
కలుము లందిచ్చుగిత్తలను బెంచి
పనిముద్దుగాని సంపద ముద్దుగాదన్న
జీవసూత్రము శిరసావహించి
గాడగరి వఙ్గంగి గోసంగి కనుదోయి
దైన్యరేఖలకు దాదవ్వొనర్చి
కదురుగలచోటు కవ్వంబు కదలుచోటు
కలుపులకు ధూము కేతువుగా నెఱింగి
త్యాగమున కాశ్రయము కర్మయోగి వగుచుఁ
గీర్తిఁగనవయ్య భారతక్షేత్రజీవి!

*

బెబ్బులివంటి మా తెలుఁగుబిడ్డమగంటిమి మొన్న సైతముఁ
బొబ్బిలికోటలో నుబికి పొంగి పరాసుల ముంచిముంచి త
బ్బిబ్బొనరించి శాత్రవుల బిట్టుపొగడ్తలఁ గాంచదా? జగం
బబ్బురమంద నాఁచికొనదా? శరదిందువికాసకీర్తులన్.

*

కమ్మనిమాటలాడి నయగారము నూపినమాత్రఁ జప్పు పె
ద్దమ్మల నాయకత్వ మిసుమంత సహింపఁడు తెల్గుబిడ్డ; శౌ
ర్యమ్ము నమించితాశయపరంపర బట్టు వెలార్చు నేతకై
క్రుమ్మరుచున్నవాఁ; డతనికోరిక లెన్నటికిన్ ఫలించునో?

ఈ తీరయిన జాతీయావేశముగల కవులు తక్కువ. ౧౯౨౨లో పన్నుల నిరాకరణోద్యమమున మన చౌదరిగారు జరిమానా శిక్ష నందెను. అదిగాక, గుంటూరుజిల్లాకాంగ్రెసు సంఘములో వీరు

పదేండ్లపాటు సభ్యులై జాతీయ ప్రబోధము గావించినారు. రాట్నము, గాంధి, అస్పృశ్యత, పంజాబువధలు, భారతమాత ఇత్యాదిశీర్షికలతో వీరు రచించిన పద్యములు తెలుఁగు చదువరులకు సుపరిచితములు. వీరి యాదర్శములకుఁ దగినటులుగా మహాత్ముని యాత్మకథ మధురమైన కావ్యముగా సంతరించినారు.) ఈరచన లిటులు సాగించుచునే దుగ్గిరాల, బాపట్ల, నిడుబ్రోలు, అప్పికట్ల హైస్కూళ్లలో నాంధ్రోపాధ్యాయ పదవి నిర్వహించి శిష్యుల నెందఱనో దిద్దినారు. ప్రస్తుతము వీ రుపాధ్యాయ పదవియందే యున్నారు.

ఈయభినవ తిక్కననుగన్న తలిదండ్రులు ధన్యులు. చౌదరిగారితండ్రి నారయ్య ధర్మజ్యోతి. ఆయన శీలసంపద శాశ్వతమైన కృతిగా సంతరించి, యీపుత్రుఁడు మనకిచ్చెను. జనకునిపై తనయునకుఁ గల భక్తిగౌరవములకేకాక, నీతి నిష్ఠావిశేషమునకు, రసభావ సౌష్ఠవములకుఁగూడ 'ధర్మజ్యోతి' ఆకరకారణమైన కావ్యము. చౌదరిగారు తండ్రినిగూర్చి యిటులు వ్రాయుచున్నారు :

చదువకయున్న నేమి బుధసత్తము లుబ్బఁగ సర్థభావసం
పద వికసింప భాగవత భారతముల్ వివరించు ; హృద్యముల్
తదమలకావ్యపద్యములు ధారణ కగ్గముచేసి వేనవేల్
చదువునతండు ; తచ్ఛ్రవణసాహితి దుశ్శక మెట్టె వారికిన్.

మక్కువమై కొండికనాఁ
డక్కఱగల యద్ది లేనియప్పుడు నొఱపౌ
చక్కట్ల దండ లాతఁడు
పెక్కులు మన్మదుల హృదయపీఠికఁ జుట్టెన్.

సౌజన్యమూర్తియగు "తుమ్మల" కవికి ౧౯౫౭ లో, కనకాభిషేక గౌరవము జరిగిన సందర్భమున శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి యధ్యక్షుఁడుగా విప్పిన హృదయ మిట్లున్నది.

"మన చౌదరి యతిప్రాసములకై భంగపాటుచెంది తలగోఁకి కొనుచు బలాత్కార పద ప్రయోగములుచేసి, యర్థము ననుసరించి పదములు వాడక, పదములఁబట్టి యర్థమును వంపులువెట్టి వంగఁజేయు నీరసుఁడుగాఁడు. భావ మనర్గళముగాఁ బ్రవహించు చందాన వ్రాయు మహనీయుఁడు. యతి పదాదియందే కాక మధ్యమునను గొనలు వ్రాలును. ప్రాసమునకు యతికినై పద్యము నడక నిలిచి దాఁటవలసిన యిబ్బంది లేదు. అర్థమునుబట్టి పదములు, పదములలో లీనమైనరీతిని యతిప్రాసములు ననాయాసముగ నప్రయత్నముగ, స్వచ్ఛందముగ వచ్చి చేరు చుండును. ఈసిద్ధి యుండుఁ బ్రసిద్ధుఁడు తిక్కన ఈమార్గమున తిక్కన్నతో సజాతీయుఁడైన వాఁడు మన చౌదరి అనఁగా సరి సమానుఁడని యతిశయోక్తి పలికిన ప్రమాదము లేదు. ఆమార్గమున నప్రాసనత్వము లేకున్నను నాసనత్వము కలవాఁడని నామతి"

సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరము - 1950